శ్రీసాయిచరిత్రాధారసాహిత్య గ్రంథమాల ద్వితీయ కుసుమం

# శ్రీసాయిభక్త అనుభవ సంహిత


ఆంగ్ల మూలం

**శ్రీ బి.వి.నరసింహస్వామి**

ఆంధ్రానువాదం

**సాయినాథుని సురేంద్రబాబు**

పరిష్కరణ

*సాయిపథం సంపాదకవర్గం*



SAIPATHAM PUBLICATIONS

SHIRDI CHENNAI HYDERABAD

SriSaiBhakta Anubhava Samhita

A Telugu translation of Sri B.V. Narasimha Swami's

*Devotees Experiences of Sri Sai Baba*

Translated by : Sainathuni Surendra Babu

Publishers :: Saipatham, SHIRDI

First Edition, Vijayadasami, October 2008
Second Edition, Vijayadasami, October 2010

ISBN No: 978-81-88560-04-2

**శ్రీసాయిభక్త అనుభవ సంహిత**

ఆంధ్రానువాదం :
**సాయినాథుని సురేంద్రబాబు**

ప్రచురణ :
**సాయిపథం, శిరిడీ**

ప్రథమ ముద్రణ, విజయదశమి, అక్టోబరు 2008

ద్వితీయ ముద్రణ, విజయదశమి, అక్టోబరు 2010

ప్రతులకు :

**సాయిపథం పబ్లికేషన్స్**

P.O. Box No. 5005

బెసెంట్ నగర్, చెన్నై:: 600 090

email :: books@saimail.com
Website : www.saibaba.com

డిజైనింగ్ & ప్రోససింగ్ :

**సాయిముద్ర, శిరిడీ**

**ముద్రణ :**

సాయిబాంధ్స ప్రింట్ సిస్టమ్స్, **చెన్నై**


# విషయసూచిక

పేజీ నెం.


| | |
|---|---|
| *అనువాదకుని నివేదన* | VII |
| *ప్రకాశకుల మాట* | VIII |
| *ముందుమాట* | XI |
| *పీఠిక* | XIII |
| 1. జస్టిస్ ఎం.బి. రేగే | 1 |
| 2. ప్రొఫెసర్ జి.జి. నార్కే | 17 |
| 3. రావుబహద్దూర్ ఎస్.బి. ధుమాళ్ | 37 |
| 4. శాంతారాం బల్వంత్ నాచ్నే దహనూకర్ | 57 |
| 5. నారాయణ్ ఆశ్రమ్ | 79 |
| 6. శ్రీమతి తారాబాయ్ సదాశివ్ తర్ఖడ్ | 83 |
| 7. రఘువీర్.బి. పురందరే | 95 |
| 8. రావుసాహెబ్ యశ్వంత్ జనార్దన్ గాల్వంకర్ | 109 |
| 9. అబ్దుల్లా జాన్ | 113 |
| 10. చక్రనారాయణ | 117 |
| 11. జోసెఫ్ ఫౌజ్‌దార్ | 119 |
| 12. దాదాజీ గోపీనాథ్ జోషీ | 120 |
| 13. రావుబహద్దూర్ మోరేశ్వర్ వి. ప్రధాన్ | 123 |
| 14. శ్రీమతి చోటూబాయి ప్రధాన్ | 139 |
| 15. రావుబహద్దూర్ హెచ్.వి. సాఠే | 145 |
| 16. దాసగణు మహరాజ్ | 165 |
| 17. దత్తాత్రేయ దామోదర్ రాస్నే | 189 |
| 18. దామోదర్ సావల్రాం రాస్నే | 197 |
| 19. అబ్దుల్ | 203 |
| 20. అబ్దుల్ రహీం శంశుద్దీన్ రంగారీ | 209 |
| 21. రజబ్అలి మహమ్మద్ | 213 |
| 22. ఆదం దలాలి | 215 |
| 23. నందారాం శివరాం మార్వాడీ | 219 |

24. లక్ష్మణ్ గోవింద్ ముంగే 221
25. గంగాధర్ విష్ణు క్షీరసాగర్ 224
26. బయ్యాజీ అప్పాజీ పాటిల్ 227
27. రామచంద్ర సీతారాందేవ్ 231
28. డి.ఎం. ముల్కీ 234
29. నగేష్ ఆత్మారాం సావంత్ 238
30. కాశీబాయి హంసరాజ్ 241
31. దినకరరావ్ జయకర్ 243
32. భికూబాయి 244
33. పార్శీ గుమాస్తా 246
34. సోమనాథ్ శంకర్ దేశ్‌పాండే 251
35. మాధవరావ్ దేశ్‌పాండే 261
36. డి.వి. సంభారే 266
37. తుకారాం బర్కు 269
38. ఎం.జి. ప్రధాన్ 270
39. మామా దూబే 272
40. రామచంద్ర వామన్ మోడక్ 273
41. గోపాల్ భాస్కర్ దాతార్ 279
42. కాశీనాథ్ ఖండేరావ్ గార్డే 282
43. మైనతాయి గణేష్ కువలేకర్ 286
44. వినాయక్ దాజీభావే 289
45. ముకుందశాస్త్రి లేలే 291
46. కర్సెట్‌జీ షాపుర్‌జీ పెస్టన్‌జామాస్ 292
47. బి.లగాటే 293
48. కుశాభావు 295
49. బాలకృష్ణ గోవింద్ ఉపాసనీ శాస్త్రి 301
50. బాలకృష్ణ రామచంద్ర ఖైరికర్ 305
51. బదావే 307
52. శ్రీధర్ నారాయణ్ ఖార్కర్ 309

53. శామ్‌రావ్ రావ్‌జీ శ్రోత్రి 313
54. సదాశివ్ త్రయంబక్ విధావ్‌కర్ 314
55. దత్తాత్రేయ విఠల్ వైద్య 317
56. శంకర్ బల్వంత్ కొహెూజ్కర్ 320
57. రామచంద్ర రామకృష్ణ సామంత్ 323
58. బాపూరావ్ ఎన్. చాందోర్కర్ 329
59. చంద్రాబాయి బోర్కర్ 335
60. బల్వంత్ హరికార్నిక్ 341
61. వినాయక్ అప్పాజీ వైద్య 343
62. బి.వి. దేవ్ 347
63. శ్యామరావ్ జయకర్ 357
64. బాలకృష్ణ వామన్ వైద్య 365
65. రామ్‌గిరి బువా 369
66. ఎస్.ఎ. పాటంకర్ 372
67. రఘూజీ గణ్‌పత్ శిండే పాటిల్ 373
68. సగుణ్‌మేరు నాయక్ 377
69. లక్ష్మణ్ కచేశ్వర్ జాఖ్డె 380
70. లక్ష్మణ్ భట్ జోషీ 381
71. గణేష్ రఘునాథ్ తేలి 384
72. రామచంద్ర వాసుదేవ గెయిసాస్ 385
73. అమోల్‌చంద్ చంద్రభాన్ సేఠ్ 389
74. నాగేశ్వర్ ఆత్మారాం సామంత్ 391
75. జి.కె. రేగే 394
76. అజ్ఞాత భక్తుడు 397
77. అప్పాజీ సుతార్ 399
78. ఇమాంభాయ్ చోటాఖాన్ 401
79. ఎం.వి. సహస్రబుద్ధే 413
80. భాస్కర్ సదాశివ్ సాతమ్ 416



భక్తపరివేష్టితుడై లెండీ వద్ద
శ్రీసాయిబాబా

# అనువాదకుని నివేదన

మద్రాసులోని అఖిలభారత సాయిసమాజ వ్యవస్థాపకులు, 'శ్రీసాయివ్యాసుడు' అనదగిన పూజ్యశ్రీ బి.వి. నరసింహస్వామీజీ 1936లో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి, ఎందరో సాయిభక్తులను కలసి, వారి అనుభవాలను సేకరించి, వాటిని ఆంగ్లంలో గ్రంథస్థం చేసి వెలువరించిన విషయం మనకు తెలుసు. పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీగారి ఆశీస్సులతో ఆ మహద్గ్రంథాన్ని యథాతథంగా తెలుగులోనికి అనువదించే భాగ్యం నాకు కలిగింది. దీనిని బాబా నాపై చూపిన అనుగ్రహ కటాక్షంగా భావిస్తాను.

ఒక భాషలో రచింపబడిన గ్రంథాన్ని మరో భాషలోకి తర్జుమా చేసేటప్పుడు అనువాదకుల పరిధి చాలా పరిమితం. మూలంలోని విషయాలను పెంచడంగానీ, తీసివేయడంగానీ చేయకుండా, అనువాదకుని కల్పనకు తావులేకుండా యథాతథంగా అనువదించవలసి ఉంటుంది. మూలంలోని భావం చెడకుండా చూడాలి. మక్కీకిమక్కీలా ఉండకుండా వాక్యనిర్మాణం ఓ స్వాతంత్ర్య రచనగా అనిపించాలి. శైలీభేదం కనిపించకుండా చూడాలి. ఈ పరిమితులన్నీ దృష్టిలో ఉంచుకొని, నా శక్త్యానుసారం అనువదించడానికి యత్నించాను. అంతేగాక భక్తులు వారివారి స్వభాషలలో(మరాఠీ, హిందీ) చెప్పిన అనుభవాలను ఇంగ్లీష్ లోనికి, ఆ తరువాత తెలుగులోకి తర్జుమా చేయబడ్డ క్రమంలో మూలం యొక్క జీవం కొంచమైనా కోల్పోయే అవకాశం ఉంది. అలా జరగకుండా మాతృకలోని జీవము తరిగిపోకుండా ఉండేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయడం జరిగిందని మనవి చేస్తున్నాను. శ్రీసాయి నాచే చేయించిన ఈ అనువాదం పాఠకులను అలరిస్తుందని ఆశిస్తున్నాను.

ఈ అనువాదంలోని ప్రతి పదాన్ని వాక్యాన్ని శ్రద్ధతో తరచిచూసి, మెరుగులు దిద్దిన గురుబంధువులందరికి నా కృతజ్ఞతలు.

సాయిసేవలో .......

మీ

సాయినాథుని సురేంద్రబాబు

# శ్రీసాయిచరిత్రాధారసాహిత్య గ్రంథమాల

## ప్రకాశకుల మాట

**శ్రీ**సాయిచరిత్రాధారసాహిత్య గ్రంథమాలలో మరో కుసుమం ఈ 'శ్రీసాయిభక్త అనుభవ సంహిత'. ఈ గ్రంథానికి మూలం- పూజ్యులు శ్రీ బి.వి.నరసింహస్వామి వారు ఆంగ్లంలో రచించి ప్రచురించిన Devotees Experiences of Sri Saibaba. పుస్తకం పేరును యథాతథంగా తెలుగులోకి తర్జుమా చేస్తే 'సాయిభక్తుల అనుభవాలు' అవుతుంది. ఇంగ్లీషులో ఎలావున్నా, తెలుగులో పుస్తకం పేరు ఆ గ్రంథమహాత్మ్యాన్ని తెలిపేటట్లుంటే బాగుంటుందని మాకనిపించింది. ఈ పుస్తకానికి మరేదైనా పేరును సూచించవలసిందని శ్రీబాబూజీని కోరాము. అప్పుడు వారు: ***"తత్త్వాన్వేషణలో తన్మయమైన మహర్షుల అనుభూతులకు వాగ్రూపమే*** *వేదం. ఆ వాఙ్మయ మూలపాఠాలే - texts - వేదసంహితలు. ఆ మహాత్ముల, పురాణపురుషుల యొక్క జీవిత చరిత్ర బోధనలను వారి శిష్యులు తమ స్మృతుల రూపంలో మనకందించిన వాఙ్మయమే - శ్రుతులు, స్మృతులు, పురాణేతిహాసాలు, దర్శనాలు! ఈ గ్రంథం సాయిభక్తుల స్మృతుల సమాహారం; వారి అనుభవాల సంపుటి. సాయిభక్తులకు బాబా లీలాప్రబోధాలే వేదాలు; సాయిదర్శనాలు; నిదర్శనాలు. అందుచేత యీ పుస్తకాన్ని* ***'సాయిభక్త అనుభవ సంహిత'*** *అంటే బాగుంటుంది!"* అన్నారు.

వివిధ భాషలలో గ్రంథస్థం చేయబడి ఉన్న సాయిసాహిత్యాన్ని, సాయిలీలాప్రబోధాలను తెలుగులోనికి అనువదించి, ఆ సాహితీకుసుమాలను ఒక్కొక్కటిగా కూర్చి, శ్రీసాయిచరిత్రాధారసాహిత్య గ్రంథమాలగా తీర్చి, శ్రీసాయికి అలంకరించి, ఆ సాయిభక్తిపరిమళాలు సర్వత్రా వ్యాపింపచేయాలన్న శ్రీబాబూజీ ఆకాంక్ష మమ్ములను సాయిపథోన్ముఖులుగా చేస్తూ, ఈ సాయిసాహితీ యజ్ఞానికి సమాయత్తపరిచింది.

శ్రీసాయిబాబా మహాసమాధి చెందిన దాదాపు 17 సంవత్సరాల తరువాత 1936-1938 మధ్య కాలంలో పూజ్యశ్రీ బి.వి.నరసింహస్వామిజీ వారు బాబాను ప్రత్యక్షంగా దర్శించి సేవించే భాగ్యానికి నోచుకున్న భక్తులను కలుసుకొని, సాయితో వారికిగల అనుబంధాన్ని, వారి అనుభవాలను, అనుభూతులను

వాఙ్మూలపూర్వకంగా (స్టేట్‌మెంట్స్) సేకరించారు. వందల సంఖ్యలో సేకరించిన ఆ వాఙ్మూలాలను ఆంగ్లంలోకి తర్జుమాచేసి, వాటిలో నుండి సుమారు ఓ ఎనభై ఎంపిక చేసి, మూడు భాగాలుగా ప్రచురించారు. ఆల్ ఇండియా సాయిసమాజ్ (మద్రాసు) తరపున 1941లో Devotees Experiences of Sri Saibaba పేర ప్రచురింపబడిన ఈ అమూల్య గ్రంథంలో అప్పటివరకు వెలుగుచూడని ఎన్నో సాయిలీలలు, అనుభవాలు, సాయిచరిత్రకు సంబంధించిన ఎన్నో విశేషాలు పొందుపరచడం జరిగింది. ఈ గ్రంథరాజమే తరువాతి కాలంలో రచింపబడిన మరెన్నో సాయిచరిత్రలకు మూలాధారమయింది. దక్షిణ భారతావనిలో సాయితత్త్వప్రచారానికి ఆద్యునిగా నిలిచిన పూజ్యశ్రీ నరసింహస్వామిగారు చరితార్థులు; శ్రీసాయిభక్తులకు చిరస్మరణీయులు.

సాయి గురించి, సాయి లీలల గురించి సాయిని ప్రత్యక్షంగా సేవించిన భక్తులు చెప్పిన విషయాలను వారి మాటల్లోనే యథాతథంగా ఆంధ్ర సాయిభక్తులకు అందించాలన్న సత్సంకల్పంతో ఈ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించి ప్రచురించడం జరిగింది. శ్రీసాయి తత్త్వాన్ని, లీలా ప్రబోధాన్ని ప్రతి అక్షరంలోనూ నిక్షిప్తం చేసుకొన్న ఈ గ్రంథం చదువుతున్నంత సేపు సాయి సాన్నిధ్యాన్ని మనకు అందిస్తుంది. సాయి రూపాన్ని, తత్త్వాన్ని నాటి శిరిడీ వైభవాన్ని, అలనాటి స్థితిగతులను సాయి లీలావిలాసంలో అంతర్భాగంగా మనకు ఈ గ్రంథం సాక్షాత్కరింపజేస్తుంది. ఈ గ్రంథంలోని అక్షరమక్షరంలోను సాయిరూపం సజీవంగా నడయాడుతూ మన కనుల ముందు ప్రత్యక్షమవుతుంది. వారి కరుణ, కోపం, హాస్యం, లాస్యం, వాత్సల్యం, దాతృత్వం, అంతర్యామిత్వం అన్నీ కలగలిసి సంపూర్ణత్వాన్ని సంతరించుకున్న రూపంగా శ్రీసాయిని దర్శించగలుగుతాం. సాయిని ప్రత్యక్షంగా చూడలేకపోయామని మథనపడే ప్రతి సాయిభక్తుడి వెలితిని కొంతవరకైనా ఈ గ్రంథం తీర్చగలుగుతుందని మా ఆశ.

ఆంగ్లమూలాన్ని అత్యంత శ్రద్ధాభక్తులతో తెలుగులోనికి అనువదించిన వారు పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ తండ్రిగారైన శ్రీసాయినాథుని సురేంద్రబాబు గారు. వారికి మా హృదయపూర్వక ప్రణామాలు. ఈ గ్రంథానువాదం వ్రాతప్రతిని సముచిత రీతిన పరిష్కరించి ప్రచురణకు సిద్ధం చేయడంలో సాయిపథం

సంపాదకవర్గం అహర్నిశలు ఎంతగానో కృషిచేసింది. ఈ సంపాదకవర్గాన్ని ముందుండి నడిపించిన శ్రీమతి అద్దేపల్లి సుచిత్రాదేవి (చెన్నై) గారికి, అనువాద పరిష్కరణలో సహకరించిన గురుబంధువులు శ్రీసిహెచ్. శేఖర్ (చెన్నై), శ్రీడి. రఘు (బెంగుళూరు), శ్రీకె. ఉపేంద్ర (చెన్నై), పరిష్కరణ అంశాలను సమీక్షించిన శ్రీచేకూరి రమణ (యు.ఎస్), శ్రీమతి ఎస్. రమాలక్ష్మి(యు.ఎస్), శ్రీమతి పి. శైలజా ద్వారక్‌నాథ్ (చెన్నై) గార్లకు మా కృతజ్ఞతాభివందనాలు. గ్రంథ వ్రాత ప్రతిని టైప్ చేసి అందంగా ముస్తాబు చేసిన శ్రీమతి సిహెచ్. వాసంతి శేఖర్(చెన్నై), అచ్చు తప్పులను సరిదిద్దడంలో సహకరించిన డాక్టర్ ఎస్. హేమాద్రి (శ్రీకాళహస్తి), శ్రీటి.వి. సుబ్రహ్మణ్యం (ఒంగోలు) గార్లకు మా కృతజ్ఞతాభినందనలు.

పురాతనమై, అస్పష్టంగా ఉన్న భక్తుల ఫోటోలకు (బాబాను ప్రత్యక్షంగా దర్శించిన) స్పష్టమైన రూపుతేవడానికి రాత్రింబవళ్ళు శ్రమించిన శ్రీఎమ్. పద్మాకరన్ (చెన్నై) గారికి, ముద్రాక్షరాలకు సాంకేతికపరమైన సొబగులద్ది అక్షరరమ్యతను చేకూర్చిన శ్రీసిహెచ్. అజయ్ (యు.ఎస్) గారికి ప్రత్యేక కృతజ్ఞతాపూర్వక అభివాదములు.

అతితక్కువ సమయంలో అందంగా గ్రంథ ముద్రణ చేసి ఇచ్చిన సాయిబాండ్స్ ప్రింట్ సిస్టమ్స్ (చెన్నై) మేనేజింగ్ డైరెక్టర్ శ్రీఎల్.వి.ఎస్. వాసుదేవరావు గారికి కృతజ్ఞతాభినందనలు.

ప్రతి విషయంలోను తమ అమూల్యా సలహాలు, సూచనలిస్తూ అందరినీ ప్రోత్సహిస్తూ గ్రంథ ప్రచురణను ముందుండి నడిపించిన డా. ఎమ్.వి. నరేంద్రనాథ్‌గారికి సప్రేమపూర్వక కృతజ్ఞతాభివందనాలు.

ఈ గ్రంథం వ్రాతప్రతిని సిద్ధం చేసే దగ్గర నుండి, ప్రచురణ వరకు ఎందరో సాయిబాబా సత్సంగకేంద్ర సభ్యులు తమ సహాయ సహకారాలను అందించారు. వారందరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సాయిసాహితీ యజ్ఞంలో సమిథలుగా తమవంతు సేవలందించిన సాయిబంధువులందరిపై శ్రీసాయినాథుని అనుగ్రహాశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థిస్తున్నాం.

శ్రీసాయి సాహితీవనంలో వికసించిన ఈ సాయిచరిత్రాధారసాహితీ కుసుమాన్ని శ్రీసాయిచరణారవిందాలకే భక్తిపూర్వకంగా సమర్పించుకుంటున్నాం.


**– ప్రకాశకులు, సాయిపథం, శిరిడీ**

# ముందుమాట

(దివాన్ బహద్దుర్ కె. సుందరం చెట్టియార్, రిటైర్డ్ హైకోర్టు జడ్జి)

నా మిత్రుడు, గౌరవనీయులైన శ్రీబి.వి. నరసింహస్వామి రచించిన ఈ గ్రంథం, భౌతికవాదపు ముసుగులో అంధులై, ప్రాపంచిక విషయాలలో మునిగి, ఆధునిక శాస్త్రం ఆమోదించనిదే ఏ విషయం యొక్క అస్థిత్వాన్ని నమ్మరాదనే పక్షపాతధోరణి తలకెక్కించుకున్న జనులకు కనువిప్పు కలిగిస్తుంది. గ్రంథకర్త బహుశ్రద్ధతో ఎందరో భక్తుల ఉత్కంఠభరితమైన అనుభవాలను సేకరించి శ్రీసాయిబాబా ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రజాబాహుళ్యానికి అందజేసారు. ఆ మహాసిద్ధపురుషుని అద్భుత లీలలకు, భక్తులు తెలిపిన వివరాలే సాక్ష్యాధారాలు. అవి భక్తులు స్వయంగా అనుభవించి తెలిపినవి కాబట్టి, పాఠకుల యొక్క అజ్ఞానాన్ని, అనుమానాల్ని పారద్రోలి, వారిలో భక్తి విశ్వాసాలు నింపుతాయి. వ్యర్థ కోరికలు, చిత్తవికారాలతో కూడిన భక్తుల నీచసంస్కారాలను తమ విశిష్టమైన, నిగూఢమైన ప్రక్రియ ద్వారా శుద్ధి చేసి వారిలో నిద్రాణమై ఉన్న తేజోమయ ఉత్కృష్ట సంస్కారాన్ని జాగృతం చేసే సాయిబాబాను ఆధ్యాత్మిక రససిద్ధునిగా చెప్పవచ్చు. నిస్సందేహంగా వారు మన దేహాలనే గాక మనస్సులను కూడా ఉద్ధరించే కరుణామయులు.

తరువాత ఈ పుస్తకాన్ని చదివే భాగ్యం పొందినవారు, ఈ గ్రంథకర్తకు ఎంతగా ఋణపడి ఉంటారో నేను చెప్పనవసరం లేదు. మానవాళిని ఉద్ధరించడానికి అవతరించిన శ్రీసాయిబాబా, తమను భక్తివిశ్వాసాలతో ఆశ్రయించిన వారిపై అనుగ్రహ వర్షం కురిపించారు. ఇప్పటికీ సాయిబాబాను ఆశ్రయించినవారికి అటువంటి అనుగ్రహం లభిస్తుందని రచయిత హామీ ఇస్తున్నారు.



గ్రంథకర్త

పూజ్యశ్రీ బి.వి. నరసింహస్వామి

# పీఠిక

(గ్రంథకర్త : పూజ్యశ్రీ బి.వి. నరసింహస్వామి)

ఈ గ్రంథము, "శ్రీసాయిబాబా పరిచయము" అను చిరు గ్రంథములో నిర్థారించిన విషయాలన్నింటికి సాక్ష్యాధారముగా నిలుస్తుంది. అందులోని విషయాలపై నమ్మకం బలపడటమేగాక, బాబా యొక్క నిజతత్త్వము, వారనుసరించే పద్ధతులు, ఇతర విషయాలపై నిశిత పాఠకునికి ఈ అనుభవాలలో కొన్ని సూచనలు లభ్యమవుతాయి. ఉదాహరణకు, ప్రస్తుతం హైకోర్టు జడ్జిగా ఉన్న నా గౌరవనీయ మిత్రుడు మొదట వెల్లడించిన అనుభవం, బాబాను ఆశ్రయించగోరు పాఠకునికి, బాబాతో సన్నిహిత పరిచయమేర్పరచుకొనేందుకు, వారి సహాయం (జడ్జిగారు పొందిన సహాయంకన్నా ఎక్కువగానే) పొందేందుకు ఉపయోగపడుతుంది. వారు నిజ నామధేయంతో తమ అనుభవాలను బహిర్గతం చేయడానికి ఇష్టపడనందుకు నాకు బాధగా ఉంది. కానీ వారి సున్నిత భావాలను గౌరవించాలి కదా? ఈ పుస్తకం యొక్క మొదటి భాగంలో మారుపేరుతో తన అనుభవాలను వెల్లడి చేసిన మరొకరు శ్రీమతి మేనేజరుగారు మాత్రమే. సహజంగా ఒక స్త్రీ తన స్వానుభవాల్ని బహిరంగంగా వెల్లడి చేయడానికి సంకోచిస్తుంది. భారతీయ పాఠకులు ఆమె యొక్క సున్నిత భావాలను గౌరవిస్తారు. కానీ ఆమె సూచించిన మారుపేరును బట్టి, ఆమె హోదా మరియు ఆమె భర్త యొక్క హోదా అర్థమవుతాయి. వీరు బాబా యొక్క సన్నిహిత భక్తులుగా అందరికీ తెలుసు. ఇతర భక్తులు వివరించిన అనుభవాల యోగ్యత ఆయా అనుభవాలలో విస్పష్టమే. వాటిపై వ్యాఖ్యానం అనవసరం. ప్రొఫెసర్ నార్కేగారు తమ అనుభవాలను చాలా సుస్పష్టంగానూ, దృఢంగానూ చెప్పడం జరిగింది. రావుబహద్దూర్ ఎస్.బి. ధుమాళ్, శ్రీఆర్.బి. పురందరే, శ్రీయస్.బి. నాచ్నే, జస్టిస్ రేగే బాబాను గాఢంగా ప్రేమించే భక్తులలో అతిముఖ్యులు. బాబా రక్షణలోకి వచ్చినప్పటి నుండి వారు నిరవధికంగా సహాయం పొందుతూనే ఉన్నామని చెబుతున్నారు. పాఠకులు తాము అలాంటి సహాయం పొందలేదని నిరాశపడనక్కరలేదు. 1936లో సండే టైమ్స్ పత్రికలో, సాయిబాబాను గురించి ఈ రచయిత వ్రాసిన వ్యాసాలు చదివి, కొందరు మద్రాసీ భక్తులు బాబాతో సన్నిహిత సంబంధమేర్పరచుకొని, అనుక్షణము వారి సహాయము పొందుతూనే ఉన్నారు.


పూజ్య స్వామి నారాయణ తీర్థగారు తాము బాబా అనుగ్రహం ద్వారా పరమానంద స్థితి అనుభవించామని, సర్వం ఆత్మస్వరూపమేనని తెలిసికొన్నామని చెప్పారు. ఇటువంటి అద్వైత స్థితి బాబాను సశరీరులుగా దర్శించిన ఆనాటి భక్తులకు మాత్రమే పరిమితం కాదు. ఈనాడు కూడా భక్తులు బాబాను అనన్యంగా ప్రేమించడం ద్వారా ఆనాటి భక్తులు పొందిన దానికంటే ఎక్కువ లబ్ధిని పొందవచ్చు. బాబా తమ మహాసమాధి ముందుకంటే ఇప్పుడు అత్యద్భుత లీలలు ప్రదర్శిస్తున్నారు అని చెప్పడానికి క్రింది అనుభవమే తార్కాణము. డాక్టరు రాణేగారి భార్యకు కుష్ఠురోగం వచ్చి, ఆమె శరీరపు రంగు వికృతంగా మారిపోయింది. రాణే ఇంగ్లీషు వైద్యం (ఆలోపతి)లో శిక్షణ పొందినవాడైనప్పటికీ ఏమీ చేయలేకపోయాడు. వారిద్దరూ శిరిడీ వెళ్ళి ఆరునెలలు గడిపారు. ఆమె ప్రతిదినం బాబా అభిషేక తీర్థంతో స్నానం చేస్తూ, ఊదీ వాడింది. కొంత మెరుగనిపించడంతో వారు బొంబాయి తిరిగి వెళ్ళారు. ఆమె ఊదీని, అభిషేక తీర్థాన్ని వాడడం కొనసాగించింది. రెండు సంవత్సరాల తరువాత ఆమె రోగం పూర్తిగా నివారణై, శరీరం సహజరంగును సంతరించుకొంది. ఈ లీల బాబా సమాధి చెందిన ఎన్నో సంవత్సరాల తరువాత జరిగింది.

ఈ గ్రంథములోనున్న ఇతర వివరములు భారత దేశంలోనున్న రెండు గొప్ప మతాల మధ్య ఏర్పడిన దురదృష్టకరమైన విభేదాలు సమసిపోవడానికి బాబా ఎలా తోడ్పడిందీ చెబుతాయి. హిమలయాల ఆవల నుండి వచ్చిన అబ్దుల్లాజాన్ వృత్తాంతమే దీనికి నిదర్శనం. భారతీయులు (ముఖ్యంగా హిందువులు) బలవంతులైన ఉత్తరాది జాతులకన్నా హీనులని, వారిని తన సహజ శత్రువులుగా అతడు భావించేవాడు. కానీ బాబా సన్నిధి అతనిలో గొప్ప మార్పు తెచ్చింది. అతను హిందువులను తన సహోదరులుగా భావించడం మొదలుపెట్టాడు. వినాశకరమైన మతకలహాలు దేశశ్రేయస్సుకే ముప్పని తలచాడు. ఇది అతనొక్కడిదే కాక, మరెంతో మంది అనుభవం కూడా! హిందువులు బాబా మసీదు మరియు సమాధి కట్టారు. ఆ మసీదులో ఇరుమతాల వారు బాబాను పూజిస్తారు. శిరిడీకి మూడుమైళ్ళ దూరంలో ఉన్న సాకోరీలో ఒక బ్రాహ్మణ భక్తుడు అక్కడికి వచ్చే ముస్లింల కొరకు దత్తమందిరం, మారుతీ మందిరాలకు సమీపంలో మసీదు నిర్మించాడు. కానీ అక్కడ ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే ఏ ఒక్క సంఘటనా

జరగలేదు. బాబా హైందవ, ఇస్లాం మతాలలోని ఉన్నత భావాలను తమలో ఇముడ్చుకున్నందువల్ల, ఇరుమతాల వారూ వారిని గౌరవించి, ఆశ్రయించారు. తద్వారా ఇరుమతాల మధ్య సామరస్యం ఏర్పడింది. ఇది ప్రాపంచిక విషయాల ద్వారా వచ్చినది కాదు. బాబా మహిమ వలన మనిషి స్వభావంలో ఏర్పడిన పరిణతి ఆధారంగా వచ్చింది.

బాబాకు ఇతర మతస్థులపట్ల (ఉదాహరణకు క్రైస్తవులు) ఉన్న సోదరభావం, బాబాను అనుసరించిన సాయిభక్తుల అనుభవాలలో ప్రతిబింబించింది. బాబా శిరిడీలో నివసించిన కాలమంతటిలోనూ, ఒకటి రెండు సంఘటనలు మినహా, మత సామరస్యం వెల్లివిరిసింది.

ఈ పీఠిక ముగించే ముందు, తమ తమ అనుభవాలను వివరించిన అసంఖ్యాక భక్తులకు ఈ రచయిత కృతజ్ఞతాభివందనాలు తెలియజేసుకుంటున్నాడు. ఈ భక్తులలో గ్వాలియర్ జిల్లా జడ్జిగా పనిచేసిన శ్రీపి.ఆర్.అవస్థే, *బి.ఏ., ఎల్.ఎల్.బి,* గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారు ఎంతో శ్రమకోర్చి, అసంఖ్యాక సాయిభక్తులకు నన్ను పరిచయం చేసి, మా మధ్య దుబాసీగా పనిచేసి, సాయిబాబాపై మరాఠీలో రచింపబడిన పత్రికలు, దస్తావేజులు మొదలైనవి ఇంగ్లీషులోనికి తర్జుమా చేసి నాకు అందించారు. వీరి సహాయం లేకుండా ఈ గ్రంథం వ్రాయడం సాధ్యపడేది కాదని ఈ రచయిత మనవి చేస్తున్నాడు.



జస్టిస్ ఎం.బి. రేగే

## 1

## జూన్ ౧౧ వ తేదీ, ౧౯౩౬

**జస్టిస్ ఎం.బి. రేగే,**[1] బి.ఎ.,ఎల్.ఎల్.బి., వయస్సు సుమారు 50 సం॥లు, సారస్వత్, ఇండోర్.

శ్రీసాయిబాబాను నేను సృష్టి, స్థితి, లయకారకునిగా భావిస్తాను. వారు మహాసమాధి (1918) చెందక ముందు కూడా నేను అలాగే భావించేవాడిని. ఇప్పటికీ నాలో అదే భావముంది. వారు ఎక్కడికీ వెళ్ళిపోలేదు. ఇప్పటికీ, ఎప్పటికీ మనతోనే ఉన్నారు, ఉంటారు.

నా దృష్టిలో బాబాకు పరిమితులు లేవు. వారు సశరీరులుగా మా మధ్య సంచరిస్తున్నప్పుడు ఆయన పాంచభౌతిక రూపం మా దృష్టిని విశేషంగా ఆకర్షించేది. కానీ ఎక్కువ భాగం నా ఎఱుకలో నిలిచింది మాత్రం ఆయన అనంతతత్త్వమే. మూర్తీభవించిన ఓ మనోమయ దివ్యతత్త్వంగా నాకాయన గోచరించేవారు. పరిమితులు లేని అనంతత్త్వం మానుషరూపంలో లీలామాత్రంగా ఇమిడిపోయి, మా కనుల ముందు సంచరిస్తున్నట్లనిపించేది. ఇప్పుడు ఆ పాంచభౌతికదేహం కనుమరుగై, 'సాయిబాబా' అనే అవధులు లేని కేవల దివ్యతత్త్వం మాత్రమే మిగిలింది.

వేదాంత, తత్త్వశాస్త్రాల పట్ల నాకు ఆసక్తి లేదు. సాయిబాబా కొన్ని సందర్భాలలో దృష్టాంతాలు, నీతికథలతో నిగూఢంగా మాట్లాడేవారు. వారి మాటలను ఒక్కో భక్తుడు ఒక్కో విధంగా అర్థం చేసుకునేవాడు. ఒకసారి వారు అలా నిగూఢంగా మాట్లాడి ***"అర్థమైందా?"*** అని నన్ను అడిగారు. నేను అర్థం కాలేదని చెప్పాను. అప్పుడు కొందరు భక్తులు అక్కడున్నారు. వారు వెళ్ళిపోయిన తరువాత నేను బాబాతో "మీరు నిగూఢంగా మాట్లాడే మాటలు నేను అర్థం చేసుకోలేకపోతున్నాను. మీరు నాకేదైనా చెప్పదలిస్తే నాకర్థమయ్యేట్లు చెప్పండి!" అన్నాను. అప్పటి నుండి బాబా నాతో నీతికథల రూపంలో కాకుండా స్పష్టంగా మాట్లాడేవారు.

---

*1. జస్టిస్ రేగే తమ అనుభవాలను చిన్నిక్రిష్ణా రాజాసాహెబ్ బహద్దుర్ అనే పేరుతో వెల్లడించారు.*

నేను బాబా చెంతకు ఎలా వచ్చానో, వారే నా సర్వస్వం ఎలా అయ్యారో చెప్పే ముందు నా గురించి కాస్త చెప్పుకోవాలి.

గోవాలో కొలువై ఉన్న శాంతదుర్గాదేవి మా ఇలవేల్పు. అక్కడున్నది ఆ దేవి యొక్క రుద్ర రూపం కాదు భద్ర రూపం. సదా ఆనందాన్ని ప్రసాదిస్తుందని ఆ దేవిని ప్రార్థిస్తూ ఉండేవాడిని. నాకు ఎనిమిదవ ఏట ఉపనయనం జరిగింది. సంధ్యావార్చడం, గాయత్రీజపం చేయడం నేర్చుకున్నాను. వాటి పట్ల నాకెంతో గౌరవముండేది.

ఆ తరువాత నా ఆరాధన విష్ణువు వైపుకు మళ్ళింది. ధృవుడు - మహావిష్ణువు ఉన్న చిత్రపటం ఒకటి మా ఇంట్లో ఉండేది. ఆ ఫోటోలోని విష్ణురూపం నా హృదయంలో బలంగా ముద్రించుకుపోయింది. నేను ఆ రూపాన్ని ఎల్లప్పుడూ ధ్యానిస్తూ ఉండేవాడిని. కానీ విష్ణురూపంపై ఏకాగ్రత నిలపాలని ప్రయత్నించినప్పుడు ధృవుని రూపం వలన తరచుగా నా ఏకాగ్రత చెదిరేది. అందువల్ల పటంలో ధృవుడు కూర్చొనివున్న భాగాన్ని కత్తిరించి ధ్యానం కొనసాగించాను. అంతేగాక ధృవుని స్థానంలో నన్ను ఉంచమని ఆర్తితో విష్ణుమూర్తిని ప్రార్థించేవాడిని. చిన్నతనం నుండి నేను ప్రాణాయామం, ఆసనాలు అభ్యసించేవాడిని. సిద్ధాసనంలో కానీ పద్మాసనంలో కానీ ఒకటి లేదా రెండు గంటలు స్థిరంగా కూర్చొని 15 నిముషాల పాటు మనస్సులో ఒకే మూర్తిని నిలుపుకొని ధ్యానించగలిగేవాడిని. ప్రాణాయామంలో కూడా కొంతవరకు ప్రగతిని సాధించాను. ఇవన్నీ గురువు లేకుండానే చేయగలిగాను. ఇలా విష్ణురూప ధ్యానం నా 21వ సంవత్సరం వరకు తీవ్రంగా కొనసాగించాను. తరువాత 1910లో ఒకరోజు నిద్రలోనుండగా స్వప్నమో లేక ఒకానొక అలౌకిక స్థితిలోని దృశ్యమో సరిగా చెప్పలేనుగానీ, ఒకేరాత్రి వరుసగా మూడు అనుభవాలు కలిగాయి.

మొదటి అనుభవంలో, నేను మంచంపై పడుకొని ఉండగా నాలో ఏదో మార్పు జరిగినట్లుగా అనిపించింది. నేను నా దేహం నుండి విడిపోయినట్లు, దాని నుండి వేరుగా ఉన్నట్లు గ్రహించాను. నా ముందు విష్ణుమూర్తి నిలబడి ఉన్నారు. అంతటితో ఆ దృశ్యం ముగిసింది. సుమారు ఒక గంట తరువాత ఇదే విధమైన మరో అనుభవం కలిగింది. ఈసారి విష్ణుమూర్తి ప్రక్కన మరొకరు నిలబడి ఉన్నారు.

విష్ణుమూర్తి వారిని చూపిస్తూ నాతో "శిరిడీకి చెందిన ఈ సాయిబాబా నీ వాడు. నీవు ఈయనను తప్పక ఆశ్రయించాలి!" అన్నారు.

మరి కొద్దిసేపటి తరువాత మూడవ దృశ్యం అనుభవమయింది. నేను గాలిలో తేలుతూ వెళుతున్నట్లు ఒక వింత అనుభవానికి లోనయ్యాను. ఆ విధంగా ఒక గ్రామానికి చేరుకున్నాను. అక్కడొక వ్యక్తి కనిపించాడు. అతనిని ఇది ఏ గ్రామమని అడిగాను. ఇది శిరిడీ అని చెప్పాడు. ఇక్కడ సాయిబాబా అను పేరుగల వారెవరైనా ఉన్నారా అని అడిగాను. "ఉన్నారు. రండి చూపిస్తాను" అని అతను నన్ను మసీదుకు తీసుకెళ్ళాడు. అక్కడ సాయిబాబాను చూసాను. బాబా కాళ్ళు చాచుకొని కూర్చొని ఉన్నారు. నేను వెళ్ళి భక్తితో వారి పాదాలపై నా శిరస్సునుంచాను. వెంటనే బాబా లేచి *"నువ్వు నా దర్శనం చేసుకుంటున్నావా! నేను నీకు ఋణగ్రస్థుడను. నేనే నీ దర్శనం చేసుకోవాలి!"* అంటూ వారి శిరస్సును నా పాదాలపై ఉంచారు. ఈ మూడు దృశ్యాలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. సాయిబాబా తమ సహజరీతిలో కూర్చుని ఉన్న ఫోటో ఒకటి అంతకుమునుపు చూసి ఉన్నాను. కానీ అప్పటికి బాబా గురించి నాకు ఏమీ తెలియదు. బాబా తరచుగా కాళ్ళు చాచుకొని కూర్చొంటారనే విషయం కూడా నాకు అప్పుడు తెలియదు. దృశ్యానుభవాలను, వాటిలో చెప్పినట్లుగా బాబా నాకు నిర్ణయింపబడిన గురువో కాదో అనే విషయాన్ని నిర్ధారించుకొనేందుకు కొంతకాలం తరువాత శిరిడీకి బయలుదేరాను.

నేను మసీదుకు వెళ్ళేటప్పటికి బాబా వద్ద చాలామంది భక్తులున్నారు. నేను వెళ్ళి వారి పాదాలపై నా శిరస్సునుంచి సాష్టాంగ ప్రణామం చేశాను. అప్పుడు బాబా *"ఏంటి! నీవు మానవమాత్రుణ్ణి పూజిస్తావా?"* అన్నారు. వెంటనే వెనక్కు తగ్గి కొద్ది దూరంలో కూర్చున్నాను. వారి తిరస్కారం నన్ను తీవ్రంగా గాయపరచింది. నిజమే! నాకున్న పుస్తక పరిజ్ఞానం వలన మానవమాత్రులను పూజించరాదు అనే అభిప్రాయముండేది. బాబా నన్ను ఆదరించకపోవడానికి ఆ అభిప్రాయమే కారణమేమోనన్న ఆలోచన కలిగింది. ఈ సందిగ్ధంలో కొంతసేపు కొట్టుమిట్టాడాను. మానవులను పూజించరాదన్న అభిప్రాయం క్రమంగా నాలో అంతరించసాగింది. నా అనుభవంలో కనిపించిన విధంగా నా గురువు (బాబా)

నన్ను తమ భక్తునిగా అంగీకరించలేదని క్రుంగిపోయాను. కొన్ని గంటల పాటు అక్కడే కూర్చుండిపోయాను. మధ్యాహ్నమయింది. భక్తులందరూ వెళ్లిపోయారు. బాబా ఒక్కరే ఉన్నారు. ఆ సమయంలో అనుమతి లేకుండా బాబా దగ్గరకు ఎవరూ వెళ్ళకూడదు, అలా వెళితే కీడు జరుగుతుందని భక్తుల అభిప్రాయం. కానీ నేను ఆ విషయాలేవీ పట్టించుకొనే స్థితిలో లేను. ఏ ఆశయంతో శిరిడీ వచ్చానో అది నెరవేరలేదు. ఇక భయపడేందుకు ఏముంది? బాబా నా తల బద్దలుకొడతారేమో, కొట్టనీ! ఇలా ఆలోచిస్తూ మెల్లగా వారిని సమీపించసాగాను. అది గమనించి వారు నన్ను దగ్గరకు రమ్మని సైగ చేశారు. దాంతో ధైర్యం వచ్చి నేరుగా వెళ్ళి బాబా పాదాలపై శిరస్సునుంచాను. వెంటనే వారు నన్ను లేపి హృదయానికి హత్తుకున్నారు. సన్నిహితంగా కూర్చోబెట్టుకొని ***"నీవు నా బిడ్డవు. ఇతరుల సమక్షంలో మేము బిడ్డలను దూరంగా ఉంచుతాం"*** అన్నారు. బాబా నన్ను ఉదయం ఎందుకు నిరాదరించినట్లుగా కనిపించారోనన్న దానికి సంతృప్తికరమైన జవాబు దొరికింది. వారు నా పట్ల చూపించిన గాఢమైన ప్రేమకు నా హృదయం ప్రతిస్పందించింది. వారే నా గురువు, రక్షకుడు, గమ్యం చేర్చగల దైవం అని తెలుసుకున్నాను.

తరువాత బాబా నన్ను ఆయీ వద్దకు వెళ్ళి ఉండమన్నారు. రాధాకృష్ణ ఆయీని బాబా 'రామక్రిష్ణీ' అని పిలిచేవారు. అప్పటి నుండి ఆమె చనిపోయేంత వరకు నేను ఎప్పుడు శిరిడీ వెళ్ళినా రాధాకృష్ణ ఆయీ ఇంటిలోనే బస చేసేవాడిని. బాబాను దర్శించడానికి వెళ్ళినప్పుడు తప్ప శిరిడీలో మిగతా సమయమంతా ఆయీ ఇంటి వద్దనే గడిపేవాడిని.

ఆయీ ఉదాత్త భావాలు గల ప్రేమమయి. 'ఆయీ' అంటే తల్లి. మొదటి నుండి ఆయీని నా తల్లిగానే భావించాను. ఆమె కూడా నన్ను కన్నబిడ్డలా ఆదరించేది. బాబా ప్రతిరోజూ ఆమెకు ఒక రొట్టెను ప్రసాదంగా పంపేవారు. ఆ రొట్టెతోనే ఆమె జీవనం గడిచేది. నేను శిరిడీలో ఉన్నప్పుడు బాబా రెండు రొట్టెలు పంపేవారు. ఒకటి ఆమెకు, మరొకటి నాకు! నేను శిరిడీలో లేనప్పుడు బాబా వద్ద నుండి అదనంగా రొట్టె వస్తే, నేను దారిలో ఉన్నానని, కొద్దిసేపట్లో శిరిడీకి రాబోతున్నానన్న దానికి సంకేతంగా ఆయీ గ్రహించేది.

ఆయీకి బాబాపై ఉన్న భక్తి అపారం. ఆమె కేవలం బాబా కోసమే జీవించేది. బాబా కోరినవన్నీ నెరవేర్చడం, బాబా సంస్థానానికి కావలసినవన్నీ సమకూర్చడంలోనే ఆమెకు ఆనందం కలిగేది.

నాకు బాబా ఆదేశం, సహాయం ఆమె ద్వారా ఒక ప్రత్యేక రీతిలో అందేవి. ఆమె దయామయి. నిష్కపట స్వభావి. దాపరికం లేకుండా అన్ని విషయాలు నాతో చెప్పేది. నేను కూడా నా మనస్సు విప్పి నా భావాలను ఆమెతో పంచుకొనేవాడిని. ఆధ్యాత్మిక పురోగతి కోసం మనం ఏమి చేస్తున్నామన్నది ఇతరుల ఊహకు అందనీయకుండా రహస్యంగా ఉంచాలని, ఆధ్యాత్మిక సాధనా సాఫల్యానికి గోప్యం అవసరమని చెప్పేది. బాబా ఆచరించి చూపిన మార్గం కూడా అదే. [2]

ఆయీ శ్రావ్యమైన కంఠంతో మధురంగా పాడేది! సంగీతం ఆమె ఆధ్యాత్మిక సాధనలో భాగం. ఆమె సితార్ కూడా వాయించగలదు. నాకు కూడా సంగీతం పట్ల ఎంతో మక్కువ. ఆ పాటలు వింటున్నప్పుడు భక్తి పారవశ్యంలో నాకు సులభంగా మనోలయమయ్యేది.[3]

ఒకసారి నేనూ, ఆయీ ఏ విధమైన సాధన మాకు ఉపయుక్తంగా ఉంటుందోనని చర్చించుకున్నాం. కీర్తనలు, భజనలు ఒక విధంగా మంచివే. కానీ అవి బయటివాళ్ళను ఆకర్షిస్తాయి. అంతేకాదు కేవలం అవి మాత్రమే మా పురోగతికి సరిపోవని అనుకున్నాం. అందువల్ల జపమైతేనే బావుంటుందని నిర్ణయించుకున్నాం. తరువాత ఏ నామజపమైతే బాగుంటుందోనన్న ప్రశ్న తలెత్తింది. ఎక్కువ మంది రామనామం, విఠలుని నామం జపిస్తారని, కానీ తనకు సాయియే దైవం కాబట్టి

---

*2. జిన్నే కమాయా ఉన్నే ఛుపాయా - కబీర్ (దేనినైతే పొందారో దానిని గుప్తంగా ఉంచుతారు)*

*3. అంతర్ముఖం కావడం, తీవ్ర ధ్యానం.*

*ఈ భక్తుడు క్రింది విషయాలు కూడా చెప్పాడు- బాబాకు మంచి సంగీత పరిజ్ఞానముంది. చక్కటి సంగీతాన్ని మెచ్చుకొని అభినందించేవారు. వారికి ముఖ్యంగా భజన కీర్తనలంటే మక్కువ. ఒక్కొక్కసారి అర్ధరాత్రి తనకు కబురు పంపి కీర్తనలు పాడించుకొని వినేవారు. రాగాలలో దొర్లిన తప్పులు సవరించి, సంగీతంలోని మెళుకువలు బోధించేవారు. అంతేకాకుండా మధురమైన కంఠంతో బాబా స్వయంగా పాడేవారు.*

వారి నామం జపిస్తే చాలునని, అయితే నేను చేసుకోదలచుకుంటే విఠలనామం చేసుకోవచ్చని ఆయీ చెప్పింది. నేను విఠలుడిని చూడలేదని, ఆమెకేది మంచిదైతే నాకూ అదే మంచిదని, నేను కూడా బాబా నామమే జపిస్తానని చెప్పాను. ఇలా నిర్ణయించుకొని మేమిద్దరం ఎదురెదురుగా కూర్చొని ఒక గంట సేపు సాయినామ జపం చేశాము. అదే రోజు సాయిబాబా నాకు కబురుపెట్టారు. వెళ్ళి వారిని దర్శించగానే *"ఉదయం ఏం చేశావు?"* అనడిగారు. జపం చేసుకుంటూ గడిపానని చెప్పాను. *"ఎవరి నామం జపించావు?"* అనడిగారు. నా దేవుడి నామం జపించానని చెప్పాను. తిరిగి *"ఎవరు నీ దేవుడు?"* అనడిగారు. "నా దేవుడెవరో మీకు తెలుసు!" అని జవాబిచ్చాను. వారు చిరునవ్వు నవ్వి *"సరే!"* అన్నారు. మమ్మల్ని జపము చేసుకోమని నేరుగా తెలియజేయకున్నా నాకూ, ఆయీకి ఈ జపము చేయడానికి స్ఫూర్తినిచ్చినది బాబానే అని నాకు అర్థమైంది. నా విషయంలో జపమే సాధనని బాబా అంగీకరించారు. ఇక వారు నిర్దేశించిన గమ్యం (సాధ్యం) లేక జీవిత పరమార్థం ఏమిటి? ఏ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని మానవుడు సాధన చెయ్యాలి? బాబా సాధన విషయం పరోక్షంగా తెలియజేసారు, కాబట్టి గమ్యం విషయం కూడా పరోక్షంగానే తెలియజెప్పారు. వారు చెప్పిన విషయాలన్నింటిని బట్టి "గాఢమైన ప్రేమ ద్వారా దేవుని (ఏ రూపంలోనైనా, ముఖ్యంగా ప్రేమమూర్తి అయిన గురువు రూపాన్ని) చేరాలి" అని స్పష్టమౌతుంది. వారిని అనన్యంగా ప్రేమించడం ద్వారా అది సాధ్యమౌతుంది. మేము ఆచరించిందీ అదే, వారి అపారమైన ప్రేమతో మాచే ఆచరింప చేసిందీ అదే!

అన్ని మతాల అంతిమ లక్ష్యం మన దైవాన్ని భౌతికంగా దర్శించడం లేదా సాక్షాత్కారం పొందడమేనని కొందరి అభిప్రాయం. కానీ నేనలా అనుకోవడం లేదు. నేను బాబాను ఏకాగ్రతతో ధ్యానిస్తున్నప్పుడు, ధ్యానంలో బాబా రూపం సాక్షాత్కరించేది. నేను దీనికి పెద్దగా ప్రాధాన్యత ఇచ్చేవాడిని కాను. ఎందుకంటే బాబాను వేరుగా, నా నుండి బాహ్యంగా చూడడం నాకు ఇష్టం లేదు. అందుకే బాబాను నా లోనికి వచ్చి "నేను"గా ఉండమని ప్రార్థించాను. ఆత్మ (నేను) అనేది రెండు పదార్థాలతో కూడుకున్నది. ఒకటి స్థూలశరీరము, రెండవది సూక్ష్మశరీరము. సూక్ష్మశరీరమే మన ఉనికికి ఆధారమైనది, ఉత్కృష్టమైనది. మన ఆత్మ, విఠల దేవుడు, ఇతర తత్త్వాలు అన్నీ సత్యం యొక్క ప్రతిబింబాలే. అందువలన "నేను"

విరలుడు లేక సాయిగా ఎదగడానికి ప్రయత్నించాలి. వారు నాలో అత్యంత ఉన్నతంగా ప్రకాశించాలి. ఇదే నేను కోరుకునేది.

నేనింతవరకు భగవద్గీతను కూడా సక్రమంగా చదవలేదు. మొదటి నుండి శాస్త్రగ్రంథాల పఠనానికి ప్రాముఖ్యతను ఇవ్వలేదు. అందువల్ల ధ్యానంలోని వివిధ స్థితులను లేదా చరమస్థితిని గురించిన వివరాలలోనికి వెళ్ళను. ఒక గురుపూర్ణిమ పర్వదినాన ఎంతోమంది భక్తులు బాబా దర్శనానికి వచ్చారు. పవిత్రమైన ఆ రోజున బాబా ఆశీస్సులతో సద్గ్రంథాలను తీసుకుంటే పారాయణ ఫలవంతమవుతుందని భక్తుల అభిప్రాయం. కానీ తరచుగా బాబా ఎవరిచ్చిన పుస్తకం తిరిగి వారికే ఇవ్వకుండా మరొకరికి ఇస్తుంటారు. ఆ రోజు నా దగ్గర తప్ప భక్తులందరి వద్ద పుస్తకాలున్నాయి. ఇది గమనించిన బాబా, పుస్తకాలను చూపిస్తూ *"వాళ్ళు ఈ పుస్తకాలలో బ్రహ్మను కనుగొనాలనుకుంటారు. కానీ ఈ పుస్తకాలలో ఉండేది భ్రమే! నీ ఆలోచనే సరియైనది. నీవు ఈ పుస్తకాలు చదువనక్కరలేదు, నన్ను నీ హృదయంలో నిలుపుకో. బుద్ధిని, మనస్సును ఏకం చేయి అది చాలు"* అన్నారు. అందువల్ల నేను ఏ ఆధ్యాత్మిక గ్రంథాలు చదివేవాడిని కాదు. నేనేం చేయాలో అన్నది నా అనుభవాలే నాకు తెలియజేసేవి. ఇంతవరకు నన్ను ఏది ముందుకు నడిపించిందో, నేనేమి పొందానో- దానికి నేను సంతృప్తిగా ఉన్నాను. నాకు బాబా పట్ల ఎంతో ప్రేమ ఉన్నప్పటికీ ఇతర భక్తులు బాబాకు చేసుకున్నంత సేవను నేను చేసుకోలేకపోయాను.

1912 గురుపూర్ణిమ సమయంలో అనుకుంటాను, నేను శిరిడీకి బయలుదేరి మన్మాడు స్టేషనులో దిగాను. శిరిడీ వెళ్ళే భక్తులు చాలామంది కనిపించారు. ప్రతి ఒక్కరి చేతిలోనూ పూలమాలలున్న బుట్టలున్నాయి. నాకు సర్వస్వమైన గురువును దర్శించడానికెళుతూ కనీసం ఒక్క పూలమాల కూడా తీసుకురానందుకు చింతించాను. అందరం శిరిడీ చేరి మసీదుకెళ్ళాం. బాబా మెడనిండా ఎన్నో పూలమాలలున్నాయి. వారికి వేసేందుకు నా వద్ద ఒక్క మాల కూడా లేనందుకు మరల బాధ కలిగింది. అప్పుడు బాబా ఆ పూలమాలలన్నింటినీ పైకెత్తి చూపుతూ *"ఇవన్నీ నీవే!"* అన్నారు. ఆహా! అన్నింటినీ మన్నించి, మరిపించి మురిపించే వారి ప్రేమ ఎంత గొప్పది!

అదే సంవత్సరంలో (1912) మరొకసారి శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాను. అప్పుడు నా జేబులో 100 రూపాయలున్నాయి. బాబా 40 రూపాయలు దక్షిణ అడిగారు. వెంటనే ఇచ్చాను. కొద్దిసేపయిన తరువాత మరో 40 రూపాయలు అడిగారు. ఆనందంగా సమర్పించాను. మళ్ళీ 20 రూపాయలు అడిగారు. నా వద్ద మిగిలున్న 20 రూపాయలు కూడా ఇచ్చేసాను. ఇక ఒక్క పైసా కూడా మిగలలేదు. ఉన్న డబ్బంతా బాబాకు ఇవ్వగలిగినందుకు సంతోషించాను. కాసేపటికి బాబా నన్ను మరల పిలిపించి దక్షిణ అడిగారు. నా దగ్గర ఇచ్చేందుకు ఏమీ లేదని చెప్పాను. *"నీ వద్ద డబ్బులేకుంటే ఎవరినైనా అడిగి తెచ్చి ఇవ్వు"* అన్నారు. ఎవరి వద్దకెళ్ళమంటారో వారినే చెప్పమన్నాను. బాబా షామా దగ్గరికెళ్ళమన్నారు. నేను షామా దగ్గరికెళ్ళి జరిగింది చెప్పి డబ్బు అడిగాను. అప్పుడు షామా "నీవు బాబాను సరిగా అర్థం చేసుకోలేదు. బాబాకు డబ్బు గడ్డిపోచతో సమానం. బాబాకి కావలసింది నీ బుద్ధి, మనస్సు. అంతేకాదు నీ సమయాన్ని, ఆత్మను బాబాకే సమర్పించాలని వారి ఉద్దేశ్యం" అన్నాడు.

నేను మసీదుకు వెళ్ళి షామా చెప్పినదంతా బాబాకు వివరించాను. వారు చిరునవ్వు నవ్వి దీక్షిత్‌ను అడగమన్నారు. నేను దీక్షిత్‌కు విషయమంతా చెప్పాను. డబ్బు లేకపోవడం, డబ్బు లేదా మరేదైనా యాచించవలసి రావడం అవమానంగా తలచరాదని, తనకు తాను గొప్ప అన్న భావన ఉండరాదని నాకు బోధించడానికే బాబా ఇదంతా జరిపిస్తున్నట్లు దీక్షిత్ చెప్పాడు. నేను బాబా దగ్గరికి తిరిగి వెళ్ళి దీక్షిత్ చెప్పిన విషయాలు వారికి నివేదించాను.

బాబా నవ్వి ఈసారి నానాసాహెబ్ చాందోర్కర్ దగ్గరికెళ్ళి అప్పు అడగమన్నారు. నేను నానాసాహెబ్ కోసం ఖండోబా ఆలయానికి వెళ్ళాను. అక్కడ నానాసాహెబ్, ఉపాసనీతో కలిసి ఆధ్యాత్మిక గ్రంథాలు పారాయణ చేస్తున్నాడు. నేను నానాకు జరిగినదంతా చెప్పి బాబా ఆదేశానుసారం డబ్బు కోసం వచ్చినట్లుగా చెప్పాను. వెంటనే నానాసాహెబ్ తన లౌక్యాన్ని ప్రదర్శించాడు. "నిజమే, బాబా దక్షిణ అడిగినప్పుడు మన దగ్గర డబ్బు లేకుంటే ఎంత సంకటంగా ఉంటుందో నేనూహించగలను. అందుకే నేను శిరిడీ వచ్చేటప్పుడు సగం డబ్బు కోపర్‌గాంలో దాచి ఉంచుతాను. ఇప్పుడు కూడా అలాగే చేశాను. ఇంటి నుండి రెండు వందల

రూపాయలు తీసుకొచ్చి అందులో వంద రూపాయలు కోపర్‌గాంలో ఉంచాను. బాబా అడిగినప్పుడల్లా దక్షిణ సమర్పిస్తూ, చేతిలో డబ్బు అయిపోగానే కోపర్‌గాం నుండి మిగిలిన డబ్బు తెప్పించుకుంటాను. నువ్వు కూడా అలాగే చేయి!" అన్నాడు. నానాసాహెబ్ చెప్పిన విషయాలన్నీ బాబాకు నివేదించాను. నేనక్కడ కూర్చుని ఉండగానే బాబా వెంట వెంటనే నానాను మూడుసార్లు పిలిపించి మొదటిసారి 40 రూపాయలు, రెండవసారి 40 రూపాయలు, మూడవసారి మిగిలిన మొత్తాన్నంతా దక్షిణగా అడిగి తీసుకున్నారు. నానాసాహెబ్ వెంటనే కోపర్‌గాంలో ఉన్న వందరూపాయలు తెమ్మని మనిషిని పంపాడు. ఆ డబ్బు వచ్చేలోగా బాబా నానాను మళ్ళీ దక్షిణ అడిగారు. తన వద్ద డబ్బు లేదని చెప్పవలసి వచ్చినందుకు నానా చిన్నబుచ్చుకున్నాడు. ఈ సంఘటన ద్వారా బాబా అవసరాలన్నీ తీర్చగలమని, వారడిగినవన్నీ ఇవ్వగలమని ఎవరైనా అనుకుంటే అది కేవలం భ్రమ అన్న విషయం నానాసాహెబ్‌కు, నాకు, అక్కడున్న వారందరికీ అర్థమయింది. దక్షిణ అడగటాన్ని ఒక్కొక్క భక్తుడు ఒక్కో విధంగా ఎలా అర్థం చేసుకుంటాడో బాబా ఈ విధంగా తెలియజేసారు. బాబా దక్షిణ అడగటంలోని అంతరార్థం నానా, షామా, దీక్షిత్‌లు చెప్పినది కాదు. నానాసాహెబ్‌కు, నాకు కొన్ని విషయాలు బోధించడమే బాబా ఉద్దేశ్యం. డబ్బు, కానుకలు బాబా లెక్కచేయరు. వారు భక్తుల నుండి కోరుకునేది హృదయపూర్వకమైన ప్రేమ మాత్రమే! అటువంటి ప్రేమ బాబా యందు కలిగి ఉండటమే నా లక్ష్యం. ఈ విషయం బాబాకు తెలుసు. అందుకే నా మనసెరిగి తదనుగుణంగా స్పందించారు. బాబా మాత్రమే అలా స్పందించగలరు.

బహుశా 1915లో అనుకుంటాను రామనవమి ఉత్సవాలకు శిరిడీ వెళ్ళదలచాను. బాబాకు సమర్పించదగిన కానుకేదైనా కొనాలని తలచి ఇండోర్‌లో బట్టల బజారుకెళ్ళాను. అక్కడ ఒక చోట ఛందేర్‌లో తయారైన ఢాకా మస్లిన్ వస్త్రం ఒకటి నన్నమితంగా ఆకర్షించింది. అది 5 అడుగుల చదరంగా ఉంది. చుట్టూ 8 నుంచి 9 అంగుళాల జరీ అంచు అల్లికతో నాజూకుగా ఉంది. అది నచ్చడంతో దాని ఖరీదు 85 రూపాయలైనా సముచితమే అనిపించి కొన్నాను. అది ఎంత నాజూకుగా ఉందంటే, మడిచిన తరువాత 6×6×1 అంగుళాల ప్యాకెట్‌లో ఇమిడిపోయింది. నేను దానిని శిరిడీ తీసుకెళ్ళాను. ఆ ప్యాకెట్‌ని చొక్కాలోపల దాచుకొని మసీదుకు వెళ్ళాను. భక్తులు బాబాకు వస్త్రాలు సమర్పించి వాటిని బాబా ఆశీస్సులతో తిరిగి

పొందాలని ఆశించేవారు. బాబా ఆ విధంగానే చేసేవారు. బాబాపై నాకున్న ప్రేమను వారు గుర్తిస్తే (అంటే, నాకూ వారికి భేదం లేదన్న నా భావం వారు గుర్తించినట్లయితే) నా కానుక నాకు తిరిగి ఇవ్వకుండా వారే స్వీకరించాలి అని అనుకున్నాను. సాధారణంగా బట్టలు, శాలువాలు తెచ్చిన భక్తులందరూ వాటిని బాబాపై కప్పుతారు. సేవకులు "ఇది ఎవరిది?" అని అడుగుతూ ఎవరిది వారికి ఇచ్చివేస్తారు. నేను వెళ్ళి నమస్కరిస్తూ, బాబా నా కానుకను తిరిగి ఇవ్వకూడదని తెచ్చిన ప్యాకెట్‌ను నేర్పుగా బాబా గద్దె క్రింద దాచాను. ఎవరు సమర్పించిన కానుకలు వారికి తిరిగి ఇవ్వబడ్డాయి కానీ నేను గద్దె కింద దాచిన ప్యాకెట్‌ను ఎవరూ గమనించలేదు. అప్పుడు బాబా లేచి నిలబడి ***"గద్దెను తీసి దులిపి, శుభ్రం చేయండి"*** అని ఆదేశించారు. గద్దెను తీసినప్పుడు మస్లిన్ ప్యాకెట్ కనిపించింది. బాబా దానిని చేతిలోకి తీసుకొని "ఏమిటిది మస్లినా?" అని దాని మడత విప్పి ***"నేను దీనిని తిరిగి ఇవ్వను. ఇది నాది"*** అన్నారు. దానిని కప్పుకొని నావైపు చూస్తూ ***"ఇది కప్పుకుంటే నేను చాలా అందంగా ఉన్నాను కదూ?"*** అనడిగారు. బాబా నా కానుక స్వీకరించడంతో నాకు అమితానందం కలిగింది. నా అంతరంగంలో వారు కొలువై ఉన్నారని, నేను వారినుండి వేరుకాదని నాకర్థమైంది.

అదే సంవత్సరం బాబా మరో సంఘటన ద్వారా మా ఏకత్వాన్ని తెలియజేసారు. నేను ఎప్పటివలె శిరిడీ వెళ్ళి ఆయీ ఇంటిలో ఉన్నాను. ఒకరోజు మధ్యాహ్నం మసీదులో బాబా ఏకాంతంగా ఉన్నప్పుడు నన్ను పిలుచుకురమ్మని ఒక వ్యక్తిని పంపారు. నేను వెళ్ళగానే ఆ వ్యక్తిని పంపించివేసి నన్ను ఆప్యాయంగా దగ్గరకు పిలిచి కౌగిలించుకున్నారు. తరువాత తమ చెంత కూర్చుండ బెట్టుకొని ***"నా ఖజానా తాళపు చెవి నీ చేతిలో పెడుతున్నాను. నీకేం కావాలో కోరుకో! నెలకు 5 రూపాయలుగానీ 100 రూపాయలుగానీ నీ ఇష్టం. నీకేది కావాలన్నా ఇస్తాను"*** అన్నారు. వారు నన్ను ప్రలోభపెడుతున్నారేమోననిపించింది. అయినా నేను కోరుకోవాల్సిందేముంది? నాకు ఏది అవసరమో ఏది అనవసరమో, ఏది ఇవ్వాలో ఏది ఇవ్వకూడదో సర్వమూ వారికి తెలుసు. నేనేమీ అడగదలచకపోవడం చూసి బాబా బుజ్జగిస్తున్నట్లుగా నా చుబుకం పట్టుకొని ఏదో ఒకటి అడగమన్నారు. అప్పుడు నేను "బాబా! నేనేదడిగినా ఇస్తారా?" అన్నాను. బాబా ***"ఇస్తాను"*** అన్నారు. "అయితే ఈ జన్మలోనే కాక రాబోయే జన్మలన్నింటిలోనూ మీరు నన్ను విడిచి

వెళ్ళకూడదు. ఎప్పుడూ నాతోనే ఉండాలి'' అన్నాను. అప్పుడు వారు ఆనందంతో నన్ను మెల్లగా తడుతూ *''సరే, నువ్వెక్కడ ఉన్నా, ఏమి చేస్తున్నా నీ లోపల, వెలుపల ఎప్పుడూ నీతోనే ఉంటాను''* అన్నారు. నాకు అమితానందం కలిగింది. వారు ఎప్పుడూ నాతోనే ఉన్నారన్నది నాకు అనుభవమవుతుంటుంది. వారు నాతోనే ఉన్నారని నిదర్శనమివ్వడానికి అప్పుడప్పుడూ నాకు సాక్షాత్కరిస్తుంటారు. నన్ను సరియైన మార్గంలో నడిపిస్తుంటారు.

చాలా సంవత్సరాల తరువాత నా కుమారుడు మరణించాడు. అప్పుడు మేము అనేక కుటుంబాలు నివాసముంటున్న ఒక భవంతిలో ఉన్నాము. కుమారుని మరణానికి నా భార్య కృంగిపోయి విలపించసాగింది. బిడ్డను బాబానే తీసుకెళ్ళారనీ మనకేది మంచిదో వారికి తెలుసు గనుక మనం దుఃఖించకూడదని, పెద్దగా విలపిస్తే జనం గుమిగూడతారని చెప్పాను. బిడ్డ నిర్జీవ దేహాన్ని చూస్తూ ఆమె భరించలేకుండా ఉండటంతో, మరుసటి ఉదయం అంత్యక్రియల వరకు విశ్రాంతి తీసుకోమని ఓదార్చి, నేను ఆమెను లోనికి పంపాను. చనిపోయిన బిడ్డను ఒడిలో పెట్టుకొని కూర్చొని ఉండగా నాకు బాబా కనిపించి, నన్ను బయటకు తీసుకువెళ్ళి *''నీకు చనిపోయిన బిడ్డ కావాలో, నేను కావాలో తేల్చుకో. రెండూ కావాలంటే పొందలేవు. పిల్లవాడే కావాలనుకుంటే బ్రతికిస్తాను. కానీ నేను నీతో ఉండను. ఈ బిడ్డను బ్రతికించుకోవాలని అనుకోకపోతే నీకు తరువాత ఎంతోమంది పిల్లలు పుడతారు''* అన్నారు. నేను ఏ సంకోచము లేకుండా ''నాకు మీరే కావాలి!'' అన్నాను. *''అయితే దుఃఖించకు!''* అని చెప్పి బాబా అంతర్ధానమయ్యారు.

ఈ విధంగా నాకు అవసరమైనప్పుడు బాబా దర్శనమిచ్చి తగిన ధైర్యాన్ని ఇస్తుంటారు. వారి కృప వలన నాకు కావలసినవన్నీ నెరవేరుతుంటాయి. నేను వారినెప్పుడూ ఐహికమైన కోరికల కోసం ప్రార్థించి వారికి ఇబ్బంది కలిగించను. నాకు తగినంత ఆదాయం ఉంది. ఆస్థిపాస్థులున్నాయి. భీమా రక్షణ ఉంది. నాకున్నదానితో సంతృప్తిగా ఉన్నాను. ఎప్పుడైనా డబ్బు అవసరం ఏర్పడితే, బాబా కృపవలన ఎలాగో డబ్బు సర్దుబాటై సమస్య తీరిపోయేది. నాకు దేనికీ లోటు లేదు.

ఇక బాబా భక్తుడయ్యేందుకు, వారి సహాయం పొందేందుకు (బాబాను భౌతికంగా దర్శించనివారు) ఏం చెయ్యాలని నన్నెవరైనా అడిగితే, నేను ఇచ్చే

సమాధానమొక్కటే! బాబాను గాఢంగా, హృదయపూర్వకంగా ప్రేమించమని చెబుతాను. అందుకు శిరిడీయే వెళ్ళాల్సిన అవసరం లేదు. కానీ శిరిడీ సందర్శనం నిస్సందేహంగా సహాయపడుతుంది. సర్వేంద్రియాలను కేంద్రీకరించి ప్రేమతో వారిని ధ్యానిస్తే చాలు. ఎవరి అర్హతలకు తగినట్లుగా వారు బాబా నుండి తప్పక సహాయాన్ని పొందుతారు.

బాబా అందరికీ ఒకే విధమైన సాధన చేయమని ఆదేశించరు. ఆ భక్తుని సంస్కారానికి, పరిణతికి ఇతర పరిస్థితులకు అనుగుణమైన సాధననే విధిస్తారు. వాళ్ళ ఇష్టదైవాన్నే ఆరాధించుకోమని చెబుతారు. రామభక్తుడైతే రాముణ్ణి, అల్లాను కొలిచేవారిని అల్లానే కొలుచుకోమంటారు. బాబా అందరిని సమదృష్టితో ఆదరిస్తారు. హిందువులు నైవేద్యం సమర్పించే సమయాలలో కొన్నిసార్లు వారు 'ఫత్యా' (ముస్లిం ప్రార్థన) చదవడంగానీ, ఇతరులచే చదివించడంగానీ చేసేవారు. ఒకటి రెండు సంఘటనల మినహా హిందువులు, ముస్లింలు బాబాను పూజించే విధానాల మధ్య ఎటువంటి వైరుధ్యము ఏర్పడలేదు. ఒక ఉదాహరణ చెబుతాను.

1916లో ఇద్దరు రోహిల్లాలు శిరిడీ వచ్చి బాబాను ఆశ్రయించారు. వారిలో పెద్దవాడు నిరంతరము బాబాను అంటి పెట్టుకొని ఉండేవాడు. రాత్రిళ్ళు బాబా పాదాల చెంత కూర్చొని ఖురాన్ పఠించేవాడు. అతను బాబాను భగవంతునిగా భావించి ఆయన పట్ల ఎంతో గౌరవభావం కలిగి ఉండేవాడు. కానీ మసీదులో సంగీతవాయిద్యాల నడుమ ఆరతి పాటలు పాడడం, దేవతామూర్తులకు నివేదించబడిన నైవేద్యాలను భక్తులకు పంచడం, తామే దైవంగా పూజింపబడడం వంటివి ఇస్లాం మత సాంప్రదాయాలకు విరుద్ధమైనవని భావించి ఒకరోజు బాబాకు తన అభ్యంతరం తెలిపాడు. వారు చిరునవ్వు నవ్వి ***"అంతటా నిండివున్నది అల్లానే!"*** అన్నారు. బాబా ఒక్కొక్కసారి ***"మనమందరము అల్లాచే సృష్టించబడిన వారమే"*** అని, ఇంకొకసారి ***"నేనే దైవాన్ని"*** అనేవారు. ఇది అతడి దృష్టిలో మతవిరుద్ధంగా తోచింది. బాబా దైవమే అయినప్పటికీ వారి సిద్ధాంతం తప్పని అందుకని బాబాను, వారి సిద్ధాంతాన్ని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఒకరోజు బాబా నడిచి వెళ్తుండగా అతను కుడి చేతిలో దుడ్డుకర్ర పట్టుకొని వారిని సమీపించాడు. అప్పుడు బాబా వెనుకకు తిరిగి, రోహిల్లా ఎడమచేతి మణికట్టును పట్టుకొని తీక్షణంగా అతని

వైపు చూసారు. ఆ చూపుతో రోహిల్లా గుండె నిబ్బరం కోల్పోయాడు. చేతిలోని కర్రను కూడా పట్టుకొనే శక్తి లేక దానిని జారవిడిచి నిస్సత్తువగా కూలబడిపోయాడు. బాబా అతనిని అలాగే వదిలేసి వెళ్ళిపోయారు. చివరకు ఎవరో వచ్చి అతనిని లేపవలసి వచ్చింది. కొన్ని రోజుల తరువాత అతను బాబా వద్ద నుండి సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు. మరలా రాలేదు. రెండవ రోహిల్లా ఇతని వలె మతద్వేషి కాదు. అతను విధేయతతో సంస్థానంలో సేవ చేసుకుంటూ గడిపాడు.

ఇలా మతఛాందసాన్ని ముస్లింలే కాదు కొందరు హిందువులు కూడా ప్రదర్శించేవారు. కానీ బాబా ప్రతి సందర్భంలోను వాళ్ళలోని ద్వేషభావాన్ని ఒకే విధంగా అణచివేసారు.

బాబాతో నాకున్న అనుభవాలన్నీ వివరించవలసిన అవసరమూ లేదు, అలా వివరించడం సాధ్యమూ కాదు. వారు నాపై చూపిన కరుణ అపారం. నా శ్రేయస్సు కోసం చేసిన ఏర్పాట్లు అనంతం. వారు భక్తులను ఆదుకొనే పద్ధతులు, చేసే సహాయం ఒక్కొక్క భక్తునికి ఒక్కో విధంగా ఉండేవి. అవి ఆ భక్తుని యొక్క స్వభావానికి, పరిస్థితులకు అనుగుణంగా అమరేవి. నేను వారి నుండి అన్ని విధాలైన సహాయం పొందాను. బాబా సహాయపడే పద్ధతులు దిగువ వివరిస్తున్నాను.

మనమేదైనా ఆపదలో ఉన్నప్పుడు దాని నుండి బయటపడే మార్గం ఇదీ అని ఓ ప్రేరణ ద్వారా మన మనస్సుకు తెలిసేటట్లు చేస్తారు. ఈ ప్రేరణ బాబా నుండి వచ్చినట్లు కూడా మనకు తెలుస్తుంది. ఉదాహరణకు, బాబా నాతో ఏదైనా అసాధారణ సమయంలో ఏకాంతంగా మాట్లాడాలని సంకల్పించారనుకోండి, వెంటనే నాకు బాబాను దర్శించాలనే ప్రేరణ కలిగేది. ఈ ప్రేరణ బాబానే కలిగిస్తారు. ఈ మొదటి పద్ధతి మనం ఎఱుకలో ఉన్నప్పుడు కలిగే ప్రేరణలకు సంబంధించినది.

రెండవ విధానంలో - బాబా కొన్నిసార్లు ప్రత్యక్షంగా కనపడటం ద్వారా కానీ, స్వప్నదర్శనాల ద్వారా కానీ, ధ్యాన పారవశ్యతలో స్ఫురింపచేయడం ద్వారా కానీ సూచనలు సలహాలు ఇవ్వడం జరిగేది. ఇది పొరపాటుకు తావులేకుండా మన మనసులో చెరగని ముద్ర వేసే పద్ధతి.

ఇక మూడవ విధానంలో, బాబా మనలను వేరొక వ్యక్తి దగ్గరకు పంపించి అతని ద్వారా మనకు పరిష్కారం చూపుతారు లేదా సూచనను అందజేస్తారు.

బాబా మనల్ని కలుసుకోమన్న వ్యక్తికి సమస్యను పరిష్కరించగల సామర్థ్యంగానీ, వివేకంగానీ ఉండదు. అతనికి సమస్యేమిటో దాని పరిష్కారమేమిటో కూడా తెలియదు. అతను ఏదో ధోరణిలో మాట్లాడతాడు కానీ ఆ మాట్లాడిన మాటల్లో మన సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

బాబా సశరీరులుగా ఉన్నప్పుడూ, సమాధి చెందిన తరువాత కూడా పైమూడు పద్ధతుల ద్వారా మాత్రమే కాక అనేక విధాలుగా శిక్షణ ఇచ్చి నాకు సహాయపడేవారు. శ్రీసాయిబాబా, శ్రీరామకృష్ణ పరమహంస ఒకే అంశలో అవతరించారని, వారిద్దరూ ఒకటేనని నా నమ్మకం. నా నమ్మకానికి క్రింది సంఘటనే నిదర్శనం.

సుమారు ఎనిమిది సంవత్సరాల క్రితం నేను దక్షిణేశ్వరం వెళ్ళాను. అక్కడ ముఖ్యమైన ప్రదేశాలు చూడడానికి స్థానికుడైన ఒక గైడును ఏర్పాటు చేసుకున్నాను. అతను శ్రీరామకృష్ణ పరమహంస పూజించిన కాళీమాత విగ్రహాన్ని, ఇతర మూర్తులను చూపించాడు. నేను కాళీమాత విగ్రహాన్ని పూజగది బయట నుండే చూసి ముందుకుసాగాను. శ్రీరామకృష్ణులు తరచూ ఆడుకుంటూ గడిపిన 'రాంలాల్' చిన్న విగ్రహాన్ని చూడాలన్న ఆతృతతో దానిని చూపించమని గైడును అడిగాను. అతను నన్ను ఒక దేవాలయానికి తీసుకెళ్ళి ఒక పెద్ద విగ్రహాన్ని చూపిస్తూ 'ఇదే రాంలాల్' అన్నాడు. నేను విస్తుపోయాను. అది 'రాంలాల్' కావడానికి ఆస్కారమే లేదని చెప్పాను. దానికతను స్థానికుడైన తనకు అక్కడున్న ప్రదేశాలు, వాటి చరిత్ర క్షుణ్ణంగా తెలుసని, కొత్తవాడినైన నాకు ఈ విషయాలెలా తెలుస్తాయని అన్నాడు. నేనతనిని నొప్పించి ఉంటే క్షమించమన్నాను. కానీ 'రాంలాల్' విగ్రహం ఎక్కడ ఉందో తెలుసుకోవాలనుకున్నాను. నేను పరమహంస జీవిత చరిత్రలో 'రాంలాల్' గురించి చదివి ఉన్నాను. అదే సమయంలో ఒక పూజారి నన్ను సమీపించి, దక్కను ప్రాంతం నుండి వచ్చినది మీరేనా? అని అడిగాడు. అవునని చెప్పాను. అయితే అక్కడున్న ప్రదేశాలన్నీ తను దగ్గరుండి చూపిస్తానన్నాడు. నేనవన్నీ ఇప్పుడే చూసానని బదులిచ్చాను. అతను మళ్ళీ ఆ ప్రదేశాలు చూడమని పట్టుబట్టాడు. తనకు డబ్బేమీ ఇవ్వనక్కరలేదని, దీనికి కారణం వేరే ఉందని చెప్పాడు. గతరాత్రి అతనికి ఒక కల వచ్చిందని, కలలో దక్కను ప్రాంతం నుండి ఒక భక్తుడు వస్తున్నాడని,

అతనికన్నీ దగ్గరుండి చూపించమని ఆదేశం అందిందని, అందుకే నన్ను తనతో రమ్మని కోరాడు. నేనిక మారు మాట్లాడక అతనితో వెళ్ళాను. ఆ పూజారి నన్ను శ్రీరామకృష్ణులు పూజించిన కాళీమాత ఆలయంలోని గర్భగుడిలోనికి తీసుకెళ్ళి ఆ దేవతను తాకి, నచ్చిన విధంగా పూజించుకునే అవకాశం కల్పించాడు. తరువాత 'రాంలాల్'ను చూపిస్తానన్నాడు. నా గైడు ఒక పెద్ద విగ్రహాన్ని చూపించి దానిని 'రాంలాల్'గా పరిచయం చేశాడని చెప్పాను. ఆ గైడు నన్ను మోసం చేశాడని చెప్పి, పరమహంస ఆడుకున్న 'రాంలాల్' చిన్న విగ్రహాన్ని తెచ్చి నా ఒడిలో ఉంచాడు. నేను ఆశించిన దానికన్నా ఎక్కువగానే బాబా నాకు ప్రసాదించారు. బాబా, శ్రీరామకృష్ణ పరమహంస వేరు కాదని ఒక్కరేనని నాకవగతమైంది.

శ్రీసాయిబాబా ఎంతో ప్రేమతో నన్ను తమ చెంతకు చేర్చుకున్నారు. బాబా పట్ల నాకు కూడా అంతే ప్రేమానురాగాలు ఉన్నాయి. మా మధ్య ఉన్న ఈ అనుబంధం, నేను ఇతర మహాత్ములను దర్శించినప్పుడు, వారు నన్ను ఆదరించిన విధానంలో ప్రతిబింబించేది.

పూనా, ఇతర ప్రదేశాల్లో తరచుగా కనపడుతుండే మాధవనాథ్ మహరాజ్‌ను నేను 1927లో దర్శించాను. ఆయన రెండు నెలల క్రితం నిర్యాణం చెందారు. నేనేమీ చెప్పకముందే వారు బాబాతో నాకున్న అనుబంధాన్ని గుర్తించి 'నీవు సాయిబాబాకు చెందిన వాడవు' అని అన్నారు. అంతేగాక మొట్టమొదట నేను బాబాను దర్శించినప్పుడు నాకు, బాబాకు మధ్య జరిగిన సంభాషణను పొల్లుపోకుండా వర్ణించారు. తామప్పుడు అక్కడే ఉన్నట్లుగా చెప్పారు. అంటే వారు సూక్ష్మరూపంలోగానీ లేదా సాయిబాబా రూపంలోగానీ అప్పుడక్కడే ఉండి ఉంటారని నాకు అర్థమైంది.



ఆచార్య జి.జి. నార్కే

## 2

## మే 10, 20, 25, 28 తేదీలు, 1936

**ఆచార్య గణేశ్ గోవింద్ నార్కే** ఎం.ఎ.,(కలకత్తా), ఎం.యస్.సి.,(మాంచెష్టర్), భూగర్భ, రసాయనిక శాస్త్ర ఆచార్యుడు, ఇంజినీరింగ్ కాలేజీ, దక్కను జింఖానా, వయస్సు 53 సం॥లు, బ్రాహ్మణుడు, పూనా.

ఆధ్యాత్మికతలో సాధించిన ప్రగతినిగానీ, మహాత్ముల వలన పొందిన అనుభవాలనుగానీ వెల్లడి చేయలేము. "జిన్నేపాయా ఉన్నేఛుపాయా॥" (ఎవరు దేనినైతే పొందారో దానిని గుప్తంగా ఉంచుతారు) అనేది కబీరు ఉవాచ! ఇది నా గురువైన శ్రీసాయిబాబా ఆదేశం కూడా. అందువల్ల అనుభవాల గురించి చెప్పడానికి ప్రయత్నించినప్పుడు నా గొంతు సహజంగానే మూగబోతుంది. నిజానికి అనుభవాలను రహస్యంగా ఉంచాలన్న విషయాన్ని ప్రక్కన పెడితే, అంతరంగంలోని మాటలకందని అనుభూతులను పూర్తిగా వ్యక్తపరచేందుకు ఎవరికీ సాధ్యం కాదు. అయినా సాయిబాబాను గురించి, వారి తత్త్వాన్ని గురించి జగమెరిగిన సత్యాలను చెప్పడానికి నేను సంకోచించను. ఎందుకంటే అందరికీ తెలిసిన విషయాలను చెప్పడం వల్ల రహస్యాలను వెల్లడి చేసినట్లైలా అవుతుంది? నేనిప్పుడు ఇవ్వబోయే సమాచారం పెద్దగా చెప్పుకోదగినది కూడా కాదు. అది ధాన్యం నుండి వేరుచేసిన పొట్టువంటిది. అయినప్పటికీ మీరు సాయిబాబాను గురించిన ఎంతటి చిన్న విషయాన్నైనా తెలుసుకోవడానికి ఉత్సుకత చూపుతున్నందువలన, మీకు కొన్ని వివరాలు అందిస్తాను.

శ్రీసాయిబాబాను నేను నిత్యం ఇంట్లో పూజించే దేవతల మధ్య ఉంచాను. శ్రీసాయిబాబా భగవంతుడే కాని ఒక సాధారణ సత్పురుషుడు మాత్రం కాదు. వారి కళ్ళల్లో ప్రకాశించే దివ్య తేజస్సు వారొక గొప్ప సత్పురుషుడని తెలియజేస్తుంది. వారి చర్యలు, మహిమలు అత్యద్భుతమైనవి. ఇక నేను ఆధ్యాత్మికత వైపు ఎలా మళ్ళానో, బాబాతో నాకెలా పరిచయం ఏర్పడిందో వరుసగా వివరిస్తాను.

నా చుట్టూ ఉన్న పరిసరాలు శ్రీసాయిబాబా పట్ల నాకున్న విశ్వాసాన్ని పెంపొందించడానికి తోడ్పడ్డాయి. మా మామగారైన బూటీ, నా భార్య, మా అమ్మ

అందరూ బాబాకు గొప్ప భక్తులు. వాళ్ళు బాబాను దైవంగా పూజించేవారు. నేను జ్ఞానేశ్వరి, మహాత్ముల గొప్పతనాన్ని తెలియజేసే ఇతర గ్రంథాలను చదువుతూ ఉండేవాడిని.

నేను 1905లో ఎం.ఎ., పట్టా పుచ్చుకున్నాను. కలకత్తాలో 1907 నుండి 1909 వరకు జియొలాజికల్ సర్వేలో (భూగర్భ పరిశోధన) శిక్షణ పొందాను. 1909లో కేంద్ర ప్రభుత్వం నన్ను ఉన్నత విద్యకై మాంచెస్టర్ (ఇంగ్లాండు) నగరానికి పంపింది. అక్కడ గనులు, భూగర్భశాస్త్రంలో ఎం.యస్.సి., పట్టా పుచ్చుకున్నాను. 1912 ఆగష్టులో స్వదేశానికి తిరిగి వచ్చాను.

నా భార్య, తల్లి, మామగారు తరచూ శిరిడీలో గడిపేవారు. ఒకసారి శిరిడీ వచ్చి, సాయిబాబాను దర్శించమని నాకు జాబు వ్రాసారు. బాబా నన్ను రమ్మని చెబితే వస్తానని వారికి జవాబు వ్రాసాను. మా మామగారు బాబాను సంప్రదించి వారు నన్ను రమ్మన్నట్లుగా తిరిగి జాబు వ్రాసారు. దాంతో 1913 ఏప్రిల్‌లో శిరిడీ వెళ్ళాను. బాబా మా బంధువులపట్ల ఎంతో ఆదరణ చూపేవారు. మా అమ్మను చూసి అప్పుడప్పుడు ఉల్లాసంగా చిందులేసేవారు. నేను మొదటిసారి మాధవరావు దేశ్‌పాండేతో (షామా) కలిసి బాబాను దర్శించడానికి వెళ్ళాను. అప్పుడు మాధవరావు నన్ను వారికి పరిచయం చేశాడు. బాబా వెంటనే ***"ఇతనిని నాకు పరిచయం చేస్తున్నావా! ముప్పై తరాల (పీఢీ) నుండి ఇతను నాకు తెలుసు!"*** అన్నారు. నా భూతకాలమంతా బాబాకు తెలియడం ఎంతటి అద్భుతమైన విషయమో!

బాబాలో మొదట నన్నాకర్షించింది వారి కళ్ళు! వారి చూపు నా అణువణువులోనికి చొచ్చుకొనిపోయేది. చావడిలో ఆశీనులైనప్పటి వారి రూపం నా హృదయంలో చెరగని ముద్ర వేసింది. నాకు క్రమంగా ఆంతరంగికమైన అనుభవాలు కలుగసాగాయి. ముందు అక్కడి వాతావరణానికి అలవాటు పడి, వారికి సేవ చేయడం, ఆరతులకు హాజరవడం మొదలుపెట్టాను. వచ్చిన క్రొత్తల్లో నేనొకసారి ఆరతికి వెళ్ళినప్పుడు బాబా కోపావేశాలతో ఊగిపోతున్నారు. ఏ కారణం లేకుండా అందరిపై తిట్ల వర్షం కురిపిస్తున్నారు, కేకలేస్తున్నారు. ఇది చూసి బహుశా బాబా పిచ్చివాడేమోననే సందేహం క్షణకాలం నా మదిలో మెదిలింది. ఎప్పటివలె ఆరతి పూర్తయ్యింది. ఆ రోజు మధ్యాహ్నం తిరిగి బాబా దగ్గరకెళ్ళి వారి

పాదసేవ చేస్తున్నాను. అప్పుడు బాబా చిన్నగా నా తలపై తట్టి *"నేను పిచ్చివాడిని కాదు!"* అన్నారు. నా ఆశ్చర్యానికి అంతులేదు. వారు సర్వాంతర్యామి. వారి నుండి దాచేందుకు ఏదీ సాధ్యపడదని నాకు అర్థమయ్యింది. అప్పటి నుండి వారి అంతర్యామిత్వం అనుభవమయ్యే ఎన్నో సంఘటనలు నాకు జరిగాయి.

బాబా మాట్లాడినప్పుడు నా హృదయపీఠంపై ఆశీనులై నా మనసులోని ఆలోచనలు, కోరికలు తెలుసుకొని చెబుతున్నట్లుండేది. వారు నాలో ఉన్న దైవము. వారిని భగవంతుడనడంలో నాకెలాంటి సందేహమూ లేదు. ఒక్కొక్కసారి నేను వారిని పరీక్షించేవాడిని. ప్రతి పరీక్షలోనూ వారు సర్వజ్ఞులని, సర్వవ్యాపకులని, సంకల్ప మాత్రాన అన్నింటినీ మార్చగల సమర్థులన్న విశ్వాసం కలిగేది. భూతభవిష్యద్వర్తమానాలలో వారికి తెలియని విషయమంటూ ఏదీ లేదని ఋజువు చేసే ఎన్నో వందల అనుభవాలలో నుండి కొన్నింటిని దిగువ తెలియపరుస్తున్నాను.

1913లో బాబా నాతో *"మీ మామ ఇక్కడొక పెద్ద రాతి కట్టడం నిర్మిస్తారు. దానికి నీవు పర్యవేక్షకునిగా ఉంటావు"* అన్నారు. బాబా చెప్పినట్లుగా మా మామగారు 1915-16లో వాడా (ప్రస్తుత సమాధి మందిరం) నిర్మించడం ప్రారంభించారు. తదనంతరం 1918-19లో ఏర్పాటు చేసిన సమాధి మందిర ట్రస్ట్‌లో నేనూ సభ్యునిగా ఉన్నాను.

మా అమ్మ నా ఉద్యోగం గురించి ఆందోళనపడుతుండేది. ఎక్కడా నాకు స్థిరమైన ఉద్యోగం దొరకలేదు. కొంతకాలం ఒకచోట పనిచేయడం, మరి కొంతకాలం నిరుద్యోగిగా ఉండడం జరుగుతుండేది. నేను ఇంగ్లండులో భూగర్భ శాస్త్రవేత్తగా, మైనింగ్ ఇంజనీరుగా శిక్షణ పొందాను. నా అర్హతకు సరిపడే ఉద్యోగ ప్రకటనల కోసం పత్రికల్లో వెదుకుతుండేవాడిని. స్వల్పకాల వ్యవధి ఉండే ఉద్యోగాలు మాత్రమే దొరుకుతుండేవి. నేను మొదటిసారి శిరిడీలో మూడు నాలుగు రోజులు మాత్రమే ఉన్నాను. తరువాత బాలాఘాట్, బర్మాలకు వెళ్ళాను. అక్కడ బర్మా ఆయిల్ కంపెనీ (బి.ఓ.సి)లో నా ఉద్యోగం మూడు నెలల్లో ముగియడంతో తిరిగి నాగ్‌పూర్ చేరాను. అక్కడ నుండి వచ్చి నాలుగు నెలలు నా భార్యతో శిరిడీలో ఉన్నాను. మరల నాగ్‌పూర్ వెళ్ళిపోయాను. బాబా నన్ను శిరిడీ రమ్మన్నారని మాధవరావు నుండి ఉత్తరం రావడంతో ఈసారి ఒక్కడినే శిరిడీ వెళ్ళి 13 నెలలు గడిపాను. నాకు ఉద్యోగం

లేదు. అయినా దిగులు పడలేదు. అప్పుడప్పుడూ చిత్రంగా నాకు ఫకీరు జీవితమే మేలేమోనన్న ఆలోచనలు కలిగేవి.

1914లో ఒకరోజు బాబా కఫ్నీలను సిద్ధం చేయించి చాలామందికి పంచుతున్నారు. నేను అదంతా కాస్త దూరం నుండి చూస్తుండగా, బాబా నాకూ ఒక కఫ్నీ ఇస్తే దానిని దాచుకొని, బాబా భజన తదితర ప్రత్యేక సందర్భాలలో ధరించవచ్చన్న ఆలోచన కలిగింది. ఇంకా చాలా కఫ్నీలు మిగిలి ఉన్నప్పటికీ హఠాత్తుగా బాబా కఫ్నీలను పంచడం ఆపేసారు. కాసేపటి తరువాత నన్ను దగ్గరకు రమ్మని సైగ చేసి, నా తలపై తమ హస్తాన్నుంచి మెల్లగా తడుతూ ***"కఫ్నీ ఇవ్వనందుకు నన్ను తప్పు పట్టవద్దు. ఆ ఫకీరు (దేవుడు) నీకివ్వడానికి అనుమతించలేదు"*** అన్నారు.

నేనెక్కడా స్థిరపడకపోవడంతో నా ఉద్యోగం గురించి మా బంధువులు బాబాను అడిగేవారు. ఉద్యోగ నిమిత్తం నేను కలకత్తా, బర్మాలాంటి దూరప్రాంతాలకు వెళ్ళడం చూసి మా అమ్మ "బాబా నా కుమారుణ్ణి మా ఊరిలోగానీ, శిరిడీకి దగ్గరలోగానీ మంచి ఉద్యోగంలో స్థిరపడేలా అనుగ్రహించండి!" అని ప్రార్థించింది. అందుకు బాబా, ***"నేనతనిని పూనాలో స్థిరపరుస్తాను!"*** అని అన్నారు. ఒక్కొక్కప్పుడు నాకు ఒకేసారి అనేక ఉద్యోగాలు వచ్చేవి. వాటిలో నుండి నేను ఒకదానిని ఎంపిక చేసుకోవాల్సి వచ్చేది. బాబా యొక్క సర్వజ్ఞత, దివ్యదృష్టిపై విశ్వాసంతో నాకు దారి చూపమని ప్రతిసారి వారిని అడిగేవాడిని. బాబాపై నాకున్న నమ్మకం పాలు త్రాగే పసిపాపకు తన తల్లిపై ఉన్నటువంటిది. ఆయన ఎంపిక తరచూ చిత్రంగా ఉండేది. కలకత్తా వెళ్ళడమా, బర్మా వెళ్ళడమా అన్న మీమాంస వచ్చినప్పుడు ఎంతో దూరాన ఉన్న బర్మాకు వెళ్ళమన్నారు. నేను బాబా దగ్గరకు వెళ్ళి అడిగిన ప్రతీసారి ఆ ప్రదేశం పేరుకు ప్రక్కన పూనాను జతచేసి వెళ్ళమనేవారు. 1916వ సం॥ వారణాసిలో ఆచార్యపదవి, బర్మాలోని ఉద్యోగం, ఈ రెండింటిలో ఏదో ఒకదానిని ఎన్నుకోవలసి వచ్చింది. బాబా ***"బర్మా, పూనా"*** వెళ్ళు అన్నారు. మైనింగ్ ఇంజనీరు అయిన నాకు నా విద్యార్హతలకు తగిన ఉద్యోగం పూనాలో దొరకే అవకాశం లేదని తెలిసి, నాలో నేను నవ్వుకునేవాడిని. 1918 నుండి నేను పూనాలో చేస్తున్న పర్మినెంటు ఉద్యోగం (భూగర్భ, రసాయన శాస్త్ర ఆచార్యుడు), 1913లోనే వారి దృష్టిలో ఉంది. నా భవిష్యత్తు మొత్తం వారికి వర్తమానమన్నమాట.

చాలా రోజుల తరువాత 1916లో శిరిడీ వచ్చాను. వచ్చిన వెంటనే బాబాకు ఎవరెవరు ఏ యే సేవలు చేస్తున్నారనే విషయం విచారించాను. వామనరావుపటేల్, *బి.ఎ.,ఎల్.ఎల్.బి.,* గ్రామంలో బాబా తరఫున భిక్షకు వెళ్ళే సేవ చేసుకుంటున్నట్లు తెలిసి కాస్త అసూయపడ్డాను. 'అలాంటప్పుడు నాకు మాత్రం ఆ సేవను ఎందుకు ప్రసాదించకూడదు' అనే ఆలోచన కలిగింది. కానీ దానిని బయటకు వ్యక్తపరచలేదు. ఇంతలో బాబాను దర్శించే సమయమైనందున బట్టలు మార్చుకొనే వ్యవధి లేక, నేను ధరించి ఉన్న సూటు, బూటు, ప్యాంటు, కోటు, హ్యాటులతోనే మసీదుకెళ్ళి బాబాను దర్శించాను. "వామనరావుకు భిక్షాపాత్రనిచ్చి పంపమంటారా" అని ఒక భక్తుడు అప్పటికే మూడుసార్లు బాబాను అడిగాడు. ఉన్నట్టుండి బాబా నన్ను చూపుతూ ***"ఆ భిక్షాపాత్ర ఇతనికివ్వండి. ఈ రోజు ఇతను భిక్షకెళతాడు!"*** అన్నారు. సూటు, బూటుతోనే వెళ్ళి భిక్ష తెచ్చాను. నాకు ఆ సేవ లభించిన నాలుగు నెలలు నేను మామూలుగా ధరించే బట్టలతో మధ్యాహ్నం భిక్షకు వెళ్ళేవాడిని. బాబా నన్ను ఈ సేవకు ఎందుకెన్నుకున్నారో అని అందరూ ఆశ్చర్యపడేవారు. హృదయాంతర్యామి అయిన బాబా నా మనసెరిగి నాకు ఈ విధంగా సేవ చేసుకునే అవకాశం ప్రసాదించారు. బాబా తరఫున మధ్యాహ్నం భిక్షకు వెళ్ళే భాగ్యాన్ని వారు కొద్దిమందికి మాత్రమే ఇచ్చేవారు.

అది 1917వ సంవత్సరం. పూనా ఇంజనీరింగ్ కాలేజీలో భూగర్భ శాస్త్రం బోధించేందుకు ఒక ప్రొఫెసర్ కావాలని పత్రికలో ప్రకటన ఇచ్చారు. అది చూసిన వెంటనే ఆ ఉద్యోగానికి దరఖాస్తు చేయమంటారా అని బాబాను అడిగాను. వారు చేయమన్నారు. ఆ ఉద్యోగానికి సంబంధించిన వారిని కలుసుకోవడానికి పూనా వెళ్ళాను. అక్కడ ఎక్కువ మంది అభ్యర్థులు పోటీపడి, పలుకుబడి కలవారి సిఫార్సులు తీసుకొని రావడంతో నా పరిస్థితి క్లిష్టమయింది.

నేను శిరిడీ నుంచి వచ్చిన తరువాత బాబా అక్కడున్నవారిని ***"నార్కే ఎక్కడికి వెళ్ళాడు"*** అని అడిగారు. నేను ఉద్యోగ ప్రయత్నం కొరకు పూనా వెళ్ళినట్లు చెప్పగానే, ఆయన ***"అల్లా అనుగ్రహిస్తారు"*** అన్నారు. తరువాత ***"నార్కేకు పిల్లలున్నారా"*** అని బాబా విచారించగా, నాకు చాలామంది పిల్లలు పుట్టారు కానీ ఎవ్వరూ ఎక్కువ కాలం బ్రతకలేదని వాళ్ళు చెప్పారు. అప్పుడు కూడా బాబా ***"అల్లా***

*అనుగ్రహిస్తారు"* అని ఆశీర్వదించారు. 1918లో నాకు ఉద్యోగం వచ్చింది. 1919లో నా ఉద్యోగం పర్మినెంటు అయింది. ఆ తరువాత నాకు కలిగిన బిడ్డలందరూ క్షేమంగా ఉన్నారు. నాకు నలుగురు కుమారులున్నారు. ఇవన్నీ బాబా కృపాశీస్సుల వలన మాత్రమే సాధ్యమయ్యాయి.

శ్రీసాయిబాబాను గురించిన ఎన్నో విషయాలు వారిని బాహ్యంగా మాత్రమే చూచినవారెవరైనా సులభంగా చెప్పగలరు. కానీ బాబాను కేవలం బాహ్యంగా మాత్రమే గమనించి, వారిని అర్థం చేసుకున్నామని అనుకోవడంలో వాళ్ళ అంచనాలు తప్పవుతాయి. బాబా తమ చెంతకు రక్షణ, సహాయము కోసం వచ్చినవారి సామర్థ్యమునకు అనుగుణంగా వ్యవహరించేవారు. బాబా వద్దకు ఎక్కువమంది ప్రాపంచిక ప్రయోజనాలను ఆశించే వచ్చేవారు. అటువంటివారికి బాబా తమ నిజతత్త్వాన్ని వ్యక్తపరిచేవారు కాదు. కానీ లోతుగా ఆలోచించి అవగాహన చేసుకోగల సమర్థత గలవారికి తమ గురించి, తమ శక్తి గురించి తెలియజేసేవారు.

నేను మొదటి నుండి బాబాను నిశితంగా పరిశీలించేవాడిని. వారు అది గమనించి *"తెలివిగలవాడివే (హోషియార్)"* అని మెచ్చుకొనేవారు. ఎప్పుడైనా వారు చెప్పే మాటలలోని అంతరార్థాన్ని నేను గ్రహించలేనప్పుడు *"ఎంత మొద్దువురా (దుబ్యా)"* అనేవారు. దీనిని బట్టి సరైన దృక్పథంతో సాగే విచారణకు వారు అడ్డుచెప్పేవారు కాదని మనకు తెలుస్తుంది. వారు చేసే ప్రతిపనిలోనూ, పలికే ప్రతి మాటలోనూ ఏదో ప్రాముఖ్యత ఉండి తీరుతుంది. వాటిలో చాలావరకు నేను అర్థం చేసుకోగలిగేవాడిని.

బాబాను నిశితంగా గమనించేవారికి, వారు భౌతికంగా శిరిడీలో కనిపిస్తున్నా, సూక్ష్మదేహంతో ఇతర లోకాలలోనూ సంచరిస్తూ వారి కర్తవ్యాన్ని నిర్వహిస్తుంటారన్న అద్భుతసత్యం అవగతమవుతుంది. వారు మాట్లాడే మాటలను సామాన్యులు అర్థరహితంగా పరిగణించేవారు. కానీ సంజ్ఞలు, నీతికథలు, ఉపమానాలతో కూడిన వారి మాటలు నర్మగర్భితంగా ఉండేవి. కనుక సామాన్యులు వారి మాటలలోని లోతును సరిగా అర్థం చేసుకోలేక యథాతథంగా తీసుకొని ఎవరికి తోచిన వ్యాఖ్యానాలు వారు చేసుకునేవారు. అంతేకాదు, బాబాను ఒక లౌకికవాదిగానూ, అత్యాశగలవానిగానూ అపార్థం చేసుకునేవారు. ఉదాహరణకు-

ఒకసారి ఒక వ్యక్తి మసీదుకొచ్చి బాబాను కొద్దిసేపు పరిశీలించాడు. బాబాపై అతని అభిప్రాయం ఏమిటో తెలుపమని అడిగాను. అతను నిరాశతో "ఎల్లప్పుడూ డబ్బు గురించే మాట్లాడే సాధువులను నేనెక్కడా చూడలేదు" అన్నాడు. బాబా తరచుగా 'పైసా' అనే పదాన్ని 'పుణ్యం' అనే అర్థంతో మాట్లాడతారని అతనికి తెలియదు. బాబా మాటలను జాగ్రత్తగా పరిశీలించి విశ్లేషిస్తే వారి తత్త్వము, చర్యలు, శక్తి అద్భుతమైనవని, వారు తమ భక్తులను ఆదుకునే పద్ధతి, రక్షించే తీరు విలక్షణమైనవన్న నిర్ధారణకు వస్తారు.

**జూన్ 4వ తేదీ, 1936న చెప్పిన విషయాలు:**

1914 ప్రాంతంలో హార్దాకు చెందిన ఒక శ్రీమంతుడైన వృద్ధుడు ఒకామెతో కలిసి శిరిడీ వచ్చాడు. అతను క్షయ వ్యాధితో బాధపడుతున్నాడు. శిరిడీ చేరిన ఒక నెలకు ఆరోగ్యం మెరుగవడంతో, శిరిడీనే తన నివాసంగా చేసుకున్నాడు. కానీ రెండవ నెల చివర్లో అతని పరిస్థితి విషమించి మృత్యువు సమీపించినట్లు అనిపించింది. అప్పుడు బాబా దగ్గరకు వెళ్ళి సహాయం కోరేందుకు వారింట్లో మగదిక్కు ఎవరూ లేనందువల్ల ఆయన ఇంట్లోని ఆడవాళ్ళు, వాళ్ళ స్నేహితురాళ్ళు బాబాను అడిగి ఊదీ తెచ్చిపెట్టమని నన్ను అభ్యర్థించారు. నేను బాబా దగ్గరికెళ్ళి విషయం చెప్పి ఊదీ అడిగాను. బాబా ***"ఆ వృద్ధుడు ఈ ప్రపంచాన్ని వదిలివెళ్ళడమే మంచిది. అతనికి ఊదీ ఏం చేయగలదు? అయినా వాళ్ళు అడుగుతున్నారు కాబట్టి తీసుకెళ్ళు"*** అన్నారు. నేను ఊదీ తీసుకొని వాళ్ళకిచ్చాను. కానీ బాబా చెప్పిన విషయాలేవీ వాళ్ళకు వెల్లడించలేదు. అతని పరిస్థితి మరింత విషమించింది. అప్పుడు షామా బాబాను దర్శించి ఆ వృద్ధునికి అంతిమఘడియలు సమీపించాయని చెప్పాడు. బాబా ***"అతనెలా చనిపోగలడు? రేపు ఉదయానికల్లా ప్రాణం పోసుకుంటాడు!"*** అని అన్నట్లున్నారు. ఆ మాటలను బట్టి అతను చనిపోడని అంతా అనుకున్నారు. కానీ వృద్ధుడు ఆ రాత్రి మరణించాడు. అయినా వాళ్ళు శవం చుట్టూ దీపాలు వెలిగించి మరుసటిరోజు మధ్యాహ్నం వరకు వేచి చూసారు. అతడిలో చలనం కనపడలేదు. ఇక ఆశ వదులుకొని అంత్యక్రియలు జరిపించారు. వృద్ధుని బంధువులు, బాబా తమను నిరాశపరచారని భావించి శిరిడీ నుండి వెళ్ళిపోయారు. మూడు సంవత్సరాల పాటు వాళ్ళు శిరిడీకి రాలేదు. తరువాత

ఒకరోజు వృద్ధుని బంధువొకతనికి బాబా కలలో కనిపించారు. బాబా శరీరంపై చనిపోయిన వృద్ధుని తలవుంది. బాబా అతనికి కుళ్ళిపోయి ఉన్న ఊపిరితిత్తులను చూపించి, ***"ఇంతటి బాధ నుండి ఆ వృద్ధుణ్ణి విముక్తుణ్ణి చేశాను!"*** అని చెప్పారు. అతను తన కల విషయం అందరికీ చెప్పాడు. అప్పటి నుండి వృద్ధుని బంధువులు తిరిగి శిరిడీ రావడం ప్రారంభించారు. ***"అతడెలా చనిపోగలడు? తిరిగి ప్రాణం పోసుకుంటాడు!"*** అన్న బాబా మాటలు, ప్రాణం శిథిల శరీరాన్ని విడిచి, మరో కొత్త శరీరాన్ని ధరిస్తుందనే అర్థంతో (జన్మ పరంపర) చెప్పబడిందని మనం గ్రహించాలి.

బాబా తరచుగా ప్రాతః సమయంలో ధుని దగ్గర కూర్చొని భక్తులతో మాట్లాడుతూ, గత రాత్రి తాము సూక్ష్మశరీరంతో ఏ యే సుదూర ప్రాంతాలకు వెళ్ళి ఏమేమి చేసింది చెబుతూ ఉండేవారు. చావడిలో లేక మసీదులో బాబాతో పాటు నిద్రించిన భక్తులకు రాత్రంతా వారు భౌతికంగా తమతోనే ఉన్నారని తెలుసు. కానీ బాబా మాటలు అక్షరసత్యాలు. భక్తులు అప్పుడప్పుడు బాబా మాటలలోని నిజానిజాలు పరీక్షించేవారు. వారి మాటలు నిజమని ఋజువులు దొరికేవి.

బాబా తరచూ మరణానంతర అనుభవాల గురించి కూడా చెప్పేవారు. ఒకసారి శిరిడీలో ఓ మార్వాడీ పిల్లవాడు జబ్బుపడి మరణించాడు. బంధువులు అంత్యక్రియలు జరిపించి విషాదవదనాలతో మసీదుకు వచ్చారు. బాబా ***"ఆ పిల్లవాడు ఇప్పుడు నదికి చేరువయ్యాడు. దాటుతున్నాడు"*** అన్నారు. బాబా ఉద్దేశ్యంలో నది అంటే 'వైతరిణి' అని భావించాను.

బాబా ఎంతోమంది భక్తులకు వాళ్ళ గత జన్మల గురించి, ఆ జన్మలలో జరిగిన సంఘటనల గురించి చెప్పేవారు. ఒకసారి నా గత నాలుగు జన్మలలో జరిగిన విషయాలు భక్తులందరి సమక్షంలో చెప్పారు. కానీ బాబా చెప్పిన విషయాలు నాకు సంబంధించినవని ఇతరులెవ్వరూ అర్థం చేసుకోలేదు, చేసుకోలేరు కూడా. వారు ఒక విషయాన్ని ఒకరికి చెప్పదలిస్తే దాన్ని అందరి సమక్షంలో బాహాటంగానే చెప్పేవారు. చిత్రమేమంటే ఆ విషయం ఎవరిని ఉద్దేశించి చెప్పబడిందో వారికి మాత్రమే అర్థమయ్యేలా చెప్పడం బాబాలో ఉన్న ప్రత్యేకమైన కళ. మిగతావారికి వారు మాట్లాడినవేవీ అర్థమయ్యేవి కావు. మరో ఆశ్చర్యకరమైన విషయమేమంటే, చిన్నచిన్న మాటలు, చర్యలతో బాబా ఒకేసారి అనేకమంది భక్తులకు ప్రయోజనాన్ని

చేకూర్చగలరు. శ్రీసాయిబాబా అదృశ్యశరీరంతో విశ్వాంతరాళాలలో పర్యటించి అక్కడి విషయాలను నియంత్రించేవారు. వారు భూతభవిష్యత్తులను ఒకేలా చూసేవారు. పైవిషయాల వల్ల బాబా యొక్క నిజతత్త్వం బోధపడుతుంది.

బాబా సర్వాంతర్యామి అని, సర్వవ్యాపకుడని, సృష్టి ఆది నుండి అంతం వరకు ఉంటారని వారు అప్పుడప్పుడు పలికే మాటల వలన మనం గ్రహించవచ్చు. వారు ఒక్కొక్కసారి ***"నీవెక్కడున్నావు? నేనెక్కడున్నాను? ఈ ప్రపంచమెక్కడుంది?"*** అని పలికేవారు. మరొకసారి తమ దేహాన్ని చూపిస్తూ ***"ఇది నా ఇల్లు", "నేనిక్కడలేను! నా ముర్షద్ (గురువు) నన్ను ఈ దేహం నుండి ఏనాడో విడుదల చేశాడు"*** అనేవారు. భౌతికదేహంతో శిరిడీలో సంచరిస్తున్నప్పుడు కూడా వారు ఆ దేహానికి పరిమితమై లేరు. 'సాయిబాబా సజీవంగా ఉన్నారు. వారు అప్పుడు ఉన్న చోటే ఇప్పుడూ ఉన్నారు. నిజానికి, అప్పుడు కూడా ఇప్పుడున్న చోటే ఉన్నారు' అన్నది వాస్తవం.

శ్రీసాయిబాబా ఈ లోకంలోనూ, ఇతర లోకాలలోనూ తాము నిర్వహించే విధులను గూర్చి అరుదుగా చెబుతుండేవారు. అంతేగాక గతించిన వారి ఆత్మల స్థితిగతులను కూడా తమ అదుపాజ్ఞలలో ఉంచుకున్నానని చెప్పడం ద్వారా, ఈ జగత్తుపై తమకు గల ఆధిపత్యాన్ని తెలియజేసేవారు. బాబా ఎప్పుడూ అసత్యం పలికేవారు కాదు. అర్థరహితంగా మాట్లాడేవారు కాదు. వారి పద్ధతులను గూర్చి బాగా ఎఱిగిన వారు మాత్రమే వారి మాటలను, చర్యలను అర్థం చేసుకోగలిగేవారు. అది కూడా ఎవరిని ఉద్దేశించి పలికారో వారు మాత్రమే అర్థం చేసుకోగలరు.

**ఉపదేశం, మంత్రతంత్రాలు మొదలైనవి:**

సాయిబాబా ఏనాడూ మంత్రంగానీ, తంత్రంగానీ, ఉపదేశంగానీ ఇవ్వలేదు. మరెవరికైనా ఉపదేశించినట్లు కూడా నేనెరుగను. మాధవరావు దేశ్‌పాండే (షామా) నాకొకసారి క్రింది సంఘటన గూర్చి చెప్పాడు.

రాధాబాయి దేశ్‌ముఖ్ అను భక్తురాలు బాబాను దర్శించి, వారి నుండి ఉపదేశం పొందాలని శిరిడీ వచ్చి కొంతకాలం వేచి ఉంది. బాబా ఏమీ ఉపదేశించకపోవడంతో ఆమె ఆహారం తీసుకోవడం మానివేసి, ఉపదేశమిచ్చేంత వరకు నిరాహారిగా ఉండాలని సత్యాగ్రహం ప్రారంభించింది. అలా నాలుగు రోజులు

గడిచాయి. ఆమె పరిస్థితికి షామా జాలిపడి, బాబా దగ్గరకు వెళ్ళి ఆమెకేదైనా దేవుని పేరు మంత్రంగా చెప్పమని, దానిని ఆమె మంత్రోపదేశంగా భావించి జపం చేసుకుంటూ గడుపుతుందని చెప్పాడు. బాబా ఆమెను తమ దగ్గరకు పిలిపించుకొని, *"అమ్మా, నా గురువు నాకు ఏ మంత్రమూ ఉపదేశించలేదు. అలాంటప్పుడు నేను నీకేమి ఉపదేశించగలను? నా గురువు ఎంత శక్తిమంతుడంటే వారి ముందు నిలబడడానికి కూడా వణికిపోయేవాణ్ణి! నా గురువు అందించిన సహాయం అదృశ్యంగా, నిగూఢంగా ఉండేది. అది వాచా బోధించినది కాదు. మేము చెవిలో ఏదీ ఉపదేశించము (మీ కానాలా ఇసణారా గురు నవ్హే). ఉపదేశమివ్వడం మా పద్ధతి కాదు. మా సంప్రదాయమే వేరు (ఆమ్‌చా ఘరాణె నిరాళా ఆహేత్)"* అని పలికారు.

శ్రీసాయిబాబా ఎన్నడూ ఉపన్యాసాలు, ప్రవచనాలు చేయలేదు. ఎప్పుడైనా సందర్భానుసారం అలతి అలతి పదాలతో, చిన్న చిన్న వాక్యాలతోనే అద్భుతమైన ఆధ్యాత్మిక సత్యాలను వెల్లడించేవారు. పరిశీలనా దృష్టితో చూసే భక్తులు, బాబా పలికిన కొద్ది మాటలను వారికి తోచిన విధంగా సిద్ధాంతీకరించుకొనేవారు. అందువల్ల బాబా సిద్ధాంతము, పద్ధతి ఇదీ అని ఏ భక్తుడూ మొండిగా వాదించడానికి వీలుపడేది కాదు.

**జీవిత లక్ష్యం – పురుషార్థం!**

మోక్షమే లక్ష్యమని బాబా ఎవరికైనా చెప్పారా? పోనీ వివేక - వైరాగ్యాలను అలవర్చుకోమని చెప్పారా? అలాంటి మాటలు వారి నోటి గుండా నేనెప్పుడూ విని ఎరుగను. *"భగవంతుని చేరడమే లక్ష్యం"* - *"సప్తసముద్రాలను, లోకాలను దాటి దేవుని చేరుకోవాలి (అల్లా మిళణారా సప్తసముద్ర నిహోలా కరణ), భవబంధములను దాటిపోవాలి (బేడా పార్‌కర్‌నా।)"* అనేవారు.

బాబా ఎన్నడూ 'మాయ', 'ప్రపంచం మిథ్య' వంటి సిద్ధాంతాల గురించి మాట్లాడలేదు. ఇహపర లోకాలు సత్యాలని గ్రహించి, ఆ రెండింటిలోనూ సాధ్యమైనంత లబ్ధిని పొందాలని చెప్పేవారు.

**కర్మ– పునర్జన్మ:**

కర్మ సిద్ధాంతం, పునర్జన్మల గురించి బాబా పలుమార్లు ప్రస్తావిస్తుండేవారు. *"మంచి విత్తనం నాటితే ఈ జన్మలోనూ, మరుజన్మలోనూ*

*మంచి ఫలాన్ని పొందుతాము"* అన్న సత్యమే వారు చెప్పే కథల్లో అంతర్లీనంగా ఉండేది. వారు తరచూ ఎందరో భక్తుల గత జన్మల వృత్తాంతాలనూ, అప్పుడప్పుడు కొందరి భక్తుల రాబోవు జన్మల గురించి చెప్పేవారు.

బాబాతో ఉన్నవారెవ్వరికీ పరలోకాల ఉనికి గురించిగానీ, ఈ జన్మలో చేసిన పాపపుణ్యాల ఫలితాలు ఆ లోకాలలో అనుభవించే విషయంగానీ, మరణించిన తరువాత మన అస్థిత్వం గురించిగానీ ఎట్టి సందేహమూ ఉండేది కాదు. ఇవన్నీ హిందూమత విశ్వాసాలకు, సిద్ధాంతాలకు సంబంధించిన విషయాలు.

ఇక బాబా ఏ మతానికి చెందినవారన్న విషయానికొస్తే, నాకు తెలిసినంత వరకు వారెన్నడూ తాము ప్రత్యేకించి ఒక కులానికి, జాతికి, మతానికి చెందినవారమని చెప్పలేదు. బాబా వీటన్నిటికీ అతీతులు. కానీ బాబా ప్రస్తావించిన విషయాలు, ఆయన చర్యలు ఆయనకు హిందూ మతంతో గల సంబంధాన్ని తెలియపరుస్తున్నాయి. *"మా గురువు బ్రాహ్మణుడు (మారూ గురూ బ్రాహ్మణ్ ఆహే)"* అని బాబా చెప్పడం నేను విన్నాను.

**హిందూమతం – బ్రాహ్మణుల పట్ల బాబా దృక్పథం:**

భగవద్గీత, భావార్థరామాయణము, ఏకనాథ భాగవతము, పంచదశి, యోగవాశిష్ఠం, పురాణాలు మొదలగువాటిపై బాబాకు అమిత గౌరవము. పైగ్రంథములలోని విషయాలు తరచూ ఉదహరిస్తూండేవారు. జ్ఞానదేవుని ఆరతి మొదలైన వెంటనే బాబా సావధానులై కూర్చొని పూజ్యభావంతో చేతులు జోడించి కనులు మూసుకునేవారు. ఒకసారి "పంచదశి" గురించి ఖాపర్డేతో *"ఇది మా ఖజానా (యే తో హమారా ఖజానా హై)"* అని చెప్పడం నేను విన్నాను. అంటే అందులోని విషయాలు మన ఆధ్యాత్మిక ప్రగతికి అతి విలువైనవని వారి భావం. బాబాకు 'యోగవాశిష్ఠం' అంటే ఎంతో గౌరవం. ఆ విషయం నా స్వానుభవంతో నాకు తెలుసు. నేను బాబా దగ్గరకు వచ్చిన మొదటి రోజుల్లో అంటే 1914లో- బాబా నన్ను చాలాసార్లు 15 రూపాయల దక్షిణ అడిగేవారు. నా దగ్గర డబ్బు లేదని ఆయనకు బాగా తెలుసు. అందుకని ఒకసారి ఆయన సన్నిధిలో నేను ఒక్కడినే ఉన్నప్పుడు "బాబా నా దగ్గర పైకం లేదని మీకు తెలుసు కదా, అయినా 15 రూపాయలు దక్షిణ ఇమ్మని అడుగుతారెందుకు?" అని అడిగాను. దానికి బాబా *"నీ దగ్గర డబ్బు*

*లేదని నాకు తెలుసు. కానీ నీవు ఇప్పుడు యోగవాశిష్ఠం చదువుతున్నావు కదా? అందులో ప్రస్తుతం నువ్వు చదువుతుండే భాగం చాలా ముఖ్యమైనది. అందులో నుండి 15 రూపాయలు నాకు దక్షిణ ఇవ్వు!"* అన్నారు. నిజమే! అప్పుడు నేను యోగవాశిష్ఠమే చదువుతున్నాను. ఆ గ్రంథంలో నుండి డబ్బులు తీసుకోవడమంటే అందులోని విలువైన బోధను గ్రహించడమన్నమాట. అందులో నుండి తీసిన పైకాన్ని బాబాకు దక్షిణగా సమర్పించడమంటే ఆ గ్రంథంలో నుండి గ్రహించిన సత్యాలను నా హృదయంలో అంతర్యామిగా ఆసీనుడైయున్న బాబాకు సమర్పించి, వాటిని హృదయగతం చేసుకోవడం.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడంటే బాబాకు చాలా గౌరవము.

**బాబా మరియు మహారాష్ట్రలోని మహాత్ములు:**

జ్ఞానేశ్వర్, తుకారాం వంటి మహాత్ముల యెడల బాబాకు ఎంతో గౌరవముండేది.

బాబా దృష్టిలో మనిషి జీవితానికి ఉన్న లక్ష్యాలేమిటి? ఆ లక్ష్యాలను సాధించేందుకు కావలసిన సద్గుణాలు ఏమిటి? బాబా ఎటువంటి సాధనలను ఇష్టపడేవారు? వాటిని గురించి వివరిస్తాను.

**నాలుగు సాధనా మార్గాలు:**

1) **యోగమార్గము:** కుండలినీ శక్తిని మేల్కొల్పుట, ఆసన, ప్రాణాయామ, ధ్యానముల ద్వారా అతీతమైన శక్తులు పొందడాన్ని సాయిబాబా లక్ష్యపెట్టేవారు కాదు. పైసాధనలు చేయమని ఎవ్వరినీ ఆదేశించినట్లు నేనెరుగను. పైగా *"ప్రాణాయామం ద్వారా సాధన చేసేవారు కూడా చివరకు ఆధ్యాత్మిక పురోగతి కోసం నా దగ్గరకు వచ్చి తీరవలసిందే!"* అని బాబా చెప్పడం నేను స్వయంగా విన్నాను.

2) **కర్మమార్గము:** సమాజంలో ఉంటూనే కర్మమార్గాన్ని అనుసరిస్తూ దేనినైనా సాధించవచ్చునని తమ ఆచరణ ద్వారా సాయిబాబా నిరూపించారు. వారు స్వయంగా గోధుమలు విసిరేవారు. సన్యసించి సమాజానికి దూరంగా వెళ్ళడాన్ని, భిక్ష చేసి జీవించడాన్ని బాబా ఆమోదించేవారు కాదు. తమ కొద్దిపాటి ఆహారం కొరకు బాబా పరిమితంగా భిక్ష చేసేవారు. అలాగే, వారు దక్షిణ అడగడం వెనుక అనేక కారణాలున్నా ప్రధానమైనది మాత్రం ఋణానుబంధ విముక్తే! గృహస్థాశ్రమంలోనే

ఉంటూ ఆధ్యాత్మిక ప్రగతి సాధించవచ్చుననీ, సన్యసించనవసరం లేదనీ వారు చెప్పేవారు. నన్ను, వామనరావును భిక్షకు పంపింది మాకు వినయవిధేయతలతో గురువును సేవించుకొనే భాగ్యం కలుగజేసేటందుకే. బాబా వాచా చెప్పకపోయినా విచక్షణ లేని యాచన మంచిది కాదని, దీని వలన ఆర్జించిన పుణ్యమంతా తరిగిపోతుందని వారు భావించేవారని నా అభిప్రాయం. ఒకసారి ఓ భక్తుడు బాబాను "మీరెందుకు దక్షిణ అడుగుతున్నారు?" అనడిగాడు. దానికి బాబా ***"నేనందరినీ దక్షిణ అడుగుతున్నానా? ఆ ఫకీరు (దేవుడు) ఎవరిని అడగమని సూచిస్తారో వారినే అడుగుతాను!"*** అని బదులిచ్చారు. అంతేగాక బాబా నిర్ణీత మొత్తం మాత్రమే అడిగేవారు. వారడిగిన పైకంకన్నా ఎక్కువ ఇస్తే దానిని స్వీకరించేవారు కాదు. బాబా దక్షిణ అడిగితే ఇచ్చేందుకు ఎవరూ నిరాకరించరు. కొన్ని సందర్భాలలో వారు దక్షిణ అడిగితే - అది ఆ భక్తుణ్ణి అక్కడ నుండి వెళ్ళిపొమ్మనిగానీ లేక ఎవరినైనా వెళ్ళి కలవమనిగానీ సూచించేది.

3) **జ్ఞానమార్గము:** ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు మొదలైన గ్రంథముల అధ్యయనం ద్వారా ఆత్మవిచారణ చేయడమే జ్ఞానమార్గమైతే అది బాబా పద్ధతి కాదు. బాబా తమ అభీష్టాన్ని ఎప్పుడూ వ్యక్తపరచలేదు. అయితే తమ భక్తులు తమంతటి వారుగా అవ్వాలని బాబా ఆకాంక్ష అని- బాబా ఆచరణ ద్వారా భక్తులు గ్రహించాలి. వారి జ్ఞానము, అనుభవము నిత్యసత్యములు. ఈ లోకానికే కాక ఇతర లోకాలన్నింటికీ వ్యాపించి ఉన్న వారి ఎఱుక భూతభవిష్యద్వర్తమానాలకు కూడా విస్తరించి ఉంటుంది. వారు అనేకానేక ఆకర్షణల మధ్య నివసిస్తూనే వాటన్నిటికి అతీతులై ఉండేవారు. బాబా ఆచరించి చూపిన నిష్కామకర్మ, వైరాగ్యాలే ఎవరినైనా భగవంతుని వైపుకు నడిపిస్తాయి.

4) **భక్తిమార్గము:** ఇతర మహాత్ముల వలె సాయిబాబా కూడా భక్తి మార్గమునే బోధించారు. భక్తి మార్గములో దేవుని అనన్యంగా ప్రేమించుట, సేవించుట, ఆజ్ఞాపాలన మొదలైనవి ప్రధానాంశములు. గురుభక్తి ద్వారా దైవభక్తిని పెంపొందించుకోవాలని బాబా ఆచరించి, ప్రబోధించిన మార్గం విశిష్టమైనది. గురువునే దైవంగా భావించి, గురువులోనే భగవంతుని చూస్తూ, గురువు ద్వారానే దైవాన్ని చేరుకుంటూ, గురువే దైవమని గుర్తించడం భక్తిమార్గం.

**బాబా యొక్క గురువు:**

బాబా యొక్క గురువృత్తాంతం ఎవరికీ తెలియదు. *"నా గురువు బ్రాహ్మణుడు (మారూ గురూ బ్రాహ్మణ్ ఆహే)"* అని బాబా చెప్పడం నేను విన్నాను. నిజమైన బ్రాహ్మణులపై బాబాకు గౌరవభావముండేది. *"బ్రాహ్మణులు వారి సత్కర్మల వలన ఎక్కువ పైసలు సంపాదిస్తారు"* అని బాబా చెప్పేవారు. 'పైసా' అంటే పుణ్యమని వారి భావం.

శిష్యులకు, భక్తులకు తేడా ఉంది. గురువు తన శిష్యునితో సన్నిహిత సంబంధం కలిగి ఉండి అతని బాధ్యతలన్నీ భరిస్తాడు. కానీ భక్తునితో గురువుకు అలాంటి బంధముండదు. అతను చేసే పాపకర్మలను భరించవలసిన అవసరముండదు. శిష్యుడు తన గురువును సేవించుకుంటూ వారి ఆజ్ఞలను శిరసావహించి తు.చ. తప్పకుండా పాటించాలి. బాబాకు శిష్యులెవరూ లేరు. శిష్యుల ప్రసక్తి తెచ్చినప్పుడు బాబా *"ఎవరు నా శిష్యుడని చెప్పడానికి సాహసించగలడు? నేను నా గురువును సేవించినట్లు ఎవరైనా నన్ను తృప్తికరంగా సేవించగలరా? నా గురువును సమీపించడానికే నేను వణికిపోయేవాణ్ణి!"* అనేవారు.

బాబాకు అనేక మంది భక్తులున్నారు. బాబా తమ భక్తులను ప్రేమగా చూసేవారు, ప్రోత్సహించేవారు, రక్షించేవారు. తమ ఆచరణ ద్వారా, కొన్ని సంజ్ఞల ద్వారా వారికి సూచనలు ఆదేశాలు ఇచ్చేవారు. వాచా బోధించటం వారి సంప్రదాయం కాదు. ఒక్కొక్కసారి కొందరిని నీతికథల ద్వారా, మరికొందరిని ఆదేశాల ద్వారా ఉద్ధరించినప్పటికీ బాబా సంప్రదాయమే భక్తులపై అధిక ప్రభావం చూపేది. బాబా సంప్రదాయం ప్రకారం గురువుకు శరణాగతి చెందేందుకు వారి పాదాలనాశ్రయించిన భక్తుడు తప్పనిసరిగా స్వచ్ఛంగా, సత్ప్రవర్తనతో ఉండాలి. జపధ్యానాలతో పనిలేదు. జపం, ధ్యానం వంటి మనో సంబంధ సాధనలు చేస్తున్నప్పుడు 'నేను చేస్తున్నాను' అన్న స్ఫురణే అవరోధం. కాబట్టి వివిధ రకాలుగా వ్యక్తమయ్యే అహాన్ని మన మనస్సు నుండి పూర్తిగా తుడిచివేయాలి. అలా సర్వస్వ శరణాగతి పొందిన శిష్యుడు మాత్రమే గురువును చేరుకుంటాడు. గురుసన్నిధిలో అతను చేయవలసినదేదీ ఉండదు. గురువెప్పుడూ ఏదీ బోధించరు. తమ శక్తిని ప్రసరింపజేస్తారు. సంపూర్ణ శరణాగతి చెందిన ఆత్మ తనలో ప్రసరింపజేయబడిన

ఆ శక్తిని పూర్తిగా గ్రహించినప్పుడు అహం నశిస్తుంది. కానీ మన బుద్ధి, స్వశక్తిపై ఆధారపడటం, తన అభిప్రాయాన్ని దృఢంగా సమర్థించుకోవడం మొదలైన వివిధ రూపాలైన అహం పైశక్తిని అడ్డుకుంటుంది.

పరిశీలనాదృష్టితో బాబాను దర్శించిన వారందరూ ఈ గొప్ప సత్యాన్ని గమనించి ఉంటారు. అందుకే కొందరు భక్తులతో బాబా *"నీవు నా వద్ద ఊరకే కూర్చో. చేయవలసినదంతా నేనే చేస్తాను"* అని చెప్పేవారు.

అయితే బాబా అనుగ్రహం పొందడానికి మునుముందుగా కావలసినది వారిపై పూర్తి విశ్వాసము. ఒక్కసారే బాబాను దర్శించి వారి సమక్షంలో కొద్ది సమయం మాత్రమే గడిపిన భక్తులకు కూడా వారు ఆ నమ్మకాన్ని కలుగజేస్తారు. బాబా ఒక్కొక్క భక్తునికి ఒక్కొక్క రీతిలో అనుభవాలు, నిదర్శనాలు ప్రసాదిస్తారు. తద్వారా వారి అంతర్యామిత్వము, సర్వవ్యాపకత, త్రికాలజ్ఞత చూసిన భక్తులకు అప్పటికప్పుడు వారిపై విశ్వాసం ఏర్పడుతుంది. అయితే భక్తులు కేవలం విశ్వాసం మీద మాత్రమే ఆధారపడవలసిన పనిలేదు. తాము ఆధ్యాత్మికంగా ప్రాపంచికంగా పొందిన లబ్ధి మరియు సర్వకాల సర్వావస్థలయందు బాబా కృపాదృష్టిలో, సంరక్షణలో ఉన్నామన్న ఎఱుక భక్తులను ముందుకు నడిపిస్తాయి. సమస్త జగత్తును తమ అధీనములో ఉంచుకొని ఇహపరలోకాలలో మన విధి విధానాన్ని నిర్ణయించే మహాశక్తి శ్రీసాయిబాబా.

కాబట్టి గురువు యొక్క కృపకు పాత్రుడయ్యేందుకు భక్తునికి ముందుగా కావలసినవి సత్ప్రవర్తన, పవిత్రత, నిరాడంబరత, సద్బుద్ధి. ఆపై ప్రగాఢ విశ్వాసంతోనూ నిష్కపటంతోనూ మెలగి గురువు ప్రసాదించు అనుభవాల సోపానాలను అధిరోహిస్తూ ఆధ్యాత్మిక ప్రగతిలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలి. 'నేను ఒక్క అడుగు ముందుకు వేయగలిగితే చాలు' అనే దృక్పథమే సరియైనది. అంతేగానీ మన జీవితగమ్యం కొరకు తత్త్వశాస్త్రం, వేదాంతవిచారము మొదలైన జటిలమైన సిద్ధాంతాలను పరిశోధించవలసిన అవసరంలేదు. వాటిని పరిష్కరించుకోవడానికి కావలసిన సమర్థత మనకు లేదు. గురువే మనల్ని ఉద్ధరించి అపారమైన జ్ఞానాన్ని, సత్యాన్ని గ్రహించే శక్తిని అనుగ్రహించి భద్రంగా మనల్ని గమ్యానికి చేరుస్తారు.

పైన చెప్పిన విషయాలన్నీ బాబా ఏకధాటిగా చెప్పలేదు. బాబా ఆచరణ, వారు భక్తులతో వ్యవహరించిన పద్ధతులు, అప్పుడప్పుడు వారి నోటి నుండి

వెలువడిన మాటలు మొదలైనవాటి నుండి నేను గ్రహించిన విషయాలను సంకలనం చేశాను. నా అభిప్రాయం ప్రకారం- ఏ విషయాలను ఆస్వాదించి ఆనందించాలో వేటిని విడిచిపెట్టాలో తెలుసుకోకుండా కేవలం వివేకవైరాగ్యాలను గూర్చి చర్చించడం బుద్ధిహీనత. ఆచరణ, అనుభవం లేకుండా కేవలం పుస్తక పరిజ్ఞానంతో మాట్లాడటం ఆత్మవంచనే గాక ఇతరులను కూడా వంచించడమే అవుతుంది. ***"నేను కుక్కలోను-పందిలోను- పిల్లిలోను ఉన్నాను"*** అని బాబా అన్నప్పుడు, వారు ఆయా ప్రాణులలో తామే ఉన్నట్లు అవి పొందే అనుభవాలను గూర్చి పలికేవారని తెలుస్తుంది. కొందరు "ఈ విషయాన్ని మేము భగవద్గీతలో చదివాము, కాబట్టి దానిని నిజమని నమ్ముతున్నాము" అని చెబుతారు. కానీ ఏ విషయాన్నైనా అనుభవించి తెలుసుకోకుండా చెబితే అది వంచనే అవుతుంది.

బాబా యొక్క గొప్పతనము, వారి నిజతత్త్వము నాకు ఒక సంఘటన ద్వారా క్షుణ్ణంగా అర్థమయింది. భక్తులు భావిస్తున్నట్లు బాబా దైవమని నేను నా అనుభవాల ద్వారా తెలుసుకున్నాను. కానీ వారు భౌతికదేహం ధరించి కొన్ని పరిమితులకు లోబడి మానవ మాత్రునివలె కూడా మెలుగుతున్నారు కదా? అందువల్ల వారిలో దైవత్వం మానవతత్త్వం రెండూ సమ్మిళితమై ఉంటాయి అన్న నా అభిప్రాయంతో శిరిడీలో ఉన్న కొందరు మిత్రులు ఏకీభవించలేదు. వారికి బాబా దైవస్వరూపులే!

శ్రీకృష్ణుడు ద్వారకలో ఉన్నప్పుడు ఆ ద్వీపంలో 6 కోట్ల మంది నివసించేవారని భక్తులు చెప్పారు. నేను దానిని ఖండించి, అది వాస్తవం కాదని ఇప్పటి విశాల భారతదేశంలోని జనాభా 33 కోట్లు మాత్రమే అయినా జనం ఒకరి మీద ఒకరు నడుస్తున్నట్లు ఉంటుంది. అలాంటప్పుడు ఆ ద్వీపంలో అంతమంది ఉండటానికి అవకాశమేలేదని చెప్పాను. నా వాదన భక్తులకు నచ్చలేదు. "ఈ విషయం బాబా చెబితే నమ్ముతావా?" అని వాళ్ళు నన్నడిగారు. నమ్ముతానని చెప్పాను. అందరం కలిసి బాబా దగ్గరికి వెళ్ళాము.

మాధవరావు మరికొందరు భక్తులు బాబాను ఈ విషయం అడిగారు:

భక్తులు : బాబా! పురాణాలు నిజమేనా?

బాబా : *నిజమే!*

భక్తులు : శ్రీరాముడు, శ్రీకృష్ణుని గురించి మీ అభిప్రాయమేమిటి?

*బాబా : వారు గొప్ప మహాత్ములు. భగవంతుని అవతారాలు.*

భక్తులు : నార్కే వీటిని నమ్మడం లేదు. మీరు దేవుడు కాదని కూడా అంటున్నాడు.

*బాబా : అతను చెప్పింది నిజమే. నేను మీ తండ్రిని. మీరలా మాట్లాడకూడదు. మీరు మీ సకల శ్రేయస్సును నా నుండి పొందాల్సి ఉంది.*

ఈ విధంగా బాబా తమ పరిమితులను అంగీకరించారు. భక్తుల అనుభవంలో బాబా సాక్షాత్తు భగవంతుడే. అందులో ఏమాత్రం సందేహం లేదు. అది భక్తుల అనుభవం. అయితే బాబా ఏనాడూ తాను భగవత్స్వరూపుడనని చెప్పుకోలేదు. బాబా తమ దైవత్వాన్ని స్వార్థప్రయోజనాలకు ఉపయోగించలేదు. సాంఘిక, నైతిక ధర్మాలను అతిక్రమించలేదు. వారెప్పుడూ గౌరవప్రదమైన వస్త్రధారణ, ప్రవర్తన కలిగివుండేవారు. వారు స్త్రీలతో ముక్తసరిగా ఉండేవారు.

**బాబా యొక్క మనోవైఖరి:**

బాబా ఆనందపారవశ్యంలో ఉన్నప్పుడు ***"నేనే భగవంతుణ్ణి (మై అల్లా హూం)"*** అని పలికేవారు. ఇందులో సందేహమే లేదు. నేను స్వయంగా విన్నాను కూడా. అయితే అలా ఎప్పుడో ఒకసారి జరిగేది కానీ తరచుగా కాదు. భగవంతుడు (ఫకీరు) ప్రసాదించిన శక్తుల ద్వారా, తమకు అప్పగించిన పనులు నిర్వర్తిస్తూ బాబా ఒక భక్తుని వలె మెలిగేవారు. ***"భగవంతుడే యజమాని (అల్లా మాలిక్)", "భగవంతుడు మేలు చేస్తాడు (అల్లా భలా కరేగా)", "భగవంతుడు అనుగ్రహిస్తాడు"*** అని బాబా తరచూ పలుకుతుండేవారు. ***"నేను అల్లా యొక్క బానిసను", "నేనెప్పుడూ భగవంతుణ్ణి స్మరిస్తూ ఉంటాను"*** అని కూడా చెప్పేవారు.

**బాబాకు స్త్రీల పట్ల గల దృక్పథం:**

బాబా అస్ఖలిత బ్రహ్మచారి. ఈ విషయం వారి నేత్రాలలోని దివ్య తేజస్సును చూస్తే అర్థమౌతుంది. వారు స్త్రీలను దూరంగా ఉంచేవారు. కొద్దిమంది

మహిళలను మాత్రమే తమ పాదసేవ చేసుకొనేందుకు అనుమతించేవారు, అదీ పగటిపూటే. బాబా వస్త్రధారణ శరీరాన్ని ప్రదర్శించని రీతిలో గౌరవప్రదంగా ఉండేది.

**బాబా యొక్క విశిష్ట స్వభావము:**

బాబా ఎల్లప్పుడూ నిష్పక్షపాతంగా వ్యవహరించేవారు. వారు రాజునూ, పేదనూ సమదృష్టితో చూసేవారు. ఎందరో ధనవంతులు, పరపతిగల ఉద్యోగులు, అధికారులు వారిని దర్శించడానికి వచ్చేవారు. కానీ బాబా వారికెలాంటి ప్రత్యేకత చూపేవారు కాదు. బాబా తమ దగ్గరికి వచ్చే భక్తుల అంతరంగాలను, నిజతత్త్వాన్ని చూసేవారేగానీ, వారి బాహ్యాన్ని చూసేవారు కాదు. ఒకసారి బాబా ఒక పేదవానిని శ్లాఘిస్తూ ***"అతని వద్ద చాలా పైసలున్నాయి"*** అని చెప్పడం గమనించాను. అంటే అతనెంతో పుణ్యాత్ముడని వారి భావం.

**కఠిన న్యాయం:**

బాబా వంటి మహనీయుల గొప్పతనాన్ని వారి చుట్టూ ఉన్న వ్యక్తుల గుణగణాలను బట్టి నిర్ధారించడం సరికాదు. ఉదాహరణకు బాబా వద్దకు దుండగులు, అత్యాశాపరులు, వేశ్యలు, రకరకాల పాపాలు చేసినవారు, ప్రాపంచిక ప్రయోజనాలను ఆశించి వస్తూవుంటారు. వాళ్ళు బాబా సన్నిధిని ఉపయోగపెట్టుకొని ఉన్నతి సాధించలేక వెళ్ళిపోయి నరకకూపంలోపడి బాధపడుతుంటారు. వాళ్ళ కర్మకు వాళ్ళని విడిచిపెట్టేవారు. బాబా న్యాయము కఠినమైనది. ***"గర్భంలో అడ్డం తిరిగితే, బిడ్డనైనా సరే కోసి బయటికి తీయవలసిందే!"*** అని అంటారు బాబా.

భయంకర అంటువ్యాధుల బారినపడినవాళ్ళతో, ఆ రోగాలకు కారణమైన శక్తులతో కూడా బాబా ఎంతో ధైర్యంగా మెలిగేవారు. ఆ వివరాలు మనకు తెలియవు కానీ బాబాకు పూర్తిగా తెలుసు. ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన కనీస జాగ్రత్తలను కూడా లక్ష్యపెట్టక వ్యాధిగ్రస్తులపై బాబా చూపే ప్రేమ, ఆదరణ భక్తులలో వారిపై సంపూర్ణ విశ్వాసాన్ని కలిగిస్తుంది. నాకు తెలిసిన ఇలాంటి ఒక సంఘటన వివరిస్తాను.

బాబాకు ప్రతిదినం శిరిడీలోని ఒక హల్వా దుకాణదారుడి నుండి మిఠాయి నైవేద్యంగా పంపబడేది. 1916వ సంవత్సరములో శిరిడీలో ప్లేగు బాగా

ప్రబలి ఉంది. ఆ దుకాణదారుడు ప్లేగు బారిన పడి మరణించాడు. ఆ సమయంలో బాబా నన్ను ఆ దుకాణానికి వెళ్ళి మిఠాయి తీసుకుని రమ్మని అడిగారు. విలపిస్తున్న ఆ దుకాణదారుని భార్య దగ్గరకెళ్ళి బాబా ఆదేశాన్ని తెలియజేసాను. తన భర్త శవాన్ని చూపుతూ, తీసుకోదలిస్తే అల్మారా నుండి మిఠాయి తీసుకోవచ్చని ఆమె చెప్పింది. దాని వలన నేను, మిగిలినవారు ప్లేగు బారిన పడతామేమోనని భయంతో వణికిపోతూనే మిఠాయి తీసుకొచ్చాను. దానిని నైవేద్యంగా పెట్టి అందరికీ పంచాము. బాబా నాతో *"నీవు శిరిడీలో ఉంటే మరణిస్తావని, శిరిడీ విడిచి వెళ్తే సురక్షితంగా ఉంటావని అనుకుంటున్నావా? కానీ అలా జరగదు. మరణించవలసినవారే మరణిస్తారు, రక్షింపబడవలసిన వారు రక్షింపబడతారు"* అన్నారు. శిరిడీలో కలరావ్యాధి వ్యాపించి ఉన్నప్పుడు కూడా బాబా నాకు ఇలాగే ధైర్యం చెప్పారు. కుష్ఠురోగులు బాబా పాదాలు మర్దన చేసేవారు. వాళ్ళలో ఒకతనికి వ్యాధినయమై ఆరోగ్యవంతుడయ్యాడు. బాబా ఒక కుష్ఠురోగిని ధుని నుండి ఊదీ తీసి భక్తులకు పంచమనేవారు. కుష్ఠురోగితోనే వ్యాధిగ్రస్తుల నోట్లో ఊదీ వేయించేవారు. అయినప్పటికీ నాకు తెలిసినంత వరకూ ఎవ్వరికీ ఏ ఆపదా సంభవించలేదు.



ఎస్.బి. ధుమాళ్

## 3

## అక్టోబరు 16, 1936-నాశిక్, అక్టోబరు 28, 1936- శిరిడీ

**రావుబహద్దుర్ ఎస్.బి. ధుమాళ్,** బి.ఎ.,ఎల్.ఎల్.బి., ప్లీడరు, వయస్సు 63 సం॥లు, బ్రాహ్మణుడు, నాశిక్.

"బాబాతో మీ అనుభవాలేమిటి?" అని మీరడిగిన ప్రశ్నకు నేను ఏమి సమాధానం చెప్పగలను? ఒకటా, రెండా? ప్రతిరోజు ప్రతిక్షణము బాబా నాకు అనుభవాలను ప్రసాదిస్తూనే ఉన్నారు. నా జీవితంలో బాబా ప్రమేయం లేని సంఘటన అంటూ ఏదీ లేదు, అది ఎంతటి చిన్న విషయమైనా. నేను చేసే ప్రతి పనీ వేసే ప్రతి అడుగు బాబాచే నిర్దేశింపబడిందే! అలాంటప్పుడు దేనిని నా అనుభవంగా చెప్పగలను? బయట ప్రపంచం నా మాటలు నమ్మకపోవచ్చు. నేను ఆ విషయం పట్టించుకోను. వాస్తవానికి ఎవరైనా తమ అనుభవం వెల్లడి చేయకపోవడానికి ఎదుటివారు ఆ అనుభవాన్ని నమ్మకపోవడం ఒక కారణం కావచ్చు. ప్రతిభక్తుడు తనకు కలిగిన అనుభవం- తనకు మాత్రమే సంబంధించినదని, అది తన ఐహిక, ఆధ్యాత్మిక ప్రయోజనాల కోసమే ప్రసాదింపబడిందని అనుకుంటాడు. అంతేగానీ అజ్ఞానులు, కువిమర్శకులు, అకారణంగా అపహసించేవారితో నిండి ఉండే సామాన్య ప్రజానీకానికి వెల్లడి చేయడానికి కాదని అనుకుంటాడు. అయితే పట్టుదల గల చరిత్రకారులు, తాము వ్రాస్తున్న గ్రంథాలకు మెరుగులు దిద్దుకోవడానికి భక్తుల ఆంతరంగిక రహస్యాలను, అనుభవాలను వెలికి తీసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటారు. కానీ గోప్యంగా ఉంచుకున్న తన అనుభవం వ్యక్తం చేసేటప్పుడు ఆ అనుభవం యొక్క జీవము, సారము నాశనమైపోతుందని భక్తుడు భావిస్తాడు. శరీరధర్మశాస్త్రజ్ఞుడు ప్రాణమున్న జీవిని అణువణువూ పరీక్షించదలచి తనకు కావలసిన భాగాలను కోసి మైక్రోస్కోప్‌లో పెట్టి పరీక్షిస్తాడు. ఆ ప్రక్రియలోనే జీవి యొక్క ప్రాణం పోతుంది. చివరకు అతను పరీక్షించేది నిర్జీవ పదార్థాన్నే. బాబాను గురించి తెలుసుకోవాలంటే స్వయంగా బాబా ఇచ్చే అనుభవాలను పొంది తెలుసుకోవడమే ఉత్తమమైన మార్గం. బాబా ఎక్కడికీ వెళ్ళలేదు. వారు ఇప్పటికీ జీవించే ఉన్నారు. మహాసమాధి ముందు కన్నా ఇప్పుడు తమ కర్తవ్యాన్ని

మరింత ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శ్రద్ధగలవారికి ఈనాటికీ వారి సన్నిధి అనుభవైకవేద్యం. కానీ అలా శ్రద్ధను పెంపొందించుకోకుండా ఇతరుల అనుభవాలను తెలుసుకోవాలని ప్రయత్నించినప్పుడు ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి అనుభవాలు చేరే క్రమంలో వాటిలోని భావప్రకటన అస్పష్టమవుతుంది, శక్తి తరిగిపోయి బలహీనమవుతుంది.

స్వభాషలో వ్యక్తం చేసిన అనుభవాలకు ప్రాముఖ్యత, శక్తి ఉంటాయి. నేను చెప్పిన అనుభవాలను మీరు ఆంగ్లంలోనికి అనువదించి పాఠకులకందిస్తారు. ఇలా భాషాంతరీకరణము చేసే ప్రక్రియలో మూలభావానికి లేదా అనుభవానికి జరిగే నష్టము తీవ్రంగానే ఉంటుంది.[1]

ఏదేమైనా మీరు బాబాను గురించి కొన్ని వాస్తవాలు అడుగుతున్నారు కాబట్టి, నేను యదార్థమని దృఢంగా చెప్పగలగిన నా అనుభవాలు కొన్నింటిని వివరిస్తాను.

నేను మొదట (1903లో) శ్రీగజానన్ మహరాజ్ యొక్క భక్తుడను. ఆయనను శ్రీమాన్ గోపాలరావు బూటీ దగ్గరకు తీసుకెళ్ళాను. సుమారు 1907లో నేను ప్రథమంగా బాబాను దర్శించాను. ఆ ప్రథమ దర్శనంలోనే వారి అసాధారణమైన వ్యక్తిత్వము నన్ను అమితంగా ఆకర్షించింది. బూటీని బాబా వద్దకు తీసుకెళ్ళాను. అలా తీసుకెళ్ళడం బాబా ప్రేరణగానే భావిస్తున్నాను. అతను కూడా బాబా భక్తుడయ్యాడు. అతను నిర్మించిన భవంతిలోనే బాబా భౌతిక దేహం సమాధి చేయబడింది. అది ఈనాడు సమాధిమందిరంగా రూపొంది ఎందరో భక్తులు బాబాను పూజించుకోవడానికి అవకాశమేర్పడింది. అతను బాబాకు చేసిన సేవలలో అది చిరస్మరణీయమైనది.

---

*1. E.Herman వ్రాసిన Meaning & Value of Mysticsm అను గ్రంథంలో (14వ పేజీ) ఇలా వివరించారు: మనస్సును ప్రభావితం చేయడంలో భాష- వాక్యసరళి కన్నా శక్తివంతమైన సాధనం మరొకటి లేదు. పదింటిలో ఎనిమిది సందర్భాలలో ఏదైనా విషయం పాఠకుని బుద్ధిసంస్కారానికి సుపరిచితమైన భాషాశైలిలో వ్యక్తీకరించినపుడు, సూటిగా మనసులో నాటుకొంటుంది. అదే విషయం పరిచయం లేని పరభాషలో చెప్పినప్పుడు కృత్రిమంగానూ, అస్పష్టంగానూ ఉంటుంది.*

బాబాతో నా అనుభవాలు ఇవి అని చెప్పడానికి సాధ్యం కాదు. ఎందుకంటే నా జీవితంలోని ప్రతి చర్య, ప్రతి సంఘటన బాబాచే మలచబడింది. బాబా తత్త్వాన్ని, నాలాంటి భక్తులకు వారు చేసిన, ఇంకా చేస్తున్న సహాయాన్ని తెలియజేసే బాబా చర్యలను, ప్రబోధాన్ని మీతో పంచుకుంటాను.

ఒకసారి బాబా నాతో *"నిన్ను అడుగడుగునా కాపాడుతున్నాను. లేకుంటే, నీకేమయ్యేదో ఆ భగవంతునికే ఎఱుక"* అన్నారు. అది అతిశయోక్తి కాదు. మరోసారి మేమిద్దరమే ఉన్నప్పుడు,

*బాబా : భావూ, నాకు రాత్రంతా నిద్రపట్టలేదు* (బాబా నన్ను "భావూ" అని పిలిచేవారు)

నేను : ఎందుకు బాబా?

*బాబా : రాత్రంతా నీ గురించే ఆలోచిస్తూ.... ఉన్నాను*

వారి మాటలు విన్నంతనే నాలో ఆశ్చర్యము, ఆనందము, కృతజ్ఞత, ప్రేమ, అభిమానము ముప్పిరిగొని ఆనందభాష్పాలుగా పెల్లుబికాయి. వారికి నాపై ఎంత ప్రేమున్నదో! నా కోసం ఎంత శ్రమ తీసుకున్నారో! నేను ఎప్పుడూ బాబా గురించి ఆలోచిస్తున్నట్లే, వారు కూడా నా గురించి ఆలోచించేవారు. కానీ నా ఆలోచన ప్రేమతో నిండి ఉన్నప్పటికీ అది శక్తిలేనిది, వారికి నిజమైన సేవ చేసుకోలేనిది. బాబా నాపై చూపే ప్రేమలో అతీతమైన శక్తి ఉండి అడుగడుగునా నన్ను కాపాడుతూ ఉండేది. వారు త్రికాలజ్ఞులు కాబట్టి, నేను చేసే ప్రతి పని, వేసే ప్రతి అడుగు సరియైనదో కాదో తెలుసుకొని సరియైన మార్గంలో నడిపించేవారు. నన్ను సర్వదా జాగరూకతతో గమనిస్తూ రాబోయే ప్రమాదాల నుండి కాపాడి నాకు మంచి జరిగేటట్లు చూసేవారు. ఈ విషయాన్ని ఋజువు చేసేందుకు ఎన్నో నిదర్శనాలున్నాయి. నేను పొందిన, పొందుతున్న మేలు ఏదైనా అది బాబా ప్రసాదించినదే. దీనిని ఇతరులు నమ్మకపోవచ్చు. కానీ బాబా నాకు సహాయపడిన కొన్ని సందర్భాలు ఎంత స్పష్టమైనవంటే సరైన దృక్పథం గల జిజ్ఞాసువులెవరైనా బాబా మాటల్లోని, నా మాటల్లోని సత్యాన్ని అంగీకరిస్తారు.

బాబాకు నేను తరచూ జాబులు వ్రాస్తుండేవాడిని. మాధవరావు దేశ్‌పాండే వాటిని బాబాకు చదివి వినిపించి, వారు చెప్పిన విధంగా నాకు సమాధానాలను

వ్రాస్తుండేవాడు. బాబా సశరీరులుగా ఉన్నప్పుడు కూడా కొన్ని సందర్భాలలో నా సమస్యల పరిష్కారానికై బాబాను ప్రార్థించి, పటం ముందు చీటీలు వేసేవాడిని. ఆ చీటీలో వచ్చిన దానిని బాబా ఆదేశంగా భావించి పాటించేవాడిని. బాబా మహాసమాధి అనంతరం కూడా ఇదే పద్ధతిని కొనసాగిస్తున్నాను. ఇది సమాజానికి శాస్త్రవిరుద్ధంగా, అవివేకంగా అనిపించినప్పటికీ దానినే తు.చ తప్పకుండా పాటిస్తున్నాను. ఈ పద్ధతి ద్వారా బాబా నాకు ఇచ్చిన ఆదేశాలు ఎప్పుడూ శ్రేయోదాయకంగానే ఉండేవి.

**ఆరోగ్యపరమైన విషయాలు:**

నాశిక్ మెయిన్ రోడ్డులోనున్న మా పూర్వీకుల ఇంట్లోనే నా జీవితాంతం నివసించాను. ఒకసారి నాశిక్‌లో ప్లేగు వ్యాధి ప్రబలింది. మా ఇంట్లో కూడా చచ్చిన ఎలుకలు కనిపించాయి. వెంటనే ఈ విషయం ఉత్తరం ద్వారా బాబాకు తెలియజేసాను. నేను బాబా ఆదేశం లేనిదే ఏ పనీ చేసేవాడిని కాదు. సదా వారి రక్షణలో ఉన్నందువల్ల, వారి సమాధానం వచ్చేవరకు ఆ ఇంట్లోనే గడపడం క్షేమమని భావించి అక్కడే ఉన్నాను. నేను వేసే ప్రతి అడుగులోనూ తాము మార్గదర్శకత్వం వహిస్తున్నామని బాబా చెప్పేవున్నారు. నాకు బాబా మాటలపై సంపూర్ణ విశ్వాసం ఉంది. నాశిక్‌లోనూ, ఇతర ప్రదేశాలలోనూ జరుగుతున్న, జరుగబోయే సంఘటనలు సర్వమూ బాబాకు తెలుసు. ఒక పసిబిడ్డలా బాబాపై ఆధారపడిన నాకు ఎటువంటి హాని కలుగకుండా కాపాడుతారన్నది నా నమ్మకం. గత 29 సంవత్సరాలుగా నేను వారిపై పెట్టుకున్న ఈ నమ్మకం ఏ ఒక్క విషయంలోనూ వమ్ము కాలేదు.

ఆ ఇల్లు విడిచి వేరే ఇంటికి మారిపొమ్మని బాబా నుండి సమాధానం రావడంతో, నాశిక్‌లోని మరొక బంగళాకు నివాసం మార్చాను. కానీ ఆ బంగళాలో చేరిన రాత్రే నా సోదరుని కుమారుని పడక దగ్గర చచ్చిన ఎలుకొకటి కనిపించింది. ఈ విషయాన్ని బాబాకు మళ్ళీ ఉత్తరం ద్వారా తెలియజేస్తూ, తిరిగి మరో ఇంటికి మారమంటారేమో తెలుపమని కోరాను. ఈసారి మారవద్దని బాబా నుండి సమాధానమొచ్చింది. డాక్టర్లు, స్నేహితులు ఆ బంగళాలో ఉండటం క్షేమం కాదని, వేరే ఇంటికి మారిపొమ్మని సలహా ఇచ్చారు. కానీ నాకు బాబా మాటే వేదవాక్కు. వారి కృప నాపై ఉన్నంతవరకు ఏ ఆపదా సంభవించదని నా నమ్మకం. అందువల్ల

ఎవరి సలహాలు పాటించకుండా అక్కడే నివసించసాగాను. ఇలా కొన్ని రోజులు గడిచిన తరువాత పనివాళ్ళ గదులలోను, ఇంటి లోపల, బయట ఆవరణలోనూ చచ్చిన ఎలుకలు ఎన్నో కనిపించాయి. చివరకు మేము త్రాగడానికి, వంటకు ఉపయోగించే మంచినీటి బావిలో కూడా చచ్చిన ఎలుక కనిపించింది. ఇక ఆ బంగళాలో ఉండటం మంచిది కాదని తోచి, అన్ని విషయాలు బాబాకు వివరంగా జాబు వ్రాసి ఇల్లు మారేందుకు అనుమతించవలసిందిగా ప్రార్థించాను. ఈసారి బాబా తప్పక అంగీకరిస్తారని తలచి సామానంతా సర్ది, 'బజార్' వీధిలోనున్న మా ఇంటికి బండిలో పంపాను. తరువాత కుటుంబంతో సహా వేరొక బండిలో ఆ ఇంటికి చేరి, తాళం తీయడానికి ప్రయత్నిస్తుండగా ఇంతలో శిరిడీ నుండి వచ్చిన ఉత్తరం అందింది. అందులో "మనం నివసిస్తున్న ఇంటిని ఎందుకు విడిచిపెట్టాలి? (ఆపణ్ కశాలా సోడావే తేత్తేచ్ రాహావే)" అని ఉంది. నేను మరేమీ ఆలోచించలేదు. బాబా ఆజ్ఞను శిరసావహించి వెంటనే ఖాళీ చేసి వచ్చిన బంగళాకు తిరిగివెళ్ళి అక్కడే నివసించసాగాము. (నీటి విషయంలో మాత్రం కాస్త జాగ్రత్త వహించాము. గోదావరి నుండి నీటిని తెప్పించి వాడుకోసాగాము.) నేను చేసిన పని అవివేకంగా, ప్రమాదకరమైనదిగా అనిపించినా మాకు ఎటువంటి హానీ జరగలేదు. నాశిక్‌లో ప్లేగు బాగా వ్యాపించి దినానికి 14-15 మంది చనిపోతున్నా, బాబా మమ్మల్ని అదే ఇంటిలో నివసించమని ఆదేశించారు. వారి అనుగ్రహంతో మేము క్షేమంగా ఉండగలిగాము.

నాయందు బాబా అనుగ్రహం ప్రాపంచిక విషయాలకే పరిమితం కాలేదు. 1909లో నా భార్య మరణించింది. ఆమె ఆత్మశాంతి కోసం ప్రతినెలా 'మాసికం' పెట్టేవాడిని. ఆరవ మాసికం పెట్టవలసిన సమయం ఆసన్నమయింది. అప్పుడు బాబా *"ఈసారి మాసికం శిరిడీలో పెట్టు. నీ భార్యకు సద్గతి ప్రసాదిస్తాను"* అన్నారు. వారి మాట ప్రకారమే ఆరవ మాసికం శిరిడీలో పెట్టాను. బాబా 15 రూపాయలు దక్షిణ అడిగారు. నేను సమర్పించాను. బాబా మాటలపై నాకు అచంచల విశ్వాసముంది. వారి మాటలు అక్షరసత్యాలని అనేక ఋజువులు దొరికినందువల్ల ఆయన పట్ల నా విశ్వాసం ఎంతో దృఢపడింది. అది నేను ఋజువుపరచలేని విషయాలపట్ల కూడా నమ్మకమేర్పడడానికి దోహదం చేసింది. అందువల్ల బాబా అనుగ్రహంతో నా భార్య సద్గతి పొందింది అని నేను సంపూర్ణంగా నమ్ముతున్నాను. అప్పటికి (1909) నా వయస్సు 36 సంవత్సరాలు, ఆరోగ్యంగా ఉన్నాను. పేరున్న న్యాయవాదిని. దానికి

తోడు మాకు సంతానం లేకుండా నా భార్య చనిపోయినందు వల్ల, నా స్నేహితులు, బంధువులు నన్ను ద్వితీయ వివాహం చేసుకోమని ఒత్తిడి చేయసాగారు. వీరిలో నాగ్‌పూర్‌కు చెందిన న్యాయవాది, మా మామగారైన రావుబహద్దుర్ బాపూరావ్ దాదా కింఖేడే, *ఎం.ఏ.,* కూడా ఉన్నారు. బాబా అనుమతి లేనిదే నేను ఏ పనీ చేయనని మా మామగారికి చెప్పాను. అందువల్ల ఆయన నన్ను శిరిడీ తీసుకెళ్ళారు. ముందు ఆయనొక్కరే లోనికి వెళ్ళి బాబాతో మాట్లాడి ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చారు. బాబా కళ్ళలో విముఖత కనిపించిందని, వారి ఆజ్ఞ లేకుండా ద్వితీయ వివాహం చేసుకోవద్దని మా మామగారు నాకు చెప్పారు. బాబా అనుజ్ఞకు విరుద్ధంగా నేను ఏనాడూ నడుచుకోలేదు. ఈనాటి వరకు బాబా నా వివాహానికి సమ్మతించలేదు. దాంతో నా జీవితమంతా ‘ఆనందమయ ఒంటరితనం’తోనే గడిపాను.

నేను ప్రాపంచిక జీవితంలో సాధించిన విజయాలు ఎనలేనివి. వృత్తిపరంగా నా విజయ పరంపరలు మకుటాయమానమైనవి. నేను ఆర్థికంగా ఎంతో ఎదిగాను. దానికి నేను చెల్లిస్తున్న ఆదాయపుపన్నే నిదర్శనం. ఇదంతా బాబా అనుగ్రహంతోనే సాధ్యమయింది. ఇన్ని విజయాలు సాధించినప్పటికీ వారు నన్ను ప్రాపంచిక బంధాల నుండి దూరంగా ఉండేట్లు చేశారు. బాబా నాకు విజయవంతమైన ఐహిక జీవితం ప్రసాదించిన తరువాత పారమార్థిక విషయాల వైపు నా దృష్టిని మరలించారు. వారి చర్యలు నిగూఢాలు, అనూహ్యాలు. నా ప్రాపంచిక - పారమార్థిక విషయాలపట్ల చింత లేకుండా చేసి, వారి చెంత శరణాగతి పొందడానికి, వారి ఆదేశం అందిన వెనువెంటనే అన్నీ వదిలి వెళ్ళేందుకు నన్ను సమాయత్తపరిచారు.

బాబా అనుమతితో నేను ప్రజోపయోగ కార్యాలు చేపట్టాను. వీటన్నింటిలో బాబా యొక్క అద్భుత సహాయం కనిపిస్తుంది. కొన్ని సంఘటనలు నమ్మశక్యం కానివిగా ఉన్నందువల్ల వాటిని మీకు చెప్పడానికి సందేహించాను. కానీ నేను ఇతరుల నమ్మకాలను, అపనమ్మకాలను పట్టించుకోను. మీరు వాస్తవాలు చెప్పమన్నారు కాబట్టి నా అనుభవాలను జరిగినవి జరిగినట్లుగా చెబుతున్నాను.

నా న్యాయవాద వృత్తిలో బాబా సహాయపడిన సంఘటనలను ఉదహరించిన తరువాత ప్రజోపయోగ కార్యక్రమాలలోనూ వారు నాకు ఎలా తోడ్పడ్డారో వివరిస్తాను. సుమారు 20, 25 సంవత్సరాలకు పూర్వం శిరిడీ నుండి

ఒక క్రిమినల్ కేసు వచ్చింది. చాలా గ్రామాలలో మాదిరిగానే శిరిడీలో కూడా పార్టీ తగాదాలు, ముఠాకక్షలు ఉండేవి. ఒక మార్వాడి స్త్రీపై దౌర్జన్యం చేసి, ఆమె గౌరవానికి భంగం కలిగించారన్న నేరారోపణపై బాబా సేవకుడైన రఘుని, మరో ఐదుగురిని అరెస్టు చేశారు. ఆ నేరాన్ని ప్రత్యక్షంగా చూసిన సాక్షులు చాలామంది ఉన్నట్లు చూపించారు. న్యాయమూర్తి వాళ్ళకి ఆరు నెలల కారాగార శిక్ష విధించాడు. తాత్యాకోతే పాటిల్‌కు వీళ్ళపై ప్రత్యేకమైన అభిమానం, జాలి ఉన్నాయి. వాళ్ళనెలాగైనా విడుదల చేయించాలని తలచి, న్యాయమూర్తి ఇచ్చిన తీర్పుప్రతులను తీసుకొని, అప్పుడు శిరిడీలో ఉన్న ప్రముఖ న్యాయవాదులైన దీక్షిత్, ఖాపర్డే మరియు మెజిస్ట్రేటుగా రిటైరైన హెచ్.వి. సాఠే తదితరుల వద్దకు వెళ్ళాడు. వారందరూ ఆ ప్రతులను చదివి, తీర్పు చాలా బలంగా ఉందని, అప్పీలు చేసినా ప్రయోజనం స్వల్పమేనని చెప్పారు. తాత్యా బాబాను ఆశ్రయించాడు. బాబా ***"భావూ దగ్గరికి పేపర్లు తీసుకుపో"*** అని ఆదేశించడంతో, తీర్పుప్రతులతో తాత్యా నాశిక్ వచ్చి నన్ను కలిసాడు. వాటిని చదివిన నాకు నిరాశ కలిగింది. అప్పీలు చేసినా కేసు గెలిచే అవకాశం కొంచెం కూడా కనపడలేదు. అందువల్ల దీనిని బొంబాయికిగానీ, అహ్మద్‌నగర్‌లో ఉన్న ప్రముఖ న్యాయవాదుల దగ్గరికిగానీ తీసుకెళితే మంచిదని తాత్యాకు సూచించాను. కానీ తాత్యా నాకు బాబా ఆదేశాన్ని గుర్తు చేయడంతో ఇక ఆ విషయంలో నా బాధ్యతగానీ, నాకు మరో మార్గంగానీ ఏమీలేదని అర్థమయింది. నేను మారు మాట్లాడకుండా కేసును పరిశీలించి, అప్పీలు పిటీషన్ వ్రాసి డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేటు ఇంటికి తీసుకెళ్ళాను. ఆయన అదేమీ చదవకుండా విషయమేమిటో తెలుపమని అడిగారు. కేసు విషయం క్లుప్తంగా వివరించాను. ఆయన అంతా విని "నిందితులపై కేసు చాలా బలంగా ఉన్నట్లు కనిపిస్తుందే! దీనిపై నీ అభిప్రాయమేంటి?" అనడిగారు. అసలా కేసు, అంతమంది సాక్ష్యులు వీటన్నింటికీ ముఖ్య కారణం గ్రామంలోని ముఠా తగాదాలని, వాటివల్లే నేరం ఆరోపించబడిందని చెప్పాను. "నువ్వు అలాగే అనుకుంటున్నావా?" అని మేజిస్ట్రేటు అడిగారు. "అనుకోవడం కాదు, అలాగే జరిగింద"ని నేను ప్రగాఢంగా నమ్ముతున్నట్లు జవాబు చెప్పాను. మేజిస్ట్రేటు ఇంకేమీ ఆలోచించలేదు. నేను వ్రాసి తెచ్చిన అప్పీలు పిటీషనుపై వాస్తవాలను ప్రస్తావిస్తూ తీర్పు వ్రాసారు. నిందితులను విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఆ తరువాత మేజిస్ట్రేటు "మీ శిరిడీ సాయిబాబా

ఎలాంటివారు? వారు హిందువా, ముస్లిమా? వారు మీకేమి బోధిస్తారు?'' అనడిగారు. ''సాయిబాబా హిందువూ కాదు, ముస్లిమూ కాదు, ఈ రెండింటికీ అతీతులు'' అని జవాబిచ్చాను. వారు బోధించేదేమిటో నేను వివరించలేనని స్వయంగా వారిని దర్శించి తెలుసుకోవాలని చెప్పాను. వీలు చూచుకొని సాయిబాబాను దర్శిస్తానని మేజిస్ట్రేటు నాకు మాట ఇచ్చారు. (వాస్తవానికి ఆ తరువాత వేసవిలో ఒక రోజున ఆయన బాబాను దర్శించాలని శిరిడీ బయలుదేరి ఎండ తీవ్రంగా ఉండడంతో కోపర్‌గాం నుండే వెనుదిరిగారు.) కేసు పూర్వాపరాలు, క్రింది కోర్టు తీర్పు పరిశీలించకుండా పోలీసులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు నోటీసులు ఇవ్వకుండా ముద్దాయిలను విడుదల చేయాలన్న ఆయన నిర్ణయం, ఆ వెనువెంటనే బాబాను గురించి అడగడం- ఇదంతా బాబా మహిమ వలనే జరిగిందనడానికి నిదర్శనం. ఆ విషయాన్ని ఈ క్రింది సంఘటన బలపరుస్తుంది.

నేను అహ్మద్‌నగర్ నుండి శిరిడీ చేరాను. ఆ రోజు శిరిడీలో దీక్షిత్ కుమార్తె మరణించింది. విషాద వదనాలతో ఆమె అంత్యక్రియలకు వెళ్తున్న భక్తులలో కొందరిని పిలిచి *''వెళ్ళిపోకండి. మీకొక చమత్కారం చూపిస్తాను!''* అని బాబా అన్నారు. కానీ భక్తులకు ఏ చమత్కారమూ కనిపించనందున వాళ్ళు అంత్యక్రియలకు వెళ్ళిపోయారు. ఆ తరువాత కాసేపటికి రఘు తదితరుల విడుదలకు సంబంధించిన వార్తతో నేను శిరిడీ చేరాను. బాబా చూపిస్తానని చెప్పిన చమత్కారం అదేనని భక్తులు అప్పుడు గ్రహించారు.

నా వృత్తికి సంబంధించిన మరో కేసు విషయం తెలియజేస్తాను. ఈ కేసు ముగ్గురు సోదరులకు సంబంధించినది. వీరు తమ ప్రత్యర్థులను తీవ్రంగా గాయపరచారని వారిపై క్రిమినల్ కేసు మోపబడి, నేరం నిరూపించబడింది. గాయపడినవారిలో ఒకరికి ఎముక విరిగి 20 రోజులు ఆసుపత్రిలో చికిత్స పొందినట్లుగా కూడా చెప్పబడింది. పైముగ్గురి తరపున నేను వాదించడానికి ఒప్పుకొని అప్పీలు మెమో తయారు చేసుకొని, ముందు జామీనుకు ప్రయత్నించాను. కేసు బలంగా ఉన్నందున నిందితులకు జామీను ఇవ్వడానికి వీలుపడదని సెషన్స్ కోర్టు న్యాయమూర్తి (సీనియర్ ఐరోపా అధికారి) చెప్పాడు. నేను ఒక్కసారి బాబాను స్మరించుకొని జడ్జి వైపు తిరిగి, ప్రాసిక్యూషన్ వారు చెప్పిన విషయం నమ్మశక్యంగా

లేదని, ఎముక విరిగిందని చెప్పబడుతున్న ధృవపత్రం, ఏ డిగ్రీలు, సర్టిఫికెట్లు లేని ఒక నాటువైద్యుడిచే ఇవ్వబడిందని చెప్పాను. మరియు నిందితులు ముగ్గురూ రైతులని, వ్యవసాయమే వారి జీవనాధారమని, వాళ్ళు జైలులో కూర్చుంటే వ్యవసాయం దెబ్బతింటుందని చెబుతూ వాళ్ళపై శిక్ష ఖాయమైతే వాళ్ళని అప్పుడు జైలుకు పంపవచ్చని వాదించాను. వెంటనే న్యాయమూర్తి జామీను మంజూరు చేశాడు. కొద్ది రోజుల తరువాత కేసు విచారణకొచ్చింది. నేను వాదించబోయేది ఖైదీలను విడుదల చేసేందుకా లేక కేవలం క్షమాభిక్ష కొరకా అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ నన్ను అడిగాడు. క్షమాభిక్షకయితే తాను వ్యతిరేకించనన్నాడు. తీర్పు బలంగా ఉన్నప్పటికీ బాబాపై భారం వేసి ఖైదీల విడుదల కోసమే వాదిస్తానని చెప్పాను. ఒక నాటు వైద్యునిచే ఇవ్వబడిన ధృవపత్రాన్ని ఆధారం చేసుకొని, ప్రమాదకరంగా గాయపరిచారని చెప్పడం సబబు కాదని వాదించాను. నేను శిక్ష రద్దు కొరకు వాదించడం మొదలుపెట్టినా చివరికి సాధ్యమైనంత వరకు శిక్షను తగ్గించమని న్యాయమూర్తిని వేడుకున్నాను. అందుకు న్యాయమూర్తి, నేను కోర్టువారిని క్షమాభిక్ష కొరకే అభ్యర్థిస్తున్నప్పుడు అంతసేపు వాదించకుండా ఉండాల్సింది అంటూ "ఒక నాటువైద్యుడిచ్చిన ధృవపత్రం ఆధారంగా ప్రత్యర్థిని తీవ్రంగా గాయపరచారని ఎలా చెబుతున్నావు?" అని ప్రాసిక్యూటర్‌ను అడిగాడు. "ప్రత్యర్థి 20 రోజులు చికిత్స పొందాడు కదా!" అని ప్రాసిక్యూటర్ జవాబు చెప్పాడు. అప్పుడు న్యాయమూర్తి "నీ వాదన మూడవ తరగతి మేజిస్ట్రేటు ముందు ప్రవేశపెట్టదగినది. నీవు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ముందు వాదిస్తున్నావన్న విషయం మరిచిపోయావు" అని గద్దించాడు. దీని తరువాత ప్రాసిక్యూటర్ మౌనం వహించాడు. దాంతో వాదన ముగిసింది. న్యాయమూర్తి అప్పీలుదారులను విడుదల చేశాడు.

నా ప్రజాసంబంధిత కార్యక్రమాల గురించి మొదట చెప్పవలసినదేమంటే, నేను నాశిక్ జిల్లా లోకల్ బోర్డు అనధికార అధ్యక్షునిగా ప్రభుత్వంచే నియమించబడ్డాను. ఆ పదవిని నేను 1.11.1917 నుండి 13.5.1925 వరకు నిర్వహించాను. ఆ పదవిలో ఉన్నప్పుడు వేలకొలది సంతకాలు స్వయంగా (నా సంతకంతో తయారు చేయబడిన స్టాంపు ఉపయోగించకుండా) పెట్టవలసివచ్చేది. దీనికి రోజులో చాలా సమయం కేటాయించవలసి వచ్చేది. దీని ఫలితంగా నా

న్యాయవాద వృత్తికి సమయం దొరకక అది బాగా కుంటుపడింది. నేను కట్టే ఆదాయపు పన్ను 260 రూపాయల నుండి సున్నాకు పడిపోయిందంటే, నా సంపాదన ఎంత తరిగి పోయిందో తెలుసుకోవచ్చు. కానీ నా ఈ త్యాగానికి గుర్తింపుగా 1927లో నాకు "రావుబహద్దుర్" అనే బిరుదు ప్రదానం చేయబడింది. అది ఏమంత పెద్ద గుర్తింపు కాకపోయినా దానికి తగిన ప్రాధాన్యత దానికున్నది కదా? బాబాపై భారం వేసి నా పని నేను నిర్వహించుకుంటూ పోయాను. ప్రతిరోజు జవాను ఆఫీసు పేపర్లను తెచ్చి నా టేబుల్‌పై ఉంచేవాడు. ఒక్కొక్క పేపరుపై నేను సంతకం పెడుతుంటే జవాను ఆ సంతకాన్ని బ్లాటింగ్ పేపరుతో అద్ది ప్రక్కన పెడుతుండాలి. ఇలా పేపర్లన్నింటిపై సంతకాలు పెట్టడానికి చాలా సమయం పట్టేది. ఒకరోజు నేను సంతకాలు పెట్టడానికి ఉపక్రమించాను. ఇంతలో నాకు బాగా తెలిసిన, నేను గౌరవించే ఒక వ్యక్తి నన్ను కలవడానికి వచ్చాడు. సంతకాల పని మరుసటి ఉదయానికి వాయిదా వేసి అతనితో అర్ధరాత్రి వరకు మాట్లాడుతూ గడిపాను. తరువాత జవానును భోజనానికి పంపి నేను నిద్రపోయాను. మరునాటి ఉదయం ఊరు వెళ్ళాల్సిన పని ఉండి, పేపర్లపై సంతకాలు పెట్టకుండా ఆఫీసుకు పంపాను. తిరిగి రాత్రికి కానీ రాలేకపోయాను. యథావిధిగా సంతకాలు చేసేందుకు కూర్చున్నప్పుడు ఆరోజు తాలూకు పేపర్లు మాత్రమే కనిపించాయి. ముందురోజు సంతకాలు చేయని పేపర్లను తెప్పించి చూస్తే వాటన్నిటిపై నా సంతకాలున్నాయి. ఆశ్చర్యం! నేను చేయకుండానే వేల పేపర్లపై నా సంతకం ఉండడం ఎలా సాధ్యమైంది? ఇది బాబా యొక్క మానవాతీత శక్తి వల్లే సంభవమైందని నేను గ్రహించాను.

అలాగే బాబా చేసిన మరొక అద్భుత చర్య గురించి తప్పక చెప్పాలి. డిస్ట్రిక్ట్ లోకల్ బోర్డు అధ్యక్షునిగా ప్రాథమిక పాఠశాలలన్నీ నా అధీనంలోనే ఉండేవి. ఒకసారి, నెల మొదటివారంలో దీపావళి సెలవులు వచ్చాయి. టీచర్లందరికీ సెలవులకు ముందే జీతాలు చెల్లిస్తే బాగుంటుందని మహమ్మదీయుడైన విద్యాశాఖాధికారి అభిప్రాయపడ్డాడు. మొదట నేను ఆ విషయం పెద్దగా పట్టించుకోలేదు. రెండు మూడు రోజుల తరువాత అతను అదే విషయం తిరిగి నాకు గుర్తుచేశాడు. నాకూ అలా చేస్తే బాగుంటుందనిపించి అకౌంట్స్ ఆఫీసరును సంప్రదించాను. ప్రభుత్వం నుండి డబ్బు మంజూరుకాలేదని, అలాంటప్పుడు చెక్కు పంపడం అభ్యంతరకరమని అతను చెప్పాడు. అందువల్ల నేను ఏమీ

చేయలేకపోయాను. మరలా విద్యాశాఖాధికారి ఆ విషయాన్ని నా ముందుంచడంతో నేను అతని అభిప్రాయంతో ఏకీభవించి బాబా అనుమతి కోరదలచాను. రెండు చీటీలు వ్రాసి బాబా పటం ముందుంచి, ఒక దానిని తీయించాను. జీతాలు చెల్లించమనే చీటీ వచ్చింది. నేను వెంటనే చెక్కు వ్రాయించి బ్యాంకుకు పంపి డబ్బు తెప్పించి టీచర్లందరికీ జీతాలిచ్చాము. దీపావళి పర్వదినానికి ముందు జీతాలిచ్చినందుకు అందరూ సంతోషించారు. అయితే అక్కౌంట్స్ ఆఫీసర్ అభ్యంతరాన్ని త్రోసిపుచ్చి చెక్కు పంపినందుకు ఏమవుతుందోనని కొంచెం ఆందోళనపడ్డాను. కానీ బాబా దయవలన ఏమీ కాలేదు. ఆ తరువాత చాలాకాలానికి జరిగిన ఆడిట్‌లో ఈ విషయంపై అభ్యంతరం లేవనెత్తారు. దానికి "భవిష్యత్తులో అలా జరగకుండా ఉండేందుకు గుర్తుంచుకోవడమైనది" అని నేను జవాబు వ్రాసి పంపాను. అది అంతటితో సమసిపోయింది.

నా జీవితంలోని ప్రతి మలుపులోనూ, సందిగ్ధస్థితిలోనూ బాబా నాకు ఎన్నోసార్లు సహాయపడ్డారు. వాటిలో కొన్నింటిని ఎంపిక చేసుకొని మీకు వివరిస్తాను. 1910లో నా సన్నిహిత స్నేహితుడైన గోపాలరావు బూటీ నాకు సహాయం చేయదలచి నన్ను ఉన్నతవిద్యకై విదేశాలకు (ఇంగ్లండు) పంపదలచాడు. ఇంగ్లండులో చదువుకయ్యే ఖర్చు, ప్రయాణపు ఖర్చులు, నేను విదేశాలలో ఉన్నప్పుడు ఇక్కడ ఇంటికయ్యే ఖర్చు అన్నీ తానే భరిస్తానని చెప్పాడు. మేము అన్ని ఏర్పాట్లు చేసుకొని బాబా అనుమతి కోసం వారిని దర్శించాము.

షామా : బాబా, భావూను విదేశాలకు (బిలాయత్) పంపించమంటారా?

*బాబా : ఎందుకట?*

షామా : ఉన్నతవిద్య కోసం. (బార్-ఎట్-లా)

*బాబా : అతని అభిరుచి (ఇలాయత్), దైవేచ్ఛ (విలాయత్), విదేశాలలో (బిలాయత్) లేదు. ఈ దేశంలోనే ఉంది. అతను ఇంగ్లండుకు ఎందుకు వెళ్ళాలి?*

మనం ఎంత జాగ్రత్తగా ప్రణాళికలు వేసుకున్నప్పటికీ అవి తరచుగా తలక్రిందులవుతుంటాయి అని నేనప్పుడు తెలుసుకున్నాను.

1912లో జె.జె. హాస్పిటల్‌లో నాకొక ఆపరేషన్ జరిగింది. అది క్లిష్టమైన ఆపరేషన్. ఆపరేషన్‌కు ముందు మత్తిచ్చారు. మత్తులోనికి జారేముందు నేను వెనుకకు తిరిగి చూసాను. నా తల వైపు ఆపరేషన్ టేబుల్ వద్ద బాబా ఒక కుర్చీలో కూర్చొని ఉన్నారు. బాబా నా వెంటే ఉన్నారన్న భరోసా కలిగింది. వారి దయవలన ఆపరేషన్ విజయవంతంగా జరిగింది.

1915లో నన్ను నాశిక్‌లో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉద్యోగంలో చేరమని ప్రభుత్వం ఆహ్వానం పంపింది. నేను రెండు రోజులు గడువు అడిగి, బాబాను ఉత్తరం ద్వారా సంప్రదించాను. ***"నీవు చేస్తున్న పనే మంచిది. కొత్తదానిని అంగీకరించవద్దు"*** అని బాబా నుండి వెంటనే సమాధానం వచ్చింది. వారి ఆదేశం మేరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉద్యోగాన్ని నిరాకరించాను.

1918లో బాబా మహాసమాధికి కొద్దిరోజుల ముందు శిరిడీ, పూనా మరికొన్ని ప్రాంతాలలో ప్రమాదకరమైన విషజ్వరాలు (ఇన్‌ఫ్లూయంజా) విజృంభించాయి. పూనాలోనున్న నా అన్న భార్యకు ఈ జ్వరం సోకి ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందని నాకు తంతి ద్వారా తెలియజేసారు. వెంటనే నేను అవసరానికి 80 రూపాయలు తీసుకుని మా అన్న దగ్గరికి బయలుదేరాను. నాశిక్ నుండి పూనా వెళ్ళే దారిలోనే శిరిడీ ఉంది కాబట్టి అక్కడ ఆగి బాబాను దర్శించి రోగికి ఊదీ, ఆశీస్సులు తీసుకొని వెళదామని తలచాను. వెళ్ళిన రోజే బాబా పలుమార్లు నన్ను దక్షిణ అడిగి నా దగ్గరున్న 80 రూపాయలు తీసేసుకున్నారు. ఇది నాకు అంత మంచి శకునంగా అనిపించలేదు. ఇక నా పూనా ప్రయాణం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదనిపించింది. అయినా నేను పూనా వెళ్ళేందుకు అనుమతించమని బాబాను కోరాను. వారు రాచఠీవీతో ***"రేపు చూద్దాం (ఉద్యా పాహూ)"*** అన్నారు. అలా అంటూ మూడు రోజులు నన్ను శిరిడీలోనే ఉంచారు. అంతలో మా వదిన చనిపోయినట్లు టెలిగ్రాం వచ్చింది. అప్పుడు నేను పూనా వెళ్ళేందుకు బాబా అనుమతించారు. మా వదిన చనిపోతుందనీ, నేను అక్కడికి వెళ్ళినా ఫలితమేమీ ఉండదని సర్వజ్ఞులైన బాబాకు ముందే తెలుసు. అందుకే నన్ను శిరిడీలోనే ఆపేసారు. బాబా నిర్ణయానికి గల కారణాలను నేను తెలుసుకోలేను. కానీ ఏ విషయంలోనైనా వారే నిర్ణయం తీసుకోగల సమర్థులు. అందుకే ఎప్పటిలాగే వారిదే తుది నిర్ణయంగా భావించి

ఆగిపోయాను. ఈ సంఘటన బాబా మహాసమాధికి కొద్ది రోజుల ముందు జరిగింది. అలా నన్ను శిరిడీలోనే ఉంచి తాము భౌతికదేహంతో ఉన్న చివరి రోజులలో వారితో గడిపే మహద్భాగ్యాన్ని నాకు ప్రసాదించారు.

నేను డిస్ట్రిక్ట్ లోకల్ బోర్డు అధ్యక్షునిగా ఉన్నప్పుడు నా ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. కానీ బాబా దయ వలన క్రమంగా పుంజుకొని మామూలు స్థితికి చేరుకోగలిగాను. నేను 1.9.1930 నుండి 9.4.1932 వరకు దేవార్ సంస్థానానికి రెవెన్యూ మెంబరు గానూ, 1932 సంవత్సరాంతము నుండి 1933 ఆగష్టు వరకు సుర్‌గాన సంస్థానానికి సెక్రటరీ గానూ పనిచేశాను. నేను నాశిక్‌లో ఉన్నప్పుడు నా న్యాయవాద వృత్తి కొనసాగిస్తూనే ఉండేవాడిని. అందువల్ల ఒక్కరోజు కూడా ఖాళీ ఉండేది కాదు. నేను సుర్‌గాన సంస్థానంలో పని చేస్తున్నప్పుడు బాబా ఎంతో దయతో నాకు ఏ విధంగా ఆర్థిక సహాయం అందించారో చెప్పడానికి ఈ క్రింది అద్భుత లీలే నిదర్శనం.

ఒకరోజు నేను భోజనం చేస్తున్నప్పుడు ఆ సంస్థాన్ ప్రధాని నా గదిలోనికి ప్రవేశించాడు. నేను భోజనం చేస్తున్నందున ఆయనను సగౌరవంగా ఆహ్వానించి ఉచితాసనంపై కూర్చోపెట్టలేకపోతున్నందుకు క్షమించమని కోరాను. కానీ ఆయన నేరుగా ప్రక్కనే ఉన్న గదిలోనికి వెళ్ళి, అక్కడ గోడకు తగిలించి ఉన్న బాబా పటాన్ని కొంతసేపు తదేకంగా చూసి తిరిగి నా గదికి వచ్చి "మీ జీతం 50 రూపాయలు పెంచుతున్నాను" అని చెప్పి వెళ్ళిపోయాడు. నా జీతాన్ని పెంచమని నేనసలు అడగలేదు. ఉద్యోగంలో చేరిన 15రోజులకే నా ప్రయత్నమేమీ లేకుండా నా జీతం పెరగడం బాబా అనుగ్రహమే. బాబా మనపై చూపుతున్న ప్రేమ, తల్లి తన బిడ్డపై చూపేటటువంటిదని అర్థమయింది (మావులీఁచే చిత్ లేకురాచేఁ హిత్).

బాబాను నేను పూజించే విధానం గురించి చెబుతాను. మొదట్లో నా పూజామందిరంలో బాబా ఫోటోలు ఉండేవి. వాటితో పాటు తరువాత బాబా యొక్క రంగుల చిత్రపటాలు కూడా ఉంచాను. బాబా నిల్చుని ధ్యానమగ్నులై ఉన్న పెద్ద పటం వాటన్నింటి మధ్యలో ఉండేది. ఆ పటం అంటే నాకు ఎంతో ఇష్టం. మొదట అది రాధాకృష్ణ ఆయీ దగ్గర ఉండేది. దానిని నాకు ఇవ్వమని ఆమెను ఒత్తిడి చేసి తీసుకొన్నాను. ఆయీ ఇంటి నుండి ఆ పటాన్ని తీసుకొని మసీదు దారిలో

వెళుతున్నప్పుడు బాబా నన్ను లోనికి పిలిచి, నా చేతిలో ఉన్న పటాన్ని చూస్తూ ***"ఏమిటిది?"*** అనడిగారు. "ఇందులో మీరున్నారు" అన్నాను. బాబా ***"ఇటివ్వు"*** అంటూ పటాన్ని తమ చేతుల్లోకి తీసుకొని, దానిని ముందూ వెనుక తదేకంగా చూసి తిరిగిచ్చి ***"ఉంచు"*** అన్నారు. బాబా స్పృశించి ఇచ్చిన చిత్రపటాన్ని వారి చేతుల మీదుగా తీసుకొని పూజించుకోవాలనే నా కోరిక అలా నెరవేరింది. అంతేకాదు దానిని చూసినప్పుడల్లా, ***"భావూ! నాకు రాత్రంతా నిద్రలేదు. నీ గురించే ఆలోచిస్తూ ఉండిపోయాను!"*** అని బాబా నాతో అన్న సందర్భం గుర్తుకొచ్చేది. బాబా నాకు ప్రసాదించిన కానుకగా భావించి దానిని భక్తితో పూజిస్తున్నాను.

ఈ ఫోటోలనన్నింటినీ నేను ఎక్కడికి వెళితే అక్కడికి నావెంటే తీసుకుని వెళ్ళేవాడిని. నేను దేవార్ సంస్థానంలో పని చేస్తున్నప్పుడు నాశిక్, దేవార్‌ల మధ్య ఎన్నోసార్లు ప్రయాణించవలసి వచ్చేది. ప్రతిసారి ఫోటోలను నా వెంట తీసుకెళుతుండడం చూసిన దేవార్‌లోని మా వంటవాడు ఒకసారి "కొన్ని ఫోటోలను ఇక్కడే ఉంచవచ్చు కదా?" అన్నాడు. అదే ప్రశ్న తరువాత నాశిక్‌లోని నా సోదరుని కుమారుడు కూడా అడగడంతో అప్పుడు నేను ఆ విషయంగా బాబా నిర్ణయం ఏమిటో తెలుసుకోవాలని తలచి బాబా పటం ముందు చీటీలను వేసేవాడిని. అలా చేసిన ప్రతీసారి ఫోటోలన్నీ తీసుకువెళ్ళమనే సమాధానం వచ్చేది.

నేను పవిత్రంగా భద్రపరచుకోవడానికి బాబా నాకు కొన్ని వస్తువులు ప్రసాదించారు. ఒకసారి నన్ను 2 రూపాయలు దక్షిణ అడిగి తీసుకొని వాటిని తిరిగి నాకే ఇచ్చి ***"వీటిని భద్రంగా దాచుకో. ఎవరికీ ఇవ్వవద్దు. ఖర్చు పెట్టవద్దు (జపూన్ ఠేవా. కోణాలా దేవూఁ నకో, ఖర్చ్ కరూఁ నకో)"*** అన్నారు. ఇంకొకసారి అలాగే మరి 2 రూపాయలిచ్చి పైవిధంగానే ఆదేశించారు. ఒకసారి నేను, బూటీ కలిసి బాబాను దర్శించాము. బాబా బూటీని 20 రూపాయలు దక్షిణడిగారు. అతను సమర్పించాడు. కానీ ఆ మొత్తాన్ని బాబా నాకు ఇచ్చివేసారు. ఇంకొకసారి బూటీ, నేను కలిసి బాబాను దర్శించినప్పుడు బాబా బూటీని 30 రూపాయలు దక్షిణడిగారు. అతను సమర్పించాడు. బాబా ఆ 30 రూపాయలను తమ దోసిలిలోనికి తీసుకొని, దోసిలి మూసి క్రిందికి పైకి ఆడించి వాటిని తమ రెండు గుప్పెళ్ళలోకి తీసుకొని ఒక గుప్పెడు నాకు, మరో గుప్పెడు బూటీకి ఇచ్చారు. మేము వాడాకెళ్ళి వాటిని

లెక్కిస్తే సరిగ్గా చెరి 15 రూపాయలున్నాయి. ఆశ్చర్యపోయాము! ఇవే కాకుండా వివిధ సందర్భాలలో బాబా నాకు మరో 30 రూపాయలిచ్చారు. అలా బాబా నాకు ఇచ్చిన మొత్తం 69 రూపాయలయింది. వీటిని బాబా నాపై చూపిన ప్రేమకు జ్ఞాపికలుగా మాత్రమేగాక, నాకు అదృష్టాన్ని తెచ్చిపెట్టే దివ్యమైన నాణాలుగా భావించి చాలా జాగ్రత్తగా దాచుకున్నాను.

నిజమైన ప్రేమికుల మధ్య ఇచ్చిపుచ్చుకోవడాలు సహజం (దదాతి ప్రతి గృహ్యాతి). బాబాకు నాపై గల ప్రేమే నా నుండి దక్షిణ అడిగేట్లు చేసింది. నేను కూడా ఆనందంగా దక్షిణ సమర్పించేవాడిని. బాబా స్వీకరించే దక్షిణల వెనుక నిగూఢమైన మర్మం ఉండేదని ఆ తరువాత జరిగే సంఘటనల వల్ల వెల్లడయ్యేది. ఒక్కొక్కసారి భక్తుల దగ్గరున్న డబ్బు మొత్తం చివరి పైసాతో సహా దక్షిణగా తీసేసుకునేవారు (యస్యానుగ్రహ మిచ్ఛామి తస్య సర్వ్ హరామ్యహమ్). అలా నాకూ తరచుగా జరిగేది. అటువంటి సమయాలలో నేను ఎలాంటి బాధ, విచారం లేకుండా వారు అడిగినప్పుడల్లా సంతోషంగా దక్షిణ సమర్పించేవాడిని. ఎందుకంటే మనకు అన్నీ ఇచ్చేది బాబా కాబట్టి వారు మనకు ఇచ్చిందే తిరిగి తీసుకుంటున్నారు. మన వద్ద పైసా కూడా మిగల్చకుండా తీసుకున్నప్పుడు తిరిగి మనకు ఏదో ఒక మార్గం చూపించవలసింది కూడా ఆయనే కదా! బాబా అలా ఏర్పాటు చేయకుండా వదిలివేసిన సందర్భాలు ఏనాడూ లేవు. 1918లో నాకు జరిగిన ఇటువంటి ఒక అనుభవాన్ని మీకు ముందే తెలియజేసాను. ఇప్పుడు మరో రెండు సంఘటనలను వివరిస్తాను.

పైసంఘటన జరగడానికి పూర్వం ఒకసారి నేను శిరిడీ వెళ్ళినప్పుడు బాబా నన్ను పలుమార్లు దక్షిణడిగి నా దగ్గరున్న డబ్బంతా తీసేసుకున్న తరువాత మరల ***"భావూ, నాకు 7 రూపాయలు ఇవ్వు"*** అని అడిగారు. నా దగ్గర లేవని చెప్పగా ఎవరినైనా అడిగి తీసుకొని ఇవ్వమన్నారు. ఇతరులను అడగటం అవమానంగా భావించరాదని తెలియజేసి నాలోని గర్వాన్ని, అహంకారాన్ని అణచి అణకువగా మెలగాలని నాకొక పాఠం నేర్పించారని నా అభిప్రాయం. బాబా నేర్పిన ఈ విషయం నన్నెంతగా ప్రభావితం చేసిందంటే బాబా మహాసమాధి చెందిన తరువాత నేను శిరిడీ వెళ్ళినప్పుడు, ఆనాడు బాబా భిక్ష చేసిన ఇళ్ళవద్ద భిక్షచేసేవాడిని. బాబా

దయవలన నా అహంకారం అణిగింది. లేకుంటే నా అహంకారం ఇంకా పెరిగి సమాజంలోని క్రిందితరగతివారిని దూరంగా ఉంచేవాడిని.

దక్షిణకు సంబంధించిన మరో సంఘటన తెలియజేస్తాను. ఒకసారి బాబా నా దగ్గరున్న డబ్బంతా దక్షిణగా తీసుకొని, తిరిగి యాభై రూపాయలు అడిగారు. నా దగ్గర పైసా కూడా లేదని చెప్పాను. ఎవరినైనా అడిగి తెమ్మన్నారు. నేను వెళ్ళి ఒకరిని అడిగితే అతను తన దగ్గర డబ్బు లేదని చెప్పాడు. ఆ విషయం బాబాకు తెలియజేసాను. ఈసారి బాబా హెచ్.వి.సాఠే దగ్గరకు వెళ్ళమన్నారు. అలా బాబా తన వద్దకు దక్షిణ కోసం పంపడం సాఠేకు సంతోషాన్ని కలిగించింది. సాఠేను యాభై రూపాయలు అడగమనడంలోని మర్మం నాకు తరువాత తెలిసింది. సాఠే రిటైరైన తరువాత అతనికి పింఛను మంజూరైంది. అతను తనకు యాభై రూపాయలు పింఛను అదనంగా రావలసివుందని ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకొన్నాడు. ప్రభుత్వం దానిని అంగీకరించింది. డబ్బు కొరకు నన్ను సాఠే వద్దకు పంపించడంలోని బాబా ఉద్దేశ్యం అతనికి అదనంగా యాభై రూపాయల పింఛను మంజూరవుతుందన్న విషయాన్ని సూచిస్తుంది. పింఛను మంజూరైన తేదీ, బాబా సాఠేను యాభై రూపాయలు అడిగిన తేదీ ఒక్కటే కావడం విశేషం!

బాబా సేవకుడైన రఘు తదితరులకు సంబంధించిన కేసులో వాళ్ళు నేను అడుగకుండానే 300 రూపాయల ఫీజు ఇచ్చారు. నేను అహ్మద్‌నగర్ నుండి శిరిడీ వచ్చి మూడురోజులు గడిపాను. బాబా ఆ మూడురోజులలో పలుమార్లు దక్షిణ అడిగి ఆ 300 రూపాయల మొత్తాన్ని నా నుండి తీసేసుకున్నారు. బాబా అలా చేయడంలోని అంతరార్థం నేను గ్రహించాను. నా గురువు యొక్క సేవకుడిని విడిపించడం కోసం నేను ప్రతిఫలం ఆశించడం సముచితం కాదు. ఎందుకంటే ఆ కేసు గెలిచింది నా ప్రతిభాపాటవాల వల్ల కాదు. బాబా అద్భుతరీతిలో మేజిస్ట్రేటు మనస్సును నియంత్రించినందువల్లే ఆ కేసు విజయవంతమైంది.

నా అనుభవాల సంపుటిని ముగించే ముందు బాబా బోధించిన కొన్ని ఆధ్యాత్మిక సత్యాల గురించి వివరిస్తాను. వారిపై మన నమ్మకం బలపడేందుకు తమ నిజతత్త్వాన్ని సూచనప్రాయంగా వ్యక్తం చేస్తూ బాబా ఒక విషయం చెప్పారు. ఒకసారి ఒక భక్తుడు దేవుని గురించి మాట్లాడుతున్నప్పుడు, బాబా ***"దేవుడు, దేవుడు అని ఊరికే ఎందుకు అంటున్నావు? దేవుడు నా జేబులో ఉన్నాడు!"*** అన్నారు.


ఒక్కొక్కసారి బాబా స్వయంగా వంట చేసి బీదలకు, ఆకలిగొన్నవారికి వడ్డించేవారు. ఇది వారి ప్రేమను, దాతృత్వాన్ని తెలియజేస్తుంది. అలా ఒకరోజు మసీదు ఆవరణలో వారు పొయ్యిని వెలిగించి దానిపై పెద్దపాత్ర (హండీ) పెట్టి వంట చేస్తున్నారు. ఇంతలో మాంసాహారం అంటే ఇష్టపడే ఒక ఫకీరు వచ్చి అందులో కొంత మాంసం వేసాడు. బాబా తయారు చేస్తున్న స్వచ్ఛమైన శాకాహార వంటకం మాంసాహారాన్ని ఇష్టపడేవారి ప్రత్యేక విందుగా మారిపోవడం చూసి అసహ్యంతో బాలాసాహెబ్ మిరీకర్ "బాబా! మన కడుపు నింపుకోవడం కోసం, ఇతర జీవులను ఎందుకు హింసించడం?" అనడిగాడు. అప్పుడు బాబా ***"చంపేవాడే రక్షిస్తాడు - రక్షించేవాడే చంపుతాడు (జో మారీల్ తోచ్ తారీల్, జో తారీల్ తోచ్ మారీల్)"*** అన్నారు. ఈ మాటలు సృష్టి, స్థితి, లయ కారకుడు భగవంతుడే అని చెబుతున్నాయి. అంతేగాక బాబావంటి మహాత్ముల సన్నిధిలో మరణించిన లేక చంపబడ్డ జీవులకు సద్గతి ప్రాప్తిస్తుందనే నిగూఢ భావం ఇమిడివుంది.

నా ఈ అనుభవాల వివరణను ముగించే ముందు హరిసీతారాం దీక్షిత్ నాకు స్వయంగా వివరించిన రెండు అపూర్వ సంఘటనల గూర్చి చెబుతాను. దీక్షిత్ ఆర్థిక పరిస్థితి సరిగాలేనప్పుడు ఒక బాకీదారునకు 30 వేల రూపాయలు చెల్లించవలసి వచ్చింది. అప్పు తీర్చడానికి గడువు నాలుగురోజులే ఉంది. ఎలా తీర్చాలో ఏం చేయాలో తోచక దీక్షిత్ మథనపడసాగాడు. అదేరోజు అతని కలలో బాకీదారుడు కనిపించి అప్పు విషయం హెచ్చరించాడు. దీక్షిత్ అతనితో "నీవేమీ భయపడనవసరం లేదు. నాకు చమన్‌లాల్ మొదలైన మార్వాడీలెందరో తెలుసు. వారినడిగి డబ్బు తెచ్చి గడువులోపల తప్పక నీ బాకీ తీరుస్తాను" అని చెప్పాడు. తరువాత దీక్షిత్ మేల్కొని, కలలో తాను సంభాషించినదానిని గుర్తుచేసుకొని బాధపడ్డాడు. తన దైవమైన సాయిబాబా తనకు అండగా ఉండగా అవసరమైన సమయంలో అక్కరకురాని సామాన్య మానవుల సహాయం పొందాలనుకోవడం తెలివితక్కువతనమని తలచి పశ్చాత్తాపం చెంది వెంటనే బాబా పటం ముందు కూర్చొని తను చేసిన తప్పును మన్నించమని కన్నీరు కారుస్తూ ఆర్తిగా ప్రార్థించాడు. బాబా ఒక్కరే తమ భక్తులను కష్ట సమయంలో ఆదుకుంటారని నమ్మి తన బరువుబాధ్యతలన్నీ బాబాపై వేసి నిశ్చింతగా గడపసాగాడు. కానీ అప్పు

తీర్చవలసిన గడువు తేదీ దగ్గరపడినా కూడా డబ్బు అందే అవకాశమేదీ కనపడలేదు. సరిగ్గా ఆ ముందురోజు దీక్షిత్ ఆఫీసులో ఉండగా అతని సన్నిహిత స్నేహితుని కుమారుడు అతని దగ్గరకొచ్చాడు. తన వద్ద 30 వేల రూపాయలు ఉన్నాయని ఆ మొత్తాన్ని దేనిలో పెట్టుబడి పెడితే బాగుంటుందో తెలుపమని అడిగాడు. దీక్షిత్ పెట్టుబడులు వాటి సాధకబాధకాల గురించి వివరించాడు. ఒకవేళ ఆ డబ్బును తన దగ్గర మదుపు చేసే ఆలోచన గనుక ఉంటే తనను చివరగా పరిగణనలోనికి తీసుకోమనీ, అతని తండ్రితో ఉన్న సాన్నిహిత్యాన్ని ఆధారంగా చేసుకొని లాభపడాలనే ఉద్దేశ్యం తనకు ఎంతమాత్రం లేదని చెప్పాడు. ఇంకా ప్రస్తుతం తన ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఆ డబ్బును గడువులోపల బహుశా తిరిగి చెల్లించలేకపోవచ్చని కూడా నిస్సంకోచంగా చెప్పాడు. ఇదంతా విని ఆ వ్యక్తి ఏ మాత్రం భయపడకపోగా అంత నిజాయితీగా ఉన్న విషయాలు ఉన్నట్లుగా చెప్పడం వల్లే దీక్షిత్‌కు ఆ డబ్బు ఇవ్వాలని నిర్ణయించుకున్నానని చెప్పాడు. పితృసమానులకు కష్ట సమయంలో సహాయం చేయకపోవడం భావ్యం కాదన్న భావంతో ఆ డబ్బు దీక్షిత్ స్వీకరించవలసిందే అని పట్టుబట్టాడు. ఆ డబ్బు తీసుకొని దీక్షిత్ గడువులోగా అప్పును తీర్చగలిగాడు. తమను సంపూర్ణంగా నమ్మినవారిని బాబా తప్పక ఆదుకుంటారనే దానికి ఇదొక ఉదాహరణ. బాబా తమ భక్తులకు సహాయపడే కార్యంలో భాగంగా ఎంతో మంది ఆలోచనలలో, సంకల్పాలలో మార్పు తేగలరని, వేలాది రూపాయలను తమ భక్తుల కొరకు సమకూర్చిపెట్టగల సమర్థులని ఈ లీల ద్వారా నిరూపించారు.

దీక్షిత్ తమ్ముడు సదాశివ్, *బి.ఎ., ఎల్.ఎల్.బి.,* చదివి న్యాయవాద వృత్తిని చేపట్టాడు. మొదట నాగ్‌పూర్‌లోనూ తరువాత బొంబాయి, ఖాండ్వాలలో ప్రాక్టీసు చేసినా ఎక్కడా రాణించలేకపోయాడు. దీక్షిత్ బాబా ముందు చీటీలు వేసాడు. అతనిని బొంబాయికి తీసుకొని వెళ్ళవలసినదిగా బాబా ఆదేశం వచ్చింది. దాంతో అతనిని బొంబాయి తీసుకెళ్ళి తన ఆఫీసులో పెట్టుకున్నాడు. కానీ అతను అక్కడ కూడా సంతృప్తికరంగా పనిచేయలేకపోయాడు. సదాశివ్ తిరిగి వెళ్ళిపోతానని తన అన్నతో చెప్పాడు. బాబా ఆదేశం మేరకు బొంబాయి తీసుకొని వచ్చినా ఫలితమెందుకు దక్కలేదోనని దీక్షిత్ ఆశ్చర్యపోయాడు. బాబా ఆదేశం వమ్ము కావడానికి వీలులేదు.

అందువలన మరి కొద్దిరోజులలో వచ్చే దీపావళి సెలవుల వరకు సదాశివ్‌ను ఖాండ్వా తిరిగి వెళ్ళకుండా ఆగమని కోరాడు. ఈలోగా పరిస్థితులు అద్భుతమైన మలుపు తిరిగాయి. ఒకరోజు దీక్షిత్‌ను స్నేహితుడొకడు కలిసి, కచ్ రాష్ట్రంవారు తమ బ్యాంకులో పని చేసేందుకు గుజరాతీ భాషాపరిజ్ఞానమున్న నమ్మకమైన అభ్యర్థి కోసం వెతుకుతున్నారని దీక్షిత్‌కు చెప్పాడు. దీక్షిత్ తన తమ్ముని విషయం ప్రస్తావించాడు. ఆ స్నేహితుడు తనకు సదాశివ్ ఖాళీగా ఉన్న విషయం తెలియదని, అతడైతే తనకు మరీ సంతోషమని అన్నాడు. వెంటనే కచ్ రాష్ట్రం వారికి అతడిని సిఫారసు చేశాడు. నిజానికి సదాశివ్ న్యాయవాద వృత్తిలో పలుచోట్ల విఫలమైనా నెలకు 1000/- రూపాయల జీతంపై అతను బ్యాంక్ ఆఫీసర్‌గా నియమించబడ్డాడు. సదాశివ్ ఆ ఉద్యోగంలో చాలాకాలం పనిచేశాడు. దీనిని బట్టి బాబా సదాశివ్‌ను బొంబాయి వెళ్ళమని ఆదేశించడంలోని ఆంతర్యం అతనికి శాశ్వత ప్రయోజనం చేకూర్చేందుకే అని అర్థమవుతున్నది.



ఎస్.బి. నాచ్నే

# 4

## సెప్టెంబరు 13వ తేదీ, 1936- ధినా

**శాంతారాం బల్వంత్ నాచ్నే దహనూకర్,** హెడ్ గుమాస్తా, తాలూకా షెరిస్తాడార్, మేజిస్ట్రేటు కోర్టు, కుర్లా, కాయస్థప్రభు.

1923లో "సాయిలీలామాసిక్" మాసపత్రికలో నా అనుభవాలు కొన్ని ప్రచురింపబడ్డాయి. ఈ పత్రికను అన్ని తరగతుల ప్రజలు చదువుతారనే అభిప్రాయం ఉంది. కాబట్టి సామాన్య ప్రజలు విశ్వసించని, అర్థం చేసుకోలేని, వారి అవగాహనకు అందని విషయాలను చెప్పకుండా సంగ్రహంగా నా అనుభవాలను తెలియజేసాను. చాలాకాలం అయినప్పటికీ నా అనుభవాలన్నింటినీ గుర్తుకు తెచ్చుకునేందుకు ప్రయత్నించి చెప్పగలిగినన్ని పూర్తి వివరాలతో మీకు తెలియజేస్తాను. 1923 తరువాత నాకు కలిగిన అనుభవాలు కూడా చెబుతాను.

1909లో జరిగిన కొన్ని సంఘటనలకు శ్రీసాయిబాబాకు సంబంధమున్నట్లుగా అప్పట్లో అనిపించలేదు. బొంబాయిలోని బజేకర్ హాస్పిటల్‌లో మా అన్నగారికి గొంతు దగ్గర ఆపరేషన్ చేయవలసి వచ్చింది. మేమందరము ఆ ఆపరేషన్ విషయమై మథనపడుతూ ఆదుర్దాగా ఉన్నాము. అప్పుడు నేను దహనులో ఉన్నాను. మా ఇంటికొక సాధువు వచ్చి రెండు రొట్టెముక్కలుంటే పెట్టమని అడిగాడు. మేమతనిని లోనికి ఆహ్వానించి సాదరంగా కూర్చోబెట్టి భోజనం వడ్డించాము. మా వదినగారు ఆ సాధువుకు అన్ని పదార్థాలు వడ్డించింది కానీ సాధువులకు వడ్డించతగినది కాదని తలచి బెండకాయకూర వడ్డించలేదు. అయితే ఆ సాధువు ప్రత్యేకంగా ఆ కూరనే అడిగి పెట్టించుకొని తిన్నాడు. భోంచేసిన తరువాత ఆయన మమ్మల్నందరినీ ఆశీర్వదించి, హాస్పిటల్‌లో ఆపరేషన్ విజయవంతంగా జరిగిందని చెప్పాడు. అదే రోజు నా స్నేహితుడు హరిభావు మోరేశ్వర్ పాన్సే "సాయిబాబా కృపవలన అంతా చక్కగా జరుగుతుందని" అన్నాడు. నేను 'సాయిబాబా' పేరు వినడం అదే మొదటిసారి. అప్పుడు నాకు బాబా గురించి ఏమీ తెలియదు కానీ పాన్సేకు తెలుసని స్పష్టమయింది. మా నాన్నగారు సాయంత్రం బొంబాయి నుండి వచ్చి ఆపరేషన్ పూర్తయిందనీ ప్రమాదం ఏమీ లేదని తెలిపారు. ఆపరేషన్ తరువాత ఒక సాధువు వచ్చి ఆపరేషన్ జరిగిన శరీరభాగంపై తమ హస్తముంచి 'అంతా మంచే

జరుగుతుంద'ని ఆశీర్వదించి వెళ్ళిపోయాడని కూడా చెప్పారు. మా అన్నగారి ఆపరేషన్ విజయవంతమై, వారు త్వరలోనే కోలుకొని ఆరోగ్యవంతులయ్యారు.

అదే సంవత్సరం మా నాన్నగారు దాసగణు చేసిన సంకీర్తనకు హాజరయ్యారు. ఆ కీర్తనలో సాయిబాబా సాక్షాత్తు దత్తాత్రేయుని అవతారమని, అద్భుత శక్తిమంతులని, అత్యంత కరుణామూర్తులని దాసగణు మహరాజ్ వర్ణించడం జరిగింది. ఆ తరువాత మేము సాయిబాబా ఫోటోను తెచ్చుకుని ప్రతిదినం సాంబ్రాణికడ్డీలు వెలిగించి పూజించేవాళ్ళం. నేను 1912లో మొదటిసారిగా శిరిడీ వెళ్ళాను. అప్పటికి నేను రెవెన్యూ సబ్ఆర్డినేట్ పరీక్షలు వ్రాసి ఉన్నాను. ఫలితాలు వచ్చేముందు శంకర్ బాలకృష్ణ వైద్య, అచ్యుత దాతే అను ఇద్దరు స్నేహితులతో కలసి శిరిడీ బయలుదేరాను. మేము రైలులో ప్రయాణించి కోపర్గాం స్టేషనులో దిగాము. మేము సాయిబాబాను దర్శించడానికి వెళుతున్నామని తెలుసుకున్న స్టేషనుమాస్టరు, సాయిబాబా తన గారడీవిద్యలతో ప్రజలను ఆకర్షించే మోసగాడని, ఆయనకు లేని గౌరవాన్ని ఆపాదిస్తున్నారని నోటికొచ్చినట్లు వాగాడు. సాయిబాబాపై అతని ప్రేలాపన మా మనసులను ఎంతో కలతపరచింది. ఇంతటి వ్యయప్రయాసలకోర్చి మేము దర్శించబోతున్నది నిజమైన మహాత్ముడినేనా? అన్న సంశయాన్ని రేకెత్తించింది. మేము శిరిడీ చేరేటప్పటికి బాబా లెండీతోట నుండి వస్తున్నారు. బాబా నా పరిస్థితిని గమనించినట్లు ఒక్కసారిగా నావైపు చూసి నేను ఎవరో, ఏమిటో మొదలైన వివరాలు చెప్పకముందే ***"ఏమిటి? మామ్లత్‌దార్ అనుమతి తీసుకోకుండా వచ్చావా?"*** అని అడిగారు. అవునని జవాబిచ్చాను. ***"అలా ఎప్పుడూ చేయకు"*** అని మందలించి వెళ్ళిపోయారు. స్టేషనుమాస్టరు చేసిన అనాలోచిత వ్యాఖ్యలతో నా మదిలో ఏర్పడిన శంకలన్నీ బాబా మాటల వల్ల తొలగిపోయాయి. నేను సర్వజ్ఞులైన ఒక మహాత్ముని ముందు నిలబడి ఉన్నానని అర్థమయింది. మేము శిరిడీలో మూడు రోజులున్నాము. ఆ మూడురోజులలో బాబా యొక్క మహిమలు, వారు భక్తులపై కురిపిస్తున్న ప్రేమానురాగాలు స్పష్టమవడంతో వారిపై దృఢమైన భక్తి విశ్వాసాలు ఏర్పడి, అప్పటి నుండి వారిని పూజించసాగాను.

బాబా నాపై ప్రత్యేకమైన అభిమానం చూపారు. వారు స్వయంగా నా చేతిలోని ఊదీ తీసి నా నుదుటిపై పెట్టారు. ఇది అందరికీ లభించే భాగ్యం కాదు.

ఒకరోజు ఆరతి సమయానికి మసీదు చేరిన భక్తులతోపాటు నేనూ ఉన్నాను. బాబా నన్ను చూసి, వాడాకెళ్ళి భోంచేసి రమ్మన్నారు. "బాబా! ఈ రోజు ఏకాదశి" అన్నాను. సాధారణంగా నేను ఏకాదశి రోజులలో ఉపవాసం ఉండను. కానీ నా ఇద్దరి మిత్రులకు ఏకాదశి రోజు ఉపవాసముండే అలవాటుంది. నా మిత్రులు ఉపవసిస్తుండగా, నేను మాత్రం భోంచేయడం బాగుండదని నేనూ ఉపవాసముంటున్నాను. బాబాకు నేను ఉపవసించడం ఇష్టం లేదు. వైద్య, దాతేలను చూపిస్తూ ***"వీళ్ళు పిచ్చివాళ్ళు. నువ్వు వాడాకు వెళ్ళి భోజనం చేసిరా!"*** అని బాబా నాతో అన్నారు. నేను వాడాకెళ్ళి భోజనం పెట్టమని అడిగాను. వాడాలో భోజనం వడ్డించే వ్యక్తి ఏకాదశి పూటకూడా భోజనం కోసం ఆరాటపడుతున్నానని గొణుక్కొంటూ, ఆరతి అయ్యేంతవరకు భోజనం పెట్టనని చెప్పి మసీదుకు బయలుదేరాడు. నేనూ అతని వెంటే వెళ్ళాను. నన్ను చూస్తూనే ***"భోజనం చేశావా?"*** అని బాబా మళ్ళీ అడిగారు. "బాబా, ఆరతి వేళ అయింది కదా! ఆరతి అయిన తరువాత భోజనం చేస్తాను" అన్నాను. కానీ బాబా పట్టుబట్టి ***"ఆరతి ఆగుతుందిలే! నువ్వు భోజనం చేసివచ్చిన తర్వాతే మొదలవుతుంది. వెళ్ళిరా"*** అని ఆదేశించారు. భోజనశాలతను ఇక తప్పనిసరై నాకు భోజనం పెట్టాడు. నేను భోంచేసి మసీదుకు తిరిగి వచ్చాను. అదే సమయానికి 'మావ్‌సీ' (పిన్నమ్మ లేక పెద్దమ్మ) అనే భక్తురాలు బాబాకు తాంబూలం (బీడా) సమర్పించింది. బాబా ఆ తాంబూలం నాకు ఇచ్చి తినమన్నారు. ఏకాదశి రోజున తాంబూల సేవనం నిషిద్ధం కాబట్టి నేను తినడానికి సంశయించాను. కానీ బాబా, ***"తిను"***అని మళ్ళీ అన్నారు. నేను తాంబూలం వేసుకొని నమలసాగాను. ఆ తర్వాతే ఆరతి మొదలైంది. ఆరతి అయిన తరువాత బాబా నా వద్ద 4 రూపాయలు, వైద్య వద్ద 16 రూపాయలు దక్షిణ తీసుకున్నారు. దాతే బాబాకు దక్షిణ సమర్పించాలనుకోలేదు కనుక బాబా అతనిని దక్షిణ అడగలేదు. అప్పుడొక మార్వాడీ బాలిక బాబాను సమీపించి నారింజపండు కావాలని అడిగింది. దాతే తన అల్పాహారం (ఫరల్) కొరకు కొన్ని నారింజపండ్లు వాడాలో దాచుకొని, మిగతావాటిని బాబాకు సమర్పించాడు. సర్వజ్ఞులైన బాబాకు తెలియని విషయమంటూ ఏదీ ఉండదు కదా? దాతేను వాడాకెళ్ళి నారింజపండ్లు తీసుకురమ్మన్నారు. కానీ దాతే వాటిని ఫలహారం కోసం దాచుకున్నానని చెప్పి, బాబా అడిగినప్పటికీ వాటిని ఇచ్చేందుకు నిరాకరించాడు. బాబా కూడా అతణ్ణి మరి ఒత్తిడి చేయలేదు.

మేము శిరిడీలో ఉన్నప్పుడు నాపట్ల, నా కుటుంబంపట్ల బాబా ఎంతో అభిమానం చూపారు. ఒకసారి హెచ్.ఎస్. దీక్షిత్, జోగ్, దాభోల్కర్ మొదలైన భక్తులు బాబా సమక్షంలో ఉండగా, బాబా నన్ను చూపించి వాళ్ళతో ***"నేనొకసారి ఇతనింటికి భోజనానికి వెళ్ళాను. అప్పుడు ఇతడు నాకు బెండకాయ కూర వడ్డించలేదు"*** అన్నారు. ఆ మాటలు వినగానే 1909లో మా అన్నగారికి ఆపరేషన్ జరిగినప్పుడు మా ఇంటికి వచ్చిన సాధువు రూపం నా మనసులో మెదిలింది. అంటే మాకు తెలియకుండానే 1909 నుండే బాబా ఇతర సాధువుల రూపంలో మా కుటుంబాన్ని కాపాడుతూ వస్తున్నారని నాకు అర్థమైంది. దహనులో సాధువు మా ఇంటికి వచ్చినప్పుడు మా వదిన ఆయనకు బెండకాయ కూర వడ్డించని సంగతిని అక్కడున్న దీక్షిత్, జోగ్, దాభోల్కర్‌లకు ఆ తరువాత తెలియజేసాను.

చిత్రమైన విషయమేమంటే ఆ రోజు మా ఇంటికి వచ్చిన సాధువుకు, బాబాకు ఎలాంటి పోలికలు లేవు. అతను నల్లని రంగు, పొడవైన గడ్డంతోనున్న హిందూ సాధువు. అతను సాయిబాబా వలె కాక, మీ వలె (బి.వి. నరసింహస్వామి వలే) ఉన్నాడు. అంతేగాక ఆపరేషన్ జరిగిన రెండు మూడు రోజుల తరువాత దహనులో అతనిని చూసి దగ్గరగా పరిశీలించాను కూడా! కొన్ని రోజుల తరువాత అతను దహను నుండి వెళ్ళిపోయినట్లున్నాడు, నాకు మళ్ళీ కనపడలేదు. కానీ బాబా 1912లో పలికిన మాటలను బట్టి, బాహ్యంగా రూపు రేఖలలో తేడాలున్నప్పటికీ వారే ఆ రూపంలో మా ఇంటికి వచ్చారని నిర్ధారణ అయింది.

నేను వ్రాసిన డిపార్ట్‌మెంటల్ పరీక్షలో ఎటువంటి ఫలితం వస్తుందని బాబానడిగాను. ***"అల్లామాలిక్"*** అంటూ బాబా తమ వరదహస్తాన్ని నా తలపై ఉంచారు. నేను ఆ పరీక్షలో ఉత్తీర్ణుడనయ్యాను.

ఆ తొలి శిరిడీ యాత్రలో నా మనసులో బాబా పట్ల ముద్రించుకుపోయిన సద్భావనలు చెరిగిపోతాయేమో అనిపించే సంఘటన చివరిరోజు జరిగింది. ఆ రోజు ఉదయం మసీదులో బాబా కోపావేశాలతో ఊగిపోతున్నారు. వారి కనులు ఎర్రబారి ఉన్నాయి. వారి కోపానికి కారణం ఎవరికీ అంతుబట్టలేదు. 15 నిముషాల పాటు అందరినీ భయభ్రాంతులను చేశారు. బాబాను సమీపించడానికి ఎవరూ సాహసించలేదు. స్టేషను మాస్టరు చెప్పినట్లుగా వారు పిచ్చివారేమో అన్న అనుమానం

కలిగింది. కానీ కాసేపటికి వారు శాంతించి మామూలు స్థితికి వచ్చారు. మేము వారి దగ్గరకెళ్ళి సెలవు కోరాము. బాబా ఊదీ ఇచ్చి, వెళ్ళేందుకు అనుమతినిచ్చారు.

శిరిడీలో బాబా ప్రస్తావించిన విషయం అనగా- నేను అనుమతి లేకుండా ఉద్యోగానికి గైరుహాజరైన సంగతి మామ్లత్‌దారైన నా పైఅధికారి బి.వి. దేవ్‌గారు గమనించారు. కానీ దైవానుగ్రహం వలన నాకు శిక్ష పడలేదు. ఇంకోసారి ఆ విధంగా చేస్తే మాత్రం శిక్షింపబడతానని హెచ్చరించి వదిలివేసారు.

నేను అడుగకనే 1912లో బాబా మరో అనుభవాన్ని ఇచ్చారు. నేను ఠాణాజిల్లాలోని దహనులో పనిచేస్తూ ఉండేవాడిని. గ్రామప్రాంతాల నుండి నగరానికి బదిలీ కావడం అంత సులభమేమీ కాదు. 1912లో నేను శిరిడీ వెళ్ళినప్పుడు బాబా *"ఉద్యోగానికి బొంబాయి రా!"* అన్నారు. వారి ఆశీర్వాద ప్రభావం వల్ల నేను 1918లో బాంద్రాకు (బొంబాయి పరిసర ప్రాంతం) బదిలీ అయ్యాను.

ఆ తరువాత నేను తరచుగా శిరిడీ వెళ్ళి బాబాను దర్శించేవాడిని. 1913లో ఒకసారి శిరిడీ బయలుదేరుతున్నప్పుడు నా స్నేహితుడు హరిభావు ఎం. పాన్సే నన్ను కలిసాడు. అప్పుడతనికి ఆఫీసు డబ్బు దుర్వినియోగపరిచాడనే నేరంపై జైలుశిక్ష విధించి ఉన్నారు. అతను జామీనుపై బయటికి వచ్చాడు. ఆ కేసు తాలూకు అప్పీలు ఆ రోజో లేక మర్నాడో విచారణ కొస్తుంది. పాన్సే తన తరఫున బాబా సహాయాన్ని అర్థించమని నన్ను కోరాడు. "నేను ఆపదలో ఉన్నానని, ఏ నేరమూ చేయలేదని బాబాకు చెప్పు" అన్నాడు. నేను శిరిడీకి వెళ్ళి, చావడిలో కాకడ ఆరతి జరుగుతున్నప్పుడు బాబాను దర్శించాను. వారు చాలా కోపంగా ఉన్నారు. నేను చెప్పకముందే పాన్సే కేసు విషయాన్ని బాబా ప్రస్తావిస్తూ *"అతను అప్పీలుపై విడుదలవుతాడు, చింతించనవసరం లేదని చెప్పు"* అన్నారు. నేను శిరిడీ నుండి తిరిగి వచ్చిన తరువాత పాన్సేను కలిసి ఈ విషయం తెలియజేసాను. బాబా దయవలన అతనప్పటికే విడుదలైనట్లు నాకు చెప్పాడు.

అదే సంవత్సరం (1913) నేను శిరిడీలో ఉండగా, బాబా ఒకరోజు *"మనం పిచ్చివాళ్ళను నమ్మకూడదు"* అన్నారు. ఇది అందరినీ ఉద్దేశించి చెప్పినదే కానీ నాకు ప్రత్యేకంగా చెప్పినది కాదని అనుకున్నాను. కానీ అది సాధారణ హితవాక్యం కాదని, నాకు ప్రత్యేకంగా చేసిన హెచ్చరిక అని 1914లో జరిగిన ఒక సంఘటన

ద్వారా తెలిసింది. నేనప్పుడు దహనులో కోశాధికారిగా పనిచేస్తూ ఉండేవాడిని. రామకృష్ణ బల్వంత్ పాన్సే అనే వ్యక్తి అక్కడ ఉండేవాడు. అతనికి మతిస్థిమితం లేదు. ఎవరికీ ఏ హానీ తలపెట్టనందున అతనిని ఎవరూ పట్టించుకునేవారు కాదు. ఒకరోజు నా దినచర్యలో భాగంగా బాబా ఫోటోను ఇతర దేవతామూర్తులను పూజిస్తున్నాను. మా పూజగదికి సమీపంలో ఉన్న వంటింటి గుమ్మంలో ఆ పిచ్చివాడు నిలబడి ఉన్నాడు. అకస్మాత్తుగా అతను నా మీద పడి రెండు చేతులతో నా మెడ పట్టుకొని, “నీ రక్తం త్రాగుతాను” అంటూ నా గొంతు కొరికేందుకు ప్రయత్నించాడు. నాకప్పుడు ఏం చేయాలో తోచక నా చేతికి అందిన ఉద్ధరణి తీసుకొని అతని నోట్లో గుచ్చాను. దాంతో పాటుగా నా చేతివేలు అతని నోట్లోకి వెళ్ళిపోయింది. అతను నా వేలును గట్టిగా కొరకసాగాడు. నేను మరోచేత్తో నా మెడను విడిపించుకునేందుకు ప్రయత్నించసాగాను. అతని గోళ్ళు నా మెడలోనికి గుచ్చుకుపోయాయి. అంతలో మా అమ్మ పరుగున వచ్చి అతని పట్టునుండి విడిపించడానికి సహాయపడింది. అప్పటికే నేను స్పృహ కోల్పోయాను. తరువాత ఏవో చికిత్సలు చేసి నన్ను మామూలు స్థితికి తెచ్చారు. నా వేళ్ళకైన గాయాలు కూడా మానిపోయాయి. ఆ తరువాత నేను శిరిడీ వెళ్ళినప్పుడు అక్కడున్న అణ్ణాచించణీకర్ అను భక్తునికి బాబా నన్ను చూపించి ***“అణ్ణా, నేను ఒక్క క్షణం ఆలస్యం చేసినా ఇతను చనిపోయి ఉండేవాడు. ఆ పిచ్చివాడు ఇతని గొంతు నులిమేసి ఉండేవాడు. అతని బారి నుండి నేను విడిపించాను. ఏం చేస్తాం? నా బిడ్డలను నేను కాపాడకపోతే మరెవరు కాపాడతారు?”*** అన్నారు.

31.3.1915న మాకు ఒక భయానక సంఘటన ఎదురయ్యింది. నేను, శాంతారాం మోరేశ్వర్ పాన్సే, మరికొందరం ఎడ్లబండిలో ఒక దట్టమైన అడవిగుండా రాత్రి వేళ ప్రయాణిస్తూ ‘రాన్‌షెట్ కనుమ’ వద్దకు వచ్చాము. ఆ ప్రదేశంలో పెద్దపులుల బెడద ఎక్కువని చెబుతారు. అకస్మాత్తుగా ఒకచోట భయంతో ఎద్దులు వెనుకకు నడవసాగాయి. అదృష్టవశాత్తు అవి బండిని ప్రక్కకు లాగలేదు. ఆ ఇరుకు దారిలో బండి ఏమాత్రం ప్రక్కకు జరిగినా అక్కడున్న అగాధమైన లోయలో పడి ఎడ్లబండితో సహా మేమందరమూ నామరూపాలు లేకుండా పోయేవాళ్ళం. అంతలో శాంతారాం ఎదురుగా పొంచి ఉన్న ప్రమాదాన్ని చూపించాడు. మా బండికి కాస్త

దూరంలో ఒక పెద్దపులి పడుకొని మా వైపే చూస్తూ ఉంది. చీకటిలో దాని కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. బండి లోయలో పడిపోకుండా, చక్రాలు వెనక్కి వెళ్ళకుండా అడ్డంగా పెద్ద రాయిగానీ కర్రగానీ పెట్టేందుకని శాంతారాం పాన్సే క్రిందకు దిగదలచి నన్ను బండి పగ్గాలు పట్టుకోమన్నాడు. నేను పగ్గాలు పట్టుకొని ఎలుగెత్తి "జై సాయిబాబా! పరుగున వచ్చి మమ్మల్ని కాపాడు" అని అరిచాను. మిగిలిన వారు కూడా పెద్దగా అరిచారు. దానితో పులి భయపడి మా బండి ప్రక్కనుండి వెళ్ళిపోయింది. బాబాపై నాకున్న నమ్మకమే నాకు ధైర్యాన్నిచ్చి ఆ సమయంలో బాబాను ఎలుగెత్తి పిలిచేలా చేసి ఆ ప్రమాదం నుండి బయటపడేసింది.

పై సంఘటన జరిగిన తరువాత అదే సంవత్సరం (1915లో) శిరిడీ బయలుదేరాను. స్టేషనులో వి.ఎస్. సామంత్ అను భక్తుడు ఒక టెంకాయ, రెండణాలు ఇచ్చి, ఆ రెండణాలతో కలకండ కొని, వాటిని బాబాకు సమర్పించమని కోరాడు. నేను శిరిడీ చేరి బాబాను దర్శించి టెంకాయ సమర్పించాను. కానీ సామంత్ ఇచ్చిన రెండణాల విషయం పూర్తిగా మర్చిపోయాను. నేను ఇంటికి వెళ్ళడానికి బాబా అనుమతి కోరినప్పుడు ***"అలాగే చితలీ మీదుగా వెళ్ళు. కానీ ఈ పేద బ్రాహ్మణుడి రెండణాలు నీ దగ్గరే ఎందుకు పెట్టుకున్నావు? (మాఝే గరీబ్ బ్రాహ్మణాచే దోన్ ఆణే కా ఠేవ్‌తోస్)"*** అని బాబా అడిగారు. బాబా అన్న మాటతో నాకు ఆ సంగతి గుర్తుకొచ్చి సామంత్ ఇచ్చిన రెండణాలు సమర్పించాను. నేను తిరిగి అనుమతి కొరకు ప్రార్థించినప్పుడు ***"ఇప్పుడు నీవు వెళ్ళవచ్చు. ఏదైనా పనిచేస్తానని ఎవరి దగ్గరైనా ఒప్పుకుంటే దానిని బాధ్యతాయుతంగా నిర్వహించు. లేదా ఒప్పుకోకు"*** అని నవ్వుతూ హితవు పలికారు.

ఒకసారి నేను శిరిడీలో ఉన్నప్పుడు శంకరరావు బాలకృష్ణవైద్య వచ్చాడు. బాబా అతనిని 16 రూపాయలు దక్షిణ అడిగారు. శంకరరావు తన వద్ద డబ్బు లేదని చెప్పాడు. కాసేపాగి మళ్ళీ శంకరరావును 32 రూపాయల దక్షిణ అడిగారు. శంకరరావు మళ్ళీ అదే సమాధానమిచ్చాడు. మరి కాసేపాగి ఈసారి 64 రూపాయల దక్షిణ అడిగారు. "బాబా! మేము ధనవంతులము కాదు. మా దగ్గర అంతంత పెద్దమొత్తాలెలా ఉంటాయి?" అన్నాము. ***"అయితే వసూలు చేసి ఇవ్వండి"*** అన్నారు బాబా. ఈ మాటలు బాబా త్రికాలజ్ఞతకు అద్దం పడతాయని మాకు తరువాత

తెలిసింది. ఎలాగంటే కొన్ని రోజుల తరువాత బాబా అస్వస్థతకు గురయ్యారు. అప్పుడు నామసప్తాహం జరిగింది. వచ్చినవారందరికీ పెద్ద ఎత్తున అన్నసంతర్పణ జరిపేందుకు చందాలు సేకరించాల్సి వచ్చింది. దాభోళ్కర్ ఆదేశానుసారం నేను, శంకరరావు చందాలు వసూలు చేశాము. వసూలైన మొత్తం సరిగ్గా 64 రూపాయలు మాత్రమే. ఆ డబ్బు శిరిడీ పంపాము.

ప్లేగు జ్వరంతో బాధపడుతున్న రావూజీ సఖారాం వైద్య కుమారుడు 'మోరు'[1] కొరకు నేను బాబా ఊదీని ఇచ్చాను. ఊదీ మహిమతో జ్వరం తగ్గింది. తలాఠీగా పనిచేసే పరశురాం అప్పాజీ నాచ్నే ఒక దీర్ఘవ్యాధితో బాధపడేవాడు. కాస్త వైద్య పరిజ్ఞానమున్న మా నాన్న, మరికొందరు వైద్యులు చేసిన చికిత్సలు విఫలమయ్యాయి. కానీ బాబా పటం ముందు సాంబ్రాణికడ్డీలు, అఖండ నేతి దీపం వెలిగించి ప్రార్థించడం ద్వారా అతని వ్యాధి నయమైంది.

1915లో నేను ఎస్.బి. వైద్యతో కలిసి బాబాను దర్శించాను. అతను బాబాకు వెండి పాదుకలు సమర్పించాడు. వాటిని బాబా చేతుల మీదుగా తీసుకొని పూజించుకోవాలని అతని ఉద్దేశ్యం. కానీ బాబా వాటిని నాకు బహుకరించారు. నేను వాటిని వైద్యకు ఇవ్వడమే సరైనదనిపించి అతనికి ఇచ్చేసాను. మాధవరావు దేశ్‌పాండే కల్పించుకోవడంతో పాదుకలు తిరిగి నా వద్దకే వచ్చాయి. వైద్య వద్ద మరొక జత పాదుకలు ఉన్నాయి. బాబా స్వయంగా ఆ పాదుకలు అడిగి తీసుకుని వాటిని కూడా నాకే బహుకరించి ***"వీటిని నీ వద్ద ఉంచుకొని పూజించుకో"*** అన్నారు. నేను "బాబా, ఇవి వైద్య చేయించినవి. అతనికే చెందాలి కదా?" అనడిగాను. అందుకు బాబా ***"ప్రస్తుతానికి నీవే ఉంచుకో. కావాలంటే తరువాత అతనికి ఇవ్వవచ్చు"*** అన్నారు. నేను వాటిని కొద్ది రోజులు నా దగ్గరే ఉంచుకొని తరువాత ఒక జత పాదుకలు వైద్యకు ఇచ్చాను.

బాబా తమ భక్తుల ఛాందస భావాలను నిరసించేవారు. అందరినీ సమదృష్టితో చూసేవారనీ, బాబా చెంత అందరికీ ఒకే న్యాయమని తెలియజేసే

---

*1. Devotees experiences of Sri Sai Baba ప్రథమ ముద్రణలో రావూజీ కుమారుడు 'మోరు' అని ప్రచురితమయింది. తదుపరి ముద్రణలలో రావూజీ కుమార్తె 'మోరు'గా ముద్రితమయింది. శ్రీసాయిభక్త అనుభవ సంహితలో Devotees experiences of Sri Sai Baba ప్రథమ ముద్రణను ప్రామాణికంగా తీసుకొన్నాము.*

సంఘటన ఒకటి ఉదహరిస్తాను. 1915 మే నెలలో మా అత్తగారు తదితరులతో కలిసి నేను శిరిడీ వెళ్ళాను. మేమప్పుడు సాఠేవాడాలో (ఆ తరువాత కాలంలో అది చేతులు మారి నవాల్కర్ వాడా అయింది) బసచేశాం. మేమున్న వాడాలోనే దాదాకేళ్కర్ అను పూర్వాచారపరాయణుడైన బ్రాహ్మణుడు ఉండేవాడు. అతనికి ఉల్లిపాయలంటే అసహ్యం. ఒకరోజు ఉదయం మా అత్తగారు వంటకు ఉల్లిపాయలు తరుగుతూ ఉంది. అది చూసి కేళ్కర్ ఆమెను దూషించాడు. మా అత్తగారు ఎంతో నొచ్చుకున్నారు. అలా జరిగిన కొన్ని గంటల తరువాత కేళ్కర్ మనుమరాలు తీవ్రమైన కంటినొప్పితో బాధపడసాగింది. కేళ్కర్ బాబా దగ్గరకెళ్ళి తన మనుమరాలి బాధను తగ్గించమని వేడుకున్నాడు. *"ఉల్లిపాయలతో కాపడం పెట్టు"* అని బాబా చెప్పారు. కేళ్కర్, "ఉల్లిపాయలను ఎక్కడ నుండి తెచ్చేది బాబా?" అనడిగాడు. బాబా దగ్గర ఎప్పుడూ ఉల్లిపాయలుండేవి. అందువల్ల బాబానే తనకు ఉల్లిపాయలు ఇస్తారనే ఉద్దేశ్యంతోనే కేళ్కర్ పైవిధంగా అడిగి ఉండవచ్చు. కానీ బాబా ఆంతర్యం మరో విధంగా ఉంది. మా అత్తగారిని చూపిస్తూ *"ఈ తల్లినడుగు ఇస్తుంది"* అన్నారు. తన మనస్సులో అణచిపెట్టుకున్న బాధను సరైన రీతిలో పోగొట్టుకునే అవకాశాన్ని (చెడుకు మంచి చేయడం ద్వారా) బాబా మా అత్తగారికి కల్పించారు. తాను ఆ ఉదయమే వంటకు ఉల్లిపాయలు తరుగుతుంటే దాదా తనను దూషించాడని తనకు ఇవ్వాలని లేకపోయినా బాబా ఇవ్వమంటే ఇస్తానని చెప్పింది. బాబా ఆదేశించడంతో మా అత్తగారు కేళ్కర్‌కు ఉల్లిపాయలిచ్చింది.

మాకు సంతానం లేదు. పుట్టిన బిడ్డలు పురిటిలోనే చనిపోతూవచ్చారు. అందువల్ల మాకు సంతానం ప్రసాదించమని మా అత్తగారు బాబాను ప్రార్థించింది. మా అత్తగారి అభ్యర్థనపై మాధవరావు దేశ్‌పాండే (షామా) నా భార్యను బాబా వద్దకు తీసుకు వెళ్ళి, ఒక టెంకాయను ఆమె చీరచెరగులో వేయమని బాబాను అభ్యర్థించాడు. నా భార్యకు టెంకాయ ఇస్తున్నప్పుడు బాబా కళ్ళు చెమర్చాయి. తరువాత బాబా నన్ను దగ్గర కూర్చోపెట్టుకుని తమ పాదాలు పట్టమన్నారు. నేను బాబా పాదాలు పడుతుండగా, వారు తమ చేతితో నా వీపుని నిమిరారు. బాబా నాపై చూపుతున్న కరుణకు నేను వారికి కృతజ్ఞతలు తెలుపుతూ, పిచ్చివాడు నన్ను చంపడానికి వచ్చినప్పుడు బాబా ఫోటో నా దగ్గర ఉన్నందువల్లే నేను రక్షింపబడ్డానని వారితో అన్నాను. బాబా నా మాటలు విని *"భగవంతుడే యజమాని (అల్లా మాలిక్‌హై) అన్నీ వారి ఆజ్ఞ ప్రకారమే జరుగుతాయి"* అన్నారు. తరువాత మేమిద్దరం ఆలింగనం చేసుకున్నాము.

బాబా తమ భక్తులందరిపట్ల ఎంతో ఆదరణ చూపేవారు. అంతేగాక ఒక భక్తుడు తమకు చేసే సేవలో మరొకరు జోక్యం చేసుకోవడం వారికి బొత్తిగా నచ్చేది కాదు. ఇప్పుడు నేను చెప్పబోయే సంఘటనే దానికి నిదర్శనం. ఒకరోజు బాబా తమకు కడుపునొప్పిగా ఉందని చెప్పారు. ఇంతలో మావ్‌సిబాయి ఒక ఇటుకను ఎర్రగా కాల్చి బాబా పొత్తికడుపుపై (కఫ్నీ మీద) పెట్టింది. పదినిముషాలు దానినలాగే ఉంచి తీసివేసింది. బాబా కాళ్ళు మర్దన చేస్తున్న నేను ఆమె సేవను చూసి అదొక క్రూరమైన చికిత్సగా అనుకున్నాను. తరువాత ఆమె ఇటుకను తీసి తన శక్తినంతా ఉపయోగించి బాబా కడుపును నొక్కసాగింది. అది చూసి నేను ఓర్చుకోలేక "కాస్త నెమ్మదిగా ఒత్తు, బాబాకు బాధ కలుగుతుంది" అన్నాను. బాబా వెంటనే ***"ఫో అవతలకి"*** అని నాతో గట్టిగా అన్నారు. నేను అక్కడ నుండి వెళ్ళిపోయాను.

ఆ రాత్రి 8 గంటలకు నేను మసీదుకు వెళ్ళి నాకు ఉపదేశమివ్వమని బాబాను ప్రార్థిస్తూ "ఏ జపం చేసుకోమంటారు?" అనడిగాను. వారు వెంటనే, ***"దేవపూర్ (కోపర్‌గాం నుండి 20 మైళ్ళ దూరంలో ఉన్న గ్రామం) వెళ్ళి, అక్కడ నీ పూర్వీకులు పూజించిన శిలలను పూజించుకో"*** అన్నారు. దహనుకు వెళ్ళిన తరువాత బాబా మాటలలోని అర్థం మా నాన్నగారిని అడిగాను. దేవపూర్‌లోని విగ్రహాలను, మా పూర్వీకులు పూజించిన విధానాన్ని మా నాన్నగారు ఇలా చెప్పారు.

ఐదుతరాల మునుపు, మా పూర్వీకుడైన బాబాప్రయాగ్‌కు 60 సంవత్సరాల వయస్సు వరకు సంతానం లేదు. బాబాభగవత్ అను మహాత్ముని అనుగ్రహంతో కొంతమందికి సంతానం కలిగిందని అతనికి తెలిసింది. బాబాభగవత్ ఏకనాథ్ మహరాజ్‌గారి శిష్యుడు. వారు చాలా అరుదుగా త్రయంబక్‌లోని నివృత్తినాథ్ ఆలయానికి వస్తూవుండేవారు. అలా వచ్చినప్పుడు బాబాప్రయాగ్ సంతానం కొరకు వారిని దర్శించగా, ఆయన ఆశీర్వదించి ఒక టెంకాయను ప్రసాదించారు. ఆ తరువాత బాబాప్రయాగ్‌కు అరవై ఒక్క సంవత్సరాల వయసులో మగపిల్లవాడు పుట్టాడు. ఆ బాబుకి కృష్ణారావ్ అని నామకరణం చేశారు. ఏడాది వయసున్న ఆ పిల్లవాడిని బాబాభగవత్ దేవపూర్ తీసుకెళ్ళి జ్ఞానేశ్వరి వ్రాతప్రతిని ఇచ్చి ఆశీర్వదించి పంపారు. ఆ వ్రాతప్రతి ఎంత మహిమగలదంటే దానిని బయటికి తీసినప్పుడల్లా శుభసంకేతాలు కనిపిస్తాయి! (ఆ వ్రాతప్రతిని

మా ముందుంచారు. అదే సమయంలో వీధిలో నుండి సంగీతం వినిపించింది). అప్పటి నుండి మా పూర్వీకులు బాబాభగవత్ గురుపరంపరలోని వారిని దర్శించి వారి వద్ద ఉపదేశం పొందేవారు. బాబా ఇచ్చిన ఆదేశం వల్ల అప్పటివరకూ తెలియని మా పూర్వీకుల వృత్తాంతం నాకు మా తండ్రి ద్వారా తెలిసింది.

1916లో బాబా అనుగ్రహంతో నేను జలగండం నుండి రక్షింపబడ్డాను. అప్పుడు దహనులో ప్లేగు వ్యాపించి ఉంది. నేను ఆఫీసుకు వెళ్ళేందుకు ఒక చిన్న సముద్రపుపాయను దాటి వెళ్ళవలసి వచ్చేది. ఒకరోజు ఆఫీసు నుండి ఆలస్యంగా బయలుదేరాను. అప్పుడు పాయను దాటడానికి పడవ ఏదీ లేదు. ఒక పిల్లవాడి సాయంతో దోనెలో సముద్రపుపాయను దాటుతున్నాను. నేను ఒకవైపుకు కొద్దిగా వాలినందున దోనె తలక్రిందులైంది. మేము నీటిలో పడిపోయాము. నన్ను కాపాడమని ఆర్తిగా బాబాను ప్రార్థించాను. దోనె నడిపే పిల్లవాడు గజ ఈతగాడు, చాలా చురుకైనవాడు. నేను నీటిలో మునిగిపోతున్న సమయంలో దూరంగా నిలిచి ఉన్న ఓడ నుండి నీటిపై తేలుతున్న త్రాడును నావైపు విసిరి పట్టుకోమన్నాడు. ఆ పిల్లవాడి అరుపులు విని ఓడలోని వాళ్ళు ఒక పడవను పంపి మమ్మల్ని రక్షించారు.

బాబా నా భార్యకు టెంకాయ ప్రసాదించి ఆశీర్వదించిన తరువాత 1919లో మాకొక మగబిడ్డ కలిగాడు. వాడు మూలానక్షత్రంలో పుట్టాడు. మేము వాడికి కాలూరాం అని పేరు పెట్టాము. వాడు 8 సం॥లు మాత్రమే జీవించాడు. కాలూరాంకి మూడవ సంవత్సరం (1921లో) రాగానే మూలానక్షత్ర ప్రభావం వల్ల పిల్లవాడి తల్లి (నా మొదటి భార్య) చనిపోయింది. నా భార్య చనిపోతుందని తెలిసే టెంకాయ ప్రసాదించేటప్పుడు బాబా కన్నీరు కార్చారని మాకు అర్థమైంది. కానీ ప్రజ్ఞావంతుడు, యోగాంశ కలిగిన బాలునికి జన్మనిచ్చినందుకు నా భార్యావియోగ బాధ కాస్త ఉపశమించింది.

కాలూరాం మూడు సంవత్సరాల వయస్సప్పుడే "రామ్ హరిరామ్" మంత్రాన్ని జపించడం మొదలుపెట్టాడు. "హరి విజయం"లోని విషయాలు కథలుగా చెప్పడం ప్రారంభించాడు. మా ప్రక్క ఇంట్లో హెగ్డే అను భక్తుడు, పండితుడు ఉండేవాడు. అతనింట్లో ప్రతిదినం "హరి విజయం" పారాయణ చేయబడేది. కాలూరాం ప్రజ్ఞావంతుడేకాక తన గతజన్మల స్మృతులను పూసగ్రుచ్చినట్లు చెప్పేవాడు. కాలూరాంతో పరిచయం ఉన్న వారందరూ వాడి ప్రతిభను చూసి

సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యేవారు. హెగ్డే, కాలూరాంను క్షుణ్ణంగా పరిశీలించి అతను శ్రీకృష్ణుని చెలికాని అవతారంగా ప్రకటించాడు. అతని భావనకు తగినట్లు కాలూరాం తను శ్రీకృష్ణునితో కలిసి ఆడిన ఆటలు, చేసిన వెన్న దొంగతనాలు కళ్ళకు కట్టినట్టు వర్ణించేవాడు. "కృష్ణుడు నన్నెప్పుడూ ఏడిపించేవాడు. అందుకు నేనొకసారి అతని తొడను గిల్లాను" అని చెప్పేవాడు. "ఒకసారి కృష్ణుడు నా వీపుపై ఎక్కి ఉట్టిపై నున్న పెరుగుకుండను నాపై బోర్లించాడు. ఇంతలో ఆ ఇంటి గోపిక వచ్చింది." ఇలా కృష్ణలీలలు వర్ణిస్తూ ఉండేవాడు. వీడి మాటలు విన్న తరువాత హెగ్డే చెప్పిన మాటలు నిజమనే అనిపించేది. హెగ్డే ఇంటిలో ఆ రోజు జరిగే పారాయణలో వచ్చే విషయాలన్నీ ముందే వివరించేవాడు. ఒకరోజు వాడు తలకు ముసుగు వేసుకొని ఒక మూల కూర్చొని ఉండడం గమనించాను. కాలూ ధ్యానమగ్నుడైనట్లు నిశ్చలంగా కూర్చొని ఉన్నాడు. వాడి కళ్ళను నాకు కనిపించనివ్వకుండా తలపై వేసుకున్న ముసుగు కప్పివేసింది. నేను వెళ్ళి ముసుగు తొలగించాను. వాడి కనుపాపలు పైకి తిరిగి ఉన్నాయి. ముసుగెందుకేసుకున్నావని అడిగాను. "నేను ఎప్పుడూ ఇలాగే చేస్తుంటాను" అన్నాడు. ఎందుకు ఇటువంటి సాధన చేస్తున్నావని అడిగాను. అందుకు వాడు నవ్వాడు. వాడి వయస్సుకి మించిన పరిణతికి నేను ఆశ్చర్యపోయాను. ఒకసారి "సందేష్" మాసపత్రిక తెమ్మన్నాడు. నేను తెచ్చి ఇచ్చాను. దాని ముఖచిత్రం శ్రీకృష్ణునిది. శ్రీకృష్ణుని చుట్టూ "ఓం" (ప్రణవం) అని ముద్రించబడి ఆకర్షణీయంగా ఉంది. కాలూరాం దానిని కత్తిరించి గోడకు అంటించాడు. దానిలో ఒక ప్రకటన ఉంది. "హిజ్ మాస్టర్స్ వాయిస్" (తన యజమాని స్వరం) గ్రామ్‌ఫోన్ రికార్డుల ప్రకటన అది. ఆ ప్రకటనలో గ్రామ్‌ఫోన్ ముందు కూర్చొని ఉన్న కుక్క బొమ్మ ముద్రించబడి ఉంది. అప్పుడు మా ఇద్దరి మధ్య సంభాషణ ఇలా జరిగింది:

కాలూరాం : ఇదేమిటి?

నేను : గ్రామ్‌ఫోన్ రికార్డుల వారిచ్చిన ప్రకటన.

కాలూరాం : ఇది శ్రీకృష్ణుడిచ్చిన ప్రత్యేక సందేశం

నేను : ఏమిటా ప్రత్యేక సందేశం?

కాలూరాం : కుక్క ఏం వింటుంది?

నేను : గ్రామ్‌ఫోన్ నుండి వచ్చే సంగీతాన్ని.

కాలూరాం : కుక్క తన యజమాని స్వరం వింటుంది. దాన్ని చూడు. అది నిశ్చలంగా కూర్చొని ఎంత శ్రద్ధగా వింటుందో! మనం కూడా నిశ్చలంగా ఉండాలి. చూడు నేను ఎలా కూర్చుని ఉన్నానో, నువ్వు కూడా అలాగే కూర్చొని ఏకాగ్రతతో వినాలి. అప్పుడు నీకు బాబా స్వరం వినిపిస్తుంది

నేను : నీకు బాబా స్వరం ఎలా తెలుసు?

కాలూరాం : నాకు తెలుసు. కానీ నీకు చెప్పను. అనుభవం ద్వారా నువ్వే తెలుసుకో.

కాలూరాం "రామ్ హరిరామ్" మంత్రాన్ని జపించడమేగాక కాగితాలపై కూడా వ్రాస్తూ ఉండేవాడు. ఆ కాగితాలు నా దగ్గర ఎన్నో ఉండేవి. ఒకసారి శ్రీఉపాసనీబాబా అంధేరి వచ్చినప్పుడు తమకు అవి కావాలన్నారు. వారికి ఆ కాగితాలన్నీ ఇచ్చాను. 1924లో గాడ్గీబాబా వంటి మహాత్ములెందరో కాలురాంను చూడటానికి మా ఇంటికి వచ్చారు. 1926లో కాలూరాంకు శరీరమంతా నీరు చేరి తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. మేము వాడికి బాబా ఊదీ మాత్రమే ఇచ్చాము. కానీ వ్యాధి కొంతకాలం కొనసాగింది. వైష్ణవులకు పర్వదినమైన ఒక కార్తీక శుద్ధ ఏకాదశినాడు (వేలాది యాత్రికులు పండరిపురంలోను, ఇతర వైష్ణవ క్షేత్రాలలోను ఎంతో భక్తిపూర్వకంగా జరుపుకునే పర్వదినం) కాలూరాంకు అంతిమఘడియలు సమీపించాయి. నన్ను తన ప్రక్కకు పిలిచి జ్ఞానేశ్వరి తెమ్మన్నాడు. అందులో 13వ అధ్యాయాన్ని తెరిచాడు. అటువంటి బిడ్డను పోగొట్టుకుంటున్నందుకు నాకు దుఃఖం ఆగలేదు. కాలూరాం నన్ను ఓదార్చుతూ "ఇందులో దుఃఖించేందుకు ఏముంది? ఈ 13వ అధ్యాయాన్ని పెద్దగా చదువు. నేను ఈ రోజు వెళ్ళిపోతున్నాను" అన్నాడు. దుఃఖభారంతో నేను చదవలేకపోయాను. అప్పుడు ఆ పుస్తకాన్ని తనముందుంచుకొని తుది శ్వాస విడిచాడు. అట్లా పసితనంలోనే చనిపోవడం ఎంతో విచారకరమైనప్పటికీ కాలూరాం ఉత్తమ జీవితానికి కార్తీక ఏకాదశి నాడు యుక్తమైన ముగింపు లభించింది. ఆ విషయం బాబాకు ముందే తెలుసు కాబట్టే 1918లో మాకు టెంకాయ ప్రసాదిస్తూ కన్నీరు కార్చారంటే అందులో ఆశ్చర్యమేముంది?

బాబా అనుగ్రహం వల్ల నా వంశం నిలబడింది. 1922లో అంటే కాలూరాం తల్లి చనిపోయిన మరుసటి సంవత్సరం నా తల్లిదండ్రులు నాకు రెండవ

వివాహం చేయడానికి సంబంధాలు వెతకసాగారు. రెండు సంబంధాలు వచ్చాయి. ఒకటి ధనవంతులది, రెండవది పేదవారిది. మొదటి అమ్మాయికి 600 రూపాయల వరకు కట్నకానుకలు ఇవ్వడానికి సిద్ధపడ్డారు. మా నాన్న ఆ సంబంధాన్నే ఖాయం చేయదలచాడు. కానీ నాకు ఇష్టం లేదు. మా అమ్మకు సాయిబాబా కలలో కనిపించి ఆ ధనవంతుల సంబంధం చేసుకోవద్దని చెప్పి అంతర్ధానమయ్యారు. ఆ కలలోనే మా అమ్మ మరో అమ్మాయిని చూసింది. తరువాత ఒక పేద అమ్మాయిని నాకిచ్చి పెండ్లి చేయాలని తలచి ఆ అమ్మాయి పినతండ్రి మమ్మల్ని సంప్రదించాడు. మా అమ్మ వెళ్ళి అమ్మాయిని చూసింది. చిత్రంగా మా అమ్మ కలలో చూసింది ఆ అమ్మాయినే! ఆ అమ్మాయితోనే నా వివాహం 1922లో జరిపించారు. మాకు చాలామంది సంతానం కలిగారు. బాబా ఆశీస్సులవల్ల వాళ్ళందరూ క్షేమంగా ఉన్నారు. 'బాబా ఆశీస్సులు' అని నేను మాటవరుసకి చెప్పడంలేదు. బాబా నన్ను రక్షించిన విధంగానే నా పిల్లలను కూడా ఎలా రక్షించారో తెలియజేస్తాను.

1926లో నా కుమారుడు సాయినాథ్ ఉరఫ్ హరేశ్వర్‌కు ఎనిమిది, తొమ్మిది నెలల వయస్సుంటుంది. కాలూరాం టపాసులు, బెంగాల్ అగ్గిపుల్లలు తెచ్చుకున్నాడు. వాటిని పిల్లలందరూ కలిసి కాల్చుకుంటున్నారు. ఒక పిల్లవాడు కాల్చిన అగ్గిపుల్లొకటి విసిరేసాడు. అది సాయినాథ్‌పై పడి వాడికి తొడిగిన బట్టలు అంటుకొని రాజుకోసాగాయి. పిల్లలు ఆ ప్రమాదాన్ని గమనించకుండా ఆడుకుంటున్నారు. నా భార్య క్రింద వాకిట్లో ఏదో పనిలో ఉంది. అకస్మాత్తుగా ఒక ఫకీరు ఆమె ముందు ప్రత్యక్షమై చేతితో మిద్దెను చూపిస్తూ "అక్కడ ఏం జరుగుతుందో చూడు" అన్నాడు. ఆమె పరుగున మిద్దెపైకి వెళ్ళి సాయినాథ్ బట్టలు అంటుకొని ఉండటం చూసింది. వెంటనే సమయస్ఫూర్తితో మంటలు వ్యాపించకుండా బట్టలను పట్టుకొని చేతులతో నలిపి మంటలను ఆర్పివేసింది. చిత్రమేమంటే ఒంటి మీదున్న గుడ్డలు ముప్పాతిక భాగం కాలిపోయినా ఒళ్ళు కాలిన ఛాయలేమీ కనిపించలేదు. సరియైన సమయంలో ఫకీరు వచ్చి హెచ్చరించబట్టి పిల్లవాడు రక్షింపబడ్డాడు. మంటలను ఆర్పివేసిన తరువాత నా భార్య బయటకు వచ్చి చూస్తే ఫకీరు జాడే లేదు! ఈ ఫకీరు ఎవరై ఉంటారు? ప్రమాదం జరుగుతున్న విషయం ఫకీరుకు ఎలా తెలిసింది? జాగరూకతతో నా పిల్లలను గమనిస్తూ చివరిక్షణంలో తల్లిని పంపి వారిని కాపాడవలసిన అవసరం ఆ ఫకీరుకు ఏముంది?

1928లో సాయినాథ్‌కు రెండు సంవత్సరాల వయస్సప్పుడు ఒక ప్రమాదం జరిగింది. ఆటలలో పరుగెత్తుతూ డాబా మెట్లపై నుండి పడిపోయాడు. క్రింద పెద్ద కుప్పగా చెత్త పేరుకొని ఉంది. నేను ఆదుర్దాగా క్రిందికి వెళ్ళి చూస్తే పిల్లవాడు క్షేమంగా ఎటువంటి గాయాలు లేకుండా నిలుచొని ఉన్నాడు. “భయపడకండి. క్రింద పడకుండా బాబా నన్ను పట్టుకున్నారు” అని పిల్లవాడు చెప్పాడు.

1932లో సాయినాథ్ తన తమ్ముడు వాసుదేవ్‌కు ఒక ఉంగరం ఇచ్చాడు. వాడు దానిని నోట్లో వేసుకున్నాడు. అది వాడి గొంతులో ఇరుక్కుపోయింది. సుమారు గంటసేపు ఇంట్లోని వారందరూ ఆందోళనతో దానిని బయటికి కక్కించడానికి ఏవేవో ప్రయత్నాలు చేశారు. కానీ అది బయటికి రాలేదు. చివరగా వాడి నోట్లో కాస్త బాబా ఊదీ వేసాను. తరువాత గొంతులోనికి నా వేలు చొప్పించాను. ఉంగరం వ్రేలికి తగిలింది. దానిని బయటికి తీయగలిగాను.

1934లో వాసుదేవ్‌కు పొంగు (మీజిల్స్) పోసింది, దానికి తోడు న్యుమోనియా వచ్చి, ఛాతిపై పుండు లేచింది. వాడు క్రమంగా క్షీణించిపోసాగాడు. డాక్టరు ఆ పుండును ఆపరేషన్ చేసి తొలగించాలనుకున్నాడు కానీ పిల్లవాడు బలహీనంగా ఉన్నందువల్ల ఆపరేషన్ చేసేందుకు వెనుకాడాడు. నేను పుండుపై ఆయింట్‌మెంట్ రాసాను. అది పగిలింది. డాక్టరు ఏమీ చేయలేకపోయాడు. నేను ఈ డాక్టరును గాక నా డాక్టరైన శ్రీసాయిబాబానే నమ్మదలిచాను. బాబాను ధ్యానించి పుండుపై ఊదీ రాసాను. అప్పుడు డిప్యూటీ కలెక్టరు శ్రీవసంతరావు మాధవ్ జాథవ్, నేను చేస్తున్నదంతా గమనించి విస్తుపోయాడు. “నువ్వు చేస్తున్న ఈ ఊదీ చికిత్సవల్ల పుండు మానుతుందని అనుకుంటున్నావా?” అని అడిగాడు. తప్పకుండా మానిపోతుందని చెప్పాను. “ఎన్ని రోజులలో?” అని ప్రశ్నించాడు. 24 గంటలలో అని చెప్పాను. ఆ రోజు రాత్రి బాబా నా కలలో కనపడి ***“24 గంటలని ఎందుకు చెప్పావు? వెంటనే అని చెప్పి ఉండాల్సింది”*** అన్నారు. నా పొరపాటుకు క్షమించమని బాబాను కలలోనే వేడుకున్నాను. మరుసటిరోజుకి పుండు మానిపోయింది. జాదవ్ ఆశ్చర్యపోయాడు. న్యుమోనియాతో బాధపడుతున్న తన 4½ సంవత్సరాల కుమారుని కొరకు బాబా ఊదీ, ఆశీస్సులు కావాలని అడిగాడు. నేను జాదవ్‌కు బాబా ఊదీ ఇచ్చిన సమయానికి వాడు 6 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. వాడికి చికిత్స చేస్తున్న డాక్టరు ఆ జ్వరం 9 రోజులకు గానీ తగ్గదని చెప్పాడట. కానీ

ఊదీ వాడిన మరుసటిరోజుకల్లా జ్వరం తగ్గిపోయింది. జాదవ్ కృతజ్ఞతాపూర్వకంగా ఏడు రూపాయలిచ్చి శ్రీసాయిబాబా సంస్థాన్‌కు పంపమని కోరాడు.

కిందటి ఏడాది (1935లో) ఒకరోజు మా ఇంట్లో స్టవ్‌పై పాలు మరిగిస్తున్నారు. నా రెండేళ్ళ కుమారుడు ఆనంద్ పరుగెత్తుకుంటూ వచ్చి కాళ్ళకు కర్ర తట్టుకొని స్టవ్‌పై పడ్డాడు. సాధారణంగా అలాంటి సమయంలో మరిగిన పాలు పైనపడి చర్మం బొబ్బలెక్కడమో బట్టలు అంటుకొని కాలడమో జరుగుతుంది. కానీ బాబా కృపవలన ఏ హానీ జరుగలేదు. స్టవ్ ఒక ప్రక్కకు, పాలగిన్నె మరో ప్రక్కకు ఎగిరిపడ్డాయి. మధ్యలో వీడు పడ్డాడు. అలా బాబా ప్రమాదం నుండి తప్పించారు.

ఈ సంవత్సరం (1936) వాసుదేవ్ అతని తమ్ముడు కలిసి అల్మారాలు వెదుకుతుండగా బిళ్ళలున్న ఒక పెట్టె కనిపించింది. అవి పిప్పరమెంట్లనుకొని కొన్ని తమ్ముడికిచ్చి కొన్ని తన నోట్లో వేసుకున్నాడు. అవి వెగటుగా ఉన్నందువల్ల తినలేక వాడు నాలిక వెళ్ళబెట్టి ఏడవసాగాడు. నా భార్య వచ్చి వాడు సున్నం తిన్నాడనుకొని తన వేలుతో వాడి నోట్లో ఉన్నదంతా తీసివేసింది. ఏమితిన్నావని అడిగితే ప్రక్కనున్న చిన్న పెట్టెను చూపించాడు. అవి దీపావళి సమయంలో పిల్లలు కాల్చుకునే పాముమందు బిళ్ళలు. ఆ బిళ్ళలను ముట్టిస్తే వాటి నుండి బుసబుసమని వంపులు తిరుగుతూ పాముల్లాంటి కుబుసాలు వస్తూ ఉంటాయి. వెంటనే వాడిని తీసుకొని డాక్టరు దగ్గరకెళ్ళాము. డాక్టరు విషపదార్థమంతా వాంతి అయ్యేందుకు మందిచ్చాడు. కానీ వాంతి కాలేదు. నేను వాడినోట్లో ఊదీ, తీర్థం పోసాను. కాసేపటికి వాడికి వాంతి అయ్యింది. కడుపులో ఉన్న విషపదార్థమంతా బయటకు వచ్చేసింది. పిల్లవాడు కాస్త కోలుకున్నాడు. ఇదంతా అయిన తరువాత వాడు తన తమ్ముడికి కూడా బిళ్ళలు ఇచ్చినట్లు చెప్పాడు. దానిని కొద్దిగానే తిన్నందువల్ల వాడికేమీ కాలేదు. అయినప్పటికీ మేము బాబాను స్మరించి వాడికి కూడా బాబా ఊదీ, తీర్థం ఇచ్చాము. వాడు కూడా వాంతి చేసుకున్నాడు.

క్యాషియర్‌గా పనిచేస్తున్న ఒకతని ఆఫీసు ఖాతాలో గత సంవత్సరం 3500/- రూపాయలకు లెక్క తేలలేదు. అంటే లోటు కనిపించింది. ఆ మొత్తాన్ని అతనే కాజేసాడని అతనిపై నేరం మోపబడింది. ఆపదలో ఉన్న ఆ క్యాషియర్‌ని ఒక స్నేహితుడు నా దగ్గరకు పంపాడు. క్యాషియర్ 'సాయిబాబా'ను ఒక మహమ్మదీయునిగా భావించడంవల్ల వారి పట్ల అయిష్టత ఉండేది. నేనతనికి

సాయిబాబా యొక్క మహిమలను గురించి చెప్పి అతనిని కాపాడగలవారు బాబా ఒక్కరేనని, వెంటనే శిరిడీ వెళ్ళి వారిని క్షమించమని అర్థించి సహాయం కొరకు ప్రార్థించమని చెప్పాను. నా సలహా మేరకు అతను శిరిడీ వెళ్ళాడు. బాబా ఫోటోను తెచ్చుకొని, సగుణ్‌మేరు నాయక్ సహాయంతో దానిని బాబా సమాధిపై పెట్టి ఆర్తిగా ప్రార్థించాడు. తరువాత ఫోటోను తీసుకొని శిరిడీ నుండి తిరిగి వచ్చాడు. అప్పటి నుండి అతని పరిస్థితులు మెరుగుపడసాగాయి. ఆఫీసు ఖాతాలో తగ్గిన 3500/- రూపాయలు జమకట్టడానికి అతనికి 8 రోజులు గడువు ఇచ్చారు. అతను సకాలంలో డబ్బు చెల్లించాడు. ఆ విషయం అంతటితో సమసిపోయింది. అతను అనుకున్నట్లు అతనిని విచారించడంగానీ, ఉద్యోగం నుండి తొలగించడంగానీ జరుగలేదు. వి.సి. చిట్నిస్ అనే అతనికి కూడా బాబా నుండి ఇదే విధమైన సహాయం అందింది. చిట్నిస్ తనను ఉద్యోగం నుండి తొలగించిన తరువాత నా దగ్గరికి వచ్చాడు. నేను అతడి బరువు బాధ్యతలన్నీ బాబాపై మోపి శిరిడీ వెళ్ళి వారిని ప్రార్థించమని చెప్పాను. అతను అలాగే చేశాడు. తరువాత అతడిని తిరిగి ఉద్యోగంలో చేర్చుకున్నారు.

నా కుటుంబసభ్యులు సద్గతి పొందడానికి బాబా ఎలా సహాయపడ్డారో తెలియజేస్తాను. నా తల్లిదండ్రులు సాయిబాబా భక్తులు. 1926లో మా అమ్మ చనిపోయేనాటికి ఆమెకు 70 సంవత్సరాలు. ఆమె చివరి శ్వాస విడిచేంత వరకు సాయిబాబా ఫోటోను తన ముందుంచుకుంది. చనిపోయేముందు ఆమె నన్ను తన ప్రక్కన కూర్చొని విష్ణుసహస్రనామాన్ని పెద్దగా చదవమని చెప్పింది. నేను అలాగే చేశాను. ఆమె 'రామ్, రామ్' అంటూ తుదిశ్వాస విడిచింది.

నా రెండవ భార్య 1929లో మరణించింది. ఆమె సద్గతి పొందడానికి నేను చేయగలిగినదంతా చేయదలచి, ఆమె చితాభస్మాన్ని, అస్థికలను నాశిక్‌లోని గోదావరిలో కలిపి తగిన విధంగా శ్రాద్ధకర్మలు జరుపదలిచాను. కానీ కొన్ని సమస్యలు చుట్టుముట్టాయి. మా నాన్నగారికి సుస్తీ చేసింది. భార్య పోయిన దుఃఖంతో పాటుగా తదుపరి కార్యక్రమాల ఏర్పాట్లు, అందుకు కావలసిన డబ్బు సమకూర్చుకోవడం వంటి భారాలు నాపై పడడంతో నాకు ఏం చేయాలో తోచలేదు. ఎలాగో 80 రూపాయలు జేబులో వేసుకొని నా మూడు సంవత్సరాల చిన్నబిడ్డను ఇంటిలో వదిలి, నాశిక్‌కు రైలులో బయలుదేరాను. విక్టోరియా స్టేషనులో

ఒక తోటి ప్రయాణీకుడు కలిసాడు. అతను నాకోసం ఎంతో శ్రమ తీసుకొని నా ప్రయాణం మొదలైనప్పటి నుండి నాకెంతో సహాయపడ్డాడు.

అతను : మీరెక్కడికి వెళుతున్నారు?

నేను : నాశిక్.

అతను : మీరెందుకు కంబళి తీసుకెళ్ళడం లేదు? అక్కడ రాత్రిళ్ళు చలి అధికంగా ఉంటుంది.

నేను : అంత అవసరమనిపించలేదు. అయినా ఇవన్నీ పట్టించుకొనే స్థితిలో నేను లేను. మూడు సంవత్సరాల బిడ్డను వదిలి నా భార్య వారం క్రితం చనిపోయింది.

అతను నన్ను కాసేపు నిరీక్షించమని చెప్పి, ఒక స్నేహితుని పిలిచి, ఒక దుప్పటి, రగ్గు తెప్పించి నాకు ఇచ్చాడు.

నేను : ఇవన్నీ ఇంత త్వరగా ఎలా తెప్పించగలిగారు?

అతను : మేము నివాసముండేది ఇక్కడికి దగ్గరలోనున్న బొంబాయి ఆర్ట్స్ స్కూల్‌లో. ఈ చుట్ట కాల్చండి (అంటూ ఒక చుట్టనిచ్చాడు).

నేను : (చుట్ట తీసుకొని) మీ పేరేమిటి? మీరేం చేస్తుంటారో తెలుసుకోవచ్చా?

అతను : నా పేరు గణపతి శంకర్. నేను ఆ పాఠశాలలో ప్యూన్‌గా పని చేస్తూంటాను. మీరిక దేనికీ ఆందోళన చెందకుండా పడుకోండి. నేను కూడా నాశిక్ వెళుతున్నాను. స్టేషను రాగానే మిమ్మల్ని లేపుతాను.

నేను : మీరు నాశిక్‌కు ఎందుకు వెళుతున్నారు?

అతను : ఊరకే చూడడానికి. మా సాహెబ్ సిమ్లాకు వెళ్ళాడు. అందువల్ల నాకు నాశిక్ వెళ్ళడానికి అవకాశం దొరికింది.

నేను పడుకున్నాను.

అతను : మీ డబ్బు జాగ్రత్త చేసుకోండి. లేదా నా చేతికిస్తే, నా స్టీలు ట్రంకుపెట్టెలో భద్రంగా దాస్తాను.

నేనేమీ సంకోచించకుండా నా దగ్గరున్న 80 రూపాయలు అతని చేతికిచ్చి పడుకొని నిద్రపోయాను. నాశిక్‌కు దగ్గరలోనున్న ఘోటీ స్టేషనులో అతను నన్ను

నిద్రలేపాడు. ముఖం కడుక్కుని ఇద్దరం టీ త్రాగాము. దానికి అతనే డబ్బులిచ్చాడు. తరువాత నాశిక్ రోడ్ స్టేషనులో దిగి బస్సులో ప్రయాణించి నాశిక్ చేరాము. "మీరు దేనికీ శ్రమపడవద్దు, మీరు పూజారి (భట్‌జీ) దగ్గరకు కూడా వెళ్ళవద్దు అన్నీ నేను చూసుకుంటాను" అని అతను నాతో చెప్పాడు.

నాశిక్ చేరినప్పటి నుండి పన్నెండవ రోజు చేసే కర్మకాండ వరకు నా వెంటే ఉండి, ఒక ప్యూన్‌లాగా అన్నీ అతనే చూసుకున్నాడు. ఆ విషయాలన్నీ అతనికి బాగా తెలిసుండడంతో శాస్త్రోక్తంగా పిండప్రదానం చేయించాడు. ఒక బ్రాహ్మణుణ్ణి ఏర్పాటు చేసి పిండాన్ని రామ్‌కుండ్ దగ్గరికి తీసుకెళ్ళమన్నాడు. రామ్‌కుండ్ దగ్గరున్న గోదావరిలో అస్థికలను ఎలా కలపాలో, ప్రవాహవేగానికి అవి కొట్టుకొని పోకుండా ఎలా గట్టిగా పట్టుకోవాలో కూడా వివరించాడు. చిత్రమైన విషయమేమంటే అతను చెప్పినట్లు నేను అస్థికలను ఎంత గట్టిగా పట్టుకున్నప్పటికీ అవి కలకండలాగా వేగంగా కరిగి గోదావరిలో కలిసిపోయాయి. పన్నెండవరోజు గణపతి శంకర్‌ను బొంబాయి రావలసినదిగా అతనికొక టెలిగ్రాం వచ్చింది. అతను నా దగ్గర తీసుకొన్న డబ్బుకు పైసాతో సహా లెక్క చెప్పాడు. తరువాత నాశిక్‌లోనున్న దేవాలయాలన్నింటికి తీసుకొని వెళ్ళి దర్శనం చేయించాడు. అక్కడొక దేవాలయంలో ఒక సన్యాసి అతనిని గుర్తుపట్టి పలకరించాడు. అతను తనకొచ్చిన టెలిగ్రాం చూపించాడు. కర్మకాండ చేసిన బ్రాహ్మణుడు, గణపతి శంకర్ చాలా తెలివిగలవాడని, అతనికెంతో శాస్త్రపరిజ్ఞానముందని మెచ్చుకున్నాడు. మామూలుగా ఆ బ్రాహ్మణుడు అశుభకార్యాలకు ముందు విఘ్నేశ్వరపూజ అనవసరం అని తలచి ఆ పూజ జరుపకపోతే, అతను చేస్తున్నది సరియైన పద్ధతి కాదని గణపతి శంకర్ చెప్పాడు. అయినప్పటికీ ఆ పూజారి సంశయిస్తుంటే ఒక పండితుడిని అడగమని చెప్పాడు. ఆ పండితుడు గణపతి శంకర్ చెప్పిన దానినే సమర్థించాడు. గణపతి శంకర్ తన అడ్రస్ ఇచ్చి నన్ను అంధేరీలో కలుస్తానని చెప్పి ఆ రోజే తిరిగి వెళ్ళిపోయాడు. నేను నాశిక్ నుండి బొంబాయి తిరిగి వెళ్ళిన తరువాత నాకు ఎంతో సహాయం చేసిన గణపతి శంకర్ నన్ను కలవకపోవటంతో నేనే బొంబాయి ఆర్ట్స్ స్కూల్‌కు వెళ్ళాను. అక్కడ విచారిస్తే గణపతి శంకర్ అను పేరుగల వారెవరు ప్యూన్‌గా ఆ స్కూల్‌లో పనిచేయడం లేదని, ప్యూన్ నుండి ప్రిన్సిపాల్ దాకా అందరూ ధృవీకరించారు. నేను ఆశ్చర్యపోయాను! నా నుండి

ఏమీ ఆశించక నా కొరకు అంత శ్రమపడి, నా భార్య సద్గతికి సహాయపడిన ఈ గణపతి శంకర్ ఎవరు? అతను శ్రీసాయిబాబా కాక మరెవరై ఉంటారు?

1927లో కాలూరాంకు పుట్టు వెంట్రుకలు తీయించేందుకు శిరిడీ తీసుకెళ్ళి ఆ కార్యక్రమం పూర్తి చేయించాను. నన్ను దేవపూర్ వెళ్ళి అక్కడున్న పవిత్ర శిలలను పూజించమని బాబా చెప్పిన ఆదేశం నేను నిర్లక్ష్యం చేశాను. నేను దేవపూర్ వెళ్ళనేలేదు. ఆ విషయం అప్పుడు శిరిడీ వచ్చివున్న ఒక మహాత్ముడి ద్వారా మళ్ళీ తెలియజేసారు. వారిని నేను అంతకుముందు ఎప్పుడూ కలవలేదు. వారి పేరు శ్రీపాదనర్సోబా పాంచ్‌లేగాంకర్. వారు 'నానూ మహరాజ్'గా వ్యవహరింపబడేవారు. అప్పుడు వారి వయస్సు 15 సం॥లు. నేనెవరో, సాయిబాబా నాకు ఉపదేశం గురించి ఏమి చెప్పారోనన్న విషయాలు ఆయనకు తెలియవు. అయినా వారంతటవారే "దేవపూర్ వెళ్ళావా?" అని అడిగారు.

నేను : (విస్తుపోతూ) వెళ్ళలేదు.

నానూ మహరాజ్ : ఎందుకు వెళ్ళలేదు?

నేను : దేవపూర్‌లోని మా గురుపరంపరలో నేను గురువుగా స్వీకరించి ఉపదేశం పొందేందుకు వయసులో నా కన్నా పెద్దవారు ఎవరూ లేరు.

నానూ మహరాజ్ : అయితే ఏమైంది? నా గురువు నా కన్నా చిన్నవారు. వారి పేరు 'దోయిఫోడే'. నీ గురువు పేరు భగవత్.


నానూ మహరాజ్ తమ గురువును నాకు చూపిస్తానని మాట ఇచ్చారు.

నానూమహరాజ్ గుర్తుకుతెచ్చిన బాబా ఆదేశాన్ని నెరవేర్చడానికి దేవపూర్ వెళ్ళి ఉపదేశం పొందాను. మరుసటి సంవత్సరం నానూ మహరాజ్ బొంబాయి వస్తున్నట్లు నాకు సమాచారం అందింది. వారిని దర్శించేందుకు నేను విక్టోరియా స్టేషనుకు వెళ్ళాను. రైలు వచ్చి ఆగింది. నానూ మహరాజ్ ఒక బోగీలో ఉన్నారు. వారిని చూడడానికి వచ్చిన జనం మధ్యలోనున్న నన్ను పిలిచి వారి గురువును చూపించారు. వారు 8 సంవత్సరాల బాలుడైన శ్రీపాద రామకృష్ణ దోయిఫోడే. శ్రీదోయిఫోడే ప్రస్తుతం గుంటూరులో (అప్పటి మద్రాసు రాష్ట్రం)

మెట్రిక్యులేషన్ విద్య అభ్యసిస్తున్నారు. 1928 తరువాత నానూ మహరాజ్‌ను నేను దర్శించలేదు.

నేను ప్రార్థించినంతనే అన్యులను సైతం బాబా కాపాడిన ఒక సంఘటన గురించి చెప్పి నా అనుభవాల సుదీర్ఘ వివరణను ముగిస్తాను. 3-12-1923 నాడు అంధేరీలోని మా ఇంటిలో కూర్చొని యథాలాపంగా వీధివైపు చూస్తున్నాను. అప్పుడు నోయల్ అనునతడు కారు నడుపుకుంటూ వచ్చి ఒక చిన్న పాపను (విఠల్ కుమార్తె) గుద్దేసాడు. "బాబా పాపను కాపాడు" అని నేను బాబాను ప్రార్థించాను. కారు ఆగిపోయింది. నేను క్రిందికి వచ్చి వెంటనే పాపను హాస్పటల్‌కు తీసుకెళ్ళాను. కారు అకస్మాత్తుగా ఆగకుంటే పాప కారు క్రిందపడి నలిగిపోయి ఉండేది. కారుకు బ్రేకు పనిచేయడం లేదు. కారు ఎలా ఆగిందో అని పరిశీలించినప్పుడు, బ్రేకు వేయకపోయినా ఎలాగో "గేరు" లోనికి ఒకరాయి పోయి హఠాత్తుగా కారు నిలిచిపోయిందని తెలుసుకున్నాము. ఇది బాబా చేసిన అద్భుతమైన లీల! పాపను పరిశీలించిన సబ్ అసిస్టెంట్ సర్జన్ పాపకు ప్రమాదకరమైన దెబ్బలు తగిలాయని బ్రతకడం కష్టమని చెప్పారు. నేను బాబా కాపాడుతారని చెప్పాను. పాప 15 రోజులు హాస్పిటల్‌లో ఉండి కోలుకుంది. కానీ మాట పడిపోయింది. అలా తొమ్మిది నెలలు గడిచాయి. ఒకరోజు దాసగణు మహరాజ్ అంధేరీకి వచ్చినప్పుడు ఆయనకు పాప విషయం చెప్పాను. మహరాజ్ పాపకు మరలా బాబా ఊదీ ఇవ్వమని సలహా ఇచ్చాడు. నేను ఆ పాప నోట్లో ఊదీ వేసాను. వెంటనే పాప మాట్లాడసాగింది. ఇది బాబా చేసిన అత్యద్భుతమైన లీల! ఆ పాప ఇప్పటికీ జీవించి ఉంది. చక్కగా మాట్లాడుతోంది.

నేను ఇతరులకు సహాయం చేసేందుకు కూడా బాబా పలు అవకాశాలు కల్పించారు. 1926లో బాబా నా కలలో కనిపించి కె.జి. కొఠారే అను న్యాయవాది దగ్గరకు వెళ్ళి ***"అతను చెయ్యదలుచుకుంటున్న పనిని వద్దని"*** చెప్పమని ఆదేశించారు. ఆ ఆదేశం అస్పష్టంగా ఉన్నప్పటికీ నేను వెళ్ళి అతనికి బాబా సందేశం అందజేసాను. తను గృహస్థాశ్రమం విడిచి సన్యాసం స్వీకరించదలచాననీ, కానీ బాబా ఆదేశం మేరకు తన నిర్ణయాన్ని మార్చుకున్నాననీ చెప్పి అతను నాకు కృతజ్ఞతలు తెలియజేసాడు.



# నారాయణ్ ఆశ్రమ్

## 5

## సెప్టెంబరు 23వ తేదీ, 1936, దాది అగియారి వీధి, బొంబాయి.

**శ్రీ నారాయణ్ ఆశ్రమ్,** సన్యాసి మరియు వేదాశ్రమ స్వామి (తారక్‌మఠ్, దుర్గాఘాట్, కాశి) భక్తుడు, వయస్సు 58సం॥లు, వామన్ మఠ్, గంగాపురివాయ్, (సతారా జిల్లా).

1910లో దాసగణు మహరాజ్ కీర్తనల ద్వారా నాకు సాయిబాబా యొక్క పేరు, గొప్పతనం తెలిసాయి. "వారు జీవించే ఉన్నారా?" అని ఆయనను అడిగాను. అవును శిరిడీలో ఉన్నారు అని చెప్పారు. ఐదురోజుల తరువాత నేను శిరిడీ వెళ్ళి వారిని దర్శించాను. ఆ తరువాత ఆరునెలల్లో తొమ్మిదిసార్లు శిరిడీ వెళ్ళి బాబాను దర్శించడం జరిగింది. అటుపిమ్మట కూడా తరచూ బాబా వద్దకు వెళ్ళేవాడిని. నేనప్పుడు కస్టమ్స్ శాఖలో పనిచేస్తూ ఉండేవాడిని. 31 సంవత్సరాలు ఉద్యోగం చేసిన తరువాత 1926లో ఉద్యోగ విరమణ చేసి పింఛను తీసుకుంటున్నాను. 1927 నుండి 1930 వరకు 'నర్మదా ప్రదక్షిణ'లో గడిపాను. 1931లో సన్యాస దీక్ష స్వీకరించి నారాయణ్ ఆశ్రమ్ అను పేరుతో వ్యవహరించబడుతున్నాను. నా పూర్వాశ్రమనామం రోసర్.

1895లో మొదటిసారిగా నా గురువును కలలో దర్శించాను. తరువాత 1910లో శిరిడీ వెళ్ళి బాబాను దర్శించినప్పుడు నన్ను కలలో (1895) ప్రభావితం చేసింది సాయిబాబానే అని తెలుసుకున్నాను.

నర్మదా నదీ తీరాన, నాందోడ్ (గుజరాత్) సమీపంలో ఉన్న గరుడేశ్వర్‌లోని శ్రీవాసుదేవానంద సరస్వతికి బాబాతో అనుబంధం ఉండేది. వారు 1915లో విదేహులయ్యారు. నేను 1918 తరువాతే శ్రీవాసుదేవానంద సరస్వతి స్వామిని ఆశ్రయించాను. సాయిబాబా నన్ను వారి సంరక్షణలో ఉంచారని నా నమ్మకం. తరువాత 1931లో కాశీలో (తారక్‌మఠ్, దుర్గాఘాట్) ఉన్న వేదాశ్రమ స్వామి నాకు సన్యాస దీక్షను ప్రసాదించారు.

నేను ఎక్కువగా 'వాయ్'లో ఉండేవాడిని. నా ఆధ్యాత్మిక పురోగతిపై శ్రీసాయిబాబా ప్రభావాన్ని మాటలలో వర్ణించలేను. శ్రీసాయిబాబా వివిధ భక్తులతో విభిన్న రీతులలో వ్యవహరించేవారు. సాయిబాబా కేంద్ర బిందువై ఒక్కొక్క భక్తుణ్ణి ఒక్కొక్క పరిధిలో ఉంచేవారు. బాబా దగ్గరకు ప్రాపంచిక కోరికలతో వచ్చేవారు ఎక్కువగాను, ఆధ్యాత్మికోన్నతి కొరకు వచ్చేవారు తక్కువగాను ఉండేవారు.

బహుశా హరిసీతారాం దీక్షిత్, చాందోర్కర్, దాభోళ్కర్‌లు బాబా ప్రబోధాన్ని ఆశించి వారిని ఆశ్రయించి ఉండవచ్చు. వారిలో ఎవరైనా ఆత్మనిష్ఠను సాధించారా, లేదా ఆ చేరువకైనా వచ్చారా అన్నది ప్రశ్నార్థకమే! బాబా దగ్గరికి వచ్చినప్పుడు ఆధ్యాత్మికంగా ప్రారంభదశలోనే ఉన్న దీక్షిత్‌కు, అతని భక్తిని పెంపొందించడానికి ఏకనాథ భాగవతం, భావార్థ రామాయణం పారాయణ చేయమని బాబా ఆదేశించారు. మన అభివృద్ధికి బాబా ప్రత్యక్ష సన్నిధే అవసరం లేదని నా అభిప్రాయం. నేను శిరిడీలో ఉన్నప్పుడు మసీదులో బాబా వద్ద గాక ఎక్కువగా సాఠేవాడాలో కూర్చొని ఉండేవాడిని. వాడాలో కూడా బాబా ప్రభావం ప్రస్ఫుటంగా అనుభవమయ్యేది.

బాబా తమ వద్దకు వచ్చిన భక్తుని శిరస్సును ప్రత్యేక రీతిలో స్పృశించేవారు. కొందరి తల నిమిరేవారు. కొందరి తలపై తట్టేవారు. మరికొందరి తలను అదిమిపెట్టి గట్టిగా నొక్కేవారు. అలా చేసేటప్పుడు ఆ భక్తునిలోనున్న సంకుచిత భావాలన్నింటినీ అణగద్రొక్కి వాటిని బయటికి నెట్టివేస్తున్నారా అనిపించేది. ఒక్కొక్క స్పర్శ ప్రభావం ఒక్కో విధంగా ఉండి భక్తుల భావనలలో, అనుభూతులలో గొప్ప మార్పు తీసుకువచ్చేది. ఇది బాబాకే సొంతమైన విలక్షణ పద్ధతి. అంతేగాక వారు అదృశ్యరీతిలో భక్తుల స్వభావాలను సంస్కరించి వారిలో గొప్ప పరిణతి తెచ్చేవారు.

సమస్త జీవులలోని తేడాలన్నీ మిథ్య అని, వాటన్నింటిలో అంతర్లీనంగా ఉన్న సత్యం ఒక్కటేనని వారు వాచా బోధించకుండానే నాకు తెలియజేసారు. నేను మొదటిసారి శిరిడీ దర్శించిన తరువాత బహుశా 1913 లేక 1914లో ఆ అనుభవం కలిగింది. నాకు తెలిసినంతవరకు ఇటువంటి సత్యాలను గురించి బాబా ఎప్పుడూ మాట్లాడలేదు. నిజానికి అంతటి విషయాలను వినే అర్హత కలిగినవారు లేరు. బాబా ఎప్పుడూ 'మహావాక్యాలు'గానీ, శంకరాచార్య ఆత్మబోధ, వివేక చూడామణి మొదలైన వాటిలోని విషయాలుగానీ చెప్పగా నేను వినలేదు. దీక్షిత్, దాభోళ్కర్ బాబా నాకు ప్రసాదించిన అనుభవాల గురించి తెలుపమని అడిగారు. కానీ నేను వారికి నా అనుభవాలను ఎన్నడూ వెల్లడి చేయలేదు.

నేను 1910లో శిరిడీ వెళ్ళినప్పుడు బాబా వద్దకు భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చేవారు కాదు. అప్పట్లో బాబా ఎక్కువ సమయం మౌనంగానే గడిపేవారు.

తరువాత బొంబాయి నుండి భక్తులు అసంఖ్యాకంగా రాసాగారు. ఫలితంగా భక్తులు కొత్త పద్ధతులు, కొత్త ఆచారాలు ప్రవేశపెట్టి బలవంతంగా బాబాపై రుద్దసాగారు. భక్తులు వారి వారి అభిరుచులకు అనుగుణంగా ప్రవేశపెట్టిన ఈ వైభవాలు అలంకారాల వలన స్వయం ప్రకాశమైన బాబా మహత్యం మరుగునపడింది. దీని వలన వారొక భూలోక వైభవ విశేషంగా మిగిలిపోయారు.

భక్తులు అసంఖ్యాకంగా రావడం మొదలుపెట్టినప్పటి నుండి బాబా ఎక్కువగా నీతికథలు, దృష్టాంతాల రూపంలో మాట్లాడేవారు. బాబా నాతో మాట్లాడింది తక్కువే అయినా దృష్టాంతాల రూపంలో కాకుండా ఎప్పుడూ స్పష్టంగా సూటిగా మాట్లాడేవారు. వీరి తత్త్వము, అక్కల్‌కోట మహరాజ్‌గారి తత్త్వము ఒకే విధంగా ఉండేవని నా అభిప్రాయం. ఈ విషయం అక్కల్‌కోట మహరాజ్‌గారి జీవిత చరిత్ర చదివితే అర్థమవుతుంది. అక్కల్‌కోట మహరాజ్ కూడా అద్వైతాన్ని గురించి మాట్లాడలేదు. కర్మ మార్గాన్ని అనుసరిస్తూ సగుణ తత్త్వాన్ని ప్రోత్సహిస్తూ భక్తులను ఉద్ధరించేవారు. భక్తులను వాళ్ళున్న స్థాయి నుండి ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళేందుకు బాబా ప్రయత్నించేవారు.

నాందేడు (నిజాం రాష్ట్రం) సమీపంలోని డాంగర్ టాక్డి అను గ్రామంలో నివసిస్తున్న బ్రాహ్మణుడు, గృహస్థువైన దాజీ మహరాజ్‌ను సాయిబాబా తమ 'సోదరుని'గా వ్యవహరించినట్లు దాసగణు మహరాజ్ నాతో చెప్పారు. 1914లో ఒకరోజు దాజీ మహరాజ్ "సాయిబాబా మారుతి రూపంలో నిన్న ఇక్కడికి వచ్చినప్పుడు ఉరుముల వంటి శబ్దాలు వినిపించాయి" అని చెప్పారట. దాజీ మహరాజ్ గాయత్రి పునశ్చరణ చేసేవారు. వారు 1934లో నిర్యాణం చెందారు.

నేను, మా తండ్రిగారు మారుతిని పూజించేవాళ్ళం. నేను 1918లో విల్లేపార్లేలోని హనుమాన్ వీధిలో ఒక మందిరాన్ని నిర్మించి దానిలో హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసాను. సాయిబాబానే హనుమంతుడన్న విషయం గుర్తు చేసుకొని ఆ మూర్తికి "శ్రీసాయిహనుమాన్" అని పేరు పెట్టాను. ఆ మందిరాన్ని నా సోదరునికి బహుకరించాను. విల్లేపార్లేలో విగ్రహప్రతిష్ఠ జరిగిన రోజే శిరిడీలో వజే అను బ్రాహ్మణునికి బాబా 25రూపాయలు ఇచ్చి సత్యనారాయణ పూజను జరిపించమని ఆదేశించారట. ఈ రెండు సంఘటనలకు సంబంధమున్నట్లు భక్తులు చెప్పుకుంటారు.

నేను శిరిడీ వెళ్ళిన మొదట్లో సాంప్రదాయాలకు, మతాచారాలకు వ్యతిరేకిని. సిద్ధులని లక్ష్యపెట్టేవాడిని కాదు. శిరిడీలో ఉన్నప్పుడు బాబా చావడి ఉత్సవానికి కూడా అరుదుగా మాత్రమే హాజరయ్యేవాడిని. నా పద్ధతులు చూసిన వాళ్ళెవరైనా నేను బ్రాహ్మణుడనని చెబితే నమ్మేవారు కాదు. క్రమంగా నాకు ఆచార వ్యవహారాల పట్ల గౌరవం పెరిగింది.

నాకు పెళ్ళి కాక ముందునుండే సన్యాసంపై మక్కువ ఉన్నా అది 1931లో మాత్రమే సాధ్యమయ్యింది. ఈ మధ్యకాలంలో జరిగిన సంఘటనలు నేను సన్యాసం తీసుకునేందుకు దారితీసాయి. నా ఇద్దరు పిల్లలు పుట్టిన కొంతకాలానికే ఒకరు 1900లో మరొకరు 1915లో మరణించారు. సన్యాసానికి బ్రహ్మచర్యం ప్రధానం. నాకు భార్య ఉన్నప్పటికీ నా బ్రహ్మచర్యానికి ఆటంకం కాలేదు. తల్లిపై ప్రత్యేకమైన మమకారం ఏమీ చూపించకుండా అందరిలో ఒకరుగా మాత్రమే భావించినట్లైతే సన్యాసానికి అవరోధం కాదు. నాకు సన్యాసం తీసుకోవాలనే సంస్కారమే గొప్ప ప్రేరణ అయింది. శ్రీసాయిబాబా నాతోగానీ మరెవ్వరితోగానీ సన్యాసాశ్రమం యొక్క ఆవశ్యకతను గురించి దానిలోని కష్టనష్టాల గురించి మాట్లాడినట్లు నేనెరుగను. కులమత మార్పిడులు, ఆచారాలు, గురువు, సాధనా పద్ధతుల గురించి బాబా చెప్పేది ఒక్కటే, *"ఎవరికి ప్రాప్తించినదానితో వారు తృప్తిపడుతూ జీవితం కొనసాగించాలి"* అని.

ఆత్మసాక్షాత్కారానికి సహాయపడేవాడే గురువు. నీకతడు ఒక మాధ్యమంగా మాత్రమే ఉపయోగపడగలడు. స్వయంగా నీవే సాధన చేసి, ఆధ్యాత్మిక పురోగతిని సాధించాలి. నేను ఆధ్యాత్మికంగా ఉన్నతి సాధించేందుకు శ్రీసాయిబాబా నాకలాంటి మాధ్యమంగా ఉపయోగపడ్డారు. నేను శిరిడీ వెళ్ళక ముందు 1900వ సంవత్సరంలో కొల్హాపూర్‌లోని వినాయక్ భట్ సాధలే అను సాధువును కలిసాను. వారు నాచే 'యోగవాశిష్ఠం'లోని భాగాలను శ్రద్ధగా పఠింపజేసారు. వారు కూడా నాకొక మాధ్యమమే. ఒక్కొక్క సమయంలో ఒక్కొక్కరి సహాయంతో నిలకడగా సాధన చేసి ఆత్మసాక్షాత్కారం పొందాలి.

6

## మే 21వ తేదీ, 1936

**శ్రీమతి తారాబాయ్ సదాశివ్ తర్ఖడ్**, (శ్రీమతి మేనేజర్)[1] హెూలీసిటీ.

శ్రీసాయిబాబాను వర్ణించడం కానీ వారితో మా అనుబంధాన్ని వివరించడం కానీ అంత సులభం కాదు. బాబాకు సంబంధించిన కొన్ని విషయాలను మాత్రం ముచ్చటించుకుందాం.

ఒకసారి మా పాపకు పదిహేను నెలలప్పుడు జబ్బు చేసింది. మా పాప అనారోగ్యం గురించే బాధపడసాగాను. ఆ సమయంలో మావారి సోదరుడు శిరిడీ నుండి వచ్చి శ్రీసాయిబాబా మహిమల గురించి గొప్పగా చెప్పాడు. అప్పుడు పాప కోలుకుంటే పాపను తీసుకొని శిరిడీ వెళ్ళి బాబాను దర్శించుకుంటానని మ్రొక్కుకున్నాను. పాప జబ్బు నయమైంది. వెంటనే మ్రొక్కు చెల్లించడానికి శిరిడీ వెళ్ళాము.

ప్రథమంగా బాబాను దర్శించినప్పుడు ఎవరినైనా అమితంగా ఆకర్షించేది వారి కళ్ళు. వారి శక్తివంతమైన చూపు మన అణువణువులోనికీ చొచ్చుకొని వెళ్ళి పరిశీలిస్తున్నట్లుండేది. ఎవ్వరూ బాబా కళ్ళల్లోకి ఎక్కువ సేపు చూడలేకపోయేవారు. వారి నిశిత దృష్టిని తట్టుకోలేక తలవంచి నమస్కరించేవారు.

శ్రీసాయిబాబా గొప్ప మహిమాన్వితులు. బాబాను దర్శించిన వారెవరైనా వారు అంతర్యామి అని, వారు మన హృదయంలోనేగాక శరీరంలోని అణువణువులోనూ ఉన్నారన్న అనుభూతిని పొందుతారు. బాబా మాట్లాడే కొద్ది మాటలు, సంజ్ఞల బట్టి భూతభవిష్యద్వర్తమానాలు తెలిసిన సర్వజ్ఞులని భక్తులు తెలుసుకుంటారు. బాబాను ఒకసారి దర్శించిన తరువాత వారికి సర్వస్యశరణాగతి చెందడం కన్నా చేయవలసినది మరేదీ ఉండదు. జీవితంలో అడుగడుగునా ప్రతి చిన్న విషయంలోనూ బాబా మనకు దారి చూపి సహాయపడతారు. బాబాను దేవుడని పిలవండి లేదా సహజస్థితిలోనున్న సత్పురుషుడనండి, వారు అంతర్యామి. అత్యంత

---

*1. శ్రీమతి తారాబాయి సదాశివ్ తర్ఖడ్ తమ అనుభవాలను 'శ్రీమతి మేనేజర్' అనే పేరుతో వెల్లడించారు.*

శక్తిమంతులైన వారి సన్నిధిలో ఎలాంటి సందేహాలకు, భయాలకు తావుండదు. వారిని శరణువేడడమొక్కటే శ్రేయస్కరమని అనిపిస్తుంది. బాబాను దర్శించిన వెంటనే వారి శక్తి, సర్వజ్ఞత, సర్వవ్యాపకత అనుభవమవడం మొదలౌతుంది. సర్వకాల సర్వావస్థలయందు వారి కృపాదృష్టి మనపై ఉంటుందని మనకు ఏ ఆపదా వాటిల్లదనే నమ్మకం ఏర్పడుతుంది.

నేను శిరిడీ వెళ్ళిన మొదటిరోజులలో బాబా అంతర్యామిత్వానికి సంబంధించి నాకు కలిగిన లేదా నేను తెలుసుకున్న అనుభవాలను వివరిస్తాను.

ఆ రోజుల్లో శిరిడీ వీధి దీపాలు, పరిశుభ్రత వంటి కనీస సౌకర్యాలు కూడా లేని కుగ్రామం. తరువాత కాలంలో అభివృద్ధి చెందింది కానీ అప్పట్లో వీధి దీపాలు లేనందువల్ల శిరిడీ వీధులన్నీ చీకటిగా ఉండేవి. ఒక రాత్రి నేను వీధిలో నడుస్తూ అకస్మాత్తుగా ఒకచోట ఆగిపోయాను. నేను ఏదైనా శబ్దం వినో దేన్నైనా చూడడం వలనో ఆగిపోలేదు. నాకెందుకో ఆగిపోవాలనిపించి ఆగిపోయాను. అలాగే కొద్ది సమయం గడిచింది. ఎవరో దీపం తెచ్చారు. ఆ దీపం వెలుగులో చూస్తే నా ముందు ఒక పాము నిశ్చలంగా పడుకొని ఉంది. నేను ఆగకుంటే తరువాత వేయబోయే అడుగు పాము మీద పడివుండేది. నేను ఒక్క అడుగు వేసి ఉన్నా ఎంతో ప్రమాదం జరిగేది. నాకు అక్కడ పాము ఉందని తెలిసే అవకాశమే లేదు. మరి పాముకు సరిగ్గా అడుగు దూరంలో నేనెందుకు అకస్మాత్తుగా ఆగిపోయాను? సరిగ్గా ఆ సమయానికి ఎవరో దీపం తెచ్చి నా ముందున్న ప్రమాదాన్ని చూపించడం ఎలా జరిగింది? వీటన్నింటికీ సమాధానం ఒక్కటే! అనుక్షణం జాగరూకతతో తమ భక్తులను గమనిస్తూ, రక్షిస్తున్న సర్వాంతర్యామి అయిన బాబా అనుగ్రహమే అది. అలా ఎన్నోసార్లు బాబా నన్ను మృత్యువు నుండి కాపాడారు. ఆ సంఘటనలు తరువాత చెబుతాను.

మేము మసీదుకు వెళ్ళి బాబా సన్నిధిలో కూర్చునేవాళ్ళం. సాధారణ సమయాలలో ఎవరైనా బాబాను దర్శించవచ్చు. దీనికి ప్రత్యేకమైన అనుమతిగానీ పరిచయంగానీ అవసరం లేదు. ఒకసారి నేను అలా బాబాకు సమీపంలో కూర్చొని ఉన్నాను. ఇంతలో ఒక కుష్ఠురోగి మసీదుకొచ్చాడు. అతని వ్యాధి బాగా ముదిరి, శరీరం నుండి దుర్వాసన వస్తున్నది. శక్తి కూడా బాగా క్షీణించిందేమో అతికష్టం మీద పాకుతూ మసీదు మూడు మెట్లూ ఎక్కి ధుని వద్దకు వెళ్ళి తరువాత బాబాను

సమీపించి వారి పాదాలపై తల ఉంచి నమస్కరించాడు. ఇందుకు చాలా సమయమే పట్టింది. నేను ఆ దుర్గంధాన్ని భరించలేక అతనెప్పుడు బయటకు వెళ్ళిపోతాడా అని నిరీక్షిస్తున్నాను. కుష్ఠురోగి బాబాకు నమస్కరించి లేచి వచ్చిన విధంగానే పాకుతూ వెళ్ళిపోయాడు. అతడి చేతిలో మాసిన గుడ్డతో కట్టిన మూట ఒకటుంది. అతను వెళ్ళిపోగానే హాయిగా ఊపిరి పీల్చుకొని "దేవుడా! బ్రతికించావు అతను వెళ్ళిపోయాడు" అని మనస్సులో అనుకున్నాను. మరుక్షణం బాబా నావైపు తీక్షణంగా చూసారు. బాబా నా మనస్సులోని భావాలను గ్రహించారని తెలిసిపోయింది. ఆ కుష్ఠురోగి ఎక్కువ దూరం పోకముందే బాబా ఒక భక్తునితో అతనిని పిలుచుకొని రమ్మని ఆదేశించారు. కుష్ఠురోగి అతిప్రయాసతో మరల మసీదులోనికి వచ్చాడు. బాబా దగ్గరకు వెళ్ళి వంగి నమస్కరించాడు. బాబా అతని చేతిలోని మూటను తీసుకుని ***"ఇదేమిటి?"*** అని అడుగుతూ దానిని విప్పారు. అందులో పేడాలున్నాయి. బాబా ఒక పేడాను తీసి, మసీదులో ఎంతోమంది భక్తులున్నా నాకు మాత్రమే ఇచ్చి తినమన్నారు. నాకు భయము, అసహ్యాము కలిగాయి. కుష్ఠురోగి తెచ్చిన పేడా తినడమా? కానీ అది సాయిబాబా ఆజ్ఞ కావడంతో నాకు తీసుకోక తప్పలేదు. ఎలాగో పేడాను తిన్నాను. తరువాత బాబా మరొక పేడా తీసుకొని తాము తిన్నారు. మిగిలిన పేడాలను అతనికే ఇచ్చి పంపించివేసారు. బాబా ఆ కుష్ఠురోగిని తిరిగి ఎందుకు పిలిపించారో, అంతమంది భక్తులుండగా పేడాను నాకొక్కదానికే ఇచ్చి ఎందుకు తినమన్నారో నాకు తప్ప అక్కడ ఎవరికీ అర్థం కాలేదు. బాబా నా మనసు చదివి నాకు విలువైన పాఠాలు (అణకువ, సోదరభావం, జాలి, సహనము) నేర్పడానికే అలా చేశారు. ఆరోగ్యపరమైన జాగ్రత్తలకంటే బాబా శక్తి మీద నమ్మకముంటే చాలని తెలియజేసారు.

మాకు ఏవైనా కష్టాలు, సమస్యలు వచ్చినప్పుడు బాబాకు వాచా చెప్పవలసిన అవసరం లేదు. వారి సన్నిధికి వెళితే చాలు. సర్వజ్ఞులైన బాబా మాకు వచ్చిన సమస్యను తెలుసుకొని ఆ కష్టం తొలగిపోయే మార్గం చూపేవారు. ఇలాంటిదే నేను చెప్పబోయే సంఘటన. ఒకసారి మేము శిరిడీ వెళ్తూ మాతో మా పనివాడిని కూడా తీసుకు వెళ్ళాము. కానీ శిరిడీ చేరగానే అతని నడుము పట్టేసింది. తీవ్రంగా బాధపడసాగాడు. నా భర్త మసీదుకు వెళ్ళి బాబా ముందు నిలబడ్డారు. అప్పుడు కొందరు భక్తులు కూడా ఉన్నారు. ఇంతలో బాబా ***"నా కాలు విపరీతంగా***

***బాధపెడుతోంది"*** అని చెప్పారు. ఒక భక్తుడు వారి బాధ నివారణకు ఏదైనా మార్గం సూచించమని కోరాడు. బాబా అలాగేనని ***"పచ్చని ఆకులు వేడి చేసి పెడితే బాధ తగ్గుతుంది"*** అన్నారు. మరో భక్తుడు "బాబా, అవి ఏమి ఆకులు?" అని అడిగాడు. ***"లెండీ (వాగు) దగ్గర ఉన్న ఆకులు"*** అని బాబా చెప్పారు. అప్పుడు ఒక్కొక్కరు ఒక్కొక్క ఆకును సూచించారు. చివరగా ఒక భక్తుడు "అవి కలబంద (aloe vera) ఆకులా?" అని అడిగాడు. ***"ఆ! అవే. వాటిని తెచ్చి రెండుగా చీల్చి కొద్దిగా వేడి చేసి నొప్పి ఉన్న చోట పెట్టి కట్టాలి. అంతే"*** అన్నారు. బాబా దయతో చెప్పిన చికిత్స మా పనివాడికని నా భర్త అర్థం చేసుకున్నారు. వెంటనే వెళ్ళి ఆ ఆకులు తెచ్చి బాబా చెప్పినట్లుగా చేశారు. అతని బాధ నివారణ అయింది. బాబా తాము భౌతికంగా మసీదులోనే ఉన్నప్పటికీ సర్వత్రా నిండి తమ సూక్ష్మశరీరంతో అనేక కార్యాలు నిర్వర్తించగలరు.

నేను ఎప్పుడూ కంటి జబ్బుతో బాధపడుతూ ఉండేదానిని. ఒకసారి శిరిడీలో ఉన్నప్పుడు బాధ ఎక్కువై నా కళ్ళు నుండి నీళ్ళు కారసాగాయి. అలాంటి స్థితిలో నేను మసీదుకు వెళ్ళి బాబా ముందు కూర్చున్నాను. బాబా నా వైపు చూసారు. అంతే నా కంటి బాధ నివారణ అయింది. నీరు కారడం కూడా ఆగిపోయింది. కానీ బాబా కనుల నుండి నీరు కారడం ప్రారంభమైంది. వారి ఒక్క చూపుతోనే మన బాధలేమిటో తెలుసుకోవడం అద్భుతం! ఏ మందూ వాడకుండానే దీర్ఘకాలిక వ్యాధులను సైతం క్షణంలో నివారించడం అత్యద్భుతం! శాస్త్రవేత్తలు కానీ వైద్యులు కానీ దీనిని నమ్మకపోవచ్చు. ఇది కేవలం నా స్వానుభవమే కాదు ఎందరో భక్తుల అనుభవం కూడా. అంతేగాక బాబా సంకల్పమాత్రాన భక్తుల రోగాలను తాము స్వీకరించి నివారించడం మరో అసాధారణ ప్రక్రియ.

బాబా సర్వాంతర్యామి. సర్వ జీవులలోనూ, సకల జీవ, నిర్జీవ పదార్థాలలోనూ వసించి ఉంటారు. వాటి కదలికలను కార్యాలను నియంత్రించి నిర్దేశిస్తారు. అదే శిరిడీలోనే ఉంటూ ***"నేను శిరిడీలో లేను"*** అని పలికిన బాబా మాటలకు అర్థం. అంటే వారు అంతటా నిండి ఉన్నారు. "సాయిబాబా అని పిలువబడే నేను ఎముకలు, రక్తమాంసాలతో కూడిన ఈ మూడుమూరల దేహానికే పరిమితమై లేను" అని వారు తరచూ చెబుతుండేవారు. కుక్క, పిల్లి, పంది మొదలైన సర్వజంతుజాలంలోనూ, సర్వమానవులలోనూ వారు వసించి ఉంటారు. మనం కేవలం మన భౌతిక శరీరమే అన్న భావన మనల్ని వీడదు. ఐహిక బంధాలతో

మన శరీరాలు ముడివేయబడి ఉంటాయి. కానీ బాబాకు అలా కాదు. వారు దేహానికి, భవబంధాలకు అతీతులు. ఎప్పుడూ సహజ సమాధి స్థితిలో నుండే జ్ఞానమయ శరీరులు.

శ్రీసాయిబాబాకు ఇతర సాధు సత్పురుషులకు గల ముఖ్యమైన తేడా గమనించదగ్గది. నేను ఎంతోమంది సత్పురుషులను దర్శించి ఉన్నాను. వారు తమ శరీరాన్ని, పరిసరాలను పూర్తిగా మరచి 'సమాధి' స్థితిలోనికి వెళ్ళిపోతారు. తరువాత సమాధి స్థితి వీడి బాహ్యస్పృహలోకి వచ్చి, మన హృదయంలో ఏముందో తెలుసుకొని మనకు సమాధానం ఇస్తారు. కానీ సాయిబాబా పద్ధతి విలక్షణమైనది. అత్యున్నత స్థితి పొందేందుకు లేక మరేదైనా తెలుసుకొనేందుకు బాబా సమాధి స్థితికి వెళ్ళనవసరం లేదు. వారు ఎల్లప్పుడూ రెండు స్థితులయందు ఉండేవారు. ఒకటి 'సాయిబాబా'గా శిరిడీలో మెలగుతూ తమ భక్తుల ఐహిక, ఆధ్యాత్మిక అవసరాలను తీరుస్తూ ఉంటారు. రెండవది పరమాత్మగా విశ్వమంతా వ్యాపించి ఉంటారు. ఇతర సాధువులు మన మనస్సు చదవడానికి గతం తెలుసుకోవడానికి ప్రయాసపడతారు. కానీ శ్రీసాయిబాబాకు ఏ ప్రయత్నమూ అవసరం లేదు. వారు రెండు స్థితుల సహజమైన గుణగణాలను శక్తులను వ్యక్తం చేస్తూ ఉండేవారు. వారు ఎప్పుడూ సర్వజ్ఞస్థితిలో ఉంటారు.

సాయిబాబాను కొంతమంది అర్థం చేసుకోలేరు. ఉదాహరణకు: బాబా కఫ్నీలకు గుడ్డ కొనేందుకు వాటిని అమ్మేవాడిని పిలుస్తారు. వాడు గజం ఎనిమిదణాలు చెబితే వారు చాలాసేపు బేరం చేసి గజం 5 అణాలకు తగ్గించి 40 గజాలు కొంటారు. ఇది గమనించినవారు తొందరపడి బాబా లోభి అని, అత్యాశాపరుడని డబ్బంటే వ్యామోహమని అనుకొంటారు. తరువాత ఆ వ్యాపారికి బాబా తాము బేరం చేసిన మొత్తానికి నాలుగు రెట్లు అధికంగా చెల్లిస్తారు. అప్పుడదే ప్రేక్షకులు బాబానొక పిచ్చివానిగానూ, డబ్బు విలువ తెలియనివానిగానూ అభివర్ణిస్తారు. వారు చేసేది అపాత్రదానం అని కూడా అనుకుంటారు.

పైరెండు సందర్భాలలోనూ విచక్షణ లేకుండా చేసిన విమర్శలు వాళ్ళ అవగాహనారాహిత్యానికి నిదర్శనాలు. బాబా అలా ప్రవర్తించడానికి నిజమైన కారణం నిగూఢంగా ఉండి, వారు ఎవరికి విశదపరచాలనుకున్నారో ఆ భక్తులకు మాత్రమే బోధపడుతుంది.

బహుశా 1915లో అనుకుంటాను ఒక వేసవిలో నేను నెల రోజుల పాటు నరములకు సంబంధించిన తీవ్రమైన తలనొప్పితో బాధపడ్డాను. నా తలనొప్పి ఎంత తీవ్రమైనదంటే ఆ బాధను భరించలేక నా తల బ్రద్దలైపోతుందేమో అనిపించేది. మేమప్పుడు పాంచ్‌గని శానటోరియంలో ఉండేవాళ్ళం. ఎన్నో వైద్య చికిత్సలు చేయించాము. కానీ బాధ నివారణ కాలేదు. నాకు మరణం తప్పదనిపించింది. దాంతో బాబా పాదాల చెంత మరణించడం ఉత్తమమనిపించి శిరిడీకి వెళదామని నిశ్చయించుకున్నాను. మావారు మొదట కొన్ని అభ్యంతరాలు తెలిపినా చివరకు శిరిడీ బయలుదేరాము. కోపర్‌గాం వద్ద గోదావరి దాటి శిరిడీ వెళ్ళేందుకు నది ఒడ్డుకు చేరాము. అప్పుడు నాకు ఒక ఆలోచన వచ్చింది. ఎలాగూ చనిపోతున్నాను కదా? చనిపోయేముందు పవిత్ర గోదావరిలో స్నానమాచరిస్తే మంచిదనిపించింది. కానీ చన్నీళ్ళ స్నానం చేస్తే తలనొప్పి ఎక్కువై చావుకు దగ్గరౌతానేమోననిపించింది. అంతకుముందు తలనొప్పి ఉన్నప్పుడు చన్నీటి స్నానం చెయ్యడమన్న ఆలోచనే నన్ను వణికించేది. ఏమైతే అది కానీ అని తలచి గోదావరిలో స్నానం చేసి బయటకు వచ్చాను. ఆశ్చర్యం! ఎక్కువవుతుందనుకున్న తలనొప్పి శాశ్వతంగా మాయమైంది. దీర్ఘకాలంగా నన్ను బాధించిన ఆ నొప్పి నన్ను వదిలిపోయింది. బాబా కాక మరెవ్వరు చేయగలరు ఈ అద్భుత నివారణ!

భక్తులను ఆకర్షించేది కేవలం బాబా యొక్క మహిమాన్విత శక్తి మాత్రమే కాదు, అది వారి అవ్యాజమైన ప్రేమానురాగాలతో మిళితమైనందువలన భక్తులకు శిరిడీ ఒక స్వర్గధామమయింది. బాబా సన్నిధిలో ఉంటే మనకు ఏ ఆపదా వాటిల్లదని క్షేమంగా ఉంటామనే నమ్మకం కలుగుతుంది. నేను శిరిడీలో ఉన్నప్పుడు వారి సన్నిధిలో కూర్చుంటే నా బాధల్నే కాదు ప్రాపంచిక చింతలతో కూడిన ఈ శరీరాన్ని కూడా మరిచిపోయేదాన్ని. గంటల తరబడి ఒక ఆనందమయ స్థితిలో ఉండిపోయేదాన్ని. కాలగమనమే తెలిసేది కాదు. వారి నిజమైన భక్తులందరూ ఇటువంటి అద్వితీయ అనుభూతే పొంది ఉంటారన్నది నా నమ్మకం. సర్వత్రా ఆయనే నిండి ఉన్నారు. మా సర్వస్వం వారే. బాబాకు పరిమితులు ఉంటాయన్న భావన మాలో కలిగేది కాదు.

బాబా మనల్ని వీడిపోయారనే ఆలోచన నన్నమితంగా బాధిస్తుంది. ఇది పూరించలేని లోటు. మనలోని జీవం వారితో వెళ్ళిపోయి, కేవలం శరీరాలుగా

మాత్రమే మిగిలి ఉన్నామనిపిస్తుంది. వారి ప్రత్యక్షసన్నిధిలో అటువంటి ఆనందమయ క్షణాలను గడిపే అవకాశం ఈనాడు లేదు. కానీ బాబా మనల్ని పూర్తిగా వీడిపోయారనేది కూడా వాస్తవం కాదు. వారు ఇప్పటికీ ఉన్నారు. వారి శక్తి, రక్షణ మనకు ఎన్నో సందర్భాలలో అనుభవమవుతూనే ఉంటాయి. కానీ వీటన్నింటినీ వారి ప్రత్యక్ష సన్నిధిలో లభించే ఆనందంతో పోల్చలేము. వారు విదేహులైనప్పటికీ వారి రక్షణ, సహాయము మనకు అందుతూనే ఉందన్న దానికి నిదర్శనంగా కొన్ని సంఘటనలు వివరిస్తాను.

1927లో నేను ఆరు నెలల గర్భవతిగా ఉన్నప్పుడు మా కుటుంబమంతా శిరిడీ వెళ్ళాము. అక్కడ నా గర్భంలోని శిశువు చనిపోయింది. రోజులు గడిచాయి కానీ ప్రసవం కాలేదు. ఇలాంటి సమయాలలో ఆపరేషన్ చేసి మృతశిశువును బయటకు తీస్తారు. కానీ శిరిడీలో ఎలాంటి వైద్య సదుపాయాలు లేవు. కనీసం మంత్రసాని కూడా లేదు. అహ్మద్‌నగర్ నుండి మందులు తెప్పించి వాడినా ప్రయోజనం లేకపోయింది. నా భర్తకు ఏం చేయాలో తోచక సాకోరి వెళ్ళి శ్రీఉపాసనీబాబాను కలిసి సహాయం అర్థించారు. వారు నా భర్త చెప్పినదంతా విని "ఉత్తమోత్తమ వైద్యుడు (సాయిబాబా) శిరిడీలోనే ఉండగా నా దగ్గరకెందుకొచ్చావు?" అన్నారట. రోజుల తరబడి మృతశిశువు గర్భంలో ఉన్నందువల్ల నా రక్తమంతా విషపూరితమై శరీరం నీలంగా మారిపోయింది. నేను స్పృహ కోల్పోయాను. అప్పుడు ఏం జరిగిందో, నేనెలా ప్రసవించానో నాకు గుర్తులేదు. జరిగినదంతా నా భర్త తరువాత చెప్పాడు. నేను స్పృహలేని స్థితిలోనే మాట్లాడుతూ మొదట బాబా ఊదీని పెట్టి, తీర్థం నోట్లో పోయమని చెప్పానట. ఇంకా ఏవేవో ఆదేశాలిచ్చానట. నా భర్త నేను చెప్పినట్లుగా చేశారట. కొద్దిసేపటికి చనిపోయిన బిడ్డతో సహా లోపల ఉన్నదంతా బయటికి వచ్చేసిందట. కానీ నేను నెలరోజుల పాటు అపస్మారక స్థితిలోనే ఉండి తరువాత స్పృహలోకి వచ్చాను. ఆరోగ్యం కూడా కుదుటపడింది. నన్ను బ్రతికించడానికి బాబా (మహాసమాధి చెందిన తొమ్మిది సంవత్సరాల తరువాత) చేసిన అద్భుత లీల ఇది!

శ్రీసాయిబాబా ఎలాంటి సంస్థలు, మఠాలు నెలకొల్పలేదు. కనుక తదనంతరం తమ గద్దెనెక్కడానికి ఎవరినీ ఎన్నుకోలేదు.

శ్రీసాయిబాబా ఆచరణే వారి సుగుణాలను బహిర్గతం చేస్తుంది. వారి సచ్ఛీలత కీర్తించదగినది. ఇంతకుమునుపు చెప్పిన సంఘటనలలో బాబా దయాదాక్షిణ్యాలు వెల్లడయ్యాయి. బాబా కృపాశీస్సులు వారి దగ్గరకు వచ్చిన భక్తులపై మాత్రమే కాకుండా, శిరిడీ నుండి ఎంతో దూరప్రాంతాలలోనున్న భక్తులపై కూడా వర్షిస్తాయి. 1914-19లో ప్రపంచయుద్ధం జరుగుతున్నప్పుడు వేలమైళ్ళ దూరంలో ఐరోపాలోనున్న తమ భక్తులు ప్రమాదస్థితిలో ఉన్నప్పుడు వాళ్ళను ఆదుకొని మృత్యువు నుండి కాపాడారు. వారు దయాస్వరూపులే కాక వారి న్యాయదృష్టి, నిష్పక్షపాత వైఖరి ఎనలేనిది. అవసరమైతే ఎవరైనా తమ బిడ్డను కూడా త్యాగం చేయడానికి సిద్ధపడాలని బాబా చెప్పేవారు. పేద-ధనిక తారతమ్యాలు లేకుండా అందరినీ సమానంగా ఆదరించేవారు. వారి దగ్గరకు గొప్ప గొప్ప అధికారులైన కలెక్టర్లు, రెవెన్యూ కమీషనర్లు వచ్చేవారు. మామ్లత్‌దార్‌లు, డి.ఓ.లు, డి.సి.లు, క్రిందిస్థాయి ఉద్యోగులు ఎంతో మంది వచ్చేవారు. బాబా దృష్టిలో అందరూ సమానులే. ధనము, హోదా ప్రాతిపదికగా ఎవరిపై ఎట్టి ప్రత్యేకత చూపేవారు కాదు. అందరికీ, అన్నివేళలా అందుబాటులో ఉండటం బాబాలోని గొప్ప విశేషం. ఎప్పుడైనా, ఏ సమయంలోనైనా వారిని దర్శించుకోవచ్చు. ***"నా దర్బారు అన్నివేళలా తెరిచే ఉంటుంది"*** అని బాబా చెప్పేవారు. ఆయన ఇతరుల నుండి భయపడి దాచుకోవలసిన, సిగ్గుతో కప్పిపుచ్చుకోవలసిన విషయాలేమీ లేవు. వారి చర్యలన్నీ బాహాటంగా ఉండేవి.

బాబా జీవితానికి సంబంధించిన మరో విలక్షణ అంశం- వారు ఎలాంటి బాదరబందీల్లేకుండా స్వేచ్ఛా జీవనం గడిపేవారు. బాబా నిర్వహించడానికి ఎలాంటి సంస్థలు, మఠాలు లేవు, సంరక్షించుకోవడానికి ఎలాంటి ఆస్తులు లేవు. భిక్షచేసి నిరాడంబరంగా జీవించేవారు. వారు ప్రతిదినం భక్తుల నుండి దక్షిణలు స్వీకరించేవారు. కానీ ఆ మొత్తాన్ని భక్తులకే పంచిపెట్టేవారు. బాబా సశరీరులుగా ఉన్న చివరి 9 సంవత్సరాలు తాత్యాకు, బడేబాబాకు ప్రతిరోజూ 110 రూపాయలు ఇచ్చేవారు. బాబా సమాధి చెందినప్పుడు వారి జేబులో తమ అంత్యక్రియలకు అవసరమైనంత డబ్బు మాత్రమే మిగిలి ఉంది. వారి మనోనిగ్రహము, వైరాగ్యము చెప్పుకోదగినవి. జిహ్వాచాపల్యంతో సహా ఇంద్రియాలన్నీ వారి అధీనంలో ఉండేవి. వారికి ఏ విషయం పట్లా మమకారం ఉన్నట్లు ఎవరూ గమనించలేదు.

బాబా దాతృత్వము ఎనలేనిది. వారు ప్రతిదినం భక్తులకు 110 రూపాయల వరకు ఇవ్వడమే కాక వారికి సమర్పించిన కానుకలను కూడా పంచేసేవారు. కొందరు వారు ప్రతిదినం పంచే మొత్తం 300 రూపాయలు అంటారు. కానీ అది వాస్తవం కాదు. వారి కీర్తిని తెలియజేసేందుకు ఇటువంటి అతిశయోక్తులు అవసరం లేదు. బాబా గొప్పతనం చాటేందుకు వాస్తవ విషయాలే చాలు. ఫకీర్లు, భజనబృందాలు బాబాను దర్శించినప్పుడు వాళ్ళకు ధారాళంగా డబ్బు, బహుమతులు ఇచ్చి పంపేవారు.

బాబా ప్రసాదించే ఆధ్యాత్మిక ప్రగతి, వారు బోధించే పద్ధతి ఇతరులకు తెలియనిచ్చేవారు కాదు. భగవంతుని గురించి వారు అరుదుగా మాట్లాడేవారు. ఆ సందర్భంలో భక్తిభావంతో, ఆర్తిగా ఒక భగవద్భక్తుని వలె పలికేవారు. వారు ఆధ్యాత్మిక సాధనలు చేసినట్లుగా ఎవరూ చూసి ఎరుగరు. ప్రతి ఉదయం ధుని దగ్గర కూర్చొని చేతులు, వ్రేళ్ళు తిప్పుతూ ఏవేవో సంజ్ఞలు చేస్తూ "హక్" (దేవుడు) అని మాత్రం ఉచ్చరిస్తూ ఉండేవారు. ఆ సంజ్ఞలు ఎవరికీ అర్థమయ్యేవి కావు.

పవిత్రత, శక్తి, నియమపాలన, వైరాగ్యం ఎప్పుడూ వారిలో కనిపించేవి. బాబా ఎప్పుడూ భిక్షాటనతోనే జీవించారు. వారు అనారోగ్యంతో ఉన్నప్పుడు కూడా భిక్షాటన మానేవారు కాదు. బాబా ప్రతిదినం ఎప్పుడూ వెళ్ళే కొన్ని ఇండ్లకు మాత్రమే వెళ్ళి పరిమితంగానే భిక్ష తీసుకునేవారు. భిక్ష ద్వారా వచ్చిన పదార్థాలలో కొంత తిని మిగతా పదార్థాలను పంచిపెట్టేసేవారు.

బాబా సాధారణంగా మాట్లాడిన మాటలను అర్థరహితాలని కొందరు వ్యాఖ్యానిస్తారు. వాళ్ళ భావన ఆ విధంగా ఉంది కాబట్టి పైగా ఆ మాటలు వాళ్ళను ఉద్దేశించినవి కాదు కాబట్టి వాళ్ళకు అవి నిస్సందేహంగా అర్థరహితాలే అవుతాయి. ఎవరి శ్రేయస్సు కోసం బాబా ఆ మాటలు పలికారో వాళ్ళు మాత్రమే మాటలలోని మర్మాన్ని అర్థం చేసుకుంటారు. "జయామని జైసాభావ, తయాతైసా అనుభవ॥". ఏ భావంతో మనం బాబాను దర్శిస్తామో, అదే విధమైన అనుభవాన్ని మనకు వారు కలుగజేస్తారన్నదే దీని భావం.

బాబా తమకెలాంటి సుఖాలు, సౌకర్యాలు ఏర్పాటు చేయమని అడిగేవారు కాదు. బాబా ఉంటున్న మసీదు మొదట్లో శిథిలమై పాడుపడి పడిపోయేటట్లుండేది. భక్తులు దానిని మరమ్మత్తు చేయదలచి బాబా అనుమతి అడిగారు. బాబా

ఒప్పుకోలేదు. కానీ భక్తులు పట్టుబట్టి బాబా చావడిలో నిద్రించే రాత్రి వేళల్లో మసీదు మరమ్మత్తులు పూర్తిచేశారు.

శిరిడీలో మేము ఉపాసనీబాబానే కాక మరెందరో మహాత్ములను కలిసాము. శిరిడీలో రాధాకృష్ణఆయీ అను బ్రాహ్మణ వితంతువు బాబా సేవ చేసుకుంటూ గడిపేది. బాబా ఆరతికి కావలసిన ఏర్పాట్లు చూసుకునేది. ఆమె వివిధ వస్తువులను తెమ్మని భక్తులను పురమాయించేది. ఆమెను అందరూ ఎంతో గౌరవభావంతో చూసేవారు. 1915 ప్రాంతంలో మేము శిరిడీ వెళ్ళినప్పుడు సాయిబాబా మమ్మల్ని ఆయీ ఇంటికి వెళ్ళమని ఆదేశించారు. అలాగే మేము వెళ్ళి వసతి కల్పించమని ఆమెనడిగాము. కానీ ఆమె తాను చెప్పిన పనులన్నీ చేస్తానంటేనే వసతి కల్పిస్తానని షరతు పెట్టింది. నేను అందుకు అంగీకరించి ఆమె చెప్పిన పనులన్నీ చేసేదానిని. ఆయీకి కొన్ని దివ్య శక్తులుండేవి. ఎదుటివారి మనస్సు చదవగలిగేది. ఆమె నా గతచరిత్రంతా పూసగ్రుచ్చినట్లు చెప్పింది. ఎప్పుడైనా బాబా తమకు ఫలానా వంటకం కావాలని అసాధారణ సందేశం పంపినప్పుడు, ఆమె ఆ వంటకాన్ని సిద్ధంగా ఉంచి, వెంటనే ఇచ్చి పంపేది. నాకేదైనా సందేశం వచ్చినప్పుడు నా మనస్సు చదివి, నేనివ్వదలచిన సమాధానాన్ని ముందే ఆమె చెప్పేది.

ఆయీకి సాయిబాబాపై అమితమైన భక్తి, శ్రద్ధలుండేవి. ఆమె బాబా సంస్థానానికి చేసిన సేవలు ఎనలేనివి. కానీ ఆమె చాలా పరుషంగా మాట్లాడేది అని చెప్పక తప్పదు. అందువల్ల ఎవరూ ఆమెతో సఖ్యతగా ఉండేవారు కాదు. బహుశా మాలో సహనాన్ని పెంచేందుకే బాబా మమ్మల్ని ఆయీ ఇంటికి పంపించి ఉండవచ్చు.

బాబా ఆధ్యాత్మిక బోధన ప్రత్యేకంగా ఉండేది. వారు ఎవరికీ మంత్రోపదేశం చేయలేదు. వారెప్పుడూ యోగ, ప్రాణాయామం, కుండలిని మొదలైన వాటి గురించి మాట్లాడలేదు. కానీ ఆయా మార్గాలలో సాధన చేసేవారికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు సాయిబాబాను ఆశ్రయిస్తే, వారు ఆ లోపాన్ని సరిదిద్ది పంపేవారు. ఆసనాలు, ప్రాణాయామం అభ్యసిస్తున్న ఒక వ్యక్తికి వాటిలో ఏదో పొరపాటు జరిగి రక్త విరేచనాలు కాసాగాయి. అతను బాబా వద్దకు వచ్చి శిరిడీలో కొద్దిరోజులున్న తరువాత అతని ఆరోగ్యం కుదుటపడింది.



హెచ్.ఎస్. దీక్షిత్



ఆర్.బి. పురందరే

## 7

## మే 4వ తేదీ, 1936- పూనా

**రఘువీర్ బి. పురందరే,** రిటైర్డ్ గుమాస్తా, జి.ఐ.పి. రైల్వే, వయస్సు 60 సం॥లు, బ్రాహ్మణుడు, దేశస్థ, శుక్ల యజుర్వేది (కేల్వామహిమ్, థానా జిల్లా), తండ్రి: భాస్కర పురందరే, ప్రస్తుత నివాసం: సాయినాథ్ ఆశ్రమం, 59- బి, పెర్రీరోడ్, బాంద్రా.

నాకు మొదటి నుండి సాధు సత్పురుషులను ఆశ్రయించాలనే కోరిక ఉండేది. నేను 1909లో మొదటిసారిగా సాయిబాబా పేరు విన్నాను. వారొక సత్పురుషుడని విని ఆకర్షితుడనయ్యాను. తరువాత వారు నా కలలో కనిపించి శిరిడీ రమ్మన్నారు. అప్పుడు మా పెద్దపాపకు (ఆరు నెలల వయసు) అనారోగ్యంగా ఉండటంతో నేను శిరిడీ వెళ్ళేందుకు మా అమ్మ అభ్యంతరం చెప్పింది. కానీ నేను పట్టుబట్టి వాళ్ళను కూడా నాతో శిరిడీ తీసుకెళ్ళాను. మేము శిరిడీ చేరిన 3 రోజులకు పాపకు నయమయింది. కానీ మేము ఇంటికి వెళ్ళడానికి బాబా అనుమతి ఇవ్వలేదు. 13 రోజులు శిరిడీలోనే ఉంచారు. నేను బాబాను ఏ కోరికా కోరలేదు. బాబా నా గురించి మా అమ్మతో చెబుతూ ***"మా అనుబంధం ఏడు శతాబ్దాలనాటిది. నేనతడిని మరచిపోను. అతను రెండు వేల మైళ్ళ దూరంలో ఉన్నా నేనెప్పుడూ గుర్తుంచుకొనే ఉంటాను. అతను లేకుండా నేనొక ముద్దైనా తినను"*** అన్నారు. తరువాత బాబా అనుమతితో నాశిక్ మీదుగా మేము నివసిస్తున్న దాదర్‌కు తిరిగి వచ్చాము.

ఒకసారి నా భార్యకు కలరా సోకింది. ఆమెకు చికిత్స చేస్తున్న వైద్యుడు ఆశ వదులుకోమన్నాడు. అప్పుడు మా ఇంటి ఎదురుగా ఉన్న దత్తమందిరం ప్రక్కన సాయిబాబా నాకు దర్శనమిచ్చి నా భార్యకు ఊదీ, తీర్థం ఇవ్వమని ఆదేశించారు. నేను అలాగే చేశాను. అరగంట తరువాత ఆమె పరిస్థితి మెరుగుపడింది. డాక్టరు వచ్చి చూసి ఆమెకు ప్రమాదం తప్పిందని చెప్పాడు. ఆమె కోలుకుంది. అప్పటి నుండి నేను తరచూ శిరిడీ వెళ్ళి బాబా ఆదేశానుసారం ఎక్కువ రోజులు అక్కడే గడిపేవాడిని. అప్పుడప్పుడు బాబా కూడా నన్ను శిరిడీ రమ్మని దీక్షిత్‌చే జాబు వ్రాయించేవారు. నేను తరచుగా దీక్షిత్‌తో కలిసి బాబాను దర్శించేవాడిని.

నేను చాలా పేదవాడిని. అయినప్పటికీ ఏ ప్రాపంచిక ఉద్దేశ్యాలతో శిరిడీకి వెళ్ళేవాడిని కాదు. నేను ముందు నుండి చేస్తున్న ఉపాసననే

కొనసాగించమని బాబా చెప్పారు. నేను విష్ణుమూర్తిని ఆరాధించేవాడిని. అందువల్ల ఆ ఉపాసననే కొనసాగించాను. బాబా పలుమార్లు నన్ను రెండు రూపాయల దక్షిణ అడుగుతుండేవారు. ఒకసారి నేను బాబాను "ఎందుకు నన్నెప్పుడూ రెండు రూపాయల దక్షిణ అడుగుతున్నారు?" అని అడిగాను. అందుకు వారు *"నేను అడిగింది నువ్వు అనుకుంటున్న ఈ రూపాయలు కాదు. ఒకటి "నిష్ఠ" (అనన్యమైన నమ్మకము), రెండవది "సబూరి" (సంతోషంతో కూడిన ఓరిమి)"* అన్నారు. నేను "అవి మీకు ముందే సమర్పించాను" అన్నాను. బాబా *"అలాగే నీ నిష్ఠ చెదరకుండా కాపాడుకో. అంతేగాక నీవు చేసిన వాగ్దానాలన్నీ నెరవేర్చు. నీవెప్పుడూ సత్యాన్నే అంటిపెట్టుకో. అప్పుడు నీవు ఎక్కడున్నా, అన్ని సమయాలలో నేను నీతోనే ఉంటాను"* అని హామీ ఇచ్చారు. దానికి నేను "బాబా మీరు చెప్పినట్లుగా నడుచుకోడానికి ప్రయత్నిస్తాను. కానీ నా మనస్సు నా ఆధీనంలో ఉండేటట్లు మీరు అనుగ్రహించాలి" అన్నాను. దానికి వారు సమ్మతించారు. ఇదంతా నా ప్రథమ దర్శనంలోనే జరిగింది.

బాబా నన్ను స్వంతంగా ఒక ఇల్లు కొనుక్కోమని ప్రోత్సహించారు. నా జీతం నెలకు 35 రూపాయలు. బాబా కొనమని చెప్పగానే నేను బాంద్రాలో స్థలం కొన్నాను. మొదట్లో నిర్మాణం కొంచెం ఆలస్యమైనందుకు బాబా నాపై రాళ్ళు రువ్వేవారు. నా పరిస్థితి చూసి చాందోర్కర్, దీక్షిత్ తాము ఇల్లు కట్టించి ఇస్తామని ముందుకొచ్చారు. కానీ బాబా ఒప్పుకోలేదు. *"ఎవ్వరినీ ఒక్క పైసా కూడా అడగవద్దు. నేను నీకు సహాయం చేస్తాను"* అని బాబా అన్నారు. నేను ఆఫీసులో 500 రూపాయలు అప్పు తీసుకొని ఇల్లు కట్టడం ప్రారంభించాను. చివరకు బాబా అనుగ్రహంతో మూడు సంవత్సరాలలో దానిని పూర్తిచేశాను. అది ఊరికి దూరంగా జనసంచారంలేని ప్రదేశంలో ఉండేది. అప్పుడు బాబా మా ఇంట్లోనే తానున్నానని, నన్ను నా భార్యను కాపాడుతుంటానని చెప్పారు. అందువల్ల నేను అక్కడే ఉండిపోయాను. నేను ఇప్పటికీ ఆ ఇంట్లోనే నివసిస్తున్నాను.

'సత్యాన్నే అంటిపెట్టుకొని ఉండమని' బాబా నాకు ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. వారు మహాసమాధి చెందిన తరువాత నాకు కలలో కనపడి శిరిడీ వెళ్ళి సంస్థాన్ విధులు నిర్వహించమని చెప్పారు. నేనలాగే చేశాను. నేనిప్పుడు సంస్థాన్ ఉమ్మడి కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. విధి నిర్వహణలో

భాగంగా నేను చేయవలసిన పనులు, చేస్తున్న పనులు అన్నీ వారి నిర్దేశకత్వంలోనే జరుగుతున్నాయని నేను గుర్తిస్తున్నాను.

బాబా నన్ను హెచ్.ఎస్. దీక్షిత్‌కు సహకరించమని చెప్పేవారు. అలాగే నాకు సహకరించమని దీక్షిత్‌కు చెప్పేవారు. మేమిద్దరం అత్యంత సన్నిహిత మిత్రులుగా మెలిగేవాళ్ళం.

ధ్యానాన్ని గురించి బాబా నాతో ఎప్పుడూ మాట్లాడలేదు. అంతేగాక తమనే పూజించమని బాబా ఎవ్వరితోనూ చెప్పలేదు. తమ తమ ఇష్టదైవం యొక్క ఉపాసనను కొనసాగించమని చెప్పేవారు. ఆయా భక్తులకు వారి ఉపాసనాదైవాల రూపంలో బాబా దర్శనమిచ్చేవారు.

1913లో మా అమ్మ పండరిపురం వెళదామని ఒత్తిడి చేసింది. నేను ఈ విషయం బాబాకు చెప్పలేదు. బాబా తమంతటతాముగా ఆ ప్రస్తావన తెచ్చి ***"అమ్మా! పండరి ఎప్పుడు బయలుదేరుతున్నావు?"*** అని మా అమ్మని అడిగారు. ఆ రోజు మసీదులో నా భార్యకు, మా అమ్మకు రుక్మిణీ సమేత విఠలునిగా బాబా దర్శనమిచ్చారు. వాళ్ళు ఆనందంతో పులకించిపోయారు. ఆపై పండరి ప్రయాణం మానుకున్నారు. బాబా తరచూ మా అమ్మను ***"అమ్మా! పండరి ఎప్పుడు వెళుతున్నావు?"*** అని అడిగేవారు. దానికి ఆమె "నా దేవుడిక్కడే ఉన్నాడు. శిరిడీయే నా పండరి"[1] అని జవాబు చెప్పేది.

ఒకసారి నా భార్య ప్రసవానికి ముందు అనారోగ్యంతో బాధపడింది. బాబా ఆమెకు కలలో కనబడి ఊదీ రాసారు. వెంటనే ఆమె మేల్కొని, "లేవండి. బాబా వచ్చారు. ధుని నుండి వెచ్చని ఊదీ తీసి పెడుతున్నారు. నా శరీరమంతా కాలిపోతోంది" అంటూ కలవరించసాగింది. తరువాత ఆమెకు ఆరోగ్యం చేకూరింది. ఆ విధంగా ఆమెకు ఎన్నోసార్లు బాబా కనిపించేవారు.

నేను కష్టాలలో ఉన్నప్పుడు బాబా పటం ముందు కూర్చొని ఏడ్చేవాడిని. బాబా వెంటనే నా ముందు ప్రత్యక్షమై నన్ను ఓదార్చేవారు. నానాసాహెబ్

---

*1. "శిరిడీ మాఝే పండరిపుర్ సాయిబాబా రమావర్"*

*"శిరిడీయే నా పండరిపురము, శ్రీసాయియే నా విఠలుడు" అనే చరణం శిరిడీ ఆరతులలో భాగమై, గత 30 సంవత్సరముల నుండి అందరూ పాడుకుంటున్నారు.*

చాందోర్కర్ జామ్నేరులో మామ్లత్‌దార్‌గా పనిచేస్తున్నప్పుడు అతని కుమార్తె ప్రసవం కష్టమై ప్రమాద పరిస్థితి ఏర్పడినప్పుడు రామ్‌గిరి గోసావి అనువాని చేత బాబా ఊదీ పంపారట. అతనిప్పటికీ శిరిడీలో జీవించే ఉన్నాడు. రామ్‌గిరిబువాను బాబా 'బాబూగిర్' అని పిలిచేవారు. రామ్‌గిర్ జాల్నా స్టేషనులో ఉన్నప్పుడు అతడికి ఒక గుఱ్ఱపు బండి నడిపే అతను కనపడి టాంగాలో రామ్‌గిర్‌ను జామ్నేరు చేర్చి టాంగాతో సహా అంతర్ధానమయ్యాడట. టాంగాను చాందోర్కర్ పంపలేదట. బాబా పంపిన ఊదీతో చాందోర్కర్ కుమార్తెకు సుఖప్రసవమయిందట. ఈ వృత్తాంతాన్ని నానాసాహెబ్ నాకు చెప్పాడు. అతనికి బాబు, బాపు అను ఇద్దరు కుమారులున్నారు. వారిప్పుడు కళ్యాణ్‌లో నున్న చాందోర్కర్ వాడాలో ఉన్నారు. కుమార్తె పూనాలో ఉంది.

చాందోర్కర్‌కు తను గొప్ప సంస్కృత పండితుడనే గర్వం ఉండేది. ఒకసారి బాబా "తద్విద్ధి ప్రణిపాతేన..." అనే భగవద్గీత శ్లోకానికి అర్థం చెప్పమన్నారు. చాందోర్కర్ తనకు తెలిసిన అర్థతాత్పర్యాలు చెప్పాడు. నానా చెప్పిన అర్థం సరికాదని చెప్పి బాబా సరియైన అర్థం వివరించారు. బాబాకు సంస్కృత పరిజ్ఞానం కలదని, వారు అప్పుడప్పుడు భాగవతంలోని శ్లోకాలను ఆయా భక్తులకు సందర్భోచితంగా చెప్పేవారని నానా చెప్పాడు. దీని ద్వారా నానా చెప్పింది నిజమేనని తెలుస్తుంది. (ఈ లీల సచ్చరిత్రలోను, దాసగణు రచించిన భక్తలీలామృతంలోని 31,32,33 అధ్యాయాలలోను, సంతకథామృతంలోని మొదటి అధ్యాయంలోను, దాభోళ్కర్ రచించిన భావార్థదీపికలోను వివరించబడింది).

అద్వైతము మొదలైన వాటి గురించి బాబా మాట్లాడగా నేను ఎప్పుడూ వినలేదు. ఎల్లప్పుడూ ***"అల్లా రక్షిస్తాడు", "పేదలకు పెన్నిధి భగవంతుడు (గరీబ్ కో అల్లా వాలీ హై, అల్లా అచ్ఛా కరేగా)"*** అని పలికేవారు. అన్ని జీవులలో తామున్నట్లు బాబా నాకెప్పుడూ చెప్పలేదు. కానీ వారు తరచుగా దైవంతో తాదాత్మ్యాన్ని చెంది ఉండేవారు. ప్రాణాయామం, కుండలిని మొదలైన సాధనల గూర్చి కూడా వారెప్పుడూ మాట్లాడలేదు. నేను కూడా వాటిని గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు.

***"ఎవరైతే ఈ మసీదులో అడుగిడతారో వాళ్ళు గమ్యాన్ని చేరుకుంటారు (జో కోయీ యే మస్‌జిద్ మే ఆవే, జిస్‌కా మస్‌జిద్‌మే పాయ్ లగా, ఉస్‌కా బేడా***

*పార్ హై). ఎవరి మంచితనం ఎట్లా ఉంటే, వారి అభివృద్ధి కూడా అట్లాగే ఉంటుంది (జైసీ జిస్‌కీ నియత్, వైసి ఉస్‌కూ బర్కత్)"* అనేవారు బాబా.

**బాబా దేహత్యాగం – ముందుగా సూచించుట:**

1916 విజయదశమి నాడు శిరిడీలో సీమోల్లంఘన ఉత్సవం జరుగుతూ ఉంది. ఆ రోజు గ్రామస్థులందరూ శమీవృక్షాన్ని పూజించి, శమీ ఆకులు ఒకరికొకరు పంచుకొని, ఊరి పొలిమేరలు దాటుతారు. అదే సీమోల్లంఘనం! ఆ రోజు బాబా కోపావేశాలతో ఉగ్రరూపం దాల్చారు. తమ కఫ్నీ, లంగోటి, తలగుడ్డ అన్నీ ధునిలో వేసి తగులబెట్టారు. భక్తులు వారిని సమీపించి "బాబా ఈ పర్వదినాన మీరు ఎందుకు ఇలా చేస్తున్నారు?" అనడిగారు. అప్పుడు బాబా ***"ఇదే నా సీమోల్లంఘనం"*** (అంటే సరిహద్దులు దాటడం) అని చెప్పారు. ఈ సంఘటన బాబా మహాసమాధి చెందడానికి (1918 విజయదశమికి) సరిగ్గా రెండు సంవత్సరముల ముందు జరిగింది.

రెండు గంటలు బాబా అలా నగ్నంగా ఉన్న తరువాత భక్తుల బలవంతంపై కొత్త లంగోటి, కఫ్నీ, తలగుడ్డ ధరించారు (పండుగనాడు అందరూ కొత్తబట్టలు ధరించే విధంగా). బాబా కొరకు భక్తులు ఎప్పుడూ కొత్త బట్టలు సిద్ధంగా ఉంచేవారు.

అదే రోజు అనారోగ్యంతో ఉన్న రామచంద్ర దాదాపాటిల్ తో ***"తాత్యాపాటిల్ రెండు సంవత్సరాల తరువాత ఇదే రోజున మరణిస్తాడు"*** అని బాబా చెప్పారు. వారు చెప్పినట్లుగా రెండు సంవత్సరాల తరువాత తాత్యా తీవ్రంగా జబ్బుపడ్డాడు. దసరాకు వారం రోజుల ముందు నుండి బాబా కూడా అనారోగ్యంతో ఉన్నారు. తాత్యా

---

*"లోక్ సమజ్‌తాత్ కీ, ఆపణ్ నిర్‌నిరాలే ఆహోత్. పణ్ హే లోక్ చుకీచే సమజ్‌తాత్, మీ తుమ్చ్యా మధ్యే ఆహే, తుమ్హీ మాజ్యా మధ్యే ఆహాత్॥"* అంటే ***"ప్రజలందరూ తాము ఒకరి నుండి ఒకరు వేరని తలుస్తారు. కానీ అది నిజం కాదు. నేను నీలో ఉన్నాను. నీవు నాలో ఉన్నావు"*** *అని 1913-14 ప్రాంతంలో బాబా అన్నారు. ఇంకా,* ***"నీవు ఈ విధంగా ఆలోచిస్తూ వుంటే, అప్పుడు ఈ మాటలలోని భావం నువ్వే తెలుసుకుంటావు"*** *అన్నారు.*

*"నేనే పరమసత్యాన్ని" అని బాబా చెప్పలేదు. తాము సర్వ జీవులలో ఉన్నామని బాబా చెప్పారు.*

కోలుకున్నాడు కానీ బాబా నిర్యాణం చెందారు. తాత్యాను బ్రతికించేందుకే బాబా తమ ప్రాణాన్ని పణంగా పెట్టారని అందరూ అనుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఇతర మహాత్ముల జీవితాలలో కూడా జరిగాయి. ఈనాటికీ బాబా తమ భక్తులను కాపాడుతున్నారు. నా జీవితంలో జరిగిన మరో సంఘటన వివరిస్తాను.

1932లో నేను కీళ్ళజబ్బుతో తీవ్ర అనారోగ్యానికి గురై మృత్యువుకు దగ్గరయ్యాను. యమదూతలు నా ప్రాణాన్ని తీసుకెళ్ళడానికి సమీపిస్తున్నారు. అప్పుడు బాబా వచ్చి నా మంచంపై కూర్చొని, నా చేతిని తీసుకొని తమ మోకాలిపై ఉంచారు. సమీపిస్తున్న యమదూతలను తరిమికొట్టి నన్ను రక్షించారు.

బాబా సమాధి చెందడానికి పన్నెండు లేక పదిహేనురోజుల ముందు నన్ను, దీక్షిత్‌ను బొంబాయి వెళ్ళిపొమ్మని ఆదేశించారు. *"నేను చాలా దూరం వెళుతున్నాను. మీరు నన్ను తరువాత అనుసరించండి"* అని చెప్పారు. ఇంకా *"నా సమాధి సమాధానమిస్తుంది. నా నామం పలుకుతుంది. నా మట్టి మాట్లాడుతుంది"* అన్నారు. మేము వెళ్లిపోయాము. అప్పటికి బాబాకు ఎలాంటి సుస్తీ లేదు. కనుక బాబా దేహత్యాగం చేస్తారని మేము ఊహించలేదు. అంతకుమునుపు కూడా వారు అవే మాటలు పలికి ఉన్నారు. ఆ మాటల్లోని ఆంతర్యం అప్పుడు మాకు బోధపడలేదు.

నాకు కోపం ఎక్కువ. త్వరగా ఆవేశానికి లోనయ్యేవాడిని. బాబా తరచుగా నాతో *"నిన్నెవరైనా దూషించినా, దండించినా వారితో గొడవకు దిగవద్దు. నీవు సహించలేకుంటే ఒకటి రెండు మాటలతో సమాధానం ఇవ్వు లేదా ఆ చోటు వీడి వెళ్ళిపో, అంతేగానీ వారితో పోట్లాడవద్దు (కిసీసే వాదావాదీ (బరోబరీ) కర్‌నా నహీ). మీరు ఎవరితోనైనా తగవు పెట్టుకుంటే నాకు అసహ్యము, బాధ కలుగుతుంది"* అని పలికేవారు. ఈ హితవాక్యాలు నాతోనే కాక ఇతర భక్తులతోనూ అనేకసార్లు చెప్పేవారు.

బాబా ఎప్పుడూ నాకు తెలిసినంత వరకు కైలాసం, వైకుంఠం, స్వర్గం, జీవితం యొక్క లక్ష్యం, మోక్షం గురించి మాట్లాడలేదు. కానీ ఒకసారి *"నా కాకాను విమానంలో తీసుకెళ్తాను"* అన్నారు. విమానంలో తీసుకెళ్ళడమంటే సద్గతినివ్వడం అని అర్థం. అట్లాగే దీక్షిత్ 1926లో ఒక ఏకాదశినాడు బాబా గురించి మాట్లాడుతూ ప్రశాంతంగా ప్రాణాలు విడిచాడు. బాబా అప్పుడప్పుడు నాతోను, ఇతర భక్తులతోను *"నావాడు వెయ్యిమైళ్ళ అవతల మరణించినప్పటికీ, పిచ్చుక కాలికి దారం కట్టి*

*లాగినట్లు లాగి నా వద్దకు చేర్చుకుంటాను"* అని చెప్పేవారు. ఇంకా ***"నావాడిని నా నుండి దూరంగా వెళ్ళడానికి అనుమతించను"*** అని కూడా చెప్పేవారు. నాకు తెలిసి కొందరు ఏకాదశినాడు శిరిడీలో మరణించారు. వారు తప్పక స్వర్గానికి చేరి ఉంటారని నా అభిప్రాయం.

బాబా అప్పుడప్పుడు భవిష్యత్తును గురించి చెప్పేవారు. కానీ నా భవిష్యత్తును గురించి నేను ఎప్పుడూ వారిని అడగలేదు. 1914-16 మధ్య ఒకామె బాబా దగ్గరకొచ్చి "నాకు ఎప్పుడు మంచి జన్మ లభిస్తుంది?" అనడిగింది. బాబా *"నీ మరుజన్మలో (దుస్‌రే జనమ్ మేం)"* అని సమాధానమిచ్చారు. ఆమె మరుసటిరోజు తన ప్రస్తుత జన్మను అంతం చేసుకోదలచి వెళ్ళి బావిలో దూకేసింది. కానీ ఆమెను ఎవరో రక్షించారు.

బాబా సశరీరులుగా ఉన్నప్పుడు ఒకసారి సగుణ్‌మేరు నాయక్‌ను పిలిచి ***"అన్నంలో నెయ్యి కలిపి, దానిలో కొంత ధునికి సమర్పించి, మిగతాది నాకు తీసుకురా"*** అన్నారు. అతను అలాగే చేశాడు. బాబా ఆ నివేదనను స్వీకరించారు. (అంతకుముందు సగుణ్ తెచ్చే నైవేద్యంలో నెయ్యి ఉండేది కాదు.) సగుణ్ ఆ రోజు నుండి అలాగే చేయడం మొదలుపెట్టాడు. ప్రతిరోజు నివేదన సగుణ్‌మేరు నాయక్ ఇంటి నుండే వచ్చేది. ఇప్పటికీ అది అలాగే కొనసాగుతోంది. బాబా మాంసాహారం తినడం నేను చూడలేదు. మహమ్మదీయులు నివేదన చేస్తున్నప్పుడు బాబా ఫకీర్లను "ఫత్యా" (ప్రార్థన) చదవమని చెప్పేవారు.

ఒకసారి బాబా నా వద్దనున్న పాత రాగినాణాలన్నీ తమకు ఇవ్వమన్నారు. నేను నా దగ్గరున్నవన్నీ వారికి ఇచ్చాను. వాటిని వారేమి చేశారో నాకు తెలియదు. బాబా తమ దగ్గరున్న నాణాలన్నిటిని గుడ్డ మడతలలో మూటకట్టి (ఒకదానితో ఒకటి కలిసి గలగల ధ్వని చేయకుండా ఉండేటట్లు) వారి జేబులో పెట్టుకునేవారు. ఒకసారి బాబా దక్షిణ అడిగారు. నా వద్ద ఉన్నదంతా ఇచ్చేసాను. ఇంకోసారి ఇలాగే నా దగ్గరున్న నాణాలన్నీ బాబాకు ఇచ్చేసాను కదా అని అనుకుంటున్నప్పుడు ***"నీ జేబులో రెండణాల నాణెమొకటి మిగిలి ఉంది చూడు"*** అన్నారు. చూస్తే నిజంగానే ఉంది. దానిని కూడా వారికి ఇచ్చేసాను. బాబా ఇలా చాలామంది భక్తుల దగ్గరున్న డబ్బంతా తీసేసుకునేవారు. వారలా ఎందుకు చేసేవారో నాకు తెలియదు. కొందరు

భక్తులు బాబాను అంత డబ్బు ఎందుకు తీసుకుంటారని అడిగేవారు. *"నేనందరినీ అడగను. ఆ ఫకీరు (దేవుడు) ఎవరిని చూపిస్తారో వాళ్ళనే అడుగుతాను. కానీ బదులుగా వాళ్ళకి నేను తీసుకున్న దానికి పదింతలు ఇవ్వవలసి ఉంటుంది. నేను నా స్వంతానికి ఏమీ తీసుకోను. నాకు ఏ సంసారమూ లేదు"* అని జవాబు ఇచ్చేవారు. గాయకులకు, వీధి నాటకాల వారికి, ఫకీర్లకు బాబా ధారాళంగా డబ్బులిచ్చేవారు. ధుని కోసం బాబా మోపుల కొద్దీ కట్టెలు కొనేవారు. మాలేగాం ఫకీరుకు (బడేబాబా, బడేమియా అని బాబా పిలిచేవారు) బాబా నుండి అధిక మొత్తంలో డబ్బు లభించేది.

మసీదులో 1909-12 ప్రాంతంలో తులసీ బృందావనం ఏర్పాటు చేయబడింది. ఆ కార్యక్రమంలో మేమంతా సహాయపడ్డాము. మసీదు ముందు మండపం 1912లో నిర్మించబడింది. జి.యస్. ఖాపర్డే, సాఠేవాడాలో "పంచదశి"ని చదివి భక్తులకు వివరించేవాడు. దీనికి ఉపాసనీబాబా కూడా హాజరయ్యేవారు. నేను నిరంతరం ఇతర పనులలో నిమగ్నమై ఉండడంతో ఎప్పుడూ అక్కడకు వెళ్ళలేదు. రిటైర్డ్ సబ్‌జడ్జి అయిన బల్వంత్ రామచంద్ర నూల్కర్ శిరిడీ వచ్చి, అక్కడే నివసించి శిరిడీలోనే నిర్యాణం చెందాడు.

1915లో బాబా తీవ్ర ఉబ్బసంతో బాధపడసాగారు. ఆయాసంతో శ్వాస కూడా సరిగా తీసుకోలేకపోయారు. వారు ఆహారం తీసుకోవడం మానివేసారు. నేను బాబా పరిస్థితి చూసి రోదించాను. *"ఎందుకు ఏడుస్తున్నావు?"* అని బాబా అడిగారు. నేను "మిమ్మల్ని ఈ స్థితిలో చూడలేకపోతున్నాను బాబా" అన్నాను. *"భయపడకు. రెండు మూడు రోజులలో నేను కోలుకుంటాను. అల్లా నాకు ఈ వ్యాధిని ఇచ్చారు. వారే దీనిని తగ్గిస్తారు. నీవు ఏడవవద్దు. గత రెండు మూడు రోజులుగా నీవే జ్ఞాపకం వస్తున్నావు. అందుకే నిన్ను రమ్మంటూ జాబు వ్రాయమని కాకాతో చెప్పాను"* అని బాబా అన్నారు. కానీ దీక్షిత్ నాకు జాబు వ్రాయలేదు. అసలు జరిగిన విషయమేమంటే బాబా ఆజ్ఞమేరకు దీక్షిత్ నాకు జాబు వ్రాయబోతుంటే *"అతనే వస్తున్నాడు, జాబు వ్రాయనవసరం లేదు"* అని బాబా అన్నారట. బాబా అనారోగ్యంతో ఉన్నారని నాకు తెలియదు. ఎందుకో వారిని చూడాలనిపించి బయలుదేరాను. బాబా ఎంత అనారోగ్యంతో ఉన్నప్పటికీ మందులు వేసుకునేవారు కాదు. అది వారి పద్ధతి. ఎంత సుస్తీగా ఉన్నప్పటికీ భిక్షకు

వెళ్ళడం మానరు. ఒక్కొక్కసారి భక్తుల సహాయంతో నడిచి వెళ్ళి భిక్ష చేసేవారు కానీ బాబా దానిని తినేవారు కాదు. వారు అనారోగ్యంతో ఉన్నా తమ రోజువారి దినచర్యను ఏ మాత్రమూ మానేవారు కాదు. బాబా అనారోగ్యంగా ఉన్నప్పుడు, ఒక భక్తుడు చక్రాల కుర్చీ తెచ్చాడు. కానీ దానిని ఆయన ఏనాడూ ఉపయోగించలేదు.

బాబాకు సుస్తీగా ఉన్నరోజుల్లోనే ఒకసారి వారు నిచ్చెన సాయంతో ఒక ఇంటి మిద్దెపైకి ఎక్కి, అటు నుండి ఆ ప్రక్క ఇంటి మీదుగా రాధాకృష్ణ ఆయీ ఇంటి పైకి చేరారు. బాబా అక్కడ నుండి దిగడానికి ప్రయత్నిస్తున్నప్పుడు ఒకతను వారిని ఎత్తుకొని క్రిందికి తీసుకొచ్చాడు. బాబా అతనికి మూడునాలుగు రూపాయలిచ్చి ***"మనము ఎవరి కష్టాన్నీ ఉచితంగా పొందకూడదు"*** అని భక్తులకు చెప్పారు. నేను ఇవన్నీ ప్రత్యక్షంగా చూసాను.

1920లో నా భార్య తీవ్ర అనారోగ్యానికి (ఇన్ఫ్లూయంజా) గురై ప్రమాదస్థితికి చేరుకొంది. ఆమె రాబోయే ఉరుసు- రామనవమి ఉత్సవాలకు శిరిడీ వెళ్ళలేక పోతున్నందుకు బాధపడసాగింది. ఆ రాత్రి బాబా ఆమె కలలో కనబడి ***"బాధపడకు నేను నిన్ను ఉరుసు ఉత్సవానికి తప్పక తీసుకెళతాను"*** అని హామీ ఇచ్చారు. మరునాటి ఉదయం ఆమె కొద్దిగా కోలుకొని, ఆ కల విషయం నాతో చెప్పింది. కానీ ఆమె అనారోగ్యంతోనే శ్రీరామనవమినాడు "బాబా, బాబా" అని బాబా నామాన్ని ఉచ్ఛరిస్తూ తుదిశ్వాస విడిచింది.

ఇక శిరిడీలో శ్రీరామనవమి ఉత్సవాలు ఎలా జరుగుతాయో వివరిస్తాను. ఉదయం 10 గంIIలకు జెండాలను గ్రామమంతా ఊరేగించి మసీదుపైన కడతారు. తరువాత 12 గంటలకు హిందీలో 'రామజన్మ' కీర్తన పాడడం మొదలవుతుంది. మహమ్మదీయులు కూడా ఖురాను చదవడం మొదలుపెట్టి చందనాన్ని గ్రామమంతా ఊరేగింపుగా తీసుకువెళతారు. ఈ చందనోత్సవంలో హిందువులు, హిందువులు చేసే జెండా ఉత్సవంలో మహమ్మదీయులు పాల్గొనేవారు. అందుకే హిందూ ముస్లింల మధ్య విభేదాలు తొలగించి సోదరభావం నెలకొల్పేటందుకే బాబా జన్మించారు అని బాబాకు పాడే ఆరతి గీతాలలో కీర్తిస్తారు (యవనస్వరూపీ ఏక్యా దర్శన త్వాధిదలేII సంశయ నిరసునియా తద్వైతా ఘాలవిలేII గోపీచందా మందా త్వాంచీ ఉద్ధరిలేII మోమిన వంశీ జన్ముని లోకా తారియలేII).

బాబా స్నానం చేస్తున్నప్పుడు నేను చూడటం జరిగింది. నాకు తెలిసినంతవరకు వారికి సున్తీ చేయలేదు. వారి చెవులు కుట్టబడి ఉన్నాయి.

మేఘుడు బాబాను శివుని యొక్క అవతారంగా భావించి ఒంటికాలిపై నిలుచుని పూజించేవాడు. బాబా మేఘుని కలలో కన్పించి అతను నివసిస్తున్న సాఠేవాడాలోని గోడపై త్రిశూలం గీయమని ఆదేశించారు. మేఘుడు అలాగే చేశాడు. మరుసటి రోజు బాబా అతనికి పూజించుకునేందుకు ఒక శివలింగం కూడా ఇచ్చారు. ఆ శివలింగం ఈనాటికీ ఉంది. మేఘుడు నాకొక అద్భుత లీల గురించి ఇలా చెప్పాడు. ఒకసారి మేఘుడు బాబాకు గంగా జలంతో స్నానం చేయించదలచి వారి అనుమతిని కోరాడు. బాబా *"శరీరానికి శిరస్సే ప్రధానమని, తమ తలపై కొంచెం నీళ్ళు పోసి, తలను మాత్రం తడపమని"* చెప్పారు. అప్పుడు మేఘుడు కోపర్‌గాం వద్ద ఉన్న గోదావరి నుండి కుండతో నీళ్ళు తెచ్చి భక్తి పారవశ్యంతో బాబా తలపై కుమ్మరించాడు. కానీ అద్భుతమేమంటే బాబా తల మాత్రమే తడిచింది, తలక్రింది భాగమంతా అంటే చేతులు, కాళ్ళు, కఫ్నీ ఏమీ తడవలేదు.

బాబా ఒకటి, రెండుసార్లు పాటలు పాడగా నేను విన్నాను. భక్తులు పాటలు పాడినప్పుడు బాబా ప్రసన్నంగా వినేవారు.

మేము సాఠేవాడాలో బాపూసాహెబ్ జోగ్ నిర్వహిస్తున్న ఏకనాథ భాగవత పారాయణకు హాజరయ్యేవాళ్ళం. అద్భుతమైన విషయమేమంటే, జోగ్ పారాయణ చేసే భాగంలో అంతకుముందు మసీదులో బాబా మాతో మాట్లాడిన మాటలు ఉండేవి. మేమంతా ఆశ్చర్యపోయేవాళ్ళం. ఇలాంటి అనుభవం చాలాసార్లు జరిగింది. కానీ నాకు ఆ వివరాలు ఒక్కటి కూడా గుర్తులేదు.

**1936 మే 5వ తేదీన చెప్పిన విషయాలు:**

బాబా ప్రతిదినం వేకువఝామున ధుని దగ్గర దక్షిణాభిముఖంగా స్తంభాన్ని ఆనుకొని కూర్చొని ఏదో చేస్తూ ఉండేవారు. ఏం చేస్తుంటారో నాకు తెలియదు. ఆ సమయంలో ఎవరినీ వారి వద్దకు రానిచ్చేవారు కాదు. భక్తులు వారికి 50 అడుగుల దూరంలో ఉండేవారు. సేవకులు మాత్రం చిమ్మడం, శుభ్రం చేయడం, ధునిలో కట్టెలు వేయడం మొదలైన పనులు చేస్తూ ఉండేవారు. బాబా ఆ సమయంలో *"యాదేహక్"* వంటి పదాలను ఉచ్చరిస్తూ ఉండేవారు. కానీ

అవి దూరంగా ఉన్న మాకు అరుదుగా వినపడేవి. వారు తరచుగా *"భగవంతుడే యజమాని, రక్షించువాడు (అల్లామాలిక్, అల్లావలీహై)"* అనేవారు.

నేను ఒకసారి శిరిడీ వెళ్ళడానికి నిర్ణయించుకొని ఆఫీసుకు సెలవు పెట్టాను. మా అమ్మకు కూడా చెప్పాను. నేను మరుసటి రోజు సాయంత్రం శిరిడీ బయలుదేరవలసి ఉంది. కానీ ఆ రోజు రాత్రి బాబా నా కలలో కన్పించి *"శిరిడీ రావద్దు"* అని చెప్పారు. బాబా అలా ఎందుకు చెప్పారా? అని నేను ఆశ్చర్యపోయాను. నేను వారి ఆదేశం మేరకు శిరిడీ వెళ్ళడం మానుకొని ఆఫీసుకు వెళ్ళాను. అకస్మాత్తుగా ఆ మర్నాడు నుండి వర్క్‌షాప్ కార్మికులందరూ సమ్మె ప్రారంభించారు. ముందు అనుకున్నట్లుగా నేను ఆ రోజు శిరిడీ వెళ్ళివుంటే, నాకూ సమ్మెలో భాగముందని అధికారులు అనుమానించి నాపై చర్య తీసుకునేందుకు అవకాశముండేది. బాబా నన్ను శిరిడీ రాకుండా ఆపి వీటన్నిటి నుండి రక్షించారు.

ఇంజనీరుగా పనిచేస్తున్న రఘునాథ్ ముకుంద్ గారి మనుమడు యశ్వంతరావు 1911 లేక 1912లోనో గురుపూర్ణిమకు నా వెంట శిరిడీ వచ్చాడు. అప్పుడు శిరిడీలో కలరా ప్రబలి ఉంది. యశ్వంతరావు నాకన్నా ముందుగా ఊరికి తిరిగి వెళ్ళదలచుకోలేదు. కానీ అతనిని ఇంటికి వెళ్ళమని ఆదేశిస్తూ బాబా ఊదీ ఇచ్చారు. అయినా అతను బయలుదేరదలచుకోలేదు. బాబా దగ్గర సెలవు తీసుకున్నాడు కనుక వెళ్ళడమే మంచిదని అతనికి నేనూ చెప్పాను. కానీ అతను శిరిడీలోనే ఉండిపోయాడు. ఆ రాత్రి అతనికి కలరా సోకి మరునాటి ఉదయం చనిపోయాడు.

మేఘుడు మరణించడానికి రెండు మూడు రోజుల ముందు అనారోగ్యంతో ఉన్నప్పుడు బాబా అతనికి ఊదీ ఇచ్చారు. అతను మరణించినప్పుడు బాబా చూడడానికి వెళ్ళారు. అతని శవాన్ని పూలతో కప్పి కన్నీరు కార్చారు. అంతేకాదు శవాన్ని దహనం చేసినప్పుడు స్మశానానికి కూడా వెళ్ళారు.

నేను ఒకసారి శిరిడీ నుండి ఇంటికి బయలుదేరాను. ఆ రోజు సోమవారం (సంత జరిగే రోజు). మన్మాడు వెళ్ళే చివరి రైలు కోపర్‌గాంలో సాయంత్రం 6.30 గం॥లకు బయలుదేరుతుంది. కానీ బాబా 4.30 గం॥ల వరకు వెళ్ళడానికి అనుమతించలేదు. అంతేకాదు రేగేను నాతో బయలుదేరమన్నారు. మేము

ఎడ్లబండి మాట్లాడుకొని బయలుదేరాము. గోదావరి తీరం చేరేటప్పటికి 6.45 గం॥లు అయింది. అక్కడి నుండి గోదావరి దాటి కోపర్‌గాం 7.45 గం॥లకు చేరాము. అప్పటికి మేం వెళ్ళవలసిన రైలు వెళ్ళిపోయింది. ఆ రోజుల్లో 6.30 గం॥ల తరువాత కోపర్‌గాం నుండి మన్మాడ్‌కు వెళ్ళేందుకు రైళ్ళు లేవు. అయితే ఆ రోజు ఒక స్పెషల్ రైలు నడుస్తుందని అది 8.15 గం॥లకు వస్తుందని స్టేషనులో తెలిసింది. ఆ రైలులో మన్మాడ్ చేరి అక్కడ నుండి ఇంటికి చేరుకున్నాము.

మొదటిసారి బాబాను దర్శించడానికి వెళ్ళినప్పుడు నన్ను ***"శాల"***కు వెళ్ళమన్నారు. నాకు అర్థం కాలేదు. 'శాల' అంటే రాధాకృష్ణఆయీ ఇల్లని దీక్షిత్ చెప్పాడు. నేను అక్కడికి వెళ్ళాను. ఆమె తలుపు తీయకుండానే ఎవరని అడిగింది. నేను చెప్పాను. కానీ ఆమె నన్ను లోనికి రానీయలేదు. నేను పది నిముషాలు అక్కడే నిరీక్షించి మసీదుకు వెళ్ళాను. బాబా ***"శాలకు వెళ్ళావా?"*** అని అడిగారు. వెళ్ళాను కానీ ఆమె తలుపు తీయలేదని వారికి చెప్పాను. **"మళ్ళీ వెళ్ళు"** అని ఆదేశించారు. నేను మళ్ళీ వెళ్ళగానే ఆమె తలుపు తీసి నా కాళ్ళపై పడి ఏడవసాగింది. నేను ఎంతో ఆశ్చర్యపోయాను. ఆమె ప్రవర్తన నాకు అర్థం కాలేదు.

ఆనాటి నుండి ఆయీ చనిపోయేంతవరకు మాతృప్రేమను నాకు పంచింది. నేను కూడా ఆమెను తల్లి వలె ప్రేమించసాగాను. ఆమే నాకు సర్వస్వం అయింది. ఆమె ఇచ్చే ఆదేశాలు పాటిస్తూ శిరిడీలో నేను ప్రతి నిమిషం బాబా సేవలో గడిపేవాడిని. ఆమె నా చేత ఎక్కువగా తన ఇంట్లోను, అప్పుడప్పుడు మసీదులోనూ పనులు చేయించేది. ఆయీ ఒక విచిత్రమైన స్వభావం కలది. ఆమె భక్తి పారవశ్యంతో పాటలు, కీర్తనలు ఎంతో శ్రావ్యంగా పాడేది. ఒక్కొక్కసారి పాటను మధ్యలో ఆపి విపరీతంగా నవ్వసాగేది లేదా గద్గదస్వరంతో పాడుతుండేది లేదా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ పాడలేక ఆపేసేది.

నేను ఆఫీసుకు సెలవు పెట్టి శిరిడీ వెళ్ళేవాడిని. కానీ సెలవు ముగిసిన తరువాత కూడా తరచూ బాబా నన్ను శిరిడీలోనే ఉంచేవారు. 1912లో ఒకసారి సెలవు ముగిసిన తరువాత దీర్ఘకాలం శిరిడీలోనే ఉంచేశారు. షామా తదితరులు బాబా దగ్గరకు వెళ్ళి "పురందరే యొక్క యజమాని అతడిని తప్పుపడతాడేమో,

అతనిని వెళ్ళనివ్వండి" అని ప్రార్థించారు. బాబా ***"నేనే అతని యజమానిని"*** అంటూ నన్ను శిరిడీలోనే ఉంచేశారు. ఇలా ఆ సంవత్సరంలో సెలవు ముగిసిన చాలా రోజులకు ఒక గురువారం రోజున ఒంటి గంటకు తిరిగి ఆఫీసుకు వెళ్ళాను. నేను సెలవు తీసుకోకుండా ఆఫీసుకు గైర్హాజరు అయినందుకు ఫోర్‌మెన్ సంజాయిషీ అడుగుతూ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేశాడు. నేను ఏమీ జవాబు చెప్పకుండా రాజీనామా పత్రాన్ని సమర్పించాను. ఉన్నతాధికారి అయిన విల్సన్ (డిప్యూటీ సూపరింటెండెంట్) నన్ను పిలిపించి, ఇన్ని రోజులు ఎక్కడున్నానని అడిగారు. శిరిడీలోని సాయిబాబా వద్ద ఉన్నానని సమాధానమిచ్చాను. అతను విషయమంతా తెలుసుకొని, మారు మాట్లాడకుండా నా రాజీనామా పత్రాన్ని చించి చెత్తబుట్టలో వేసాడు. ఉన్నతాధికారి చేసిన పని ఫోర్‌మెన్‌కు నచ్చలేదు కానీ నన్నేమీ చేయలేకపోయాడు. ఉన్నతాధికారి ఫోరమెన్‌తో "అతను నీ క్రింది ఉద్యోగి కానీ, పనివాడు కానీ కాదు" అని నన్ను ఉద్దేశించి అన్నాడు. ఆరు నెలలు గడిచిన తరువాత నాకు ప్రమోషన్ వచ్చింది. అదే ఫోర్‌మెన్ నా క్రింది ఉద్యోగి అయ్యాడు.



వై.జె.గాల్వంకర్

# 8

## అక్టోబరు 17వ తేదీ, 1936

**రావుసాహెబ్ యశ్వంత్ జనార్దన్ గాల్వంకర్,** బి.ఎ., భూస్వామి మరియు సూపరింటెండెంట్, హోం డిపార్ట్‌మెంట్, సచివాలయం, బొంబాయి, వయస్సు 51సం॥లు, బ్రాహ్మణుడు, టర్నర్ రోడ్, బాంద్రా, (బొంబాయి 20).

నేను మొట్టమొదట 1911లో మా మామగారైన శ్రీదాభోళ్కర్ (హేమాడ్‌పంత్) మరి కొందరు బంధువులతో కలిసి శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాను. వారొక గొప్ప మహాత్ములని విన్నా అప్పుడు నేను ఏ విధమైన ప్రాపంచిక, పారమార్థిక లబ్ధిని ఆశించి శిరిడీ వెళ్ళలేదు. ఇలా నాలుగైదు సార్లు వెళ్ళిన తరువాత వారిపట్ల నా ఆసక్తి పెరిగింది. ఒకసారి బాబా నా కలలో కన్పించి రెండు రూపాయలు దక్షిణ అడిగారు. నేను మరుసటి రోజు వాటిని మనియార్డరు ద్వారా శిరిడీ పంపాను. వారు కలలో దక్షిణ అడగటమే కాక నీతి నిజాయితీలతో మెలగమని (నేకీనే వాగావే) సచ్ఛీలత, ఇంద్రియ నిగ్రహము కలిగి ఉండమని రెండు విలువైన ఆదేశాలు ఇచ్చారు. నేను ఆ ఆదేశాలను శ్రద్ధ, పట్టుదలతో ఆచరించాను.

1917లో అనుకుంటాను బాబాను దర్శించినప్పుడు వారు నా తలపై తమ హస్తాన్ని ఉంచారు. అది నాపై అద్భుతమైన ప్రభావాన్ని చూపింది. నన్ను, నా పరిసరాలను మరచి నేను ఆనందపారవశ్యంలో ఉండిపోయాను. వారప్పుడు అక్కడున్న ఇతర భక్తులతో నా గత జన్మ వృత్తాంతాల గురించి వివరించారు. నేను పూర్వజన్మలో నీతి, నిజాయితీ గల సచ్ఛీలుడనని, ఆ జన్మలో నేను పొందిన స్థితులు, రూపాలననుసరించి బాబానే ప్రస్తుత జన్మలో నన్ను నా తల్లి గర్భంలో ప్రవేశపెట్టారని, ఈ జన్మలో కూడా నేను నీతి, నిజాయితీలను నిలబెట్టుకుంటున్నానని బాబా వాళ్ళతో చెప్పారు. ఈ విషయమంతా భక్తుల ద్వారా ఆ తరువాత విన్నాను.

క్రిస్‌మస్ మరియు ఇతర సెలవులప్పుడు నేను బాబాను దర్శించడానికి వెళ్ళేవాడిని. బాబా నా సెలవుకు మించి ఎక్కువ రోజులు నన్ను ఎప్పుడూ శిరిడీలో ఉంచలేదు. నాకు బాబాపై భక్తివిశ్వాసాలున్నాయి. వారు నాకెప్పుడూ అద్వైతము, ఆత్మసాక్షాత్కారము, ఆధ్యాత్మిక విషయాల గురించి బోధించలేదు. కానీ ఒకసారి శిరిడీ వెళ్లినప్పుడు "నేను *ఈ మూడున్నర మూరల శరీరానికి మాత్రమే పరిమితం*


*కాలేదు. నేను అంతటా ఉన్నాను. ప్రతిచోట నన్ను దర్శించవచ్చు (మీ సాడేతీన్ హాత్ దేహామధ్యే నాహీఁ, సర్వ్ ఠికాణీ ఆహేఁ, సర్వ్ ఠికాణీ మలా పాహత్ జా)''* అని పలకడం నేను విన్నాను. నేను భగవద్గీత, భాగవతంలోని ఏకాదశ స్కంధమైన ఏకనాథ భాగవతాన్ని నిత్యం పారాయణ చేసేవాడిని. ఈ గ్రంథాలు పారాయణ చేయమని దీక్షిత్, జోగ్‌లను ఆదేశించినట్లుగా బాబా నన్ను ఆదేశించలేదు. కానీ శ్రీసాయిబాబా ఇచ్చిన స్ఫూర్తితోనే నేనీ పారాయణ చేస్తున్నానని నా నమ్మకం. మహాసమాధి చెందడానికి ముందు వారితో సన్నిహిత బంధం ఏర్పరచుకోలేక పోయినందుకు నేనిప్పటికీ బాధపడుతుంటాను. అప్పుడు నేను చిన్నవాడిని కాబట్టి ఇప్పుడున్నంత శ్రద్ధ నాలో ఉండేది కాదు. బాబాను దర్శించిన వారిలో ఆత్మసాక్షాత్కారం పొందడానికి అర్హత ఉన్నవారు కొద్దిమంది మాత్రమే. వారిలో కూడా ఉన్నతస్థాయిని సాధించినవారు కొందరే.

నేను మొదటిసారి శిరిడీ వెళ్ళినప్పుడు జరిగిన సంఘటన ఇది. బాబాను దర్శించడానికి వాడా నుండి మసీదుకు వెళుతుండగా, బాబా దక్షిణ అడుగుతారనే విషయం దారిలో గుర్తుకొచ్చింది. తిరిగి వాడాకెళ్ళి రెండు రూపాయలు తీసుకుని మసీదుకు వెళ్ళాను. బాబాను దర్శించినప్పుడు వారు దక్షిణ అడిగారు. నేను రెండు రూపాయలు సమర్పించాను. వారు అంతకుమించి దక్షిణ అడుగలేదు. నేను సమర్పించదలచిన రెండు రూపాయలు మాత్రమే తీసుకున్నారు. వారి అంతర్యామిత్వానికి ముగ్ధుడనయ్యాను. బాబా నాకు ప్రసాదించిన దానితో నేను సంతృప్తిగా జీవితం కొనసాగిస్తున్నాను (సాయి రఖేఁగా వైసా హీ రహేనా).

1921లో అనుకుంటాను, నేను నా కుటుంబంతో కాశీ ప్రయాగ యాత్రలకు బయలుదేరాను. మేము ప్రయాగలో ఒక గైడుని ఏర్పాటు చేసుకొన్నాము. అతను ప్రయాగలో ఉన్న పవిత్ర ప్రదేశాలన్నింటినీ చూపించాడు. మేము భరద్వాజాశ్రమంలో ఉన్నప్పుడు అక్కడి వాతావరణం నన్నెంతో ప్రభావితం చేసింది. మాకెవరైనా సత్పురుషుని దర్శనం లభించేటట్లు చేయమని బాబాను ప్రార్థించాను. మహాత్ములెవరైనా అక్కడ ఉంటే వారి దగ్గరకు తీసుకెళ్ళమని గైడుతో చెప్పాను. మేము భరద్వాజాశ్రమం విడిచిన నాలుగైదు నిమిషాలకు మా గైడు టాంగాను ఒకచోట ఆపి అక్కడున్న గొప్ప మహాత్ముని చూపించాడు. వారి గడ్డం

ఛాతి క్రింది వరకు పెరిగి ఉంది. వారు ఎన్నో సంవత్సరాలకు ఒకసారి ప్రయాగకు వస్తుంటారనీ, వారి మహత్యం గురించి అక్కడ అందరికీ తెలుసనీ గైడు చెప్పాడు. వారు ఎవరినీ దగ్గరకు రానివ్వరని ఎవరి వద్ద నుండి డబ్బు పుచ్చుకోరని కూడా చెప్పాడు. బాబాను ప్రార్థించిన కొద్ది నిమిషాలకే ఈ మహాత్ముడు కనపడినందువల్ల నా హృదయం ఉప్పొంగింది. గైడు వెళ్ళవద్దని చెబుతున్నా నేను వారిని సమీపించి నమస్కరించాను. వారు కోపగించుకోకుండా ఆశీర్వాదపూర్వకంగా చేతులు పైకెత్తి "రా, బిడ్డా" అంటూ ఆహ్వానించారు. గైడు వారిస్తున్నా వినకుండా నా భార్య, తల్లి, మిగిలినవారందరూ కూడా వచ్చి వారికి నమస్కరించి ఆశీస్సులు అందుకున్నారు. ఆ మహాత్మునికి సమర్పించడానికి నా దగ్గర పూలు, పండ్లు, తినుబండారాలేవీ లేవు. అందువల్ల నా దగ్గరున్న మూడణాలు వారికి దక్షిణగా సమర్పించాను. దక్షిణ స్వీకరించడం వారి పద్ధతికి వ్యతిరేకమైనప్పటికీ నేనిచ్చిన నాణాలను ప్రసన్నంగా చూసి జేబులో వేసుకున్నారు. ఇదంతా చూస్తున్న గైడు ఆశ్చర్యపోయాడు. బాబానే ఆ విధంగా ఆదరించి దక్షిణ స్వీకరించారని నేను భావించాను.

బాబా నాకు దివ్యానుభూతిని అనుగ్రహించినప్పటి నుండి నా దృష్టి ఆధ్యాత్మికచింతన వైపు మళ్ళింది. 1932లో నాకు ఒక కల వచ్చింది. కలలో బాబా కనిపించి ***"నీకేం కావాలి?"*** అని అడిగారు. నాకు "ప్రేమ" కావాలని ప్రేమ తప్ప మరేదీ వద్దని చెప్పాను. బాబా ప్రేమను అనుగ్రహించి అదృశ్యమయ్యారు. అప్పటి నుండి నేను ధ్యానంలో ఉన్నప్పుడు, పారాయణ చేస్తున్నప్పుడు ప్రేమవాహిని నాలో పరవళ్ళు త్రొక్కేది.



అబ్దుల్లా జాన్

౭

# నవంబరు 5వ తేదీ, 1936- శిరిడీ

**అబ్దుల్లా జాన్,** స్వస్థలం: టార్‌బెల్లా (పెషావర్ సమీపంలో ఉన్న హజారా జిల్లా) వయస్సు 40 సం॥లు, మహమ్మదీయ పఠాన్, కొరాలే (సాకోరీ దగ్గర).

నేను బాల్యంలోనే నా స్వస్థలమైన టార్‌బెల్లాను విడిచిపెట్టాను. నాకు సహాయం చేసేవారు ఎవ్వరూ లేరు. మొదటి నుండి నాకు మక్కా దర్శించాలనే కోరిక ఉండేది. అందువలన నేను దక్షిణ దిశగా బయలుదేరి మన్మాడ్ వరకు ప్రయాణించాను. అక్కడ ఒకతను నన్ను బొంబాయి వెళ్ళమని, అక్కడ నుండి మక్కాకు సులభంగా వెళ్ళవచ్చునని చెప్పాడు. 1913లో నేను మన్మాడ్‌కు వెళ్తూ హరిపూర్‌లో ఉన్నప్పుడు, శిరిడీలోని 'సాయిబాబా' గొప్ప మహాత్ములని, వారు ఫకీర్లకు ధారాళంగా డబ్బు ఇస్తారని, నేను కోరుకుంటున్నట్లు నన్ను మక్కాకు పంపిస్తారని ఎవరో చెప్పారు. అందువలన నేను శిరిడీ వెళ్ళాను. నేను మసీదు ద్వారం వద్ద ఉన్నప్పుడు వారు మసీదులో నుండి నన్ను చూసారు. నేనూ వారి వంక చూసాను. ప్రథమ దర్శనంలోనే వారే నా గురువని భావించి శిరిడీలోనే ఉండిపోయాను. వారు నాకూ, ఇతర ఫకీర్లకు సమృద్ధిగా భోజనం పెడుతుండడంతో సులభంగా జీవనం గడిచిపోతుందని భావించి నేను బాబాతో ఉండిపోవాలని నిర్ణయించుకున్నాను. ఇదంతా 1913లో జరిగింది. నేను అప్పటికి చిన్నవాడినైనందువల్ల జీవితంపట్ల సరైన అవగాహన ఉండేది కాదు.

బాబా దగ్గర ఉండటం వలన నా స్వభావంలో ఎంతో మార్పు వచ్చింది. నేను శిరిడీకి వచ్చినప్పుడు హిందువులను శత్రువులుగా భావించేవాడిని. బాబాతో మూడు సంవత్సరాలు కలిసి ఉండడం వలన క్రమంగా నాలో ఆ భావం తొలగిపోయి హిందువులను నా సోదరులుగా భావించడం మొదలుపెట్టాను. బొంబాయిలో ముస్లింలు హిందువుల దేవాలయాలను నాశనం చేయాలని, హిందువులు ముస్లింల మసీదులని నాశనం చేయాలని అనుకుంటున్నారని విని బాధపడ్డాను. ఇలా ఒకరినొకరు అంతమొందించుకుంటుంటే, ఈ ఇరుమతాల స్థానే ఇతర మతస్థులు తమ మతాలను నెలకొల్పడానికి వీళ్ళు అవకాశం కల్పించినవారవుతారని అనుకున్నాను.

బాబా మహాసమాధి చెందేటప్పటికి నా వయస్సు 22 సంవత్సరాలే కనుక ఆధ్యాత్మికంగా చెప్పుకోదగినంత లబ్ధిని పొందలేకపోయాను. నేను నిరాశానిస్పృహలతో తిరిగి నా యాత్రలు కొనసాగించాను. 1926లో ఉత్తరదిశగా బయలుదేరి మాలేఖండ్ ఏజన్సీలో ఉన్న "స్వాట్"లోయను చేరాను. ఆ లోయలో అకున్‌బాబా అనే గొప్ప మహాత్ముని సమాధి ఉంది. అకున్‌బాబా మహ్మాద్‌ప్రవక్త యొక్క వంశీయుడు. వారి అద్భుత మహిమలను గురించి విరివిగా చెప్పుకుంటారు. లార్డ్ రాబర్ట్స్ ముస్లిం తెగలవారిని అణచదలచి పశ్చిమంగా బయలుదేరినప్పుడు, అకున్‌బాబా తమ మంత్ర శక్తులతో లార్డ్ రాబర్ట్స్‌ను ఒక కొండపై 3 నెలల 11 రోజులు బంధించి ఉంచారు. అతను అక్కడ నుండి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక తన దుస్థితిని విక్టోరియా రాణికి తెలియజేసాడు.

నేను అకున్‌బాబా సమాధి చెంత ఒక రాత్రి నిద్రించాను. నిద్రించే ముందు "నాకు బాబా సహాయం చేయలేదు. మీరైనా నాపై దయ ఉంచి ఉద్ధరించండి" అని ప్రార్థించాను. ఆ రాత్రి నాకొక కల వచ్చింది. కలలో నేను పడుకొని ఉండగా నా తల దగ్గర కుర్చీలో సాయిబాబా కూర్చొని ఉన్నారు కానీ ఏమీ మాట్లాడలేదు. నిద్ర నుండి మేల్కొని కల గుర్తుకు తెచ్చుకున్నాను. నేనింకా బాబా రక్షణలోనే ఉన్నట్లు గ్రహించాను. నేను ప్రార్థించింది సాయిబాబాను కాదు అకున్‌బాబాను. కానీ అక్కడికి 1500 మైళ్ళ దూరంలో ఉన్న శిరిడీ నుండి బాబానే దయతో నా చెంతకు వచ్చి నన్ను ఆశీర్వదించారు. శిరిడీలో వారి చెంతనున్న ఐదు సంవత్సరాలలో బాబా నాకు ఏ సహాయం చేయక నన్ను మోసగించారన్న భావం తప్పు అని గ్రహించాను. స్వాట్ లోయలో ఆ స్వప్నదర్శనం అయినప్పటి నుండి బాబాపై నాకు మరింత విశ్వాసం ఏర్పడింది. ఆ తరువాత నేను ఈ ప్రాంతానికి తిరిగి వచ్చేసాను. నాకు వివాహమైన తరువాత 1924 నుండి నేను నా కుటుంబంతో కొరాలేలో ఉంటున్నాను. బాబా రెండు మూడు సంవత్సరాలకు ఒకసారి నాకు దర్శనమిస్తుంటారు.

బాబా భౌతికంగా ఉన్న రోజులలో మసీదు భక్తులతో క్రిక్కిరిసి ఉండేది. అక్కడ కూర్చునేందుకు కూడా చోటు దొరికేది కాదు. ఇప్పుడు మసీదు దాదాపు నిర్మానుష్యంగా ఉంటున్నది. బాబా వైభవమే అంత తక్కువ కాలంలో అంతరించిపోతే ఇక నాలాంటి అల్పప్రాణుల పరిస్థితి ఏమిటి?

బాబా చెంత రోహిల్లాలు ఉన్నట్లు నేనెప్పుడూ చూడలేదు, వినలేదు కూడా. కానీ మతమౌఢ్యంగల పఠాన్‌లు వారి వద్దకు వచ్చారని తెలుసు. రామచంద్ర ఆత్మారాం తర్ఖడ్ నాతో చెప్పిన ఒక సంఘటన గూర్చి వివరిస్తాను. ఒకరాత్రి తర్ఖడ్ బాబాతో చావడిలో నిద్రిస్తున్నాడు. కాందహార్ నుండి వచ్చిన మీర్‌జమాన్ అనే అతను కూడా అక్కడ ఉన్నాడు. అతను రాత్రి 3 గం॥లకు అకస్మాత్తుగా లేచి బాబాతో "బాబా ఈ హిందువులందరూ ముస్లిం సాంప్రదాయాలను, మిమ్మల్ని భ్రష్ఠుపట్టిస్తున్నారు. మీరు ఒప్పుకుంటే ఈ హిందువులందరి గొంతులను ఒక్క వేటుతో నరికివేసి మిమ్మల్ని విడిపిస్తాను" అని అన్నాడు. తర్ఖడ్ మెలకువగా ఉండి ఈ మాటలన్నీ విని ఆ దుర్మార్గుడు తనను చంపుతాడేమోనని వణికిపోయాడు. అప్పుడు బాబా మీర్‌జమాన్‌ను సమాధానపరుస్తూ *"నేను పిచ్చివాడిని (పాగల్). నన్ను పూజిస్తున్న ఈ హిందువులు కూడా పిచ్చివాళ్ళే! వాళ్ళు నన్ను పూజించడానికి (ఇస్లాం మత సాంప్రదాయాలకు విరుద్ధంగా) కారణం నేనే కానీ వాళ్ళు కాదు. కాబట్టి కోయవలసింది వాళ్ళ గొంతులు కాదు నా గొంతే"* అన్నారు. దానితో మీర్‌జమాన్ మౌనంగా ఉండిపోయాడు.

నాగ్‌పూర్‌కు చెందిన అబ్దుల్లాఖాన్ పరమతద్వేషి. హిందుస్థానీ పఠాన్ అయిన అతను ఒక పత్రికా విలేఖరి. అతనికి మహాత్మాగాంధీ, బూటీ మొదలగువారితో పరిచయముంది. అతను బాబా దగ్గర మూడు నాలుగు నెలలు గడిపాడు. శిరిడీలో ఉన్నప్పుడు బాబా తనను మోసం చేశారని అప్పుడప్పుడు చెబుతూండేవాడు. అతను అహ్మద్‌నగర్‌లో మరణించాడు.

ఒకసారి అబ్దుల్లాఖాన్ నానాచోప్దార్‌ను కొట్టాడు. అతని నేరం ఋజువైనందున కోపర్‌గాం మేజిస్ట్రేటు 15 రూపాయల జరిమానా విధించాడు. జరిమానా కట్టేందుకు అతని దగ్గర డబ్బు లేదు. పూచీకత్తు కూడా చూపించకపోవడంతో అతనిని జైలులో పెట్టారు. బూటీకీ విషయం తెలిసి 15 రూపాయలు పంపాడు. కానీ అబ్దుల్లా "తనను మోసం చేసినవారే జరిమానా కట్టాలి కానీ వేరెవరూ కాదు" అంటూ నిరాకరించాడు. అప్పుడు బాబా తమ జేబు నుండి 15 రూపాయలు పంపి అతనిని విడుదల చేయించారు. అతనొకసారి బాబాతో "మీరు ఇస్లాం మత సాంప్రదాయాలను ఉల్లంఘిస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న

దానికి మీ గొంతు కోయాలి" అన్నాడు. దీనికి బాబా నవ్వారు. అతను తరువాత బాబాను క్షమాపణ కోరాడు. దానికి కూడా బాబా నవ్వారు.

బాబా సశరీరులుగా ఉన్నప్పుడు ఒక భక్తుడు "బాబా మీరు సమాధి చెందిన తరువాత మీ ప్రాభవం మీతోనే అంతరించిపోతుందేమో?" అనే సందేహం వ్యక్తం చేశాడు. అప్పుడు బాబా ***"సమాధి నుండే కర్రలతో కొడతాను (తుర్వతీతూన్ డణ్డే హానీన్)"*** అనడం నేను విన్నాను. అంటే తమ భౌతిక శరీరం లేనంత మాత్రాన తమ ప్రభావం, కర్తవ్యనిర్వహణ ఆగిపోదని అర్థం.

## 10

## అక్టోబరు 20వ తేదీ, 1936

**చక్రనారాయణ,** పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటుకు లీడర్, వయస్సు సుమారు 50 సం॥లు, క్రైస్తవుడు, థానా.

1918లో బాబా సమాధి చెందినప్పుడు నేను కోపర్‌గాంలో ఫౌజ్‌దార్‌గా (సబ్ ఇన్‌స్పెక్టర్) పనిచేస్తున్నాను. మొదట్లో నేను బాబాను విశ్వసించేవాడిని కాదు. బాబా ఆదాయవ్యయాలు పరిశీలించేందుకు ప్రభుత్వంవారు నన్ను నియమించారు. మొదట్లో బాబాను అనుమాన దృష్టితో పరిశీలించినప్పటికీ క్రమంగా నాకు వారిపై ఎంతో గౌరవభావం ఏర్పడింది.

బాబాలో నాకు నచ్చిన మొట్టమొదటి విషయం వారు కాంతా-కనకాల వలన ఏమాత్రం చలించేవారు కాదు. ఎందరో స్త్రీలు వచ్చి వాళ్ళ శిరస్సులను బాబా పాదాలపై ఉంచి నమస్కరించి, వారి సన్నిధిలో కూర్చునేవారు. బాబా చలించేవారు కాదు. బాబా వాళ్ళ వంక ప్రశంసాపూర్వకంగా కానీ, మోహముతో కానీ చూసేవారు కాదు. వారు బంధాలకు అతీతులు. ఇక డబ్బు విషయాలలో బాబాను క్షుణ్ణంగా పరిశీలించాము. వారికి డబ్బంటే గడ్డిపోచతో సమానం. భక్తులు స్వచ్ఛందంగా వారికి దక్షిణలు సమర్పించేవారు. దక్షిణ ఇవ్వని వారిని ద్వేషించడం, నిందించడం, నిరాదరించడం జరిగేది కాదు. భిక్ష విషయంలో కూడా అంతే. ఎవరేది పెట్టినా తీసుకొని అందరికీ పంచేవారు. దక్షిణల విషయాలలో కూడా ఇలాగే జరిగేది. బాబా తమకు వచ్చిన దక్షిణల మొత్తాన్ని భక్తులకు ధారాళంగా ఇచ్చేసేవారు. మరో అద్భుతమైన విషయమేమంటే ఒక్కొక్కరోజు వారికి దక్షిణల రూపంలో వచ్చిన మొత్తం కంటే ఎక్కువ మొత్తం భక్తులకు పంచేవారు. అధికంగా పంచిన డబ్బు ఎక్కడ నుండి వచ్చేదో మాకు అర్థమయ్యేది కాదు. దీనిని బట్టి వారికి దివ్యశక్తులున్నట్లు గ్రహించాము. బాబా సమాధి చెందిన తరువాత వారి దగ్గరున్న డబ్బు మేం స్వాధీనం చేసుకున్నాం. అది కేవలం 16 రూపాయలు మాత్రమే!

బాబా అన్ని మత సాంప్రదాయాలను గౌరవించేవారు. వారికి కుల, మత, వర్గ విచక్షణగానీ, పేద, గొప్ప భేదంగానీ లేదు. వారెవరినీ చులకనగా

చూసేవారు కాదు. అందరూ వారికి సమానులే. నేను మొదట శిరిడీ వెళ్ళినప్పుడు ఒక భక్తుడు బాబాతో "ఈ ఫౌజ్‌దార్ క్రైస్తవుడు" అని చెప్పాడు. అందుకు బాబా ***"అయితేనేం? అతను నా సోదరుడు"*** అన్నారు.

ఒకసారి ఒక పోలీసు అధికారి వచ్చి బాబాను దర్శించాడు. బాబా అతనిని దక్షిణ అడిగారు. అతను తన దగ్గర డబ్బు లేదని చెప్పాడు. బాబా ***"నీ పర్సు తెరచి చూడు. అందులో 50 రూపాయలు ఉన్నాయి"*** అన్నారు. అతను పర్సు తీసి ఆ డబ్బును బాబాకు సమర్పించాడు. బాబా ఆ మొత్తంలో కొంతమాత్రమే తీసుకుని మిగతాది ఆ అధికారికి తిరిగి ఇస్తూ ***"ఈ డబ్బుని నీ దగ్గరే ఉంచుకో. దీని అవసరం నీకు త్వరలోనే వస్తుంది"*** అన్నారు. అతను వెళ్ళిపోయాడు. తరువాత బాబా చెప్పినట్లు అతనికొక సమస్య ఎదురై, అందులో నుండి బయటపడడానికి ఆ డబ్బుని ఖర్చుపెట్టవలసి వచ్చింది. తరువాత అతను కృతజ్ఞతతో ఆ మొత్తాన్ని బాబాకు పంపాడు.

బాబా మహాసమాధి చెందినప్పుడు జప్తు చేయబడిన వారి ఆస్తులకు సంబంధించిన వ్యవహారాలలో నేను సంస్థాన్‌కు సహాయపడ్డాను. బాబా ఆస్తుల పంపకం విషయంలో ప్రజాభిప్రాయాలను సేకరించాను. నేనిచ్చిన వివరాల ఆధారంగా మామ్లత్‌దార్ మేజిస్ట్రేటు పంపకానికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశాడు. దీనివలన సంస్థాన్‌కు ఎన్నో ఇబ్బందులు తప్పాయి. బాబా ఊదీ సర్వరోగాలను నయం చేస్తుంది.

11

## సెప్టెంబరు 26వ తేదీ, 1936- బాంద్రా

**జోసెఫ్ ఫౌజ్‌దార్,** (రిటైర్డ్), వయస్సు 46 సం॥లు, క్రైస్తవుడు, టర్నర్ రోడ్, బాంద్రా.

నేనెప్పుడూ శిరిడీ వెళ్ళలేదు. నా స్నేహితుల ద్వారా బాబాను గురించి విని వారి ఫోటో ఒకటి తెప్పించుకున్నాను. కానీ వారిని పూజించేవాడిని కాదు. అద్భుత శక్తులున్న మహాత్మునిగా భావించి గౌరవించేవాడిని.

1917లో గజానన్ నార్వేకర్ అనునతడు తీవ్రజ్వరంతో బాధపడసాగాడు. అతని కుమారుడు 500 రూపాయలు తీసుకొని వెళ్ళి బాబాకు సమర్పించాడు. ఆ డబ్బు తీసుకోగానే బాబా జ్వరంతో వణకనారంభించారు. భక్తులు దానికి కారణం అడిగారు. అప్పుడు బాబా ***"మనం ఇతరులకేదైనా చేయదలిస్తే వారి బరువుబాధ్యతలను స్వీకరించాలి"*** అన్నారు. ఆ తరువాత గజానన్ జ్వరం తగ్గిపోయింది.

ఒకసారి నేను ఒక క్లిష్టమైన క్రిమినల్ కేసు పరిశోధించవలసి వచ్చింది. నేను సహాయం కోసం బాబాను ప్రార్థించాను. సాయిబాబా నా కలలో కనిపించి ఆ కేసులో ముందుకు వెళ్ళడానికి మార్గం చూపారు. వారు చెప్పినట్లు నడుచుకొని అందులో విజయం సాధించగలిగాను. 1916లో నేను ఇద్దరు పఠాన్ గజదొంగలను పట్టుకోవలసి వచ్చింది. నేను నా సిపాయిలతో వారిని పట్టుకోవడానికి ప్రయత్నించినప్పుడు, పఠాను ఒక సిపాయిని చంపేసాడు. నేను గాయాలతో ఆసుపత్రి పాలయ్యాను. అలా జరుగుతుందని సాయిబాబా ముందురోజు రాత్రి నా కలలో కనిపించి సూచించారు. ఆ దృశ్యంలో నన్ను ఇద్దరు పట్టుకొని ఒక వివాహం జరుగుతున్న చోటుకు ఈడ్చుకుంటూ తీసుకువెళ్ళారు.

నా రక్షకుడు అయిన సెయింట్ ఫ్రాన్సిస్ గ్జేవియర్ ద్వారా నేను నా దైనందిన జీవితంలో ఊరట, ఉత్తేజం పొందుతున్నాను. బాబా కూడా నాకు అప్పుడప్పుడు సహాయం చేస్తుంటారు.

12

## డిసెంబరు 15వ తేదీ, 1936

**దాదాజీ గోపీనాథ్ జోషీ,** రామ్‌మారుతీ రోడ్, దాదర్.


నేను 1932లో శిరిడీ వెళ్ళాను. ఏడాది వయస్సున్న నా కుమారునికి తీవ్రంగా జ్వరమూ, మశూచి వచ్చాయి. నేను వాడికి బాబా ఊదీ, తీర్థం ఇస్తూ వచ్చాను. మందులేమీ వాడకుండానే మా అబ్బాయికి ఆరోగ్యం చేకూరింది. వాడికి నయమయితే శిరిడీ తీసుకొని వస్తానని మ్రొక్కుకున్నాను. కానీ మ్రొక్కు విషయం చాలాకాలం వరకు మరచిపోయాను. తరువాత వాడికి మూర్ఛరోగం వచ్చింది. అప్పుడు నాకు మ్రొక్కు విషయం గుర్తొచ్చింది. దానిని మరచినందుకు క్షమించమని, పిల్లవాడికి నయమైతే ఈసారి తప్పక శిరిడీ తీసుకొచ్చి అభిషేకం మొదలైన పూజలన్నీ జరిపిస్తానని మరల బాబాకు మ్రొక్కుకున్నాను. అబ్బాయికి నయమైంది. వెంటనే 1932లో వాడిని శిరిడీకి తీసుకుని వెళ్ళాము. బాబాకు అభిషేకం చేయించి తిరిగి ఊరికి బయలుదేరాము. మేము కోపర్‌గాంకు సగం దూరంలో ఉన్నప్పుడు పిల్లవాడికి మూర్ఛరోగం తిరగబెట్టింది. అది చూసి అప్పుడు మాతో ఉన్న పురందరే, మమ్మల్ని శిరిడీ తిరిగి వెళ్ళి మ్రొక్కుబడులేమైనా మిగిలి ఉన్నాయేమో గుర్తు తెచ్చుకొని జరిపించమని సలహా ఇచ్చాడు. మేము అభిషేకం మాత్రమే చేయించి, మిగతా పూజలు మరచిపోయినట్లు అప్పుడు మాకు గుర్తుకొచ్చింది. తిరిగి శిరిడీ వెళ్ళాము. మూర్ఛ వల్ల సగం స్పృహ కోల్పోయిన పిల్లవాడు, శిరిడీ చేరిన వెంటనే పూర్తి స్పృహలోకి వచ్చి, బాబా సమాధిని ఎక్కి ఆడుకుంటూ కేరింతలు కొట్టసాగాడు. మేము మిగిలిన పూజలన్నీ జరిపించి తిరిగి వచ్చాము. మాకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాలేదు.

1933లో మేము మరల శిరిడీ బయలుదేరాము. దారిలో కోపర్‌గాం వద్ద గోదావరి నది చేరాము. అక్కడున్నవారు ఆ సమయంలో నది దాటవచ్చని చెప్పడంతో మా అబ్బాయిని ఎత్తుకుని నేను, నా భార్య నదిలోకి దిగాము. కానీ నది మధ్యలోనికి వెళ్ళేసరికి ప్రవాహ వేగం ఎక్కువగా ఉండి, నాకు కళ్ళు తిరగసాగాయి. మేమిక కొట్టుకొనిపోవడం ఖాయమనిపించింది. అప్పుడు నేను కళ్ళు మూసుకుని

బాబాను ప్రార్థించాను. ఐదు నిమిషాలలో సాయిసంస్థాన్‌కు చెందిన బాలాగురవే వచ్చి, నది మధ్యలో ఉన్న మమ్మల్ని పట్టుకొని క్షేమంగా ఒడ్డుకు చేర్చాడు.

నా కుమారుని పుట్టు వెంట్రుకలను కాశీలో తీయించాలని తలపెట్టాము. అదే సమయంలో శిరిడీలో బాబాకు అభిషేకం చేయించదలచాము. రెండు కార్యక్రమాలు ఒకేసారి జరగాలని మా అభిప్రాయం. కానీ శిరిడీలో ఉన్న నానూపూజారికి బాబాకు అభిషేకం చేయమని సందేశం పంపడం మరిచిపోయాం. మేము కాశీలో కార్యక్రమం పూర్తి చేసుకొని గయకు వెళ్ళాం. గయావాలా ఇంట్లో దిగాం. అక్కడ మా అబ్బాయికి మరల మూర్ఛ వచ్చింది. అప్పుడు మాకు శిరిడీలో అభిషేకం జరిపించలేదనే విషయం గుర్తుకొచ్చింది. వెంటనే మేము మరచిన మ్రొక్కు చెల్లించేందుకు ఒకటి, మరచిపోయినందుకు ప్రాయశ్చిత్తంగా మరొకటి మొత్తం రెండు అభిషేకాలు జరిపించమని నానూపూజారికి సందేశం పంపించాము. ఆ తరువాత పిల్లవాడు కోలుకున్నాడు. మా తదుపరి ప్రయాణం క్షేమంగా సాగింది.

1934లో నా కుమారుడు జ్వరంతో బాధపడసాగాడు. ఇది ఎలాంటి జ్వరమో ఎవరూ కనిపెట్టలేకపోయారు. నేను బాబా ఊదీ, తీర్థం ఇచ్చాను. పిల్లవాడికి జ్వరం తగ్గిపోయింది. 1935లో వాడి కాలి బొటన వేలు విపరీతంగా వాచింది. డాక్టర్లు ఆ వేలును కోసివేయాల్సి ఉంటుందని చెప్పారు. కానీ ఊదీ వాడటం వలనే వాడికి నయమయింది. ఈ విధంగా నేను బాబానే నమ్ముకొని, వారి కృపాశీస్సులతో క్షేమంగా ఉన్నాను.



ఎం.వి. ప్రధాన్

# 13

## అక్టోబరు 18వ తేదీ, 1936, శాంతాక్రూజ్, సాయంత్రం 4 గం॥లు

**రావుబహద్దుర్ మోరేశ్వర్ వి. ప్రధాన్,** బి.ఎ., ఎల్.ఎల్.బి., హైకోర్టు ప్లీడరు మరియు జె.పి (జస్టిస్ ఆఫ్ పీస్), వయస్సు 56 సం॥లు, సాయిబాగ్, శాంతాక్రూజ్.

నేను, నా బంధువులు బాబా దగ్గరకు వెళ్ళడానికి కారకులు శ్రీనానాసాహెబ్ చాందోర్కర్. 1910వ సంవత్సరం మే నెల మొదటివారంలో ఒకరోజు నా సోదరులు, బంధువులు చాందోర్కర్‌తో మాట్లాడుతూ ఉన్నారు. నా సోదరుడు రామారావు, చాందోర్కర్‌ల మధ్య సంభాషణ ఇలా జరిగింది.

రామారావు : ప్రస్తుతం అక్కల్‌కోట మహరాజ్‌లాంటి మహాత్ములు ఎవరైనా ఉన్నారా?

చాందోర్కర్ : అలాంటివారిని చూడాలనుకుంటున్నావా?

రామారావు : అవును.

చాందోర్కర్ : అయితే శిరిడీ వెళ్ళు. శ్రీసాయిబాబా అటువంటి మహనీయులే!

రామారావు : మేము శిరిడీ గురించి వినడం ఇదే మొదటిసారి. అదెక్కడుంది? అక్కడికెలా వెళ్ళాలి?

చాందోర్కర్ : శిరిడీ అహ్మద్‌నగర్ జిల్లాలోని కోపర్‌గాం తాలూకాలో ఉంది. ధోండ్- మన్మాడ్ రైల్వేలైనులో ఉన్న కోపర్‌గాం స్టేషనులో దిగాలి. అక్కడ నుండి 11 మైళ్ళ దూరంలో నున్న శిరిడీకి టాంగాలో వెళ్ళవచ్చు.

శ్రీసాయిబాబా గొప్పతనం, శక్తి, కరుణ, తత్త్వము గురించి చాందోర్కర్ ఎంత స్పష్టంగా వర్ణించాడంటే అక్కడున్న శ్రోతలు ఎంతో ప్రభావితులై వీలైనంత త్వరలో శిరిడీ చేరి, ఆ మహాత్ముని దర్శించాలని అభిలషించారు. ఆ మరుసటి రోజే నా స్నేహితులు, బంధువులు పది, పదిహేను మంది ఒక బృందంగా ఏర్పడి శిరిడీకి ప్రయాణమయ్యారు. వాళ్ళతోపాటు నన్ను కూడా శిరిడీ తీసుకువెళ్ళాలనుకున్నారు. కానీ నేను ఆ సమయంలో ఇంట్లో లేనందువల్ల నా భార్యతో చెప్పి వాళ్ళు

బయలుదేరారు. ఆ రోజు నేను మా అమ్మ వద్ద ఉన్నాను. ఆమె వాళ్ళ ప్రయాణాన్ని గురించి నాతో చెప్పింది. నేను అజ్ఞానంతో "బాబా నిజమైన సాధువో కాదో ఎవరు చెప్పగలరు?" అన్నాను.

శిరిడీ వెళ్ళిన వాళ్ళు తిరిగి వచ్చిన తరువాత ఆ బృందంలోని నా సోదరుణ్ణి కలిసాను. వాళ్ళు శిరిడీ నుండి తెచ్చిన బాబా ఫోటోను, దాసగణు రచించిన భక్తలీలామృతంలోని 31వ అధ్యాయాన్ని నేను అదే రోజు తిరిగి ఇస్తానని చెప్పి ఇంటికి తీసుకొని వచ్చాను. ఆ అధ్యాయంలో బాబా లీలలు, మహిమల గురించి వర్ణించబడివుంది. నా భార్యకు బాబా ఫోటో చూపించి 31వ అధ్యాయాన్ని బిగ్గరగా చదివి వినిపించాను. అది నన్నెంతగానో ప్రభావితం చేసి, నాలో గొప్ప మార్పు తెచ్చింది. మా అమ్మ దగ్గర వెలిబుచ్చిన సందేహాలు తొలగిపోయాయి. నిజమైన మహాత్ముడెవరైనా ఉంటే అది సాయిబాబానే అన్న నమ్మకమేర్పడింది. నా భార్య ఇంకా ఎక్కువగా బాబాను విశ్వసించింది. ఫోటోను, పుస్తకాన్ని ఆ రోజే తిరిగి ఇవ్వవలసి ఉందని నా భార్యతో చెప్పాను. బాబా ఫోటోను, అదీ గురువారం నాడు ఇచ్చివేయడానికి ఆమె ఒప్పుకోలేదు. ఆమె పట్టుబట్టడం వలన వాటిని మూడురోజులు మా ఇంట్లోనే ఉంచాను. నాల్గవరోజు నా సోదరుడు వాటికోసం కబురు పంపడంతో వాటిని తిరిగి ఇవ్వక తప్పింది కాదు.

ఆ తరువాత మేము బాబాను దర్శించడానికి తపించిపోసాగాము. కానీ శిరిడీకి వెళ్ళేందుకు పరిస్థితులు అనుకూలించలేదు. మా వదిన నిండు గర్భంతో ఉండగా భర్తను పోగొట్టుకుంది. ఆమెకు మగసంతానం లేదు. ఈసారి తప్పక మగపిల్లవాడు పుడతాడని మేమందరం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాము. ఆమె ఏ రోజైనా ప్రసవించవచ్చునని, ఆ సమయంలో ఇంటికి మగదిక్కైన నేను ఉండకపోతే బాగుండదని ఊరి నుండి కదలలేకపోయాను.

కానీ నేను బాబాను త్వరగా దర్శించుకోవాలని నా భార్య, సోదరి ఆతృతపడ్డారు. అందువలన మా బంధువుల బృందం తిరిగి వచ్చిన 15 రోజులకు అంటే 1910 మే నెలాఖరున నేను శిరిడీకి బయలుదేరాను. చాందోర్కర్ ఎంతో ఆదరంతో అతని ఇద్దరు కుమారులు బాబు, బాపూలను నాకు తోడుగా పంపాడు. బయలుదేరేటప్పుడు నా దగ్గర మూడు నాలుగు బంగారు నాణాలు, కొన్ని కరెన్సీనోట్లు ఉన్నాయి. బాబా దక్షిణ అడిగితే ఇవ్వడానికి ఒక నోటు మార్చి

20 వెండిరూపాయి నాణాలను సిద్ధంగా ఉంచుకొన్నాను. మేము కోపర్‌గాంలో దిగగానే అక్కడి మామ్లత్‌దార్ చక్కగా స్వాగతం పలికాడు. గోదావరిలో స్నానమాచరించి శిరిడీ చేరాము. మాకోసమే నిరీక్షిస్తున్నారా అన్నట్లు బాబా లెండీతోట దగ్గర నిలబడి ఉన్నారు. మేము టాంగా దిగి వారికి నమస్కరించాము. మేము సాతేవాడాలో బస చేశాము. అక్కడ మాకు రావుబహద్దుర్ సాతే, నూల్కర్ (ఫస్ట్ క్లాస్ సబ్‌జడ్జి) లతో పరిచయమయ్యింది.

కొంతసేపటి తరువాత నేను తెచ్చిన పూలు, పండ్లు, మాలలు తీసుకొని బాబాను దర్శించడానికి మసీదుకెళ్ళాను. బాబాకు పూలమాలను వేసి, తీసుకువెళ్ళిన కానుకలు సమర్పించాను. బాబా కళ్ళల్లోకి చూసిన వెంటనే వారు గొప్ప మహాత్ములన్న నా నమ్మకం దృఢపడింది. ఇంతటి మహనీయుని దర్శించుకొనే అవకాశం కల్పించినందుకు ఆ భగవంతునికి ధన్యవాదాలర్పించుకొన్నాను. బాబా వెంటనే నా నమ్మకాన్ని పరీక్షించదలచారు. వారు నన్ను దక్షిణ అడిగారు. వారికివ్వడానికి సిద్ధంగా ఉంచుకున్న వెండి రూపాయలకు బదులు ఒక బంగారు నాణాన్ని వారి చేతిలో పెట్టాను. బాబా ఆ నాణాన్ని మొదట జార్జిబొమ్మ ఉన్న వైపుకు, తరువాత బొరుసు వైపుకు త్రిప్పి చూసారు. అలా మూడుసార్లు చేశారు. ఆ మూడుసార్లూ ***"ఇదేమిటి?"*** అని నూల్కర్‌ను అడిగారు. నూల్కర్ అది బంగారు నాణెమని చెప్పాడు. ***"దీని విలువ ఎంత?"*** అని బాబా ప్రశ్నించారు. 15 రూపాయలని నూల్కర్ చెప్పాడు. బాబా ఆ నాణాన్ని నాకే తిరిగి ఇచ్చివేస్తూ ***"ఇది నాకొద్దు. నువ్వే ఉంచుకొని నాకు 15 రూపాయలివ్వు"*** అన్నారు. నేను దానిని పర్సులో పెడుతున్నప్పుడు నూల్కర్ అది బాబా స్పర్శతో పునీతమైన నాణెమని దానిని ఇతర నాణాలతో కలపకుండా విడిగా ఉంచుకోమని చెప్పాడు. నేనలాగే చేసి బాబాకు 15 వెండి రూపాయలు ఇచ్చాను. బాబా వాటిని మరల మరల లెక్కించి ***"ఇక్కడున్నవి పది రూపాయలే. మరో అయిదు రూపాయలివ్వు"*** అన్నారు. నిజానికి వారు నా నమ్మకాన్ని పరీక్షిస్తున్నారు. సహజంగా వాదించడానికి అలవాటు పడిన ఏ లాయరైనా బాబా చేసిన ఆరోపణ తప్పని, తాను లెక్కించి సరిగా 15 రూపాయలిచ్చానని వాదిస్తాడు. కానీ నేనలా చేయలేదు. ఇది నా నమ్మకానికి పెట్టిన పరీక్షగా తలచి వారి లెక్కే సరియైనదని ఆమోదించి ఆనందంగా నా దగ్గర మిగిలి ఉన్న 5 వెండి రూపాయలు తీసి వారికి సమర్పించాను. నా జేబులో ఉన్న ఇరవై రూపాయలు

బాబాకు ఇచ్చేందుకే తెచ్చానని వారికి తెలుసు. అందుకే లెక్క తప్పిందన్న మిషతో నేను సమర్పించదలచిన మొత్తాన్ని వారు స్వీకరించారు. నా వద్ద ఇంకా చాలా డబ్బు ఉన్నప్పటికీ, 20 రూపాయలు మాత్రమే స్వీకరించారు. అంతకుమించి వారు నన్ను దక్షిణ అడగలేదు. తరువాత నేను అక్కడ నుండి వచ్చేసాను.

నేను మరల మసీదుకు వెళ్లేటప్పటికి బాబా తమ చుట్టూ చేరిన భక్తులందరికీ ఊదీ ఇస్తున్నారు. దూరంగా నిలబడి ఉన్న నన్ను చూసి దగ్గరికి రమ్మని సైగ చేసి, ***"భావూ (అప్పటి నుండి నన్ను ఎప్పుడూ అలాగే పిలిచేవారు), రెండు మూడు రోజులలో అంతా బాగైపోతుంది"*** అని ఊదీ ఇచ్చారు. ఊదీ తీసుకొని బయటికి వెళ్ళిపోయాను. బాబా నాపై ప్రత్యేకంగా చూపిన ఆదరాభిమానాలకు నూల్కర్, శ్రీమతి జోగ్ మొదలైన భక్తులందరూ ఆశ్చర్యపోయారు. నూల్కర్ ఆనందంతో నన్ను ఆలింగనం చేసుకున్నాడు. ఐశ్వర్యాన్ని, బంగారాన్ని, కుటుంబ హోదాను బాబా ఏమాత్రం లెక్కచేయరన్న విషయం అందరికీ తెలుసు. కనుక, బాబా ప్రత్యేకాభిమానం పొందడానికి నేను ఏ సద్గ్రంథాలను పారాయణ చేశానో తెలుపమని శ్రీమతి జోగ్ అడిగింది. నేను చేసిన సద్గ్రంథాల అధ్యయనం, పారాయణ ఏమీ లేదని వినమ్రంగా జవాబిచ్చాను.

మరుసటిరోజు ఇంటికి బయలుదేరాలనుకొని బాబాను అనుమతి కోరాను. బాబా తమదైన ప్రత్యేక రీతిలో ***"రేపు వెళ్ళు"*** అంటూ అనుమతి నిరాకరించారు. ప్రతిరోజూ ఆ విధంగానే చెబుతూ ఎనిమిది రోజులు నన్ను శిరిడీలో ఉంచేశారు. నేను మరుసటి రోజు బాబాకు ప్రత్యేకంగా విందు (భిక్ష) ఇవ్వదలచి, విందులో ఏ యే పదార్థాలు ఉండాలో, ఎవరెవరిని ఆహ్వానించాలో తెలుపమని బాబాను ప్రార్థించాను. ప్రత్యేకించి విందుకు బొబ్బట్లు (పూరన్ పోళీలను) తయారు చేయించమని, తమకు అభిమానపాత్రుడైన బాబును ఆహ్వానించమని బాబా చెప్పారు. 'బాబు' దాదాకేళ్కర్ సోదరుని కుమారుడు. నేను బాబాను ఆహ్వానించకముందే ***"నేను కూడా వస్తాను (మీహి యే ఈన్)"*** అని బాబా అన్నారు. మరుసటిరోజు విందు బాబా చెప్పిన ప్రకారమే ఏర్పాటు చేశాను. బాబును, ఇతర భక్తులను ఆహ్వానించాను. వాళ్ళందరూ వచ్చి కూర్చున్న తరువాత పళ్ళాలలో పదార్థాలన్నీ వడ్డించబడ్డాయి. బాబాకు ప్రత్యేకంగా ఒక పళ్ళెంలో వడ్డించాము. ఇంతలో ఒక కాకి వచ్చి బాబా ప్లేటులోని

పూరన్ పోళీని ఎత్తుకుపోయింది. ఆ రూపంలో బాబానే వచ్చి విందు ఆరగించారని భక్తులందరూ సంతోషంతో జయజయధ్వానాలు చేశారు.

ఆ రోజు మధ్యాహ్నం బాబా తమ శరీర పార్శ్వభాగాన్ని చూపిస్తూ *"ఈ భాగమంతా విపరీతంగా నొప్పి పుడుతోంది. కానీ మూడు నాలుగు రోజుల్లో తగ్గిపోతుంది"* అన్నారు. బాబా చూడడానికి ఆరోగ్యంగానే ఉండడం వలన పై మాటల ద్వారా వారు చెప్పదలచుకున్నదేమిటో అర్థం చేసుకోవడం మా శక్తికి మించిన పని.

ఒక గురువారంనాడు పెద్ద ఎత్తున అన్నసంతర్పణ చేసేందుకు బాబా హండీ పెట్టి వంట చేస్తున్నారు. వారు భక్తులందరినీ మసీదు నుండి తరిమివేసి ఒంటరిగా హండీ దగ్గర ఉన్నారు. ఆ సమయంలో నేను, చాందోర్కర్ కుమారులిద్దరూ మసీదులోనికి వెళుతుంటే, చూస్తున్న వారందరూ ఆశ్చర్యపడ్డారు. అయితే బాబా మమ్మల్ని కోప్పడకపోగా సాదరంగా ఆహ్వానించారు. బాబా మాకు ప్రత్యేక దర్శనం ఇవ్వడానికే భక్తులందరినీ బయటకు పంపించివేసినట్లున్నారు. తరువాత వారేదో చిన్నగా పాడుతున్నట్లు అనిపించింది. వారు ఆ పాటను మూడవసారి పాడుతున్నప్పుడు - *"కాయరే ఆపలా కాయ్‌హూ మణావే; శ్రీరామ జయరామ జయజయ రామ॥"* అని వినిపించింది. ఆ పదాలు వినగానే ఉద్వేగానికి లోనయ్యాను. బాబా పాదాలపై నా శిరస్సునుంచాను. నా కళ్ళలో ఆనందబాష్పాలు పెల్లుబికాయి. బాబా పలికిన పలుకులే మా కులగురువైన 'హరిబువా' నాకు ఉపదేశించిన మంత్రం. (హరిబువా తాతగారైన ఆత్మారాంబువా మా ముత్తాత గారి గురువు. వీరి పూజ కొరకు బొంబాయి ఠాకూర్‌ద్వార్‌లో ఒక దేవాలయం నిర్మించబడింది). ఈ విధంగా గురువు ఉపదేశించిన మంత్రం పట్ల బాబా నాలో శ్రద్ధను, గౌరవాన్ని పునరుద్ధరించారు. నేను అడుగకపోయినా నా ఆధ్యాత్మిక లబ్ధికై ఎంతో శ్రద్ధ కనపరచడం చూసి అశ్రునయనాలతో బాబాకు కృతజ్ఞతలు సమర్పించడం కన్నా నేను చేయగలిగింది ఏమీ లేదు. తరువాత బాబా హండీ దగ్గర నిలబడి ఉడుకుతున్న వంటకాన్ని సమంగా కలిసేలా గరిటెతో కాక, తమ చేతితో కలియబెట్టారు. అది చూసి నేను ఆశ్చర్యపోయాను. చేతితో కలియబెట్టినప్పటికీ బాబా చేయి కాలలేదు, బొబ్బలెక్కలేదు!

అకస్మాత్తుగా మధ్యాహ్నం బాబా మా ముగ్గురిని (నేను, చాందోర్కర్ కుమారులు బాబు, బాపు) లెండీకి తీసుకెళ్ళారు. అది సాధారణంగా వారు లెండీకి వెళ్ళే సమయం కాదు. అక్కడ బాబా కొన్ని గుంటలు త్రవ్వి, నా చేతికి కొన్ని మొక్కజొన్న విత్తనాలిచ్చి ఆ గుంటలలో పెట్టించి, వాటిపై మట్టి కప్పి నీళ్ళు పోయమన్నారు. తరువాత మేము మసీదుకు తిరిగి వచ్చాము. ఆ లెండీ తోటనే ఏడెనిమిది సంవత్సరాల తరువాత బాబా సమాధి చెందిన వెంటనే నేను కొన్నాను.

బాబా మమ్మల్ని వారం రోజులు శిరిడీలోనే ఉంచిన తరువాత తిరిగి వెళ్ళడానికి అనుమతినిచ్చారు. బాబుచాందోర్కర్ ఒక పళ్ళెం తెచ్చి బాబా పాదాల క్రింద ఉంచాడు. వారి పాదాలు అభిషేకించిన తరువాత ఆ పాదతీర్థాన్ని ఇంట్లో వాడుకునేందుకు తీసుకున్నాడు. ఆ విధంగా చేయడం శిరిడీలో అప్పుడున్న పద్ధతులకు భిన్నమైనది. అప్పటి వరకు ఊదీ మాత్రమే ఇంటికి తీసుకెళ్ళేందుకు ఆమోదించేవారు. పాదతీర్థం ఆరతి సమయమప్పుడు త్రాగడానికి మాత్రమే ఇచ్చేవారు. నేను బాబును అనుసరించి మా అమ్మకు, ఇతర భక్తులకు ఇవ్వడానికి పాదతీర్థం తీసుకున్నాను. మేము మన్మాడ్ చేరగానే పంజాబ్ మెయిల్ వచ్చింది. మా దగ్గర మూడవ తరగతి టిక్కెట్లు ఉన్నాయి. అవి తరువాత వచ్చే రైలు ఎక్కడానికి మాత్రమే పనికివస్తాయి కానీ మెయిల్ ఎక్కడానికి రైల్వే నిబంధనలు ఒప్పుకోవు. కానీ ఆనందంలో అవేమీ పట్టించుకోకుండా మెయిల్ ఎక్కాము. మేము బొంబాయి చేరవలసిన సమయానికన్నా నాలుగైదు గంటలు ముందు చేరాము. తరువాత, ఆ సమయం ఎంతో విలువైనదని తెలుసుకున్నాను. బాబా అనుగ్రహం వల్లే మేము త్వరగా ఇంటికి చేరుకోగలిగామని భావించాము.

నేను ఇల్లు చేరగానే, మా అమ్మకు పక్షవాతం వచ్చిన సంగతి తెలిసింది. శిరిడీలో బాబా తమ శరీర పార్శ్వభాగమంతా బాధిస్తున్నదని చెప్పిన సమయంలోనే, బొంబాయిలోని మా ఇంట్లో మా అమ్మకు పక్షవాతం వచ్చిందట. వెంటనే డాక్టర్లను పిలిపించి చికిత్స మొదలుపెట్టారు. నా సోదరి, ఇతర బంధువులు శిరిడీలో ఉన్న నాకు కబురుపెట్టాలని అనుకున్నారు. కానీ అప్పుడు అక్కడే ఉన్న చాందోర్కర్ కబురు పెట్టాల్సిన అవసరం లేదని, నేను బాబా సన్నిధిలో ఉన్నంత వరకు మా అమ్మకు ఏమీ కాదని, అవసరమనిపిస్తే వెంటనే బాబా నన్ను పంపగలరని చెప్పాడు. మేము శిరిడీలో బయలుదేరిన రాత్రి, ఇక్కడ మా

అమ్మకు చికిత్స చేస్తున్న డాక్టరు ఆమెకు జ్వరం చాలా ఎక్కువగా ఉందని, ఆమె ప్రేవులు బిగుసుకొనిపోయి ఉన్నాయని, పరిస్థితి ప్రమాదస్థాయికి చేరుకుందని చెప్పాడు. రాత్రికి ప్రేవుల్లో కదలిక ఏర్పడితే (విరోచనమైతే), ఆమె పరిస్థితి కాస్త మెరుగుపడుతుందని అన్నాడు. నేను ఆ తెల్లవారుఝామున 4.30- 5 గంటలకు మా అమ్మ ఉన్న చోటికి చేరుకున్నాను. వెంటనే నేను ఆమెకు బాబా ఊదీ, పాదతీర్థం ఇచ్చాను. ఆమెకు కొద్దిగా నిద్రపట్టింది. తరువాత కాసేపటికి ప్రేవుల్లో కదలిక ఏర్పడి విరోచనమయింది. దాంతో జ్వరం తగ్గిపోయింది. డాక్టరు వచ్చి పరీక్షించి ఆమె పరిస్థితి మెరుగుపడిందని, ఇక కోలుకుంటుందని చెప్పాడు. బాబాకు ఇవన్నీ ముందుగా తెలిసే, తమ సంకల్పానుసారం మమ్మల్ని ఊదీ, తీర్థంతో శిరిడీ నుండి పంపి మన్మాడ్‌లో పంజాబ్ మెయిల్ అందేటట్లుచేసి, సరియైన సమయానికి ఇంటికి చేర్చారని అర్థమయింది. నేను శిరిడీలో ఉన్నప్పుడు నన్ను దగ్గరకు పిలిచి ఊదీ ఇచ్చి ***"మూడు నాలుగురోజులలో అంతా బాగైపోతుంది"*** అనటంలో మా అమ్మ కోలుకుంటుందని బాబా ఉద్దేశ్యం.

బాబా చర్యలు నిగూఢమైనవి. వారి లీలలు అద్భుతాలు.

ఆ తరువాత మా అమ్మ సంపూర్ణ ఆరోగ్యంతో నాలుగు సంవత్సరాలు జీవించింది. ఆమె చనిపోయేందుకు రెండు సంవత్సరాల ముందు శిరిడీ వెళ్ళి బాబాను దర్శించి వారి ఆశీస్సులు పొందింది.

నేను ఒక్కడినే కాక మా కుటుంబంలోని వారందరూ బాబాను దర్శించి వారి ఆశీస్సులు పొందారు. నా భార్య, ఆమె సోదరి బాబా దగ్గరకు ఎలా వెళ్ళారో, నా భార్య బాబా నుంచి ప్రత్యేకంగా ఆశీస్సులు ఎలా పొందిందో మీకు ఈ సంఘటన ద్వారా తెలియజేస్తాను.

ఒక రాత్రి దాసగణు మహరాజ్ మా అమ్మవాళ్ళ ఇంట్లో అద్భుతమైన కీర్తన నిర్వహించాడు. కీర్తనలోని కథా విషయమేదైనప్పటికీ మధ్యలో బాబా మహిమల గురించి, వారి లీలల గురించి వర్ణించేవాడు. కీర్తన ముగిసిన తరువాత వారిని, చాందోర్కర్‌ను, ఇతర స్నేహితులను శాంతాక్రూజ్‌లో నున్న మా ఇంటికొచ్చి విశ్రాంతి తీసుకొమ్మని ఆహ్వానించాను. అందరూ సంగీత వాయిద్యాలతో సహా మా ఇంటికొచ్చారు. అక్కడ మరొక కీర్తన నిర్వహిస్తే బాగుంటుందని అందరూ

తలచారు. ఆ కీర్తన రాత్రి 2గం॥ల నుండి వేకువఝామున 5గం॥ల వరకు జరిగింది. ఆ సమయం మనసును ఎంతో ప్రభావితం చేస్తుంది. ఆ కీర్తన విన్న వెంటనే నా భార్యకు బాబాను దర్శించాలన్న బలమైన కోరిక కలిగింది. అంతేగాక బాబా తన కలలో కన్పించారని, అది బాబా తనను శిరిడీ రమ్మనడానికి సంకేతమని చెప్పింది. నెలలు నిండిన నా భార్య సోదరి విషయం ఎలా అని ఆలోచించాను. ప్రయాణం మధ్యలో నొప్పులొస్తే, ఆ పరిస్థితిని ఎదుర్కొనేందుకు నా భార్య, ఆమె సోదరి సంసిద్ధమయ్యారు. పన్నెండు టికెట్ల డబ్బు చెల్లించి, మాకోసం ప్రత్యేకంగా ఓ సెకెండు క్లాసు రైలుపెట్టెను బుక్ చేశాను. ఆ రైలుపెట్టె మన్మాడ్ మీదుగా కోపర్‌గాం చేరి, తిరుగు ప్రయాణంలో మాకోసం అక్కడే ఉండేటట్లు ఏర్పాటు చేసుకున్నాను. ప్రయాణం ఎటువంటి ఇబ్బందులు లేకుండా సుఖంగా సాగింది. ఇక కోపర్‌గాం చేరబోతున్నామనగా చాందోర్కర్‌గారు మాకోసం స్టేషనుకు వస్తారేమోనని నా భార్య అన్నది. నేను చాందోర్కర్‌కు శిరిడీ వెళ్తున్నట్లు జాబు వ్రాసినప్పటికీ, అతను వచ్చే అవకాశమే లేదని చెప్పాను. కానీ ఆమె ఊహించినట్లుగానే చాందోర్కర్ స్టేషనుకు వచ్చాడు.

చాందోర్కర్‌కు సుస్తీగా ఉండడంతో శిరిడీ వెళ్ళి ఉన్నాడు. అతనికి రోజు మార్చి రోజు జ్వరం వస్తూవుంది. మేము శిరిడీ వెళ్ళేరోజు, అతనికి జ్వరం వచ్చేరోజు ఒకటే అయ్యింది. అయినప్పటికీ నా ఉత్తరం అందుకున్న అతను కోపర్‌గాం స్టేషనుకు వచ్చి మమ్మల్ని స్వాగతించేందుకు బాబా అనుమతి కోరాడు. బాబా వెంటనే అనుమతించారు. అది తెలిసి దీక్షిత్ బాబాతో- చాందోర్కర్‌కు జ్వరం వస్తుందని, అందువల్ల తాను స్టేషనుకు వెళ్ళి మమ్మల్ని వెంటబెట్టుకొని వస్తానని అన్నాడు. కానీ బాబా దీక్షిత్‌ను వద్దని చాందోర్కర్‌ను మాత్రమే స్టేషనుకు వెళ్ళమని గట్టిగా చెప్పారు. చాందోర్కర్ స్టేషనులో కలిసి మమ్మల్ని స్వాగతించి మాకు ఘనమైన ఏర్పాట్లు చేశాడు. స్త్రీలకు సౌకర్యంగా ఉండే వసతి కల్పించాడు. మేము గోదావరిలో స్నానమాచరించి క్షేమంగా శిరిడీ చేరాము. చాందోర్కర్ మా కోసం ఇంత శ్రమ తీసుకున్నప్పటికీ, ఆరోగ్యపరంగా అతనికి కొంచెం కూడా ఇబ్బంది కలగలేదు. అంతేకాదు చాందోర్కర్‌కు ఆ రోజు నుండి మళ్ళీ జ్వరం రాలేదు.

మేము శిరిడీ చేరిన రోజు, బాబా నా భార్యను చూపించి మాధవరావు దేశ్‌పాండేతో ***"ఈమె నా బాబుకు తల్లి"*** అన్నారు.[1] గర్భవతిగా కనపడుతున్న నా భార్యసోదరి గురించే బాబా చెబుతున్నారని చాందోర్కర్ అనుకుని, ఆమెను చూపించి, "మీరు మాట్లాడుతున్నది ఈమె గురించే కదా?" అనడిగాడు. బాబా కాదని చెప్పి నా భార్యను చూపించి, ***"నేను మాట్లాడింది ఈమె గురించి"*** అన్నారు. ఆ రోజు నుండి సరిగ్గా 12 నెలలకు నా భార్య ఒక మగపిల్లవాడిని ప్రసవించింది. వాడికి బాబా నోటి నుండి వెలువడిన "బాబు" అన్న పేరేపెట్టాము. నామకరణ కార్యక్రమానికి దాసగణు, చాందోర్కర్ మొదలైన భక్తులందరూ వచ్చారు. ఆ కార్యక్రమం ఎంతో వేడుకగా, బాబా కరుణ, గొప్పతనాన్ని స్మరించుకునే విధంగా జరిగింది.

నేను మొదటిసారి శిరిడీ వెళ్ళినప్పుడు, మసీదులో బాబా సన్నిధిలో ఉండగా గాలివాన వచ్చింది. ఎడతెగకుండా వర్షం కురుస్తోంది. ఇలా ఒక పావుగంట వరకు కొనసాగింది. నేనప్పుడు వర్షం ఇలాగే కొనసాగితే నదులు వాగులు పొంగుతాయి. అప్పుడు నేను బొంబాయి వెళ్ళడానికి కష్టమవుతుంది. బాబా నన్ను తిరిగి వెళ్ళడానికి అనుమతివ్వరేమోనని అనుకున్నాను. అప్పుడు బాబా ఆకాశం వైపు చూస్తూ, ***"ఓ దేవా! చాలు. ఇక వర్షాన్ని ఆపు. నా బిడ్డలు తిరిగి ఇళ్ళకు వెళ్ళాలి. వారు కష్టపడకుండా ఇళ్ళకు వెళ్ళనీ (అరే అల్లా అభీ బర్‌సాత్ పురా కర్! మేరే బాల్‌బచ్చే ఘర్ జానేవాలేఁ హై. ఉన్‌కో సుఖ్‌సే జానేదే)"*** అన్నారు. ఆ

---

*1.*

*a. బాబు అంటే బాబాకు అమితమైన ప్రేమని, అతను చనిపోయినప్పుడు బాబా చాలా బాధపడ్డారని రావుబహద్దుర్ సాఠే చెప్పాడు.*

*b. బాబు గతజన్మల వృత్తాంతాన్ని గురించి జి.యస్. ఖాపర్డేతో (సాయిలీలామాసిక్ III (4) 345) బాబా ఇలా చెప్పారు- "దైవభక్తి కలిగిన ఒక వృద్ధుడు శిరిడీలో 12 సంవత్సరాల పాటు గడిపాడు. అతని భార్య, ఎదిగిన కొడుకులు జాల్నాలో ఉండేవారు. వాళ్ళు ఈ వృద్ధుని శిరిడీ నుండి తిరిగిరమ్మని పోరుపెట్టారు. చివరికతను గుర్రంపై బయలుదేరాడు. నేను అతనిని బండిలో అనుసరించాను.*

*కొంతకాలం గడిచిన తర్వాత, ఈ వృద్ధుడు తన సోదరుని కుమార్తెను వివాహమాడాడు. వాళ్ళిద్దరికి ఒక కొడుకు పుట్టాడు. పిల్లవానికి ఆరేళ్ళ వయస్సున్నప్పుడు వృద్ధుడు చనిపోయాడు. ఈ పిల్లవాని దాయాదులు అతనికి విషముపెట్టి చంపేసారు. ఆ పిల్లవాడే బాబు (దాదాకేళ్కర్ సోదరుని కుమారుడు) గా జన్మించాడు. ఆ బాబు మరణించి తిరిగి బొంబాయిలో పుట్టాడు."*

మాటలు అనడంతోనే వర్షం తగ్గుముఖం పట్టింది. నా మదిలో మెదిలే ఆలోచనలన్నీ బాబాకు తెలుసు. తరువాత బాబా నన్ను ఇంటికి వెళ్ళడానికి అనుమతించారు. నేను ఊదీ, తీర్థం తీసుకొని, పంజాబ్ మెయిల్‌లో ఊరికి చేరి మా అమ్మకు ఊదీ, తీర్థం ఇచ్చాను. ఈ విషయాన్ని ముందే విపులంగా చెప్పివున్నాను.

నేను ఇంటికి తిరిగి వచ్చిన రాత్రి మా వదినకు ఒక కల వచ్చింది. ఆ కలలో కఫ్నీ ధరించి, తలకు గుడ్డకట్టుకొన్న ఒక ఫకీరు మా ఇంట్లో ఉన్నట్లు చూసిందట. నేను శిరిడీలో బాబా అనుమతి తీసుకొంటున్నప్పుడు *"నేనూ నీ వెంటే వస్తాను"* అన్న బాబా మాటలు నిజమయ్యాయని తోచింది. బాబా మా ఇంట్లోనే ఉన్నారు.

**శాంతాక్రూజ్‌లో 1936 అక్టోబరు 19వ తేదీన వివరించిన విషయాలు:**

బాబా మా కుటుంబంపై చూపిన కృప అపారమైనది. బాబు పుట్టినప్పటినుండి నా భార్య తన మెట్టినింటి ఇలవేల్పుగా బాబాను కొలుచుకోవాలని నిర్ణయించుకుంది. మా సాంప్రదాయానుసారం ఏ స్త్రీ అయినా తనకు బిడ్డ పుట్టినప్పుడు గోధుమలు, టెంకాయ, పండ్లు కొంగులో కట్టుకొని అత్తవారింటికి వెళ్ళి, తన మామగారి ముందుగానీ లేక వారు పూజించే ఇలవేల్పు ముందుగానీ ఉంచాలి. కానీ నా భార్య ఈ వస్తువులన్నీ కొంగునగట్టుకొని, నాలుగు నెలల వయస్సున్న బాబును తీసుకొని శిరిడీ వెళ్ళి బాబాకు సమర్పించింది. బాబా వాటిని ప్రేమతో స్వీకరించారు. అంతేగాక బాబును తమ చేతులలోనికి తీసుకొని లాలిస్తూ *"బాబూ, ఎక్కడికి వెళ్ళావు? నేనంటే విసుగు కలిగిందా లేక నామీద అలిగావా? (బాబు కోఠే గేలా హోతాస్? మల కంతాలాస్ హోతాస్ కాయ్?)"* అంటూ ముద్దాడారు. తరువాత, బాబు శిరిడీ వచ్చిన సంతోష సమయంలో, వారి జేబులో నుండి రెండు రూపాయలు తీసి బర్ఫీ తెప్పించి కొడుకు పుట్టిన సందర్భంలో ఎలా మిఠాయిలు పంచుతారో అలాగే బాబా అందరికి బర్ఫీ పంచారు. ఇది 1912లో జరిగింది.

ఈ సందర్భంలోనే, బాబా శిరిడీ గ్రామ ద్వారాన్ని (ఆర్చి) చూపించి *"దీనినెవరు పునర్నిర్మిస్తారో వారికి అనుగ్రహం లభిస్తుంది"* అన్నారు. వెంటనే నా భార్య దానిని మేము కట్టించడానికి అనుమతి కోరింది. బాబా అనుమతించారు. నేను దాని నిర్మాణ నిమిత్తం 600 రూపాయలు చాందోర్కర్‌కు ఇచ్చాను. ఆ సమయంలోనే బాబా *"బాబు బంగళా అందంగా ఉంది. చక్కగా పూర్తయింది"* అన్నారు. బాబా

మాటలలోని అంతరార్థం, నేను ప్రస్తుతం నివాసముంటున్న బంగళాను ఖరీదు చేయమన్నట్లు అనిపించింది. బాబా చెప్పిన రెండు నెలల్లోగా ఆ బంగళాను లీజుకు తీసుకొని అందులోకి మారాను. తరువాత ఆరు నెలలకు దానిని ఖరీదు చేశాను. బాబా అన్నట్లు 1913 కల్లా 'బాబు' బంగళా తయారయ్యింది.

తరువాత బాబును మొదటి పుట్టినరోజుకు మళ్ళీ శిరిడీ తీసుకెళ్ళాము. అప్పుడు కూడా, బాబా రెండు రూపాయలకు బర్ఫీ తెప్పించి అందరికీ పంచారు. తరువాత ప్రత్యేకించి 'బాబు'ను గురించి *"బాబుకు సోదరి కానీ, సోదరుడు కానీ లేరా?"* అనడిగారు. నా భార్య ఒకింత సిగ్గుపడుతూ "మీరు మాకు ఈ బాబునొక్కడినే ప్రసాదించారు కదా?" అని జవాబిచ్చింది. అప్పటికి మాకొక కుమార్తె ఉంది. వారి పలుకులనే ఆశీస్సులుగా అన్వయించుకొని మాకింకొక కొడుకు, కూతురు పుడ్తారని అనుకున్నాము. బాబా చెప్పినట్లుగానే జరిగింది.

బాబు మొదటి పుట్టినరోజు సందర్భంగా మాధవరావు దేశ్‌పాండే ఇంట్లోనే పెద్ద ఎత్తున విందు ఏర్పాటు చేసి అందరినీ ఆహ్వానించాను. ఆ రోజు గురువారం. బాలాసాహెబ్ భాటే తనకు గురువారంనాడు బయట తినకూడదనే నియమం ఉందని చెప్పాడు. అతను ఆ రోజు బాబా దగ్గరకు వెళ్ళినప్పుడు, బాబా అతనిని ఇలా అడిగారు:

*బాబా : భావూ (ప్రధాన్) ఏర్పాటు చేసిన విందుకు వెళ్ళి భోంచేశావా?*

భాటే : ఈ రోజు గురువారం బాబా!

*బాబా : అయితే ఏమిటట?*

భాటే : నేను గురువారాలు భోంచేయను. అది నా నియమం.

*బాబా : ఎవరి ప్రీతి కోసం ఈ నియమం పెట్టుకున్నావు?*

భాటే : మీ ప్రీతి కోసమే!

*బాబా : అయితే నేనే చెబుతున్నాను. భావూ వద్దకు వెళ్ళి భోంచేసిరా!*

అప్పటికే సాయంత్రం 4 గంటలు అయింది. అయినప్పటికీ భాటే మా వద్దకు వచ్చి, బాబా ఇచ్చిన ఆదేశాన్ని తెలిపి భోంచేసి వెళ్ళాడు.

శాంతాక్రూజ్‌లో ఉండగా ఒకరోజు నా భార్యకు బాబా దర్శనమిచ్చినట్లు, బాబాకు పాదపూజ చేస్తున్నట్లు కల వచ్చింది. తన ఇంటిలో నిత్యము బాబా పాదపూజ చేసుకోమని దీని అంతరార్థంగా చాందోర్కర్ తెలియజేసి, ఆమెను రెండు

వెండి పాదుకలను తీసుకొని శిరిడీకి వెళ్ళమని చెప్పాడు. ఆమె అలాగే చేసింది. ఆమె బాబా వద్దకు వెళ్ళగానే, కాళ్ళు ముడుచుకొని కూర్చొని ఉన్న బాబా, తమ పాదాలను చాచి, ***"పాదుకలను ఈ పాదాల మీద ఉంచి పూజించుకో"*** అన్నారు. నా భార్య అలాగే బాబాను పూజించింది. అప్పుడు బాబా నానాసాహెబ్‌తో ***"చూసావా! ఈ తల్లి నా పాదాలను కోసి తీసుకువెళుతోంది (నానాహినేఁ మాఝే పాయ్ పహా కాపూన్ నేలే)"*** అన్నారు. బాబానే ఆ రెండు పాదుకలను ఆమె చేతికిచ్చారు. అప్పటి నుండి ఆమె ప్రతి రోజూ బాబా పాదుకలను పూజిస్తోంది.

నేను మొదటిసారి శిరిడీ వెళ్ళినప్పటి నుండి మసీదులో బాబాతోనే భోంచేసేవాడిని. బాబా స్వయంగా తమ చేతితో పదార్థాలను తీసి మా పళ్ళాల నిండా పెట్టేవారు. ఇలా పెట్టింది చాలా ఎక్కువ పరిమాణంలో ఉండేది. విలువైన ఆ ప్రసాదాన్ని పారేయకుండా, నాకు పెట్టినదాంట్లో ముప్పాతిక భాగం నా మేనకోడలితో ఇంటికి పంపేవాడిని. అది మా కుటుంబానికంతా సరిపోయేది. అంతేగాక నేను తిన్న ప్రసాదంతో నా కడుపు నిండి రాత్రికి ఇక ఆకలయ్యేది కాదు. బాబా భోంచేసిన తరువాత భోజనానంతర ఫలహారముగా పండ్లను ఇచ్చేవారు. నేను బాబును తీసుకు వెళ్ళినప్పుడు వాడికి వండిన పదార్థాలు సహించవని, బాబా మొదట వాడికి మామిడిపండ్లు మొదలైనవి తినిపించేవారు. దానితో వాడి కడుపు నిండేది. నాకు మరో కొడుకు, కూతురు పుట్టిన తరువాత బాబుతో కలసి ముగ్గురు పిల్లలను తీసుకొని మసీదుకు వెళ్ళి బాబాతో భోంచేసేవాడిని.

నేను చివరిసారిగా బాబాను దర్శించింది 1918 మే నెలలో. అప్పుడు నా దగ్గర 3800/- రూపాయలు ఉన్నాయి. బాబా పట్టుబట్టినందువల్ల నేననుకున్న సమయం కన్నా ఎక్కువ కాలం శిరిడీలో గడపవలసి వచ్చింది. వాచా చెప్పకపోయినా, వారి వద్ద స్పష్టంగా కనిపించే పద్ధతేమిటంటే- బాబా తాము ప్రేమించిన వారి వద్ద ఉన్న డబ్బంతా తరచుగా తీసేసుకుంటారు (యస్యానుగ్రహమిచ్చామి తస్యవిత్తం హరామ్యహమ్ అంటే నేను ప్రేమించిన వారి సంపదను పూర్తిగా తీసుకుంటాను). అందువల్ల నెల రోజులు శిరిడీలో ఉండి, బయలుదేరేటప్పటికి నా దగ్గరున్న డబ్బంతా అయిపోవడమే కాకుండా 1200 రూపాయలు అప్పుపడ్డాను. నేను ఈ మొత్తాన్ని నాకు పరిచయమున్న పూనాకు చెందిన పశువుల డాక్టరు వద్ద అప్పుగా తీసుకుని, ఇంటికి వెళ్ళిన తరువాత తిరిగి ఇచ్చివేసాను.

బాబు అనారోగ్యంగా ఉన్నప్పుడు జరిగిన సంఘటనలు వివరిస్తాను. బాబుకు అప్పుడు 3-4 సంవత్సరాలుంటాయి. బాబు తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. మాధవభట్ అనే తెలుగు పూజారి మా కుటుంబ శ్రేయస్సు కోసం మా ఇంట్లో ప్రతిరోజూ మంత్రజపం, పూజ నిర్వహించేవాడు. అతడికి మా కుటుంబంతో మంచి అనుబంధముండేది. అతడికి బాబుపై ప్రేమాభిమానాలుండేవి. మేము బాబాను పూజించడం పట్ల మొదట్లో అతనికి సదభిప్రాయం లేదు. మేము ముస్లిం ఫకీరైన సాయిబాబాను కొలుస్తున్నందుకే బాబు అనారోగ్యం పాలయ్యాడని అతని అభిప్రాయం. కానీ ఈ అభిప్రాయాన్ని మాతో చెప్పే ధైర్యం అతనికి లేకపోయింది.

ఒకరాత్రి అతనికొక కల వచ్చింది. ఆ కలలో ఒక రూపం (మా వద్ద ఉన్న ఫోటోను చూసి, కలలో వచ్చింది సాయిబాబా అని గుర్తించాడు) మిద్దెమెట్లపై కూర్చొని, ఒక చేతితో బెత్తాన్ని పట్టుకొని అతనితో ***"ఏమనుకుంటున్నావు! నేనే ఈ ఇంటి యజమానిని"*** అన్నారు. ఈ కల విషయం అతను ఎవరికీ చెప్పలేదు. (అతను బాబు కోలుకోవడం కోసం మమ్మల్ని దత్తునికి మ్రొక్కుకోమని చెప్పాడు. కానీ మేము సాయియే దత్తాత్రేయుడని అతనికి చెప్పాము).

తరువాత బాబు ఆరోగ్యం క్షీణించి ప్రమాదస్థితికి చేరుకుంది. బాబు పరిస్థితిని గమనించిన అతను పరుగెత్తుకుంటూ వెళ్ళి, బాబా ఫోటో ముందు నిలబడి "బాబా సాయంత్రం 4గం॥ల లోపల బాబు జ్వరం పూర్తిగా తగ్గిపోయి, మిద్దెపై నుండి క్రిందికి రాగలిగితే మీరు దత్తాత్రేయుడేనని నేను నమ్ముతాను" అని పెద్దగా ప్రార్థించాడు. కొద్దిసేపటికి బాబు జ్వరం తగ్గడం ప్రారంభమై సాయంత్రం 4గం॥ల కల్లా ఆడుకునేందుకు తనను క్రిందికి తీసుకెళ్ళమని కోరడంతో వాళ్ళమ్మ వాడిని క్రిందికి తీసుకొని వచ్చింది. ఇది గమనించిన మాధవభట్‌లో ఎంతో మార్పు వచ్చి, శ్రీసాయిబాబా దత్తాత్రేయుని అవతారమేనని భావించి బాబాకు 120 రూపాయలు దక్షిణ సమర్పిస్తానని మ్రొక్కుకొని అలాగే సమర్పించాడు. తరువాత మాధవభట్ తనకు మగపిల్లవాడు పుడితే 108 రూపాయలు సమర్పిస్తానని మ్రొక్కుకున్నాడు. కొడుకు పుట్టిన వెంటనే శిరిడీకెళ్ళి 108 రూపాయలు బాబాకు సమర్పించాడు. అదే సమయంలో నా (ప్రధాన్ యొక్క) అభీష్టం నెరవేరితే 1008 రూపాయలు దక్షిణగా సమర్పిస్తానని మ్రొక్కుకున్నాడు. అతను సమర్పించిన 108 రూపాయలే చాలా పెద్ద మొత్తం అని షామా అన్నాడు. అప్పుడు ***"ఇతడు దీనికన్నా ఎంతో ఎక్కువ***

*మొత్తం నాకు ఇవ్వబోతున్నాడు"* అని 1008 రూపాయల మ్రొక్కును ఉద్దేశించి బాబా అన్నారు.

బాబా ఒకసారి నా భార్యతో *"ఎదుటివారు మనలను పదిమాటలంటే, ఒకవేళ మనం సమాధానం ఇవ్వాల్సివస్తే ఒక్క మాటతో సమాధానమిద్దాం"* ఇంకా *"ఎవరితోనూ గొడవకుగానీ, పోటీకిగానీ దిగవద్దు (కోణీ కోణాచీ బరోబరీ కరూఁ నయే)"* అని హితవు పలికారు. 1918లో చివరిసారిగా శిరిడీ వెళ్ళి బాబాతో 32 రోజులు గడిపినప్పుడు, ఒకరోజు భక్తులందరం బాబాకు ఛత్రం పట్టి మేళతాళాలతో ఊరేగింపుగా లెండీకి తీసుకెళ్ళి విడిచి వచ్చాము. కాసేపటికి నన్ను మాత్రం పిలిపించారు. వారు నా తలపై తమ హస్తాన్నుంచి *"భావూ నేను చెప్పిన పని చేస్తావా?"* అనడిగారు. నేను చేస్తానని చెప్పాను. *"అయితే, నాకు వంద రూపాయలు ఒక సంచిలో వేసి మసీదుకు తెచ్చి ఇవ్వు"* అన్నారు. ఈ విధంగా బాబా నేను తీసుకొచ్చిన డబ్బే కాక అరువుగా తీసుకున్న డబ్బును (3800+1200) కూడా నా నుండి స్వీకరించారు. బాబా అప్పుడు ఏవేవో సంజ్ఞలు చేశారు. నాకు వాటి భావం స్పష్టంగా అర్థం కాలేదు. "మిన్ను విరిగి మీద పడినా వెరవకు. నేను నీ వెంటే ఉంటాను" అనే భావం ఆ సంజ్ఞలలో ఉన్నట్లు నేను గ్రహించాను. మొట్టమొదట వారిని దర్శించినప్పుడు, గత ఆరు సంవత్సరాలుగా నేను ఇచ్చిన చిలుంనే ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. వారి మాటలలోని అంతరార్థం నాకు బోధపడలేదు.

1916లో బూటీ రెండవ వివాహము శిరిడీలో జరిగింది. దీనికి నేను హాజరయ్యాను. మేము శిరిడీ నుండి బయలుదేరేటప్పుడు బాబా *"నేనూ మీ వెంటే వస్తాను (తుఝ్యా బరోబర్ మీ యేఈన్)"* అన్నారు. ప్రత్యక్షంగా (భౌతిక శరీరంతో) వారు మాతో రానప్పటికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం సుఖంగా సాగింది. దాన్నిబట్టి బాబా తమ సూక్ష్మశరీరంతో మమ్మల్ని అనుసరించి ప్రమాదాలను, ఇబ్బందులను తొలగించారని అర్థమయింది.

బాబా సమాధి చెందిన తరువాత కూడా వారి ఆశీస్సుల వల్ల, నేనెన్నో లాభాలు పొందాను. 1920 నుండి 1926 వరకు నేను సౌత్ సాల్సెట్ రెండవ తరగతి కోర్టు మేజిస్ట్రేటుగా నియమించబడ్డాను. 1926 నుండి జె.పిగా (జస్టిస్ ఆఫ్ పీస్) పనిచేశాను. బొంబాయి శాసనమండలి సభ్యునిగా థానా నుండి (1921-23) ఎన్నుకోబడ్డాను. 1927లో రావుబహద్దుర్ బిరుదు నాకు ప్రదానం చేయబడింది.



బాబు ప్రధాన్



శ్రీమతి చోటూబాయి ప్రధాన్

## 14

## **శ్రీమతి చోటూబాయి ప్రధాన్,** శాంతాక్రూజ్.

321(1) ఒకసారి నా పిల్లలందరికీ పొంగు (మీజిల్స్) పోసింది. బాబు పరిస్థితి మాత్రం ప్రమాదకరంగా ఉందని డాక్టరు చెప్పాడు. అందరూ ఆశ వదులుకున్నారు. నేను బాబాను ప్రార్థించాను. అప్పుడు బాబా కనిపించి, ***"ఎందుకమ్మా దుఃఖిస్తావు? పిల్లవాడు బాగానే ఉన్నాడు. ఉదయం ఆరు, ఆరున్నర గంటలకు వాడికి బాగా ఆహారం పెట్టు"*** అన్నారు. బాబు ఉదయానికల్లా కులాసాగా ఆడుకోసాగాడు. డాక్టరు వచ్చి వీడిని చూసి ఆశ్చర్యపోయాడు. పిల్లవాడికి ఏ ఆహారం పెట్టవద్దన్నాడు. కానీ, వాడు అన్నీ తిని అరాయించుకున్నాడు.

323(2) ఒకరాత్రి 11గం॥ల సమయంలో బాబా నా కలలో కన్పించి, ***"నిద్రపోతున్నావా? లేః! పిల్లవాడికి మూర్ఛ వస్తుంది"*** అన్నారు. నేను వెంటనే లేచి పిల్లవాడిని చూసాను. జ్వరంగానీ, మూర్ఛ లక్షణాలుగానీ కనిపించలేదు. కానీ బాబా హెచ్చరించినప్పుడు జాగ్రత్తపడాలి కదా! అందువల్ల వేడినీళ్ళు, నిప్పు, ఉడుకులోన్ మొదలైనవన్నీ సిద్ధంగా ఉంచాను. మా పిల్లలందరికీ అప్పుడప్పుడు మూర్ఛలు వస్తూనే ఉంటాయి. రాత్రి 2 గంటలప్పుడు పిల్లవాడికి మూర్ఛ లక్షణాలు కనిపించాయి. అన్నీ సిద్ధంగా ఉంచుకోబట్టి, అవి అర్ధగంటలో తగ్గిపోయాయి. రాబోయే ప్రమాదం గురించి బాబా ముందుగానే హెచ్చరించి నా బిడ్డను కాపాడారు. ఇలా బాబా తరచూ మాకు సహాయపడేవారు.

324(3) ఒకసారి బాబా నా కలలో కనిపించి, వారి పాదాలకు పసుపు, కుంకుమ పెట్టమన్నారు. కలలో నేను వారిని అలాగే పూజించాను. నా కల విషయం చాందోర్కర్‌కు చెప్పగా, ఆయన "వెండి పాదుకలను తీసుకొని శిరిడీకి వెళ్ళు. అవి బాబా ముందుంచి, వాటిని తెచ్చి పూజించుకో" అన్నారు. నేను అలాగే చేశాను. బాబా తమ పాదాలను ముందుకు చాపి, పాదుకలను తమ పాదాలపై పెట్టి పూజించుకోమని చెప్పారు. నేను పూజించుకున్నాను. బాబా వాటిని తిరిగి నాకు ఇస్తూ, నానాసాహెబ్‌తో, ***"చూసావా నానా! ఈ తల్లి నా రెండు పాదాలను కోసి తీసుకెళుతోంది (నానాహినేః మాఝే పాయ్ పహా కాపూన్ నేలే)"*** అన్నారు.

(325) ఒకరోజు మసీదులో బాబా ఆగ్రహంతో కేకలు వేస్తారేమోనని నేను భయపడ్డాను. కానీ ఆ రోజు వారు అలా ఏమీ చేయకుండా, ***"చూసావా, నేను ఎవరి పైనా కోప్పడలేదు, కేకలేయలేదు. అవునా?"*** అన్నారు. మరొక రోజు మసీదులో బాబాను పూజిస్తున్నాను. వాడాలో నా బిడ్డ ఏడుస్తుండడం బాబాకు తెలిసి, నన్ను పూజ మధ్యలో ఆపి ***"ఇంటికి వెళ్ళు"*** అని పంపించి వేసారు. నేను వెళ్ళి బిడ్డను సముదాయించి, మసీదుకు తిరిగి వచ్చాను. బాబా ***"ఇప్పుడు పూజ చేసుకో"*** అన్నారు.

ఒకసారి టైఫాయిడ్ జ్వరము నుండి అప్పుడే కోలుకుంటున్న మా అబ్బాయిని శిరిడీకి తీసుకువెళ్ళదలచాము. డాక్టరు వద్దని చెప్పాడు. కానీ మేము పిల్లవాడిని శిరిడీకి తీసుకువెళ్ళాము. రైలులో వాడికి జ్వరమొచ్చింది. అందరూ చెబుతున్నా వినకుండా పిల్లవాడిని తీసుకొచ్చాను, ఇప్పుడు వాడికేమన్నా అయితే నా పిచ్చితనాన్ని చూసి నలుగురూ నవ్వుతారేమోనని భయపడ్డాను. వాడు జ్వరతీవ్రతతో పడుకునే ఉన్నాడు. కనీసం కూర్చోలేకపోతున్నాడు. మేము శిరిడీ చేరి బాబా వద్దకు వెళ్ళేటప్పటికి, పిల్లవాడు కోలుకొని లేచి నిలబడగలిగాడు. బాబా ***"ఇప్పుడు నిన్ను చూసి ఎవ్వరూ నవ్వరు"*** అన్నారు. రైలులో ప్రయాణించేటప్పుడు నా మదిలో మెదిలిన ఆలోచన గురించి బాబాకు తెలుసు.

(328) 16.10.1918న అంటే బాబా మహాసమాధి చెందిన మరుసటి రాత్రి, బాబా మరణిస్తూ కనిపించారు. నేను "బాబా చనిపోతున్నారు" అని అరిచాను. అప్పుడు బాబా ***"మహాత్ముల విషయంలో చనిపోయారని అనకూడదు. సమాధి చెందారని అనాలి"*** అన్నారు. బాబా శరీరం నిశ్చలంగా ఉంది. చుట్టూ భక్తులు చేరి రోదిస్తున్నారు. నాకు చాలా బాధ కలిగింది. తరువాత నేను రాత్రి 12.30 గంII ల సమయంలో నిద్ర నుండి మేల్కొన్నాను. ఉదయం అణ్ణాచించణీకర్ నుండి జాబు వచ్చింది. బాబా 15.10.1918 విజయదశమి రోజున మధ్యాహ్నం 3 గంటలకు సమాధి చెందినట్లు అందులో ఉంది.

---

*ఎం.వి. ప్రధాన్ హైకోర్టులో స్పృహతప్పి పడిపోయినప్పుడు, శిరిడీలో బాబా హరిసీతారాం దీక్షిత్‌ను* ***"ప్రధాన్ వచ్చాడా"*** *అని అడిగారు. అప్పుడు దీక్షిత్, "లేదు. నేను అతనికి కబురు చేయనా?" అని అడిగితే, బాబా,* ***"అలాగే"*** *అన్నారు. (సాయిలీలా మాసిక్ 1(8) 65)*


(329) 19.10.1918 రాత్రి బాబా నా కలలో కన్పించి నాకు మూడు రూపాయలిచ్చారు. కలలో డబ్బు తీసుకోవడం అశుభంగా తోచి నేను బాధపడుతున్నాను. అప్పుడు బాబా ***"తీసుకో, తీసుకో! కానీ నీవు డబ్బాలో దాచిన డబ్బంతా నాకు పంపు"*** అన్నారు. మరుసటి రోజు నేనలాగే దాచుకున్న డబ్బంతా శిరిడీలో జరిగే కార్యక్రమాల కోసం పంపాను. నాకు పై కల వచ్చిన రాత్రే బాబా నా సోదరి కలలో కనపడి, తమ సమాధిపై కప్పేందుకు పసుపు పచ్చని పీతాంబరాన్ని పంపమని ఆదేశించారు. మేము అలాగే చేశాము.

(S.L.M III (4) 353) శాంతాక్రూజ్‌లో ఉండగా నా ప్రసవ సమయంలో నాకు సహాయంగా ఒక మంత్రసాని, ఒక నర్సు నియమించబడ్డారు. పురిటి నొప్పులతో నాలుగు రోజులు బాధపడ్డాను కానీ, ప్రసవం కాలేదు. నర్సు భయపడసాగింది. ఆమె నా సోదరి దగ్గరకెళ్ళి నొప్పులు ప్రారంభమై నాలుగు రోజులు కావస్తున్నా ప్రసవం కావడంలేదని, మావారి ద్వారా వెంటనే డాక్టరుకు కబురుపెట్టడం మంచిదని చెప్పింది. నా సోదరి బాబా పటం ముందు ఆర్తిగా ప్రార్థించింది. వెంటనే ఎవరి సహాయం లేకుండా నాకు ప్రసవమయింది. బాబా శక్తికి కరుణకి నేను, నర్సు ఆశ్చర్యపోయాము.

శ్రీసాయిలీలామాసిక్ పత్రిక (III (5) 381-384)లో శ్రీప్రధాన్‌గారు, మాధవ్‌భట్ అనే తెలుగు పూజారిలో వచ్చిన పరివర్తన గూర్చి తెలిపిన వివరాలు:

మాతోపాటు మాధవ్‌భట్ అనే తెలుగు బ్రాహ్మణుడు ఉండేవాడు. అతను వృద్ధుడు, పరమ శివభక్తుడు. రాత్రింబవళ్ళు రుద్రాభిషేకం మొదలైన పూజలు చేస్తూ గడిపేవాడు. 1912లో ఏడాది వయస్సున్న నా కుమారుడు బాబు అస్వస్థతకు లోనయ్యాడు. మేము ఇంటిలో ముసల్మానును పూజిస్తున్నందువల్ల శివుని ఆగ్రహానికి గురయ్యామని, అందుకే బాబు అస్వస్థుడయ్యాడని భట్ భావించేవాడు. ఒకరాత్రి బాబు జ్వరం తీవ్రమై ప్రమాదస్థితి ఏర్పడింది. మేము భట్‌ను లేపాలని అనుకుంటున్నాం. కానీ అతడే తనకు తానే లేచి మేడపైకి వచ్చి, నేరుగా వెళ్ళి బాబా ఫోటో ముందు కూర్చొని "నాకు వచ్చిన స్వప్నం నిజమైతే, బాబు జ్వరం 5 నిమిషాలలో తగ్గిపోవాలి. రేపటి నుండి వాడు ఆడుకోగలగాలి. డాక్టర్లు వాడు పూర్తిగా కోలుకున్నట్లు చెప్పాలి. అలా జరిగితే మీరు సిద్ధపురుషుడని నమ్మి మీ

ముందు సాగిలబడ్డాను. 15 రోజులలో శిరిడీ వచ్చి మీకు 108 రూపాయలు దక్షిణ సమర్పిస్తాను" అని మ్రొక్కుకున్నాడు. భట్ తనకు వచ్చిన కల గురించి చెప్పాడు. ఒక ముసల్మాను బాబా వలె దుస్తులు ధరించి దండము చేతబూని తన పడక దగ్గరికి వచ్చి లేపాడు. తరువాత మేడ పైకి మెట్లు ఎక్కుతూ *"నీకేం తెలుసు? ఈ ఇల్లు నాది. ఈ బిడ్డను నేనే ప్రసాదించాను. నీవు పిల్లవాడి రోగం నయం చేయగలవని అనుకుంటున్నావా? ఆ పిల్లవాడు నా వాడు. ఆ విషయం నీకు వెంటనే నిరూపిస్తాను"* అని పైకి వెళ్ళాడు. దాంతో తాను మేల్కొని, బాబా పటం దగ్గర ప్రార్థించడం జరిగిందని భట్ చెప్పాడు. అతను ప్రార్థించిన గంట తరువాత బాబు జ్వరం, దగ్గు తగ్గిపోయాయి. పిల్లవాడు చురుకుగా ఆడుకోసాగాడు. ఇది చూసి భట్ నేరుగా బాబా పటం దగ్గరకు వెళ్ళి సాష్టాంగ నమస్కారం చేశాడు. తరువాత మ్రొక్కు తీర్చడానికి శిరిడీ వెళ్ళాడు. బాబా భట్‌ని చూసిన వెంటనే *"ఇతడు నన్ను కుక్క అని, పిల్లి అని, ముసల్మానునని అంటున్నాడు"* అని భక్తులతో చెప్పారు. బాబా అంతర్యామిత్వానికి భట్ ఆశ్చర్యచకితుడై వారి పాదాలపై పడి నమస్కరించాడు. అప్పుడు బాబా షామాతో *"ఈ భట్ నన్ను రోజుకు ఎన్నిసార్లు పూజిస్తాడు?"* అన్నారు. తరువాత భట్ బాబాను ఇలా ప్రార్థించాడు. మొదటిది, తనకు ఒక కుమారుడు పుడితే 108 రూపాయలు దక్షిణ సమర్పించుకుంటానని, రెండవది, తన యజమాని అయిన శ్రీప్రధాన్‌గారి కోరిక నెరవేరితే దానికి పదింతల డబ్బు దక్షిణగా సమర్పించుకుంటానని మ్రొక్కుకున్నాడు. అదే రోజు మధ్యాహ్నం మసీదుకు వెళ్ళి బాబాను దర్శించాడు. బాబా అతనిని దక్షిణ అడిగారు. షామా బాబాతో ఆ ఉదయమే భట్ దక్షిణ సమర్పించాడని చెప్పాడు. *"అతను ఉదయమిచ్చింది చాలా చిన్న మొత్తం. అతడింకా పెద్ద మొత్తమే మనకి ఇవ్వబోతున్నాడు"* అని బాబా అన్నారు. తన అంతరంగంలోని ఆలోచనలన్నీ బాబాకు తెలుసునని భట్ చెప్పాడు. ఒక సంవత్సరం తరువాత భట్‌కు మగపిల్లవాడు పుట్టాడు. భట్ శిరిడీ వెళ్ళి బాబాకు 108 రూపాయల దక్షిణ సమర్పించాడు. తన స్వగ్రామంలో అతని సోదరుడు నిర్మించిన దత్తమందిరంలో బాబా ఫోటోనుంచి పూజించసాగాడు.



తాత్యాకోతే పాటిల్



హెచ్.వి. సారే

## 15

## ఆగష్టు 6వ తేదీ, 1936

**రావుబహద్దుర్ హరివినాయక సాఠే,** రిటైర్డ్ డిప్యూటీ కలెక్టరు, డక్కని, వయస్సు 81 సం॥లు, (జననం:1855), బ్రాహ్మణుడు, ప్రస్తుత నివాసం: 108, శుక్రవార్‌పేట్, పూనా.

నా నలభైనాల్గవ ఏట నా భార్య స్వర్గస్థురాలైంది. నాకొక కుమార్తె ఉంది. అప్పటి నుండి నా స్నేహితులు, పరిచయస్థులు నన్ను రెండవ వివాహం చేసుకోమని చెబుతుండేవారు. ముఖ్యంగా కోపర్‌గాం మామ్లత్‌దార్ అయిన బర్వే ఎక్కువగా ఒత్తిడి చేయసాగాడు. కానీ యాభయ్యవపడిలో అడుగుపెట్టబోతున్న నేను రెండవ వివాహం చేసుకోవడానికి నిరాకరించాను. వంశోద్ధారకుడు కావాలనే కోరిక బలంగా ఉన్నా, రెండవ వివాహం చేసుకున్నా ఆ వయసులో మగపిల్లవాడు పుడతాడనే నమ్మకం ఏమిటి? అందువల్ల ఎవరైనా మహాత్ములు సూచిస్తే తప్ప ద్వితీయ వివాహం చేసుకోనని నన్ను బలవంతపెడుతున్న స్నేహితులతో గట్టిగా చెప్పాను.

1904లో బర్వేతో కలిసి మసీదుకు వెళ్ళి శ్రీసాయిబాబాను దర్శించాను. కొంతసేపటి తరువాత సెలవు తీసుకొని మసీదు మెట్లు దిగాను. అప్పుడు బర్వే "సాహెబ్‌కు కొడుకు లేడు" అని బాబాతో అన్నాడు. (బాబా నన్ను ఎప్పుడూ 'సాహెబ్' అనే పిలిచేవారు). దీనికి బాబా ***"అతను వివాహం చేసుకుంటే దేవుడతనికి కొడుకును ప్రసాదిస్తాడు (షాదీ కరేగా తో అల్లా బచ్చా దేఁగా)"*** అన్నారు. బాబా మాటలు నేను విన్నాను. దీని తరువాత బర్వే తదితరులు నన్ను వివాహం చేసుకోమని మరల ఒత్తిడి చేయసాగారు. కానీ వధువు ఎంపికకు సమయం పట్టవచ్చునని నేను భావించాను. ఆ తరువాత నేను మా హెడ్‌క్వార్టర్స్ అయిన అహ్మద్‌నగర్‌కు వెళ్ళిపోయాను. ఆ సంవత్సరాంతంలో ఒక ప్రముఖ జ్యోతిష్కుడు పూనా వచ్చివున్నాడని తెలిసింది. నేను వెళ్ళి అతనిని సంప్రదించాను. అతను నాకూ, మా అమ్మాయికి గతంలో జరిగిన విషయాలన్నీ యథాతథంగా చెప్పాడు. అంతేకాకుండా నా జాతక చక్రం పరిశీలించి నాకు 50వ సంవత్సరం తరువాత కొడుకు పుడతాడని కూడా చెప్పాడు. అది మరలా వివాహం చేసుకోవాలన్న నా నిర్ణయాన్ని మరింతగా బలపరిచింది.

ఇది జరిగిన కొన్ని మాసాలకు నేను అహ్మదాబాద్‌కు బదిలీ చేయబడ్డాను. నేనక్కడ ఉన్నప్పుడు దాదాకేళ్కర్ (గణేష్ దామోదర్ కేళ్కర్) నాకొక ఉత్తరం వ్రాసాడు. అందులో తనకు పెళ్ళీడుకొచ్చిన ఒక కూతురుందని, అహ్మదాబాద్‌లో ఆ అమ్మాయికి తగిన సంబంధాలేవైనా ఉంటే తెలుపమని వ్రాసాడు. ఈ ఉత్తరం పెండ్లికొడుకుల అన్వేషణకుగాక, అతని కుమార్తె విషయంలో నా అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి వ్రాసినట్లుగా అనిపించింది. ఈ ఉత్తరం వ్రాయడంలో శ్రీసాయిబాబా పరోక్ష ప్రభావం కూడా ఉందనిపించింది. అందుకే నేను, ఈ దూరప్రాంతంలో ఆమెకు తగిన సంబంధాలేవీ ఉండవని, అతను నన్ను దృష్టిలో ఉంచుకొని ఆ ఉత్తరం వ్రాసి ఉన్నట్లయితే నా వయస్సు ఇతర వివరాలు పరిగణించమని జవాబు వ్రాసాను. అందుకతను నా పూర్తి వివరాలు తనకు తెలుసునని, నన్ను అతని అల్లునిగా చేసుకోవడానికి సంతోషపడుతున్నట్లు వ్రాసాడు. అలాగైతే తన కూతురిని శిరిడీ తీసుకెళ్ళి శ్రీసాయిబాబాకు చూపించి, వారి అనుమతి తీసుకోవలసినదని, బాబా అనుమతి లేనిదే వివాహం చేసుకోనని జవాబు వ్రాసాను. అప్పుడు దాదాకేళ్కర్‌కు బాబాపట్ల వ్యతిరేక భావముండేది. తన కుమార్తెను నాకు ఇవ్వడానికి బాబా అనుమతించరనీ దాని వలన ఆ వివాహం జరగదేమోనని సందేహించాడు. అందువల్ల 'వాయి'లోని బ్రాహ్మణ పండితుని (అతని బావమరిదిని) సంప్రదిస్తానని చెప్పాడు. అందుకు నేను ఒప్పుకోలేదు. బాబా వద్దకు వెళ్ళి వారి అనుమతి తీసుకోవలసిందేనని పట్టుబట్టాను. దాంతో కేళ్కర్‌కు తన కుమార్తెను తీసుకొని శిరిడీకి వెళ్ళవలసి వచ్చింది. శిరిడీ చేరి మాధవరావు సహాయంతో బాబా అనుమతి కోసం వేచివున్నాడు. దాదాకేళ్కర్ బాబా వద్దకు వెళ్ళగానే ***"అమ్మాయిని అహ్మదాబాద్ పంపు"*** అని బాబా అన్నారు. అంటే నాతో వివాహం చేయమని పరోక్షంగా తెలిపారు. బాబా అనుమతించారన్న సమాచారం నాకు అందింది. ఆ తరువాత 1905లో నా యాభయ్యవ సంవత్సరంలో నాకు దాదాకేళ్కర్ కుమార్తెతో వివాహమయ్యింది. తరువాత నాకు ఒక కుమారుడు, కుమార్తెలు కలిగారు.

**సాఠేవాడా:**

బాబాకు ఇష్టమైన వేపచెట్టు సమీపంలో గ్రామ సరిహద్దు గోడ ఉండేది. అది చాలా వరకు శిథిలమైంది. ఒకసారి బాబా నాతో, ***"ఆ గోడను పడగొట్టి, నిర్మించు"*** అన్నారు. శిథిలమై ఉన్న ఆ గ్రామ సరిహద్దు గోడను కూల్చి, పునర్నిర్మించమని

బాబా ఆదేశమని నేను అర్థం చేసుకున్నాను. అంతపెద్ద గోడ నిర్మించడానికి నేనేమీ ప్రభువును కాదు కదా అని తలచి మౌనంగా ఉండిపోయాను. కానీ బాబా ఉద్దేశ్యం అది కాదని, గ్రామగోడను కలుపుతూ ఒక వసతి గృహం మాత్రమే నిర్మించమని వారు సూచించినట్లుగా తరువాత నేను తెలుసుకున్నాను. నేను అక్కడున్న స్థలాన్ని కొని, గోడను కలుపుతూ వేపచెట్టుకు ఒకవైపున వసతిగృహాన్ని నిర్మించాను. వేపచెట్టు దగ్గర ఉన్న సమాధి తమ గురువు సమాధి అని బాబా చెప్పారు. (వేపచెట్టు చుట్టూ చిన్న అరుగు కట్టి భక్తులు పూజించుకునేందుకు చిన్న గూడు నిర్మించి, ప్రక్కగా భవంతి నిర్మించాను. ఆ భవంతిలో కొంతభాగం సమాధిపైకి వచ్చింది) వారి గురువు పేరు కూడా నాతో చెప్పారు కానీ నాకు గుర్తులేదు. పేరులో చివరి అక్షరం 'షా'తోగానీ, 'సా'తోగానీ పూర్తవుతుంది. బహుశా అది "వెంకూసా" అయి ఉండవచ్చు.

నేను శిరిడీ వెళ్ళి కొంతకాలం అక్కడ నివసించాను. అప్పుడు రోజూ బాబాకు పూజచేసి, ఆరతివ్వడం జరుగుతుండేది. అయితే తర్వాత కొన్ని రోజులకుగానీ గురుపూర్ణిమ రోజున బాబాకు ప్రత్యేక పూజలు ఉత్సవంగా చేసుకోవడం మొదలవలేదు. ఒక గురుపూర్ణిమ రోజున బాబా మా మామగారిని (దాదాకేళ్కర్) పిలిచి ***"ఈ రోజు గురుపూర్ణిమని నీకు తెలియదా? పూజాసామాగ్రిని తెచ్చి, గురుపూజ చేసుకో"*** అని ఆదేశించారు. మేమందరం ఆ రోజు గురుపూజ చేసుకున్నాము. అప్పటి నుండి గురుపూర్ణిమ రోజున భక్తులందరూ బాబాను పూజించడం మొదలయింది. అది ఈనాటికీ కొనసాగుతోంది.

బాబా నన్నెప్పుడూ 'హరిబా' మొదలైన పేర్లతో పిలిచేవారు కాదు. వారు ఎప్పుడూ నన్ను 'సాహెబ్' అనే పిలిచేవారు. నేను, మరి కొందరు భక్తులు బాబా చెంత ఉండగా- దేవుని తత్త్వం గురించి సాధనా చతుష్టయం, వివేక వైరాగ్యాలు, సమాధి స్థితి, ముముక్షుత్వం, బ్రహ్మము, సచ్చిదానందము మొదలైన వాటి గురించి బాబా సుదీర్ఘంగా ప్రసంగించినట్లు సంత్‌కథామృత్ గ్రంథంలో వ్రాసి ఉంది. అది సత్యదూరం. బాబా నా దగ్గర ఇలాంటి విషయాల గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. ఇతరుల దగ్గర మాట్లాడారో లేదో నేనెరుగను. తరువాత భక్తలీలామృత్ గ్రంథంలోని 31వ అధ్యాయంలో (219-236) నా వివాహాన్ని గూర్చి వ్రాయబడిన విషయం వాస్తవం కాదు. దానిని నన్ను సంప్రదించకుండానే వ్రాసారు. వ్రాసిన తరువాత కూడా నాకు చూపించలేదు. నేను ఇంతకుముందు మీతో చెప్పిన విషయాలే వాస్తవాలు.

నా వివాహం జరగడానికి, 1905 తరువాత నాలో వచ్చిన గొప్ప మార్పుకూ బాబానే మూలకారణం. అప్పటి నుండి వారే నా విధి నిర్ణేత, సూత్రధారి. నా ప్రాపంచిక, ఆధ్యాత్మిక, ఉద్యోగ, కుటుంబ విషయాలన్నింటిలో వారి రక్షణ, మార్గదర్శకత్వాన్నే ఆకాంక్షిస్తూ వారినే ప్రగాఢంగా నమ్మి నా బరువు బాధ్యతలన్నీ వారిపై మోపాను. శిరిడీలో వాడా కట్టిన తరువాత నేను, నా కుటుంబము మా మామగారు 1906 నుండి 1916 వరకు అక్కడ నివసించేటప్పుడు మా చుట్టూ ఉన్నవాళ్ళ ఈర్ష్యాద్వేషాలు, పగ ప్రతీకారాలు ఎదుర్కోవలసి వచ్చింది. బాబా నిరంతర జాగరూకత, రక్షణ లేకపోతే ఆ సమస్యల నుండి బయటపడేవాళ్ళం కాదు. ఎన్నో సందర్భాలలో బాబా అద్భుతరీతిలో సహాయమందించారు. అటువంటివి కొన్ని చెబుతాను.

1909 లేక 1910లో జరిగిన సంఘటన ఇది. అప్పుడు నేను, రెవెన్యూ కమీషనర్ శ్రీకర్టిస్, జిల్లా కలెక్టరు ఒక కమిటీగా ఏర్పడి ఉన్నాము. ఒకరోజు ఈ కమిటీ మన్మాడ్‌లో సమావేశమయ్యేందుకు నిర్ణయించబడింది. మన్మాడ్‌లో సమావేశం ముగిసిన తరువాత ఇతర ప్రాంతాలకు వెళ్ళవలసి ఉంది. సమావేశానికి ముందురోజు నేను శిరిడీలో ఉన్నాను. బాబా అభ్యంతరపెట్టరని తలచి మన్మాడ్ వెళ్ళడానికి అనుమతి కోసం మా మామగారిని బాబా దగ్గరికి పంపాను. అతను తిరిగి వచ్చి బాబా అనుమతివ్వలేదని చెప్పాడు. ఇది పెద్ద పెద్ద అధికారులతో కూడుకున్న పనని, సమావేశానికి వెళ్ళకపోతే ఉద్యోగం ఊడుతుందని చెప్పాను. మా మామగారు మరల బాబా వద్దకు వెళ్ళి నా ప్రయాణం గురించి అడిగి చూసారు కానీ బాబా అనుమతించలేదు. పైగా మన్మాడ్ వెళ్ళకుండా నన్ను గదిలో బంధించి ఉంచమన్నారట.

ఇలా మూడు రోజులు నన్ను శిరిడీలో ఉంచిన తరువాత మన్మాడ్ వెళ్ళేందుకు బాబా అనుమతించారు. నేను మన్మాడ్ వెళ్ళి విచారిస్తే సమావేశం జరగవలసిన రోజు అధికారులెవ్వరూ రాలేదని, నిర్ణయించిన కార్యక్రమంలో మార్పు జరిగి సమావేశం వాయిదాపడిందని తెలిసింది. పాత కార్యక్రమాన్ని అనుసరించి తదుపరి విడిదులలో బస చేయడానికి కావలసిన గుడారం తదితర సామగ్రిని రైలు ద్వారా మన్మాడ్ నుండి ఇతర నిర్ణీత ప్రదేశాలకు పంపే ఏర్పాట్లు అప్పటికే నేను చేసి ఉన్నాను. కానీ ఆశ్చర్యకరంగా రైల్వే అధికారుల పొరపాటు వలన అవి పంపబడలేదని, మన్మాడ్‌లోనే ఉన్నాయని

తెలుసుకున్నాను. ఇది నా మంచికే జరిగింది. ఒకవేళ అవి పంపబడి ఉంటే వాటిని వెదకి, తిరిగి తెప్పించుకోడానికి నానా అవస్థలు పడవలసి వచ్చేది. కాబట్టి మన్మాడ్ వెళ్ళనందు వలన నాకు జరిగిన నష్టమేదీ లేదు ఒక్క మనశ్శాంతి కోల్పోవడం తప్ప. అంతేగాక శిరిడీలో నా కుటుంబంతో, సాయిబాబా సన్నిధిలో ఎక్కువ సమయం గడపగలిగాను. నేను శిరిడీలో ఆగిపోవడం వలన నష్టపోతాననుకోవడం నా అజ్ఞానంగా అనిపించింది. కానీ త్రికాలజ్ఞులైన బాబాకు జరగబోయేదంతా తెలుసు. కావున వారే ఈ ఏర్పాటంతా చేశారు. ఇలాంటి సంఘటనలు మనకు బాబాపై ఉన్న నమ్మకం దృఢపడేందుకు తోడ్పడతాయి.

ఉద్యోగరీత్యా నాకు రావలసిన ప్రమోషన్ రాలేదని ఎంతో అసంతృప్తిగా ఉండేది. విసుగు చెంది ఈ విషయం సాయిబాబాకు తెలియజేసి, నేను ఉద్యోగానికి రాజీనామా చేస్తానని కూడా చెప్పాను. బాబా అలా చేయవద్దని, నాకు త్వరలోనే ప్రమోషన్ వస్తుందని చెప్పారు. కొన్నాళ్ళకు బాబా చెప్పినట్లుగా నా సీనియర్లను మించి వ్యవసాయ సూపరింటెండెంటుగా నాకు ప్రమోషన్ ఇచ్చి కోల్హాపూర్ బదిలీ చేశారు. నా జీతం వంద రూపాయలు పెరగడమే కాకుండా నా సీనియర్లకంటే నాకు ఎక్కువ పింఛను కూడా లభించింది.

నా పింఛను విషయంలోనూ నాకొక సమస్య ఎదురయింది. పింఛను శాఖవారు నా పర్మినెంటు ఉద్యోగమైన డిప్యూటీ కలెక్టరు ఉద్యోగాన్ని ప్రాతిపదికగా తీసుకొని పింఛను మంజూరు చేశారు. కానీ నేను చివరగా నిర్వహించిన ఉన్నతపదవిని వారు పరిగణనలోనికి తీసుకోలేదు. ఫలితంగా నాకు రావలసినదానికన్నా పింఛను 50 రూపాయలు తగ్గింది. ఈ విషయం నేను సాయిబాబాకు చెప్పాను. ఇలా తక్కువ పింఛను తీసుకునే బదులు అసలు పింఛనే తీసుకోవడం మానివేస్తానని అన్నాను. బాబా, ఆ యాభై రూపాయలు కూడా తప్పక మంజూరవుతాయని, అల్లా మేలు చేస్తాడని చెప్పారు. నేను రెవెన్యూ కమీషనరైన కర్టిస్‌కు అప్పీలు పిటీషన్ పంపాను. అతని సిఫారసుతో నా పింఛను మొత్తం పూర్తిగా మంజూరయింది. బాబా ఎవరి మనసునైనా ప్రభావితం చేయగలరు. ఏదైనా సంభవింప చేయగలరు.

**మేఘుడు:**

విరంగాంలో నేను డిప్యూటీ కలెక్టరుగా పని చేస్తున్నప్పుడు, మేఘశ్యాముడనే బ్రాహ్మణ భక్తునితో పరిచయమయింది. అతను నిరంతరం 'నమఃశివాయ' అనే

పంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ ఉండేవాడు. అతనికి గాయత్రీమంత్రం, సంధ్యావార్చడం వంటివి కూడా తెలియవు. అతని శ్రేయస్సు కోరి గాయత్రీమంత్రాన్నీ, సంధ్యావార్చడాన్ని నేర్పించాను. శివారాధన చేసుకోవడానికి అతనిని బ్రోచ్ అనే ఊరికి పంపుతూ దారి ఖర్చులకు ఎనిమిది రూపాయలిచ్చాను. అతనెప్పుడూ ఒంటికాలుపై నిలబడి శివుని ధ్యానించేవాడు. శ్రీసాయిబాబా పరమశివుని అవతారంగా శిరిడీలో వెలసివున్నారని, వారినొకసారి దర్శించి రమ్మని చెప్పి అతనిని శిరిడీ పంపించాను. కానీ బ్రోచ్ రైల్వే స్టేషనులో సాయిబాబా మహమ్మదీయుడని విన్నాడు. నిష్కపటి, ఆచారపరుడు అయిన అతను ఒక ముసల్మానుకు నమస్కరించాలన్న ఆలోచనతోనే తీవ్రంగా కలత చెంది, తనను శిరిడీకి పంపవద్దని నన్ను వేడుకున్నాడు. కానీ నేను మేఘునికి నచ్చజెప్పి అతనిని సాయిబాబాకు పరిచయం చేయమని మా మామగారికి జాబు వ్రాసి అతనికిచ్చి శిరిడీ పంపాను. అతను శిరిడీకి వెళ్ళి మసీదులోనికి అడుగిడే సమయంలో సాయిబాబా అతనిని చూస్తూనే ***"ఈ దుష్టుణ్ణి తన్ని తరిమేయండి"*** అని మసీదులోనికి రానివ్వలేదు. అంతేకాకుండా అటువంటి మూర్ఖుణ్ణి తమ వద్దకు పంపానని నా మీద కూడా బాబా కోప్పడ్డారట. మేఘుడు నిరాశపడి త్రయంబక్ వెళ్ళి అక్కడ గంగాద్వార్‌లో ఒకటిన్నర సంవత్సరం పాటు శివుని పూజిస్తూ గడిపాడు. తిరిగి శిరిడీ వెళ్ళాడు. ఈసారి మా మామగారి ప్రమేయంతో అతనికి మసీదులోకి ప్రవేశించేందుకు, శిరిడీలో ఉండేందుకు అనుమతి లభించింది. బాబా వాచా బోధించకపోయినా క్రమేణా మేఘుని అంతరంగంలో పరివర్తన తెచ్చారు. ఆ మార్పు అతనికి ఎంతో లబ్ధి చేకూర్చింది. మేఘుడు నిరంతరం బాబాను సేవిస్తూ, బాబాకు మధ్యాహ్న, సాయంత్ర ఆరతులు క్రమం తప్పకుండా నిర్వహించేవాడు. 1912లో మేఘుడు చనిపోయినప్పుడు బాబా తమ చేతులతో అతని మృతదేహాన్ని స్పృశించి ***"ఇతడు నా నిజమైన భక్తుడు"*** అన్నారు. అంతేకాక అంత్యక్రియలైన తరువాత తమ ఖర్చుతో బ్రాహ్మణులందరికి భోజనాలేర్పాటు చేయమని ఆదేశించారు. భావూసాహెబ్ దీక్షిత్ బాబా ఆజ్ఞ నెరవేర్చాడు.

**శిరిడీ విడుచుట:**

బాబా సర్వరాజలాంఛనాలతో వైభవంగా మసీదు నుండి చావడికి వెళుతున్నప్పుడు, నేను బాబా దర్బారు యొక్క రాజదండాన్ని (చిహ్నాన్ని) పట్టుకొని బాబా ముందు నడిచేవాడిని. అంతటి విశిష్టమైన సేవ నాకు లభించిందని

చాలామందికి నాపై అసూయగా ఉండేది. వాళ్ళు, మరికొందరు గ్రామస్థులు కలిసి నానావలీని నాపై ఉసిగొల్పి, నన్ను బాధించి అవమానించుట ద్వారా శిరిడీ నుండి తరిమేయాలని కుట్రపన్నారు. ఒకసారి చావడి ఉత్సవంలో నేను బాబా దర్బారు రాజదండాన్ని పట్టుకొని బాబా ముందు నడుస్తున్నాను. ఇంతలో హఠాత్తుగా నానావలీ నామీదబడి ఒక గాజుపెంకుతో నా మెడ వెనుక గాయపరిచాడు. ఆత్మరక్షణార్థం నేను అతణ్ణి రోడ్డు ప్రక్కనే పడివున్న ఒక కట్టెల మోపుపై త్రోసి కదలకుండా అదిమిపట్టాను. అది చూసి బాబా ***"సాహెబ్ అట్లా చెయ్యొద్దు"*** అని కేక వేసారు. తరువాత శిరిడీలో గాలి నాకు ప్రతికూలంగా ఉందని గ్రహించి చాలా జాగ్రత్తగా మెలగడం మొదలెట్టాను. ఒకరోజు బాబాకు నైవేద్యం తీసుకొని మసీదుకు బయలుదేరబోతున్నాను. ఇంతలో మా మామగారు (దాదాకేళ్కర్) పరుగు పరుగున వచ్చి నన్ను మసీదుకు వెళ్ళవద్దని, అక్కడ మసీదు ద్వారం బయట నానావలీ నన్ను చంపడానికి ఒక గొడ్డలి చేతబట్టుకొని నిలబడి ఉన్నాడని చెప్పాడు. అంతే నేను బాబా వద్ద సెలవు కూడా తీసుకోకుండా అటు నుండి అటే శిరిడీని శాశ్వతంగా వదిలిపెట్టి వెళ్ళిపోయాను. నిజానికి బాబా నన్ను శిరిడీలో ఉంచదలచుకోలేదని అనిపించింది. బాబా నన్ను నానావలీ బారి నుండి కాపాడలేకపోయారు కాబట్టి బాబాను విశ్వసించవద్దని నాకు చాలామంది చెప్పారు. అప్పుడు నేను విఠలుని భక్తుడు, గాయక్వాడ్ ప్లీడరైన గంగాధర శాస్త్రి తన శత్రువుల బారి నుండి పారిపోయి విఠలుని గుడిలో తలదాచుకున్నప్పుడు అతని శత్రువులు విఠలుని ముందే అతనిని చంపివేసిన ఉదంతాన్ని వాళ్ళకు గుర్తుచేశాను. నేను శిరిడీ విడిచిపెట్టడం, పూనాలో స్థిరపడడం నా మంచికోసమే జరిగింది. సాయిబాబా శిరిడీలో ఉన్నప్పుడు రక్షించినట్లే పూనాలో కూడా నన్ను సదా కాపాడుతున్నారు.

1916 ప్రాంతంలో అనుకుంటాను, ఉద్యోగరీత్యా పూనా సమీపంలోనున్న కోత్రుడ్ అనే ప్రదేశానికి వెళ్ళాను. నా వసతి కొరకు మంగులు (కడజాతివారు) పవిత్రమైన ఔదుంబర వృక్షం క్రింద గుడారం వేసారు. అంతేగాక, గుడారపు త్రాళ్ళను ఆ చెట్టుకు కట్టి దానిని అపవిత్రం చేశారు. అప్పుడు నాకు ఆ విషయం తెలియదు. దాని తరువాత నాకు దురదృష్టకర సంఘటనలెన్నో జరిగాయి. ఇలా ఎందుకు జరుగుతున్నాయో విచారించిన తరువాత నాకు అసలు విషయం తెలిసింది. నేను బాబాను ప్రార్థించాను. వారు నా కలలో కన్పించి, మొదట ఒక బ్రాహ్మణుణ్ణి పిలిపించి

ఆ చెట్టు శుద్ధి చేసేందుకు పూజలు జరిపించమన్నారు. తరువాత ఆ చెట్టు మొదట్లో దత్తుని పాదుకలు ప్రతిష్ఠించమని చెప్పారు. నేను వారు చెప్పినట్లుగా చేశాను. అక్కడ ఒక పూజారిని నియమించి, నిత్యం రెండుసార్లు పాదుకలను పూజించే ఏర్పాటు కూడా చేశాను.

**28.8.1936 తేదీన కొనసాగిన సంభాషణలు:**

నా స్వభావం గురించి చెబుతూ, బాబా, ***"సాహెబ్ కల్లాకపటములేని మనిషి"*** అన్నారు. అందువల్ల వారు నన్నెప్పుడూ కొట్టలేదు, తిట్టలేదు. కానీ బాబా ఇతర భక్తులను కొట్టేవారు, తిట్టేవారు. ఒకసారి మాత్రం నన్ను కొడతానని బెదిరించారు. దీనికి కారణం నేను చేసిన పొరపాటే. మా మామగారికి, నాకు ఏవో మనఃస్పర్థలు ఉన్నందువల్ల నేను శిరిడీలో వేరుగా ఉండసాగాను. నా బసలో ధనుర్మాస వేడుకలను జరుపదలచి అందరినీ ఆహ్వానించాను. మా మామగారిని మాత్రం ఆహ్వానించలేదు. నేను బాబాను ఆహ్వానించడానికి మసీదుకు వెళ్ళినప్పుడు, నన్ను చూడగానే ***"ఆ కర్రనిలా తీసుకురా"*** అని ఒక భక్తుణ్ణి ఆదేశించారు. నేను మౌనంగా నిలబడిపోయాను. వెంటనే బాబా మనఃస్థితి మారింది. ***"సరేలే! నేను వస్తాను"*** అన్నారు. ఆ రోజు వారి కోపానికి మరొక కారణం కూడా ఉంది. ఆ ఉదయం నేనొక మార్వాడీకి సంబంధించిన తగాదాలలో అనవసరంగా తలదూర్చాను. ఇది కూడా బాబాకు నచ్చివుండదు.

నేనొకసారి "బాబా చేతిలో దెబ్బలు తిననివాడిని నేనొక్కడినే" అని గొప్పగా చెప్పుకున్నాను. ఇది విని మాధవరావు దేశ్‌పాండే నా ముందే బాబాను అందుకు కారణమడిగాడు. బాబా ***"అతనిని నేనెందుకు కొట్టాలి? అతనిని కొట్టడానికి అతని మామ ఉన్నాడు కదా?"*** అన్నారు. మా మామగారు ప్రత్యక్షంగా కొట్టకపోయినా నన్ను తరచూ డబ్బులడుగుతూ వేధిస్తుంటారని, అది కొట్టడంతో సమానమని బాబా అభిప్రాయం.

బాబా నన్ను ఆడంబరాలకు, గర్వానికి, చెడు పనులకు దూరంగా ఉంచి నా ఆధ్యాత్మిక ఉన్నతికి సహాయపడేవారు. కొన్ని ఉదాహరణలు చెబుతాను. సాఠేవాడా శంకుస్థాపన కార్యక్రమం ఒక పౌర్ణమి రోజు జరిగింది. ఆ రోజు జరుగుతున్నట్లు నాకెవరూ తెలియపర్చలేదు. పౌర్ణమి ముందురోజు నేను, బేరే

శిరిడీ బయలుదేరాము. మా ప్రయాణం గురించి ఎవరికీ చెప్పలేదు. మేము ఆ రోజు సాయంత్రానికి కోపర్‌గాం చేరాము. రాత్రిపూట బాబాను దర్శించడం కష్టమౌతుందని ఆ రాత్రికి కోపర్‌గాంలో ఉండి ఉదయమే శిరిడీ వెళదామని చెప్పి బేరే నన్ను ఒప్పించాడు. మేము ఉదయమే లేచి శిరిడీకి వెళ్ళాము. మేము వెళ్ళే సమయానికి బాబా లెండీ నుండి వస్తూ కనిపించారు. వారి దర్శనం కోసం 80, 90 మంది జనం ప్రోగైవున్నారు. మేము వెళ్ళి సాష్టాంగ ప్రణామం చేశాం. బాబా ***"నీవు సరియైన సమయానికే వచ్చావు. వాడా శంకుస్థాపన కార్యక్రమం జరపాలి"*** అన్నారు. నేను శంకుస్థాపన కార్యక్రమం ఆడంబరంగా జరుగుతుందని ఆశపడ్డాను. నేను వెంటనే పారతీసుకొని త్రవ్వడానికి ఉపక్రమించాను. ఇది చూసి బాబా ***"నువ్వక్కడికి ఎందుకు వెళ్ళడం? అవన్నీ మనకెందుకు? అవన్నీ తాపీ మేస్త్రీలు, పనివాళ్ళు చూసుకుంటారు"*** అని నన్ను ఆపేసారు. దాంతో పద్ధతి ప్రకారం జరగాల్సిన విధంగా శంకుస్థాపన కార్యక్రమం జరగలేదు. తరువాత మా మామగారు, నేను పౌర్ణమి రోజు వస్తున్నట్లు తనకు ముందు రోజే తెలుసని అందుకే ఆ రోజు శంకుస్థాపన కార్యక్రమం తలపెట్టానని చెప్పాడు. నేను వస్తున్నట్లు అతనికెలా తెలిసింది అని అడిగినప్పుడు, ముందురోజు బాబా ***"సాహెబ్ రేపు వస్తున్నాడు. ఈ విషయం నాకు చాకలి చెప్పింది. సాహెబ్ యొక్క గుడారాన్ని ఆమెకు ఉతకడానికి వేసారట"*** అని అన్నారని చెప్పాడు. నేను గుడారమూ పంపలేదు, నేను వస్తున్నట్లు చాకలికి కబురూ చేయలేదు.

ముందురోజు రాత్రి బేరే నన్ను కోపర్‌గాంలో ఆపేయడం మంచిదే అయింది. మా మామగారి తండ్రివైపు బంధువులెవరో చనిపోయారు. అతని దశదిన కర్మకత్రువులు ఆ రోజు జరిపించారు. ఇల్లంతా మైలపడి, రోదనలతో గందరగోళంగా ఉంది. మేము వచ్చివుంటే, మాకు మడిగా వండి వడ్డించేందుకు కూడా ఎవరూ లేరని తెలిసింది.

బాబా తమ బిడ్డల చర్యలను వాళ్ళు ఎంత దూరంలో ఉన్నా జాగరూకతతో గమనిస్తుంటారు. ఒకసారి నేను కోపావేశానికి లోనుకాకుండా, ఎటువంటి క్రూరచర్యలకూ పాల్పడకుండా బాబా కాపాడారు. మా మామగారు శిరిడీ సమీపంలో 20 ఎకరాల భూమిని కొనమని నాకు సలహా ఇచ్చాడు. నేనాయనకు 1200 రూపాయలు పంపాను. దానితో ఆ 20 ఎకరాల భూమిని కొన్నాడు. ఒకరోజు నేను శిరిడీలో ఉన్నప్పుడు ఆ భూమిని చూడాలనే కోరిక కలిగింది. కానీ మా మామగారు

ఏవేవో సాకులు చెబుతూ వాయిదా వేస్తూ వచ్చారు. తన సోదరుని కుమారుడు బాబు చనిపోవడంతో, బాబు భార్య వాళ్ళతోనే ఉంది. ఆమెకు ఈ పొలం విషయం తెలిస్తే దానిలో భాగం అడుగుతుందని అతని భయం. కానీ నేను ఆ భూమిని చూడాలనే పట్టువీడలేదు. ఒకరోజు భూమిని చూడాలని నిర్ణయించుకొని తాత్యా దగ్గరి నుండి బండిని తెప్పించాను. నా భార్య మొదట వస్తానని చెప్పింది కానీ చివరి నిమిషంలో తన తండ్రిగారి మాటలకు తలవొగ్గి రానని చెప్పింది. నేను కోపావేశంతో రెచ్చిపోయి బండివాని నుండి కొరడా లాక్కొని, చెప్పిన మాట విననందుకు ఆమెను కొట్టబోయాను. హఠాత్తుగా మేఘుడు పరుగెత్తుకుంటూ వాడాకు వచ్చి, బాబా నన్ను వెంటనే మసీదుకు రమ్మంటున్నారని చెప్పాడు. నేను బాబా దగ్గరికెళ్ళాను. నేను మసీదుకు వెళ్ళగానే బాబా నన్ను చూసి *"ఏంటి విషయం? ఏమి జరిగింది?"* అని అడిగారు. అంతేకాదు నా భార్య మరియు మామగారు ఎందుకు అలా చేయాల్సి వచ్చిందో నాకు అర్థమయ్యేలా ***"నీ పొలం అక్కడే ఉంటుంది. దానిని చూడవలసిన అవసరమేముంది?"*** అని మందలించారు. నా అనవసర కోపానికి, తొందరపాటుకు సిగ్గుపడి తిరిగివచ్చాను. నా ప్రవర్తనను, శ్రేయస్సును బాబా గమనిస్తూనే ఉండేవారు.

బాబా నన్ను నైతికంగా పతనం కాకుండా కాపాడిన మరో సంఘటన గురించి వివరిస్తాను. ఒకసారి కుతూహలం కొద్దీ మొదటిసారిగా ఒక భక్తురాలి ఇంటికి వెళ్ళాలని అభిలషించాను. ఆమె ఇంటికి వెళ్ళే ముందు, ఫలానా చోటుకు వెళ్ళావా? అని బాబా అడిగారు. అక్కడి ప్రదేశాల పేర్లు నాకు తెలియవు గనుక బాబా అడిగిన ప్రశ్నలోని మర్మం నాకు బోధపడలేదు. బాబా అంతటితో ఆ విషయాన్ని ఆపేసారు. తరువాత నేను ఆ స్త్రీ ఇంటికి వెళ్ళి ఆమెతో సంభాషించసాగాను. త్వరలోనే చెడు ఆలోచనలు నా మనస్సును తొలచసాగాయి. అప్పుడు అకస్మాత్తుగా ఆ ఇంటి ముందు బాబా ప్రత్యక్షమై, మూసి ఉన్న తలుపులను త్రోసారు. వాకిట నుండే బాబా *"ఎంత గొప్ప కార్యానికి పూనుకోబోతున్నావు?"* అను అర్థం వచ్చే రీతిలో ఏవో సంజ్ఞలు చేసి, అంతర్ధానమయ్యారు. ఇలా నా చెడు ఆలోచనలు నా మనసులో స్థిరపడి, వాటిని ఆచరణలో పెట్టకముందే వారు సమయానికి వచ్చి నన్ను హెచ్చరించారు. నా తప్పు తెలుసుకొని వెంటనే ఆ ఇంటి నుండి వెనుదిరిగాను. తిరిగి ఆ ఛాయలకు వెళ్ళలేదు. తరువాత నేను వెళ్ళిన

చోటుకు స్థానికంగా ఉన్న పేరు, బాబా ఆ రోజు ప్రస్తావించిన పేరు ఒకటేనని తెలిసి నేను ఆశ్చర్యపోయాను.

**కుటుంబ వ్యవహారములు:**

బాబా నా కుటుంబ, ఉద్యోగ, ఆధ్యాత్మిక విషయాలలో సహాయపడేవారు. 1904లో నేను తిరిగి వివాహం చేసుకుంటే భగవంతుడు నాకు కుమారుణ్ణి ప్రసాదిస్తాడని బాబా చెప్పారు. 1905లో దాదాకేళ్కర్ కుమార్తెను నాకు భార్యగా ఎంపిక చేశారు. దీనితో దాదాకేళ్కర్ బాబా భక్తుడై శిరిడీయే తన శాశ్వత నివాసంగా చేసుకున్నాడు. తరువాత 1908లో బాబా ఆదేశానుసారం నేను శిరిడీలో వాడాను నిర్మించాను (గాంవ్ కుస్ బాంధా). వాడా కేవలం బాబా దగ్గరికి వచ్చే భక్తుల వసతి కోసం నిర్మించినప్పటికీ మా మామగారు, అత్తగారు, నా భార్య, అప్పుడప్పుడు నేను అక్కడ నివసించేవాళ్ళం. ఈ వాడా నిర్మించకముందు గౌరవప్రదమైన యాత్రికుల వసతి కోసం చావడి మాత్రమే ఉండేది.

వాడా శంకుస్థాపన ఎలా జరిగిందో మీకు ముందే వివరించాను. వాడాను నిర్మించేందుకు గోడలు కొంతవరకు లేపాము. వాటి ఎత్తు పెంచడానికి వేపచెట్టు (తొలిరోజుల్లో బాబా ఈ చెట్టు కింద కూర్చొని సాధన చేసుకున్నారు) కొమ్మలు అడ్డుపడ్డాయి. వాటిని నరికివేయందే నిర్మాణం సాగదు. పవిత్రమైన ఆ చెట్టుకొమ్మలు నరికేందుకు ధైర్యం చాలక బాబా దగ్గరకెళ్ళాం. బాబా సమస్యను విని ***"నిర్మాణానికి అడ్డొచ్చిన మేరకు కొమ్మలు నరికేయండి. మన గర్భంలో అడ్డం తిరిగిన బిడ్డను సైతం కోసి తీయవలసిందే కదా?"*** అన్నారు. బాబా ఆజ్ఞ అయిన తరువాత కూడా పవిత్రమైన చెట్టుకొమ్మలు నరకడానికి భయపడి పనివారెవరూ ముందుకురాలేదు. తరువాత బాబానే వచ్చి ఆ అడ్డొచ్చిన కొమ్మలను నరికివేసారు. తరువాత నిర్మాణం పూర్తయింది. ఆ తరువాత వేపచెట్టు చుట్టూ అరుగు, పైకి వెళ్ళేందుకు మెట్లు, బాబా గురువు యొక్క సమాధిపై గూడు కట్టబడ్డాయి. దానికైన ఖర్చు బాబా నన్ను భరించమన్నారు. ఇంకా ఆధ్యాత్మిక కార్యాలకు, ధర్మకార్యాలకు కూడా డబ్బు ఖర్చు చేయించేవారు. ఉదాహరణకు: దాసగణు రచించిన "మహాత్ముల జీవిత చరిత్రలు" అను గ్రంథం ముద్రణకు సిద్ధంగా ఉన్నప్పుడు, బాబా ఆ ఖర్చు నిమిత్తం నాచేత 75 రూపాయలు ఇప్పించారు.

నేను రెండవ వివాహం చేసుకున్న తరువాత ఇద్దరు కుమార్తెలు జన్మించారు. మా అత్తమామలు బాబా దగ్గరకెళ్ళి, బాబా మాట ఇచ్చిన ప్రకారం నాకు కుమారుడు కలగాలని ప్రార్థిస్తూ "బాబా మాకెప్పుడు మనవడు పుడతాడు?" అనడిగారు. అందుకు బాబా ***"నేను అల్లాను ప్రార్థిస్తున్నాను. వారు తప్పక నీ కోరిక తీరుస్తారు"*** అన్నారు. ఒకటి రెండు సంవత్సరాల తరువాత 1913లో నాకు కుమారుడు జన్మించాడు. బాబా కృపవలన వాడు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాడు. వాడే ఈ వయసులో నాకు ఆసరా.

నా భార్య, మామగారితో నేను ఎలా మెలగాలో అన్న విషయంలో బాబా నాకు చేసిన సూచనలు మీకు ముందే చెప్పాను. నా కుటుంబ వ్యవహారంలో బాబా ఎంత శ్రద్ధ కనబరచేవారో తెలియజేసే మరో సంఘటన వివరిస్తాను. నేను రిటైరైన తరువాత నా ఆర్థిక పరిస్థితులు క్షీణించసాగాయి. అలాంటి ఒక సమయంలో నా భార్య నగ ఒకటి అమ్మాను. అప్పుడు ***"ఆ తెలివితక్కువ సాహెబ్ నా కూతురు నగనెందుకమ్మాడు?"*** అని బాబా మా మామగారితో అన్నారట.

మా మామగారి సోదరుని కుమారుడైన బాబు అంటే బాబాకు అమితప్రేమ. బాబు నా అసిస్టెంట్ లిమాయే (నేనప్పుడు యేవలా మరియు కోపర్‌గాంలలో రెవెన్యూ సర్వే విభాగంలో సహాయక సూపరింటెండెంట్‌గా ఉన్నాను) వద్ద ఉద్యోగం చేస్తూ ఉండేవాడు. అతడికి ఉద్యోగంపై ఆసక్తి లేదు. ఉద్యోగాన్ని నిర్లక్ష్యం చేసి, శిరిడీ వెళ్ళి బాబా సేవ చేసుకుంటూ గడిపేవాడు. లిమాయే ఈ విషయంపై నాకు ఫిర్యాదు చేశాడు. నేను మా మామగారికి చెప్పాను. మా మామగారు "ఏం చేద్దాం? అతను బాబా ఆజ్ఞానుసారం నడుచుకుంటున్నాడు" అన్నారు. కానీ బాబుకు త్వరలో ఏం జరగబోతుందో తెలిసిన బాబా ***"ఉద్యోగం పోతేపోనీ, వాడిని నన్ను సేవించుకోనివ్వండి"*** అన్నారు. బాబు ఎల్లప్పుడు బాబాతోనే ఉండి చేతనైనంత సేవ చేసుకునేవాడు. అందువల్ల లిమాయే బాబును అతని ఇష్టప్రకారమే చేయనివ్వసాగాడు. 1910కి అతని చివరి రోజులు సమీపించాయి. బాబా తమకు కానుకగా వచ్చిన తినుబండారాలలో రుచికరమైన వాటిని ముందుగా బాబుకు ఇచ్చేవారు. బాబు అతనికిష్టమైన మామిడి పండ్లు (1910 నుండి భక్తులు బాబాకు మామిడిపండ్లు ఎక్కువగా సమర్పించేవారు) ఎక్కువగా తింటుండేవాడు.

బాబా మా మామగారిని ***“బాబు ఆరోగ్యం జాగ్రత్త (బాబు కడే లక్ష్ ఠేవా)”*** అని హెచ్చరించారు. బాబుకు తీవ్ర జ్వరం వచ్చి మృత్యువుకు చేరువయ్యాడు. అప్పుడు బాబా మా మామగారితో ***“అతను ఇంకా బ్రతికే ఉన్నాడా? (అరే తో ఆహే కాయ్?)”*** అన్నారు. కొన్ని రోజుల తరువాత బాబు (22సం॥ల వయస్సులో) 1910లో తుది శ్వాస విడిచాడు.

**మతపరమైన విషయాలు:**

ఐహిక విషయాలలోగానీ, ఆధ్యాత్మిక విషయాలలోగానీ బాబాను సంప్రదించనిదే ఏ పనీ చేసేవాడిని కాదు. మా మామగారి ద్వారాగానీ లేక మరెవరి ద్వారానైనాగానీ వారి అనుమతి పొందేవాడిని. బాబా ఎవ్వరికి ఏదీ ఉపదేశించినట్లు నేనెరుగను. అందువల్ల ఉపదేశం కోసం నేనెప్పుడూ వారి నాశ్రయించలేదు. కానీ ఎంతోమంది ఎన్నో సందర్భాలలో ఉపదేశిస్తామని నన్ను పిలిచేవారు. ఉదాహరణకు 1915 లేక 1917లోనో ఖరగ్‌పూర్, మీరజ్ యాత్రలు ముగించుకొని శిరిడీ వచ్చినప్పుడు ఉపాసనీబాబా పంచదశిలోని విషయాలను బోధపరుస్తానని, తమ దగ్గరికి రమ్మని ఆహ్వానించారు. అప్పుడు ఖరగ్‌పూర్, నాగ్‌పూర్ నుండి భక్తులు వచ్చి వారి దగ్గర ఉపదేశం పొంది వెళ్ళేవారు. నేను కూడా వీరి దగ్గర ఉపదేశం పొందేందుకు వెళ్ళాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్నాను. సంగోలాకు చెందిన ‘ఆత్యాబాయ్’ అను మహాత్మురాలు (ఈమె నుండి నా మొదటి భార్య ఉపదేశం పొందింది) మరియు మోరేగాంకు చెందిన గణపతి ఉపాసకుడు శ్రీవినాయక్ పాఠక్ మహరాజ్‌గారు కూడా నాకు ఉపదేశమిస్తామని ఆహ్వానించారు. ఈ మూడు సందర్భాలలోనూ సాయిబాబా అనుమతి కోరగా వారు నిరాకరించారు. (మొదటిసారి నేనే స్వయంగా బాబాను అడిగాను. తరువాత రెండుసార్లు మా మామగారి చేత అడిగించాను). బాబా నాకు ప్రత్యేకించి ఏదీ ఉపదేశించకపోయినా నేను అనన్యచింతనతో వారి యందు దృష్టి నిలపాలని వారి ఉద్దేశ్యం. తమ అపారమైన మహిమతో నా ప్రాపంచిక, ఆధ్యాత్మిక అవసరాలు తీర్చేందుకు వారు సదా సంసిద్ధులై ఉండేవారు.

నేను బాబా వద్దకు వెళ్ళిన మొదట్లో, ఒక్కొక్కసారి వారిని పూజించడానికి అనుమతించేవారు, ఒక్కొక్కసారి నిరాకరించేవారు. ఒక గురుపూర్ణిమ రోజు మాత్రం

నేను, మా మామగారు, అందరూ తమను సామూహికంగా పూజించేందుకు బాబానే ఆదేశించిన విషయం ముందు తెలిపాను కదా! ఒక శివరాత్రి నాడు అర్ధరాత్రి సమయంలో వారిని శివునిగా భావించి పూజిస్తానని అందుకు అనుమతించమని కోరాను. కానీ బాబా నిరాకరించారు. ఆ రోజు శివాలయాలన్నింటిలో అర్ధరాత్రి పూజలు నిర్వహిస్తారు. అదే విధంగా బాబాను పూజించాలని మా కోరిక. దాంతో నేనూ, మేఘుడు అర్ధరాత్రి రహస్యంగా మసీదు మెట్ల దగ్గర పూజ నిర్వహించాలని తలచాము. బిల్వపత్రాలు, చందనం మొదలైనవి తీసుకొని అర్ధరాత్రి మసీదు చేరాము. మేము రావడం గమనించిన తాత్యా మమ్మల్ని వెళ్ళిపొమ్మని చేతులతో సైగ చేశాడు. బాబా నిద్రిస్తున్నట్లు కనిపించడంతో మేము ధైర్యంగా మసీదు మెట్లపై చందనం పూసి, బిల్వపత్రాలు వేసాము. వెంటనే బాబా మేల్కొని ఎవరినీ ఉద్దేశించినట్లు కాకున్నా పెద్దగా కప్పులెగిరిపోయేట్టు తిట్టడం ప్రారంభించారు. వారి అరుపులకు తిట్లకు గ్రామమంతా మేల్కొని గ్రామస్థులందరూ మసీదు చేరారు. బాబా నిరాకరించిన తరువాత కూడా రహస్యంగా పూజను నిర్వహించి ఎవరికీ దక్కని పుణ్యం పొందేందుకు ప్రయత్నం చేయడం తప్పని గ్రామస్థులు మమ్మల్ని నిందించారు. బాబా నన్ను ఎవ్వరి నుండి ఉపదేశం పొందనవసరం లేదని చెప్పారు కానీ నేను సాధుసత్పురుషులను గౌరవించి ఆదరించాలని మాత్రం అభిలషించేవారు. అంతేకాదు ఒక సత్పురుషుడు స్వయంగా మా ఇంటికి వచ్చేలా బాబా చేశారు.

**ధోపేశ్వర్‌కు చెందిన కాకామహరాజ్:**

కాకామహరాజ్ గొప్ప సిద్ధపురుషుడు. వారు 25 సంవత్సరాల క్రితం పూనా వచ్చి, దేవ్‌లే అను వానింట్లో బస చేశారు. భక్తులెందరో వారిని దర్శించి తమ ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించమని కోరారు. నేను కూడా ఉదయమే కాకామహరాజ్‌ను దర్శించి వారిని మా ఇంటికి ఆహ్వానించాను. వారు రాలేమని చెప్పారు. ఆ మధ్యాహ్నం నేను ఆఫీసులో ఉండగా కాకామహరాజ్ మా ఇంటికి వస్తారన్న కబురందుకొని ఆశ్చర్యపోయాను. నేను వెంటనే వారికి టాంగా పంపి ఇంటికి వెళ్ళాను. కాసేపటికి మహరాజ్ వచ్చారు. ఉదయం రాలేనని చెప్పారు కదా, ఇంతలోనే మనస్సు మార్చుకోవడానికి కారణమేమిటని వారినడిగాను. వారు మా ఇంట్లో గోడకు తగిలించి ఉన్న సాయిబాబా ఫోటోను చూపిస్తూ "నేను మీ ఇంటికి వచ్చి, నిన్ను చూసేదాకా వీరు నన్ను నిలువనీయలేదు" అన్నారు.

కాకామహరాజ్ తమ దేహత్యాగానికి ముందు నా అల్లుని సోదరుడు హరి గంగాధర్‌జోషీని (ప్లీడరు, థానా), అతని స్నేహితుడిని సాయిబాబాను దర్శించి పూజించమని ఆదేశించారు. మహరాజ్ నిర్యాణం చెందిన తరువాత వీరు శిరిడీ బయలుదేరారు. వీరు మసీదు చేరేటప్పటికి బాబా పట్టరాని కోపావేశాలతో ఊగిపోతున్నారు. కానీ వీళ్ళిద్దరూ బయట నిలబడి ఉండడం గమనించిన వెంటనే బాబా వాళ్ళను లోనికి తీసుకురమ్మన్నారు. అప్పటికి బాబా కాస్త శాంతించడంతో వీరిద్దరూ ఎటువంటి ఇబ్బందీ లేకుండా బాబా దర్శనం చేసుకున్నారు. ఆ తరువాత బాబా భిక్షకు బయలుదేరుతూ వీరిని చూసి ***"ఆ వృద్ధుణ్ణి (కాకామహరాజ్) చంపి ఇక్కడికొచ్చారా?"*** అన్నారు. ఈ విధంగా బాబా తమ సర్వజ్ఞతను, కాకామహరాజ్ పట్ల తమ సోదరభావాన్ని తెలిపారు.

(వామనరావుపటేల్ రచించిన "గురుస్మృతి"లో) నా అల్లుడు జోషీకి బాబా చూపిన చమత్కారమొకటి ఉంది. అతను శిరిడీ వెళ్ళి బాబాను దర్శించి, ఊదీ అడిగాడు. అతనికి ఊదీ తరువాత ఇవ్వబడుతుందని, బాబా చెప్పి పంపారు. తరువాత జోషీ రైలులో ప్రయాణిస్తున్నప్పుడు, ఒక తోటి ప్రయాణికుడు బాబా ఇచ్చిన ఊదీ అతనికి ఇచ్చాడు.

**దక్షిణ భిక్ష సంస్థ:**

డిసెంబరు 1915లో నేను పూనాలో ఉన్నప్పుడు బాబా నుండి నాకొక ఆదేశమందింది. వారి ఆదేశం మేరకే నా అధ్యక్షతన "దక్షిణభిక్ష సంస్థ" అనుదానిని నెలకొల్పడానికి సహాయపడ్డాను. ఈ సంస్థ అధికార అంగంగా "సాయినాథ్ ప్రభ" అను పత్రిక కూడా నడిపేవాళ్ళం. ఈ పత్రికలో ప్రచురింపబడుతున్న విషయాలు బాబాకు చదివి వినిపించడం కానీ ముద్రణకు ముందు వారి అనుమతి తీసుకోవడంగానీ జరుగలేదు. ఈ పత్రిక ఆయుర్దాయం బహుస్వల్పమే (సంవత్సరంలోపు). "సాయినాథ్ ప్రభ" పత్రికల కాపీలు కూడా లభ్యం కావడం లేదు. (ఒకటి, రెండు భాగాలు తప్ప). ఈ భాగాలలో, 1915-1917, 1918లలో శిరిడీ సంస్థాన్ స్థితిగతులు వివరించబడి ఉన్నాయి. ఈ పత్రిక సంపాదకునిగా సుందర్‌రావు నారాయణ్ వ్యవహరించాడు. మొదటి భాగంలో నీతివాక్యాలను, పత్రిక ఆశయాలను 'రామ్‌గిర్'

అను కలం పేరుతో రచించినది ఇతనే. ఇప్పుడతను ఎక్కడున్నాడో, ఏమయ్యాడో కూడా నాకు తెలియదు. సంస్థ స్థాపించబడిన పదకొండు నెలలకు రాధాకృష్ణ ఆయీ మరణించింది. సాయి సంస్థాన్‌కు చెందిన వస్తువులు అన్నీ ఆమె అధీనంలో ఉండేవి. విల్లు రాయకుండా చనిపోయిన బ్రాహ్మణ వితంతువు అయినందున, ఆమెకు ఎవరూ వారసులు లేనందున పోలీసులు వచ్చి ఆమె అధీనంలో ఉన్న ఆస్తులన్నీ స్వాధీనం చేసుకున్నారు. మేము 'సభ' (ద.భి.స) పేరున కేసును దాఖలు చేసి, మహజర్‌లు కూడా సమర్పించి, కోపర్‌గాం మేజిస్ట్రేటు నుండి ఉత్తర్వులు (M.E.R.23 N2 1916) తెప్పించి, సంస్థాన్ ఆస్తులనన్నింటిని సంస్థాన్ తరఫున 'సభ' (ద.భి.స) పరం చేశాము. కానీ ఆర్థిక వ్యవహారాలన్నీ నా అజమాయిషీలో ఉండడంతో నా మీద అందరికీ వ్యతిరేకత పెరిగి, నానావలీ ద్వారా నన్ను శిరిడీ నుండి తరిమివేసి ఆపై నాకు కోర్టు ద్వారా నోటీసులు ఇవ్వడం దాకా వెళ్ళింది. తప్పుదారి పట్టిన కొందరు భక్తులు, దొంగిలించబడిన వెండి అలంకరణ వస్తువుల (సంస్థాన్ గుఱ్ఱానికి సంబంధించినవి) వంటి చిన్న విషయాన్ని అడ్డంపెట్టుకొని నాపై కేసు మోపి లాయరు ద్వారా 1918 జనవరిలో నాకు నోటీసు ఇప్పించారు. నేను బాబాను సంప్రదించాను. బాబా నన్ను జవాబు ఇవ్వమని, ఏ విధంగా జవాబు వ్రాయాలో కూడా చెప్పి నన్ను కాపాడతానని, కేసు విచారణకు రాకుండా చేస్తానని హామీ ఇచ్చారు. నేను బాబా చెప్పినట్లుగా జవాబు వ్రాసి పంపాను. బాబా చెప్పినట్లే జరిగింది. నా మీదగానీ, 'సభ' (ద.భి.స) మీదగానీ ఎటువంటి విచారణ జరగలేదు.

**బాబా మరియు ఇతర మహాత్ములు: వారి అంతర్జ్ఞానం**

నేను శిరిడీలో ఉండగా, బాబా ఒకరోజు మామూలుగా వెళ్ళే సమయానికి లెండీ తోటకు బయలుదేరలేదు. మసీదు గోడకానుకొని పడుకున్నారు. ఇలా ఒక గంట గడిచింది. బాబా లెండీకి వెళ్లే సమయం మించిపోతుండడంతో, లెండీకి ఎందుకు వెళ్ళలేదని భక్తులు బాబాను ప్రశ్నించారు. బాబా ***"అరే! నా గజానన్ వెళ్ళిపోయాడు (అరే మార్ఝా గజానన్ గేలా)"*** అని జవాబిచ్చారు. ఒక భక్తుడు గజానన్ మహరాజ్‌గారి కుశలమడుగుతూ శిరిడీ నుండి షేగాంకు జాబు వ్రాసాడు. బాబా చెప్పిన రోజే వారు సిద్ధిపొందినట్లు జవాబు వచ్చింది.

**బాబా దూరదృష్టి:**

1917లో ఒకసారి బాబా *"తిలక్ ఇక్కడికి వస్తున్నాడు"* అని పలికారు. ఏ కారణం చేతనూ లోకమాన్య బాలగంగాధర్ తిలక్ శిరిడీ వచ్చే అవకాశం లేదని, బహుశా బాబా చెప్పింది వామన్ మహరాజ్ తిలక్ గురించని నేను తలచాను. కానీ, త్వరలోనే అంటే, 19.5.1917 తారీఖున లోకమాన్య తిలక్ శిరిడీ వచ్చి బాబాను దర్శించాడు.

**బాబా లీలలు:**

మామూలుగా బాబా తమ భక్తులకు చేసిన ఉపకారాలు, అద్భుతకార్యాలు భగవంతుడు చేసినట్లుగా చెప్పి ఆ గొప్పతనాన్ని భగవంతునికే ఆపాదిస్తారు. అది బాబా వినమ్రత కావచ్చు లేక ఆయన పద్ధతి కావచ్చు. కానీ కొన్ని విషయాలలో మాత్రం తామే చేసినట్లుగా తెలియజేసారు.

మొదటిది, నా పింఛను మంజూరు విషయంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి నా పూర్తి పింఛను మంజూరు చేయిస్తానని చెప్పారు.

రెండవది, దాజీహరిలేలే జీతం పెంపు విషయంలో! నాశిక్‌లో లాండ్ రికార్డ్స్ ఇన్‌స్పెక్టరుగా పని చేస్తుండిన దాజీ హరిలేలే బాబా దర్శనార్థం శిరిడీ బయలుదేరాడు. దారిలో కోపర్‌గాంలో ఆగి లైబ్రరీకెళ్ళి గెజిట్ చూసాడు. అందులో అతని జీతం 125 రూపాయల నుండి 150 రూపాయలకు పెరిగినట్లు ఉంది. తరువాత అతను శిరిడీ వచ్చి బాబాను దర్శించాడు. బాబా అతనిని 15 రూపాయల దక్షిణ అడిగారు. దాజీ తన దగ్గర డబ్బు లేదని చెప్పాడు. బాబా *"నిన్ననే నీకు 25రూపాయలు ఇచ్చాను. వెళ్ళి డబ్బు తీసుకురా"* అని ఆదేశించారు. దాజీ వాడాకొచ్చి జరిగిన విషయమంతా నాకు చెప్పి 15 రూపాయలు అప్పు తీసుకొని బాబాకు సమర్పించాడు.

**బాబా ఉవాచ:**

*1. నేను పిల్లవానిగా ఉన్నప్పుడు శాలువాలు నేసేవాడిని. నా తండ్రి నా అద్భుత పనితనానికి మెచ్చి నాకు 5 రూపాయలు బహుకరించారు.*


*2. నేనొకప్పుడు కోరమండల్ తీరంలో నివసిస్తూ ఉండేవాడిని.*

*3. అక్బర్ పాదుషా పసిబిడ్డగా ఉన్నప్పుడు అతనిని కాపాడాను. అతను నాపట్ల భయభక్తులతో ఉండేవాడు.*

*4. పైఠాన్‌కు చెందిన ఆ బ్రాహ్మణుణ్ణి (ఏకనాథ్ మహరాజ్) నేనెరుగుదును. అంతటి శ్రేష్ఠమైన బ్రాహ్మణులు ఈ రోజుల్లో కనిపించటం లేదు.*

*5. చాంద్‌భాయ్ పాటిల్ నా దగ్గరకొచ్చి "నా గుర్రాన్ని ఎక్కడికి తోలేసావు?" అనడిగాడు. నేను "నన్నెందుకడుగుతావు? నీ గుర్రం ఆ కట్ట ప్రక్కనే మేస్తూవుంటుంది వెళ్ళిచూడు"* అన్నాను.

బాబా నోటిగుండా వెలువడిన మాటలు ఇంతమాత్రమే. ఆ మాటలకు నా ఊహాగానంతో కల్పన చేసి, కథలు అల్లి "సాయికథాకరండకా" అను గ్రంథాన్ని వ్రాసాను. దీనిని వ్రాసే ముందు బాబాకు చెప్పలేదు. వారి అనుమతి కూడా తీసుకోలేదు. బాబా చెప్పే విషయాలు చాలా క్లుప్తంగా ఉండేవి. వారు కథలు కూడా చెబుతూండేవారు. కానీ చాలాసార్లు కథలను అర్థాంతరంగా ఆపేసేవారు.



# మహాల్సాపతి



దాసగణు మహరాజ్

## 16

## జూన్, 1936- పూనా

**దాసగణు మహారాజ్ ఉరఫ్ గణపతిరావు దత్తాత్రేయ సహస్రబుద్ధే,** కీర్తనాకారుడు, వయస్సు సుమారు 78 సం॥లు, బ్రాహ్మణుడు, నాందేడు (నిజాం రాష్ట్రం).

శ్రీసాయిబాబా నాకు చాలాకాలంగా తెలుసు. నేను రచించిన భక్తిసారామృత్‌లో 26, 65, 66, 67 అధ్యాయాలు (1925), భక్తలీలామృత్‌లో 31 (1906), 32, 33 అధ్యాయాలు, సంత్‌కథామృత్‌లో 57వ అధ్యాయములో బాబాను గురించి పేర్కొని ఉన్నాను. భక్తలీలామృత్‌లోని 31వ అధ్యాయము, సంత్‌కథామృత్‌లోని 57వ అధ్యాయము రెండూ బాబా భౌతికంగా ఉన్నప్పుడే ప్రచురితమయ్యాయి.

బాబా తమ గతానికి సంబంధించిన కొన్ని వాస్తవాలను స్వయంగా వెల్లడించారు. అవి చాలా స్వల్పమే. దానికి తోడు నేను వారితో గడిపిన సమయం నామమాత్రమే! నేను బాబాను అరుదుగా దర్శిస్తూ ఉండేవాడిని. శిరిడీలో ఉన్నప్పుడు బాబా నన్ను మసీదులో ఎక్కువ సమయం ఉండనిచ్చేవారు కాదు. విఠల్ మందిరానికి పంపేవారు. అక్కడ మహాత్ముల జీవిత చరిత్రలు రచిస్తూనో, విష్ణుసహస్రనామం పఠిస్తూనో గడిపేవాడిని. నేను బాబాను గురించి వ్రాసేముందు, వారి గురించి కొన్ని పరిశోధనలు జరిపాను. కొన్ని వాస్తవాలు నా స్వీయ పరిశీలనతో వ్రాసినవి. పోలీసు శాఖలో హవల్దారుగా పని చేసినందున నాకు ఈ పరిశోధన సులభంగా సాగింది.

నాకు సాహిత్యం పట్ల, నాటకకళ పట్ల మక్కువ ఉండేది. అందువలన నేను వీధి నాటకాలలో (తమాషాలలో) పాల్గొనేవాడిని. అంతేగాక సాహిత్యంలో కూడా ప్రవేశం ఉండడంతో, లావణీ మొదలైన ఛందస్సులను ఉపయోగించి ఆశువుగా పద్యాలు చెప్పగలిగేవాడిని! నేను పోలీసు శాఖలో పని చేస్తున్నప్పుడు నానాసాహెబ్ చాందోర్కర్ డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తూ ఉండేవాడు. అతను నన్ను బాబా దగ్గరకు తీసుకెళ్ళాడు. బాబా నన్ను చూసిన వెంటనే నా భవిష్యత్తు చదివి నా కాలక్షేపపు కార్యక్రమాలను, ఉద్యోగాన్ని మాన్పించి, ఆధ్యాత్మిక పథంలో నన్ను నడిపించాలని సంకల్పించారు. నాముందే నానాసాహెబ్‌తో ***"ఇతనికి తమాషాలన్నా, ఉద్యోగమన్నా అమిత మక్కువ. వాటన్నింటిని ఇతడు విడిచిపెట్టాలి!"*** అన్నారు. అదే విషయం నాతో కూడా చెప్పారు. కానీ అవంటే నాకిష్టం. క్రమేణా తమాషాలలో

పాల్గొనడం మానివేసాను. ఇక ఉద్యోగ విషయానికి వస్తే ఉద్యోగం వదిలిపెట్టే ఆలోచన మాత్రం నాకు లేదు. నన్ను ఉద్యోగం మానెయ్యమని బాబా సలహా ఇచ్చిన ప్రతిసారీ "చూస్తాను" అనేవాడిని. దాంతో బాబా నాకు కొఱత వేస్తేగాని ఉద్యోగం మాననని అన్నారు. అలా సుమారు 10సం॥ల పాటు బాబా (ప్రత్యక్షంగా, పరోక్షంగా) నన్ను ఉద్యోగం వదిలివేయమని పదేపదే చెప్పారు. ఇక బాబా నన్ను ఎన్నోసార్లు శిక్ష, అవమానం, మరణం నుండి కూడా కాపాడి, చివరికి 1903లో నా అంతట నేనే ఉద్యోగాన్ని త్యజించే పరిస్థితులు కల్పించి, ఉద్యోగానికి ఏ విధంగా రాజీనామా చేయించారో అన్న వివరాలను తరువాత వెల్లడిస్తాను.

ఒక విచారణలో భాగంగా బాబా ఇచ్చిన సాక్షి వాఙ్మూలాన్ని బట్టి వారి పూర్వాపరాలను గూర్చిన కొన్ని వివరాలు వెలుగులోకి వచ్చిన వైనాన్ని వర్ణిస్తాను. నగలు దొంగిలించినట్లుగా ఒక వ్యక్తిపై ధూళే తాసిల్దార్ మేజిస్ట్రేటు కోర్టులో నేరం మోపబడింది. ఆ వ్యక్తి తనకు ఆ నగలు శిరిడీలో ఉన్న సాయిబాబా ఇచ్చారని, అందుకు వారే సాక్ష్యమని చెప్పాడు. దాంతో సాయిబాబాను కోర్టుకు హాజరుకావలసినదిగా కోర్టువారు సమన్లు జారీ చేశారు. బాబా ఆ సమన్లు పుచ్చుకోవడానికి నిరాకరిస్తూ వాటిని ధునిలో వేసారు. కానీ బాబాకు సమన్లు అందజేసినట్లు రిపోర్టు పంపబడింది. సమన్లు పంపినా రానందువల్ల సాక్ష్యం ఇచ్చేందుకు కోర్టులో బాబాను హాజరుపరచమని వారెంటు జారీ చేయబడింది. ఈ వారెంటు తీసుకొని కోపర్‌గాంకు చెందిన గణపతిరాంజీ అను హెడ్ కానిస్టేబుల్ మసీదుకు వచ్చాడు. బాబాను అరెస్టు చేయడానికి అతనికి ధైర్యం లేదు. అందువల్ల వారెంటులోని విషయాలు బాబాకు చెప్పి తనతో కోర్టుకు రమ్మని అభ్యర్థించాడు. కానీ బాబా తిరస్కరించారు. పైగా కోపంతో ఆ వారెంటును చెత్తకుప్పలో వేయమన్నారు. అతనికి ఏం చేయాలో తోచలేదు. నేనప్పుడు మసీదులో ఉన్నాను. ఈ విషయం బాబా భక్తుడైన నానాసాహెబ్ చాందోర్కర్‌కు తెలియజేయమని అతనికి సలహా ఇచ్చాను. చాందోర్కర్ అప్పుడు అహ్మద్‌నగర్‌లో డిప్యూటీ కలెక్టరుగా పని చేస్తున్నాడు. అతను చాందోర్కర్‌ను సంప్రదించాడు. కోర్టుకు వెళ్ళడం బాబాకు, భక్తులకు ఇష్టం లేకపోతే ఒక విన్నపం తయారు చేయించి అందులో భక్తులందరి చేత సంతకాలు పెట్టించి కోర్టుకు సమర్పించమని చెప్పాడు. భక్తులు ఆ విధంగానే

చేశారు. ఆ మహజరులో శ్రీసాయిబాబా సాధారణ వ్యక్తి కాదని, అసంఖ్యాక భక్తులచే దైవంగా పూజింపబడుతున్న సత్పురుషులని, వారి విషయంలో సామాన్య కోర్టు పద్ధతులు అనుసరణీయం కాదని ఆ తరువాత తలెత్తే పర్యవసానాల దృష్ట్యా అలా చేయడం భావ్యం కాదని, వారి సాక్ష్యం కావాలంటే ఒక కమీషనర్‌ను శిరిడీ పంపి విచారించవచ్చని భక్తులు పేర్కొన్నారు. అప్పుడు ధూళే కోర్టువారు నానాజోషీ అనే ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌ను కమీషనరుగా (అసిస్టెంట్ కలెక్టరు) బాబా సాక్ష్యం నమోదు చేసేందుకు శిరిడీ పంపారు. అతను శిరిడీ రావడానికి మూడుగంటల ముందు బాబా కుర్చీలు, బల్లలు తెప్పించి మసీదును చిన్న కోర్టుగా రూపొందించారు. కమీషనరు మసీదుకు వచ్చి విచారణ ప్రారంభించాడు. ఈ విచారణ అసాధారణమైనది. ఆ విచారణ సారాంశమిది:

కమీషనర్ : మీ పేరేమిటి?

బాబా : *నన్ను అందరూ సాయిబాబా అంటారు*

కమీషనర్ : మీ తండ్రి పేరు?

బాబా : *సాయిబాబానే!*

కమీషనర్ : మీ గురువుగారి పేరు?

బాబా : *వెంకూసా!*

కమీషనర్ : మీ మతము?

బాబా : *కబీరు*

కమీషనర్ : మీ కులము?

బాబా : *దైవము (పర్వర్దిగర్)*

కమీషనర్ : మీ వయస్సు?

బాబా : *లక్షల సంవత్సరాలు!*

కమీషనర్ : ప్రమాణపూర్వకంగా మీరు చెప్పబోయేదంతా నిజమేనా?

బాబా : *నిజమే!*

కమీషనర్ : నిందితుడు మీకు తెలుసా?

బాబా : *తెలుసు. నాకు అందరూ తెలుసు!*

కమీషనర్ : నిందితుడు, మీ భక్తుణ్ణని, మీతో కలసి ఉంటున్నానని చెబుతున్నాడు. నిజమేనా?

*బాబా : నిజమే, నేను అందరితో కలిసే ఉంటాను. అందరూ నా వారే!*

కమీషనర్ : అతను చెప్తున్నట్లు, నగలు అతనికి మీరు ఇచ్చారా?

*బాబా : అవును నేనే ఇచ్చాను. అయినా ఎవరు ఎవరికి ఇచ్చేది?*

కమీషనర్ : మీరు అతనికి నగలు ఇచ్చినట్లయితే, ఆ నగలు మీకు ఎక్కడివి?

*బాబా : సర్వమూ నాదే!*

కమీషనర్ : బాబా, దొంగతనమనే నేరం అతనిపై మోపబడింది. అతడేమో ఆ నగలు మీరిచ్చినట్లు చెబుతున్నాడు

*బాబా : ఏమిటిదంతా? ఈ పీడతో నాకేంటి సంబంధం?*

అంటూ బాబా కోపంతో అక్కడ నుండి లేచి వెళ్ళిపోయారు.

బాబా ఇచ్చిన జవాబులతో కమీషనరు ఖిన్నుడయ్యాడు. బాబా ప్రతి ప్రశ్నకు ఔను అనే జవాబు చెబుతుండడంతో అతనికేం వ్రాసుకోవాలో తెలియలేదు. అంతలో ఒకరు "గ్రామ డైరీ" తెప్పించి చూస్తే విషయాలు బయటపడతాయని సలహా ఇచ్చారు. ఆ డైరీలో గ్రామానికి వచ్చిన క్రొత్తవాళ్ల పేర్లు, వారెన్ని రోజులు గ్రామంలో ఉండినది మొదలైన విషయాలు తప్పక నమోదు చేయబడతాయి. కమీషనరు ఆ డైరీని పరిశీలించాడు. ఆ డైరీలో అటువంటి వ్యక్తి ఆ సమయంలో శిరిడీలో ఉన్నట్లు నమోదు చేయబడిలేదు. శిరిడీ, దాని పరిసరాలు దాటి బాబా ఎన్నడూ వెళ్ళలేదని అందరికీ తెలిసిన విషయమే. కమీషనరు బాబాకు ఈ విషయాలన్నీ వివరించాడు. అతను శిరిడీయే రాలేదని బాబాతో ఉండలేదని బాబా అతడికి నగలు ఇవ్వలేదని కూడా వివరించాడు. బాబా దీనిని కూడా సమర్థించారు. ధూళే కోర్టువారు బాబాను సంతకంగానీ వేలిముద్రగానీ కోరలేదు. విచారణ అంతటితో ముగిసింది. కమీషనరు తన విచారణ ఫలితాలను కోర్టుకు సమర్పించాడు. కోర్టు నిందితుడిని దొంగగా నిర్ధారించి జైలుశిక్ష విధించింది.

బాబా వయస్సును ఎవరూ నిర్ధారించలేరు. అలాగే వారి కులమతాలు, తల్లిదండ్రుల వివరాలు కూడా అంత సులభంగా నిర్ణయించలేము. 40సంవత్సరాల క్రితం నేను శిరిడీకి చెందిన సాళుబాయ్‌షెళ్కే అనే ఆమెను కలిసాను. అప్పుడామె వయస్సు 65 లేక 70 సంవత్సరాలుంటాయి. ఆమె నాకు చెప్పిన విషయమేమంటే

తనకు 8-10 సంవత్సరాల వయస్సులో వివాహమయ్యిందని ఆ సమయంలోనే బాబా శిరిడీ వచ్చారని 1895లో మేము చూసినప్పుడు బాబా ఎలా ఉన్నారో అప్పుడు కూడా అలాగే కనిపించేవారని చెప్పింది (అంటే 45-50 ఏళ్ళ వారిలా). సాయిబాయి అనే మరో ముసలావిడ బాబా బాలునిగా శిరిడీ వచ్చారని చెప్పింది. ఈ వివరాలను బట్టి మహాసమాధి నాటికి బాబా వయస్సు 100 సంవత్సరాలు పైబడి ఉండవచ్చు. బాబాను వారి వయస్సు పూర్వ వివరాలను గూర్చి అడిగే సాహసం ఎవరికి ఉంది? అందుకే నిర్ధారణగా ఏదీ చెప్పలేము.

బాబా అప్పుడప్పుడు తమ గత కాలపు జ్ఞాపకాలు చెబుతూ ఉండేవారు. తమ గురువు "వెంకూసా" అని వారి కృపవలనే తామీ స్థితికి చేరుకున్నామని ఎన్నోసార్లు చెప్పారు. (భక్తలీలామృత్-31వఅ॥) బాబాకు సంబంధించిన ఎన్నో విషయాలు నిగూఢంగానే ఉండిపోయాయి. వారి అద్భుత లీలలను కొన్ని నేను స్వయంగా చూసాను. మరికొన్ని ఇతరుల ద్వారా విన్నాను. బాబా నీటిని నూనెగా మార్చి ఒక రాత్రంతా నీటితోనే దీపాలు వెలిగించిన లీలను చూచిన ఎంతోమంది గ్రామస్థులు నాకు ఆ విషయం చెప్పారు. ఆ రోజు బాబాకు నూనె పోయడానికి నిరాకరించిన వారిలో ప్రేమచంద్ మార్వాడీ ఒకరు. సన్నని గుడ్డపీలికల సహాయంతో మసీదు పైకప్పుకు వేలాడదీయబడిన చెక్కపలక మీద బాబా నిద్రించడం నేను స్వయంగా చూసాను. నేలపై నుండి ఏడెనిమిది అడుగుల ఎత్తులో పైకప్పుకు ఒకటి ఒకటిన్నర మూరల క్రిందగా వేలాడుతున్న ఆ బల్లపైకి బాబా ఎలా ఎక్కేవారో అన్నది ఆశ్చర్యంగా ఉండేది. పలక నాలుగుమూలల నాలుగు దీపాలు వెలుగుతుండేవి. అంత ఎత్తులోనున్న కొయ్యపలక మీదకి బాబా ఎలా ఎక్కుతారో ఎలా దిగుతారో చూడాలని, ఆ చెక్కబల్ల బాబా బరువును ఎలా మోసేదో తెలుసుకోవాలని మసీదులో జనం కాపుకాసేవారు. కానీ ఎవరూ తెలుసుకోలేకపోయారు.

భక్తలీలామృత్‌లోని 121-141 పేరాలలో పాన్సేకు సంబంధించిన వివరాలు ఆయనే నాకు స్వయంగా వివరించారు. భక్తలీలామృత్‌లోని 31, 32, 33 అధ్యాయాలు మసీదులో బాబా ముందు పారాయణ (పోతీ) చేయడం జరిగింది. నానాసాహెబ్ చాందోర్కర్ ఆ పుస్తకాన్ని బాబా చేతికిస్తే వారు *"మంచిది!"* అన్నారు. ముస్లింలు రోజుకి ఐదుసార్లు నమాజు చేయడం రివాజు. కానీ బాబా ఐదుసార్లు కాదు

కదా ఒక్కసారి కూడా నమాజు చేసేవారు కాదు. ఫత్యాను (ముస్లిం ప్రార్థన) కూడా అక్కడున్న భక్తులచే చెప్పించేవారు. ఒక్కొక్కసారి వారు కూడా ఫత్యా వల్లించేవారు. ఖురానులోని శ్లోకాలను కూడా అప్పుడప్పుడు ఉచ్ఛరిస్తూ ఉండేవారు.

బాబా నానాకు చేసిన కొన్ని ఉపదేశాలు నానాసాహెబ్ నాకు చెప్పాడు. వాటిని నా స్వంత పాండిత్యంతో వివరించి, విశదపరచి ఆ రూపంలో పెట్టాను. కానీ దాని మూలం మాత్రం నానాసాహెబ్ ఇచ్చాడు. బాబా ఎన్నోసార్లు నాముందు అద్వైత సిద్ధాంతాన్ని గూర్చి మాట్లాడేవారు. *"నేను దేవుడిని!", "నీవు దేవుడవు!", "అందరూ దేవుళ్ళే!"* అని బాబా ఎన్నోసార్లు పలికేవారు. వారికి తెలియనిది ఏమీ లేదు.

బాబా చర్యలు స్పష్టంగా అర్థమయ్యేవి కావు. అవి నిగూఢంగా ఉండేవి.

ఉదాహరణకు- వాలంబిమాష్టరు కోపర్‌గాం స్టేషను మాష్టరుగా పని చేస్తూ ఉండేవాడు. అతనికి బాబాపై నమ్మకం లేదు. అందువల్ల నాతో మరియు ఇతరులతో "బాబా పిచ్చివాడు. ఎందుకు మీరు అతనిని గొప్పవాడిని చేస్తారు?" అని అంటుండేవాడు. నేను అతనిని ఎలాగో ఒప్పించి బాబా దర్శనానికి శిరిడీ తీసుకెళ్ళాను. మేము మసీదు చేరేసరికి బాబా కుండలన్నింటిని కడిగి బోర్లించి పెడుతున్నారు. వాలంబిమాష్టరు బాబాను "ఏమిటి ఇదంతా" అని అడిగాడు. బాబా *"నా దగ్గరకి వచ్చే ప్రతి కుండ (భక్తులు) ఇలా తలక్రిందులుగానే వస్తుంది!"* అన్నారు. బోర్లించిన కుండలు దేన్నీ స్వీకరించలేవుకదా? అలాగే తమ దగ్గరకు వచ్చే భక్తులు తాము అనుగ్రహించే దానిని గ్రహించలేని స్థితిలోనే వస్తారని దీని అంతరార్థం.

1898-99 ప్రాంతంలో కాణాభిల్ అనే క్రూరుడైన గజదొంగ ఉండేవాడు. అతను బ్రిటీష్ మరియు స్వదేశీ సంస్థానాలకు చెందిన బీడ్- అహ్మద్‌నగర్ జిల్లాలలో దొంగతనాలు చేస్తుండేవాడు. మూడు సంవత్సరాల నుండి అతడి కొరకు పోలీసుశాఖ గాలిస్తున్నది. కానీ అతడిని పట్టుకోలేకపోయింది. నేనప్పుడు పోలీసుశాఖలో హవల్దారును మాత్రమే. కానీ నాకు, మరో ముగ్గురికి ప్రత్యేక గూఢచారి బాధ్యతలు అప్పజెప్పి కాణాభిల్ కదలికలు పసిగట్టి తెలుపమన్నారు. కాణాభిల్ చాలా జిత్తులమారి. అన్నింటికీ తెగించినవాడు. అతని నిఘా వ్యవస్థ చాలా పటిష్ఠమైనది కావడంతో మేము ఎక్కడ ఉన్నామో కనిపెట్టి మాలో ముగ్గురిని ఒకరి తరువాత

ఒకరిని హతమార్చాడు. మా ఇన్‌స్పెక్టరు నేను సరిగా పనిచేయడం లేదని ఇంకా కష్టపడి పనిచేయాలని పైఅధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆ రోజుల్లో నేను ఒక రామదాసిగా మారువేషం వేసుకొని లోనీవార్నీ గ్రామంలోని రామాలయంలో కీర్తనలు చెబుతూ గడిపేవాడిని. కాణాభిల్ ఆ గ్రామపాటిల్‌కు స్నేహితుడే కాక అతనింటికి అప్పుడప్పుడు వచ్చి వెళుతుంటాడు. కాణాభిల్ నా పేరు, నంబరు (727) నేను ఏ స్టేషనులో పనిచేస్తున్నది మొదలైన వివరాలన్నీ తెలుసుకొని ఒకరోజు నన్ను కాల్చి చంపేందుకు వచ్చాడు. నా ప్రాణాలు కాపాడమని నేను శ్రీరాముని శరణువేడాను. కాణాభిల్ నన్ను గమనిస్తూనే ఉన్నానని హెచ్చరించి వెళ్ళిపోయాడు. దానికి తగ్గట్లే అతని అనుచరులు నన్ను నిరంతరం గమనిస్తూ ఉండడంతో నేను ఆ ప్రదేశాన్ని విడిచి వెళ్ళలేకపోయాను. ఒకసారి కాణాభిల్ కదలికలపై కొందరు గ్రామస్థుల నుండి నాకు సమాచారం అందింది. వెంటనే ఆ విషయం మా పైఅధికారులకు తెలియజేసాను. దాంతో కాణాభిల్ దాగివున్న కొండను పోలీసులు చుట్టుముట్టారు. అప్పుడు జరిగిన కాల్పుల్లో మా పోలీసు వాళ్ళు చాలామంది హతులయ్యారు. కానీ కాణాభిల్ మళ్ళీ తప్పించుకున్నాడు. కాణాభిల్ వలన నాకు ప్రమాదం తప్పదని అర్థమైపోయింది. కాబట్టి నాకు హృద్రోగమున్నట్లు డాక్టరు నుండి సర్టిఫికేటు తీసుకొని దానిని మా పైఅధికారులకు చూపి నిఘావిభాగం నుండి తప్పుకున్నాను. అప్పుడు మామ్లత్‌దార్ అయిన రాళే, లోనీవార్నీ గ్రామస్థులను ఒక బందిపోటుకు ఆశ్రయమిచ్చారనే నేరంపై విచారించాడు. ఆ విచారణలో కాణాభిల్ గురించిన సమాచారాన్ని అందించి నాకు సహాయపడ్డాడని ఆ గ్రామపాటిల్‌కు అనుకూలంగా నేను సాక్ష్యం చెప్పడంతో అతను విడుదలయ్యాడు.

నేనొకసారి ఉద్యోగానికి సెలవు పెట్టకుండా నా అధికార పరిధిలో లేని ప్రాంతంలోని పుణ్యక్షేత్రాన్ని దర్శించడానికి వెళ్ళాను. తిరిగి వచ్చే దారిలో గోదావరి తీరం చేరి దోసిలితో గోదావరి నీటిని తీసుకొని బాబా నన్ను కాపాడినట్లయితే నేను ఉద్యోగాన్ని వదిలివేస్తానని బాబాకు మ్రొక్కుకున్నాను. అప్పుడు నాకు అక్కడ ఒక ముఠా దొంగసొత్తును పంచుకుంటూ కనిపించారు. వారిని పట్టుకోడానికి వెళ్ళినట్లు అధికారులకు చెప్పాను. అక్కడ ఉన్నందుకు నేను సరియైన కారణం చూపినందున నన్ను క్షమించి వదిలివేసారు. బాబా అద్భుతరీతిలో నన్ను కాపాడారు. అప్పటికి కూడా ఫౌజ్‌దార్‌ను అవ్వాలనే కోరిక మాత్రం నాలో బలంగా ఉండేది. నేను ఆ పరీక్ష వ్రాసి

ఉత్తీర్ణుడనై తగిన అర్హత కూడా సంపాదించాను. బాబా నాకు ఫౌజ్‌దార్ ప్రమోషన్ రాదని చెప్పారు. ఒకసారి నన్ను వేరొక చోటుకు బదిలీ చేశారు. ఆ చోటుకు శిరిడీ మీదుగానే వెళ్ళాలి. కానీ నేను ఉద్యోగంలో కొనసాగడాన్ని బాబా అనుమతించరు కాబట్టి నేను బాబాకు కనిపించదలచుకోలేదు. అందువల్ల శిరిడీ వెలుపల నుండే రహదారిలో గుర్రంపై వెళుతున్నాను. (గ్రామంలో మసీదు ఉన్న వైపుకు కూడా తలతిప్పి చూడకుండా) విధివశాత్తు జరిగిందో, బాబా సంకల్పానుసారమే జరిగిందో తెలియదు కానీ బాబా అదే సమయంలో లెండీ తోట నుండి రహదారిపైకి వచ్చారు. నేను గుర్రం దిగి వారికి పాదాభివందనం చేశాను. బాబా నన్ను మసీదుకు వెళ్ళమన్నారు. మసీదులో బాబా *"గణూ, దోసిలిలో గోదావరి నీటిని ఉంచుకొని ప్రమాణం చేసిందెవరు?"* అనడిగారు. నేను "దానివల్ల నష్టమేముంది? నేనెలాగూ ఉద్యోగానికి రాజీనామా చేస్తాను కదా?" అన్నాను. బాబా మళ్ళీ *"పరిస్థితులు అనుకూలంగా ఉన్నంతకాలం నీవు నా మాట వినవు!"* అన్నారు.

ఒకసారి నా తప్పేమీ లేకుండానే నేను ఒక సంకటస్థితిలో పడ్డాను. ఒక నేరస్థుడు ప్రభుత్వానికి కట్టవలసిన జరిమానా మొత్తము 32రూపాయలు వసూలు చేసి, నా పరిధిలో ఉన్న పోలీసు స్టేషనుకు పంపాడు. నేనప్పుడు స్టేషనులో లేను. నా క్రింది ఉద్యోగి దానిని ప్రభుత్వానికి జమ చేయకుండా కాజేసాడు. నేరస్థుడు విడుదల కాకపోవడంతో ఫిర్యాదు మోపబడి కేసు విచారణ కొచ్చింది. నన్ను సస్పెండు చేశారు. నాకు శిక్ష పడడం ఖాయమని తేలిపోయింది. నేను ఈ సమస్య నుండి బయటపడితే వెంటనే ఉద్యోగాన్ని వదులుకుంటానని బాబాకు ప్రమాణం చేసి 1903లో ఉద్యోగానికి రాజీనామా చేశాను.

నేను 1898లో శివాజీపై రాసిన ఒక పద్యం విచారణకు దారి తీసింది. విచారణలో నేను ఒక ఆశుకవిననీ, ఆశుకవితా ధోరణిలో నేను ఆ పద్యం చెప్పాననీ వాదించాను. దానితో నాకు శిక్షపడలేదు.

బాబా తరచూ నన్ను ఉద్యోగం విరమించమని చెబుతున్నప్పుడల్లా *"వెళ్ళి, నాందేడులో స్థిరపడు"* అంటుండేవారు.

నేను : ఏ నాందేడు?

*బాబా : నైజాం రాష్ట్రంలో ఉన్న నాందేడు*

నేను : నా జీవనోపాధికి నేను ఏం చేయాలి?

బాబా : నేను ఏర్పాటు చేస్తాను

ఉద్యోగ విరమణ తరువాత బాబా ఆదేశానుసారం నేను నాందేడులో నివసించసాగాను. నేను కీర్తనలు చెప్పుకుంటూ జీవనం సాగించేవాడిని. కీర్తనలకు పారితోషికమేదీ తీసుకొనేవాడిని కాదు. కీర్తనకు ముందుగానీ తరువాతగానీ భక్తుల వద్ద నుండి ఎటువంటి కానుకలు విరాళాలు స్వీకరించేవాడిని కాదు. దేశంలోని అనేక ప్రాంతాలలో ఉన్న నా భక్తులు ఉత్తరాల ద్వారా నన్ను వాళ్ళ ఇళ్ళకు రమ్మని ఆహ్వానం పంపితే నేను వెళ్ళి వారితో ఉండి కీర్తనలు చెప్పడం, గ్రంథాలు వ్రాయడం చేస్తుండేవాడిని.

నా స్నేహితుడొకడు అతి తక్కువ ధరకు కొంత పంట పొలాన్ని నాకు ఇచ్చాడు. నేను ఒంటరివాడిని కాబట్టి నా అవసరాలు చాలా తక్కువ. అందువలన ఈ పొలం మీద వచ్చేదే నా జీవనోపాధికి సరిపోయేది. బాబా ఎందరో భక్తులకు డబ్బు ఇచ్చేవారు. నాకు, మహల్సాపతికి మాత్రం డబ్బు ఇచ్చేవారు కాదు. డబ్బుకన్నా విలువైన ఆధ్యాత్మిక లబ్ధిని చేకూర్చారు. బాబా ఎన్నో విధాలుగా తమపట్ల నాకు విశ్వాసాన్ని ఏర్పరచి దాన్ని దృఢపరిచారు. నాకు ఎన్నో విలువైన పాఠాలను అమూల్యమైన అనుభవాలను ప్రసాదించారు.

లోకమాన్య తిలక్ శిరిడీ వచ్చి వెళ్ళిన తరువాత (1915-1917) ఆదాయపు పన్ను శాఖవారి దృష్టి శిరిడీ సంస్థాన్‌పై పడింది. బాబా ఆదాయాన్ని అంచనా వేయడానికి ఒక అధికారి శిరిడీ వచ్చాడు. వారు మొదట బాబాకు పన్ను విధించాలనుకున్నారు. కానీ వారి దగ్గర చాలా స్వల్పంగా మాత్రమే డబ్బు మిగలడం చూసి వారి నుండి ప్రతిదినం డబ్బు తీసుకుంటున్న తాత్యాపాటిల్, బడేబాబా, బగియా, భయ్యాజీ పాటిల్ మొదలైనవారిపై ఆదాయపు పన్ను విధించారు.

నేనొకసారి పూరీ యాత్రకు బయలుదేరాను. దారిలో తేంబేస్వామి (వాసుదేవానంద సరస్వతి) అను సాధువును కలిసాను. వారు నాకు పరిచితులే! వారు నన్ను 'శిరిడీ వెళుతున్నావా?' అని అడిగారు. నేను అవునని చెప్పి, కొన్ని నెలల తరువాత వెళతానని బదులు చెప్పాను. అప్పుడు వారు నాకొక టెంకాయను ఇచ్చి దానిని వారి కానుకగా బాబాకు సమర్పించమని కోరారు. నేను దానిని నా సంచిలో

భద్రపరిచాను. కానీ తదుపరి ప్రయాణాలలో నాతోటి వారు దానిని పగులగొట్టి తినేసారు. తరువాత నేను శిరిడీ వెళ్ళి బాబాను దర్శించినప్పుడు ***"దొంగభడవా, నా సోదరుడిచ్చిన టెంకాయ ఏది?"*** అని అడిగారు.

'బేరే' అను భక్తుడు దారిదోపిడి నుండి తప్పించుకున్న ఉదంతం నాకు స్వయంగా తెలుసు. ఆ సంఘటన జరిగినప్పుడు నేను కూడా అతనితో టాంగాలో ఉన్నాను. భక్తిసారామృత్‌లో దానిని నేను ప్రస్తావించాను.[1]

ఒక మహాశివరాత్రి నాడు నేను శిరిడీలో ఉన్నాను. శిరిడీకి మూడుమైళ్ళ దూరంలోనున్న సింగాబా వద్ద గంగాస్నానం చేయాలని సంకల్పించాను. మేఘుడు బాబాను అభిషేకించడానికి ప్రతిదినం గోదావరి నుండి నీటిని తెచ్చేవాడు. కానీ నేను గోదావరికి వెళ్ళడానికి బాబా అనుమతించలేదు. ***"గంగ ఇక్కడే నా పాదాల చెంత ఉంది. వెళ్లకు!"*** అన్నారు. ఇది నన్ను బాధించింది. బాబా నారాయణుడని, నారాయణుని పాదాల నుండే గంగ ప్రవహిస్తుందని నాకు తెలుసు. కానీ ప్రత్యక్షంగా గంగలో స్నానం చేయడం వలన కలిగే అనుభూతి కేవలం ఒక రేఖామాత్రంగా ఉన్న నమ్మకం ద్వారా కలగదు కదా అని చింతించసాగాను. నా మనస్తత్వం ఎరిగిన బాబా తమ పాదాల చెంతకు రమ్మని పిలిచి చెయ్యిపట్టమన్నారు. బాబా రెండు పాదాల నుండి సన్నటి నీటిధార నా చేతిలోనికి ప్రవహించసాగింది. (స్వేద బిందువులు

---

*1. గణేష్ విష్ణు బేరే జిల్లా వ్యవసాయ శాఖాధికారి. అతను శిరిడీకి వచ్చి, బాబాను దర్శించి, నమస్కరించాడు. బాబా,* ***"తక్షణం శిరిడీ నుండి బయలుదేరి వెళ్ళండి, కొంచెం కూడా ఆలస్యం చేయవద్దు. ఇంకొక్క క్షణం కూడా ఇక్కడ ఉండవద్దు. వీలైనంత త్వరగా టాంగాలో కోపర్‌గాం చేరుకోండి"*** *అని ఆజ్ఞాపించారు. బాబా మాటపై విశ్వాసం ఉంచి, వెంటనే అక్కడ నుండి బయలుదేరాము. దారిలో నెమ్మదిగా మరో టాంగా పోతూ ఉంది. ఆ టాంగాలో ఉన్నవారిలో ఒక పెద్దమనిషి బేరేతో, మేమూ వస్తున్నాము కదా, రైలు వచ్చేందుకు ఇంకా సమయం ఉంది, కొంచెం నిదానంగా వెళ్ళండి అని అన్నాడు. బేరే అతని మాటలు లెక్కచేయకుండా బాబా ఆజ్ఞమేరకు టాంగాను త్వరగా పోనివ్వమన్నాడు. మేము గోదావరి నదిని దాటి కోపర్‌గాం స్టేషను చేరాము. తరువాత తెలిసిన విషయమేమంటే కోపర్‌గాం రోడ్డుపై నింపాదిగా వెనుక వస్తున్న రెండవ టాంగా ఒక రోడ్డు మలుపులో దారిదోపిడీకి గురి అయ్యింది. వాళ్ళు డబ్బు పోగొట్టుకోవడమేగాక బందిపోట్ల చేత తన్నులు కూడా తిన్నారు. ఆ వార్త విని బేరే ఓ సద్గురూ! ఈ పసివాడిని రక్షించావు! నీవు ఎందుకు మమ్మల్ని త్వరగా వెళ్ళమన్నావో ఆ సత్యం ఇప్పుడు బోధపడింది అని బాబాకు మనసులోనే కృతజ్ఞతలు అర్పించాడు.*

*'భక్తిసారామృత్' నుండి.*

కాదు) కొన్ని నిముషాలకు నా చెయ్యి నిండింది. అద్భుతం! పవిత్ర గంగను బాబా నా చేతిలోనికి తెప్పించారు. ఆ నీటిని నా తలపై చల్లుకొన్నాను కానీ త్రాగలేదు. ఇవేకాదు ప్రతిదినం మసీదులో ఆరతి తరువాత ఇచ్చే బాబా పాదతీర్థాన్ని కూడా నేను త్రాగేవాడిని కాదు. ఒకసారి ఈ విషయాన్ని జోగ్ బాబాకు ఫిర్యాదు చేశాడు. నేను నా నమ్మకాలను, సాంప్రదాయాలను అనుసరించి పాటించడంలో తప్పులేదని, నా విషయంలో జోగ్‌ను కలుగచేసుకోవద్దని బాబా చెప్పారు.

అలా అని బాబా అన్ని సందర్భాలలోను ఆచారాలను గౌరవించేవారు కాదు. నా ఆచారం ప్రకారం ఉల్లిపాయను తినేవాడిని కాదు. ఉల్లితో చేసిన ఏ పదార్థాన్ని ముట్టుకునేవాడిని కాదు. కానీ బాబాకు ఉల్లి అంటే మక్కువ. వారి భోజనంలో ఉల్లిపాయ లేకపోవడమనేది చాలా అరుదు. ఒకరోజు బాబా నన్ను ఉల్లిపులగం (పితలా) చేసి కొంత తమకు సమర్పించి నన్ను కూడా తినమన్నారు. నేనలాగే పులగం చేసి బాబా దగ్గరకు తీసుకువెళ్ళాను. బాబా ***"నీవు తిన్నావా?"*** అనడిగారు. నేను తిన్నానని బదులుచెప్పాను. ఏ పదార్థాన్నైనా వేలుతో తాకి దాన్ని గడ్డానికంటించుకొని గడ్డం నుండి క్రింద పెదవివరకు తీసుకువెళితే ఆ పదార్థాన్ని తిన్నట్లవుతుందని నేనలాగే చేసి చేతులు ముఖం కడుక్కున్నాను. కానీ బాబాకు నేను చేసిన యుక్తి తెలుసు. (బాబాకు తెలియనిది ఏముంది?) బాబా ***"అతను తినకుండా కేవలం వేళ్ళతో తాకి, ఆ వేలుని తన గడ్డానికి అంటించుకొని తిన్నట్లు నటించాడు"*** అని చెప్పి నేను చేసినట్లుగా చేసి చూపించారు. తరువాత నన్ను తప్పక ఉల్లి తినమన్నారు. ఉల్లిని మనం రోజూ భోజనంలో చేర్చుకోవడం ద్వారా అది ఎంతో మంచి చేస్తుంది అన్నారు. కానీ ఘాటైన వాసన కలిగి ఉండటం వలన, తామస గుణం పెంపొందింపజేయడం వలన ఆచారపరంగా ఉల్లి నిషిద్ధం. ***"ఉల్లిని అరిగించుకొనే శక్తి (తామసగుణాన్ని జయించగలిగే శక్తి) ఉంటే ఉల్లి చెడు చేయదని మేలు చేస్తుందని"*** బాబా చెప్పారు. అందువలన బాబా సశరీరులుగా ఉన్నంతకాలం ఏకాదశిరోజులలో తప్ప నేను శిరిడీలో ఉల్లి తినేవాడిని!

ఒక్కొక్కసారి నేను పండరి మొదలైన పుణ్యక్షేత్రాలకు వెళ్ళాలి అనుకున్నప్పుడు బాబా ఏదో ఒకటి చేసి నన్ను యాత్రలకు వెళ్ళకుండా చేసేవారు. ప్రతిసంవత్సరం భాద్రపద, ఆశ్వయుజ మాసాలలో ముఖ్యంగా ఆశ్వయుజ ఏకాదశి రోజు పండరిలో తప్పక గడిపేవాడిని. 1916లో నానాసాహెబ్ చాందోర్కర్‌ను

మన్మాడ్‌లో కలిసాను. భాద్రపద మాసం మొదలవుతుండడంతో నేను పండరిపురం వెళుతున్నానని చెప్పాను. కానీ నానా నన్ను శిరిడీ తీసుకువెళ్ళాడు. బాబా నన్ను అక్కడ ఒక వారంపాటు సప్తాహం, కీర్తన నిర్వహించమని చెప్పారు. నేను మొదటిసారిగా కీర్తనలు చెప్పడం నానాసాహెబ్ ప్రోద్బలంతో శిరిడీలోని బాబాసంస్థానంలో ప్రారంభించాను. మొదట నేను కీర్తనకారులు మామూలుగా ధరించే పద్ధతిలో ఆడంబరమైన దుస్తులు ధరించి మెరిసిపోతూ హరికథ చెప్పడానికి సిద్ధమయ్యాను. నానాసాహెబ్ దగ్గర మంచి తలపాగా, కుచ్చులు అరువు తీసుకుని మరీ ధరించాను. బాబా నన్ను చూసిన వెంటనే ఆక్షేపించి ఆ ఆడంబరమైన దుస్తులను తీసిపారెయ్యమన్నారు. అప్పటి నుండి నేను సాంప్రదాయబద్ధంగా ధోవతి మాత్రమే ధరించి కీర్తనలు చేసేవాడిని. ఈ విధంగా నన్ను శిరిడీలో ఒక నెల రోజులపైనే ఉంచేశారు. భాద్రపదం వెళ్ళి ఆశ్వయుజం వచ్చింది. కనీసం ఆశ్వయుజంలోనైనా పండరి వెళ్ళకుండా శిరిడీలోనే గడపవలసి వస్తోందని చిరాకుపడసాగాను. నానా నన్ను ఇంకా శిరిడీలోనే ఉంచుదామని అనుకున్నాడు. "దేవుని దగ్గరకు (పండరిపురం) వెళ్ళకుండా అడ్డుకునే ఈయన (బాబా) గురువెలా అవుతాడు?" అని మనస్సులోనే అనుకోసాగాను. బాబా నా మనస్సుని చదివి వెంటనే పండరి వెళ్ళిపొమ్మని నన్ను ఆదేశించారు. నానాసాహెబ్‌ను కూడా అడ్డుపడవద్దని చెప్పారు. నేను సంతోషంగా పండరి వెళ్ళి ఆశ్వయుజంలో అక్కడ గడిపాను.

బాబా కొన్నిసార్లు నా ఆధ్యాత్మికపరమైన కోరికలను కూడా తీర్చేవారు కారు. నామదేవుడు మొదలైన వారికి లభ్యమైనట్లు, నాకు కూడా నేను కొలిచే దైవం యొక్క సాక్షాత్కారం ఇప్పించమని బాబాను ఎన్నోసార్లు ప్రార్థించాను. బాబా ప్రతిసారీ ***"ఆగు, ఆగు"*** అనేవారు. చివరకు (1916వ సం॥లో అనుకుంటాను) నేను బాబా వద్దకు వెళ్ళి "బాబా మీరు చాలాకాలంగా నా కోరికను దాటవేస్తున్నారు. నాకెప్పుడు సాక్షాత్కారం అనుగ్రహిస్తారు?" అని అడిగాను. అప్పుడు బాబా *"ఇప్పుడు నన్ను చూస్తున్నావు కదా? ఇదే సాక్షాత్కారం! నేనే భగవంతుణ్ణి!"* అన్నారు. "ఇలాంటిదేదో చెప్పి నన్ను మభ్యపెడతారని నాకు తెలుసు. మీరిచ్చిన జవాబుతో నేను సంతృప్తి చెందలేను!" అంటూ నా ప్రారబ్ధంలో 'సాక్షాత్కారం' పొందే భాగ్యం లేదని, సత్పురుషులు కూడా ఈ విధిని మార్చలేరేమో అని సరిపెట్టుకున్నాను!

బాబా మహాసమాధి చెందిన తరువాత నేనెందరో సాధుసత్పురుషులను దర్శించాను. ఎవ్వరూ నాకు సంతృప్తినివ్వలేదు. కానీ ఒకరు మాత్రం నన్ను ఎంతో ప్రభావితం చేశారు.

1919లో నాందేడుకు సమీపంలో ఒక గుట్టపై విరాగి అయిన ఒక బ్రహ్మచారి ఉండడం గమనించాను. అతను ఏ విషయాలు పట్టించుకునేవాడు కాదు. నేను, నా భార్య యొక్క శ్రాద్ధకర్మలు జరిపించేటప్పుడు మొదటిసారిగా అతనిని చూసాను. అతని పట్ల తీవ్రంగా ఆకర్షితుడనై అతని దర్శనం చేసుకుందామని అతని వద్దకు వెళ్ళాను. అతను నాకు దర్శనమివ్వడానికి ఇష్టపడనట్లు మరోవైపు తిరిగాడు. ఇలా మూడుసార్లు జరిగింది. నేను చాలా నిరాశ చెందాను. నిరాశపడ్డాను అని చెప్పడం కంటే చిన్నబుచ్చుకున్నానని చెప్పాలి. పోనీ అతనికి భిక్ష ఇచ్చి కాస్త పుణ్యమైనా దక్కించుకుందామని తలచి, ఒక మనిషి చేత భోజనం పంపాను. అతను నేను పంపిన భోజనాన్ని స్వీకరించినట్లు తెలుసుకొని ఆశ్చర్యపోయాను. దాంతో కాస్త ధైర్యం తెచ్చుకొని మరల అతని ముందుకెళ్ళి "తమరు నాకెందుకు దర్శనం నిరాకరిస్తున్నారు?" అనడిగాను.

అతను : నీవు కీర్తనకారుడవని చెప్పుకుంటున్నావు. మరి నీ అహంకారాన్ని విడిచిపెట్టావా?

నేను : లేదు. కానీ, ప్రతిఒక్కరికీ అహంకారం ఉండటం సహజమే కదా?

అతను : నాకు ఆహారం పంపేటప్పుడు, నువ్వు భోజనం పెడుతున్నావనే అహం నీలో లేదా?

నేను : అహంకారమనేది, సాత్వికము, రాజసము, తామసము అని మూడు రకాలుగా ఉంటుంది. మనం చేసే ప్రతిపనిలోనూ ఏదో ఒకటి ఇమిడి ఉంటుంది. వాటిలో చెఱుపు చేసేది విడిచిపెట్టాలని నా అభిప్రాయం

అతని అభిప్రాయం అందుకు భిన్నంగా ఉంది. నా అహంకారాన్ని సంపూర్ణంగా అణిచివేయాలనుకుంటున్నాడు. అతను నా మనసు చదువుతున్నాడు. అతని శక్తికి నిదర్శనంగా కొన్ని ఉదాహరణలు ఇచ్చాడు.

అతను : నీవు సాధు సత్పురుషుల జీవిత చరిత్రలను వ్రాస్తున్నావు కదా?

నేను : ఔను. వ్రాస్తున్నాను

ఆరు రోజుల క్రితం నేను వ్రాసిన శ్లోకంలోని కొన్ని పంక్తులను అతను అచ్చుగుద్దినట్లు వల్లించాడు. అప్పటికి అవి ప్రచురింపబడలేదు. అతని అంతర్యామిత్వానికి నేను ముగ్ధుడనయ్యాను. అతను మళ్ళీ ఇలా ప్రశ్నించాడు:

అతను : నీకు బాబా పాదాల నుండి గంగనీరు లభించింది కదా?

నేను : అవును

అతను : ఆ నీటిని ఏం చేశావు?

నేను : నా తలపై చల్లుకున్నాను

అతను : ఆ నీటిని నీవు త్రాగలేదు. ఎందుకంటే నీవు బ్రాహ్మణుడవని ఆ నీరు త్రాగితే అపవిత్రుడవవుతావని తలచావు! నీకు ఎంత అహంకారం ఉందో గమనించావా?

అతని తత్త్వము, అతీత శక్తులు చూసి ప్రతిదినం అతనిని దర్శించి, రాత్రిళ్ళు మూడు నాలుగు గంటలు అతని వద్ద గడపసాగాను. నా మీద సదభిప్రాయం ఉండి నా వద్దకు వచ్చే కొందరికి ఆ బ్రహ్మచారిపై మంచి అభిప్రాయం లేదు. వారిలో బీకే (అసలు పేరు కాదు) అనే అతను నన్ను ఆ విషయంపై వివిధ రకాలుగా ప్రశ్నించసాగాడు. ఆ బ్రహ్మచారి గొప్ప శక్తులు కలవాడని, అతను ఇతరుల మనసు చదవగలడని అన్నాను. బీకే నా మాటలు విశ్వసించకపోవడంతో నేను అతనిని బ్రహ్మచారి వద్దకు తీసుకెళ్ళి, అతని అపనమ్మకాన్ని గురించి బ్రహ్మచారితో చెప్పాను. అప్పుడు ఆసక్తికరమైన సంభాషణ జరిగింది:

బ్రహ్మ : (నాతో) ఏంటి? కోతిని ప్రదర్శించినట్లు నన్ను అందరికీ ప్రదర్శించ దలచావా?

నేను : నా ఉద్దేశ్యం అది కాదు. ఇతడు మిమ్మల్ని నమ్మడం లేదు

బ్రహ్మ : (బీకేతో) నీ గురించి కొన్ని వాస్తవాలు చెప్పమంటావా?

బీకే : చెప్పండి

బ్రహ్మ : నీకొక స్త్రీతో (ఆమె పేరు కూడా చెప్పాడు) అక్రమ సంబంధం ఉంది కదా?

బీకే : లేదు

బ్రహ్మ : చాలాకాలం నుండి ఆమె నిన్ను పోషిస్తున్నది కదా?

బీకే : లేదు

అప్పుడు బ్రహ్మాచారి తమ మాటలలోని నిజాన్ని, తమ శక్తులను నిరూపించేందుకు ఈ విధంగా అన్నారు.

బ్రహ్మ : నీ జేబులో ఏముందో చెప్పమంటావా?

బీకే : చెప్పండి

బ్రహ్మ : నీవు నడుపుతున్న 'సత్యసమాజ్' అను సంస్థ వ్యవహారాల గురించి, కోల్హాపూర్ రాజా వారు నీకు వ్రాసిన ఉత్తరముంది. ఆ ఉత్తరాన్ని తీసి మహరాజ్‌కు (నాకు) ఇవ్వు

బీకే ఉత్తరాన్ని తీసి నా చేతిలో పెట్టాడు. బ్రహ్మాచారి ఆ ఉత్తరంలోని వాక్యాలన్నీ అక్షరం పొల్లుపోకుండా ఉన్నది ఉన్నట్లుగా చెప్పాడు. దీనిని బట్టి అంతకుముందు స్త్రీ గురించి చెప్పినది కూడా వాస్తవమని ఋజువయ్యింది. దాంతో బీకే కొయ్యబారిపోయాడు. నేనక్కడ లేకుంటే బీకే బ్రహ్మాచారితో మనసు విప్పి మాట్లాడి పరివర్తన చెందేందుకు అవకాశముంటుందని భావించి నేనక్కడనుండి తప్పుకున్నాను. బీకేలో మార్పు వచ్చింది. చెడు సావాసాలు చెడు పనులు చేయడం మానుకున్నాడు. ఇది జరిగిన తరువాత ఆ బ్రహ్మాచారి కీర్తి అతిత్వరగా అంతటా వ్యాపించింది. ఆ తాలూకా అధికారి అయిన తహసిల్దారు బ్రహ్మాచారిచే ప్రవచనం చెప్పించదలచి ఒక సాయంత్రం నన్నతనిని తీసుకొని రమ్మని ఆదేశించాడు. తహసిల్దారు తాను తాలూకా అధికారినని తన మాట బ్రహ్మాచారి కాదనడని ప్రవచనానికి నిరాకరించడని అనుకున్నాడు. కానీ ఆ కార్యక్రమానికి ముందు రోజు తెలిసిన విషయమేమిటంటే ఆ బ్రహ్మాచారి ఆ ప్రదేశాన్ని విడిచి శాశ్వతంగా వెళ్ళిపోయాడని. అతను తిరిగి ఎప్పుడూ కనపడలేదు. ఆ తరువాత అతని గురించి వినలేదు.

**శ్రీసాయిబాబా గురించి నేను రచించిన గ్రంథాల వివరణ:**

1) 'సంత్‌కథామృత్': ఇది మొదటిది. నేను ఉద్యోగంలో పని చేస్తున్నప్పుడు 1903కి పూర్వం బాబా గురించి ఇతర సాధువుల గురించి కొంచెం కొంచెం వ్రాయడం జరిగింది. ఇది 1903లో ముద్రితమయ్యింది. నేను చేసిన కృషికి బాబా ఆశీస్సులిచ్చారు.

నేను వ్రాసిన పుస్తకాలేవీ బాబాకు చదివి వినిపించలేదు. అవి వ్రాసేముందు వారి నుండి విషయసేకరణ కూడా చేయలేదు. బాబా తమంతట తాముగా మాట్లాడిన మాటలను ఆధారంగా తీసుకొని నేనే స్వయంగా వ్రాయడం

జరిగింది. బాబా సేలూ విషయం ప్రస్తావించిన తరువాత నేను సేలూ వెళ్ళి బాబా పూర్వవృత్తాంతం గురించి విచారించాను. నేను వ్రాసిన పుస్తకాలు బాబా చేతిలో పెట్టినప్పుడు వారు ***"మంచిది!"*** అని ఆశీర్వదించేవారు. బాబాకు చదవడం, వ్రాయడం లేదా సంతకం పెట్టడమన్నా తెలుసో లేదో నాకు తెలియదు.

2) తరువాత వ్రాసినది 'భక్తలీలామృత్'. 1906లో బాబా సశరీరులుగా ఉన్నప్పుడే ఇది ప్రచురింపబడింది.

3) చివరిది 'భక్తిసారామృత్'. దీనిలోని 52-53 అధ్యాయాలు బాబాను గురించి వ్రాసినవి. వీటిని బాబా చేతిలో పెడితే ***"మంచిది!"*** అని ఆశీర్వదించారు. ఇతర అధ్యాయాలు 1918 (బాబా మహాసమాధి) తరువాత అప్పుడప్పుడు వ్రాయడం జరిగింది. ఇది 1925లో ముద్రితమయ్యింది.

ఈ పుస్తకం 26వ అధ్యాయంలో- సేలూలో బాబా పూర్వ వృత్తాంతం గురించిన వివరాలు, కొంత బాబా మాటల ఆధారంగాను కొంత సేలూ గ్రామస్థుల మాటల ఆధారంగాను వ్రాసినవి. సేలూ గురించి బాబా చెప్పిన ఏకైక వివరం తాము సేలూ నుండి వచ్చామని. దాంతో నేను ఉద్యోగం చేస్తున్న రోజుల్లోనే బాబా పూర్వ వివరాలు సేకరించేందుకు సేలూ వెళ్ళాను. ఇది జరిగి దాదాపు 35 సంవత్సరాలయ్యింది. అక్కడి గ్రామస్థులు నాకు చెప్పిందేమంటే అక్కడొక వృద్ధసాధువు ఉండేవాడని అతను ఒక బాలునికి శిక్షణ ఇస్తుండేవాడని, కొందరు ఆ సాధువుపై విసిగిపోయి అతనిని రాళ్ళతో కొట్టి చంపినట్లు, బాలుడు తప్పించుకున్నట్లు చెప్పారు. అదంతా అప్పటికి 100 సంవత్సరాల పూర్వం జరిగినట్లు కూడా చెప్పారు.

శ్రీసాయిబాబా దగ్గర ఒక ఇటుకరాయి ఉండేది. వారు దానిని రాత్రిళ్ళు తలగడగా ఉపయోగించేవారు. బాబా స్మృతి చిహ్నంగా అది ఇప్పటికీ శిరిడీలోనే ఉంది. ఆ ఇటుకరాయి తమ గురుదేవులు తమకు ప్రసాదించారని, తమ గురువు పేరు "వెంకూసా" అని బాబా నాకు చెప్పారు. ఈ విషయం చెప్పేటప్పుడు చాందోర్కర్ కూడా అక్కడ ఉన్నాడు. ఈ విషయాలు సాయిబాబా చాందోర్కర్‌కు బోధించినట్లు నేను వ్రాసినది కల్పితం. నా గ్రంథంలో నా పేరు ప్రముఖంగా ఉదహరించడం ఇష్టంలేక చాందోర్కర్ పేరు వ్రాసాను. 53వ అధ్యాయంలో చాందోర్కర్‌ను గూర్చి నేను వ్రాసిన వివరాలు చాందోర్కర్ నాకు చెప్పినవి కావు. చాందోర్కర్ తనకు బాబాతో గల అనుభవాలను డైరీలో వ్రాసుకున్నాడా లేదా అన్న విషయం నాకు తెలియదు.

రతన్‌జీ వాడియాకు సంబంధించిన ఒక చిన్న అనుభవాన్ని చెబుతాను. ఒకసారి నన్ను అతను తేనీటి విందుకు ఆహ్వానించాడు. అప్పుడు నాందేడు మౌల్వీ కూడా అక్కడికి వచ్చాడు. బాదం, పిస్తా మొదలగు రుచికరమైన పదార్థాలెన్నో వడ్డించబడ్డాయి. వాటి విలువ మూడు నాలుగు రూపాయలు ఉంటుంది. తరువాత రతన్‌జీ శిరిడీ వెళ్ళాడు. బాబా తమకు అంతకు మునుపే రూ॥ 3.12.0 (మూడు రూపాయల పన్నెండు అణాలు) అందాయని మిగిలిన రూపాయి నాలుగణాలు మాత్రం ఇవ్వమని చెప్పారు. అతడలాగే ఇచ్చి తిరిగి వచ్చి జరిగిందంతా చెప్పి బాబా అంతకుముందే డబ్బులు స్వీకరించానని చెప్పడంలోని ఆంతర్యం ఏమిటని ఆశ్చర్యపోయాడు. అంతకుముందు ఒక సాయంత్రం మౌల్వీకిచ్చిన అల్పాహార విందులో ఖర్చయిన మొత్తమెంతో తన జమాఖర్చు చిట్టాలో చూడమని నేను చెప్పాను. అతను లెక్కలు చూస్తే విందుకు సరిగ్గా బాబా చెప్పిన విధంగా రూ॥ 3.12.0 ఖర్చయినట్లు వ్రాయబడివుంది. ఇదే వాస్తవం! ఈ లీల గురించి 'భక్తిసారామృత్'లో ప్రస్తావించినదంతా దీనికి వివరణే!

ఆ పుస్తకంలో ఉదహరించినది బాబా గురువు సమాధి. మేము మొదట చూసినప్పుడు మాకు సమాధి కనబడలేదు. నేల చదునుగా ఉండి దాని అడుగున సమాధి ఉండేది. వేపచెట్టు క్రింద ఉన్న సమాధి చుట్టూ అరుగు దానికి మెట్లు సాఠే సాహెబ్ కట్టించాడు. అక్కడ ఒక గూడు కట్టబడి భక్తులు పూజించుకోవడానికి వీలు కల్పించబడింది.

నేను మొట్టమొదట సాయిబాబా దగ్గరకు నానాసాహెబ్ చాందోర్కర్‌తో కలిసి వెళ్ళింది కేవలం నానాసాహెబ్‌ను ప్రసన్నం చేసుకునేందుకు మాత్రమే. అప్పుడు నాకు సాయిబాబాపై భక్తి గౌరవాలుగానీ, ప్రత్యేకంగా వారిని దర్శించాలనే కోరికగానీ లేదు. ఎలాంటి ప్రాపంచిక, ఆధ్యాత్మిక కోరికలను ఆశించి కూడా వెళ్లలేదు. ఒక సంవత్సరం తరువాత ఉస్మానాబాద్ వద్ద ఇస్లాంపూర్‌కు చెందిన వామన్ సాహి ఇస్లాంపూర్‌కర్ అను వృద్ధ బ్రాహ్మణుణ్ణి కలుసుకోవడం తటస్థించింది. అతను వివాహితుడు. మద్రాసు యూనివర్శిటీ పట్టభద్రుడు. నా పైఅధికారులు "సాయిగొండ" అను ప్రదేశంలో అతని సేవకై నన్ను నియమించారు. అతను గొప్ప భక్తికలవాడని, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రగతిని సాధించాడని నేను తెలుసుకున్నాను. మోక్షప్రాప్తి కోసం గురువు యొక్క ఆవశ్యకత ఉందని నమ్మి అతనిని నాకు

ఉపదేశమివ్వమని అర్థించాను. ఆయన సమ్మతించాడు. నేను శివభక్తుణ్ణి కాబట్టి నేను కోరుకున్నట్లుగానే శివమంత్రం ఉపదేశించాడు. నన్ను ఆ మంత్రాన్ని నిరంతరం జపిస్తూ ఉండమని ఆదేశించాడు. నేను సాయిబాబాను దర్శిస్తూ ఉన్న విషయం అతనికి చెప్పి అదేమైనా కీడు కలిగిస్తుందా అని అడిగాను. దృఢమైన విశ్వాసముంటే ఎటువంటి మహాత్ములను దర్శించినా ఏ హానీ జరుగదని ఆయన చెప్పాడు. తరువాత నేను సాయిబాబాను గురించి ఆయన అభిప్రాయం అడిగాను. తాము శ్రీసాయిబాబాను దర్శించామని వారి చెంత మూడురోజులు గడిపి వచ్చామని వారొక గొప్ప సత్పురుషులని, రామభక్తులని చెప్పాడు. వారిని ఇంకా ఎవరూ అర్థం చేసుకోలేకపోతున్నారని, త్వరలో ప్రజలు వారి గురించి తెలుసుకుని వారిని కీర్తిస్తారని అన్నాడు. ఈ విషయం విన్న తరువాత సాయిబాబాపై భక్తి గౌరవాలు పెరిగాయి. వారిపట్ల నమ్మకంతో తరచూ శిరిడీ వెళ్ళి వారిని దర్శించడం మొదలుపెట్టాను.

నాకు మంత్రోపదేశం ఇచ్చిన రెండు సంవత్సరాలకు నా గురువు నన్ను భుశావల్ వద్ద కలుసుకొమ్మని ఉత్తరం ద్వారా తెలిపారు. నేను వెళ్ళి వారిని కలిసాను. తాము కాశీ వెళుతున్నట్లు ఆరు నెలల తరువాత వచ్చే జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నాడు అక్కడే సమాధి చెందుతున్నట్లు చెప్పారు. వారి కర్మ క్రతువులు నన్ను జరిపించమని చెప్పడానికే పిలిపించినట్లు కూడా చెప్పారు. ఈ విషయం చెబుతున్నప్పుడు వారి కంట నీరు కారింది. నేను ఇంటికి తిరిగి వెళ్ళాను. క్రతువుల కయ్యే ఖర్చు నిమిత్తం 500 రూపాయలు గురువుగారు పోస్టు ద్వారా ఇంటికి పంపివున్నారు. అందులో వారి వీలునామాకు సంబంధించిన ఉత్తరం కూడా ఉంది. వారు చెప్పిన ఏకాదశినాడు వారు సమాధి చెందినట్లు కాశీ నుండి నాకు తంతి ద్వారా వర్తమానమందింది. ప్రతి సంవత్సరం నేను మా గురువు పుణ్యతిథిని జరిపిస్తున్నాను. ఈ విషయాన్ని సాయిబాబాకు చెబితే వారు ఆమోదించారు.

**శ్రీసాయిబాబా – ముస్లిం ఛాందసవాదులు:**

కొన్ని సమయాలలో బాబా చర్యలు ఇస్లాం సాంప్రదాయానికి విరుద్ధంగా ఉండటం వలన బాబాకు, స్థానికులైన ముస్లింలకు మధ్య స్పర్థలు ఏర్పడేవి. బడేబాబా, మరి కొంతమంది ముస్లింలు ఒకసారి కుత్బా ప్రార్థనలు చేయడానికి శిరిడీ వెలుపలకు రమ్మని బాబాను ఆహ్వానించారు. బాబా ముందు *"పదండి*

***వెళదాం"*** అన్నారు. కానీ బయలుదేరే సమయానికి వెళ్ళడానికి నిరాకరించారు. మరొకసారి కొందరు ముస్లింలు వచ్చి మసీదులో సామూహిక ప్రార్థనలు చేశారు. కానీ బాబా వారితో కలిసి ప్రార్థన చేయలేదు.

ఒక మొహరం పండుగప్పుడు కొందరు స్థానిక ముస్లింలు వచ్చి మసీదుకు 'తాజియా' తీసుకు వస్తామని చెప్పారు. వారు 'తాజియా' నిర్మించి, మొహరం పండుగ 5వ రోజు మసీదులో ఒకచోట ప్రతిష్ఠించారు. బాబా 2 రోజులు దానిని మసీదులో ఉండనిచ్చారు. 3వ రోజు ***"మసీదులో శవాన్ని ఉంచడం నాకు ఇష్టం లేదు!"*** అంటూ దానిని లాగి ధునిపై పెట్టారు. బాబాకు వ్యతిరేకంగా వారేమీ చేయలేక వెళ్ళిపోయారు. ఒక సాంప్రదాయ మహమ్మదీయుడు పూలను (సెరా) తెచ్చి మసీదులోని నింబారును అలంకరిస్తానని చెప్పి బాబా అనుమతి కోరాడు. బాబా ***"దానిని తీసుకెళ్ళి హనుమాన్‌కు అలంకరించు!"*** అన్నారు. తను మహమ్మదీయుడనని హిందూ దేవతామూర్తిని పూజించలేనని అతను చెప్పాడు. అప్పుడు బాబా అతనిని తీవ్రంగా దూషిస్తూ బూతులు తిట్టారు. (హనుమంతుడు అల్లాకన్నా గొప్పవాడు అని అర్థం వచ్చేలా) ఆ మహమ్మదీయుడు పూలను తీసుకెళ్ళిపోయాడు.

**బాబాకు హనుమంతునిపై ఉన్న గౌరవభావం:**

చావడిలో అరుగుపై ఒక మూల చిన్న హనుమాన్ విగ్రహముంది. బాబా క్రింద కూర్చొని ఉన్నారు. అప్పుడు వాన నీళ్ళు చావడిలోకి రాసాగాయి. ఎవరో భక్తుడు బాబాను అరుగుపై కూర్చొనమని సలహా ఇచ్చాడు. బాబా నిరాకరిస్తూ ***"దేవునితో సమానంగా అదే స్థాయిలో మనమెలా కూర్చొనగలం?"*** అన్నారు.

బడేబాబా (ఫకీర్‌బాబా) ఇస్లాం మతం పుచ్చుకున్న ఒక హిందువును బాబా దగ్గరకు తీసుకువచ్చాడు. బాబా వాడి చెంప ఛెళ్ళుమనిపించి ***"నీ అబ్బను మార్చుకున్నావు!"*** అన్నారు.

బాబా ఒక్కొక్కసారి హిందూ దేవతలపట్ల కూడా విమర్శనాపూర్వకంగా మాట్లాడేవారు. భక్తులు ఎప్పుడైనా పండరిపురం వెళ్ళడానికి అనుమతి కోరినప్పుడు ***"వెళ్ళు"*** అని అంటూనే ఒక తిట్టు తిట్టేవారు. కానీ ఆరతి సమయంలో జ్ఞానదేవ్, తుకారాం పేర్లు వచ్చిన వెంటనే బాబా సావధానంగా కూర్చొని గౌరవపూర్వకంగా చేతులు జోడించేవారు.

బాబాకు అద్వైత సిద్ధాంతం పట్ల ఉన్న అభిప్రాయాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం. వారు స్పష్టంగా ఏదీ చెప్పేవారు కాదు. ***"నేనే భగవంతుణ్ణి!"*** అని ఒకసారి, ***"భగవంతుడు అందరిలో ఉన్నాడు!"*** అని మరొకసారి పలికేవారు. కానీ బాబా మూర్తీభవించిన అద్వైతవాది అని చెప్పవచ్చు.

బాబా ఎప్పుడూ నిశ్చల స్థితిలో ఉండేవారు. వారి చుట్టూ ఏం జరిగినా పట్టించుకునేవారు కాదు. ముప్పైరెండు మంది బాలికల బృందమొకటి ప్రతిదినం మసీదుకు వచ్చి వారి ముందు నాట్యం చేసేవారు. బాబా వారి వైపు కన్నెత్తి కూడా చూసేవారు కాదు. వారిని ఏ ఐహిక బంధాలు అంటేవికావు. వారు ఎప్పుడూ సచ్చిదానంద స్థితిలో ఉండేవారు. ఒకసారి ఒక భక్తుడు "భగవంతుడు (బ్రహ్మము) ఎలా ఉంటాడు?" అనడిగాడు. బాబా అతనికేమీ జవాబు చెప్పలేదు. కానీ ఒక వ్యక్తిని భాగ్‌చంద్ మార్వాడీ దగ్గరకెళ్ళి 100రూపాయలు తెమ్మన్నారు. భాగ్‌చంద్ డబ్బు ఇవ్వలేదు కానీ బాబాకు తన నమస్కారాలు అందజేయమని చెప్పి పంపాడు. బాబా తిరిగి మరొకరి దగ్గరకు పంపారు. అతను కూడా లేదనే జవాబు పంపాడు. తరువాత బాబా నానాసాహెబ్ చాందోర్కర్‌ను పిలిపించి అతనిని 100 రూపాయలు అడిగారు. అతను ఒక చీటీ వ్రాసి భాగ్‌చంద్‌కు పంపాడు. భాగ్‌చంద్ వెంటనే 100 రూపాయలు పంపాడు. బాబా ***"ఈ ప్రపంచంలో అంతా ఇలాగే ఉంటుంది!"*** అని వ్యాఖ్యానించారు. బాబాను ప్రశ్నించినవాడికి ఇదేమీ అర్థం కాలేదు. అతను నా దగ్గరకు వచ్చి బాబా తనడిగిన ప్రశ్నకు జవాబెందుకు చెప్పలేదని అడిగాడు. నేనతనికి బాబా దక్షిణ అడగడం, దానికి లభించిన స్పందనే అతని ప్రశ్నకు సమాధానమని వివరించాను. ఇతరులు అడిగితే భాగ్‌చంద్ మార్వాడీ డబ్బివ్వలేదు, నానా అడిగిన వెంటనే డబ్బు పంపించాడు. అదే విధంగా ఊరకే బ్రహ్మాన్ని చూడదలచిన వ్యక్తికి అది లభించదు, ఆ అర్హత గలవాడికే లభిస్తుంది. "(బ్రహ్మాన్ని) అభిలషించే ముందు అర్హత సంపాదించు!" అనేది దీని సారాంశం.

బాబా లీలలు, మహిమలు నేను పెద్దగా చూడలేదు. 1898 ప్రాంతంలో వారు కొయ్యపలకపై నేల నుండి ఏడెనిమిది అడుగుల ఎత్తులో నిద్రించే లీలను నేను చూసాను. నిచ్చెన లేకుండానే వారు ఆ పలకపైకి ఎలా ఎక్కేవారో మళ్ళీ ఎలా దిగేవారో అనేది ఒక అద్భుతంగా ఉండేది! బాబా దానిపైకి ఎక్కేటప్పుడుగానీ దిగేటప్పుడుగానీ ఎవరూ చూడటం జరగలేదు. ఆ పలకను వ్రేలాడదీసిన దారాలు

పుటుక్కున తెగిపోయేలా ఉండేవి. దానికితోడు దీపాలు వెలిగించి దాని మీద ఊరికే అలా పెట్టబడి ఉండేవి. పలక ఏ మాత్రం కదిలినా ఆ దీపాలు క్రింద పడిపోతాయి. ఒకసారి వారు ఆ పలకపై పడుకొనివుంటే నేను చూడడానికి వెళ్ళాను. వారు ఆగ్రహించి నన్ను అక్కడ నుండి తరిమివేసారు.

**బాబా నాణాలను రుద్దేటప్పుడు మంత్రాన్నేదైనా ఉచ్ఛరించేవారా?**

బాబా అప్పుడప్పుడు మధ్యాహ్నం 1-2 గంటల మధ్య మసీదులో పరదా వెనుక ఒంటరిగా కూర్చొని వింతగా ఏదో చేస్తూండేవారు. గుడ్డతో కట్టిన ఒక మూటను విప్పి అందులోంచి 10-15 పాతనాణాలను బయటికి తీసేవారు. వాటిలో అర్ధణా, అణా, బేడ, పావలా, అర్ధరూపాయి, రూపాయి మొదలైన నాణాలుండేవి. ఒక్కొక్క నాణాన్ని తమ చేతిలోనికి తీసుకొని వేళ్ళతో వాటిని మృదువుగా రుద్దేవారు. అప్పుడు మంత్రమేదైనా పఠిస్తుండేవారో లేదో తెలియదు. కానీ *"ఇది నానాది, ఇది బాపూది, ఇది కాకాది"* అంటుండేవారు. ఈ నాణాలన్నీ బాగా అరిగిపోయి నున్నగా ఉండేవి. ఎవరైనా వస్తున్నట్లు గమనిస్తే వెంటనే వాటిని మూటలో కట్టి దాచేసేవారు.

బాబా వాచా వేలకొద్దీ ప్రవచనాలు చేశారు. వాటిలో కొన్ని చెబుతాను. ఒకసారి బాబా *"నేను పుణతంబలో ఉన్నప్పుడు రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. వాళ్ళెందుకు పోట్లాడుకుంటున్నారో అని నేను ఆశ్చర్యపోయాను. వారి వద్ద ఒక కుండ నిండా నాణాలున్నాయి. ఈ సంపద గురించే వారు గొడవపడుతున్నారు. నేను చడీచప్పుడు చేయకుండా ఆ నాణాల కుండను తీసుకెళ్ళాను. వాళ్ళు సంపద మాయమవ్వడం చూసి దుఃఖించసాగారు. నాలో నేను ఇలా అనుకున్నాను- నేనెవరు? ఈ సంపదేమిటి? ఎవరిదీ సంపద? ఈ సంపదకోసం పోట్లాటలు, గొడవలు దేనికి? ఈ కుండ నాది! నేను ఈ కుండకు చెందినవాడిని!"* అన్నారు.

మరోసారి *"నేను పుట్టినప్పుడు నా తల్లి తనకు కుమారుడు కలిగినందుకు ఎంతో సంబరపడింది. ఆమె ప్రవర్తన చూసి నేనాశ్చర్యపోయాను. ఆమె నన్ను కన్నదెప్పుడు? నేనసలు పుట్టానా? అంతకు ముందు మాత్రం నేను లేనా? ఎందుకామె ఇలా సంతోషిస్తోంది?"* అని అన్నారు.

ఒకసారి శిరిడీలో ఒక భక్తుడు "శిరా" (తీపి పదార్థం) తయారు చేశాడు. అప్పుడు బాబా నాతో *"నీకు అతను శిరా ఇచ్చాడా?"* అనడిగారు. నాకు అతనికి


మధ్య మనఃస్పర్థలున్నాయని అందువలన నాకతను శిరా ఇవ్వలేదని బాబాకు చెప్పాను. అప్పుడు బాబా ***"ఎవరు ఎవరికి ఏమి ఇస్తారు? ఈ శిరా ఏమిటి? దానిని తినేది ఎవరు? అతను నీ విరోధి అని అనకు. ఎవరు ఎవరికి విరోధి? ఎవరిపైనా విరోధ భావం పెంచుకోకు. అందరూ ఒక్కటే!"*** అని బోధించారు. పైభావాన్నే 'అమృతానుభవ'కు నేను వ్రాసిన వ్యాఖ్యలో రెండవ అధ్యాయం చివరలో పొందుపరచాను.

సతారాకు చెందిన ఒక మతగురువు వేదాంతాన్ని గురించి బోధిస్తాను రమ్మని నన్ను ఆహ్వానించాడు. కానీ నేనీ విషయంలో శ్రీసాయిబాబా సహాయం తీసుకోదలచినట్లు అతనికి చెప్పాను. అతను వెటకారంగా నవ్వి "ముస్లిం ఫకీరైన సాయిబాబాకు ఏమీ తెలియదని, వారు వేదాంతాన్ని ఏ మాత్రం బోధించలేరు!" అని అన్నాడు. నాకు సాయిబాబాపై ఉన్న నమ్మకం సడలలేదు. నేను బాబా దగ్గరికెళ్ళి సుపరిచిత వేదాంత గ్రంథమైన 'అమృతానుభవ'కు వ్యాఖ్య వ్రాయాలనుకుంటున్నానని చెప్పాను. వారు నా తలపై తమ హస్తాన్నుంచి ఆశీర్వదించి అనుమతి ఇచ్చారు. నేను వ్యాఖ్య వ్రాయడం మొదలుపెట్టాను. అప్పుడప్పుడు బాబా పలికిన ప్రవచనాల నుండి కొత్త సాదృశ్యాలతో ఉపమానాలతో ఉదహరిస్తూ వ్యాఖ్య విజయవంతంగా వ్రాయగలిగాను. ఇవేగాక ఎన్నో కీర్తనలను, స్తోత్రాలను, శ్లోకాలను వ్రాయగలిగాను. 'భక్తిసారామృత్'లోని 63వ అధ్యాయంలో 333వ పేజీలో మనాచి శ్లోకంతో పాటు నా రచనల వివరాలు కూడా పేర్కొనబడి ఉన్నాయి.

సాయిబాబా అప్పుడప్పుడు ముసల్మానీ గీతాలను పాడుతూ ఉండేవారు. ఆ గీతాల భావమేమిటో నాకు అర్థమయ్యేది కాదు.



అణ్ణాసాహెబ్ దాభోళ్కర్



# దత్తాత్రేయ దామోదర్ రాస్నే

## 17

## మే, 1936

**దత్తాత్రేయ దామోదర్ రాస్నే ఉరఫ్ నానాసాహెబ్ రాస్నే (దౌలత్ షా),** వయస్సు 40 సం॥లు, తండ్రి: దామోదర్ (అణ్ణా) సావల్రాం రాస్నే, రవివార్‌పేట్, పూనా.

మా నాన్న ఎంతో కాలం నుండి శ్రీసాయిబాబా భక్తులు. నానాసాహెబ్ చాందోర్కర్ బాబా వద్దకు వెళ్ళిన సమయంలోనే వీరు కూడా శిరిడీ వెళ్ళి బాబాను దర్శించారు. అప్పటికి మా నాన్నకు సంతానం లేదు. సంతానాన్ని ఆశించి బాబాను దర్శించారు. 1895 సంవత్సర ప్రాంతంలో ఒక భక్తుడు బాబాకు బుట్టెడు గోవా మామిడి పండ్లను కానుకగా పంపాడు. బాబా వాటిలో 6 పండ్లు విడిగా ఉంచి మిగతావి అందరికీ పంచారు. విడిగా ఉంచిన ఆరు పండ్లు కూడా పంచమని భక్తులు అడిగారు. అవి దామ్యా కోసం ఉంచామని బాబా చెప్పారు. బాబా మా నాన్నను 'దామ్యా' అని పిలిచేవారు. భక్తులు "దామ్యా ఇక్కడ లేడు కదా?" అన్నారు. ***"అతను ఇప్పుడే కోపర్‌గాంలో దిగాడు. కాసేపటికి ఇక్కడకు వస్తాడు!"*** అని బాబా అన్నారు. బాబా చెప్పినట్లుగానే మా నాన్న కాసేపటికి మసీదు చేరి పూలమాల, చాదర్ మొదలగునవి బాబాకు సమర్పించాడు. అప్పుడు బాబా మా నాన్నతో ***"దామ్యా! ఈ పండ్లను తీసుకో. వీటిని తిని, చావు"*** అన్నారు. ఆ మాటలు విని మా నాన్న భయపడిపోయాడు. కానీ అక్కడే ఉన్న మహల్సాపతి బాబా పాదాల చెంత మరణించడం కన్నా గొప్ప వరం మరొకటి ఉండదని చెప్పాడు. మా నాన్న కాస్త ఊరట చెంది పండ్లు తిందామనుకున్నాడు. అప్పుడు బాబా ***"ఈ పండ్లను నీవు తినవద్దు, నీ చిన్నభార్యకు ఇవ్వు. ముందు నీకు ఇద్దరు కుమారులు కలుగుతారు. మొదటివాడికి 'దౌలత్‌షా' అని, రెండవవాడికి 'తాన్‌షా' అని పేర్లు పెట్టు"*** అని ఆదేశించారు. మా నాన్న అహ్మద్‌నగర్ తిరిగి వచ్చి బాబా ఇచ్చిన పండ్లను తన చిన్న భార్యకు ఇచ్చాడు. బాబా చెప్పిన పేర్లను కూడా గుర్తుగా తన డైరీలో వ్రాసిపెట్టాడు. ఒక సంవత్సరం తరువాత నేను పుట్టాను. నాకు 15 నెలల వయస్సున్నప్పుడు మా నాన్న నన్ను బాబా దర్శనానికై శిరిడీ తీసుకొని వెళ్ళాడు. బిడ్డకు పేరేమిపెట్టమంటారని బాబాను అడిగాడు. బాబా ***"నేను ఈ***

*బిడ్డకు పేరు పెట్టడమేమిటి? నేను ఏమి చెప్పానో నీవు మరచిపోయావా? నీవు నీ డైరీలోని 3వ పేజీలో వ్రాసుకున్నావు. వీడికి దౌలత్‌షా అని పెట్టమని చెప్పలేదూ?"* అన్నారు.

నాకు 5 సంవత్సరాలప్పుడు (1900), పుట్టు వెంట్రుకలు తీయించి అక్షరాభ్యాసం చేయించాలని తలచి మా నాన్న నన్ను శిరిడీ తీసుకెళ్ళాడు. బాబా నా చేత పలక బలపం పట్టించి 'హరి' అని వ్రాయించారు. తరువాత నన్ను శిరిడీలోని బడికి పంపించారు.

నాకు 7 సంవత్సరాల వయస్సున్నప్పుడు మా తల్లిదండ్రులతో కలిసి నేను శిరిడీ వెళ్ళాను. ఒక రోజు మసీదులో కూర్చొని బాబా పాదాలు పడుతున్నాను. అప్పుడక్కడ చాలామంది పిల్లలున్నారు. బాబా వాళ్ళకి స్వయంగా మిఠాయిలు పంచుతున్నారు. నా దృష్టి అటువైపు మళ్ళింది. ఫలితంగా కాళ్ళు ఒత్తడంలో నా శ్రద్ధ కాస్త మందగించింది. ప్రక్కనే ఉన్న మా అమ్మ అది గమనించి "మిఠాయిల వైపు చూస్తూ బాబా సేవ నిర్లక్ష్యం చేస్తున్నావా?" అంటూ నన్ను కొట్టింది. వెంటనే బాబా కోపంతో ***"ఏయ్ ముసలీ! పిల్లవాడి నెందుకు కొట్టావ్?"*** అని కసురుకున్నారు. ఆమె బాబాతో "బాబా! పిల్లవాడు కుదురుగా మీ సేవచేసుకునే బుద్ధిని ప్రసాదించండి" అని వేడుకుంది. ***"పిల్లవాడు చక్కగా నా సేవ చేసుకుంటాడు. భగవంతుడు వాడికి స్వచ్ఛమైన బుద్ధిని ప్రసాదిస్తాడు. భయపడకు. ఇక వాడినెప్పుడూ కొట్టకు"*** అని బాబా మందలించారు.

నాకు 12 సంవత్సరాల వయస్సున్నప్పుడు నా సోదరునితో కలిసి శిరిడీ వెళ్ళాను. మా దగ్గర 100 రూపాయలున్నాయి. బాబా దక్షిణ రూపంలో 10 రూపాయలు ఒకసారి, 15 రూపాయలు ఇంకోసారి, ఇలా చాలాసార్లు డబ్బు అడిగి తీసుకున్నారు. మా దగ్గర (నా సోదరుని జేబులో) 25 రూపాయలే మిగిలాయి. దారి ఖర్చులకు, బాబాకు దక్షిణ ఇచ్చేందుకు డబ్బు పంపమని అహ్మద్‌నగర్‌కు జాబు వ్రాసాము. ఆ రోజు సాయంత్రం బాబా నా సోదరుణ్ణి 25 రూపాయలు దక్షిణ అడిగారు. అతను మా దగ్గరున్న డబ్బంతా ఖర్చయిపోయిందని, ప్రయాణ ఖర్చులకు డబ్బు అవసరమని చెప్పాడు. బాబా వెంటనే ***"ఎందుకు అబద్ధం చెబుతావు? నీ జేబులో 25 రూపాయలు ఉన్నాయి. ప్రయాణ ఖర్చులకు డబ్బు పంపమని నగర్‌కు***

*జాబు వ్రాసారుకదా? ఆ డబ్బు మనియార్డరు ద్వారా రేపు మీకు అందుతుంది, భయపడవద్దు"* అన్నారు. నా సోదరుడు తన దగ్గరున్న 25 రూపాయలు బాబాకు సమర్పించాడు.

బాబా తరచుగా *"ఎవరు నాకు ఒకటి సమర్పిస్తారో వారికి నేను రెండు ఇస్తాను. రెండిచ్చిన వారికి ఐదు ఇస్తాను. ఐదిచ్చినవారికి పదిస్తాను!"* అని చెబుతుండేవారు. మనం భగవంతునికి భక్తితో సమర్పించిన మొత్తానికి ఎన్నోరెట్లు అధికంగా మనకు వారు ప్రసాదిస్తారన్న సామాన్య అర్థంతో పాటు ఏదో నిగూఢార్థం కూడా దాగివుంది!

నాకు వివాహం చేయడానికి నిశ్చయించినప్పుడు నాలుగు సంబంధాలు వచ్చాయి. మా నాన్న బాబాను సంప్రదించకుండా, వారి అనుమతి లేకుండా ఏపనీ చేయరు. అందువల్ల ఆ నలుగురు అమ్మాయిల జాతకాలు తీసుకుని శిరిడీ వెళ్ళి బాబా ముందుంచారు. అందులో 2500 లేక 3000 రూపాయలు కట్నమిచ్చే సంబంధం కూడా ఉంది. కానీ బాబా ఆ నలుగురిలో పేదింటి అమ్మాయి జాతకం ఎంపిక చేసి మా నాన్న చేతిలో పెట్టారు. ఆ అమ్మాయితోనే నా వివాహం జరిగింది. పండరిపురంలో జరుప నిశ్చయించిన నా వివాహానికి మా నాన్న బాబాను ఆహ్వానించాడు. బాబా *"నేను నీతోనే ఉంటాను. భయపడవద్దు - నన్నెప్పుడు తలచుకున్నా వచ్చి నీ చెంతనే ఉంటాను"* అన్నారు. అయినా మా నాన్న బాబాను నా పెండ్లికి రమ్మని ఒత్తిడి చేశాడు. అప్పుడు బాబా *"భగవంతుని అనుమతి లేనిదే నేనేపని చేయలేను. నా తరపున షామాను పంపుతాను"* అన్నారు. అలాగే పండరిపురంలో జరిగిన నా పెళ్ళికి షామా హాజరయ్యాడు.

నాకొక తమ్ముడు ఉన్నాడు. అతనికి కూడా బాబా సూచించిన పేరే పెట్టారు. నాకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు పుట్టారు. కానీ ముగ్గురూ పుట్టిన కొన్ని నెలలకే మూర్ఛరోగంతో చనిపోయారు. మగపిల్లవాడు 1926లో చనిపోయాడు. నా భార్య ఆరోగ్యం కూడా క్షీణించింది. నాలో నిరాశా నిస్పృహలు అలుముకున్నాయి. విచారభారంతో క్రుంగిపోయి శిరిడీ వెళ్ళి బాబాను "అల్పాయుష్కులైన ఇంతమంది పిల్లలను ఇచ్చే బదులు పూర్ణాయువు గల ఒక్క బిడ్డను ప్రసాదించండి" అని ప్రార్థించాను. నేను శిరిడీలో నిద్రిస్తుండగా బాబా నా కలలో కనిపించారు. *"పిల్లవాడు*

*చనిపోయాడని చింతించకు. వాడు తల్లిదండ్రులకు హాని కలిగించే మూలా నక్షత్రంలో పుట్టాడు"* అని బాబా పలికారు. ఆ కలలో బాబా ఛాతిపై సూర్యుని వలె ప్రకాశించే కాంతి వలయముంది. ఆ వలయంలో చనిపోయిన నా కుమారుణ్ణి ఒడిలో పెట్టుకొని బాబా కూర్చొని ఉన్నారు. *"నీకు ఈ బిడ్డవల్ల ప్రమాదం ఉంది. అందుకే నేను తీసుకువెళ్ళాను. నీకు మరొక బిడ్డను ప్రసాదిస్తాను, భయపడకు"* అన్నారు. అప్పటికే మా కుటుంబం అహ్మద్‌నగర్ నుండి పూనాకు తరలి వెళ్ళింది. నేను ఇంటికి వెళ్ళి చనిపోయిన కుమారుని జాతకచక్రం తీసి చూసాను. బాబా చెప్పినట్లు వాడు మూలా నక్షత్రంలోనే పుట్టాడు. నేను శిరిడీ యాత్ర చేసిన 15 నెలలకు మాకొక కుమారుడు పుట్టాడు. వాడు పూర్ణారోగ్యంతో ఉన్నాడు. ఇది 1928లో జరిగింది.

నాకు శ్రీసాయిబాబాపై భక్తి విశ్వాసాలు వృద్ధి చెందాయి. నేను సాధుసత్పురుషులను అందరినీ సాయిస్వరూపులుగానే భావించేవాడిని. వారికి నమస్కరించేటప్పుడు బయటకుగాని, మనస్సులోగాని "సమర్థ సద్గురు సాయినాథ్‌కు ప్రణామాలు" అనేవాడిని. 1927లో ఖేడ్‌గాంపేట్‌కు వెళ్ళి నారాయణ్ మహరాజ్‌ను దర్శించాను. వారికి నమస్కరిస్తూ మనస్సులో సాయిబాబాకు ప్రణామాలందజేసాను. మహరాజ్ "నీ గురువు నాకన్నా ఉన్నత శ్రేణిలో ఉన్న పరమగురువు. నీవిక్కడి కెందుకొచ్చావు? నీ ప్రారబ్ధము - సంచితము అక్కడే ఉంది. నీ ఎన్నిక శ్రేష్ఠమైనది. అక్కడికే వెళ్ళు. నీ ఆశయాలన్నీ అక్కడే సిద్ధించగలవు" అన్నారు. నేను నారాయణ్ మహరాజ్‌ను నాకు కుమారుడు పుట్టకమునుపే దర్శించాను.

1927లో నా జాతక చక్రంలోని నక్షత్ర ప్రభావం వల్ల నా ఆరోగ్యం క్షీణించింది. నేను ప్రతి ఆదివారం జున్నర్‌కు రెండు మైళ్ళ దూరంలోనున్న (పూనా నుండి 40 మైళ్ళు) 'సీతారాం ఉత్తరేశ్వర్' (శివుడు) ఆలయానికి వెళ్ళి పూజించేవాడిని. ఒక ఆదివారం రాత్రి 9గం॥లకు విగ్రహంపై పూలు చల్లి "సాయిబాబాకు ప్రణామాలు" అని నమస్కరించాను. అప్పుడు ఆ విగ్రహం వద్ద ఒక వెలుగు, ఆ వెలుగులో నేను నిరంతరం స్మరించే సాయిబాబా రూపం కనిపించాయి. అప్పటి నుండి నా ఆరోగ్యం మెరుగుపడసాగింది. అక్కడ జానకీదాస్ అనే సాధువు ఉండేవారు. ప్రతి ఆదివారం అక్కడికి వెళ్ళినప్పుడు ఆ సాధువును కూడా సాయిలా భావించి సాయినామం స్మరించుకుంటూ నమస్కరించేవాడిని. ఒకసారి అతనికి నమస్కరించిన వెంటనే


"నీవొక గొప్ప మహాత్ముని ఆశ్రయించావు. నాలాంటి సామాన్య సాధువుల దగ్గరకెందుకొస్తావు? మాలాంటి వారమంతా సాయిబాబా పాదాలను ఆశ్రయిస్తాము" అన్నారు. తరువాత నేను బసకు వెళ్ళి నిద్రపోయాను. ఆ రాత్రి కలలో బాబా ఫకీరువలె కన్పించారు. వారు నాతో *"నీవు చాలా ఆతురతగానున్నావు. నీ సంపూర్ణ శరీరాన్ని, మనసుతో సహా నాకు భిక్షగా సమర్పించు"* అన్నారు. నేను "ఈ భిక్షను సమర్పించి మా నాన్నకు తెలియజేస్తాను" అని వారికి చెప్పాను. బాబా *"మీ నాన్నతో సంప్రదించకుండానే నీవు ఈ పని ఎలా చేయగలవు?"* అనడిగారు. నేను "ఔను చేస్తాను. నా శరీరానికి యజమానిని నేనే! ఇది నా స్వంతం. అంతేగాక మా నాన్నగారికి నేనొక్కడినే కాదు. ఇంకా కుమారులున్నారు. మీరే వారికి కుమారులను ప్రసాదించారు. మీరిచ్చిన దానిని తిరిగి మీకు ఇవ్వడానికి మా నాన్న అభ్యంతరం చెప్పరు" అన్నాను. తరువాత బాబా నా శరీరాన్ని తమ అరచేతిలోకి తీసుకొని పైజేబులో వేసుకున్నారు. బాబా ఎంతో దయతో నన్ను తమ హృదయం చెంతకు చేర్చుకున్నారన్న ఆలోచన నాకు ఆనందపారవశ్యాన్ని కలగజేసింది. తరువాత నాకు మెలకువ వచ్చింది. నేను మేలుకోగానే చాలా ఆనందం కలిగింది. ఆ కల తరువాత నా మనస్సు వైరాగ్యంతో నిండిపోయింది. అంతకు ముందువలె ఏ విషయమూ నన్ను ఆకర్షించలేకపోయింది, నా మనస్సును ప్రభావితం చేయలేకపోయింది.

రెండు మూడు నెలల తరువాత 1928వ సంవత్సరంలో (ఫాల్గుణ వద్య) పండరిపురంలో ఉండగా మాకొక కుమారుడు కలిగాడు. 15 నెలల తరువాత మా నాన్నతో కలిసి శిరిడీ వెళ్ళినప్పుడు, మా నాన్న నాకు మరొక కుమారుణ్ణి ప్రసాదించమని బాబాను ప్రార్థించాడు. బాబా కృపవలన 1931లో మరొక బిడ్డ కలిగాడు. వాడికి "సాయిదాస్" అని పేరుపెట్టాము. వాడు పుట్టిన రెండవరోజే వాడికి తీవ్రమైన జ్వరం వచ్చింది. బాబా ఊదీ, తీర్థం ఇచ్చాము. బాబా ఉపయోగించిన శేషవస్త్రాన్ని తాయెత్తులో పెట్టి వాడికి కట్టాము. వెంటనే జ్వరం తగ్గి ఆరోగ్యవంతుడయ్యాడు. పిల్లవాడికి సంవత్సరం నిండిన తరువాత వాడిని తీసుకొని శిరిడీ వెళ్ళాము. బాబాకు అభిషేకం చేయించాము. సమాధి మీద కప్పేందుకు వస్త్రాన్ని సమర్పించాము. బ్రాహ్మణులకు అన్నసంతర్పణ చేశాము.

1931లో గాజుల వ్యాపార నిర్వహణను నాకు అప్పగించారు. నేను ఆ వ్యాపారానికి బాబా పేరు పెట్టాలని పట్టుబట్టి 'శ్రీసమర్థ సాయినాథ్ అండ్ కంపెనీ'

అని పేరుపెట్టాను. (ఆ పేరుపెట్టడం బాబా అనుమతితోనే జరిగింది అంటే బాబా పటం ముందు చీటీలు వేసి ఎంపిక చేయడం). ఈ వ్యాపారాన్ని నిజాయితీగానూ, మనస్సాక్షి సమ్మతంగానూ నడపసాగాను. బాబాను స్మరించి నేను ఎవరికైనా ఊదీ, తీర్థము ఇస్తే, వాళ్ళ రోగాలు నయమయ్యేవి.

నేను తీర్థయాత్రలకు వెళ్ళినప్పుడు 1-9-1932వ తేదీన 'ముత్రా' అను ప్రదేశంలో నాకు కలరా సోకింది. నేను మరణించడం ఖాయమనిపించింది. మా నాన్న నా చివరి కోరిక ఏమిటని అడిగాడు. నన్ను శిరిడీ తీసుకువెళ్ళమని, నేను మరణిస్తే నా దైవమైన సాయిబాబా చెంత నా దేహాన్ని దహనం చేయమని కోరాను. బాబా ఫోటోను నా తల దగ్గర పెట్టి సాంబ్రాణికడ్డీలు వెలిగించారు. బాబా ఊదీ, తీర్థము నా నోట్లో పోస్తూనే ఉన్నారు. నేను కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాను. అర్థరాత్రి మా వదిన సుభద్రాబాయికి పూనకం వచ్చింది. 'మీరాదాతార్' (గుజరాత్‌లో సిద్‌పూర్ సమీపంలోని 'ఉనవ'కు చెందిన) అను ముస్లిం సాధువు ఆమెను పూని మాట్లాడసాగాడు. "మీరు సాయిని ప్రార్థిస్తున్నారు. వారు నా మామ. వారు వయోభారంతో నడవలేకున్నారు. కనుక వారు పంపగా నేను వచ్చాను. వారి కృపాశీస్సులు మీకు లభిస్తాయి. వారిని మీరు రేపు దర్శించుకుంటారు. ఒక కప్పు కాఫీ తయారు చేసి రోగికివ్వండి. భయపడవద్దు" అని పలికాడు. కాఫీ తయారుచేసి దానిలో బాబా ఊదీ వేసి, నా చేత త్రాగించారు. ఆ తరువాత జ్వరం తగ్గి విరోచనాలు ఆగిపోయాయి. మరుసటి రోజు నేను అంత త్వరగా కోలుకోవడం చూసి డాక్టరు ఆశ్చర్యపోయాడు. "నిన్న ఇతడు మృత్యువుకు అతి సమీపంలో ఉన్నాడు. ఒక్కరోజులో ఇతనిలో ఇంత మార్పెలా వచ్చింది?" అని ప్రశ్నించాడు. శ్రీసాయిబాబా వైద్యులకే వైద్యుడని, వారి పవిత్ర ఊదీయే నన్ను కాపాడిందని నేను జవాబు చెప్పాను.



త్రయంబక్ దామోదర్ రాస్నే



దామోదర్ సావల్రాం రాన్నే

## 18

**దామోదర్ సావల్రాం రాస్నే ఉరఫ్ అన్నా రాస్నే,** తండ్రి: సావల్రాం రాస్నే, కాసార్, అహ్మద్‌నగర్, ప్రస్తుత నివాసం: పూనా.

నా కుమారుడు తన జన్మవృత్తాంతం గురించి చెప్పినదంతా వాస్తవమే! నేను సంతానాన్ని ఆశించి బాబాను దర్శించినప్పుడు వారు ఎంతో దయతో నన్ను ఆశీర్వదించారు. నేను కోపర్‌గాం స్టేషనులో దిగి శిరిడీకి చేరే మార్గంలో ఉన్న సమయంలోనే బాబా నేను వస్తున్నట్లు భక్తులకు చెప్పి, నాకు ఇవ్వడానికి కొన్ని మామిడిపండ్లు తీసి ఉంచారు. నేను మసీదు చేరగానే ఆ పండ్లను నాకు ఇచ్చి ఆశీర్వదిస్తూ వాటిని నా చిన్నభార్యకు ఇవ్వమని ఆదేశించారు. ఆమెకు ముందు ఇద్దరు మగపిల్లలు పుడ్తారని, వాళ్ళకి ఏ పేర్లుపెట్టాలో కూడా చెప్పారు. నేనా పేర్లను గుర్తుగా నా డైరీలోని 3వ పేజీలో వ్రాసిపెట్టాను. 15 నెలల తరువాత బాబా చెప్పినట్లుగా ఒక బిడ్డ, కొన్ని సంవత్సరాల తరువాత మరొక బిడ్డ కలిగారు. వారికి మామూలు హిందూ పేర్లతో పాటు బాబా చెప్పిన పేర్లను కూడా జతచేశాను. నేను బాబా సమాధి ముందు కూర్చుని నాకు రెండవ మనుమణ్ణి ప్రసాదించమని ప్రార్థించాను. వారు వెంటనే నా కోరిక తీర్చారు.

నేను ఎల్లప్పుడూ బాబా సలహా తీసుకున్న తరువాతే ఏ పనైనా చేసేవాడిని. అందువల్ల ఎప్పుడూ మంచి ఫలితాలే దక్కేవి. ఒకసారి నాకు సంబంధించిన కేసు ఒకటి హైకోర్టుకు అప్పీలు చేయబడింది. ఆ కేసు నిమిత్తం బొంబాయికి వెళ్ళమని మా లాయరు నాకు జాబు వ్రాసాడు. నేనప్పుడు శిరిడీలో ఉన్నాను. బాబా నేను బొంబాయి వెళ్ళేందుకు అనుమతించక నన్ను శిరిడీలోనే ఉంచారు. నేను కోర్టుకు హాజరుకాకపోయినప్పటికీ తీర్పు నాకు అనుకూలంగా వచ్చింది.

ఒకసారి నానాసాహెబ్ డేంగ్లే ఒక పెద్ద వెండిపళ్ళెం నిండా రుచికరమైన పదార్థాలు పెట్టి దానిని బాబా ముందుంచి ఆరగించమని ప్రార్థించాడు. అప్పుడు బాబా కేక వేయగానే ఒక నల్లకుక్క పరుగున వచ్చి పళ్ళెంలోని పదార్థాలను తినసాగింది. అక్కడే నిలబడి చూస్తున్న నానాసాహెబ్ డేంగ్లే "ఈ ఊరకుక్క కోసమేనా ఇంత కష్టపడి ఈ పదార్థాలను తయారు చేసింది?" అని మనస్సులో అసహ్యించుకున్నాడు.

వెంటనే బాబా పళ్ళాన్ని అతని వైపు నెట్టి కోపంగా **"తీసుకుపో"** అన్నారు. ఇది జరిగినప్పుడు నేను అక్కడే ఉన్నాను.

బాబా మూగజీవులను, కడజాతి వాళ్ళను తమతో సమానంగా భావించి ఆదరించేవారు. ఒకసారి నేను శిరిడీలో విందొకటి ఏర్పాటు చేసి బాబా స్వయంగా రారని తెలుసు కాబట్టి వారి బదులు బాలాపాటిల్‌ను విందుకు పంపమని అభ్యర్థించాను. నేను బాబా వద్దకు వెళ్ళిన తొలిరోజులలో నేవాసాకు చెందిన బాలాపాటిల్ మసీదులో చిమ్మడం వంటి పనులతో పాటు బాబాకు పలురకాల సేవలు చేస్తుండేవాడు. అతను కడజాతివాడు. అతనిని **"దుత్ దుత్"** అని అసహ్యించుకుంటూ అవమానించకుంటే పంపుతామని బాబా చెప్పారు. నేనలాగేనని వారికి హామీ ఇచ్చి బాలాపాటిల్‌ను ఇంటికి తీసుకెళ్ళాను. భోజనం తయారవగానే బాబాకు ప్రత్యేకించి ఒక పళ్ళెము పెట్టి వండిన వంటకాలన్నీ అందులో వడ్డించి "బాబా రండి!" అని ఆహ్వానించాను. వెంటనే ఒక నల్లని కుక్క లోనికి ప్రవేశించి పళ్ళెములోని పదార్థాలన్నింటిని తిని వెళ్ళిపోయింది. అది తిన్నంత వరకు నేను గౌరవభావంతో వేచి ఉండి తరువాత బాలాపాటిల్‌ను నాతోపాటు కూర్చోబెట్టుకొని అతిథులందరితో కలసి భోంచేశాను.

నా మనస్సెప్పుడు బాబా ధ్యాసలోనే ఉంటుంది. తరచుగా వారి దర్శనం నాకు ఇక్కడే లభించేది. బాబా అప్పుడప్పుడు కఠినంగా తిట్టేవారు- కొట్టేవారు కూడా! అక్కల్‌కోట మహరాజ్ వంటి మహాత్ముల తిట్లు, దెబ్బలు శుభాల్నే కలుగజేస్తాయని నాకు తెలుసు. అందువల్ల బాబా తిట్లను, దెబ్బలను నేను అవమానకరంగా భావించేవాడిని కాదు. వారితో గల అనుబంధాన్ని నేను ఎన్నడూ వదులుకోలేదు.

బాబా ముస్లింలను నమాజు చేసుకోమని, తరువాత తమ వద్ద ఖురాన్ పఠించమని చెప్పేవారు. అప్పుడప్పుడు మౌల్వీలతో మతపరమైన విషయాలు మాట్లాడుతుండేవారు. నేను మొట్టమొదట శిరిడీకి 1895 ప్రాంతంలో వెళ్ళాను. నేను వెళ్ళిన మరుసటి సంవత్సరం నుండి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 40 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఈ ఉత్సవాలకు జరీ అంచు జెండా ఒకటి సమర్పిస్తున్నాను. అప్పటికి నానా (దౌలత్‌షా) ఇంకా పుట్టలేదు.

దాసగణు మహరాజ్‌గానీ, దాభోళ్కర్‌గానీ నా అనుభవాల గురించి నన్నెప్పుడూ అడగలేదు. నేను వాళ్ళకి ఏ వివరాలు చెప్పలేదు. నాకు ముగ్గురు

భార్యలున్నారని వ్రాసిన విషయం వాస్తవం కాదు. నాకు ఇద్దరు భార్యలు మాత్రమే ఉన్నారు. నేను జ్యోతిష శాస్త్రాన్ని సంప్రదించాను. నా జాతక చక్రంలోని ఐదవ స్థానంలో కేతువు ఉన్నందువలన నాకు సంతానం కలగడం కష్టమని జ్యోతిష్కులు చెప్పారు. కానీ సాయిబాబా విధి విధానాన్నే మార్చి నాకు సంతానప్రాప్తి కలుగజేసారు. తాము ఇచ్చిన 4 మామిడిపండ్లు నా చిన్నభార్యకు ఇమ్మని, ఆమెకు 8 మంది పిల్లలు పుడతారని బాబా చెప్పారు. వారు చెప్పినట్లుగానే జరిగింది.

నా వ్యాపార విషయాలలో నేను బాబాను సంప్రదించేవాడిని. ఒకసారి బొంబాయి ప్రత్తి మార్కెట్టులో పెట్టుబడి పెట్టమని ఒక దళారి నాకు చెప్పాడు. అతను నా వ్యాపారంలో భాగస్థుడు కాదు. నేనే మొత్తం పెట్టుబడి పెట్టాలి. బాబా వద్దకు వెళ్ళి మసీదులో వారి పాదాలొత్తుతూ నాకు వచ్చే లాభంలో బాబాకు వాటా ఇవ్వాలని తలచాను. ఆ సమయంలో బాబా, నేను, మహల్సాపతి మాత్రమే మసీదులో ఉన్నాము. బాబా ***"వ్యాపార విషయాలలో తగులుకొనడం నాకు ఇష్టము లేదు!"*** అన్నారు. దాంతో నేను ఆ వ్యాపారం మానుకున్నాను. మరోసారి నేను శిరిడీ వెళ్ళినప్పుడు ధాన్యం వ్యాపారం చేయవచ్చా? అని బాబాను అడిగాను. ధరలు పడిపోతాయని, కొన్న ధరకన్నా తక్కువ ధరకు అమ్మవలసి వస్తుందని బాబా చెప్పారు. నేను ఆ ఆలోచన కూడా మానుకున్నాను. నేను ఈ విషయాన్ని నా స్నేహితుడైన ఒక వ్యాపారికి చెప్పాను. చాలాకాలంగా ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయని తగ్గడం జరగదని బాబా సూచన తప్పని అతను చెప్పాడు. ఆ తరువాత శ్రావణం వచ్చింది. వర్షాలు పడ్డాయి. ధరలు అకస్మాత్తుగా పడిపోయాయి. ధాన్యాన్ని నిల్వచేసిన వ్యాపారులు అపారంగా నష్టపోయారు. ఈ విషయంలో బాబా నన్ను కాపాడారు.

బాబా అనుమతిలేనిదే నేను ఏ లావాదేవీలు జరిపేవాడిని కాదు. బాబా సశరీరులుగా ఉన్నప్పుడు శిరిడీ వెళ్ళి ప్రతి విషయాన్ని వారితో సంప్రదించేవాడిని. 1918లో బాబా మహాసమాధి అనంతరం, వారి పటం ముందు చీటీలు వేసి నిర్ణయం తీసుకునేవాడిని. వారు ఇప్పటికీ నన్ను సరియైన మార్గంలోనే నడిపిస్తున్నారు. ఒకసారి నేను మసీదులో భక్తులందరితోపాటు బాబా పాదాలచెంత కూర్చొని ఉన్నాను. అప్పుడు నా మదిలో మెదిలిన రెండు ప్రశ్నలకు బాబా సమాధానమిచ్చారు.

1. బాబా దగ్గరకు అసంఖ్యాకమైన భక్తులు వస్తుంటారు కదా, వచ్చిన వారందరూ వారి నుండి లబ్ధి పొందుతున్నారా?

దానికి బాబా ***"పూతపూసిన మామిడిచెట్టును చూడు. అందులోని పువ్వులన్నీ కాయలై, పండ్లయితే ఎంత బాగుంటుంది? కానీ అలా అవుతాయా? ఎక్కువ భాగం రాలిపోతాయి (కొన్ని పువ్వులుగా, కొన్ని పిందెలుగా, మరికొన్ని గాలికి రాలిపోతాయి). ఏ కొద్దో మిగులుతాయి!"*** అన్నారు.

2. ఇది నా గురించి అడిగినది. బాబా సమాధి చెందితే నాకు దిక్కెవరు? నా గతి ఏమవుతుంది? అని చింతించాను.

దానికి బాబా ***"ఎప్పుడైనా, ఎక్కడైనా నన్ను తలచిన వెంటనే నేను నీ వెంట ఉంటాను!"*** అని హామీ ఇచ్చారు. బాబా ఇచ్చిన హామీని వారు 1918 ముందు, తరువాత కూడా నెరవేరుస్తున్నారు. వారు నాతోనే ఉండి నాకు మార్గం చూపిస్తున్నారు.

1910-11 ప్రాంతంలో నా సోదరులు నా నుండి వేరైపోయారు. అకస్మాత్తుగా నా సోదరి చనిపోయింది. మా ఇంట్లో దొంగలు పడ్డారు. దానిపై పోలీసు విచారణ జరిగింది. వీటన్నింటి వలన నా మనసు వికలమయింది. (సాయిలీలామాసిక్ III (5) 368, 369 లో ఇది ప్రస్తావించబడి ఉంది).[1]

---

*1. నా సోదరి చనిపోయినప్పుడు, నేను దుఃఖభారంతో కుమిలిపోయి జీవితం పట్ల ఆశను, ఆనందాన్ని కోల్పోయాను. నేను బాబా దగ్గరికి వెళ్ళినప్పుడు వారు హితవాక్యాలతో నన్ను ఓదార్చారు. అప్పాకులకర్ణి ఇంటికి పంపి, పూరన్‌పోళీలతో విందు భోజనం చేయించి, నాకు చందనం పూయించారు.*

*30 సంవత్సరాల నుండి నాతో ఉండిన నా పాత స్నేహితుడు, నా భార్య నగలపెట్టెను దొంగిలించుకొని వెళ్ళాడు. ఆ నగలతో పాటు మంగళకరమైన నత్తు (ముక్కుపుడక) కూడా ఉంది. నేను బాబా ఫోటో ముందు కూర్చొని విలపించాను. మరుసటిరోజు నా స్నేహితుడు మా ఇంటికి వచ్చి, క్షమాపణలు చెప్పి నగలపెట్టెను తిరిగి ఇచ్చాడు.*



తాత్యాసాహెబ్ నూల్కర్



# అబ్దుల్

౧౨

## డిసెంబరు ౮వ తేదీ, ౧౯౩౬, మార్చి ౧౦వ తేదీ, ౧౯౩౮

**అబ్దుల్,** తండ్రి: సుల్తాన్, వయస్సు సుమారు 65 సం॥లు, ముసల్మాన్, ఖాందేష్‌లోని నాందేడు, ప్రస్తుత నివాసం: శిరిడీ.

నేను తపతీనదీ తీరంలో నున్న నాందేడు నుండి 45 సంవత్సరాల క్రితం అంటే 1889లో శిరిడీ వచ్చాను. మొదట నేను నాందేడుకు చెందిన అమీరుద్దీన్ ఫకీరు ఆశ్రయంలో ఉన్నాను. ఆ ఫకీరుకు సాయిబాబా కలలో కనపడి రెండు మామిడి పండ్లను ప్రసాదించి, వాటిని నా చేతికి ఇచ్చి నన్ను శిరిడీ పంపమని ఆదేశించారు. అమీరుద్దీన్ ఫకీరు తన కల విషయం చెప్పి, మామిడి పండ్లను ఇచ్చి నన్ను శిరిడీలోని శ్రీసాయిబాబా దగ్గరకు వెళ్ళమన్నారు. నేను ఇక్కడికి నా 20వ సంవత్సరంలో వచ్చాను. అప్పటికి నానాసాహెబ్ చాందోర్కర్ కూడా బాబా వద్దకు రాలేదు. బాబా నన్ను చూడగానే ***"నా కాకి వచ్చింది (మేరా కావ్‌లా ఆలా)"*** అంటూ ఆహ్వానించారు. బాబా నన్ను తమ సేవకు పూర్తిగా అంకితమవ్వమని ఆదేశించారు. మొదటి నుండి నేను ఐదు అఖండ దీపాలలో (లెండీ, మసీదు, చావడి మొ॥) నూనె పోయడం, వెలిగించడం మొదలైన పనులు చేసేవాడిని. బాబా నాకు కానీ మరెవ్వరికీ కానీ భోజనం పెట్టేవారు కాదు. ఏదో విధంగా (భిక్షచేసి) భోజనం సంపాదించుకొనేవాడిని. నేను ప్రస్తుతపు గుర్రపు శాలలో ఐదారు సంవత్సరాలు నివసించాను. నేనెప్పుడూ బాబా సేవ చేస్తూ వారి చెంతనే గడిపేవాడిని. నేను రోజుకి మూడుసార్లు స్నానం చేసేవాడిని. మసీదులో వారి చెంత ఖురాన్ పఠించేవాడిని. ఒక్కొక్కసారి బాబా ఖురాన్‌ను తెరిచి, ఆ పేజీలో ఉన్న భాగాలని చదవమనేవారు. అప్పుడప్పుడు వారు ఖురాన్‌లోనున్న వాక్యాలను చెప్పేవారు. బాబా నోటి నుండి వెలువడిన ప్రతీమాటా పవిత్రమైనదే. వారి మాటలను మరాఠీ, మోడీ లిపిలో పుస్తకంలో వ్రాసేవాడిని.

బాబా నోటి నుండి వెలువడిన మాటలు నన్నేగాక అందరినీ సరియైన మార్గంలో నడిపిస్తాయని నా నమ్మకం. అందువల్ల వారి ప్రవచనాల పుస్తకాన్ని క్రింది విధంగా ఉపయోగించేవాడిని. ఎవరైనా తమ భవిష్యత్తు తెలుసుకోదలచినప్పుడుగానీ క్లిష్ట సమస్యలు ఎదురైనప్పుడుగానీ నా దగ్గరకు వచ్చేవారు. నేను భక్తితో బాబాను

తలచుకొని పుస్తకాన్ని తెరిచేవాడిని. తెరిచిన పేజీలో వాళ్ళ భవిష్యత్తుకు లేదా సమస్యలకు సంబంధించి సమాధానం ఉండేది. ఇందుకు రెండు ఉదాహరణలిస్తాను. బాబా సమాధి చెందిన తరువాత సాయిమందిరంలో ఒక బావిని త్రవ్వారు. కానీ ఆ బావిలో త్రాగడానికి ఉపయోగపడని ఉప్పునీళ్ళు పడ్డాయి. వాళ్ళు నా దగ్గరకొచ్చారు. నేను ప్రవచనాల పుస్తకాన్ని సంప్రదించాను. మరికొంత లోతు త్రవ్వితే మంచినీళ్ళు పడతాయని అందులో ఉంది. నేను వెళ్ళి మరి రెండడుగులు త్రవ్వాను. మంచినీళ్ళు పడ్డాయి. రెండవది బారిష్టర్ గాడ్గిల్‌కు సంబంధించిన విషయం. అతని కుమారుడు ఇంగ్లండ్ వెళ్ళి ఉన్నాడు. అతను తిరిగి ఇండియా వస్తాడా లేక అక్కడే స్థిరపడతాడా అని అడిగాడు. నేను అతను తిరిగి వస్తాడని చెప్పాను. అలాగే అతని కుమారుడు తిరిగి వచ్చాడు. నేను ఈ ప్రవచనాల పుస్తకాన్ని ఖురానంత పవిత్రంగా భావించేవాడిని. నేను ఈ పుస్తకాన్ని పఠిస్తూ, జపమాల త్రిప్పుతూ బాహ్యప్రపంచం మరచి అందులో పూర్తిగా నిమగ్నమైపోయేవాడిని.

నేను ఒక స్త్రీ ముఖం చూసి ఆమెకు వివాహం అవుతుందా, సంతానం కలుగుతుందా లేదా అనే విషయాలు చెప్పగలిగేవాడిని. నేనలా చాలాసార్లు చెప్పాను. నేను చెప్పినవన్నీ నిజాలయ్యాయి. ఇదంతా బాబా కృపవలనే సంభవమయింది. నా దగ్గరకు వచ్చేవాళ్ళని నేను ఆశీర్వదించేవాడిని. పైన చెప్పినట్లు నేను ఈ పుస్తకాలను పారాయణ గ్రంథంగానే కాక భవిష్యదర్శినిగా కూడా ఉపయోగించేవాడిని.

లెండీలో స్థూపంలా కట్టబడిన దానిపై "నందదీపం" లేక అఖండదీపం ఉండేది. సాధారణంగా బాబా ఆ స్థూపం వెనుక కూర్చొనేవారు. అక్కడ నుండి వారికి ఆ దీపం కనిపించేది కాదు. బాబా ఆ దీపం వైపు దృష్టి సారించినట్లు కూడా నేను చూసి ఎరుగను. నేను బాబాకు లెండీ, ఇతరచోట్ల సేవ చేసేవాడిని. లెండీలో కుండలనిండా నీరు తెచ్చి పెట్టేవాడిని. బాబా రెండు కుండల దగ్గర కూర్చొని నీటిని అన్ని దిక్కులకు చల్లేవారు. బాబా అలా ఎందుకు చేసేవారో నీరు చల్లేటప్పుడు వారేదైనా మంత్రం ఉచ్ఛరించేవారో లేదో నేను చెప్పలేను. ఆ సమయంలో నేను తప్ప మరెవ్వరూ అక్కడ ఉండేవారు కాదు.

బాబా చెంత నేను తప్ప ఇతర మహమ్మదీయులెవ్వరూ ఖురానుగానీ ఇతర పవిత్ర గ్రంథాలనుగానీ పారాయణ చేసినట్లు నేను ఎరుగను. అప్పుడప్పుడు బాబా పవిత్రమైన పదాలు ఉచ్ఛరిస్తూ ఉండేవారు. వీటన్నింటినీ బాబా అనుమతితో

పుస్తకంలో వ్రాసేవాడిని. ఈ పుస్తకాన్ని మీరు కానీ, ఇతర భక్తులు కానీ చదవవచ్చును. దీనిలో లిపి దేవనాగరిలో కానీ, మోడీలో కానీ ఉంటుంది.

(తరువాత అబ్దుల్ ఈ పుస్తకాన్ని బి.వి.నరసింహస్వామి చేతికిచ్చాడు. వారు పుస్తకాన్ని తెరిచి చూసారు. అది మరాఠీలో వ్రాయబడి ఉంది. అందులో బాబా నోటి నుండి వెలువడిన మాటలు ఉన్నాయి. మారుతీ స్తోత్రాలున్నాయి. దేవుని యొక్క అవతారాలున్నాయి. హిందూ దశావతారాలతో మహమ్మద్ మరికొందరిని సంప్రదాయబద్ధంగా జోడించి వరుసగా వ్రాయబడి ఉన్నాయి. దానికి తగ్గట్లే బాబా, వారిని అనుసరించే అబ్దుల్, ఇద్దరూ హిందూ అవతారాల పట్ల, మారుతి పట్ల భక్తిప్రపత్తులతో ఉండేవారు, ప్రార్థించేవారు).

**మార్చి 10, 1938న శిరిడీలో చెప్పిన విషయాలు:**

మహమ్మదీయులెవరూ బాబాకు ఖురాన్, షరీఫ్ వంటి పవిత్ర గ్రంథాలను చదివి వినిపించడంగానీ వాటిలోని విషయాలు వివరించమని అడగడంగానీ జరగలేదు. ఎంతోమంది ఫకీర్లు, ముస్లిం సాధువులు బాబా దగ్గరికి వచ్చేవారు. బాబా వారితో ఏ విషయాలు మాట్లాడేవారో నాకు తెలియదు. నేను ఎక్కువ సమయం బాబా సేవలోను, వీధులను చిమ్మి శుభ్రపరచడంలోను, రాత్రంతా బాబా సన్నిధిలో ఖురాను చదవడం వంటి పనులలో నిమగ్నమై ఉండేవాడిని. రాత్రి సమయాలలో నిద్రపోకుండా ఖురాన్ చదువుతూ ఉండమని బాబా చెప్పేవారు. పవిత్రమైన ఖురాన్ చదువుతూ తూగకూడదని, నిద్రలోకి జారుకోకూడదని కూడా బాబా చెప్పేవారు. ***"స్వల్పంగా తిను, ఒక్క పదార్థంతో తృప్తిపడు, రుచులకు పోవద్దు, అతిగా నిద్రపోవద్దు"*** అని బాబా చెప్పేవారు. ఇంకా బాబా నేను చదివిన దానిపై ధ్యాస ఉంచమనేవారు. వారు నాతో *"నేను ఎవరిని?"* అని విచారించమని చెప్పారు. నేను వారి సలహా పాటించి కొద్దిగా తిని రాత్రిళ్ళు నిద్రపోకుండా ఖురానులోని శ్లోకాలను మననం చేసుకుంటూ ఉండేవాడిని. ఇలా చేసేటప్పుడు నేను మోకరిల్లే భంగిమలో ఉండేవాడిని. ఒకరాత్రి నేను బాగా అలిసిపోయి ఉన్నందువల్ల దోసిలిలో ముఖం పెట్టుకొని నిద్రలోకి జారుకోబోతున్నాను. అప్పుడు బాబా *"చంద్రుణ్ణి చూడడానికి ప్రయత్నిస్తున్నావా?"* అన్నారు. ఆ రాత్రి నేను నిద్రమత్తులో బాబా మీద ఒరిగిపోయాను. బాబా నా పాదాలపై నెమ్మదిగా తట్టడంతో మేల్కొన్నాను.

మరుసటి రోజు నేను ముఖం కడుక్కోడానికి దోసిలిలోకి నీళ్ళు తీసుకున్నప్పుడు చిత్రంగా దోసిలిలో పూర్ణచంద్రుడు కనిపించాడు. అప్పుడు సమయం మధ్యాహ్నం 2 గంటలు. ఈ దృశ్యం గురించే బాబా చెప్పారు!

నేను లెండీని, అందులో బాబా వెలిగించిన అఖండదీపాన్ని సంరక్షిస్తూ ఉండేవాడిని. ఆ రోజులలో ఆ దీపం నేలలో 2 అడుగుల లోతుకు త్రవ్వబడిన గుంటలో ఉండేది. దీపం ఆరిపోకుండా దానిపై పందిరి ఉండేది. పందిరిపై రేకులు, చుట్టూ 20 తెరలు కట్టబడి ఒక గుడారంలా కనిపించేది. నేను ఆ గుడారంలో ఉంటూ దీపాన్ని సంరక్షిస్తూ ఉండేవాడిని. తరువాత ఆ స్థలానికి కొంచెం దూరంలో ఇటుకలు సున్నంతో దిమ్మెనొకదాన్ని నిర్మించారు. ఆ దిమ్మె మీద చుట్టూ మూసి ఉన్న అరలోనికి దీపాన్ని మార్చారు. బాబా లెండీకి వచ్చి దీపానికి దగ్గరగా కూర్చునేవారు. నేను రెండు బకెట్లతో నీరు తెచ్చి వారి దగ్గర పెట్టేవాడిని. వారు ఆ నీటిని దీపం చుట్టూ చల్లేవారు. తరువాత అన్ని దిక్కులవైపు కొన్ని గజాలు నడిచి వెళ్ళి అక్కడ నిలబడి ఆ దిక్కువైపు తదేకంగా చూస్తుండేవారు.

నేను సాయికి చేసే సేవ అందరికి చేసినట్లుగా భావించేవాడిని. శిరిడీ పొలిమేరలలో ఉన్న కాలువలో బాబా బట్టలు ఉతికి తెచ్చేవాడిని. మసీదు, చావడి వాటి పరిసరాలు శుభ్రంగా చిమ్మేవాడిని. దీపాలు తుడిచి నూనె పోసి పెట్టేవాడిని. బావి నుండి నీరు తోడి తెచ్చేవాడిని. బాబా తిరిగే వీధులన్నీ చిమ్మడమేగాక మలాన్ని కూడా ఎత్తి పారేసేవాడిని. బాబా నన్ను ***"హలాల్‌కుర్"*** అని ***"మై మిరియాంబి"*** ***(నా పాకీవాడా!)*** అని పిలిచేవారు. ఆయీ శిరిడీలో నివసించే తొలిరోజులలో ఆమె వీధులను చిమ్మి శుభ్రపరిచేది. నేను ఆ పనిలో ఆమెకు సహాయపడేవాడిని.

నా ప్రాపంచిక, ఆధ్యాత్మిక అవసరాలన్నీ బాబానే చూసుకొనేవారు, చూస్తున్నారు. రాధాకృష్ణ ఆయీ చనిపోయిన చాలాకాలం తరువాత, బాబా మహాసమాధి అనంతరం- అంటే 1927 ప్రాంతంలో ఆమె నివసించిన 'శాల'లో ఒకరోజు ఖురాన్‌లోని శ్లోకాలను మననం చేసుకుంటూ ఉన్నప్పుడు, శిథిలావస్థలో ఉన్న శాల యొక్క మూడు మట్టిగోడలు హఠాత్తుగా కూలిపోయాయి. నడుము వరకు ఆ శిథిలాలలో నేను కూరుకుపోయాను. అయినా నాకు ఏ ప్రమాదం జరగకుండా బాబానే నన్ను కాపాడారు. బాబా నన్ను ఆశీర్వదించి వారి చెంతనే ఉంచుకున్నారు. బాబాను సేవించుకోమని మొదట నా గురువైన అమీరుద్దీన్

నన్ను ఆదేశించారు. నేను అలాగే చేశాను. ఒకసారి ఆయన శిరిడీ వచ్చి నన్ను తమతో రమ్మని పిలిచారు. బాబా ఆదేశిస్తే వస్తానని చెప్పాను. కానీ బాబా అలాంటి ఆదేశమేదీ ఇవ్వనందున నేను శిరిడీలోనే బాబా వద్ద ఉండిపోయాను. అమీరుద్దీన్ శిరిడీ నుండి వెళ్ళిపోయారు.

బాబా నన్ను ఆశీర్వదించే తీరు విచిత్రంగా ఉండేది. ఒక్కొక్కసారి వారి ఆశీర్వాదం తిట్లు, దెబ్బల రూపాలలో ఉండేది. చాలాసార్లు నన్ను, జోగ్‌ను కొట్టేవారు. నాతో 1. ***"తేరేకు దరియాకు పార్ ఉతార్ దియా"***, 2. ***"తేరా మట్టి సోనా బనాదియా"***, 3. ***"క్యా బడీ మాడీ భాంధీయా"*** అనేవారు.[1]

బాబా ఉదయాన్నే చావడిలో కూర్చొని పైవిధంగా నన్ను ఆశీర్వదించి, మసీదుకు బయలుదేరేవారు. వారు తరచుగా అవతారాల గురించి చెబుతుండేవారు. వారు చెప్పినవన్నీ ఈ పుస్తకంలో వ్రాయడం జరిగింది.

(అబ్దుల్ ఒక పాత పుస్తకాన్ని తీసి చూపించాడు. అందులో కొన్ని భాగాలు దేవనాగరిలో, కొన్ని మోడీలో మరికొన్ని ఉర్దూలో ఉన్నాయి. ఇవి ఎవరు వ్రాసారో చెప్పేందుకు అతను ఇష్టపడలేదు. తోటి భక్తుల అభిప్రాయం ప్రకారం ఇవన్నీ వ్రాయడానికి కావలసిన పరిజ్ఞానం అబ్దుల్‌కు లేదని తెలిసింది. కానీ ఈ రచయిత (బి.వి. నరసింహస్వామి) ప్రార్థన మేరకు పుస్తకంలో వ్రాసి ఉన్న ప్రవచనాలను అబ్దుల్ చదివి వినిపించాడు).

**బాబా అవతారాల గురించి చెప్పినది క్రింది విధంగా వ్రాయబడి ఉంది:**

బాబా మొదట చెప్పింది, ఓంకార్, ఓంకార్ సే భవాకార్, భవాకార్ సే ఆద్, ఆద్ సే అలేక్, అలేక్ సే నిరంజన్, నిరంజన్ సే నిరాకార్, నిరాకార్ సే నీళ్, నీళ్ సే అనీళ్, అనీళ్ సే సున్నే.

*1) వీటి భావం: 1. నీవు భవసాగరాన్ని దాటడానికి తోడ్పడ్డాను - 2. నీ మట్టిని బంగారంగా మార్చాను - 3. ఎంత పెద్ద భవనాన్ని కట్టి ఇచ్చాను- మొదటిరెండూ నా ఆధ్యాత్మిక ప్రగతి గురించి బాబా చెప్పివుండవచ్చు. మూడవది నా భవిష్యత్తును సూచిస్తూ చెప్పినది అయి ఉండవచ్చు. బాబా సమాధి చెందిన తర్వాత నేను సమాధి పూజ నిర్వహిస్తూ 8, 9 సంవత్సరాలు బూటీవాడాలోని గదిలో నివసించేవాడిని.*

కేశవ్, అమ్రూ, ఉత్తర్, పూర్వ్, పిర్‌రక్ష్, పిర్ మత్స్యావతార్, మనాయత్, అస్మిత్ర్ జమ్రిద్, భగ్‌రిధ్ (భగీరథ్?), ఉచ్చాయత్ దేఖాయత్, భలింతర్, తిర్‌మక్ర్ (త్రయంబకా?), కఛావతార్, ఉచ్చాయత్, దేఖాయత్, ప్రజాయత్, ఉగ్రసేన్, కదిన్, డాల్‌బారక్షర్ వరాహావతార్, ఖలీపత్, గోత్రం, విష్ణు, హరితక్, బబ్రసేర్.

నరసింహావతార్, సేజ్‌వార్ రేవక్, బన్దోపస్త్, బైల్‌చంద్, కాసిప్ (కాశ్యప్), వామనావతార్.

షాన్, జాన్, మ్యాన్, నూర్, తేజ్, కమల్, కాదరమ్, అద్‌భుద్, గస్తత్వా, కబూబై, హరిపర్వా, అనార్థ్, జయవ్, అవి, ఆతస్తధర్మ్, మాంధాతా, విశ్రణ్, జమదగ్ని, పరశురామావతార్, రాజాజీ జాతీ, కవాదిక్, రాజా దశరత్, రామ్‌చంద్రజీ అవతార్, అంకుశ్, ఆజ్ఞాపురూష్, హిర్‌పాల్, భజాల్, పిత్రూ (పృధు), ఇదురత్ (యదు?), సుర్‌సేన్, వాసుదేవ్, శ్రీకృష్ణాజీ అవతార్, ప్రతిమదన్, (ప్రద్యుమ్న్) అనురూదస్ (అనిరూద్ధ్), ఇసితహర్ బద్ధా (బుద్ధా?), జలీ అవతార్ (కలీ).

బ్రాహ్మణ్ హువా, రాజపుత్‌హువా, గౌలీహువా, బాద్ ముసల్‌మాన్ హువా, చతురూయుగ్మే చార్ అవతార్, (నిఖాల్ = కృతయుగ?), తీర్థామే తీన్ అవతార్ (= త్రేతాయుగ), ద్వాపర్‌మే దోణ్, అథర్వణ్ మే ఏక్ అవతార్.

మస్త్య, కచ్ఛ్, వరాహ్, నార్‌సింహ్, వామన్, పరశురామ్, కృష్ణాజీ బోద్ధో భీ కల్కి.

యానేం ఇబ్రహీం చార్ వేద్ కియే। ఎటేరావూకు వాస్తే కలమ్ షరీఫ్ ఉతారా హై.

ఖుదాకీ ఖుద్‌రత్ ఖుదా హీ జానేం। హర్ వేద్‌మే హజారో అవతార్ నికాలే.

మగర్ హర్ జమానేకీ ఇవాదత్ జుదా జుదా హై। యుబీహై హిందుస్థాన్ గాడీపర్

ఆట్ బాద్‌షాహ్ బాద్‌షాహీ కరేంగా। ఏ కబర్ అటారా పురాణ్‌మే హై॥

(ఇంకా చాలా ఉన్నప్పటికీ, అబ్దుల్ చాలా నెమ్మదిగా చదవడంతో, అదంతా చదవడానికి సమయం లేకపోయింది).

# 20

## సెప్టెంబరు 11వ తేదీ, 1936- థానా

**అబ్దుల్ రహీం శంశుద్దీన్ రంగారీ,** పెయింటర్, వయస్సు 65సం॥లు, ముసల్మాను, మహాగిరి, థానా.

1913లో థానాలోనే కాకుండా శిరిడీలో కూడా ప్లేగు వ్యాపించి ఉంది. అప్పుడు నా భార్య ఏదో తెలియని జబ్బుతో నెల రోజుల నుండి బాధపడుతూ ఉంది. ఆమె గొంతు, దవడలు వాచి, ఏమీ తినలేని పరిస్థితి ఏర్పడింది. ఎన్నో మందులు వాడాము. కానీ ఫలితం లేకుండా పోయింది. మా పొరుగున నివసించే స్థానిక ప్లీడరు అయిన ఆర్.జి. గుప్తె అనునతడు నా భార్యను శిరిడీలో ఉన్న సాయిబాబా వద్దకు తీసుకువెళ్ళమని, అలా చేస్తే ఆమె జబ్బు నయమవుతుందని సలహా ఇచ్చాడు. అతని సలహా పాటించి శిరిడీ బయలుదేరాం. ప్రయాణం మొదలైనప్పుడు ఆమె ఏమీ తినలేని పరిస్థితిలో ఉంది. కానీ మార్గమధ్యంలో ఇగత్‌పురిలో ఆమె టీ త్రాగగలిగింది. నాశిక్‌లో కొంచెం ఆహారం తీసుకోగలిగింది. ఇది ఒక శుభ సూచకం. ఆమె త్వరగా కోలుకోసాగింది. మేము శిరిడీ చేరాము. నేను మసీదులోనికి వెళ్ళి బాబాకు నమస్కరించాను. వారు హిందూస్థానీలో మాట్లాడారు.

*బాబా : ఎక్కడ నుండి వస్తున్నావు?*

నేను : థానా.

*బాబా : దేనికోసం?*

నేను : నా భార్య గొంతువాపుతో బాధపడుతోంది.

*బాబా : ఆమెను మసీదులోనికి రమ్మని చెప్పు.*

ఆమెను లోనికి తీసుకువెళ్ళాను. ఆమె బాబాకు నమస్కరించగా, బాబా ఆమె శిరస్సుపై తమ హస్తాన్నుంచి *"భగవంతుడు మంచి చేస్తాడు (ఖుదా అచ్ఛా కరేగా)"* అని ఆశీర్వదించారు. బాబా అడగకుండానే నేను వారికి రూపాయి నాలుగు అణాల దక్షిణ సమర్పించాను. వారు స్వీకరించి ఊదీని ప్రసాదించారు. తరువాత మేము రెండు గంటలు అక్కడే గడిపాము. నా భార్య గొంతు, దవడవాపు త్వరత్వరగా తగ్గిపోసాగాయి. కనుక ఇంక అక్కడ నుండి బయలుదేరవచ్చనిపించింది. కానీ

బాబా నన్ను అక్కడే ఉండమన్నారు. నా భార్య, రెండేళ్ళ కొడుకుతో క్రొత్త ప్రదేశంలో ఉండటం ఇష్టంలేక బాబా అనుమతి తీసుకోకుండానే ఇంటికి బయలుదేరాము.

మేము వచ్చిన టాంగా గ్రామంలో ఉంది. మేము దానిలోనే తిరిగి కోపర్‌గాంకు బయలుదేరాము. సగం దూరం వెళ్ళేంతవరకు మాకు ఏ ఇబ్బందీ కలగలేదు. కానీ కొద్దిసేపటి తరువాత టాంగా ఇరుసు విరిగిపోయింది. అప్పుడు రాత్రి 10 గంటలయింది. వేరే వాహన వసతి లేక నిర్మానుష్యమైన దారిలో చిక్కుకొనిపోయాము. ఆ రాత్రివేళ మేము అన్ని మైళ్ళ దూరం వెనుకకు నడవలేము ముందుకూ వెళ్ళలేము. మరోప్రక్క దారిదోపిడి దొంగల భయం. తలదాచుకునేందుకు చోటు లేక చలిలో వణుకుతూ రెండు గంటలు గడిపాము. అటువంటి ఇబ్బందికర పరిస్థితి ఎవరికీ రాకూడదు. బాబా మాటలు పెడచెవిన పెట్టినందుకు చింతించాం. అర్ధరాత్రి దాటిన తరువాత ఏదో బండి వస్తున్న చప్పుడు వినిపించింది. బండివాడు "థానావాలా, థానావాలా!" అని అరుచుకుంటూ వస్తున్నాడు. నేనతనిని ఆపి నేనే థానావాలా అని చెప్పాను. "ఈ అర్ధరాత్రి సమయంలో మా దుస్థితి ఎలా తెలిసింది? ఇక్కడికి ఎలా వచ్చావు?" అని ఆ టాంగావాలాను అడిగాను. నన్ను బాబా పంపించారని అతను చెప్పాడు. "ఎందుకోసం?" అని నేను అడిగాను. "మిమ్మల్ని తీసుకువెళ్ళడానికి!" అని చెప్పాడు. తరువాత మేము ఆ టాంగా ఎక్కి శిరిడీకి చేరాము. మేము మసీదు చేరేసరికి రాత్రి 1 లేక 2 గంటలై ఉంటుంది. బాబా మమ్మల్ని చూస్తూనే ***"నా అనుమతి లేకుండా మీరు వెళ్ళారు. అందుకే ఇలా అయ్యింది"*** అన్నారు. "మీ అనుమతి తీసుకోకుండా వెళ్ళినందుకు క్షమించండి" అన్నాను. అప్పుడు బాబా మమ్మల్ని ఆ రాత్రి మసీదు వద్దే ఉండమని చెప్పారు. తరువాత వారు లోపలికి వెళ్ళి, తమ సహజరీతిలో ధ్యానమగ్నులయ్యారు.

మరుసటి ఉదయం బాబా భిక్షకు వెళ్ళి రొట్టెలు, కూర తీసుకువచ్చారు. వారు కొంత తీసుకున్న తరువాత మిగిలినది మాకు ఇచ్చి తినమన్నారు. మేము తిన్నాం. బాబా ఇచ్చిన రొట్టెను నా భార్య తినగలిగింది. మేము శిరిడీలో ఆ రోజు గడిపిన 2 గంటల సమయంలో వారితో మాట్లాడినది చాలా తక్కువ. నేను బాబా చేతులకు, నుదుటికి చందనం పూసి ఉండటం గమనించాను. ముస్లింలు ఇలా చందనం పూసుకోరు కదా, మీరు ఎందుకు అంగీకరించారు అని బాబాను

అడిగాను. బాబా *"జైసా దేశ్ తైసా వేశ్ (ఏ దేశంలో ఉంటే ఆ దేశకాల పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవాలి)"* అన్నారు. *"వాళ్ళు తమ తమ దైవాలను పూజించడానికి బదులు, నన్ను వాళ్ళ దేవునిగా భావించి పూజిస్తున్నారు. దానికి నేనెందుకు అభ్యంతరం చెప్పి వారిని నొప్పించాలి? నేను కూడా భగవంతుని భక్తుడినే"* అని కూడా అన్నారు. తరువాత మా సంభాషణ ఇలా జరిగింది:

బాబా : *నీవు నిన్న వచ్చివుంటే బాగుండేది!*

నేను : ఎందుకు?

బాబా : *నిన్న భజన జరిగింది. రాత్రంతా నేను ఏడ్చాను. వాళ్ళు నన్ను తిట్టారు.*

నేను : వాళ్ళు మిమ్మల్ని ఎందుకు తిట్టారు?

బాబా : *నేను 'తిట్టారు' అని చెబితే అందరూ అర్థం చేసుకోలేరు. కానీ, నీవు అర్థం చేసుకోగలవు.*

(మహాత్ములు నింద, స్తుతులను సమభావంతో స్వీకరిస్తారు. కొందరైతే స్తుతిని 'నింద' అని వ్యవహరిస్తారు. పైన ఉదహరించిన భజనలో బాబాను గొప్పగా కీర్తించి ఉంటారు. బాబా ఆ స్తుతిని తమ స్వాభావిక రీతిలో 'నింద' అని ప్రస్తావించారు. భగవంతుని సంకీర్తనలో హృదయాన్ని ద్రవింపజేసే సంగీతం ఆర్తి ఆర్ద్రతలతో సంగమించినప్పుడు మహాత్ముల చేత కూడా కన్నీరు పెట్టిస్తుంది.)

నేను : భగవంతుని స్తుతిస్తూ పాడుతున్నప్పుడు భక్తుడు ఏడుస్తాడు, నవ్వుతాడు, నృత్యం కూడా చేస్తాడు.

బాబా : *అవును. నీవు చెప్పినది నిజమే! నీకు నీ గురువున్నారు కదా?*

నేను : ఉన్నారు. వారి పేరు హబీబలీషా చిస్తీ నిజామి.

బాబా : *అందుకే నీవు సరిగ్గా అర్థం చేసుకోగలిగావు.*

మా గురువు నేనిక్కడికి రావడానికి 12 సంవత్సరాల ముందే సమాధి చెందారు. వారు బయటకు వెళ్ళినప్పుడు భక్తులు సంగీత వాయిద్యాలతో ఆయన్ను అనుసరించేవారు. నాకు వెంటనే ఆ విషయం గుర్తుకు వచ్చింది.

తరువాత బాబా మాకు ఇంటికి వెళ్ళడానికి అనుమతించారు. నేను బయటికి వెళ్ళి టాంగా కోసం చూసాను. ఎంత సేపు చూసినా టాంగా కనపడలేదు.

నేను తిరిగి వెళ్ళి బాబాకు ఆ విషయం చెప్పాను. బాబా ***"వెళ్ళి చూడు! అక్కడ ఒక టాంగా ఉంది"*** అన్నారు. నేను వెళ్ళి చూసాను. నిజంగానే అక్కడ టాంగా ఉంది. అకస్మాత్తుగా అక్కడికి టాంగా ఎలా వచ్చిందో మాకు అర్థం కాలేదు. బాబా ఆశీర్వాదాలు పొంది మేము తిరిగి వచ్చాం. నా భార్య ఆరోగ్యం బాగయింది. ఆ తరువాత ఏడు సంవత్సరాలకు ఆమె చనిపోయింది.

నేను శిరిడీ వెళ్ళింది ఒక్కసారి మాత్రమే అయినా నాకు బాబాపై అపార నమ్మకం ఏర్పడింది. ప్రతిరాత్రి నిద్రించేముందు వారిని, ఇతర సాధువులను స్మరించుకుంటాను. నేను బాబాను ఆర్తిగా తలచుకున్నప్పుడు వారు నాకు దర్శనమిస్తారు.

## 21

## సెప్టెంబరు 26వ తేదీ, 1936- బాంద్రా

**రజబ్అలి మహమ్మద్,** కాంట్రాక్టరు, వయస్సు 49 సం॥లు, ఖోజా, టర్నర్ రోడ్డు, బాంద్రా.

బాబా సమాధి చెందడానికి దాదాపు 8 సంవత్సరాల ముందు, వారిని గురించి ఇక్కడి వాళ్ళు గొప్పగా చెప్పడంతో నేను బాబాను దర్శించాను. నేనప్పుడు నా వ్యాపార నిమిత్తం నాశిక్ వెళ్ళాను. నేను అక్కడకు వెళ్ళినప్పటికీ సరుకు (చెట్ల బెరడు) అందివ్వడంలో జాప్యం జరిగింది. నాశిక్‌లో వ్యర్థంగా కాలం గడపడం ఇష్టం లేక, శిరిడీ వెళ్ళి సాయిబాబాను దర్శించాను. నేను సాయిబాబాను అద్భుత శక్తులు కలిగిన గొప్ప మహాత్మునిగా భావించేవాడిని. ఆత్మజ్ఞానం కలవారికి మాత్రమే ఆ అద్భుతశక్తులు సాధ్యమవుతాయి. వారికొక టెంకాయ, కలకండ సమర్పించాను. వారు నన్ను దక్షిణ అడుగలేదు, నేనివ్వలేదు. తరువాత "నేను ఈ రోజుగానీ లేదా రేపు ఉదయంగానీ బయలుదేరడానికి అనుమతించమని" వారిని కోరాను. సాయిబాబా *"అతను నీకు సరుకు ఇవ్వడానికి ఇంకా సిద్ధంగా లేడు"* అన్నారు. సరుకు ఇవ్వనప్పుడు నాశిక్‌లో నేను చేసేదేమీ లేదు. అందువల్ల సాయిబాబా సన్నిధిలోనే రెండు మూడు రోజులు గడపడానికి నిర్ణయించుకొని అక్కడే ఉండిపోయాను. నేను ప్రత్యేకించి వారిని ఏ కోరికతోనూ దర్శించలేదు. వారిపై నాకున్న నమ్మకాన్ని దృఢపరిచేటట్లు చేయమని మాత్రం వారిని ప్రార్థించాను. వారిపై సంపూర్ణ విశ్వాసంతో చనిపోతే నాకు సద్గతి లభిస్తుందన్న ఉద్దేశ్యంతో మనసులోనే దాని కొరకు వారిని ప్రార్థించాను. బాబా నా తలపై వారి హస్తాన్నుంచి ఆశీర్వదించారు. వారి ఆశీర్వాదం ఫలించి నా నమ్మకం క్రమేణా వృద్ధి చెందింది.

బాబా ఊదీపై కూడా నాకు అపారమైన నమ్మకముంది. ఈ ఊదీని ఛాతికి, కళ్ళకు, నుదుటికి పూసుకొని బాబాను ధ్యానించేవాడిని. నా కష్టాలన్నీ సమసిపోయేవి. ఇంకా వివిధ సందర్భాలలో ఊదీని ఉపయోగించి సత్ఫలితాలు పొందేవాడిని. ఐదు సంవత్సరాల క్రితం నా గేదె ఒకటి ఈనలేక చాలా అవస్థపడింది. దాని బాధ చూడలేక పశువుల డాక్టరును పిలిపించాను. నేను మునిసిపాలిటీలో శానిటరీ కమిటీకి ఛైర్మన్‌ను అయినందువల్ల అతను వచ్చి గేదెకు చికిత్స చేశాడు కానీ ప్రయోజనం లేకపోయింది. నేను బాబాను ధ్యానించి దాని తలపై ఊదీ రాసాను.

పది నిముషాల తరువాత అది సునాయాసంగా ఈనింది. అలా ఎన్నో సందర్భాలలో ఊదీ సత్ఫలితాలను ఇచ్చింది.

శ్రీసాయిబాబా (ఇప్పటికీ) గొప్ప శక్తులు గల సిద్ధపురుషుడని చెప్పడానికి నాకు ఎలాంటి సందేహమూ లేదు. సాధు సత్పురుషులు ఒక స్థితి నుండి మరొక స్థితికి వెళతారే తప్ప వారికి మరణం లేదని ఇస్లాం సాంప్రదాయం చెబుతుంది. నేను ఎందరో మహాత్ముల సమాధులను (ఢిల్లీలో) దర్శించాను మరియు సశరీరులుగా ఉన్న నాగ్‌పూర్‌కు చెందిన తాజుద్దీన్ బాబా, పూనాకు చెందిన బాబాజాన్ మొదలైన మహాత్ములను దర్శించాను (1928). నాకు అనేక అనుభవాలు ఉన్నాయి. ఇవి నా సద్గతి కొరకు విశ్వాసాన్ని పెంచడమే కాక నాకు ప్రాపంచిక ప్రయోజనాన్ని కూడా చేకూర్చాయి.

'నీవు విడిగా వంద ప్రార్థనలు చేయడం కన్నా ఒక మహాత్ముని సన్నిధిలో గడపడం ఎంతో ఉత్తమమ'ని ఒక నానుడి ఉంది. దానిని నేను గట్టిగా నమ్ముతాను, ఆచరిస్తాను. మా ఇంటిలో సాయిబాబా పింగాణి విగ్రహము మరియు సాయిబాబా పటము ఉన్నాయి. మా కుటుంబమంతా ప్రతి గురువారం ఆ విగ్రహం ముందు సాంబ్రాణికడ్డీలు వెలిగిస్తాము.

## 22

## డిసెంబరు 15వ తేదీ, 1936- బాంద్రా

**ఆదం దలాలి,** ఎస్టేట్ బ్రోకరు (దళారి), వయస్సు సుమారు 70 సం॥లు; నౌపాడ మసీదు దగ్గర, బాంద్రా.

నేను ఎంతోకాలం నుండి శ్రీసాయిబాబా భక్తుడను. వారితో నాకున్న అనుభవాలు శ్రీసాయిలీలా మాసిక్ పత్రికలో ప్రచురింపబడ్డాయి. చాలాకాలం నుండి నేను బాబా వద్దకు వెళుతున్నాను. వారు దయామయులు, గొప్ప దాతృత్వము కలవారు. వారు నాకు ఎన్నో సందర్భాలలో సహాయపడ్డారు. ముఖ్యమైనవి కొన్ని వివరిస్తాను.

నా కుమారుని వివాహం జరుపదలచి బాబా అనుమతి కోసం వారిని ఎన్నోసార్లు ప్రార్థించాను. అడిగిన ప్రతిసారీ బాబా వాయిదా వేస్తూ వచ్చారు. నేను ఎన్నో ఉత్తరాలు కూడా వ్రాసాను. ప్రతిసారి వారి దగ్గర నుండి వచ్చే సమాధానం ***"అల్లా మాలిక్ హై"*** అని మాత్రమే! ఇలా 3 సంవత్సరాలు గడిచిన తరువాత వారు నా కుమారుని వివాహానికి అంగీకరించడమే కాక, తేదీని కూడా నిర్ణయించి, వివాహం జరిపించమని నన్ను ఆదేశించారు. నేను సంతోషించాను. కానీ పేదవాడిని అయినందువల్ల నా దగ్గర డబ్బు లేదు. పెండ్లికుమార్తె తరఫున ఖర్చులు కూడా నేనే భరిస్తానని ఒప్పుకున్నాను. నేను బాబా సహాయాన్ని అర్థించాను. నాకు బాబా ఎలా సహాయపడ్డారో వివరిస్తాను. వివాహానికి 10 రోజుల ముందు నాకు అనుకోని విధంగా ఒక పని దొరికి వెంటనే డబ్బు సమకూరింది. నాకు కొంత ఊరట కలిగింది. ఆ విధంగా వివిధ పనుల ద్వారా అందిన డబ్బుతో నా కుమారుని వివాహాన్ని బాబా నిర్ణయించిన తేదీకే జరిపించగలిగాను (1913-14).

బాబా మహాసమాధికి కొంతకాలం ముందు నా వ్యాపారానికి సంబంధించిన విషయంలో వారు సహాయం చేశారు. ఒక వ్యక్తి తన భవంతిని తాకట్టుపెట్టి మార్వాడీ దగ్గర డబ్బు తీసుకున్న వ్యవహారంలో నేను దళారిగా ఉన్నాను. ఆ భవంతి తాలూకు పట్టాకాగితాలు కలెక్టరు మంజూరు చేసినట్లుగా ఉన్నాయి. కానీ తరువాత అవి నిజమైనవి కావని నకిలీవని తేలాయి. నాకు ఆ వ్యక్తి గురించి గానీ ఆ పత్రాల గురించి గానీ ఏమీ తెలియదు. కానీ నకిలీ పత్రాలు ఉపయోగించినందుకు నా మీద మరియు

ఆ వ్యక్తి మీద పోలీసులు ఛార్జిషీటు దాఖలు చేశారు. నేను బాబా దగ్గరకు వెళ్ళి వారి సహాయం కొరకు ప్రార్థించాను. బాబా ***"భయపడకు. అంతా సవ్యంగా జరుగుతుంది"*** అన్నారు. నేను టెండూల్కర్ ఇంటికి వెళ్ళి ఆయన శ్రీమతితో, బాబాను నా కొరకు ప్రార్థించమని వేడుకొని, ఆమెను 'నీవు విడుదలవుతావు' అని అనమన్నాను. ఆమె అలాగే అన్నది. ఆ రోజే కేసు నుండి నన్ను విడుదల చేశారు. ఆ కుదవ పెట్టిన వ్యక్తిని కోర్టులో ప్రవేశపెట్టి, నన్ను ప్రభుత్వ న్యాయవాది తరపు సాక్షిగా విచారించారు.

ప్రాపంచిక విషయాలలో నాకెన్నో అనుభవాలు కలిగాయి కానీ నాకవి ఇప్పుడు గుర్తులేవు. నేను ఖురాను చదవలేదు. బాబాను ఆధ్యాత్మిక విషయాల గురించి అడగనూ లేదు. బాబా కూడా నన్ను ఖురాను చదవమని చెప్పడంగానీ, నాతో ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడటంగానీ చేయలేదు. కానీ బడేబాబాతో మాత్రం ఖురాను చదవమని బాబా చెబుతుండేవారు. ముస్లిం పండితులుగానీ, ప్రముఖులుగానీ బాబాను దర్శించినట్లుగా నాకు గుర్తులేదు.

బాబా వివిధ రూపాలలో నా దగ్గరికి వచ్చి పరీక్షించేవారు. ఒకసారి ఒక బ్రాహ్మణునిగా నా దగ్గరికి వచ్చి భిక్ష అడిగారు. నేనతనికి రెండణాలు ఇచ్చి పంపాను. మరొకసారి ఒక మార్వాడీగా వచ్చి తనకు ఆకలిగా ఉందని చెప్పారు. నేను అతనికి నాలుగణాలు (పావలా) ఇచ్చి మార్వాడీ హోటలులో భోంచేయమని చెప్పి పంపాను. ఆ తరువాత నేను శిరిడీ వెళ్ళినప్పుడు బాబా కొన్ని ప్రత్యేకమైన సూచనల ద్వారా నా వద్దకు ఆ రూపాలలో వచ్చినట్లు తెలియజేసారు. ఇంకోసారి ఆ రెండవ సందర్భం గురించి చెబుతూ బాబా నన్ను చూపించి (శిరిడీలో) ఒక భక్తునితో ***"నేనితని వద్దకు వెళ్ళాను. ఇతడు నన్ను మార్వాడీ హోటలుకు పంపి భోంచేయమన్నాడు"*** అని చెప్పి నా నమ్మకాన్ని దృఢపరిచారు.

బాబా ఊదీని, తీర్థాన్ని నేనెల్లప్పుడూ ఉపయోగిస్తాను. వాటిపై నాకు అపారమైన నమ్మకముంది. నేను మా ఇంట్లో బాబా పటాన్ని పెట్టి ప్రతిదినం ఫోటో ముందు సాంబ్రాణి కడ్డీలు వెలిగిస్తాను. నేను ఇప్పటికీ శిరిడీకి వెళుతుంటాను.



కాళోజీ




నందారాం మార్వాడీ

## 23

## డిసెంబరు 8వ తేదీ, 1936- శిరిడీ

**నందారాం శివరాం మార్వాడీ,** షరాబు- వ్యాపారి, వయస్సు 70 సం॥లు, తండ్రి: శివరాం మార్వాడీ, శిరిడీ.

శిరిడీలో రెండవసారి ప్లేగు వ్యాపించినప్పుడు (1911) గ్రామస్థులందరూ శిరిడీ విడిచి వెళ్ళడం ప్రారంభించారు. అలాంటి సమయంలో నేను వీధిలో వెళుతుండగా మారుతీ ఆలయం వద్ద ఉన్న కొంతమంది నన్ను చూసి నా కళ్ళు ఎర్రగా ఉన్నాయని (జ్వరం వల్ల) నాకు ప్లేగు సోకి ఉంటుందని అన్నారు. నేను భయంతో వణికిపోయాను. గ్రామస్థుల సలహాపై మారుతీ దేవాలయానికి గుర్రంపై వెళ్ళి నూనె దీపం వెలిగించి, టెంకాయ కొట్టి నన్ను కాపాడమని మారుతిని వేడుకున్నాను. శిరిడీ విడిచి రహతా సమీపంలోని ఎక్రూఖా అను గ్రామానికి వెళ్ళడం మంచిదనిపించి బాబా వద్దకు వెళ్ళి వారి అనుమతి కోరాను. నేనెక్కడికీ వెళ్ళనవసరం లేదని, నేను మరణించే ప్రసక్తిలేదని బాబా అభయమిచ్చారు. ఇంకా ***"నేను చనిపోయేంత వరకు నిన్ను చావనివ్వను!"*** అని హామీ ఇచ్చి ఊదీ ప్రసాదించారు. నేను శిరిడీలోనే ఉండిపోయాను. నా జ్వరం తగ్గిపోయింది.



లక్ష్మణ్ గోవింద్ ముంగే

# 24

## అక్టోబరు 15వ తేదీ, 1936- నాశిక్

**లక్ష్మణ్ గోవింద్ ముంగే,** అర్జీల లేఖకుడు, వయస్సు 72 సం॥లు, నెం.43, మెయిన్ రోడ్డు, నాశిక్.

నేను బాబా దగ్గరకు 46 సం॥ల క్రితం వెళ్ళాను. మా బంధువులైన వామనరావు రంగ్‌నాథ్ విజాపూర్‌కర్, అతని సోదరుడు సఖారాం శిరిడీలో ఉండేవారు. (వాళ్ళు ఇప్పుడు లేరు). నేనప్పుడు చిదంబర్ కేశవ్ గాడ్గిల్ అను సీనియర్ మామ్లత్‌దార్ వద్ద గుమాస్తాగా పనిచేస్తూ ఉండేవాడిని. ఒకసారి చిదంబర్ కేశవ్ గాడ్గిల్, నానాసాహెబ్ నిమోణ్కర్‌లు బాబాను దర్శించడానికి శిరిడీ వెళుతుండగా వారితో నేనూ వెళ్ళాను. ఆ మునుపటి రాత్రి గదిలో మేము ముగ్గురం మాత్రమే ఉండగా, పడుకోబోయే ముందు గాడ్గిల్ బాబాకు సమర్పించడానికి కొన్ని ఖర్జూరపు పండ్లు, సాంబ్రాణికడ్డీ ప్యాకెట్టు, ఒక రూపాయి ప్రత్యేకించి విడిగా పెట్టుకున్నాడు. మరుసటి ఉదయం మేం ముగ్గురం బాబాను దర్శించాము. ముస్లిం ఫకీరైన బాబాను హిందువులు పూజించడం చూసి నేను ఆశ్చర్యపోయాను. అప్పుడు బాబా గాడ్గిల్‌ను *"నా ఖర్జూరపు పండ్లు, సాంబ్రాణికడ్డీ ప్యాకెట్టు, ఒక్క రూపాయి నాకు ఇవ్వు"* అన్నారు. ఈ మాటలు విని నేను నిశ్చేష్టుడనయ్యాను. వారు సర్వజ్ఞులని అర్థమయ్యింది. గాడ్గిల్ ఆ మూడింటిని బాబాకు సమర్పించాడు. బాబా స్వీకరించారు. నానాసాహెబ్ నిమోణ్కర్ తనంతట తానే బాబాకు 10 రూపాయల నోటు ఇవ్వబోయాడు. *"నేను ఫకీరును. ఈ డబ్బును తీసుకోను"* అంటూ బాబా తిరస్కరించారు. తరువాత గాడ్గిల్ నుండి స్వీకరించిన వాటిని క్రింది విధంగా ఉపయోగించారు. మసీదులో వెలిగించే దీపాలకు నూనె పోయడానికి రూపాయిని నూనె వర్తకునికిచ్చారు. సాంబ్రాణికడ్డీలు వెలిగించి పెట్టారు. ఖర్జూరపు పండ్లను అక్కడున్న భక్తులకు పంచారు. ఇది చూసిన తరువాత బాబా ఒక మహనీయులని వారిని పూజించడం సరియైనదే అనిపించింది.

నా 26వ ఏట 1890లో నేను బాబాను దర్శించాను. వారప్పుడు రహతాలోని మారుతీ దేవాలయంలో ఉన్నారు. నా వివాహం నిశ్చయమైంది. కానీ పెళ్ళికూతురును అలంకరించడానికి నా దగ్గర నగలు లేవు. రహతాలో ఉన్న మా

మేనత్త భర్త నుండి సహాయం పొందడానికి వెళ్ళాను. బాబాను దేవాలయంలో చూసి వారి వద్దకు వెళ్ళగా *"బిడ్డా, రా! నిన్న నీ గురించే ఆలోచిస్తున్నాను"* అంటూ ఆహ్వానించారు. బాబా తమ కాళ్ళు వత్తమన్నారు. నేను అలాగే చేశాను. వారు నాకు ఒక మామిడిపండు ఇచ్చి తినమన్నారు. నేను తిన్నాను. అది ఎంతో మధురంగా ఉంది. తరువాత బాబా నన్ను ఇలా ప్రశ్నించసాగారు.

*బాబా : నువ్వు దేనికోసం వచ్చావు?*

నేను : నా వివాహం నిశ్చయమైంది. నా వద్ద నగలు లేవు. వాటిని అరువు తీసుకోడానికి వచ్చాను.

*బాబా : ఎవరికి ఎవరు? ఇచ్చేదెవరు, పుచ్చుకునేదెవరు? అవసరానికి ఎవరూ సహాయం చేయరు. నీకు అవసరమైతే 1000 రూపాయలు గానీ, 2000 రూపాయలుగానీ (వాటికి సరిపడా నగలు) నా దగ్గర నుండి తీసుకో!*

గోనెగుడ్డలు ధరించి చేతిలో ఒక రేకుడబ్బా పట్టుకొని ఉన్న ఈ ఫకీరు నాకు ఇవన్నీ ఎలా ఇవ్వగలడని తలచాను.

నేనక్కడ నుండి మా మేనత్త ఇంటికి వెళ్ళాను. మా మామతో నా అవసరాన్ని గురించి చెప్పాను. మా మామ తన దగ్గర నగలేమీ లేవని చెప్పాడు. ప్రస్తుతానికి వివాహం వాయిదా వేసుకోక తప్పదన్న బాధతో వెనుదిరిగాను. అదే సమయంలో నా స్నేహితుడొకడు కలిసాడు. అతడికి విషయమంతా చెప్పాను. అతని మధ్యవర్తిత్వంతో సిన్నేరుకు చెందిన ఒక గుజరాతీ షావుకారు కాలి అందెలు, ముక్కుపుడక అరువుగా ఇచ్చాడు. తరువాత 30 తులాల బంగారంతో నాకు అవసరమైన నగలు ఒక్కరోజులో తయారు చేయించి అప్పుగా (వడ్డీ చెల్లించేటట్లు) ఇచ్చాడు. అనుకున్న ముహూర్తానికే నా వివాహం జరిగింది. ఈ విధంగా నా స్నేహితుడు మరియు గుజరాతీ షావుకారుల ద్వారా నాకు సహాయం అందేలా చేసి బాబా తాము ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఈ సంఘటన జరిగిన తరువాత నేను ప్రతి సంవత్సరం శిరిడీ వెళ్ళి బాబాను దర్శించుకునేవాడిని.

నాకు మొదట్లో కొంతమంది బిడ్డలు కలిగారు కానీ, వాళ్ళు అల్పాయుష్కులు. ఇలా కొంతకాలం గడిచిన తరువాత 1912లో నేను బాబాను

దర్శించి నా దురదృష్టానికి దుఃఖిస్తూ, నాకు దీర్ఘాయువుగల ఒక్క కుమారుని ప్రసాదించమని ప్రార్థించాను. వారు *"నువ్వు ఎందుకు ఒక్కపిల్లవాడినే కోరుకుంటావు? నీకు నేను ఇద్దరు కుమారులను ప్రసాదిస్తాను"* అన్నారు. బాబా ఆశీర్వదించినట్లుగానే నాకు ఇప్పుడు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకరికి 13 సంగులు, మరొకరికి 10 సంగులు. ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు. ఒకరికి 27 సంగులు, మరొకరికి 18 సంగులు. నేను ఇంట్లో బాబా ఫోటోను నిత్యం పూజిస్తాను. వారు నా కోరికలన్నీ తీర్చారు. ఈ క్రింది సంఘటనే దానికి నిదర్శనం.

ఒక వ్యక్తి, అతని కుమార్తె మా ఇంట్లో అతిథులుగా కొద్ది రోజులు ఉన్నారు. ఆ అమ్మాయికి తీవ్రంగా జబ్బు చేసి స్పృహ కోల్పోయింది. ఆమె బ్రతుకుతుందనే ఆశ ఎవరికీ లేదు. ఆ రాత్రి ఆమె తల దగ్గర నేను బాబా ఫోటోను ఉంచి బాబా ఊదీని ఆ అమ్మాయికి పెట్టాను. ఉదయానికి ఆ అమ్మాయికి స్పృహ వచ్చింది. ఆ అమ్మాయి తల్లి బాబాకు 10 రూపాయలు దక్షిణ సమర్పిస్తానని మొక్కుకుని వాటిని సమర్పించింది.

## 25

## నవంబరు 29వ తేదీ, 1936

**గంగాధర్ విష్ణు క్షీరసాగర్,** టెలిగ్రాఫ్ హెడ్ సిగ్నలర్, నీటిపారుదల శాఖ, సోనావాడి, కోపర్గాం, వయస్సు 51సం॥లు, దేశస్థ బ్రాహ్మణుడు, స్వగ్రామం- నేవాస.

నాకు 5 సం॥ల వయస్సున్నప్పుడు నా తండ్రి చనిపోయాడు. నేను, మా అమ్మ- మా మేనమామ దగ్గర ఉండేవాళ్ళం. మాకు కొన్ని పొలాలుండేవి. కొంత పొలాన్ని బాబా భక్తుడైన బాలానేవాస్కర్‌కు (జయాగుడి) కౌలుకిచ్చాం. కానీ కొంతకాలానికి బాలా మా పొలానికి తానే హక్కుదారుడనని ప్రకటించుకున్నాడు. మా తరపున మా మేనమామ వెళ్ళి అతనిని నిలదీసాడు. బాలా ఈ సమస్యను శ్రీసాయిబాబా సమక్షంలో పరిష్కరించుకుందామని చెప్పడంతో అతని మాట ప్రకారం మా మేనమామ, తల్లి, బాలానేవాస్కర్‌లు శిరిడీ వెళ్ళారు. మా అమ్మను, మామయ్యను అంతకుమునుపు బాబా ఎఱుగరు. వాళ్ళు ద్వారకామాయి చేరి బాబాకు నమస్కరించేలోపే, బాబా బాలానేవాస్కర్‌తో *"ఎందుకు నా బిడ్డలను అవస్థపెడతావు? ఆ పొలాన్ని వారికి స్వాధీనం చెయ్యి!"* అని చెప్పారు. మేము తిరిగి నేవాస వెళ్ళాము. కానీ బాలానేవాస్కర్ పొలాన్ని మాకు స్వాధీనం చేయకపోవడంతో మేము కోర్టు ద్వారా పొలాన్ని స్వాధీన పరుచుకున్నాము. అది చూసి బాలానేవాస్కర్ పిచ్చివాడయ్యాడు. తరువాత అతడెప్పుడూ శిరిడీకి రాలేదు. అది జరిగినప్పుడు నా వయస్సు 16 సంవత్సరాలు (1901). నేనెప్పుడూ సాయిబాబాను దర్శించలేదు. మా మామ, తల్లి మాత్రం అప్పుడప్పుడు వారిని దర్శించేవారు.

రెండు సంవత్సరాల క్రితం నేను సోనావాడికి (శిరిడీ- నాశిక్ మార్గంలో) బదిలీ చేయబడ్డాను. అప్పటి నుండి నేను శిరిడీ వెళ్ళి సాయిమందిరంలో పాటలు పాడుతున్నాను. నాకు 27.6.1935 నాడు ఒక కల వచ్చింది. ఆ కలలో బాబా నా ముందు నిలుచుని *"ఇంకా నిద్రపోతున్నావా! ఈ రోజు నీ ఇల్లు నీకు స్వంతం చేస్తూ కోర్టు ఉత్తర్వు వచ్చింది. శిరిడీలో జాతర జరుగుతుంది. రా భోజనం చెయ్యి!"* అంటూ భోజనాల గదికి తీసుకువెళ్ళారు. నేను భోజనం చేసి వారికి నమస్కరించాను. తరువాత నాకు మెలకువ వచ్చింది. నాలుగు రోజుల తరువాత

నా సోదరుడి నుండి నాకు ఒక జాబు వచ్చింది. అందులో మా ఇంటికి సంబంధించి అహ్మద్‌నగర్ జిల్లా కోర్టు మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని వ్రాసి ఉంది. కోర్టు తీర్పు ఇచ్చిన రోజు, నాకు కల వచ్చిన రోజు (27.6.1935) ఒకటే కావడం విశేషం. దీనివలన నాకు బాబాపై ఉన్న నమ్మకం మరింత బలపడింది.



బయ్యాజీ పాటిల్

## 26

## డిసెంబరు 9వ తేదీ, 1936- శిరిడీ

**బయ్యాజీ అప్పాజీ పాటిల్,** భూస్వామి- రెవెన్యూ మరియు పోలీసు పటేల్, వయస్సు 47 సం॥లు, మరాఠా, తండ్రి: అప్పాజీ పాటిల్, స్వస్థలం- బిరగాం, నివాసం- శిరిడీ.

నా పసితనం నుండి నాకు బాబా తెలుసు. బాబా శిరిడీ వచ్చినప్పటి నుండి సమాధి చెందేవరకు నిత్యం భిక్ష చేసిన కొద్ది ఇండ్లలో మాదీ ఒకటి. బాబా మొదటి మూడు సంవత్సరాలు మా ఇంటికి రోజుకు ఎనిమిదిసార్లు, తరువాత మూడు సంవత్సరాలు రోజుకు నాలుగుసార్లు, తరువాత పన్నెండు సంవత్సరాలు రోజుకు రెండు సార్లు వచ్చి భిక్ష అడిగేవారు. చివరి పన్నెండు సంవత్సరాలు రోజుకు ఒక్కసారి మాత్రమే వచ్చేవారు. నా పదకొండవ సంవత్సరం నుండి నేను బాబాను సేవించేవాడిని. నాకు ఏడు సంవత్సరాల వయస్సున్నప్పుడు అంటే 1896లో రామనవమి, ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అప్పుడే చందనం పూసి తమను పూజించుకోవడానికి హిందువులను, మసీదులో తమ ముందు ఖురాను చదివేందుకు ముస్లింలను బాబా అనుమతించారు.

ఈ ఉరుసు ఉత్సవం అప్పాకులకర్ణిచే ప్రారంభించబడింది. అతను ఒక డబ్బు అపహరణ కేసులో ఇరుక్కుని బాబా కృపవలన బయటపడ్డాడు. అందుకు కృతజ్ఞతగా బాబాకు ఉరుసు ఉత్సవం జరిపించాడు. హిందువులు బాబాకు చందనం పూసేవారు. బాబా చందనాన్ని చేతులతో మసీదు గోడలకు అద్దేవారు (పంజాగుర్తులు). ఇతర ముస్లింలు కూడా బాబాను అనుసరించి అలాగే పంజాగుర్తులు అద్దేవారు. బాబా మహల్సాపతికి, కొంతమంది ముస్లింలకు నుదుటిపై చందనం పూసేవారు. మహల్సాపతి బాబా నుదుటికి చందనం పూసి వారిని పూజించేవాడు.

ఆ తరువాత, ముస్లింలను మసీదులో నమాజు చేసుకోడానికి బాబా అనుమతించేవారు. నమాజు జరిగేటప్పుడు అందరినీ నిశ్శబ్దంగా ఉండమని ఆదేశించేవారు. అప్పుడప్పుడు బాబా కూడా నమాజు చేసేవారు. ఇది శనివారాలలో మాత్రమే. ఎవరైనా పేడాలు ఇతర మిఠాయిలు తెచ్చినప్పుడు బాబా "కలామ్" (ఫత్యాలాంటిది) చదివి, తరువాత వాటిని ప్రసాదంగా హిందువులకు, ముస్లింలకు సమానంగా పంచేవారు. ఉరుసు ఉత్సవం జరుపుకొనే విధానంలో హిందువులకు,

ముస్లింలకు మధ్య విభేధాలు తలెత్తే అవకాశముంటుందని చందనం పంజా గుర్తును హిందువులు, ముస్లింలు అందరిపైన ఒకేలా అద్దేందుకు బాబా అనుమతించారు. ఈ ఉత్సవానికయ్యే ఖర్చు మా నాన్న, నానాసాహెబ్ చాందోర్కర్, తాత్యాపాటిల్ మొదలైనవారు భరించేవారు.

నాకు 11 సంవత్సరాల వయస్సున్నప్పుడు (1901-02) ఒకరోజు నేను పశువులు మేపడానికి వెళ్తుంటే బాబా నన్ను వెళ్ళవద్దని ఆపారు. హఠాత్తుగా బాబా నన్ను, ఇతరులను కోప్పడుతూ నాలుగు కుండలను పగులగొట్టారు. తరువాత తమ చేతులను శంఖంలాగా నోటి దగ్గర పెట్టుకొని "భం, భం" అని ఊదారు. ఇది మృత్యువుగానీ, మరేదైనా అశుభ సంఘటనగానీ జరగబోతోందని తెలియజేసే సంకేతం. అప్పుడు సమయం ఉదయం తొమ్మిది తొమ్మిదన్నర గంటలు. ఆ రోజు రాత్రి 30 ఏళ్ళ వయస్సుగల మా అత్త కుమారుడు దాజీకోతే జ్వరంతో చనిపోయాడు.

బాబా సశరీరులుగా ఉన్న చివరి 14 సంవత్సరాలలో ప్రతిదినం నాకు 4 రూపాయలు ఇచ్చేవారు. వారు మహాసమాధి చెందిన రోజు కూడా నాకు నాలుగు రూపాయలు ఇచ్చారు. ఆ డబ్బును ఎలా ఉపయోగించాలో ఒకసారి బాబానే నాకు స్వయంగా చెబుతూ కానుకగా కానీ, అరువుగా కానీ ఎవ్వరికీ ఇవ్వవద్దు అన్నారు. ఇంకా ***"ఈ డబ్బులను తినేయకు, ఎవ్వరికీ ఇచ్చేయకు"*** అన్నారు. అందువలన ఆ డబ్బును పొలాలు కొనడానికి ఉపయోగించదలచి వారిచ్చిన డబ్బుతో 84 ఎకరాల భూమిని కొన్నాను. నాకు అంతకుముందే 10-11 ఎకరాల భూమి ఉంది.

బాబా తమ కాలజ్ఞానంతో ఎన్నోసార్లు నాకు సహాయపడ్డారు. శిరిడీలోని ఇతర రైతులవలె నేను కూడా నా పొలంలో చెఱకు పంట వేయాలని ఎంతో ఆశపడ్డాను. బాబా చెఱకు వేయవద్దని ఆదేశించారు. కానీ చెఱకు సాగు పట్ల నాకున్న ఆకర్షణ వారి ఆజ్ఞను మీరేటట్లు చేసింది. ఫలితంగా మామూలుగా మెట్ట పైర్లు వేసుకుంటే వచ్చే రాబడి పోవడమే కాకుండా చెఱకు నాటినందుకైన పెట్టుబడి 300 రూపాయలు కూడా నష్టం వచ్చింది.

1913లో మా నాన్న ఎప్పటిలాగా గుర్రంపై బయటికి వెళ్ళాడు. కానీ వచ్చేటప్పుడు పక్షవాతానికి గురయ్యాడు. అప్పటికి ఆయన వయస్సు 70 సంవత్సరాలకు పైనే ఉంటుంది. ఆయనను బ్రతికించుకోడానికి నేను మసీదుకు

వెళ్ళి బాబాను ఊదీ అడిగాను. కానీ బాబా *"నేను ఊదీ ఇవ్వను. అల్లా మాలిక్ హై!"* అన్నారు. నేను ఏడ్చాను. ఇది జరిగిన మూడవరోజు - ఆదివారం, కార్తీక శుద్ధఏకాదశి పర్వదినంనాడు మా నాన్న చనిపోయాడు. మరుసటి రోజు నేను ఎప్పటిలాగే మసీదుకు వెళ్ళి బాబా కాళ్ళు మర్దన చేయసాగాను. నాకు భీముడంత బలముందని గర్వపడుతూ ఉండేవాడిని. కనుక మర్దన పూర్తి చేసిన తరువాత వారిని ఎత్తుకొని ధుని దగ్గర కూర్చోబెట్టేందుకు ప్రయత్నించాను. అంతకుముందు చాలాసార్లు అలా చేసి ఉన్నాను. కానీ ఆ రోజు వారిని కొద్దిగా కూడా లేపలేకపోయాను. బాబా నా వైపు చూసి పకపక నవ్వారు. నా గర్వమణిగిపోయింది. ఆ రోజు ద్వాదశి. బాబా ఆ రోజు నాకు రెండు విషయాలు నేర్పారు. మొదటిది గర్వం కూడదని, రెండవది మా నాన్న మరణాన్ని గురించి దుఃఖించవద్దని. బాబా *"ఎందుకు దుఃఖిస్తావు? అతను (నా తండ్రి) 5 నెలలలో తిరిగి వస్తాడు!"* అని కూడా అన్నారు. అలాగే 5 నెలల తరువాత నాకు ఒక అబ్బాయి పుట్టాడు. వాడికి ఇప్పుడు 22 సంవత్సరాల 8 నెలలు.

బాబా సమాధి చెందే రోజు తమ చెంతనున్న కాకాదీక్షిత్‌ను అవతలకు పంపి, చివరిసారిగా నాకు కొన్ని హితవాక్యాలు చెప్పారు. వాటిని రహస్యంగా ఉంచమన్నారు. *"ఈ విషయాన్ని ఎవరికైనా వెల్లడిస్తే నీవు మరణిస్తావు!"* అన్నారు. తరువాత *"నేను వెళ్ళిపోతున్నాను నన్ను వాడాకు తీసుకొని వెళ్ళు, బ్రాహ్మణులందరూ నాకు దగ్గరగా ఉంటారు"* అంటూ వారు తుది శ్వాస విడిచారు. అప్పుడు నానాసాహెబ్ నిమోణ్కర్ వారి నోటిలో మంచితీర్థం పోసాడు. కానీ నీళ్ళు బయటికి వచ్చేసాయి. నేను వారి చుబుకం క్రింద చేతినిపెట్టి బయటికి వచ్చిన నీటిని పట్టాను. తరువాత వారు నాపై ఒరిగి దేహాన్ని త్యజించారు.

బాబా సమాధి చెందిన తరువాత ఎన్నో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ప్రభుత్వంవారు ఆస్థులనన్నింటిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా వారిని ఖననం చేసే విషయమై గ్రామస్థులు రెండు పార్టీలుగా విడిపోయి విభేదించుకోసాగారు. ముస్లింలు వారిని ప్రత్యేక భవనంలో ఖననం చేయాలని, ఆ భవన నిర్మాణానికయ్యే ఖర్చు వారి నుండి ప్రతిదినం డబ్బు దానంగా తీసుకుంటున్న నాలాంటి వారే భరించాలని అభిప్రాయపడ్డారు. కానీ మేమంతా బాబా అభిమతం మేరకు వారి పార్థివదేహాన్ని దగ్డీవాడాలో (బూటీవాడా) సమాధి చేయాలని పట్టుబట్టాము. కోపర్‌గాం మామ్లత్‌దారైన కులకర్ణి, రహతా ఫౌజుదారైన చక్రనారాయణ కూడా

అక్కడే ఉన్నారు. ప్రజలందరూ (హిందువులు మరియు ముస్లింలు) తమ తమ అభిప్రాయాన్ని వెల్లడించాలని తద్వారా మెజారిటీ అభిప్రాయాన్ని ఆమోదించాలని మామ్లత్‌దార్ నిర్ణయించాడు. ముస్లింలు సుమారు 100 సంతకాలతో మహజర్ తయారుచేసి సమర్పించారు. మేము 200 పైగా సంతకాలతో మహజర్ తయారుచేసి మామ్లత్‌దార్‌కు సమర్పించాం. హెచ్.యస్. దీక్షిత్, బాపూసాహెబ్ జోగ్, బాలాభాటే మొదలైన ప్రముఖులు మా మహజరులో సంతకాలుపెట్టారు. మా అందరి మెజారిటీ అభిప్రాయాన్ని బట్టి బాబాను దగ్డీవాడాలో సమాధి చేశారు.

1910లో శిరిడీలో రెండవసారి ప్లేగువ్యాధి ప్రబలింది.

నాలుగు సంవత్సరాల క్రితం బాబా సరియైన సమయంలో నన్ను హెచ్చరించి ఒక ప్రాణాన్ని కాపాడేందుకు సహాయపడ్డారు. శిరిడీలో మహాదేవునికి (శివుడు) సమర్పించబడిన ఒక ఆంబోతు ఉండేది. దానిపై త్రిశూలం గుర్తు కూడా ఉండేది. ఈ ఎద్దు గ్రామంలోనూ, లెండీతోట ప్రక్కనా మేస్తూ ఉండేది. కానీ తరువాత అది గ్రామస్థుల తోటలన్నీ ధ్వంసం చేయసాగింది. గ్రామస్థులు దానిని ఏవలాలో ఉన్న పశుశాలకు పంపాలని నిర్ణయించారు. అందరం చందాలు వేసుకొని మూడు రూపాయల చిల్లర ప్రోగు చేసి ఆ డబ్బును భికూమార్వాడీ అనునతనికి ఇచ్చి ఎద్దును ఏవలాలోని పశుశాలలో వదిలి రమ్మన్నాము. అతను ఎద్దుని తోలుకొనిపోయి, తిరిగివచ్చి దానిని అక్కడ వదిలినట్లుగా చెప్పాడు. కానీ ఆ రాత్రి బాబా నా కలలో కన్పించి *"నీవు నిద్రపోతున్నావా? నన్ను కసాయివాని కొట్టంలో కట్టేసారు!"* అన్నారు. నేను నిద్రలేచి తాత్యాపాటిల్ మొదలైన వారితో సంప్రదించాను. కలలో బాబా చెప్పిన మాటలను బట్టి ఆ ఎద్దును భికూమార్వాడీ పశుశాలలో వదలలేదని కసాయివానికి అప్పజెప్పాడని తెలుసుకున్నాము. నేను వెంటనే ఏవలా వెళ్ళి రెండు పశుశాలల్లోనూ విచారించాను. ఎద్దును అక్కడకు తీసుకురాలేదని వాళ్ళు చెప్పారు. తరువాత నేను కసాయిలు ఉండే చోటుకు వెళ్ళాను. అక్కడ ఒకచోట అది కట్టివేయబడి ఉంది. కసాయి దానిని ఆ రోజే మాంసం కొరకు చంపబోతున్నట్లు చెప్పాడు. దానిని తను భికూమార్వాడీ వద్ద 14 రూపాయలకు కొన్నట్లు కూడా చెప్పాడు. నేను ఆ ఎద్దుని విడిపించి పశుశాలలో వదలివచ్చాను. గ్రామస్థులను మోసం చేసినందుకు భికూమార్వాడీపై కేసు మోపబడి, రెండు నెలల కారాగార శిక్షపడింది.

## 27

## సెప్టెంబరు 18వ తేదీ, 1936

**రామచంద్ర సీతారాందేవ్ ఉరఫ్ బాలాభావు ఉరఫ్ బాలాభట్,** భూస్వామి, వయస్సు సుమారు 60 సం॥లు, బ్రాహ్మణుడు, వర్‌సోవారోడ్, అంధేరి.

నేను బాబాను మొదటిసారిగా 1908లో చూసాను. అంతకుముందే వారిని గురించి కళ్యాణ్‌లో జరిగిన దాసగణు మహరాజ్ కీర్తనల ద్వారా విని ఉన్నాను. బాంద్రాలో కసాయిపని చేస్తున్న అమీర్‌శక్కర్ ఖాతిక్ నాకు తెలుసు. అతను కూడా బాబా మహిమల గురించి గొప్పగా చెప్పి, నన్నొకసారి బాబాను దర్శించమన్నాడు. అందువల్ల నేను శ్రీకృష్ణపాటిల్‌తో కలిసి శిరిడీ వెళ్ళాను. అప్పుడు భక్తుల వసతికి సాఠేవాడా ఒక్కటే ఉండేది. కానీ మేము గణేష్ ఆలయం దగ్గర బస చేశాము. ఆ రోజు స్థానికులు, పొరుగు ఊర్ల వారు తప్ప బొంబాయి నుండి వచ్చే భక్తులు రాలేదు. అసలు నేను అక్కలకోట స్వామిని దర్శించేందుకు వెళ్ళాలని అనుకుంటుండగా, అమీర్‌శక్కర్ నాతో "అక్కల్‌కోట వెళ్ళే దారిలోనే శిరిడీ ఉంది. కాబట్టి బాబాను దర్శించిన తరువాత అక్కల్‌కోట వెళ్ళవచ్చును" అని చెప్పాడు. అతడి మాట ప్రకారం నేను శిరిడీలో దిగాను. బాబాను ఒకసారి దర్శించి, వెంటనే అక్కల్‌కోట వెళ్ళవచ్చునని తలచాను. బాబాను దర్శించాను. బాబా నా వైపు చూసి ***"నేను వెంటనే అక్కల్‌కోట వెళ్ళాలి!"*** అన్నారు. నా మనస్సులోని ఆలోచన గ్రహించిన బాబా శక్తికి ముగ్ధుడనై వారితో శిరిడీలో ఒకరోజు గడప నిశ్చయించాను. ఆ మహాత్ముని సన్నిధిలో లభించే ఆనందం కన్నా నేను మరేమీ ఆశించలేదు. అలాగే ఒక రోజు గడిపి మరునాడు వారి అనుమతితో అక్కల్‌కోట వెళ్ళిపోయాను.

నేను బాబా వైపు ఆకర్షింపబడి, తరచూ శిరిడీ వెళ్ళేవాడిని. అందుకే ఆ సంవత్సరం దీపావళికి శిరిడీ వెళ్ళాను. అప్పుడు బొంబాయి నుండి వచ్చిన భక్తులు చాలామంది బాబా వద్ద ఉన్నారు. నాతో పాటు 5, 6 మంది వచ్చారు. నేను రాత్రి 8గం॥ల నుండి అర్ధరాత్రి వరకు మసీదులో బాబా వద్ద గడిపి "మీరు నా గురువుగా ఉండి, నాకేదైనా ఉపదేశమివ్వ"మని వారిని ప్రార్థించాను. అప్పుడు బాబా ***"గురువు ఉండవలసిన అవసరం లేదు. అంతా మనలోనే ఉంది. నీవు ఏ విత్తనం నాటుతావో***

*అదే ఫలాన్ని పొందుతావు. నీవు ఎంత ఇస్తావో అంతే నీకు లభిస్తుంది (ఆపల్యా జబళచ్ ఆహే)"* అన్నారు.

*"నిన్ను నువ్వు చూసుకో. అంతా నీలోనే ఉంది. నీ అంతరాత్మ ప్రబోధాన్ని ఆలకించు (ఆపణ్ పహావా). దానికి అనుగుణంగా నడుచుకో. అదే నీ గురువు (ఆప్లా ఆపణ్ పహావా)"* అన్నారు. నేను బాబాను ఉపదేశం అడిగే నాటికి, ఈనాటికీ నాకు రత్నగిరిలో సంప్రదాయ గురువు ఒకరున్నారు. బాబాపై భక్తివిశ్వాసాలు పెరిగే కొద్దీ పండరిపూర్, అక్కల్‌కోట యాత్రలకు వెళ్ళడం తగ్గించాను. నేనప్పుడు రెండు ఉద్యోగాలు చేస్తుండేవాడిని. మొదటిది స్థానిక పాఠశాలలో అసిస్టెంట్ మాస్టర్, రెండవది స్టాంపువెండర్ (కమీషన్‌పై కోర్టు స్టాంపులు అమ్మడం). మామూలుగా స్కూలుకు సెలవు పెట్టి శిరిడీ వెళ్ళేవాడిని. కానీ బాబా నా సెలవు పూర్తయిన చాలా రోజుల వరకు నన్ను శిరిడీలోనే ఉంచేవారు. స్కూల్ అధికారులు నేను సెలవు కాలంలో ఎక్కడ గడుపుతున్నానో విచారించి నాకు తాకీదులు (మెమో) ఇచ్చేవారు. ఇలా కొంతకాలం గడిచిన తరువాత బాబా సన్నిధి, ఉపాధ్యాయ వృత్తి ఈ రెండింటిలో ఏదో ఒక్కటే ఎన్నుకోవలసిన అవసరం ఏర్పడింది. నేను ఉద్యోగానికి రాజీనామా చేశాను. స్టాంపు వెండర్ పని మాత్రం కొనసాగించాను. దీనివలన నాకు రోజుకి 20 రూపాయల నుండి 25 రూపాయల వరకు రాబడి వచ్చేది. దీనిని 5 సం॥ల క్రితం వరకు చేసి తరువాత నా కుమారునికి అప్పజెప్పాను. నేను ఉద్యోగానికి రాజీనామా చేసినప్పుడు నా వయస్సు 32 సం॥లు మాత్రమే. కానీ బాబా కృపవలన నా ఆర్థిక పరిస్థితి మెరుగుగానే ఉండేది. బాబా సన్నిధిలో జరిగే ప్రతి శ్రీరామనవమికి నేను హాజరయ్యేవాడిని. బాబా సశరీరులుగా ఉన్నప్పుడు వారు స్వయంగా నాకు సూచనలు అందించేవారు. వారు సమాధి చెందిన తరువాత వారి పటం ముందు చీటీలు వేసి ప్రార్థించడం ద్వారా వారి ఆదేశాలను తెలుసుకునేవాడిని.

బాబా సదేహులుగా ఉన్నప్పుడు ఒకసారి అంధేరీలో మేం నివసిస్తున్న ప్రాంతంలో ఒక భయానక దొంగతనం జరిగింది. దాంతో నేను చాల భయపడ్డాను. దొంగలు తీవ్రంగా గాయపరచిన ఆ ఇంటిలోని వారందరినీ నేను ఆసుపత్రిలో చూసాను. అటువంటి విపత్కర పరిస్థితి నా కుటుంబానికి రాకుండా కాపాడమని బాబాను ఆర్తిగా ప్రార్థించాను. ఆ రాత్రి బాబా నా కలలో కన్పించి ***"నేను పది మంది***

*పఠానులతో వచ్చాను. భయపడవలసిన అవసరంలేదు''* అన్నారు. ఆ తరువాత పది మంది రజకులు నా దగ్గరకి వచ్చారు. వీరు అంతకుముందు మా ఇంటికి కొంచెం దూరంలోనున్న బి.బి. అండ్ సి.ఐ. రైల్వే స్థలంలో చాకిరేవు ఏర్పరచుకొని ఉండేవారు. కానీ రైల్వే అధికారులు వారిని అక్కడి నుండి వెళ్ళగొట్టారు. అందుకని మా ఇంటి ఆవరణలో పాకలు నిర్మించుకొనేందుకు అనుమతి కోరారు. నేను వెంటనే అంగీకరించాను. వీరు పొరుగున ఉండటం వలన మాకు దొంగల బారి నుండి రక్షణ లభించడమే కాక బాడుగ రూపంలో నెలకు 200 రూపాయలు వచ్చేవి. ఆ చాకలివారి అవసరాలకు ప్రస్తుతం ఉన్న బావిలోని నీరు సరిపోయేది కాదు. నేను బాబాను సంప్రదించి వారు సూచించిన ప్రదేశంలో వేరొక బావి త్రవ్వించాను. దానిలో పుష్కలంగా నీరుపడింది.

నేను నివసిస్తున్న ఈ పెద్ద భవన నిర్మాణానికి సంబంధించి ముందుగా బావి త్రవ్వవలసి ఉండి నేను శిరిడీ వెళ్ళి బాబాను సంప్రదించాను. బాబా సలహా మేరకు త్రవ్వించిన ఆ బావిలో మంచినీళ్ళు పుష్కలంగాపడ్డాయి. తరువాత భవనాన్ని నిర్మించదలచి బాబా అనుమతికై నేను శిరిడీ వెళ్ళినప్పుడు నా దగ్గర 5 వాటాలు కట్టడానికి మాత్రమే డబ్బుంది. కానీ బాబా నన్ను చూడగానే నేలపై 25 గీతలు గీసి *''ఒక్కొక్క గీతకు (వాటాకు) రూపాయి చొప్పున 25 రూపాయలు ఇవ్వు''* అన్నారు. నేను 5 వాటాలు మాత్రమే నిర్మించదలచినా బాబా అడిగిన 25 రూపాయలు సమర్పించాను. బాబాపై భారం వేసి భవన నిర్మాణాన్ని ప్రారంభించాను. నేను మొదట అనుకున్న 5 వాటాలు పూర్తయిన తరువాత ఒకదాని తరువాత మరొకటి పెంచుకుంటూ పోయి 1920 నాటికి 25 వాటాల గృహ సముదాయం పూర్తయింది. ఇప్పటికీ 25 వాటాలే ఉన్నాయి.

బాబా నేటికీ సజీవంగానే ఉన్నారన్నది నా అనుభవం. వారు ఇప్పటికీ నాకు మార్గం చూపుతున్నారు. నావలె, నా కుమారులకు కూడా బాబాపై అంతే నమ్మకముంది. శ్రీసాయితో నా అనుభవాలనన్నింటినీ కీ.శే. శ్రీదాభోల్కర్‌గారికి పంపడం జరిగింది.

## 28

## డిసెంబరు 10వ తేదీ, 1936- గడగ్

**డి.ఎం. ముల్కీ**, ఎం.బి.బి.యస్., వైద్య వృత్తి, గడగ్.

1915లో మా కుటుంబంలో ఒక బాధాకరమైన సంఘటన జరిగింది. 18 సంవత్సరముల మా అన్నగారి కుమారుడు ఉన్నట్లుండి క్రైస్తవ మతం పుచ్చుకున్నాడు. ప్రతిభావంతుడైన అతను బి.ఎ., ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. వాడి భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న మా అన్నయ్య హతాశుడయ్యాడు. దిగులుతో కృంగిపోయి మనశ్శాంతి కోల్పోయాడు. ఎవరెంత ఓదార్చినా ఫలితం లేకుండా పోయింది. కీ.శే. హరిసీతారాం దీక్షిత్ (బాబాకు కుడిభుజం వంటివాడు) అప్పుడు మా అన్నగారి కుటుంబాన్ని బాబా సన్నిధికి తీసుకెళ్ళాడు. బాబా కృపవలన వారి జీవితంలో మరల ప్రశాంతత చేకూరింది.

మా అన్నగారి రెండవ కుమారుడు (ప్రస్తుతం రైల్వేలో పని చేస్తున్నాడు) దీర్ఘకాలిక ఎముకల వ్యాధిగ్రస్తుడు (Chronic Osteomyelitis). బొంబాయికి చెందిన ప్రముఖ శస్త్రచికిత్సా నిపుణులు వైద్యం చేసినా అది తగ్గలేదు. చివరకు అతనిని సాయిబాబా వద్దకు తీసుకెళ్ళారు. కేవలం శ్రీసాయిబాబా కృపాదృష్టి మరియు ఊదీ మహిమ ద్వారా ఆ పిల్లవాని ఎముకలోని గాయం పూర్తిగా నయమయింది. అప్పటి నుండి మా అన్నగారి కుటుంబం తరచు శిరిడీ వెళ్ళడం, భజనలు చేయడం మొదలుపెట్టారు. కానీ నాకప్పుడు ఈ విషయాలేమీ తెలియవు. 1916లో ప్రభుత్వ డాక్టరుగా నాకు బొంబాయిలోని పరేల్ లాబొరేటరిలో ఉద్యోగమొచ్చింది. అప్పుడే మా అన్నగారింట్లో సాయిభజనలు జరుగుతున్నట్లు నాకు తెలిసింది. అసలు నేనంతవరకు సాయిబాబా ఫోటో కూడా చూసి ఎరుగను. నేనిప్పుడు చెప్పబోయే సంఘటన జరిగినప్పుడే మొదటిసారిగా బాబా ఫోటో చూసాను.

1916వ సంవత్సరం అక్టోబరు నెలలో నేను తీవ్ర అనారోగ్యానికి గురయ్యాను. రోజుల తరబడి జ్వరం 105 నుండి 106 డిగ్రీలకు తగ్గకుండా ఉండేది. స్థానిక డాక్టర్లు చికిత్స చేశారు. కానీ కొంచెం కూడా తగ్గలేదు. ఇలా ఒక వారం గడిచిన

తరువాత ఒక గురువారం నాడు సాయంత్రం మా అన్నగారింట్లో సాయిపూజ, భజన జరిగింది. ఆ భజన విన్న నాకు వింతగా అనిపించింది. ఎందుకంటే అంతకుముందు వాళ్ళ ఇంట్లో అలాంటివి చూడలేదు. పైగా అప్పట్లో నాకు నాస్తిక భావాలుండేవి. గురుస్వరూపులైన సాయినాథుడు నన్ను నాస్తిక భావాల నుండి కాపాడదలచారేమో!

నాకు 104.6 డిగ్రీల జ్వరం ఉంది. ఆ రాత్రి నాకొక కలవచ్చింది. కలలో తెల్లని, పొడుగైన కఫ్నీ ధరించి, తలకు తెల్లనిగుడ్డ కట్టుకొనివున్న ఒక వృద్ధుడు కనిపించి, నేను చింతించాల్సిన అవసరం లేదని వెంటనే వచ్చి వారి దర్శనం చేసుకోవాలని, అలా చేస్తానని మాట ఇస్తే జ్వరం వెంటనే తగ్గిపోతుందని చెప్పారు. నేను భయపడి పెద్దగా కేక పెట్టాను. నా కేక శబ్దానికి నాకే మెలకువ వచ్చింది. అంతేకాదు అది విని, నన్ను బిడ్డలా ఆదరించే మా వదిన పరుగెత్తుకుంటూ నా పడక దగ్గరకొచ్చింది. అప్పటికే నా ఒళ్ళంతా చెమటలుపట్టి, కన్నీరు కారుస్తున్నాను. నేను నాకు వచ్చిన కల గురించి చెప్పాను. ఆమె వెంటనే సాయిబాబా ఫోటో తెచ్చి నాకు చూపించి, కలలో కనిపించినది వీరేనా! అని అడిగింది. నా కలలో వచ్చింది ఆయనేనని చెప్పి, వీలైనంత త్వరలో వారి దర్శనం చేసుకోవాలని వెంటనే నిర్ణయించుకున్నాను. నా జ్వరం తగ్గిపోయింది. మరల రాలేదు. తరువాత సంపూర్ణ ఆరోగ్యవంతుడనై ఉద్యోగానికి కూడా వెళ్ళడం ప్రారంభించాను. కానీ యువకుడనైన నేను నగర జీవనంలోని వివిధ ఆకర్షణల వలన శిరిడీ వెళ్ళాలన్న విషయం పూర్తిగా మరచిపోయాను.

అప్పట్లో నేను బొంబాయి నుండి పల్లె ప్రాంతాలకు బదిలీ చేయించుకోడానికి గట్టిగా ప్రయత్నించాను. కానీ నా ప్రయత్నాలేవీ ఫలించలేదు. అందువల్ల నేను బొంబాయిలోనే కొనసాగాను.

1917 ఫిబ్రవరిలో సాయిమహరాజ్ (బాబా) నా కలను, నేను వాగ్దానాన్ని నెరవేర్చకపోవడాన్ని ఈ విధంగా గుర్తుచేయదలచారు. నాకు నాశిక్ జిల్లాలోనున్న మాలేగాం అను ఊరికి బదిలీ అయ్యింది. మాలేగాం వెళ్ళేందుకు మన్మాడ్, కోపర్‌గాంల మీదుగానే వెళ్ళాలి. (శిరిడీ వెళ్ళేందుకు కోపర్‌గాం స్టేషనులో దిగాలి). నేను మాలేగాం వెళ్ళి నా పని ఒత్తిడిలో పడి మరల ఆ విషయాన్ని మరచిపోయాను. దాంతో మరో సంఘటన ద్వారా బాబానే నాకు తిరిగి గుర్తు చేశారు. మాలేగాంలో

నేనొక ప్రసవ సంబంధమైన శస్త్రచికిత్స చేస్తున్నప్పుడు, ఆ స్త్రీ గర్భంలోని ఒక భాగం తాలూకు క్రుళ్లిన ద్రవం నా ఎడమ కంట్లో పడింది. నేనప్పుడు దానిని గమనించలేదు. గమనించేటప్పటికే కన్ను బాగా వాచి విపరీతంగా బాధించసాగింది. నేనక్కడ ఒంటరిగా ఉన్నాను. ఇంతకుముందు ఎన్నడూ ప్రార్థించని విధంగా ఆర్తితో బాబాను ప్రార్థించాను. వారు నా అపరాధానికి శిక్షించక దయతో నా ప్రార్థన మన్నించారు. తమ భక్తులు ఎంత చండాలులైనా, వాళ్ళు కష్టాలు అనుభవించడం బాబా సహించలేరని అప్పటినుండి నాకు దృఢ విశ్వాసమేర్పడింది. అహంకారంలేని నిష్కల్మష భక్తినే బాబా కోరుకునేది. నాశిక్‌లోనున్న సివిల్ సర్జను నా కన్ను పోవచ్చన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. కానీ బాబా కృప వలన వారం రోజులకు నాకన్ను బాగైపోయింది. అప్పుడు నా భార్య కూడా వచ్చి నాతోనే ఉంది. బాబా దర్శనం చేసుకోకుండా బొంబాయి తిరిగి వెళ్ళకూడదని మేము మ్రొక్కుకున్నాము.

ఒక నెల తరువాత ఉద్యోగరీత్యా నన్ను బొంబాయికి రమ్మని ఆదేశం వచ్చింది. ఇది నా మ్రొక్కు తీర్చుకునేందుకు మంచి అవకాశంగా తోచింది. మేము మన్మాడ్ నుండి ధోండ్ వెళ్ళే రైలు ఎక్కేందుకు వేకువఝామున కాస్త ముందుగానే మన్మాడ్ స్టేషనుకు చేరుకున్నాము. నేను ప్లాట్‌ఫారంపై నడుస్తుండగా నాకొక దేశస్థ బుకింగ్ క్లర్క్ తటస్థపడ్డాడు. మా సంభాషణలో మేము బాబా దర్శనానికై శిరిడీ వెళుతున్నట్లు అతనికి చెప్పాను. ఇది వినిన వెంటనే అతను బాబాపై తిట్ల వర్షం కురిపించాడు. బాబా నైతిక ప్రవర్తన కూడా మంచిదికాదని చెప్పాడు. దాంతో మేము శిరిడీ ప్రయాణం మానుకొని వెంటనే తరువాత రైలుకు బొంబాయి వెళ్ళిపోయాము. ఆ విషయం గుర్తుకు వచ్చినప్పుడల్లా ఈనాటికీ నేను బాధపడుతూనే ఉంటాను.

బొంబాయి వెళ్ళిన నెల రోజుల తరువాత మా వదిన ప్రోద్బలంతో మేము శిరిడీ బయలుదేరాము. ఈసారి కూడా కొన్ని అడ్డంకులు ఎదురయ్యాయి. కానీ వాటిని లెక్క చేయకుండా శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాము. నెల క్రితం మన్మాడు స్టేషనులో బుకింగ్ గుమాస్తా మాటలు విని మేము వెనుదిరిగి వెళ్ళిన విషయాన్ని బాబా ప్రస్తావించారు. మేము సిగ్గుతో తలవంచుకున్నాము. ఆ దుష్టుని మాటలు విన్నందుకు పశ్చాత్తాపపడ్డాను.

నేను శిరిడీలో నాలుగు రోజులు గడిపాను. తరువాత ఇంటికి వెళ్ళడానికి బాబా అనుమతి కోరినప్పుడు, బాబా నన్నాశీర్వదించి జ్ఞానేశ్వరి చదవమని,

నాకు ఉన్నత పదవినిచ్చి బీజాపూర్ బదిలీ చేసిన ఉత్తర్వులు మా ఇంట్లో నా టేబుల్‌పై ఉంటాయని కూడా చెప్పారు. నేను బాబాకు హృదయపూర్వకంగా నమస్కరించి ఇంటికి తిరిగివచ్చాను. నా టేబుల్‌పై బాబా చెప్పిన ఉత్తర్వులు చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాను. బాబా కృపతో ప్రతి సంవత్సరం నేను జ్ఞానేశ్వరి సప్తాహం శ్రద్ధగా నిర్వహిస్తున్నాను. నేను మద్రాసు రాష్ట్రంలోనున్న దక్షిణ కన్నడ జిల్లాకు చెందినవాడిని. మెట్రిక్‌లో కన్నడం, ఆ తరువాత ఫ్రెంచి రెండవ భాషగా చదివాను. నేను మరాఠీ అభ్యసించలేదు. అందువల్ల నాకు మరాఠీ చదవడం వ్రాయడం రాదు. అయినప్పటికీ మరాఠీలోనున్న జ్ఞానేశ్వరిని చదవగలిగేవాడిని. ఇది కేవలం బాబా అనుగ్రహం వలనే సాధ్యమయ్యిందని నా నమ్మకం.

నేను బీజాపూర్ నుండి యుద్ధభూమిలో సేవ చేయడానికి వెళ్ళాను. అక్కడ యుద్ధం ముగిసిన తరువాత గడగ్ చేరాను. శ్రీసాయిబాబా సర్వకాల సర్వావస్థలయందు మనపై తమ కృపాదృష్టి కురిపిస్తున్నప్పటికీ వారి కరుణను గుర్తించలేకపోవడం మన అవివేకం. నాకు ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి, ఎన్నో ఎదురయ్యాయి, మరెన్నో ఎదురవుతాయి. కానీ వీటన్నింటి నుండి బాబా సదా నన్ను కాపాడుతుంటారని నా దృఢ విశ్వాసం.

29

## డిసెంబరు 1వ తేదీ, 1936- శిరిడీ

**నగేష్ ఆత్మారాం సావంత్,** పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టరు, బొంబాయి సిటీ పోలీస్, మరాఠా, వయస్సు 42 సం॥లు, తండ్రి: ఆత్మారాం సావంత్.

1922 డిసెంబరులో సావంత్‌వాడీలో "సాయిలీలా మాసిక్" పత్రిక చదవడం ద్వారా నేను శ్రీసాయిబాబాను గురించి తెలుసుకున్నాను. వారి లీలలు నన్ను అమితంగా ఆకర్షించాయి.

1923 డిసెంబరులో నా తలపై బల్లి పడింది. అది ఎంతో అశుభసూచకం.

అప్పుడు నా భార్య గర్భవతి. ఆ సమయంలో ఆమె మాళ్‌వన్ తాలూకా పెందూర్‌లో ఉంది.

నేను 1924 జనవరిలో ట్రైనింగ్ కొరకు నాశిక్‌లోని పోలీసు స్కూలులో చేరాను. ఆ చదువుపై నాకు అంత ఆసక్తి ఉండేది కాదు. నేనెప్పుడూ బాబా గురించే ఆలోచిస్తూ వారే కాపాడతారని నమ్మి బాబాను ప్రార్థిస్తుండేవాడిని. నా స్నేహితుడు పి.దేవ్ నుండి బాబా ఫోటోను తెచ్చుకొని పూజించేవాడిని.

నాశిక్‌లో జరిగిన శాఖాపరమైన పరీక్షలలో నేను ఉత్తీర్ణుణ్ణికాలేకపోయాను. పరీక్షలో ఫెయిల్ అయినవారికి సబ్ ఇన్‌స్పెక్టరు అయ్యే అవకాశం లేదు. అందువల్ల నేను తాత్కాలిక సబ్ ఇన్‌స్పెక్టరుగా 5 సంవత్సరాలు కొనసాగాను. మరల నాశిక్ వెళ్ళేందుకు నా ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో నేను ఆ ప్రయత్నం కూడా చేయలేదు. పరీక్ష పాసవకుండానే బాబా నన్ను సబ్ ఇన్‌స్పెక్టరు ఉద్యోగంలో ఖాయపరుస్తారని నేను పూర్తిగా నమ్మాను.

1924 నుండి నేను ప్రతి సంవత్సరం విజయదశమికి శిరిడీ వెళ్ళి బాబా పుణ్యతిథి ఉత్సవాల్లో పాల్గొనేవాడిని. 1926 విజయదశమికి శిరిడీ వెళ్ళాలని నిర్ణయించుకున్నాను. కానీ అది మొహరం మాసమైనందువల్ల సాధారణంగా సెలవు మంజూరు చేయరు. అప్పుడు బాబా నా కలలో కనిపించారు. కలలో వారు ఏదో కాగితంపై సంతకం పెడుతున్నట్లు కనిపించారు. నన్ను సెలవు కొరకు దరఖాస్తు పెట్టుకోమని బాబా ఉద్దేశ్యంగా భావించి దరఖాస్తు పెట్టుకున్నాను. ఏ విధమైన ఇబ్బంది లేకుండా సెలవు లభించింది.

1929 ఫిబ్రవరిలో బొంబాయిలో హిందూ ముస్లిం అల్లర్లు జరిగాయి. నన్ను బందోబస్తు విధులకు పరేల్ అను ప్రాంతంలో నియమించారు. నాకు హఠాత్తుగా జ్వరం, తలనొప్పి వచ్చాయి. అక్కడి పరిస్థితులు పరిశీలించడానికి ఒక ఐరోపా పోలీసాఫీసరు (అతను మా విభాగానికి చెందినవాడు కాదు) వచ్చాడు. అతను నన్ను చూసి "నీ ఆరోగ్యం సరిగా లేనట్టుంది" అన్నాడు. అతను మా సూపరింటెండెంట్ వద్దకు వెళ్ళి నాకు మౌఖిక సెలవు మంజూరు చేయించి నా స్థానంలో అతను ఛార్జి తీసుకున్నాడు. అప్పుడు సాయంత్రం 3.30గం॥లు అయివుంటుంది. నేను ఇంటికి వెళ్ళాను. నేనా ప్రదేశాన్ని విడిచిన తరువాత అదే చోట అల్లర్లు చెలరేగాయని ఆ అల్లర్లలో ఆ ఐరోపా పోలీసాఫీసరును చంపివేసారని ఒక గంట తరువాత నాకు తెలిసింది.

నా అనారోగ్యం అలాగే ఉండడంతో నేను పోలీసు హాస్పిటల్‌లో చేరాను. వారు నన్ను పరీక్షించి నాకు టైఫాయిడ్ వచ్చినట్లుగా నిర్ధారించారు. ఆ జ్వరం 17 రోజులు వరకు తగ్గలేదు. తరువాత ఒకరాత్రి నా కలలో నల్లని దుస్తులు ధరించి, తలకు నల్ల గుడ్డ కట్టుకున్న బలిష్టుడైన ఒక వ్యక్తి నన్ను ఈడ్చుకొని వెళ్ళసాగాడు. నేను "బాబా బాబా" అని అరవసాగాను. వెంటనే తెల్లని దుస్తులు ధరించిన తెల్లని వ్యక్తి వచ్చి, ఆ నల్లని వ్యక్తితో పోట్లాడి నన్ను అతని బారి నుండి విడిపించాడు. నేను "బాబా! దత్తమహరాజ్!" అంటూ అరిచాను. వెంటనే నేను పూజించే బాబాఫోటో నుండి బాబా బయటకు వచ్చి, నాకు దర్శనమిచ్చి అంతర్ధానమయ్యారు. అప్పటికే ఆ తెల్లని వ్యక్తి, నల్లని వ్యక్తి మాయమయ్యారు. ఆ సమయంలో నాకు సబ్జా ఆకులు, సాంబ్రాణికడ్డీల సువాసన వచ్చింది. తరువాత నా జ్వరం తగ్గిపోయింది.

నేను అనారోగ్యంతో హాస్పిటల్‌లో ఉన్నప్పుడు గ్రామంలో ఉన్న మా అమ్మకు కలలో ఎవరో కన్పించి "భయపడకు. నేను నీ కొడుకును సెలవుపై క్షేమంగా ఇంటికి తీసుకొస్తాను" అని హామీ ఇచ్చారు. ఈ కల వచ్చిన వారం రోజులకు నాకు మూడు నెలల సెలవు దొరకడంతో నేను ఇంటికి వెళ్ళాను.

జూలై 1929లో ప్రత్యేకమైన కేసుగా పరిగణిస్తూ నన్ను పరీక్ష నుండి మినహాయించి పర్మినెంటు సబ్ ఇన్‌స్పెక్టరుగా నియమించారు.

నా స్నేహితుడైన అబ్బాసావంత్ (44 సం॥లు) బొంబాయిలో పోలీసు కానిస్టేబులుగా పనిచేస్తూ మా ఇంటి సమీపంలోనే నివసిస్తూ ఉండేవాడు. అతను తన అనుభవాన్ని నాకు ఇలా చెప్పాడు. అతను కొత్త చీర కొని తన భార్యకు ఇచ్చాడు. ఆమెకు బాబాపై నమ్మకం లేదు. అందువల్ల ఆమె "నీవు ఈ చీరెను బాబా ఇచ్చిన బహుమతిగా చెబుతున్నావు. కానీ నీవు కష్టపడి సంపాదించిన డబ్బుతోనే కదా ఈ చీరెను కొన్నది?" అని భర్తతో పలికి ఆ రాత్రి చీరెను టేబుల్‌పై పెట్టింది. మరుసటి ఉదయం లేచి చూసేసరికి టేబుల్‌పై ఉన్న చీర మధ్యలో నిప్పు కణిక పెట్టినట్లుగా పైమడత నుండి క్రింది మడత వరకు కాలిపోవడంతో పనికిరాకుండా పోయింది. ఇది చూచి ఆమె "బాబా రేపు మరొక కొత్తచీర ఇస్తారేమో చూద్దాం" అన్నది. మరుసటి రోజు అనుకోని రీతిలో అబ్బాసావంత్‌కు కొంత డబ్బు వచ్చింది. ఆ డబ్బుతో మరొక కొత్తచీర కొని తన భార్యకు ఇచ్చాడు.

## 30

## డిసెంబరు 2వ తేదీ, 1936- సాకోరి

**శ్రీమతి కాశీబాయి హంసరాజ్** (కీ.శే. హంసరాజ్ భార్య), వయస్సు సుమారు 45సం॥లు, వణి, సాకోరి.

ఇరవై సంవత్సరాల క్రితం అంటే డిసెంబరు (మార్గశిర) 1916 ప్రాంతంలో నేను, నా భర్త శిరిడీ వెళ్ళాము. అప్పటికి కొద్ది రోజుల ముందే రాధాకృష్ణ ఆయీ మరణించింది. మేము శిరిడీలో ఆరు నెలలు ఉన్నాము. నాశిక్‌కు చెందిన నరసింగ మహరాజ్ నా భర్త దేహాన్ని దుష్టశక్తి ఒకటి ఆవహించిందని అది మాకు సంతానం కలుగకుండా చేస్తోందని చెప్పారు. మమ్మల్ని సిద్ధపురుషుడైన శ్రీసాయిబాబాను దర్శించమని, వారు ఆ దుష్టశక్తిని రెండు చెంప దెబ్బలతో తరిమివేస్తారని కూడా చెప్పారు. అందువల్ల మేము శిరిడీ వెళ్ళాము. బాబా, నా భర్త చెంపను రెండుమార్లు ఛెళ్ళుమనిపించి *"దుష్టశక్తీ ఫో!"* అన్నారు. అప్పటి నుండి మేము శిరిడీలోనే నివసించసాగాము. శిరిడీ రాక మునుపు నా భర్త రాత్రింబవళ్ళు తీవ్రమైన ఉబ్బసవ్యాధితో బాధపడేవారు. బాబాను దర్శించిన తరువాత ఆ వ్యాధి తీవ్రత తగ్గింది. పగలు మాత్రము ఉండేది. రాత్రిళ్ళు ఇబ్బందిపెట్టేది కాదు. ఆరునెలలు గడచిన తరువాత పగలు కూడా రావడం మాని పూర్తిగా నివారణమయింది. మేము అక్కడ ఉన్న రోజుల్లో బాబా రాత్రిళ్ళు దగ్గుతూ ఉండేవారు.

నా భర్త ఉబ్బసవ్యాధిని నివారించే క్రమంలో బాబా చేసిన ఒక చమత్కారాన్ని గురించి తప్పక చెప్పాలి. మేము శిరిడీలో ఉన్నప్పుడు బాబా నా భర్తను పుల్లని, ఘాటైన పదార్థాలు తినవద్దని ముఖ్యంగా పెరుగు తినడం మానివేయమన్నారు. కానీ నా భర్తకు పెరుగంటే ప్రాణం. చావనైనా చస్తాను గానీ పెరుగు తినకుండా ఉండలేను అనేవాడు. శిరిడీ వంటి గ్రామంలో మధ్యాహ్నంపూట పెరుగు అంత సులభంగా లభించేది కాదు. అందువల్ల రాత్రి పాలుకాచి చల్లారబెట్టి, తోడువేసి ఆ పాత్రను ఉట్టిపైపెట్టేదానిని. ప్రతిదినం మధ్యాహ్న ఆరతికి హాజరైన తరువాత ఇంటికి వచ్చి భోజనానికి కూర్చునేవాళ్ళం. కానీ ఉట్టి మీద గిన్నెలో పెరుగు ఉండేది కాదు. రోజూ ఒక పిల్లి ఇంట్లోకి దూరి, ఎత్తుగానున్న ఆ ఉట్టిమీదకెగిరి పెరుగు తినేసేది. ఇలా దాదాపు రెండు నెలలపాటు జరిగింది. నా భర్త ఒకరోజు మధ్యాహ్న

ఆరతికి వెళ్ళకుండా ఇంట్లోనే ఉండి పిల్లికోసం కాపుకాసాడు. అది రోజూ వచ్చినట్లే ఆ రోజు కూడా వచ్చి ఉట్టిమీద కెగిరి పెరుగులో మూతిపెట్టింది. నా భర్త దానిని కర్రతో గట్టిగా కొట్టి తరిమివేసాడు. పెరుగు తినకుండా పిల్లిని తరిమివేయగలిగాడు కానీ పిల్లి మూతి పెట్టినందున ఆ పెరుగు పనికి రాకుండా పోయింది. ఆ రోజు మధ్యాహ్నం భక్తులందరూ మసీదు చేరి బాబా వద్ద ఊదీ ప్రసాదం తీసుకున్నారు. మేము కూడా మసీదుకు వెళ్ళాము. జోగ్, కాకాదీక్షిత్, షామా, బూటీ మొదలైన భక్తులు అక్కడున్నారు. బాబా నా భర్తను ఉద్దేశించి భక్తులతో *"ఒక మూర్ఖుడు (ఊర్పటియా) పుల్లని, ఘాటైన పదార్థాలు తిని చావాలనుకుంటున్నాడు. కానీ నేను వాడిని అలా చేయనివ్వను. ఈ రోజు పిల్లి రూపంలో అతనింటికి వెళ్ళాను. అతను నా వీపు మీద ఎలా కొట్టాడో చూడండి!"* అంటూ తమ కఫ్నీ ఎత్తి వీపును చూపించారు. వారి వీపుపై బెత్తంతో కొట్టిన విధంగా వాత తేలి ఉంది. ఎంత ఆశ్చర్యం!

నా భర్త అప్పటి నుండి పుల్లని పదార్థాలు, పెరుగు తినడం మానివేసాడు. ఇది తనకున్న ఉబ్బసవ్యాధి త్వరగా తగ్గడానికి దోహదపడింది. శిరిడీ వచ్చిన కొత్తల్లో నేను రోజూ నా భర్తకు ఉబ్బసానికి మందు ఇచ్చేదానిని. ఇది చూసి బాబా తమకూ ఉబ్బసవ్యాధి ఉందని, నేను నా భర్తకు మందిస్తున్నట్లుగానే బాబాకు కూడా వేలమంది స్త్రీలు మందు ఇవ్వగలరని అన్నారు. *"కానీ ప్రయోజనమేముంది? అల్లా మాలిక్ హై- భగవంతుడే యజమాని"* అన్నారు. అప్పటి నుండి నేను నా భర్తకు మందులు ఇవ్వడం మానివేసాను. ఏ మందులూ లేకుండానే నా భర్త ఉబ్బసవ్యాధిని బాబా నయం చేశారు. ఒక సంవత్సరం పాటు ఆ వ్యాధి రాలేదు. కానీ 1918-19లో ఉబ్బసం తిరగబెట్టింది. అప్పుడు సియాన్‌లో ఉన్న ఉపాసనీబాబా నా భర్త వ్యాధిని నయం చేశారు.

బాబా ఎన్నో విషయాలు చెప్తుండేవారు. వాటిలో కొన్ని నాకు గుర్తున్నాయి.

అప్పటిదాకా శిరిడీలోనే ఉన్న బాబా హఠాత్తుగా ఇలా అనేవారు *"నేనిప్పుడే కాశీ వెళ్ళి గంగాస్నానం చేసి వచ్చాను. తిరిగి ఇక్కడ స్నానం చేయడమెందుకు?"*

*"నేనిప్పుడే కోల్హాపూర్ వెళ్ళి వచ్చాను!"*

*"నేనిప్పుడే ఔదుంబర్‌వాడీ వెళ్ళివచ్చాను!"*

బాపూసాహెబ్ జోగ్ కోరికపై బాబా అక్కల్‌కోట మహారాజ్‌గా అతనికి దర్శనమిచ్చారట. ఈ విషయం నాకు జోగ్ స్వయంగా చెప్పాడు.

31

## సెప్టెంబరు 26వ తేదీ, 1936- విల్లేపార్లే

**దినకరరావ్ జయకర్,** తండ్రి: శ్యామరావ్ జయకర్, వయస్సు 28 సం॥లు, విల్లేపార్లే.

నేను కొంతకాలం సాయిబాబా వద్ద ఉన్నాను. నేనొకసారి మసీదులో సాయిబాబా సన్నిధిలో ఉండగా పెద్ద తుఫాను వచ్చింది. పెనుగాలులు వీస్తూ కుండపోతగా వర్షం కురవసాగింది. కొన్ని నిముషాల తరువాత బాబా మసీదు అంచున నిలబడి ***"కొంచెం ఆగు (జరా థాంబా)"*** అని తుఫానును ఉద్దేశించి అన్నారు. వెంటనే తుఫాను తగ్గిపోయింది!

## 32

## డిసెంబరు 2వ తేదీ, 1936- శిరిడీ

**శ్రీమతి భికూబాయి** (శ్రీబయ్యాజీ పాటిల్‌కోతే భార్య), వయస్సు సుమారు 42సం॥లు, మరాఠీ, శిరిడీ

నా పుట్టినిల్లు అహ్మద్‌నగర్‌లో ఉంది. అక్కడ బాబాసాహెబ్ గణేశ్ అను ప్లీడరుండేవాడు. అతను రాధాకృష్ణ ఆయీ తాతగారు. అతనింట్లోనే ఆయీ ఉండేది. ఆయీ నా స్నేహితురాలు. ఆయీ దగ్గర సాయిబాబా ఫోటో ఒకటి ఉండేది. ఆమె ఆ ఫోటోకు భక్తితో ఆరతిస్తూ పూజించేది. ఆమె ద్వారానే నేను 'సాయిబాబా'ను గురించి విన్నాను. తాను బాబా వద్దకు వెళ్ళాలనుకుంటున్నట్లు ఆయీ నాతో చెప్పింది.

నాకు చిన్నవయస్సులోనే సంగమనేరులో నున్న ఒక వ్యక్తితో వివాహమయ్యింది. కానీ పెండ్లయిన కొంతకాలానికే నా భర్త మరణించాడు. నా స్నేహితురాలు రాధాకృష్ణ ఆయీ బాబా సేవ చేసుకుంటూ శిరిడీలో ఉండడంతో, నేను నా పద్నాల్గవ ఏట (1908) సంగమనేరు నుండి ఇక్కడికి (శిరిడీ) వచ్చాను. వంజర్‌గాంకు చెందిన గంగగిర్ మహరాజ్ వాడాకు సమీపంలోనున్న చింతచెట్ల క్రింద పెద్ద ఎత్తున నామసప్తాహం నిర్వహించారు. ఆ సప్తాహానికి ప్రతిరోజు ఎంతోమంది యాత్రికులు హాజరయ్యేవారు. ఈ యాత్రికులలో సంగమనేరుకు చెందిన భక్తబృందమొకటి ఉంది. వారు తిరిగి వచ్చేటప్పుడు నా స్నేహితురాలు రాధాకృష్ణ ఆయీ పంపిన బాబా ఫోటో, బర్ఫి ప్రసాదం తెచ్చి ఇచ్చారు. ఆమె నన్ను శిరిడీకి వచ్చి ఉండమని ఆహ్వానించినట్లు కూడా చెప్పారు. ఆమె ఆహ్వానం మేరకు నా ఆస్థిని, బంగారు నగలను వదిలేసి, శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాను. బాబా నన్ను ఆయీతో ఉండి, సేవ చేసుకోమని ఆదేశించారు.

నా భర్త యుద్ధంలో మరణించినందువల్ల నాకు నెలకు రూ 6/- వంతున పింఛను వస్తుంది. 1916 సంవత్సరం ఆఖరులో అంటే ఆయీ చనిపోయిన రెండు నెలల తరువాత నేను పింఛను తెచ్చుకోడానికి అహ్మద్‌నగర్ వెళ్ళాను. పింఛను తీసుకొని తిరిగివస్తూ బాబాకు సమర్పించడానికి ఒక పూలమాల, పేడాలు, పుచ్చకాయ కొని కోపర్‌గాంలోని గోదావరి తీరానికి చేరాను. నా స్నేహితురాలు ఆయీని అక్కడే దహనం చేసిన విషయం గుర్తుకొచ్చి నా మనసు వికలమైంది.

తరువాత శిరిడీ చేరి మసీదుకెళ్ళాను. పూలమాలను బాబా మెడలో వేయడానికి ముందుకు వెళ్ళగా ***"అశాంతచిత్తంతో తెచ్చిన ఆ పూలమాల నాకక్కరలేదు! (తళళా హార్ మలా నకో)"*** అంటూ బాబా దానిని నిరాకరించారు. నేను ఎంతో కష్టపడి అహ్మద్‌నగర్ నుండి ఆ పూలమాలను తెచ్చినందువల్ల, దానిని స్వీకరించమని దీక్షిత్ కూడా బాబాను ప్రార్థించాడు. అప్పుడు నేను ముందుకెళ్ళి పూలమాలను బాబా మెడలో వేయడానికి చేతులు రెండూ పైకెత్తాను. చిత్రంగా పూలమాల మూడుముక్కలయ్యింది. ఒక చేతిలో ఒక ముక్క, రెండవ చేతిలో మరోముక్క మిగిలిపోయి, మూడవ ముక్క క్రిందపడిపోయింది. అదెలా తెగిందో నాకు అర్థం కాలేదు. తిరిగి బాబా ***"నాకు అక్కరలేదు"*** అన్నారు.

తరువాత నేను తెచ్చిన పేడాలు, పుచ్చకాయ ముక్కలు వారి ముందుంచాను. బాబా వాటిని తీసుకొని భక్తులందరికి పంచారు. నేను ఒక పుచ్చకాయ ముక్క తీసుకొని, దాని చెక్కు తీసి వారికిచ్చి తినమని ప్రార్థించాను. దీక్షిత్ కూడా తినమని ప్రార్థించాడు. బాబా ***"ఈమె గోదావరి ఒడ్డున కూర్చొని విలపిస్తూ కన్నీరు కార్చింది. హృదయవేదనతో తెచ్చిన వీటిని నేను స్వీకరించను"*** అన్నారు. నేను గోదావరి తీరంలో ఏడుస్తూ తమ భక్తురాలిని అంతటి హేయమైన చావు నుండి కాపాడలేకపోయారని బాబాను నిందించిన విషయం వాస్తవమే. బాబాకు నా హృదయవేదన తెలిసినందువల్లనే నేను తెచ్చినవాటిని స్వీకరించలేదు.

బాబా ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో నాకూ ఒక గిన్నె నిండా ఆహారం ఇచ్చేవారు. నేను ఆ ప్రసాదాన్ని ఇంటికి తీసుకొని వెళ్ళేదాన్ని. బాబా మహాసమాధి చెందిన రోజు నేను దిక్కులేనిదానిని అయ్యానన్న బాధతో హృదయ విదారకంగా విలపించాను. "బాబా! మిమ్మల్ని ఇక చూడలేను కదా?" అని దుఃఖిస్తూ బయటకు వచ్చాను. అప్పుడు రాత్రి 10 గం॥లు అయి ఉంటుంది. ఇంటి వాకిలి వద్ద ఒక పాము కనిపించింది. బాబానే పాము రూపంలో దర్శనమిచ్చారని తలచి "బాబా మిమ్మల్ని ఈ సర్పరూపంలో గుర్తించలేను. నాకు తెలిసింది మీ సాయిబాబా రూపం మాత్రమే!" అన్నాను. పాము అదృశ్యమయ్యింది.

## 33

## డిసెంబరు 3వ తేదీ, 1936- శిరిడీ

**ఒక గుమాస్తా,** వయస్సు 44 సం॥లు, పార్శీ, బొంబాయి ఆఫీసు.

1913లో ప్రప్రథమంగా నేను శిరిడీలోని శ్రీసాయిబాబా వద్దకు వెళ్ళాను. దానికి కారణం నా స్నేహితులు కొందరు శిరిడీలోనున్న సాయిబాబా ఒక్కరే నా సోదరుని పిచ్చిని నయం చేయగలరని చెప్పారు. ఎంతోమంది వైద్యులచే చికిత్స చేయించినా నయం కాకపోవడంతో స్నేహితుల సలహా మేరకు నేను నా సోదరుణ్ణి తీసుకొని శిరిడీ వెళ్ళాను. అక్కడ కొన్ని రోజులున్న తరువాత అతని ఆరోగ్యం కొంచెం మెరుగైనట్లు అనిపించింది. మమ్మల్ని వెళ్ళిపొమ్మనడంతో బొంబాయి తిరిగివచ్చాము. కానీ తిరిగి వచ్చిన తరువాత అంతకుముందు కన్నా పిచ్చి అధికమయింది. తల్లికి, ఇతర కుటుంబ సభ్యులకు ఎంతో ఇబ్బందిని కలుగజేసాడు. నేను అతని పరిస్థితి వివరిస్తూ బాబాకు జాబు వ్రాసాను. బాబా అతనిని తీసుకొని తిరిగి శిరిడీ రమ్మని ఆదేశించారు. వారి ఆదేశం మేరకు అతనిని తీసుకొని శిరిడీ వెళ్ళాను. అక్కడ అమీదాస్ మెహతా సంరక్షణలో నా సోదరుని ఉంచి, అతని ఖర్చులకు ప్రతినెల 30 రూపాయలు పంపుతూ ఉండేవాడిని. అక్కడ నా సోదరుడు ప్రతిదినం ఆరతికి హాజరవుతూ, బాబా ఊదీ, తీర్థము సేవిస్తూ కొన్ని నెలలు గడిపిన తరువాత బాబా కృపవలన అతని పిచ్చి పూర్తిగా నయమై ఆరోగ్యవంతుడయ్యాడు. ఎన్ని రకాల మందులు ఎన్నిరోజులు వాడినా తగ్గని జబ్బు కేవలం బాబా కృపతో నయం కావడమనేది ఒక అద్భుతం! అప్పటి నుండి మాకు బాబాపై ప్రగాఢ నమ్మకము, భక్తి ఏర్పడ్డాయి. నేను నా గదిలో వారి ఫోటో పెట్టుకొని పూజిస్తుండేవాడిని. నేను యువకుడినైనందువల్ల ప్రాపంచిక ప్రయోజనాలను ఆశించి మాత్రమే అప్పుడప్పుడు శిరిడీకి వెళ్ళి బాబాను దర్శించేవాడిని. నేను మొదట బాస్రాలోను తరువాత 1917 నుండి 1918 వరకు సూయెజ్‌లోనూ ఉండి విలాసవంతమైన జీవనం గడుపుతూ జీవితం పట్ల సరియైన దృక్పథం లేక నిర్లక్ష్యంగా ఉండేవాడిని. బాబా మహాసమాధి చెందిన తరువాతే ఉన్నత, ఆధ్యాత్మిక జీవితం వైపు నా దృష్టి మరలింది.

నేనెప్పుడూ వారిని ఆధ్యాత్మిక ప్రగతి గురించి ప్రార్థించలేదు. మొదట నా సోదరుని అనారోగ్యం, తరువాత నా ఇద్దరు చెల్లెళ్ళ వివాహం మొదలైన సమస్యలు నా మనసును తొలిచేసేవి. వీటి పరిష్కారం కొరకు నేను బాబాను ఆర్తిగా ప్రార్థించాను. వారిని పూర్తిగా విశ్వసించాను. వారి కృపవలన నా చెల్లెళ్ళకు వివాహాలు జరిగాయి. బాబా నా కోరికలన్నీ తీర్చారు.

నాకు 1920లో బాబా కృపవలన వివాహమయింది. అప్పుడు నాకు 100 రూపాయల జీతం మాత్రమే వచ్చేది. అది నా కుటుంబాన్ని పోషించడానికి సరిపోదు. అయినప్పటికీ నాకు బాబా ఆశీస్సుల వలనే వివాహమై నాకు ఒక కుమారుడు, కుమార్తె కలిగారు.

నా భార్యకు ఎప్పుడూ అనారోగ్యంగా ఉండేది. నేను ఆమె ఆరోగ్యం కొరకు బాబాను ప్రార్థించేవాడిని. ఈ మధ్య ఒక నెలరోజుల ముందు నా భార్య పరిస్థితి ప్రమాదస్థితికి చేరింది. నా భార్య చనిపోతే ఆ విఘాతాన్ని తట్టుకోలేక 70 సంవత్సరాల వృద్ధురాలైన మా అమ్మ కూడా మరణిస్తుందేమోనని భయపడ్డాను. అందువల్ల నా భార్యను బ్రతికించమని బాబాను తీవ్రంగా ప్రార్థించాను. బాబా సంకల్పానుసారం నా భార్య కోలుకుంది. కానీ వృద్ధాప్యం తప్ప ఏ అనారోగ్యము లేని మా అమ్మ అకస్మాత్తుగా 'డబుల్ న్యుమోనియా'తో చనిపోయింది. నా తండ్రి చాలా సంవత్సరాల ముందే 1904లో మరణించాడు.

నాకు 12 సంవత్సరాల వయసున్నప్పుడు బాబా తరచూ కలలో కనిపించేవారు. (నేనెప్పుడూ వారి పటాన్ని చూస్తూ నమస్కారం చేసుకునేవాడిని). బాబా నా కలలో కనిపించారంటే అది నన్ను పట్టి పీడిస్తున్న ఏదో కీడును తొలగించడానికో లేక నాకు రాబోయే ప్రమాదాన్ని నివారించడానికో సూచన అని నా అభిప్రాయం. బాబాతో నా అనుభవం సంతోషదాయకమైనది. ఎప్పుడు నేను వారి సన్నిధికి వెళ్ళినా ఏ చీకూ చింత లేకుండా అన్ని సమస్యలు మరచి, ఆనందపారవశ్యంలో తేలిపోయేవాడిని. అది ఎంతో అద్భుతం! ఇప్పటికీ వారు కలలో కన్పించినప్పుడు అదే విధమైన అనుభూతిని పొందుతాను.

బాబా దయామయులు, సర్వజ్ఞులు. ఇది దక్షిణ విషయంలో కూడా నాకు అవగతమైంది. నేను చాలా పేదవాడిని. 1913లో నేను వారి దగ్గరకు వెళ్ళినప్పుడు

నా నెల జీతం 60 రూపాయలు. బాబా నన్ను దక్షిణ అడిగేవారు. ఒక్కొక్కసారి మొత్తం నా జేబులో ఉన్నదంతా కూడా తీసేసుకునేవారు. ఒకసారి నా దగ్గర ఎనిమిది రూపాయలున్నాయి. వారు ఈ మొత్తాన్ని దక్షిణగా స్వీకరించారు. నా దగ్గరున్న పైకాన్నంతా చివరి పైసా వరకు వారికి సమర్పించడానికి నాకు ఎటువంటి అభ్యంతరం లేదని వారికి చెప్పాను. ఆపై వారు దక్షిణ అడగలేదు. నా దగ్గరున్నదంతా వారికి సమర్పించినప్పుడు కూడా నాకు ఎలాంటి ఇబ్బందీ కలుగలేదు. వారు మనకి ఇవ్వడం ద్వారా అనుగ్రహించడమే కాదు, మన దగ్గర నుండి తీసుకోవడం ద్వారా కూడా మనలను అనుగ్రహించేవారు.

నేను బాబా వద్దకు కొన్నిసార్లు మాత్రమే వెళ్ళి కొద్ది సమయం మాత్రమే గడిపినందున నాకు ఎలాంటి ఆధ్యాత్మిక అనుభవాలు లేవు. నేను ఈనాటి వరకు ఏ ఆధ్యాత్మిక గ్రంథాలు (గాథలు మొదలైనవి) చదవలేదు. పార్శీ పవిత్ర గ్రంథాలు అధ్యయనం చేసిన పండితుడిని బాబా ఎలా ప్రభావితం చేస్తారో నేను చెప్పలేను.

మనం భగవంతుని గురించి తెలుసుకొని వారితో ఏకమవ్వాలి. ముందుగా మనకు సరియైన ఆలోచనా విధానం ఉంటే అది సత్ప్రవర్తనను అలవరిచి చివరకు భగవంతుని చేరేందుకు దోహదం చేస్తుంది. జోరోస్టర్ ప్రబోధించిన మతాన్నే పార్శీలు అనుసరించేవారు. పార్శీలు సూర్యుడు, సముద్రము, అగ్నిని దైవస్వరూపాలుగా భావించి వాటిలో దేనిముందైనా నిలబడి ప్రార్థిస్తారు. నాకు జోరోస్టర్ పట్ల ఉన్న భక్తిభావం బాబాను కొలిచేందుకు అడ్డంకి కాలేదు. అప్పటికే పాదుకొని ఉన్న ఒక సాంప్రదాయంలో పురోహిత వర్గం యొక్క అలక్ష్యం వల్ల చేరిన ప్రక్షిప్తాలను జోరోస్టర్ తొలగించి సంస్కరించాడు.

మనం బాబాను ప్రార్థించి వివిధ ప్రాపంచిక కోరికలు తీర్చుకుంటాము. ఈ విధంగా చేయడం సరియైనది కాదని పార్శీమతంలోగానీ, మరే ఇతర మతగ్రంథాలలోగానీ చెప్పబడిందేమో నాకు తెలియదు.



బాపూసాహెబ్ బూటీ



నానాసాహెబ్ నిమోణ్కర్

## 34

## సెప్టెంబరు ౬వ తేదీ, ౧౯౩౬

**సోమనాథ్ శంకర్ దేశ్‌పాండే,** పోలీసు ఇన్‌స్పెక్టరు, తండ్రి: శంకర్ ఉరఫ్ నానాసాహెబ్ నిమోణ్కర్; వయస్సు 51సం॥లు, బ్రాహ్మణుడు, నెం.376, శనివార్‌పేట్, పూనా.

నేను నానాసాహెబ్ నిమోణ్కర్ కుమారుణ్ణి. మా స్వస్థలమైన నిమోణ్ శిరిడీకి 20 మైళ్ళ దూరంలో ఉంది. నిమోణ్ నుండి కోపర్‌గాం వెళ్ళాలన్నా, కోపర్‌గాం నుండి నిమోణ్ వెళ్ళాలన్నా శిరిడీ మీదుగానే వెళ్ళాలి. నిమోణ్‌లో మాకు చాలా భూములున్నాయి. శిరిడీలో మా బంధువులున్నారు. షామా తండ్రి బల్వంతరావు దేశ్‌పాండే నాకు తాతయ్య అవుతాడు. ఆయనకు మా నాన్న అంటే అమితప్రేమ. బాబాను చూడాలని బల్వంతరావు ఎప్పుడు మసీదుకెళ్ళినా దూరం నుంచే బాబా అతనిపై ఇటుకరాయి విసిరేవారు, లేదా విసురుతానని బెదిరించి తరిమి వేసేవారు. అలా బాబా జనులనెవ్వరినీ తమ మసీదులోనికి రానిచ్చేవారు కాదు.

ఒకసారి బల్వంత్‌రావు "సాయిబాబాను అందరూ పిచ్చి ఫకీరంటారు. నాకూ అదే సందేహంగా ఉంది. నువ్వు నాతో వచ్చి వారిని చూసి నీ అభిప్రాయం చెప్పు" అని మా నాన్నను బాబా వద్దకు తీసుకెళ్ళాడు. మా నాన్న మసీదుకు వెళ్ళినప్పుడు మాత్రం బాబా రాళ్ళు రువ్వలేదు. దాంతో వాళ్ళు బాబా దగ్గరకు వెళ్ళి దర్శించుకోగలిగారు. బాబాను చూడడంతోనే మా నాన్న హృదయం ఆయన పట్ల ఆకర్షితమయింది. ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు, మా నాన్న బల్వంతరావుతో బాబా పిచ్చివాడు కాడని గొప్ప మహనీయులని చెప్పాడు. ఇంతకు మునుపు బాబా వద్దకు వెళ్ళినప్పుడు, వారు తనపై రాళ్ళు రువ్వేవారు కదా? మరి ఇప్పుడు ఎందుకు రువ్వలేదని బల్వంతరావు ఆశ్చర్యపోయాడు. అందుకు మా నాన్న "నీవు బాబాను పిచ్చివారని సందేహించావు. అందుకే అలా జరిగింది. నేనలా సందేహించలేదు" అని చెప్పాడు. అప్పటి నుండి మా నాన్న ఏడాదికి, రెండేళ్ళకూ ఒకసారి బాబాను దర్శించేవాడు. బాబాపై భక్తిశ్రద్ధలు పెరగనారంభించిన తరువాత తరచుగా వారిని దర్శించుకొనేందుకు వెళ్ళేవాడు.

మా నాన్న సంగమనేరు గౌరవ మేజిస్ట్రేటుగా ఉన్నప్పుడు కలెక్టరు పి.ఎ.గా పనిచేస్తున్న నానాసాహెబ్ చాందోర్కర్‌ను కలిసాడు. చాందోర్కర్ కూడా

సాయిబాబాను ఆరాధించేవాడు. వారిరువురూ బాబాను గురించి మాట్లాడుకునేవారు. చాందోర్కర్ మసీదును పునరుద్ధరించడానికి చందాలు వసూలు చేసినప్పుడు మా నాన్న కూడా తనకు చేతనైనంత చందా ఇవ్వడమేగాక మసీదు పునర్నిర్మాణ కార్యక్రమాలను పర్యవేక్షించాడు. బాబా, పనివాళ్ళను మసీదు మరమ్మత్తు పనులను చేయనిచ్చేవారు కాదు. ఆ పనులకు అడ్డుపడి, చేసిన పనులు తారుమారు చేస్తూండేవారు. అందువలన చాలాకాలం పునాదులు కూడా వేయలేకపోయారు. అందువల్ల బాబా చావడిలో నిద్రిస్తున్నప్పుడు మా నాన్న రాత్రిళ్ళు త్వరితగతిన పనులు చేయించేవాడు.

బాబాకు మా నాన్నపై ఎంతో నమ్మకముంది. అందుకే 1916-18 సంవత్సరాలలో మా నాన్న శిరిడీలో ఉన్నప్పుడు, బాబా ఆయనను షరాబుగా (బ్యాంకర్) చేశారు. బాబా తమకు వచ్చిన డబ్బును మా నాన్నకి ఇచ్చేవారు. ఇది చూసి మా నాన్నకు బాబా డబ్బు దానంగా ఇస్తున్నారని మాధవరావు కూడా పొరపడ్డాడు. మా నాన్నకి ఎవరి వద్ద నుండి డబ్బు తీసుకోవలసిన అవసరం ఉండేది కాదు. ఎందుకంటే మాకు భూముల ద్వారా వచ్చే సంవత్సర ఆదాయం 500 రూపాయల వరకు ఉండేది. మా నాన్న అవసరాలకు సరిపడా డబ్బు నేను పంపుతూ ఉండేవాడిని. అంతేగాకుండా మా నాన్న ***"ఫకీరు డబ్బు ఎవరి చెంతా నిలవదు"*** అని తరచుగా బాబా చెప్పే మాటలు జీర్ణించుకొని ఉన్నవాడు. ఎవరైనా ఫకీరు డబ్బు తింటే ఎప్పటికైనా చివరిపైసా వరకు కక్కవలసి ఉంటుంది. ఇటువంటి డబ్బు, కానుకలకంటే శ్రేష్ఠమైన మా ప్రాపంచిక, పారమార్థిక ఉన్నతినే మా నాన్న బాబా నుండి కోరుకొని వాటిని పొందాడు. కనుక బాబా డబ్బులు బాబా ఖర్చులకే ఉపయోగించేవాడు. బాబా స్వయంగా మా నాన్నను పిలిచి భక్తులకు ప్రసాదం పంచడానికి బర్ఫీ తెప్పించమనో ధునిలోనికి పెద్ద మొత్తంలో కట్టెలు తెప్పించమనో ఆదేశిస్తూ ఉండేవారు. మా నాన్నను మేము 'కాకా' అని పిలిచేవాళ్ళం. గ్రామస్థులు కూడా అలాగే పిలిచేవారు. దాంతో బాబా కూడా 'కాకా' అని పిలిచేవారు.

బాబా ద్వారా మా నాన్న ఆధ్యాత్మిక లబ్ధిని పొందారన్నదానికి నిదర్శనగా ఈ క్రింది విషయం చెప్పగలను. మా నాన్న సంస్కృతంలో భాగవతాన్ని, ఇతర గ్రంథాలను పారాయణ చేయాలనుకున్నాడు. మా నాన్నకు సంస్కృతం రానందున చదవలేకపోయాడు. ఒకసారి బాబా ఆయనతో,

*బాబా : నువ్వు ఎందుకు పారాయణ చేయవు?*

నిమోణ్కర్ : బాబా నాకు సంస్కృతం రాదు.

*బాబా : అయినా ఫర్వాలేదు. ప్రారంభించు. ఈ మసీదు తల్లి నీకు తప్పక సంస్కృతం నేర్పుతుంది. క్రమంగా నువ్వే నేర్చుకుంటావు!*

బాబా మాటల మీద నమ్మకంతో మా నాన్న శ్రీమద్భాగవతం దాని వ్యాఖ్యానం సంస్కృతంలో చదవడం మొదలుపెట్టాడు. అర్థం కాకపోయినా చదవడం కొనసాగించాడు. క్రమేణా మా నాన్నకు సంస్కృతం అర్థం కాసాగింది. అంతేకాదు బాబా ఆదేశం మేరకు భగవద్గీత, జ్ఞానేశ్వరి కూడా పారాయణ చేయగలిగాడు. అవన్నీ అర్థం చేసుకోగలిగాడు. నిత్యం సంస్కృతాధ్యయనం చేసే గొప్ప పండితులైన కాకాసాహెబ్ దీక్షిత్, జోగ్ మొదలైనవారి సందేహాలను మా నాన్న నివృత్తి చేసేవాడు. బాబా అనుగ్రహం వలనే మా నాన్న ఇంత చక్కగా అర్థం చేసుకోగలిగాడని వాళ్ళందరూ అన్నారు. కానీ బాబా ఒకసారి మా నాన్నతో ***"కాకా! మనమెందుకు ఇతరులకు విశదపరచాలి? అలా చేయడం వలన క్రమేణా మనలో అహం పెరుగుతుంది"*** అని చెప్పి ఇతరులకు వివరించడాన్ని ఆపేయమన్నారు.

పూనాలో మా నాన్న నాతో గడిపిన చివరి రెండు నెలల్లో ఆయన బాబా ద్వారా పొందిన కొద్దిపాటి ఆధ్యాత్మిక శక్తితోనే ఇతరుల కష్టాలను నివారించాడు.

మా నాన్న పొందిన ప్రాపంచిక ఉన్నతి ద్వారా ఆయన ప్రజలలో ఎంతో పేరుప్రఖ్యాతులు పొందాడు. అంతేకాకుండా మా కుటుంబసభ్యుల అందరిపై కూడా సాయిబాబా కృప అపారంగా వర్షిస్తుండేది. మా నాన్న నా చిన్నతనం నుండి నన్ను బాబా దగ్గరికి తీసుకొని వెళ్తుండేవాడు. బాబా నన్ను ***"సోమ్నియా"*** అని ముద్దుగా పిలుస్తూ ఎంతో ప్రేమాభిమానాలతో చూసేవారు.

బాబాకు నాపై ఉన్న ప్రేమ ఎటువంటిదో తెలియజేసే మరో సంఘటన మా నాన్న నాకు చెప్పాడు. ఇది నేను ఉద్యోగంలో చేరక మునుపు జరిగింది. బాబా మసీదులో కూర్చొని ఒక గుడ్డ సంచీలోని కొన్ని నాణాలను బయటికి తీసి ఒక్కొక్క నాణాన్ని చేతిలోనికి తీసుకొని వేళ్ళతో రుద్దుతూ ***"కాకాచ, సోమ్యాచ"*** అంటుండేవారు. దీన్నిబట్టి బాబా నన్ను తరచుగా తలచుకునేవారని అది నాకెంతో మంచిదని మా నాన్న చెప్పాడు.

1912లో నేను కోపర్‌గాం సబ్‌ఇన్‌స్పెక్టరుగా పనిచేసేవాడిని. శిరిడీ నా అధికార పరిధిలోనే ఉండేది. నేను ప్రతినెలా జీతం తీసుకున్న వెంటనే, రెండు రూపాయలు మనీయార్డరు ద్వారా బాబాకు పంపేవాడిని. ఇలా చేయమని మా నాన్న నన్నాజ్ఞాపించాడు. బహుశా ఇది వారి మ్రొక్కై ఉండవచ్చు. ఇలా పంపడం మా నాన్న చనిపోయిన తరువాత కొంతకాలం వరకు అంటే 1920 వరకు కొనసాగించాను. నేను కోపర్‌గాంలో ఉన్నప్పుడు ఒకసారి మా నాన్నతో కలిసి బాబాను దర్శించాను. బాబా నన్ను 10 రూపాయలు దక్షిణ అడిగారు. నేను సమర్పించాను. అప్పుడు బాబా దక్షిణ అడగడంలో నాకెటువంటి ప్రత్యేకత కనిపించలేదు. ఆరు నెలల తరువాత బాబా నన్ను దక్షిణ అడిగిన రోజు నుండి నా జీతం 10 రూపాయలు పెంచినట్లు ఉత్తర్వులు వచ్చాయి. తరువాత 1912లో నాకు కోపర్‌గాం నుండి పూనాకు బదిలీ అయ్యింది.

బాబా మా యోగక్షేమాలకు బాధ్యత వహించి ఉన్నారని తెలిపే సంఘటనలు ఎన్నో ఉన్నాయి (యోగక్షేమం వహామ్యహం). మా నాన్న జీవితంలో చివరి మూడు సంవత్సరాలలో బాబా ఆయనను కాపాడిన వైనం ముఖ్యమైనది. 1916లో నా భార్య గర్భవతిగా ఉన్నప్పుడు ఆమెకు సహాయంగా ఉండేందుకు మా అమ్మా నాన్నలను రమ్మని కబురుపెట్టాను. వాళ్ళు నిమోణ్ నుండి పూనాకు బయలుదేరారు. అప్పుడు బాబా త్వరలోనే సమాధి చెందబోతున్నారనే వదంతులు వ్యాపించాయి. అందువల్ల మొదట వాళ్ళు శిరిడీ వెళ్ళి బాబాను దర్శించారు. అప్పుడు బాబా వాళ్ళను అక్కడే ఉంచేశారు. వాళ్ళను పూనా వెళ్ళడానికిగానీ, తిరిగి నిమోణ్ వెళ్ళడానికిగానీ అనుమతించలేదు. వారెందుకలా అనుమతి నిరాకరించారో మా నాన్నకు అర్థం కాలేదు. మాధవరావు మా నాన్న తరఫున బాబాను అనుమతి కోరాడు.

*బాబా : నా మనుషులను చంపదలచావా ఏం? కాకా నీ అబ్బ సొమ్ము ఏమైనా తింటున్నాడా?*

మాధవరావు : అతని కోడలు గర్భవతి. ఆమెకు సహాయం కావలసివుంది.

*బాబా : అరే కాకా, నీవేమీ ఆందోళన పడకు. భగవంతుడు సహాయం చేస్తాడు (మా నాన్నను ఉద్దేశించి అన్నారు).*

ఇంకా, *"నన్ను సమాధి చేసి, వెళ్ళు!"* అని బాబా మా నాన్నతో అన్నారు. మా నాన్నను శిరిడీలో నిలిపివేసినప్పుడు వారు గుడ్డతో తమ చేతికి కట్టు

కట్టుకున్నారు. ఈ కట్టును 3 సంవత్సరాల వరకు విప్పకుండా ఉంచుకొని వారు సమాధి చెందడానికి 4 రోజుల ముందు మాత్రమే విప్పారు. బాబా సమాధి చెందిన నాలుగు నెలల తరువాత మా నాన్న మరణించాడు. ఆ విషయాన్ని ఆయన ముందే ఊహించి (బాబా సమాధి చెందిన 3, 4 రోజుల తరువాత) శిరిడీ విడిచి వెళుతూ మాధవరావుకు చెప్పాడు.

నా తల్లిదండ్రులు శిరిడీలో ఉన్నప్పుడు వారు ఎలాగైనా మా దగ్గరికి వస్తారనే ఉద్దేశ్యంతో మేము చివరి వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోలేదు. అకస్మాత్తుగా ఒకరాత్రి నా భార్య తనకు పురిటి నొప్పులొస్తున్నాయని చెప్పింది. వెంటనే నేను 10 గం॥ల సమయంలో టాంగా తెప్పించుకొని ఆమెను పూనా మునిసిపల్ ప్రసూతి ఆసుపత్రికి తీసుకెళ్ళాను. ఆమెను చూసుకోవాల్సిన నర్సు నాతో ప్రక్కగదిలో మాట్లాడుతూ ఉంది. సుమారు 11 గం॥ల సమయంలో అప్పుడే పుట్టిన బిడ్డ ఏడుపు వినిపించింది. నా భార్య ఎవరి సహాయం లేకుండా సుఖంగా మగబిడ్డను ప్రసవించింది. ఇంచుమించు అదే సమయంలో శిరిడీలో బాబా మా నాన్నతో *“ఒక స్త్రీ ఉంది. ఆమెను ఒక ప్రదేశానికి తీసుకెళ్ళారు. ఆమె సుఖంగా ఒక మగబిడ్డను ప్రసవించింది!”* అన్నారు.

ప్రసవమైన వెంటనే నా సోదరునితో బాబాకు, అప్పుడు శిరిడీలో ఉన్న మా తల్లిదండ్రులకు మిఠాయిలు పంపాను. సాధారణంగా బిడ్డ పుట్టినప్పుడు ఆత్మీయులకు మిఠాయిలు పంచడం ఆనవాయితి. వెంటనే పూనా బయలుదేరి వచ్చి ఇంట్లో తోడుగా ఉండమని మా తల్లిగారికి కబురు కూడా పెట్టాను. కానీ ఆమెను కూడా పూనా పంపడానికి బాబా అనుమతించలేదు. బిడ్డ పుట్టినప్పుడు బాబా అన్న మాటలను మా నాన్న నా సోదరునితో చెప్పాడు. అది 1916 భాద్రపదం.

మా కుటుంబంపై బాబా రక్షణను తెలియజేసే మరో సంఘటన వివరిస్తాను. 1917 డిసెంబరులో పూనాలో ప్లేగు వ్యాధి చెలరేగింది. నిమోణ్‌లో నా సోదరుని భార్య ప్రసవించింది. రెండుమూడేళ్ళ వయసున్న నా కుమారుడు గోపాల్‌ను తీసుకొని క్రిస్మస్ సెలవులలో నేను నిమోణ్ బయలుదేరాను. దారిలో మేము శిరిడీలో ఆగి బాబాను దర్శించాము. బాబా నన్ను నిమోణ్ వెళ్ళడానికి అనుమతిస్తూ *“బిడ్డను రక్షించుకో (పోరాలా జీవ్ లావ్)”* అంటూ ఊదీ ప్రసాదించారు. ఇది బాబా

నా కుమారుడు గోపాల్‌కు ఇచ్చిన ఆశీర్వాదం అనుకొని వాడి నొసటిపై ఊదీ రాసి టాంగాలో నిమోణ్ బయలుదేరాను. నేను నిమోణ్ చేరేసరికి నా సోదరుని 12 రోజుల బిడ్డకు సుస్తీ చేసి అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. ఒళ్ళంతా చల్లబడిపోయింది. తల్లిదండ్రులు ఆశ వదులుకొని బిడ్డ మరణించిందనే అనుకున్నారు. బాబా శిరిడీలో చెప్పింది ఈ బిడ్డ గురించేనని గోపాల్ గురించి కాదని నాకప్పుడు అర్థమైంది. బాబా ఇచ్చిన ఊదీకోసం వెతికాను. కానీ అది ప్రయాణంలో ఎక్కడో పడిపోయింది. నేను ఆ బిడ్డను నా ఒడిలోనికి తీసుకొని కాపాడమని మనఃస్ఫూర్తిగా బాబాను ప్రార్థించాను. 15 నిముషాలలో బిడ్డ కోలుకుంది. క్రమేణా ఆరోగ్యం చేకూరింది. ఆ బిడ్డను దైవదత్తంగా భావించి "దత్త" అని నామకరణం చేశారు.

నేను శిరిడీ నుండి పూనా తిరిగి వెళ్దామనుకున్న సమయంలో పూనాలో ప్రబలి ఉన్న ప్లేగు ఇంకా తగ్గలేదు. కానీ నాకు సెలవులు లేకపోవడంతో నేను 3.1.1917లో తిరిగి డ్యూటీలో చేరవలసి ఉంది. కానీ బాబా నాకు అనుమతి ఇవ్వడానికి సుముఖంగా లేరు. మా నాన్న బాబా చేతిలో ఊదీ పెట్టి నన్ను ఆశీర్వదించి పంపమని ఒత్తిడి తెచ్చాడు. మేము జనవరి 3వ తారీఖున పూనా చేరేసరికి మా ఇంటి యజమానికి ప్లేగుసోకి మంచంలో ఉన్నాడు. 4వ తారీఖున నా భార్యకు కూడా ప్లేగు సోకింది. నేను, పిల్లలు ఎక్కడికీ వెళ్ళలేక అక్కడే ఉండిపోయాము. బాబా నా భార్యనే కాక మమ్మల్నందరినీ కూడా కాపాడారు. వారి కృపవలన నా భార్య కోలుకుంది. కానీ ఆమె కంటిచూపు పోయింది. మేము ఊరు వదిలి ఆరోగ్య శిబిరానికి తరలి వెళ్ళడం మంచిదనిపించి ఆ విషయం బాబా ముందుంచాము. వారు ***"ఇల్లు ఎందుకు విడిచిపెట్టడం?"*** అని అనుమతించలేదు. మేము వారి ఆదేశాన్ని పాటించి క్షేమంగా ఉన్నాము. నా భార్యకు ఆరోగ్యం బాగులేనప్పుడు కూడా మా నాన్నను పూనా రమ్మని అభ్యర్థించాము. మా నాన్న బాబాను అనుమతి కోరాడు. ఈసారి కూడా ***"నన్ను సమాధి చేసిన తర్వాతే వెళ్ళు"*** అన్నారు బాబా.

1917 మార్చిలోనో ఏప్రిల్‌లోనో నేను తీవ్ర అనారోగ్యానికి గురయ్యాను. బహుశా అది ప్లేగుగానీ, టైఫాయిడ్‌గానీ అయి ఉండవచ్చు. మా నాన్నను రమ్మని తిరిగి జాబు వ్రాసాను. కానీ బాబా అప్పుడు కూడా మా నాన్నకు అనుమతి ఇవ్వలేదు. కానీ బాబా మా నాన్నతో ***"ఎందుకు ఆందోళనపడతావు? నీ సొమ్మియా త్వరలోనే***

*కోలుకొని మనల్ని చూడటానికి ఇక్కడికి వస్తాడు!"* అని అన్నారు. నా జ్వరం 21 రోజులదాకా తగ్గలేదు. ఆ సమయంలో కేవలం నీరు మాత్రమే తీసుకోగలిగాను. తరువాత క్రమేణా కోలుకున్నాను. నేను నా ఆరోగ్యం మెరుగుపడడానికి రెండు, మూడు నెలల సెలవుపెట్టి నా కుటుంబంతో ముందు బేలాపూర్ వెళ్ళాను. అక్కడ నాకు భక్తి మార్గాన్ని చూపి మంత్రోపదేశం చేసిన గురువు విద్యానందస్వామి సమాధి ఉంది. ఆ సమాధి చెంత కొన్నిరోజులు గడిపాను. అయినా నా ఆరోగ్యంలో పెద్దగా మార్పేమీ రాలేదు. చాలా బలహీనంగా ఉన్నాను. అక్కడికి మా అమ్మ వచ్చి మమ్మల్ని శిరిడీ తీసుకెళ్ళింది. అప్పుడు బాబా నాకు ప్రతిదినం కొంత కిచిడి పెట్టమని ఆదేశించారు. మా అమ్మ అలాగే చేసింది. నేను శిరిడీలో నెలరోజులు గడిపిన తరువాత నా ఆరోగ్యం కుదుటపడింది.

బాబా సమాధి చెందడానికి కొద్ది రోజులు ముందు నేను వారి వద్ద ఉన్నాను. అప్పుడు బాబాకు అనారోగ్యంగా ఉంది. భక్తులందరూ ఆదుర్దాగా ఉన్నారు. నేను తిరిగి వెళ్ళేందుకు సెలవు కోరితే బాబా అనుమతిచ్చేందుకు ఇష్టపడలేదు. కానీ నాకు పని ఉన్నందువల్ల నేను పూనా వెళ్ళిపోయాను.

బాబా సమాధి చెందిన 3 రోజుల తరువాత మా నాన్న శిరిడీ నుండి నిమోణ్‌కు వెళ్ళి అక్కడ నుండి అహ్మద్‌నగర్ వెళ్ళాడు. అప్పుడు నాకు పార్శ్వపు నొప్పి వచ్చింది. మా నాన్నకు కబురుపెట్టాను. నా కోరిక మేరకు పూనా వచ్చారు. అప్పటి నుండి మరణించేవరకు (రెండు నెలలు) నా దగ్గరే ఉన్నారు. ఆ చివరి రోజుల్లో నిరంతరం బాబా ధ్యాసలోనే గడిపేవారు. ఆయన దగ్గరకు వచ్చిన వారందరినీ 'సాయిబాబా'గా చూసేవారు. మా నాన్న మొదటి నుండి రామభక్తుడు. నిజానికి బాబాకు, రామునికి తేడాలేదు. మా నాన్న "శ్రీరామ్" అని పలికి తన తుది శ్వాస విడిచారు.

బాబా సశరీరులై ఉండగా వారికి నాలుగు రోజులు సేవ చేసుకునే భాగ్యం నాకు దక్కింది. ఒకసారి మా నాన్న సాక్ష్యం చెప్పడానికి అహ్మద్‌నగర్ వెళ్ళి అక్కడ నాలుగు రోజులు ఉండవలసి వచ్చింది. మా నాన్న తాను బాబాకు చేసే సేవలకు అంతరాయం కలుగకుండా ఆయన బదులు నన్ను శిరిడీలో ఉంచాడు. కానీ ఒక తేడా ఉంది. మా నాన్న వృద్ధుడు కాబట్టి కూర్చొనే సేవ చేసేవాడు. నేను యువకుడిని కాబట్టి నిలబడి సేవ చేసేవాడిని. ఇది చాలా శారీరక శ్రమతో కూడుకున్నది. రోజంతా

బాబాకు అందుబాటులో ఉంటూ వారి ఆజ్ఞలు పాటిస్తూ వారు విశ్రమించేవరకు వారి పనులన్నీ చెయ్యడం చిన్న విషయమేమీ కాదు.

ఆ రోజుల్లో బాబా నాకు ఒక దివ్యదర్శనాన్ని ప్రసాదించారు. ఒకసారి నేను మసీదులో ఉన్నాను. బాబా తమ గద్దెపై కూర్చొని ఉన్నారు. షామా మెట్ల దగ్గర కూర్చొని ఉన్నాడు. అప్పుడు బాబా నాకు మారుతిగా సాక్షాత్కరించారు. అకస్మాత్తుగా బాబా శరీరం మాయమై అక్కడ మారుతి రూపం దర్శనమయింది. ఆ రూపానికి తోక ఉన్నదో లేదో మాత్రం నేను గమనించలేదు. నేను మాధవరావుతో "అదిగో చూడండి. బాబా మారుతిగా దర్శనమిస్తున్నారు" అన్నాను. నిస్సందేహంగా బాబా రామభక్తులే. చావడి ఉత్సవమప్పుడు బాబా మారుతీ ఆలయం ఎదురుగా నిలబడి ఏదో ఉచ్చరిస్తూ 15, 20సార్లు తమ చేతిని మారుతి వైపు ఊపేవారు. నేను బాబా సమక్షంలో ఉన్నప్పుడు నా స్వాభావికమైన ప్రాపంచిక ఆలోచనలు మాయమై సరికొత్త ఆలోచనలు కలిగేవి. దీర్ఘకాలం మా నాన్న బాబా సన్నిధిలో గడిపినందువల్ల ఆయన సమర్థత, స్వభావం ఎంతో పరిణతి చెందాయి. బాబాతో మా నాన్నకు ఉన్నంత సాన్నిహిత్యం నాకు లేదు.

1918 నవంబరులో మా నాన్న అహ్మద్‌నగర్‌లో ఉండగా నాకు పార్శ్వపు నొప్పి వచ్చింది. నేను అది అపెండిసైటిస్ అనుకున్నాను. దాంతో నా ఉత్తరం అందుకొని మా నాన్న పూనా వచ్చి నాతో ఉన్నారు. ఆయన నాకు ఊదీ రాసారు. ఆ మరుసటిరోజు నుండి నొప్పి మాయమైంది. నా సోదరుడు నాతో ఉన్నాడు. అతనికి క్షయ రోగ లక్షణాలు కనిపించాయి. మా నాన్న అతడికి బాబా ఊదీ, తీర్థము ఇచ్చాడు. అతను కోలుకున్నాడు. నా సోదరుని కుమారుడైన దత్తునికి తలంతా దురదలొచ్చాయి. ఇది కూడా మా నాన్న ఊదీ ఇవ్వడంతో నయమైంది.

మా నాన్న ఆచార వ్యవహారాలలో ఎంతో నిష్ఠాగరిష్ఠుడిగా ఉండేవాడు. బాబా మా నాన్న ఆచారాన్ని గౌరవించి అందుకు విరుద్ధమైన ఏ ప్రసాదాన్ని ఆయనకు ఇచ్చేవారు కాదు.

బాబాకు ఒక పాదంలో మత్స్యము, రెండవ పాదంలో ధనుస్సు గుర్తులు స్పష్టంగా ఉండడం నేను చూసాను. ఇలాంటి గుర్తులు గొప్ప మహాత్ములకు మాత్రమే ఉంటాయి.



భాగోజీ శిండే



మాధవరావ్ దేశ్‌పాండే

## 35

## మార్చి ౨౨వ తేదీ, ౧౯౩౮- దీక్షిత్ వాడా, శిరిడీ

**మాధవరావ్ దేశ్‌పాండే ఉరఫ్ షామా,** వయస్సు సుమారు 80సం॥లు, బ్రాహ్మణుడు.

ఉపాసనీ బాబా మొదట శిరిడీ వచ్చినప్పుడు దీక్షిత్ వాడాలో బస చేసేవాడు. ఆయన అప్పటికి అనారోగ్యంతోనే ఉన్నాడు. "నేను చనిపోయాను!" అని నిద్రలో కలవరిస్తూ ఉండేవాడు. తనకు సహాయపడవలసినదిగా బాబాను అర్థించమని నన్ను కోరాడు. నేను బాబా దగ్గరకెళ్ళి ఉపాసనీశాస్త్రి మరణభయంతో ఉన్నాడని చెప్పాను. అప్పుడు బాబా ***"ఈ జాగా (శిరిడీ) మరణించేందుకు కాదు, తరించేందుకే ఉంది! (మరణ్‌కునై తరణ్‌కుహై యే జాగా)"*** అన్నారు. ఉపాసనీని అందరిలాగే నేనూ ఒక గూఢచారిగా భావించాను. కానీ తాను గూఢచారిని కానని ఆయన నాకు భరోసా ఇచ్చాడు. మొదట ఉపాసనీ వచ్చినప్పుడు, బాబా ఆయనను శిరిడీలోనే ఉండమన్నారు లేదా ఎనిమిది రోజులకల్లా తిరిగి రమ్మన్నారు. కానీ ఉపాసనీ దానికి అంగీకరించలేదు. ధూళే శిరిడీకి చాలా దూరంలో ఉన్నదంటూ మరేవో కారణాలు చెప్పాడు. చివరికి ఆయన దీక్షిత్ వాడాలో రెండు సంవత్సరాల మూడు నెలలు నివసించాడు. ఆయన రెండవసారి శిరిడీ వచ్చిన పదిహేను రోజుల తరువాత బాబా ఆయనను ఖండోబా ఆలయంలో నాలుగు సంవత్సరాలపాటు ఉండమన్నారు. నాలుగు సంవత్సరాల తరువాత ఖండోబా అనుగ్రహం లభిస్తుందని చెప్పారు. వాడాలోని క్రింది అంతస్థులో జి.యస్. ఖాపర్డే చేసే పారాయణా కార్యక్రమంలో ఉపాసనీ శాస్త్రి తదితరులు పాల్గొనేవారు. ఉపాసనీ శాస్త్రి ఖండోబా ఆలయంలో నివసించేటప్పుడు రాత్రిళ్ళు వాడాలోని పైఅంతస్థులో ఎక్కువ సమయం మాట్లాడుతూ గడిపేవాడు.

బాబా నా కన్నా నాలుగు సంవత్సరాలు చిన్నవాడినని చెప్పారు. కానీ వయస్సులో నాకన్నా పెద్దవాడిగా కన్పించేవారు. అది ఈ జన్మకు సంబంధించినది అయి ఉండదు. పూర్వ జన్మలలో వారితో నాకున్న అనుబంధాన్ని గురించి బాబా ***"నీవు, నేను గతజన్మలో ఒకే వీధిలో నివసించేవాళ్ళం!"*** అన్నారు.

మూడు సంవత్సరాల పాప, శాంతి ఖిర్వండీకర్ బావిలో పడినప్పుడు బాబా ఆ పాపకు దెబ్బ తగలనీయకుండా పట్టుకున్నారు. బాబా అనుగ్రహం వలన ఆ పాప రక్షింపబడింది. ఆమె బాబా సోదరిగా చెప్పుకునేది. ఈ సంఘటన 1915 ప్రాంతంలో జరిగింది. అప్పుడు ఆ పాప తండ్రి బాబాఖిర్వండీకర్ (ఇప్పుడు ఆయన చనిపోయాడు) శిరిడీలోనే నివసించేవాడు. ఆ పాప బావిలో పడినప్పుడు కాకాసాహెబ్ దీక్షిత్, బూటీ మొదలైన భక్తులు కూడా శిరిడీలో ఉన్నారు. ఇప్పుడు ఆమెకు వివాహమై తన భర్తతో మన్మాడ్‌కు 30 మైళ్ళ దూరంలోనున్న మాలేగాంలో నివసిస్తూ ఉంది.

మా కుటుంబం నిమోణ్‌కు చెందింది. నేను పుట్టినది కూడా అక్కడే. నాకు రెండు సంవత్సరాల వయస్సున్నప్పుడు మా నాన్న ఇక్కడికి (శిరిడీ) వచ్చి స్థిరపడ్డాడు. నేను పెరిగింది, చదివింది ఇక్కడే. నేను శిరిడీలో ఉన్న పాఠశాలలో సహాయ ఉపాధ్యాయునిగా పనిచేసేవాడిని. నాతో పాటు లక్ష్మణ్ మాస్టర్ అను మరో ఉపాధ్యాయుడు కూడా పనిచేసేవాడు. నానారత్నపార్ఖీ మా హెడ్‌మాస్టరు. మా స్కూలు, శ్యామకర్ణ (గుర్రం) కోసం నిర్మించిన గుర్రపుశాల ఉన్నచోట ఉండేది. స్కూలు గోడకున్న కిటికీ నుండి ప్రక్కనే ఉన్న మసీదు కనిపించేది. ప్రజలందరూ పిచ్చిఫకీరుగా భావించే బాబాను నేను ఆ కిటికీ గుండా అప్పుడప్పుడు చూస్తుండేవాడిని. అప్పుడు నాకు వారిపై గౌరవభావం ఉండేది కాదు. నేను రాత్రిళ్ళు స్కూల్లో నిద్రిస్తున్నప్పుడు బాబా ఇంగ్లీషు, హిందీ మొదలైన భాషల్లో మాట్లాడుతుండడం వినిపించేది. ఆ సమయంలో మసీదులో ఉన్నది బాబా ఒక్కరే. అప్పుడు అందరూ అనుకుంటున్నట్లు బాబా పిచ్చివాడు కాదని అద్భుత శక్తులుగల మహాత్ములని నాకు నమ్మకం కలగసాగింది. నేను శిరిడీలో ఉపాధ్యాయునిగా ఐదారు సంవత్సరాలు పనిచేసిన తరువాత నాకు మరో ప్రాంతానికి బదిలీ అయ్యింది. అప్పుడు నా స్థానంలో గణూమాస్టర్ నియమించబడ్డాడు. ఉద్యోగాన్ని వదిలేసిన తరువాత అప్పుడప్పుడు బాబాను దర్శించేవాడిని. తరువాత ఐదారు నెలలకు బాబా దైవమన్న నమ్మకం కలిగింది.

చిదంబర కేశవ గాడ్గిల్ అను భక్తుడు పూనాకు చెందిన భీమశంకర ఆలయంలో నివసిస్తున్న సాధువును దర్శించాడు. ఆ సాధువు గాడ్గిల్‌ను శిరిడీలో

ఉన్న శ్రీసాయిబాబా వద్దకు వెళ్ళమని ఆదేశించాడు. వారి ఆదేశం మేరకు అతను శిరిడీ వచ్చాడు. అప్పుడు నేను స్కూల్లోనే పని చేస్తున్నాను. "ఇక్కడొక గొప్ప సాధువు ఉన్నారట కదా ఎక్కడున్నారు?" అని నన్ను అడిగాడు. నేను శిరిడీలో అలాంటి వారు ఎవ్వరూ లేరని చెప్పి మసీదు వైపు చూపిస్తూ "ఇక్కడ ఉన్నది ఈ పిచ్చి ఫకీరే!" అని బదులిచ్చాను. గాడ్గిల్‌తో పాటు వామన్ అను గ్రామాధికారి, సీతారాం పట్వర్ధన్ అను విద్యాధికారి, టాంగా నడిపే అతను కూడా వచ్చారు. గాడ్గిల్‌తో పాటు మేమందరం మసీదుకు వెళ్ళాము. మేము మసీదు మెట్లు ఎక్కుతున్నప్పుడు బాబా ఆవేశంగా అరుస్తూ తిట్ల వర్షం కురిపించారు. మెట్లు ఎక్కనివ్వలేదు. *"నేనొక ముస్లిం ఫకీరును. వెళ్ళి ఆ భీమశంకర ఆలయంలోనున్న సాధువు కాళ్ళపై పడు!"* అన్నారు. బాబా తిట్టినప్పటికీ ఆ మాటలు గాడ్గిల్‌లో నమ్మకాన్ని, ఆనందాన్ని కలుగజేసాయి. బాబా పిచ్చివాడు కాదని వారొక జ్ఞాని అని తెలుసుకున్నాడు. అప్పటి నుండి శిరిడీకి తరచుగా వచ్చి బాబాను దర్శించసాగాడు. బాబాకు ప్రగాఢ భక్తుడయ్యాడు.

ఆనందస్వామి (ఆనందనాథ్ వారి అసలు పేరుకాదు) 1878 ప్రాంతాలలో సమాధి చెందిన అక్కల్‌కోట మహరాజ్ భక్తుడు. ఆయన ఏవలాకు ఆరుమైళ్ళ దూరంలోనున్న సవర్‌గాం అను గ్రామంలో ఒక మఠాన్ని స్థాపించి, నివసించేవారు. ఆ స్వామి కేవలం కౌపీనం మాత్రమే ధరించేవారు. వారు సాక్షాత్కారం పొందిన గొప్ప మహనీయులు. నేను, నందారాం మార్వాడీ మరి కొంతమంది 1885లో వారిని మఠంలో దర్శించినప్పుడు వారి వయస్సు 95 సంవత్సరాలు. మా తిరుగు ప్రయాణంలో మాతో పాటు ఆయన కూడా శిరిడీ వచ్చి సాయిబాబాను దర్శించారు. ఆయన, సాయిబాబా ఒకరినొకరు చూసుకున్నారు కానీ ఏమీ మాట్లాడుకోలేదు. ఆ స్వామి తిరిగి వచ్చి "సాయిబాబా పేడకుప్పపై ఉన్న వజ్రంలాంటి వారు" అని బాబా గురించి తమ అభిప్రాయం చెప్పారు. ఇప్పుడు 60 సం॥ల వయసున్న బాలాచోప్దార్‌కు అప్పుడు ఏడు సంవత్సరాలు.

గంగగిర్ మహరాజ్ శిరిడీ వచ్చి హోమం, నామసప్తాహం నిర్వహించాడు. నామసప్తాహం చివర్లో పెద్దఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. ఒక్కసారి మాత్రమే జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమం ఆనందస్వామి సాయిబాబాను దర్శించిన చాలాకాలానికి జరిగింది.

గంగగిర్ మహరాజ్ కూడా సాయిబాబాను దర్శించి బాబా ఎంతో గొప్పవారన్న అభిప్రాయాన్ని తెలియజేసాడు.

బాబా చేసిన ఒక వింత కొనుగోలు విషయం చెప్పి తీరాలి. ఒక వ్యక్తి వద్ద చాలా మేకలున్నాయి. ఒక్కొక్క మేక ఖరీదు, సుమారు నాలుగు రూపాయలు ఉంటుంది. బాబా అతని వద్ద నుండి రెండు మేకలను 32 రూపాయలకు కొన్నారు. ఈ విషయం తెలిసి నేను, తాత్యా, బాబా దగ్గరకెళ్ళి మేకల కొనుగోలు విషయంలో బాబా మోసపోయారని, ఒక్కొక్క మేక ఖరీదు 4 రూపాయలకన్నా ఎక్కువ చేయదని చెప్పాము. అప్పుడు బాబా బజారు నుండి 1 1/2 రూపాయలకు పప్పులు తెప్పించి వాటికి పెట్టారు. ఆ తరువాత తాము ఎందుకలా చేశారో బాబా వివరించారు. ఆ రెండు మేకలు వారి వంక దీనంగా చూసాయని వాటిని తాము గుర్తుపట్టామని చెప్పారు. ఆ మేకలు గత జన్మలో స్త్రీలని [1], వారిరువురూ తమను సేవించుకొనేవారని చెప్పారు. కానీ వాళ్ళిద్దరూ తీవ్రంగా కొట్లాడుకుంటూ చివరకు ఒకరినొకరు చంపుకున్నారు. వాళ్ళు ఈ జన్మలో మేకలుగా పుట్టారని చెప్పారు. ఆ తరువాత బాబా ఆ మేకలను తిరిగి వాటి యజమానికే ఇచ్చేసారు.

బాబా కాలంలో రోహిల్లాలు చాలామంది వచ్చేవారు. వారిలో పిష్యే ఒకడు. నీంగాంలో బాబాసాహెబ్ డేంగ్లే, అతని తమ్ముడు నానాసాహెబ్ డేంగ్లే అను భూస్వాములు ఉండేవారు. వారు ప్రభుత్వాధికారులు కాకపోయినా వారికి ప్రభుత్వాధికారులలో మంచి పరపతి ఉండేది. నేను స్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నప్పుడు నానాసాహెబ్ డేంగ్లే బాబా వద్దకు వచ్చాడు.

నానాసాహెబ్ నిమోణ్కర్ నాకన్నా ఐదారు సంవత్సరాలు పెద్దవాడు. అతను శిరిడీలో బాబాను సేవిస్తూ చాలాకాలం నివసించాడు. ఒకసారి పూనాలోనున్న అతని కొడుకు, కోడలుకు ప్లేగు సోకింది. నిమోణ్కర్, అతని భార్య పూనా వెళ్ళడానికి బాబాను అనుమతి కోరారు. కానీ బాబా అనుమతించలేదు. నిమోణ్కర్ భార్య

---

*1. శ్రీహేమాడ్‌పంత్ విరచిత "శ్రీసాయిసచ్చరిత్ర"లో ఆ మేకలు గతజన్మలో మానవులని, అప్పుడు బాబాకు జతగాండ్రుగా ఉన్నారని ప్రస్తావించబడింది.*

దుఃఖించింది. అప్పుడు బాబా ఆమెతో *"ఎందుకు దుఃఖిస్తున్నావు? నీ కుమారుడు 15 రోజుల్లో ఇక్కడికి వస్తాడు"* అని ఓదార్చారు. బాబా చెప్పినట్లుగా వారిద్దరికీ ప్లేగు వ్యాధి నయమయింది. ఆమె కుమారుడు పదిహేను రోజుల్లో శిరిడీ వచ్చాడు.

ఇక జీవించడం అసంభవం అనుకొన్న ఎందరో భక్తులను మృత్యుముఖం నుండి బాబా రక్షించారు. సమర్థ రామదాసు కూడా మరణగండం నుండి తమ భక్తుని విడిపించారు. ఒక భక్తుడు మృత్యుముఖంలో ఉన్నప్పుడు రామదాసు ఆ భక్తుని తమ చెంతనే కూర్చొని గట్టిగా తమ పాదాలు పట్టుకొని ఉండమని ఆదేశించారు. ఆ భక్తుడు అట్లాగే రామదాసు పాదాలు పట్టుకొని వదలలేదు. మృత్యుసమయం దాటిపోయింది. మృత్యువు ఆ భక్తుని చెంతకు రాకుండా రామదాసు ఆపి కాపాడారు.

నానావలీ చనిపోయేనాటికి 70 సంవత్సరాల వృద్ధుడు. బాబా నానావలీని ప్రోత్సహిస్తూ *"కులుప్ లగాదియా కిల్లీ తేరే పాస్ హై. మేరేకు దగానై ధేనా మై దగా నహీ దూంగా"* అన్నారు. అతను యశ్వంతరావ్‌కు (నాశిక్‌కు చెందిన దేవ్ మామ్లత్‌దార్) గురుబంధువు. నానావలీ గొప్ప విరాగి, సాక్షాత్కారం పొందినవాడు. అతను పందిపెంటను తినేవాడు. తేళ్ళను, కప్పను (బెండ్‌కుళి), ఎలుకను (ఉందీర్) నోటిలో ఉంచుకునేవాడు. ఒకసారి బాబాపై ఎలుకను ఉమ్మాడు కూడా. అతను జంధ్యం వేసుకునేవాడు కాదు. బాబా మహాసమాధి చెందిన రోజు 'నేనూ వెళ్ళిపోతాను' అని చెప్పి కొద్దిరోజులకే అతడూ మరణించాడు.

## 36

## సెప్టెంబరు ౨౬వ తేదీ, ౧౯౩౬

**శ్రీకొలంబో ఉరఫ్ డి.వి. సంభారే,** వయస్సు 57సం॥లు, గౌడ్ సారస్వత్.

బాబా మసీదులో చిలుం పీలుస్తూ తమ దగ్గర కూర్చొని ఉన్న భక్తులకు ఇస్తున్నారు. అప్పుడు నేను బాబాకు కొంచెం దూరంగా మెట్ల దగ్గర కూర్చొని ఉన్నాను. నాకు బీడీలు తాగే అలవాటు ఉంది. నాకూ ఒకసారి చిలుం పీల్చాలన్న కోరిక కలిగింది. ఈ ఆలోచన వచ్చినదే తడవుగా బాబా *"అరే అబ్బాయీ, ఇలారా! ఎందుకంత దూరంగా కూర్చున్నావు? దగ్గరికిరా! వచ్చి చిలుం పీల్చు! (అరే పోరా ఇక్‌డేయే, లాంబ్ కశాలా బస్‌లా? జవళ్ యే, చిలుం ఘె)"* అని పిలిచి చిలుం చేతికిచ్చారు. నేనూ వారితో కలిసి చిలుం పీల్చాను. నా కోరిక తెలుసుకుని నాకు చిలుం ఇచ్చినందుకు వారి సర్వజ్ఞతకు, కరుణకు నేను ఎంతో ఆనందించాను.

పొగపీల్చే అలవాటేగాక నాకు హానికరమైన త్రాగుడు అలవాటు కూడా ఉంది. 1.2.1917 తేదీన నాకొక కల వచ్చింది. కలలో బాబా నా ఛాతీపై కూర్చొని *"ఒరేయ్! ఏం చేస్తున్నావ్? (పోరా కాయ్ కర్తో?)"* అంటూ గద్దిస్తూ నా ఛాతీపై ఒత్తిడి పెంచి, నేను త్రాగుడు మానివేస్తానని చెప్పిన దాకా ఛాతీపై నుండి లేవలేదు. మరుసటి రోజు నుండి త్రాగుడును పూర్తిగా మానివేసాను. నాకు 15.2.1917 తేదీన ఒక కఠిన పరీక్ష ఎదురైంది. మా ఆఫీసు మేనేజరు, వారి పిల్లలకు వీడ్కోలు ఇచ్చే సందర్భంగా ఒక విందు ఏర్పాటు చేసి నన్ను కూడా ఆహ్వానించాడు. మా మేనేజరు గ్లాసులో విస్కీ, సోడా పోసిచ్చి త్రాగమని నన్ను ఒత్తిడి చేశాడు. అటువంటి వాతావరణంలో బాబా ప్రస్తావన తీసుకొని రావడం ఇష్టంలేక డాక్టరు నన్ను మద్యం మానేయమన్నాడని చెప్పాను. కానీ మా మేనేజరు ఆ అభ్యంతరాన్ని పట్టించుకోకుండా త్రాగమని బలవంతపెట్టాడు. ఇంతలో ఒక అద్భుతం జరిగింది! కరెంటుపోయి లైట్లు ఆరిపోయాయి. మేనేజరు కరెంటు ఎందుకుపోయిందో తెలుసుకోడానికి వెళ్ళాడు. చీకటిలో నా ప్రక్కన కూర్చున్నతను (మిస్త్రి) నా గ్లాసులోని విస్కీ త్రాగేసాడు. మేనేజరు వచ్చి తన కోరిక మేరకు నేను త్రాగానని భావించి సంతృప్తి చెందాడు.

బాబా దక్షిణ అడగడంలో ఒక నీతి దాగి ఉండేది. అది మనలోని దంభాలు పలుకు గుణం, దురాశ, మ్రొక్కులు తీర్చకుండా ఎగవేయుట మొదలైనవాటిని నశింపచేసేది. పైసంఘటన జరిగిన కొన్ని నెలల తరువాత నేనొకసారి శిరిడీలో ఉన్నప్పుడు బాబా భక్తులందరిని దక్షిణ అడిగారు కానీ నన్ను మాత్రం అడగలేదు. నేను నా దురలవాటు మార్చుకున్నందుకు ప్రతిఫలంగా బాబా దక్షిణ విషయంలో నాకు మినహాయింపు ఇచ్చారని అనుకున్నాను. వాడాకు వెళ్ళిన తరువాత భక్తులతో బాబా నన్ను మాత్రం దక్షిణ అడగకపోవడం గురించి దంభాలు పలికాను. వెంటనే నన్ను మసీదుకు రమ్మన్నట్లు బాబా నుండి ఆదేశం రావడంతో నేను వెళ్ళాను. బాబా నన్ను 2 రూపాయలు దక్షిణ అడిగారు. నేను సమర్పించాను. బొంబాయిలోని ముగాబత్‌కు చెందిన ముద్రణాలయం యజమాని కూడా బాబాను దర్శించేందుకు శిరిడీ వచ్చాడు. అతని వద్ద 18 రూపాయలు, కొంత చిల్లర ఉంది. అతను ఆ డబ్బంతా దాచమని నాకు ఇచ్చాడు. ఎందుకంటే బాబా తనను దక్షిణ అడిగినప్పుడు, తన దగ్గర డబ్బు లేదని చెప్పి తప్పించుకోవచ్చని అతని ఉద్దేశ్యం. నేను బాబాకు 2 రూపాయలు దక్షిణ ఇవ్వడానికి వెళ్ళినప్పుడు అతను మసీదులో ఉన్నాడు. బాబా అతనిని కూడా 2 రూపాయల దక్షిణ అడిగారు. అతను తన దగ్గర డబ్బేమీ లేదని చెప్పబోయేలోగా నన్ను చూపించి *"ఇతని దగ్గర తీసుకొని ఇవ్వు!"* అన్నారు. తను పన్నిన పన్నాగం బాబాకు తెలిసిపోయిందని గ్రహించి అతను నా దగ్గర దాచిన డబ్బు నుండి రెండు రూపాయలు తీసుకొని బాబాకు సమర్పించాడు. ఈ సంఘటన, బాబా మహాసమాధికి కొన్ని రోజుల ముందు జరిగింది.

బాబా సమాధి చెందడానికి కొన్నిరోజుల ముందు మేము శిరిడీలో ఉన్నాము. మేము ఇంటికి వెళ్ళేందుకు అనుమతి కోసం వారి దగ్గరకు వెళ్ళాము. వారు సమాధి చెందబోతున్నారనే విషయం మాకు అప్పటికి తెలియదు. వారు *"మీరు బొంబాయి నుండి వస్తున్నారు కదా? మీరు నా మాటలు వింటూనే ఉండాలి. నేనూ మీ మాటలు వింటూ ఉంటాను. కానీ మీరు వెళ్ళిపోతున్నారు! సరే... వెళ్ళండి. మీరు రేపు మధ్యాహ్నానికి చేరుకుంటారు!"* అని అన్నారు. ఆ మాటలు అనేటప్పుడు వారిలో కొద్దిగా సంశయము కనిపించింది. సాయంత్రం వారి సెలవు తీసుకొని మేము కోపర్‌గాంలో రాత్రి రైలు ఎక్కాం. మామూలుగానే ఉదయం

7.30-8 గంటలకల్లా బొంబాయి (మన్మాడ్ మీదుగా) చేరతామనుకున్నాము. కానీ అది మన్మాడు చేరేసరికి రైలు ఇంజనులో సాంకేతిక లోపమేదో కన్పించిందని, కనుక సుమారు నాలుగు గంటలు ఆలస్యమవుతుందని తెలిసింది. బాబా చెప్పినట్లే జరిగింది. మేము బొంబాయి చేరేటప్పటికి మధ్యాహ్నం 12 గంటలు అయింది.

ఆ తరువాత కొద్ది రోజులకే బాబా మహాసమాధి చెందారు. మాకు సెలవు ఇచ్చే సమయంలో బాబా ఎందుకు సంశయించారో మాకు అప్పుడు అర్థమయింది. అదే మేము వారిని చివరగా దర్శించుకుంది.

పద్నాలుగు సంవత్సరాల క్రితం నాకొక కలవచ్చింది. కలలో బాబా కనబడి *"అబ్బాయీ నీవు నన్ను నీ గురువుగా ఇతరులకు చెప్పుకుంటున్నావు. నేను నీకెప్పుడైనా ఉపదేశం చేశానా?"* అని అడిగారు. తరువాత నన్ను చేతులు కడుక్కొని రమ్మని ఆదేశించారు. నేను అలా చేసిన తరువాత నాకు ఒక మరాఠీ శ్లోకాన్ని చెప్పి దానిని వల్లెవేయమన్నారు. నేను కలలో దానిని పలుమార్లు వల్లించాను. ఇది బాబా నాకు చేసిన ఉపదేశంగా భావించాను. కానీ నిద్ర మేల్కొన్న తరువాత ఆ మరాఠీ శ్లోకం కొంచెం కూడా గుర్తుకు రాలేదు. ఇప్పటికీ అది జ్ఞప్తికి తెచ్చుకోలేకపోతున్నాను.

రెండు సంవత్సరాల క్రితమే నాకు 55 సంవత్సరాలు పూర్తయ్యాయి. మా కంపెనీ రూల్సు ప్రకారం 55 సంవత్సరాలకు పదవీ విరమణ చేయాలి. నేనందుకు సిద్ధపడి తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నాను. అప్పుడు నాకొక కలవచ్చింది. కలలో మా డైరెక్టర్ కన్పించి నేను కంపెనీ విడిచి వెళ్లనవసరం లేదని చెప్పారు. ఇంతవరకూ నన్నెవరూ పదవీ విరమణ చేయమని ఆదేశించలేదు.

నాకు ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నాకెన్నో కుటుంబ బాధ్యతలున్నాయి. కానీ నా బరువు బాధ్యతలన్నీ బాబానే చూసుకుంటున్నారు. నేనెప్పుడూ బాబాను ప్రత్యేకించి ఏ కోరికా తీర్చమని ప్రార్థించలేదు. మన కోరికలు ఏమిటో మనకు ఏది మంచిదో, ఏది ఇవ్వాలో ఆయనకు తెలియదా? మనం పలుమార్లు అడిగి విసిగిస్తేగానీ ఆయన మన కోరికలు తీర్చరా? మాకు సంబంధించిన విషయాలను బాబా ఇచ్ఛకు వదిలిపెట్టడంలోనే మాకు సంతృప్తి ఉంది. మేము ఆనందంగా ఉన్నాము.

## 37

## డిసెంబరు 9వ తేదీ, 1936- శిరిడీ

**తుకారాం బర్కు,** భూస్వామి, మహర్, వయస్సు 40సం॥లు, శిరిడీ.

శ్రీసాయిబాబాతో నాకు కొన్ని అనుభవాలున్నాయి. 1912లో గోదావరి కాలువలకు మొదటిసారి నీళ్ళు వదిలిన సమయంలో ఇక్కడికి 20 మైళ్ళ దూరంలోనున్న కరంజీగాం అను గ్రామానికి నేను ఉపాధి కోసం వెళ్ళదలిచాను. నేను ఇక్కడ నుండి బయలుదేరి కోపర్‌గాం రోడ్డులో ఉండగా బాబా లెండీతోట నుండి వస్తూనో వెళుతూనో నాకు కనిపించారు. బాబా నా భుజంపై చేయివేసి అనునయంగా ***"వెళ్ళవద్దు!"*** అన్నారు. నేను వారి సలహాని పెడచెవినపెట్టి కరంజీగాంకు వెళ్ళిపోయాను. నేను వెళ్ళిన మరుసటిరోజు నుండి నాకు జ్వరం వచ్చి చాలారోజులు బాధపడ్డాను. జీవనోపాధి మాట అటుంచి సహాయం కొరకు అక్కడున్న మా దూరపు చుట్టాల దయపై ఆధారపడవలసి వచ్చింది. 15 రోజుల తరువాత కాస్త కోలుకొని శిరిడీ వచ్చాను. శిరిడీ వచ్చిన తరువాత కూడా 45 రోజులు జ్వరంతో బాధపడ్డాను. తరువాత మా అమ్మను బాబా దగ్గరికి వెళ్ళి ఊదీ తెమ్మన్నాను. ఊదీ పెట్టుకున్న మరుసటిరోజు నుండి నా జ్వరం తగ్గిపోయింది.

## 38

## సెప్టెంబరు 23వ తేదీ, 1936

**ఎం.జి. ప్రధాన్,** గుమాస్తా, కలెక్టరు కార్యాలయం, రెవెన్యూ డిపార్ట్‌మెంట్, (ఓల్డ్ కస్టమ్స్ హౌస్), వెంకటేశ్వర ప్రెస్, చాల్, శాండ్రస్ట్ రోడ్ దగ్గర, బొంబాయి.

నేను సాయిబాబా గురించి విని ఉన్నాను. నా కుమారుడు దత్తాత్రేయ ఏడేళ్ళ వయస్సులో అకస్మాత్తుగా మరణించాడు. దుఃఖభారంతో నా మనస్సు కృంగిపోయింది. సాయిబాబాను దర్శించాలని అనుకున్నాను. ఒకరోజు నాకొక కల వచ్చింది. కలలో ఐదుగురు సాధువులు కూర్చొని ఉండడం చూసాను. "మీలో సాయిబాబా ఎవరు?" అని నేను వారిలో ఒకరిని అడిగాను. అతను సాయిబాబాను చూపించాడు. అంతటితో కల ముగిసింది. తరువాత బాబాకు సమర్పించేందుకు జంజీరాలో నున్న మా తోట నుండి సీతాఫలాలు, రామాఫలాలు తీసుకొని శిరిడీ వెళ్ళాను. నేను మసీదు చేరి బాబాను దర్శించి ఫలాలు సమర్పించి వారి ముందు కూర్చున్నాను. నాకు కలలో సాయిబాబా రూపం ఎలా కనపడిందో, శిరిడీలో బాబా సాక్షాత్తు అలాగే ఉన్నారు. అప్పుడు సాయిబాబా నన్ను తీవ్రంగా తిడుతూ *"ఎందుకీ తెలివితక్కువవాడు కొడుకు చనిపోయినందుకు బాధపడుతున్నాడు? చనిపోవడమంటే భూమిలో కలిసిపోవడమే! శరీరము ఎప్పటికైనా మట్టిలో కలిసిపోవల్సిందే! దానికి దుఃఖించడం ఎందుకు?"* అన్నారు. తరువాత నావైపు చూస్తూ *"నీ రామాఫలాలను అంతటా వెదజల్లు!"* అన్నారు. నీవు సంపాదించిన విజ్ఞానమంతా అందరికీ పంచిపెట్టు అన్నది ఆ మాటలకు అర్థమని నేను భావించాను.

తరువాత బాబా అక్కడున్న భక్తులతో మా ఇల్లు, తోట, తోటలో ఏ ఏ ప్రదేశంలో ఎన్ని సీతాఫలం, రామాఫలం చెట్లున్నవి, తరచూ చూస్తున్నట్లు వర్ణించారు. అంతేకాదు 15 రోజుల క్రితం నా కొడుకు మరణించాడని అందుకు నేను వృథాగా దుఃఖిస్తున్నానని కూడా చెప్పారు. నేను శిరిడీలో నాలుగు రోజులున్నాను. ఈ నాలుగు రోజుల్లో ఎందరో భక్తులు వారిని దర్శించారు. బాబా ఒకవైపు నా దుఃఖాన్ని తొలగిస్తూనే, నా గురించే కాక తమ దగ్గరకి వచ్చే భక్తులందరి వృత్తాంతాలు తమకు తేటతెల్లమని నాకు తెలియజేయడం ద్వారా వారిపై నాకున్న భక్తి, విశ్వాసాలను దృఢపరిచారు. నా ప్రథమ శిరిడీ యాత్రకు సెలవు మంజూరు

కావడం, వెంటనే ప్రయాణానికి డబ్బు సమకూరడంతో మొదటిసారిగా నాకు బాబా పట్ల నమ్మకం కలిగింది.

బాబా దేనినీ పట్టించుకోనట్లు ఉదాసీనంగా ఉండి, చాలా తక్కువగా మాట్లాడేవారు. వారు సదా అంతర్ముఖులై ఉండి, నిశ్చలంగా మత్తులో ఉన్నవానివలె లేదా పిచ్చివానివలె కనిపించేవారు. ఇది నేను శిరిడీలో ఉన్న నాలుగు రోజులలో గమనించిన విషయం.

నేను తిరిగి 1935 వరకు శిరిడీ వెళ్ళనప్పటికీ నాకు బాబాపై ఏర్పడిన నమ్మకం నా ప్రాపంచిక, ఆధ్యాత్మిక ఉన్నతికి ఎంతో దోహదపడింది. నాకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా బాబా స్వప్నదర్శనం ద్వారా నన్ను ఆదుకునేవారు. కానీ గత రెండు సంవత్సరాలుగా నాకు అలాంటి దర్శనాలు కలగలేదు.

బాబా సమాధి చెందిన ఎన్నో సంవత్సరాలకు నా కుమారుణ్ణి బ్రతికించిన అపూర్వ సంఘటన గురించి చెప్పితీరాలి. 1932లో నా చిన్న కుమారునికి తీవ్రంగా జ్వరం వచ్చింది. మూడు, నాలుగురోజుల జ్వరం తరువాత వాడి నాడి అందలేదు. నాకు అనుమానం వచ్చి మా డాక్టరు మిస్టర్ జె, ఎం.బి.బి.యస్‌కు కబురుపెట్టాను. అతను క్షుణ్ణంగా పరీక్షించి నాడి ఆగిపోయిందని, బిడ్డ మరణించాడని చెప్పాడు. నా భార్యను ఓదార్చడం కూడా మొదలుపెట్టాడు. కానీ పిల్లవాడు మరణించాడని నేను నమ్మలేకపోయాను. పిల్లవాడి ముందు బాబా ఫోటో పెట్టి వాడి నుదుటికి ఊదీ రాసి, బాబాను ఆర్తిగా ప్రార్థించసాగాను. అది చూసి డాక్టరు నాది మూఢనమ్మకం అన్నాడు. కానీ నేను సాయిబాబా భగవంతుడని, వారు తప్పక నా బిడ్డను బ్రతికిస్తారని చెప్పాను. ఇలా 45 నిముషాలు గడిచిన తరువాత పిల్లవాడికి స్పృహ వచ్చి లేచి కూర్చున్నాడు. ఏమీ జరగనట్లు ఆడుకోసాగాడు. ఇది బాబా చేసిన అద్భుత లీల!

**39**

## మే 3వ తేదీ, 1936

**మామా దూబే ఉరఫ్ కాశీనాథ్ దూబే,** అంగడి యజమాని, వయస్సు 70సం॥లు, బ్రాహ్మణుడు, పూనా (ఇతని అనుభవాలు సాయిలీలా మాసిక్ Vol V., parts 2&3, p.607లో కూడా ప్రచురింపబడ్డాయి).

నాకు మొదటి నుండి సాధుసత్పురుషులపై సదభిప్రాయము ఉండేది కాదు. 1909లో నేను కోపర్‌గాంలో ఉండగా ఒకావిడ నా దగ్గర పది రూపాయలు అప్పుగా తీసుకుంది. తను ఔరంగాబాదు వెళుతున్నానని, తిరిగి రాగానే అప్పు తీరుస్తానని చెప్పింది. సాయిబాబా అనే గొప్ప మహాత్ములు శిరిడీలో ఉన్నారని కూడా తెలిపింది. నేను బాబా గురించి వినడం అదే మొదటిసారి. ఆమె తీసుకున్న డబ్బు తిరిగి ఇస్తే, (ఆమె తిరిగి ఇస్తుందనే నమ్మకం నాలో లేదు) ఆ డబ్బు సాయిబాబాకే సమర్పిద్దామని నేను అనుకున్నాను. తరువాత నేను ఔరంగాబాదుకు వెళ్ళాను. అక్కడ ఆమె కనపడి, ఊహించని విధంగా నా దగ్గర తీసుకున్న అప్పు చెల్లించింది.

కొన్ని రోజుల తరువాత నేను శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాను. నా మ్రొక్కు విషయం బాబాతో చెప్పలేదు. కానీ బాబా మొదటి రోజు నాలుగు సార్లు దక్షిణ అడిగి, మొదట 5రూ॥లు, తరువాత 2రూ॥లు, ఆ తరువాత 2రూ॥లు, చివరగా 1రూ॥ మొత్తం 10రూ॥లు తీసుకున్నారు. నేను మూడు రోజులు అక్కడ ఉన్నప్పటికీ తరువాత రెండు రోజులు వారు నన్ను దక్షిణ అడగలేదు. నేను వారికి సమర్పిద్దామనుకున్న మొత్తాన్నే సరిగ్గా బాబా అడిగి తీసుకున్నారు.

# 40

## మే 23వ తేదీ, 1936

**రామచంద్ర వామన్ మోడక్,** బి.ఏ., ఇంజనీరు, పేరూ గేటు వద్ద, సదాశివపేట, పూనా (సాయిలీలా మాసిక్ Vol III, Part 9, Page.399: ఊదీ ప్రభావంతో ఇంటి నుండి పాములను తరిమివేయుట)

నేను మొదట సాయిబాబా దగ్గరికి 1909 ప్రాంతంలో వెళ్ళాను. వారిని చూసి నేను ఎంతో ప్రభావితమయ్యాను. అందుకే శిరిడీకి తరచుగా వెళ్ళేవాడిని. నేను చివరిసారి 1916లో శిరిడీ వెళ్లాను. నా శిరిడీ యాత్రలన్నింటిలోకి 1912లో వెళ్ళినది అతి ముఖ్యమైనది. అప్పుడు నేను పశ్చిమ ఖాందేషు మున్సిపల్ మరియు స్థానిక ఎకౌంట్స్ విభాగంలో సీనియర్ గవర్నమెంట్ ఆడిటర్‌గా (లెక్కలు తనిఖీ చేసే అధికారి) పనిచేస్తున్నాను. మా హెడ్‌క్వార్టర్స్ బొంబాయిలో ఉండేది. కానీ నా భార్యాపిల్లలను నేను ధూళేలో ఉంచాను. 1912లో ఉద్యోగరీత్యా నాకు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. ముఖ్యంగా ఒక ఉన్నతాధికారికి నేనంటే పడేదికాదు. అతను నన్ను ఉద్యోగం నుండి తప్పించే అవకాశం కోసం ఎదురు చూడసాగాడు. నా పైఅధికారులు నన్ను శాఖాపరమైన పరీక్షలకు హాజరుకమ్మని ఒత్తిడి తెచ్చారు. అప్పుడు ఆ అధికారికి నన్ను ఉద్యోగం నుండి తొలగించేందుకుగానీ లేదా ఏకంగా అనర్హునిగా ప్రకటించేందుకుగానీ మంచి అవకాశముంది. అందువల్ల నేను పరీక్షలను ఎదుర్కొని ఉత్తీర్ణుడనై ప్రమోషన్ పొందడమా? లేక 120 రూ॥ల జీతంతో క్షేమంగా ఉన్న ఉద్యోగంలోనే ఉంటూ, పరీక్షలు హాజరవడానికి నిరాకరించడమా? అన్న సమస్య ఎదురయింది. సాయిబాబా గొప్ప శక్తి కలవారని కరుణామయులని తెలిసిన నేను, ఇటువంటి గడ్డు పరిస్థితులలో నాకు దారి చూపించి నన్ను సరియైన మార్గంలో నడిపించగల సమర్థులు వారు ఒక్కరేనని నమ్మాను. ఎవరికీ చెప్పకుండా సెలవు తీసుకోకుండా బొంబాయి నుండి శిరిడీ (నా అధికార పరిధిలో లేని ప్రాంతం) బయలుదేరాను. బాబాను దర్శించి మరుసటిరోజు మధ్యాహ్నానికి తిరిగి బొంబాయి రావచ్చునని తలచి సెలవు కూడా పెట్టలేదు. నేను శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాను. బాబా సన్నిధిలో భక్తులు ఎంతో ఉపశమనం పొందుతారు. చింతలన్నీ తొలగిపోయి మనస్సు ఆనందంతో నిండిపోతుంది. నేను కూడా అదే

విధమైన అనుభూతికి లోనయ్యాను. మరుసటి ఉదయం 7గం॥లకే (సాధారణంగా భక్తులు ఈ సమయంలోనే తిరిగి వెళ్ళేందుకు బాబా అనుమతి అడుగుతారు). బాబా దగ్గర సెలవు తీసుకోవడానికి మసీదుకు వెళ్ళాను. కానీ నాకు బాబా నుండి అనుమతి లభించనందున నేను బొంబాయి బయలుదేరలేకపోయాను. నేను సెలవు పెట్టకుండా, అధికారుల అనుమతి తీసుకోకుండా అక్రమ పద్ధతిలో శిరిడీ వచ్చానని, కనీసం భార్యాబిడ్డలకు కూడా చెప్పలేదని సర్వజ్ఞులైన బాబాకు తెలుసు. ఇప్పుడు నేను ఎటువంటి పరిస్థితులు ఎదుర్కోవలసి వచ్చినా బాబానే బాధ్యత వహించాలి. షామాకు నా ఇబ్బందులన్నీ తెలిసినందువలన నా తరపున బాబా దగ్గరికెళ్ళి "అతను వచ్చి చాలా రోజులయ్యింది. బొంబాయి వెళ్ళడానికి అనుమతించండి" అని అడిగాడు. బాబా కోపంతో ***"అతను నిన్ను చూడడానికి వచ్చాడా లేక నన్ను చూడడానికా?"*** అని ప్రశ్నించి నా వైపుతిరిగి ***"ఏమి! నీవు నన్ను చూడడానికి వచ్చావా లేక షామానా?"*** అన్నారు. ఇంకా, అంతా సవ్యంగానే జరుగుతుందనీ నా ఉద్యోగ విషయంలోగానీ, ఇతర విషయంలోగానీ నాకెలాంటి ఇబ్బందులు రావని బాబా హామీ ఇచ్చారు. బొంబాయిలో శాఖాపరమైన పరీక్ష జరిగే రోజు కూడా బాబా నన్ను శిరిడీలోనే ఉంచారు. దీనిని బట్టి నేను పరీక్ష వ్రాయకపోవడమే నాకు మంచిదని వారు నిర్ణయించినట్లుగా తెలుసుకున్నాను.

శిరిడీలో ఉన్న ఐదవ రోజు రాత్రి నాకొక కలవచ్చింది. నేను ఇంటికి వెళ్ళినట్లు, నా చిన్నకూతురు సంతోషంగా నన్ను ఆహ్వానిస్తూ "ఇన్ని రోజులు ఎక్కడికి వెళ్ళారు నాన్నా?" అని ప్రశ్నిస్తున్నట్లు కనిపించింది. నేను నిద్ర మేల్కొని, బాబా ఆ రోజు నేను ఇంటికి వెళ్ళేందుకు తప్పక అనుమతిస్తారని తలచి దుస్తులు మార్చుకొని అన్నీ సర్దుకొని తయారయ్యాను. నాతో ఉన్న నా స్నేహితుడు, ఆ రోజు కూడా బాబా అనుమతిస్తారన్న నమ్మకం లేదని చెబుతున్నా వినకుండా బయలుదేరి మసీదు గేటు దగ్గరకొచ్చాను. అప్పుడు బాబా కోపావేశాలతో ఊగిపోతూ చేతిలో ఒక రాయి పట్టుకొని మసీదులో అటు ఇటు తిరుగుతూ పెద్దగా అరుస్తున్నారు. నేను గేటు దగ్గర నిలబడి ఉండడం గమనించారు. పది నిముషాల తరువాత వారు శాంతించి గద్దెపై కూర్చున్నారు. సాధారణంగా భక్తులు వారు ఆ స్థలంలో కూర్చున్నప్పుడే వెళ్ళి వారి ఆశీస్సులు తీసుకుంటారు. నేను వెళ్ళి వారి పాదాలకు నమస్కరించాను.

బాబా స్వయంగా ***"ఊదీ తీసుకొని వెళ్ళు!"*** అన్నారు. ఆ విధంగా నాకు అనుమతి లభించింది. కానీ నా సమస్యకు వారి నోటి నుండి ఖచ్చితమైన సమాధానం ఆశించిన నేను, నన్ను పరీక్షకు హాజరవకుండా ధూళే వెళ్ళమంటారో లేక పరీక్ష వ్రాయడానికి నేరుగా బొంబాయి వెళ్ళమంటారో తెలుసుకోవాలని "నన్నెక్కడికి వెళ్ళమంటారో దయచేసి చెప్పండి?" అని బాబాను అడిగాను. వారు ***"ఇంటికి వెళ్ళు! నీకోసం పిల్లలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు!"*** అన్నారు. బాబా మాటల ద్వారా నా కల నిజమేనని నిర్ధారణ అయింది. నేను ధూళే వెళ్ళి తరువాత అక్కడ నుండి బొంబాయికి వెళ్ళాను.

సాధారణ పరిస్థితులలో అయితే నేను బొంబాయి చేరి ఆఫీసుకు వెళ్ళగానే అనుమతి లేకుండా గైరుహాజరయినందుకు ఇబ్బందులు ఎదురయ్యేవి. కానీ చిత్రంగా అంతా సవ్యంగా జరిగిపోయింది. నేను ఎక్కడికి క్యాంపుకెళ్లినా నాతో పాటు నా గుమాస్తాలు కూడా వస్తారు. కానీ వారికి నేను ఎక్కడికి వెళ్ళింది తెలియక ఆశ్చర్యపోయారు. నా భార్యాపిల్లలు మాత్రం నేను బొంబాయి ఆఫీసులోనే ఉన్నానని అనుకున్నారు. మొత్తానికి బాబా కృపవలన, అనుమతి లేకుండా సెలవుపై వెళ్ళడం అధికారికంగా గుర్తించకపోవడంతో ఉద్యోగపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు.

నేను శిరిడీ నుండి బొంబాయి వెళ్ళేందుకు సహజంగా మన్మాడ్ మీదుగానే వెళ్ళాలి. ఆ ప్రాంతపు డిప్యూటీ కలెక్టరు మన్మాడు క్యాంపులో ఉండి, నన్ను మన్మాడ్‌లో ఆగమని నాకు ఉత్తరం వ్రాసాడు. నేను శిరిడీ నుండి బయలుదేరుతూ డిప్యూటీ కలెక్టరును మన్మాడులో కలుసుకోవాలని అనుకుంటుండగా బాబా ***"వదిలేయ్! అతనక్కడ లేడు. తొందరేమీ లేదు"*** అన్నారు. బాబా అలా ఎందుకు చెప్పారో నాకు అర్థం కాలేదు. నేను మన్మాడులో దిగేటప్పటికే, డిప్యూటీ కలెక్టరుకు ఏదో టెలిగ్రాం వచ్చిందని, క్యాంపును రద్దుచేసి ఇంకో చోటికి వెళ్ళాడని తెలిసింది. ఎప్పటిలాగే బాబా చెప్పింది నిజమైంది.

శిరిడీలో ఉన్న ఆరు రోజులలో బాబా నాకు ఆధ్యాత్మిక అనుభవాలను ప్రసాదించి ఎంతో ప్రభావితం చేశారు. వారే నాకు సర్వస్వమని, నా ఇహపర

విషయాల గురించి నేను ఆలోచించవలసినది ఏదీ లేదని అనిపించింది. నేను శిరిడీలో గడిపిన రోజులు నా జీవితంలో ఎంతో ముఖ్యమైనవి, విలువైనవి.

నాకు వేదాంత శాస్త్ర గ్రంథాధ్యయనం పట్ల మక్కువ, గురి. బాబా పట్ల ఎందరో భక్తులకు ఉన్నంత భక్తిశ్రద్ధలు నాకు ఉండేవి కావు. అప్పటికి నా మనసులో ప్రాపంచిక వాసనలు పోలేదు. 1912లో నేను బాబా నుండి ఏమి పొందాను అన్నదానికి 1914లో నాకు నిదర్శనం దొరికింది. మార్గదర్శిగా సాయిబాబా విలువను, వారు నాకు ప్రసాదించిన అనుభవాలను మరొక గొప్ప మహాత్ముడు నా మనసుకు హత్తుకునేలా తెలియపరిచాడు.

ధూళేకు వెళ్ళే మార్గంలో ఉన్న సోన్‌గిర్‌లో గోవిందబువా అనే గొప్ప మహనీయులున్నారని, నేను ఇంటికి వెళ్ళే దారి అదే గనుక, వారిని దర్శించమని ఒక స్త్రీ నాతో చెప్పింది. కానీ, నేను మధ్యలో ఆగడానికి వీలుపడని విధంగా కార్యక్రమాన్ని రూపొందించుకొని, నేరుగా ధూళేకు టాంగా మాట్లాడుకున్నాను. విధివిలాసం వల్ల నేను, మా వంటవాడు కలసి ప్రయాణిస్తున్న టాంగా మధ్యలో చెడిపోయి సరిగ్గా సోన్‌గిర్ వద్ద ఆగిపోయింది. టాంగా ఇనుపచక్రం బయటకు వచ్చేయడంతో, అది సరిచేయటానికి మూడుగంటలు పడుతుందని చెప్పారు. నా వంటవాడు స్నానం చేసి, బువాగారి దర్శనం చేసుకొని, నన్ను సంప్రదించకుండానే, "మా యజమాని (నేను) తమ దర్శనానికి రావచ్చునా?" అని అడిగాడట. "స్నానం చేసి రమ్మను!" అని బువాగారు చెప్పారట. నేను స్నానం చేసి, ఒక రూపాయి, కొబ్బరికాయ తీసుకొని వారి దర్శనానికి వెళ్ళాను. వారు "అరే దుష్టుడా! నీకు అమూల్యమైనది లభించింది. నువ్వు దానిని కొంత కాలం రుచి చూసి కూడా వ్యర్థమైనవాటి కోసం అక్కడికి ఇక్కడికి పరుగులు తీస్తున్నావెందుకు?" అని అడిగారు. వారు చెబుతున్నది 1912లో నాకు బాబా నుండి లభించిన అపూర్వ అనుభవం గురించేనని అనుకున్నాను. మళ్ళీ "అయినా ఫర్వాలేదులే! నీవు నీ స్వగృహానికే వచ్చావు!" అని పలికి తనకు సాయిబాబాకు తేడాలేదని చెప్పారు. ఆ తరువాత నన్ను భిక్ష ఏర్పాటు చేయమన్నారు. పూరీలు, పాయసం చేయించమన్నారు. దానర్థం ఆ రోజు మఠంలో ప్రసాదానికి అయ్యే ఖర్చు నేను భరించాలని తెలుసుకున్నాను. నేను అలాగే చేశాను. వంటకాలు తయారైన తరువాత పూరీలు, పాయసం

బువాగారి ముందుంచి తినమని అభ్యర్థించాను. మా దగ్గరున్న లోటానిండా నీరు నింపి వారి ముందుంచాను. బువా లోటాలోని నీటిలోనికి తమ వేలును ముంచి అందులో నుండి అద్భుతరీతిలో ఒక సన్నని పూరీని బయటికి తీసి "మేమూ ఇక్కడ పూరీ తయారుచేశాం" అంటూ దానిని తిన్నారు. మఠంలో చేసిన పూరీ లావుగా, గరుకుగా ఉంది. వారు తీసిన పూరీ సన్నగా, మృదువుగా ఉంది. నీటి నుండి పూరీ తీసిన వారి అపూర్వ శక్తిని చూసి మేము సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయాము. అంతటి శక్తిసంపన్నులైన బువాగారు, 1912లో నేను సాయిబాబా నుండి పొందిన అనుభవాలను ఎంతో విలువైనవని ధృవపరిచారు.

నాకు ఆరోగ్యం ఎప్పుడూ సరిగ్గా ఉండేది కాదు. కంటికి సంబంధించిన సమస్యతో ఎక్కువగా బాధపడేవాడిని. నాకొక కంటికి చూపు పోయింది. మరో కంట్లో పొరలేర్పడుతున్నాయి. నేను ప్రతి గురువారం పూజిస్తూ, నిరంతరం స్మరించే సాయిబాబా నా ఇహపర అవసరాలన్నింటిని తీరుస్తున్నారు. నా ప్రాపంచిక, పారమార్థిక భవిష్యత్తు గురించి నాకెలాంటి చింతా లేదు. అవి రెండూ బాబా చేతులలో ఉన్నాయి. ఆయన నన్ను రక్షిస్తారు. నాపై వారికి ఉన్న కరుణను ఈ క్రింది సంఘటన తెలియజేస్తుంది.

1916లో నాశిక్‌లో నేను జ్వరం, దగ్గుతో బాధపడ్డాను. వైద్యవృత్తిలో ఉన్న నా చిన్ననాటి స్నేహితుడొకడు నాకు చికిత్స చేశాడు. నాకు వచ్చినది ఊపిరితిత్తుల నాళమునకు సంబంధించిన రోగమని నిర్ణయించి 'క్లోరల్ హైడ్రేటు' అను మందు వాడమని చెప్పాడు. కానీ నా భార్య, నాకు వచ్చిన జబ్బు సామాన్యమైనది కాదని భయపడి బాబాను ప్రార్థించి డాక్టర్ కల్నల్ బక్‌లేకు కబురుపెట్టింది. డాక్టరు బక్‌లే వచ్చి నన్ను పరీక్షించి నా రోగాన్ని 'డబుల్ న్యుమోనియా'గా నిర్ధారించాడు. మొదట పరీక్షించిన డాక్టరు తప్పుగా రోగ నిర్ధారణ చేశాడని అతను వాడమన్న మందు ప్రమాదకరమైనదని చెప్పి, దానిని వాడకముందే అవతల పారేసాడు. అతని చికిత్సతోనూ, బాబా అనుగ్రహంతోనూ నేను కోలుకున్నాను. బాబా సరియైన సమయంలో నా భార్యకు ప్రేరణనిచ్చి, ప్రమాదకరమైన మందు నాకు ఇచ్చేలోగా, మంచి డాక్టరుకు కబురు పంపే ఏర్పాటు చేసి నన్ను కాపాడారు.

నాకు బాబాను పలుమార్లు దర్శించే అవకాశం లభించలేదు. నా భార్య కూడా వారి పట్ల ఎంతో భక్తిశ్రద్ధలు కలిగి ఉండేది. 1916లో నేను, నా భార్య శిరిడీ వెళ్ళి వారిని దర్శించి, అదే రోజు తిరిగి వచ్చేసాము. అదే నేను బాబాను చివరిసారి దర్శించడం.

బాబా ఎక్కడికీ పోలేదు. వారు జీవించే ఉన్నారు. వారు సూక్ష్మ, అదృశ్యరూపంలో మార్గదర్శకత్వం వహిస్తూ అన్ని విషయాలలో నాకు సహాయం చేస్తూనే ఉన్నారు. ఇది నాకు అనుభవపూర్వకంగా ఎన్నో విషయాలలో నిదర్శనమయింది. ఉదాహరణకు నేను 1919లో 81 రూపాయల 8 అణాల పెన్షన్‌తో పదవీ విరమణ చేశాను. నేను పదవీ విరమణ చేయడం మంచిదయింది. ఎందుకంటే, వెంటనే నా స్నేహితుని మిల్లులో నెలకు 250రూ॥ల జీతంతో ఉద్యోగంలో చేరాను. 1919 నుండి 1930 వరకు నేను ఆ ఉద్యోగంలో ఉన్నాను. ఈ ఏర్పాటంతా బాబానే చేశారు.

## 41

## మే 26వ తేదీ, 1936

**గోపాల్ భాస్కర్ దాతార్,** బి.ఎ., ఎల్.ఎల్.బి., ప్లీడరు, బ్రాహ్మణుడు, స్టేషన్ రోడ్, థానా.

1917లో నేను అహ్మద్‌నగర్‌లో ఉన్నప్పుడు సాయిబాబాను దర్శించేందుకు నాకు అవకాశాలు వచ్చాయి. కానీ వారి గురించి విన్న కొన్ని వ్యాఖ్యల వల్ల నాకు వారిపై విముఖత ఏర్పడి శిరిడీ వెళ్ళలేదు. వారు భక్తులనడిగి దక్షిణ రూపంలో ఎంతో డబ్బు తీసుకుంటారని, వారు స్నానం చేసిన నీటిని భక్తులు తీర్థంగా సేవిస్తారని మొదలైన విషయాలు విన్న నాకు వ్యతిరేక భావము ఏర్పడింది. అంతే కాదు నేనెంతో గౌరవించే నారాయణ్ మహరాజ్ ప్రవర్తనతో సాయిబాబాను పోల్చి చూసాను. ఒకసారి నేను, మరి కొందరు కలిసి నారాయణ్ మహరాజ్ గారిని దర్శించి, అందరం వారికి రూపాయి చొప్పున దక్షిణగా ఇచ్చాము. వారు మేమిచ్చిన రూపాయికి కలకండ ప్రసాదం చేర్చి, తిరిగి మాకే ఇచ్చేసారు.

తరువాత ఉపాసనీబాబా జీవిత చరిత్ర చదివి, వారి ప్రసంగాలు విని, బొంబాయిలో వారిని దర్శించి సాకోరి వెళ్ళాను. 1931లో ఉపాసనీ లీలామృతం చదివాను. అందులో శ్రీసాయిబాబాను గురించి వ్రాసిన విషయాలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి. ముందు సాకోరి వెళ్ళి అక్కడ నుండి శిరిడీ వెళ్ళాను. శిరిడీలో బాబా చిత్రపటములో ప్రకాశిస్తున్న వారి నేత్రాలు, వారు నివసించిన మసీదు, ధుని చూసిన తరువాత 'వీరు ఒక సద్గురువు' అని నా మనసులో అనుకున్నాను. అటు తరువాత సాయిలీలా మాసిక్ చదివాను. ఆ పత్రికలో 'అనుభవాలు' అన్న శీర్షికన ధారావాహికంగా వస్తున్న దాభోళ్కర్ రచించిన గ్రంథం చదివిన తరువాత బాబానే నా గురువు అన్న నమ్మకం ఏర్పడింది. అప్పటి నుండి వారినే ఆశ్రయించాను.

కొన్ని అనుభవాల ద్వారా నా నమ్మకం స్థిరపడింది. మా ఇంట్లో ఒకావిడ చాలాకాలం నుండి ఒంటి నొప్పులతో బాధపడుతుండేది. వైద్యచికిత్సలేవీ నయం చేయలేకపోయాయి. నేను, దాభోళ్కర్ (హేమాడ్పంతు) రచించిన పుస్తకాన్ని బిగ్గరగా చదువుతున్నాను. పాము నోట బడిన కప్ప వృత్తాంతంలో, సాయిబాబా కప్పనెలా రక్షించిందీ తెలిపే అధ్యాయాన్ని ఆ రోజు నేను చదువుతుండగా ఆమె మగత నిద్రలోనే విని "ఓ సాయిబాబా! కప్పవంటి జీవులపైనే నీకు జాలి ఉన్నప్పుడు,

మానవజన్మ ఎత్తిన నాపై దయలేదా?'' అని ప్రార్థించింది. అప్పుడు గోడకున్న కొయ్య మేకు నుండి వెలువడినట్లుగా ***''దసరాకు నాకు ఐదు రూపాయలు దక్షిణ ఇస్తావా?''*** అనే మాటలు వినిపించాయి. తనకు నయం అయినట్లయితే తప్పక ఇస్తానని ఆమె సమాధానం చెప్పింది. తరువాత ఆమె పూర్తి మెలకువ స్థితికి వచ్చింది. తనకు కలిగిన అనుభవం గురించి నాకు చెప్పి తన చందాగా 5రూ॥లు దసరా ఉత్సవాలకు పంపమంది. నేను వెంటనే శిరిడీకి 5రూ॥లు పంపాను. ఆ రోజు సాయంత్రానికల్లా ఆమె బాధలు తగ్గిపోయాయి. ఇది 1931-32లో జరిగింది.

ఆ తరువాత 1932లో నాకు బాబా తరచూ కలలో కన్పించేవారు. వారు చిన్న పిల్లలతో ఎలా ఆడుకుంటారో అలాగే కలలో నాతో ఆడుకునేవారు. ఒక రోజు ఉపాసనీబాబా నాకు సహాయం చేయమని సాయిబాబాను కోరినట్లు, బాబా అందుకు సమ్మతించినట్లు కల వచ్చింది. ఒకసారి నేనొక పెద్ద సమస్యలో చిక్కుకున్నాను. శాశ్వత నివాసం లేకుండా తిరుగుతూ ఉండే ఒక కక్షిదారుణ్ణి నేను కోర్టులో హాజరుపరచవలసి వచ్చింది. అతను నాకు వ్రాసిన ఉత్తరాన్ని పోగొట్టడమో లేక ఎక్కడో పెట్టి మరచిపోవడమో జరిగింది. ఎంత వెదకినా అది కనబడలేదు. ఎంత ప్రయత్నించినా అతని గురించిన ఆచూకీని కనుక్కోలేకపోయాను. చివరికి బాబాను ఆర్తిగా ప్రార్థించాను. మరుసటి రోజు ఆఫీసులో ఏదో వెతుకుతూ బీరువాపై చేయిపెట్టడం తటస్థించినప్పుడు ఆ ఉత్తరం నా చేతికి తగిలింది. దాంతో కక్షిదారుణ్ణి అనుకున్న సమయానికి కోర్టులో హాజరుపరచగలిగాను.

రెండు మూడు సంవత్సరాల క్రితం దూరప్రాంతంలో ఉన్న కోర్టువారు నన్ను ఒక కేసు తాలూకు సాక్షిని విచారించేందుకు నియమించారు. ఆ కేసుకు సంబంధించిన సాక్ష్యాలు, విచారణ ఫలితాలు మొదలైన వివరాలున్న ఫైలు నాకు పంపారు. నేను దానినెక్కడో పెట్టి మరచిపోయాను. దానికోసం చాలాచోట్ల గాలించాను. కానీ అది దొరకలేదు. నా నిర్లక్ష్యాన్ని కోర్టుకు తెలియజేసి మరల పేపర్లు పంపించమని అభ్యర్థించాల్సి వస్తుందని అనుకున్నాను. అప్పుడు, పండరియాత్రకు వెళుతున్న ఒక వార్కరీ (పండరియాత్ర క్రమం తప్పక చేసేవాడు) మా ఇంటికొచ్చాడు. కొన్నిరోజుల పాటు అతనిని ఎంతో శ్రద్ధగా సేవించాను. అతనికి నా సమస్య వివరించాను. అతను ''అది తప్పక దొరుకుతుంది'' అని చెప్పాడు. నేను ప్రతిదినం బాబాను కూడా ప్రార్థించేవాడిని. ఆ యాత్రికుడు వెళ్ళిన మరుసటిరోజు, వేరే కేసుకు సంబంధించిన పేపర్ల మధ్య నేను వెతుకుతున్న పేపర్లు దొరికాయి.

మరణించిన వారికి శ్రాద్ధకర్మలు చేయడంలాంటి ఆచారాలపై మొదట్లో నాకు నమ్మకముండేది కాదు. సంఘ సంస్కరణ భావాల ప్రభావంతో అవన్నీ అర్థరహితమైన మూఢనమ్మకాలుగా పరిగణించేవాడిని. కానీ నేను సాయిభక్తుడైన తరువాత ముఖ్యంగా బొంబాయి కుర్లా కోర్టులో గుమాస్తాగా పనిచేస్తున్న నాచ్నే అను సాయిభక్తుని అనుభవం విన్న తరువాత వీటిపై నమ్మకమేర్పడింది.

ఈ మధ్యనే నాచ్నే భార్య పసిబిడ్డను వదిలి చనిపోయింది. భార్యను ప్రేమించే నాచ్నే ఆమెకు సద్గతి కలగాలని నాశిక్ వెళ్ళి గోదావరి తీరంలో శ్రాద్ధకర్మలు జరిపించదలచాడు. కానీ అతనికి ఇలాంటి విషయాలేమీ తెలియవు. ఏమి చేయాలో ఎంత ఖర్చు అవుతుందో కూడా తెలియదు. ఇలా భయపడుతూనే 80 రూపాయలు తీసుకొని బయలుదేరాడు. రైల్లో అతనికి ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు, అతని తోటి ప్రయాణికుడు ఎంతో సహాయం చేశాడు. ఆ ప్రయాణికుడు నాచ్నే ఆదుర్దా తెలుసుకొని నాచ్నే దగ్గర ఉన్న డబ్బుతోనే అన్ని క్రతువులు జరిపించేలా చూస్తానని చెప్పాడు. అతను నాచ్నేతో పాటు అన్ని ప్రదేశాలకు వెళ్ళి క్రతువులన్నీ జరిపించి, ఎక్కువ ఖర్చు కాకుండా చూసుకున్నాడు. అతను చెప్పిన వివరాల ప్రకారం బొంబాయిలోని ఒక సంస్థలో (అడ్రస్ ఇతర వివరాలు కూడా ఇచ్చాడు) ప్యూన్‌గా పనిచేస్తున్న అతను శూద్రుడై ఉండి కూడా ఈ శ్రాద్ధకర్మలన్నీ శాస్త్రోక్తంగా జరిపించడం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. నిస్వార్థంగా నాచ్నే నుంచి ఒక పైసా కూడా ఆశించకుండా అన్ని రోజులు నాచ్నేతో ఉన్న ఆ స్నేహితుడు, పక్షం రోజులలో తిరిగి కలుసుకుంటానని చెప్పి వెళ్ళిపోయాడు. కానీ అతను తిరిగి కలవలేదు. నాచ్నే అతను చెప్పిన చిరునామా ప్రకారం వెళ్ళి చూడగా ఆ సంస్థలో అటువంటి ప్యూన్ ఎవరూ లేరని తెలిసింది. అట్లా తెలివైన ప్యూన్ రూపంలో సాయిబాబానే వచ్చి కష్టకాలంలో తనకు సహాయమందించారని నాచ్నే అనుకున్నాడు.

సర్వం తెలిసిన సాయిబాబానే ఆ భక్తునికి శ్రాద్ధకర్మల విషయంలో తోడుండి అంత సహాయం చేశారంటే, అటువంటి కర్మలు తప్పక చేయాలని, చేస్తే ఉపయోగముంటుందని నాకూ అనిపించింది. నాచ్నే ఉదంతం తెలిసినప్పటి నుండి నేనూ ఈ కర్మక్రతువులన్నీ చేస్తున్నాను.

## 42

### మే 26వ తేదీ, 1936

**కాశీనాథ్ ఖండేరావ్ గార్డే,** బి.ఎ., ఎల్.ఎల్.బి., రిటైర్డ్ సబ్‌జడ్జి, వయస్సు 65సం॥లు, కాంగ్రెస్‌నగర్, నాగపూర్.

మా వంశ గురువు రామచంద్ర టికోట్కర్. నా గురువు రామదాస్ బీడ్‌కర్ మహరాజ్. వీరు జ్ఞాని, మహాశక్తి సంపన్నులు. వీరు నాకు ఉపదేశమిచ్చారు. తాము యాత్రలలో ఎందరో మహాత్ములను, సాధుపురుషులను దర్శించామని, నన్ను కూడా ఈ మహాత్ములను దర్శించి వారి ఆశీర్వాదాలు తీసుకొమ్మని చెప్పారు. వారు దర్శించిన మహాత్ముల పేర్లను కూడా నాకు చెప్పారు. ఈ మహాత్ములందరూ ఒకే కుటుంబంలా మెలుగుతుంటారని, నేను వారిని దర్శించినప్పుడు నన్ను వారికి సంబంధించినవాడిగా గుర్తించి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తారని వివరించారు. అప్పుడు తమ బోధన యొక్క విలువ, మహత్త్యం నాకు అవగతం కాగలవని అన్నారు. వారు చెప్పిన మహాత్ములలో శిరిడీ సాయిబాబా ఒకరు.

నా గురువు బీడ్‌కర్ మహరాజ్ 1898లో నన్ను శిరిడీలో ఉన్న శ్రీసాయిమహరాజ్‌ను దర్శించమని ఆదేశించారు. తాము స్వయంగా బాబాను 25 సంవత్సరాల క్రితం (1873 ప్రాంతంలో) దర్శించామని కూడా చెప్పారు. 1912-13లో నేను ఖాంగాంలో సబ్‌జడ్జిగా పనిచేస్తున్నప్పుడు మే మాసపు సెలవుల్లో శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాను. వారు నన్ను చూస్తూనే ఎలాంటి పరిచయం లేకుండానే ***"రావయ్యా రాందాస్!"*** అంటూ హృదయపూర్వకంగా ఆహ్వానించారు. రాందాస్ నా పేరుకాదు. మా గురువు రామ్‌దాస్ బీడ్‌కర్ చెప్పిన విధంగానే హృదయపూర్వకమైన స్వాగతం లభించింది. "రాందాస్" అనేది నా గురువు ప్రస్తావనగానీ, మా వంశగురువు రామచంద్ర ప్రస్తావనగానీ అయి ఉంటుందని అనుకున్నాను.

బాబాకు తన జీవితాన్ని అంకితం చేసి శిరిడీలో నివసిస్తున్న బాలాభాటే కాలేజీ (డక్కన్ కాలేజీ) రోజుల నుండి నా స్నేహితుడు. అతని ఇంట్లోనే నేను బస చేశాను. నేను ఊరికి తిరిగి వెళదామని ప్రయత్నించిన ప్రతిరోజూ బాబా ***"రేపటి వరకు ఆగు"*** అంటూ ఆరు రోజులు నాకు అనుమతి ఇవ్వకుండా శిరిడీలోనే ఆపేసారు.

నా తిరుగు ప్రయాణపు ఖర్చుల కోసం 6, 7 రూపాయలు ఉంచుకున్నాను. బాబా మొదట 2 రూ॥లు, తరువాత 4 రోజులు రోజుకొక రూపాయి చొప్పున 4 రూపాయల దక్షిణ అడిగి పుచ్చుకున్నారు. ఆ మర్నాడు నా జేబులో మూడణాల ఆరుపైసలు మిగిలివున్నాయి. బాబా తమంతట తామే *"ఆ మూడణాల ఆరుపైసలు మాత్రం నీ దగ్గర ఎందుకుంచుకుంటావు? అవి కూడా దక్షిణగా ఇచ్చేయ్! భగవంతుడు నీకు సమృద్ధిగా ఇస్తాడు!"* అన్నారు. నేను వెంటనే నా దగ్గరున్న డబ్బును ఇచ్చేసాను.

నేను శిరిడీ వచ్చేముందు పూనాలోని 'రే' మార్కెట్టుకెళ్లి, బాబాకు సమర్పించేందుకు మేలురకం 'పయరీ' మామిడిపండ్లు మూడు కొన్నాను. నేను బాబాను దర్శించిన వెంటనే ఆ పండ్లను సమర్పించాను. బాబా స్వీకరించి వాటిని చూస్తూ, పండ్లు బాగున్నాయని సంతోషంగా మెచ్చుకున్నారు. వాటిని ముక్కలు కోసి తెమ్మన్నారు. తరువాత వారొక ముక్క తీసుకొని మిగతావి ప్రసాదంగా భక్తులందరికీ పంచారు. పండ్లను కోసే ముందు భక్తులతో బాబా *"ఇదిగో! ఈ పండ్లను ఇతడు మార్కెట్టులో కొని, రుచి చూడకుండా కొన్న పండ్లన్నింటినీ తెచ్చి నాకు సమర్పించాడు. ఆ రోజు పండిట్ చేసిన విధంగా కాదు. ఆ పండిట్ నాకు సమర్పించాలని లడ్డూల ప్యాకెట్టు కొన్నాడు. ఇక్కడికి వచ్చే దారిలో గోదావరిలో స్నానం చేసిన తరువాత అతనికి ఆకలయి కొన్ని లడ్డూలను తిని మిగిలినవి తెచ్చి సమర్పించాడు. ఈ పండ్లు వాటివలె శేషభాగం కాదు"* అన్నారు. బాబా మాటలు క్రింది విషయాలను తెలుపుతాయి:

1. భక్తులు తమ గురువుపై అచంచల భక్తి కలిగి ఉండాలి. నిర్లక్ష్యంతో శేష పదార్థాలు (మిగిలినవి) నైవేద్యంగా సమర్పించకూడదని తెలుపుతాయి.

2. శిరిడీకి ఎంతో దూరంలో జరిగే విషయాలన్నీ బాబా ఎఱుక లోనివే అని మనకు తెలియజేయడం ద్వారా మనం బాబాపైన, మన గురువుపైన పెట్టుకున్న నమ్మకం పెరిగి బలపడుతుంది. నా వరకు బాబా చెప్పిన మాటల వలన నేను అంటి పెట్టుకొని ఉన్న గురువుపైనా, వారి బోధనలపైనా విశ్వాసం పెరిగి దృఢపడింది.

ఎనిమిదవ రోజు నేను ఇంటికెళ్ళడానికి బాబా నుండి అనుమతి లభించింది. భాటే దగ్గర కొంత డబ్బు అప్పు తీసుకొని ఇంటికి బయలుదేరాను. నేను శిరిడీలో ఉన్న ఎనిమిది రోజులలో ఒక అపూర్వ దృశ్యాన్ని చూసాను. ఒకరోజు

హరిసీతారాం దీక్షిత్ ఒక పెద్ద కేసు గెలిచి శిరిడీ వచ్చాడు. కక్షిదారులు అతనికిచ్చిన సుమారు వెయ్యి రూపాయల పారితోషికాన్ని వెండి రూపాయలుగా ఒక ట్రంకుపెట్టె నిండా పోసి దక్షిణగా ఆ పెట్టెను బాబా ముందుంచాడు. బాబా తమ రెండు చేతులతో ఆ డబ్బును గుప్పెళ్ళతో తీసుకొని మసీదు బయట అటువంటి అవకాశం కోసం గుంపులుగా వేచివున్న ఫకీర్లు, పేదవారికి పంచేశారు. ఇలా కొద్ది నిముషాలలో ఆ పెట్టెలోనున్న డబ్బంతా దానంగా ఇచ్చేయబడింది. తను కష్టపడి సంపాదించి తెచ్చిన డబ్బు అలా మాయమైపోయినందుకు దీక్షిత్ ముఖంలో లేశమంతైనా బాధగానీ, అసంతృప్తిగానీ కనిపించలేదు.

ఇక నా స్నేహితుడు బాలాసాహెబ్ భాటేను గురించి నాలుగు మాటలు చెబుతాను. కాలేజీలో ఉన్నప్పుడు అతనొక స్వేచ్ఛాజీవి. స్వతంత్రభావాలు కలిగి ఉండేవాడు. యథేచ్ఛగా పొగ తాగుతూ, ఒక్కమాటలో చెప్పాలంటే "ఈ రోజే తిను, త్రాగు, ఆనందించు. రేపు మనం చనిపోతాం!" అనేదే అతని సిద్ధాంతం. పొగపీల్చే అలవాటులేని నేను "యత్రయత్ర భాటేః తత్ర తత్ర ధూమః" (ఎక్కడ భాటే ఉండునో అక్కడ పొగ ఉండును) అని పరిహసిస్తూ ఉండేవాడిని. తరువాత భాటే మామ్లత్‌దారయ్యాడు. కలెక్టరు దగ్గర సమర్థత కలిగిన అధికారిగా మంచిపేరు కూడా సంపాదించాడు. అతను ఐదు సంవత్సరాల పాటు (1904-1909) కోపర్‌గాం మామ్లత్‌దార్‌గా పనిచేశాడు. అప్పుడు బాబాను దర్శించడానికి వెళ్తున్న విద్యావంతులైన తన స్నేహితులను వెక్కిరిస్తూ, బాబా ఒక పిచ్చివాడని చెబుతుండేవాడు. బాబానొకసారి దర్శించిన తరువాత వారిని గురించి ఒక అభిప్రాయానికి వస్తే బావుంటుందని అతని స్నేహితులు భాటేకు చెప్పారు. 1909లో అతను వారి మాట ప్రకారం శిరిడీలో క్యాంపువేసి ప్రతిదినం బాబాను గమనించసాగాడు. ఇలా నాలుగురోజులు గడిచాయి. ఐదవరోజు బాబా అతనిపై కాషాయ వస్త్రాన్ని కప్పారు. ఆ రోజు నుండి భాటే పూర్తిగా మారిపోయాడు. ఉద్యోగాన్నిగానీ, సంపాదననుగానీ పట్టించుకోలేదు. ఆమరణాంతం శిరిడీలోనే ఉండి బాబా సేవ చేసుకుంటూ గడపాలని నిర్ణయించుకున్నాడు. అప్పటి నుండి నిత్యకర్మలు కొనసాగిస్తూ నిత్యం బాబా సమక్షంలో ఉపనిషత్తులు పారాయణ చేయసాగాడు (బాబా అప్పుడప్పుడు దానిపై వ్యాఖ్యానించేవారు). బాబా, దీక్షిత్‌చేత ఒక సంవత్సరం సెలవు దరఖాస్తు

వ్రాయించి భాటేచే సంతకం చేయించి ఆఫీసువారికి పంపారు. ఉద్యోగంలో తిరిగి చేరడానికి కలెక్టరు భాటేకు ఒక సంవత్సరం గడువు ఇచ్చాడు. కానీ సంవత్సరం పూర్తయిన తరువాత కూడా భాటే బాబాను వదిలివెళ్ళడానికి ఇష్టపడలేదు. భాటేలోని వైరాగ్యాన్ని పరిగణనలోకి తీసుకొని అతను ఉద్యోగం చేయలేడని నిర్ధారణకాగా అతనిపై కనికరంతో నెలకు 30 రూపాయల పింఛను మంజూరు చేశారు. అతని భార్యాబిడ్డలు శిరిడీ వచ్చి అతనితో నివసించసాగారు. నేను అతనిలో వచ్చిన ఈ గొప్పమార్పుకు కారణమేమిటని అడిగాను. బాబా తనపై కాషాయ వస్త్రం కప్పినప్పటి నుండి ఈ మార్పువచ్చిందని చెప్పాడు. తన ఆలోచనా దృక్పథం పూర్తిగా తొలగిపోయి దాని స్థానే నూతన దృక్పథం చోటు చేసుకుందని చెప్పాడు.

బాబాతో నా అనుభవాలను గురించి సంక్షిప్తంగా వ్రాసాను. నేను శిరిడీ సందర్శించడానికి గల కారణాలు, బాబా వద్ద నాకు లభించిన ఆదరణ గురించిన వివరాలు మరాఠీలో వెలువడిన మా గురువుగారి జీవితచరిత్రలో ప్రచురింపబడ్డాయి.

## 43

## జూన్ 1వ తేదీ, 1936

**మైనతాయి గణేష్ కువలేకర్,** వయస్సు 49సం॥లు, తండ్రి: నానాసాహెబ్ గణేష్ చాందోర్కర్, కస్బా గణపతి ఆలయం దగ్గర, పూనా.

నేను నానాసాహెబ్ చాందోర్కర్‌గారి పెద్ద కుమార్తెని. నాకు ఇద్దరు తమ్ముళ్ళున్నారు. నా చిన్న తమ్ముడు బాపుకు ఇప్పుడు నలభై సంవత్సరాలుంటాయి. నాకు 12-13 సంవత్సరాల వయస్సున్నప్పుడు (1899-1900) మా కుటుంబ సభ్యులతో కలిసి శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాను. ఆ తరువాత తరచూ శిరిడీ వెళ్ళేదానిని. 1918 తరువాత వెళ్ళలేదు.

చిట్నిస్‌గా పని చేస్తుండిన చిదంబరరావు గాడ్గిల్ మా నాన్నను శ్రీసాయిబాబాకు పరిచయం చేశాడు. అప్పుడు మా నాన్న ఘోద్నదిలో మామ్లత్‌దార్‌గా ఉన్నారు.

మేము బాబా వద్దకు వెళ్ళిన తొలిరోజుల్లో జరిగిన ఒక సంఘటన గురించి చెబుతాను. మేము చావడిలో బస చేసి ఉన్నాము. మా నాన్న తప్ప మిగిలినవారమంతా శిరిడీ నుండి బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నప్పుడు బాబా వచ్చి భిక్ష అడిగి **"వెళ్ళవద్దు"** అన్నారు. ఆ సమయంలో బాబా కళ్ళు రత్నాల వలె మెరుస్తున్నాయి. మేము మా ప్రయాణాన్ని మానుకున్నాము. దారిలో పిల్లలు తినడానికని తీసుకువెళుతున్న తినుబండారాలను బాబాకు ఇచ్చాము.

మా నాన్న ప్రయాణాన్ని బాబా ఆపివేసిన లేక వాయిదా వేసిన ఒకటి, రెండు సంఘటనలు చెబుతాను. ఒకసారి మా నాన్న బాబా సన్నిధిలో ఉన్నప్పుడు కలెక్టరును అర్జంటుగా కలుసుకోవలసిన అవసరం ఏర్పడింది. మా నాన్న చితలీలో రైలు అందుకోడానికి సమయం ప్రకారం బయలుదేరాడు. అదే రైలుకు బయలుదేరాల్సిన ఒక హరిదాసుకు బాబా అనుమతినిచ్చారు. కానీ మా నాన్నను మాత్రం ఆపివేసారు. సమయానికి స్టేషనుకు చేరుకోగలనో లేదో అని కంగారుపడుతూ భోజనం చేయకుండానే ఆ హరిదాసు హడావిడిగా వెళ్లిపోయాడు. మా నాన్న తీరికగా భోజనం చేసివచ్చిన పిమ్మట, హరిదాసు బయలుదేరిన అర్థగంట తరువాత బాబా మా నాన్న వెళ్ళడానికి అనుమతినిచ్చారు. ఆ రోజు

రైళ్ళ రాకపోకల సమయాలు మారాయన్న విషయం మా నాన్న స్టేషనుకు వెళ్ళిన తరువాత తెలిసింది. ఆయన స్టేషనుకు చేరిన తర్వాతే రైలు వచ్చింది. ఈ సంఘటన 1900 సంవత్సరంలో జరిగింది. ఈ విషయం మా నాన్న నాతో చెప్పారు.

మరొకసారి మా కుటుంబం నాశిక్‌లో జరిగే పెళ్ళికి హాజరవడానికి శిరిడీ నుండి బయలుదేరాము. కానీ బాబా మాకు అనుమతి ఇవ్వకుండా **"వెళ్ళవద్దు"** అన్నారు. మన్మాడు స్టేషనులో పిల్లలకేదైనా తినిపించవచ్చనుకొని మేము వాళ్ళ భోజనం కోసం ఏమీ ఏర్పాటు చేసుకోలేదు. మేము 3 గంటలు వేచిన తరువాత బాబా అనుమతించారు. మేము మన్మాడుకు బయలుదేరాము. మన్మాడు చేరక ముందు మేము ఎక్కవలసిన రైలు స్టేషనులో పట్టాలు తప్పింది. దానిని సరిచేయడానికి 3 గంటలు పట్టింది. ముందు మేమనుకున్న ప్రకారం బయలుదేరివుంటే స్టేషనులో మూడు గంటలు ఆగవలసి వచ్చేది. బాబాకు సర్వం తెలుసు గనుక మమ్మల్ని శిరిడీలో ఆపారు. చివరిగా అనుమతిచ్చిన తరువాత ప్రయాణం సవ్యంగా సాగిపోయింది.

1904లో నాకు 17సంవత్సరాలున్నప్పుడు నా భర్త ప్లేగు వ్యాధితో పూనాలో మరణించారు. మా అమ్మ సమయానికి రావడంతో ఆమెకు చివరిచూపైనా దక్కింది. నా భర్త మరణించేటప్పటికి నేను గర్భవతిని. 1905లో నేను జామ్నేరులో ఉన్నప్పుడు నాకు ప్రసవ వేదన మొదలయింది. కానీ ప్రసవం క్లిష్టమయ్యింది. అప్పుడు గోసావితో బాబా ఊదీ పంపి, నాకు సుఖప్రసవమయ్యేట్టు చేశారు. నేను ప్రసవ వేదనలో ఉండడం వల్ల నాకు ఈ విషయాలేమీ తెలియవు. 1908లో మేము పండరిపురంలో ఉన్నాము. మేము శిరిడీకి వెళ్ళినప్పుడు నాలుగు సంవత్సరాల వయస్సున్న నా తమ్ముడు బాపూరావు ప్రతిదినం ఉదయం మసీదుకెళ్లి బాబా తలపై ఒక పుష్పాన్నుంచి వారిని పూజించేవాడు. అంతకుముందు బాబాను ఆ విధంగా పూజించేందుకు అనుమతిగానీ, బాబాకు నిత్యపూజ చేసే పద్ధతిగానీ లేదు. ఇదే బాబా నిత్యపూజకు నాంది అయిందని చెప్పాలి.

1906లో ఒక భక్తుడు బాబా పాదాలకు నమస్కరిస్తుండగా అతని కంటి అద్దాలు క్రిందపడిపోయాయి. ఇది చూసిన ఒక భక్తుడు, క్రిందపడిన అద్దాలు బాబాకే కానుకగా సమర్పిస్తే బాగుంటుందని చెప్పాడు. అప్పుడు బాబా

*"నాకు అద్దాలు అక్కరలేదు. నా అద్దాల విలువ నలభై రూపాయలు"* అన్నారు. బాబా మాటలలోని అంతరార్థం మా నాన్న నాకు వివరించారు. "అద్దము" అంటే ఆత్మసాక్షాత్కారమని, "నలభై రూపాయలు" అంటే నలభై సంవత్సరాల క్రితమే బాబాకు ఆత్మసాక్షాత్కారమైందని చెప్పారు. అప్పుడు నాకు 18, 19సం॥ల వయస్సుంటుంది.

మా నాన్నగారి నుండి తెలుసుకున్న విషయాలు:-

1) సాయిబాబాకు మా నాన్న మూడు నాలుగు తరాల నుండి తెలుసు.

2) బాబా "నారాయణ" అనే పదాన్ని తమ మాటల్లో తరచూ ఉపయోగిస్తుంటారని, (నారాయణ తేలి, నారాయణ దోబి) బ్రాహ్మణ సన్యాసులెప్పుడూ నారాయణ పదాన్ని వాడుతుంటారు కాబట్టి వారు బ్రాహ్మణ సన్యాసి అయి ఉంటారు.

3) బాబా గీతలోని శ్లోకాలను వల్లిస్తుంటారు కాబట్టి వారికి సంస్కృతం తెలుసు.

మా నాన్న సనాతన ఆచారాలను పాటించేవాడు. ఆయన బాబా పాదతీర్థాన్ని ఏనాడూ సేవించలేదు. కానీ దీక్షిత్ మొదలైన భక్తులు బాబా పాదతీర్థాన్ని సేవించేవారు. మా నాన్నగారి షడ్డకుడు బాలాసాహెబ్ బీనీవాలే దత్తభక్తుడు. (అతను 5, 6 సంవత్సరాలు క్రిందట చనిపోయాడు). 1899-1900లో తనకు బాబాపై నమ్మకం లేకపోయినా మా నాన్న కోరిక మన్నించి, శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాడు. అప్పుడు బాబా అతనికి మూడు శిరస్సులున్న దత్తాత్రేయునిగా సాక్షాత్కరించారు. అప్పటి నుండి అతను బాబానే దత్తావతారంగా నమ్మి జీవిత పర్యంతం సాయిభక్తునిగా ఉండిపోయాడు.

నేను మొదట 1900లో సాయిబాబాను దర్శించినప్పుడు వారు నెరసిన జుట్టుతో యాభై సంవత్సరాల వయస్సున్న వారిలా కనిపించారు. కానీ వారు 1918 వరకు ఇంచుమించు అలాగే కనిపించేవారు. 1918లో "ఇన్‌ఫ్లూయంజా" అను వ్యాధి దేశమంతటా వ్యాపించియున్న సమయంలో బాబా మహాసమాధి చెందారు.

# 44

## జూన్ 10వ తేదీ, 1936

**వినాయక్ దాజీభావే,** వయస్సు 37సం॥లు, బ్రాహ్మణుడు, షిరోల్, కొల్హాపూర్ రాష్ట్రం.

1932లో నేను బి.బి.సి.ఐ రైల్వే కంపెనీలో గుమాస్తాగా పనిచేస్తుండేవాడిని. అప్పుడు నా నెలజీతం 90రూ॥లు. నేను గురువును అన్వేషిస్తూ 13.4.1932 నుండి ఒక నెలరోజుల పాటు 'గురుగీత'ను శ్రద్ధగా పారాయణ చేశాను. నేను ఆశించినట్లు నాకు గురువు లభించలేదు, స్వప్నంలో దత్తదర్శనమూ కాలేదు. తరువాత గురువును పూజించడానికి పవిత్రమైన ఒక గురువారంనాడు దత్తమందిరానికి వెళ్ళాను. మందిరంలో దత్త విగ్రహమున్న చోట చక్కగా మలచిన ఒక సమాధి కనిపించింది. మరుసటి రోజు ఉదయం నా స్నేహితుని ఇంటికి వెళ్ళి దాభోళ్కర్ రచించిన సచ్చరిత్ర పుస్తకాన్ని చూస్తున్నప్పుడు, అందులోని బాబా సమాధి ఫోటో నా దృష్టిని ఆకర్షించింది. ఆ ఫోటోను నేను ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు. దత్తమందిరంలో నాకు కనబడిన సమాధి అదేనని రూఢి చేసుకున్నాను. దీనిని బట్టి శ్రీసాయిబాబాయే నా గురువని తెలుసుకున్నాను. కొన్ని రోజులపాటు బాబా ఊదీ ధరిస్తూ సాయిబాబాపై రచించిన కొన్ని పుస్తకాలను చదివాను. కానీ ఒక సమాధి గురువు కానేరదని అసంతృప్తిగా అనిపించేది. నేను ఆశ్రయించేందుకు, వారితో నా భావాలు విన్నవించేందుకు ఒక సజీవుడైన గురువు కావాలని కోరుకునేవాడిని. గురుగీత శ్రద్ధగా పారాయణ చేస్తే గురువు లభిస్తారన్న విషయం మరల గుర్తొచ్చింది. వెంటనే గురుగీత పారాయణ ప్రారంభించాను. ఒక వారం తరువాత నా కలలో ఖేడ్‌గాంకు చెందిన నారాయణ మహరాజ్ కన్పించారు. వారే నా గురువని తలచి ఖేడ్‌గాం వెళ్ళాను. అక్కడ నాకొక కల వచ్చింది. కలలో నాకు నారాయణ మహరాజ్ కన్పించి "నాకు శ్రీసాయిబాబాకు ఎటువంటి భేదం లేదు! అక్కడికి నువ్వెందుకు వెళ్ళలేదు?" అని ప్రశ్నించారు. నాకు ఎవరూ మార్గం చూపేవారు లేరని బదులు చెప్పాను. తరువాత నాకు మెలకువ వచ్చింది. నేను శిరిడీ వెళ్ళి, బాబాను గురువుగా ఎంచుకొని పూజించసాగాను. ఒక సాధువు నా చేయిచూసి "సాయిబాబాయే నీ గురువు!" అని చెప్పారు.

1933లో నా కుమారునికి ప్లేగు వ్యాధి సోకింది. అది కేవలం బాబా ఊదీతోనే నయమయ్యింది. మా సోదరి దుర్గాబాయి కాకత్కర్‌కు రామ సాక్షాత్కారం ఇప్పిస్తానని దత్తమహరాజ్ ఒకరు మాట ఇచ్చారు. ఆమె సంతోషించి ఆ సాధువుకు 100 రూపాయల నగదు, ఒక వెండి కప్పు ఇచ్చింది. కానీ ఆ సాధువు చెప్పినట్లు ఆమెకు శ్రీరామ సాక్షాత్కారం లభించలేదు. ఆ దత్తమహరాజ్ వెండికప్పు తిరిగి ఇవ్వడని ఆమె భయపడసాగింది. అప్పుడు నేను ఆ వెండికప్పును దత్తమహరాజ్ తిరిగి ఇస్తే దానిని సాయిబాబా సంస్థాన్‌కు సమర్పిస్తానని మ్రొక్కుకోమన్నాను. అలా చేస్తే సాయిబాబా తిరిగి ఇప్పిస్తారని చెప్పాను. ఆమె అలాగే మ్రొక్కుకుంది. అతను ఆ వెండికప్పు, వంద రూపాయలు తిరిగి ఆమెకు ఇచ్చేసాడు. ఆమె వెండికప్పును సాయిబాబా సంస్థాన్ వారికి పంపి తన మ్రొక్కు తీర్చుకుంది.

సాయిబాబా గురించి 1916లోనే నాకు తెలుసు. అప్పుడు మా అమ్మ అన్నపూర్ణాబాయి దాజీభావే బాబాను దర్శించేందుకు శిరిడీ వెళ్ళింది. ఆమె మసీదు మెట్లు ఎక్కుతున్నప్పుడు బాబా ఆమెను వారిస్తూ, మసీదు అపవిత్రం అవుతుంది అన్నారు. ఆమె వెనుతిరిగి శిరిడీ నుండి ఏవలా వెళ్ళింది. అక్కడ ఉండగా ఆమెకొక జాబు వచ్చింది! అందులో యవత్‌మాళ్‌లో ఉన్న తన కోడలు (నా సోదరుని భార్య) చనిపోయినట్లు కబురువుంది. మా అమ్మ మసీదుకు వెళ్ళిన రోజుకి ఒక రోజు ముందే ఆమె చనిపోయింది. అప్పుడు ఆ విషయం మా అమ్మకు తెలియదు. చనిపోయిన 10రోజుల వరకు సూతకపు అంటు ఉంటుంది. మసీదుకు వెళ్ళినప్పుడు మా అమ్మకు తన కోడలు చనిపోయిన విషయం తెలియదు. కానీ బాబాకు తెలుసు.

మా అమ్మ చనిపోయినప్పుడు పిండప్రదానం చేశాము. కానీ ఎంతసేపటికీ కాకులు పిండాన్ని ముట్టుకోలేదు. అప్పుడు కాకులు పిండాన్ని తీసుకొని వెళితే యాభై రూపాయలు సమర్పించుకుంటానని మా సోదరి బాబాకు మ్రొక్కుకుంది. వెంటనే కాకులు వచ్చి పిండాన్ని తిన్నాయి.

## 45

## జూన్ 17వ తేదీ, 1936

**ముకుందశాస్త్రి లేలే,** c/o కృష్ణశాస్త్రి, వైదిక జీవనం, వయస్సు 58సం॥లు, కొంకణ బ్రాహ్మణుడు, శనివార్ పేట్, పూనా.

1912లో నేను తరచూ శిరిడీ వెళ్ళి బాబాను దర్శించేవాడిని. ఒకసారి నేనూ, నానాసాహెబ్ చాందోర్కర్ టాంగాలో బయలుదేరాము. దారిలో గుర్రం వెనుకకాళ్ళపై లేచినందువల్ల టాంగా పడిపోయింది. కానీ బాబా దయవలన మేమిద్దరం ఎటువంటి గాయాలు లేకుండా క్షేమంగా బయటపడ్డాము. అదే సమయంలో బాబా మసీదులో తమ చేతులను శంఖంలా ఉంచి నోటి దగ్గరపెట్టుకొని ఊదుతూ ***"నానా చనిపోబోతున్నాడు కానీ, నేనతన్ని చనిపోనిస్తానా? (నానా ఆతా మరత్ హోతే, మీ మరూన్ దేయీన్ కాయ్?)"*** అని అన్నారు. ఇది జరిగిన ఎనిమిది రోజుల తరువాత మేము శిరిడీకి వెళ్ళాము. బాపూసాహెబ్ జోగ్ ఎనిమిది రోజుల క్రిందట బాబా పైవిధంగా అన్నారని చెబుతూ "అది నిజమేనా?" అని అడిగాడు. నేను "అవున"ని సమాధానమిచ్చి జరిగిన వాస్తవాలను వివరించాను.

1914లో నా భార్య ఎనిమిది నెలల గర్భవతిగా ఉన్నప్పుడు నేను శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాను. బాబా నాకు రెండు బర్ఫీ ముక్కలిచ్చి ***"వెళ్ళు"*** అన్నారు. నేను ఇంటికి వెళ్ళాను. నా భార్యకు సుఖప్రసవమైంది. ఇప్పుడు నాకు నలుగురు పిల్లలు.

నేను బాబాను మసీదులో పూజించేటప్పుడు నారాయణోపనిషత్తులోని తైత్తరీయ భాగాన్ని చదవమని బాబా నన్ను ఆదేశించారు. నేను పది రోజుల పాటు ఆ భాగాన్ని వారి సన్నిధిలో పఠించాను. తరువాత ఈ ఉపనిషత్తును దీక్షిత్‌కు బోధించాను. బాబా అప్పుడప్పుడు భగవద్గీతలోని 'అపిచేత్ సుదురాచార్', ఇతర శ్లోకాలు వల్లించడం నేను విన్నాను. వారికి సంస్కృతం తెలుసు.

## 46

## జూలై 7వ తేదీ, 1936

**కర్సెట్‌జీ షాపుర్‌జీ పెస్టన్‌జామాస్,** యార్డ్ మాస్టర్, రైల్వే సర్వీస్, (రిక్లమేషన్), వయస్సు 75సం॥లు, పార్శీ, కొలాబా, ఖుస్‌రూబాద్, బాగ్.

నేను శిరిడీ వెళ్ళి బాబాను దర్శించి అక్కడ 3, 4 రోజులు గడిపాను. నేను వారిని దర్శించింది ఆ ఒక్కసారి మాత్రమే! నేను, మా బావమరిది కలిసి శిరిడీ వెళ్లాము. మాకు దీక్షిత్‌వాడాలో క్రింది అంతస్థులో బస ఇచ్చారు. ధనవంతులకు, గొప్పవారికి పైఅంతస్థులో బస ఇస్తున్నట్లు గమనించాము. మేము మసీదుకెళ్ళి బాబా సన్నిధిలో కూర్చున్నప్పుడు బయటికి చెప్పకపోయినా మాకు కల్పించిన వసతి గురించిన ఆలోచనే మెదులుతూ ఉంది. "ఈ దర్బారులో ఇదేం న్యాయం? గొప్పవారు పైఅంతస్థులో సౌకర్యాలు అనుభవిస్తున్నారు. పేదవారిని అసౌకర్యంగా ఉన్న క్రింది అంతస్థులో ఉంచారు?" అని మనస్సులో అనుకున్నాను. వెంటనే బాబా ***"వీళ్ళని పైఅంతస్థుకు తీసుకువెళ్ళండి!"*** అని ఒక భక్తుని పురమాయించారు. దాంతో మాకు పైఅంతస్థులో బస ఏర్పాటు చేయబడింది. బాబా అంతర్యామిత్వానికి, సమదృష్టికి, వారి దర్బారులో అందరికీ ఒకే న్యాయముంటుంది అనడానికి ఇదొక నిదర్శనం. మేము శిరిడీ నుండి బయలుదేరుతున్నప్పుడు వారు బయటికి వచ్చి శుభసూచకంగా చేయి ఊపుతూ మాకు వీడ్కోలు చెప్పారు.

శ్రీసాయిబాబా ద్వారా నాకు కలిగిన అనుభవం ఇదొక్కటే. వారు భగవంతుడని నేను నమ్ముతున్నాను.

# 47


## జూలై 20వ తేదీ, 1936

**బి. లగాటే,** Esq**., బి.ఎ., ఎల్.ఎల్.బి.,** మాజీ సబ్‌జడ్జి, వయస్సు 70సం॥లు, బ్రాహ్మణుడు, శనివార్‌పేట్, పూనా.

నేను 1913-14లో సాయిబాబా వద్దకు వెళ్ళాను. నేనప్పుడు చాలా కష్టాలలో ఉన్నందువల్ల వారి ఆశీర్వాదం కొరకు వెళ్లాను. వారి ఆశీస్సులు లభిస్తే నా కష్టాలన్నీ తొలగిపోతాయని ఆశించాను. నేను బాబా వద్దకు వెళ్ళినప్పుడు వారు దక్షిణ అడిగారు. నేను సమర్పించాను. బాబా తమంతట తామే ***"వేపవిత్తనం నాటు, తరువాత ఆ చెట్టును నరికివేయి"*** [1] అని చెప్పారు. వారి మాటలు నాకేమీ అర్థం కాలేదు. కానీ నేను ఆశించినట్లుగా ఆశీస్సులు ఇవ్వలేదని మాత్రం అర్థమయింది. నేను నిరాశతో తిరిగి వచ్చేసాను. నేనప్పుడు బాబా సన్నిహిత భక్తుడైన హరిసీతారాం దీక్షిత్‌తో కలిసి మూడు సంవత్సరాలపాటు ఉన్నప్పటికీ మరల ఎప్పుడూ బాబాను దర్శించలేదు.

---

*1. లగాటే లంచాలు తీసుకున్నాడని అతనిపై నేరారోపణ చేయబడింది. క్రిమినల్ కోర్టులో కేసునడిచి, అతనికి జైలుశిక్ష, భారీ జరిమానా విధించబడింది. ఆ శిక్ష అప్పీలులో కూడా నిర్ధారించబడింది. లగాటే అప్పీలు పెండింగులో ఉండగా, బాబా ఆశీస్సుల కోసం వారిని దర్శించాడు. వేపవిత్తనం నాటడం, చెట్టును నరకడం! అన్న నిగూఢమైన బాబా మాటలు కర్మ సిద్ధాంతాన్ని సూచిస్తున్నాయి. చేదు విత్తనాన్ని నాటితే, చేదు ఫలితమే పొందుతావని, కనుక మనిషి తను చేసిన తప్పులకు తగిన మూల్యం చెల్లించి, కర్మ సంచితాన్ని నిర్మూలించుకోవడమే ఉత్తమమని, తద్వారా నేర్చుకున్న గుణపాఠంతో భవిష్యత్తులో ఉన్నతి పొందాలని దీని భావము.*



కుశాభావు

## 48

## జూలై 20వ తేదీ, 1936

**కుశాభావు ఉరఫ్ కృష్ణాజీ కాశీనాథ్ జోషీ,** వయస్సు 70సం॥లు, జోషీ వతన్‌దార్, బ్రాహ్మణుడు, తండ్రి: కాశీనాథ్ పద్మాకర్ జోషీ, మిరజ్‌గాం (అహ్మద్‌నగర్ నుండి 10 మైళ్ళు).

నేను పేద కుటుంబానికి చెందినవాడిని. నాకు ఉపాధ్యాయ వృత్తికి అర్హత పొందేందుకు అవసరమైన ప్రాథమిక విద్యను ప్రాంతీయ భాషలో చెప్పించారు. ఆ ఉద్యోగంలో నాకు నెలకు 5 నుండి 7 రూపాయల జీతం వచ్చేది. ఇదికాక వంశపారంపర్యంగా వచ్చే పూజారి వృత్తికి కావలసిన శిక్షణ కూడా ఇప్పించారు. కానీ నాకు ఈ రెండింటిపై ఆసక్తి లేదు. నేను భక్తి మార్గానికే నా జీవితాన్ని అంకితం చేయదలచుకున్నాను. నాకు సాత్వికులు, గొప్ప మహాత్ములు అయిన దత్తమహరాజ్ అనే గురువు లభించారు. వారిని సేవించుకుంటూ వారి దగ్గర యోగ విద్య అభ్యసించసాగాను. వారి శిక్షణలో ఆసనాలు, ప్రాణాయామం, కుండలిని శక్తిని మేల్కొలుపుట మొదలైన విద్యలన్నీ నేర్చుకున్నా నాకు తృప్తి కలగలేదు. మా గురువుగారికి మారణం, ఉచ్చాటనం, వశీకరణం మొదలైన మంత్రవిద్యలెన్నో తెలుసు. ఆ విద్యలు నేర్పమని పట్టుబట్టాను. అవి నేర్చుకోవడం మంచిదికాదని మా గురువుగారు నాకు నచ్చజెప్పచూసారు. కానీ నా యువరక్తంలో ఉన్న ఉత్సుకత, మొండితనం వలన ఆ మంత్రవిద్యలు నేర్పమని వారిపై గట్టి ఒత్తిడి తెచ్చాను. మా గురువుగారు అయిష్టంగానే నాకు ఆ విద్యలన్నీ నేర్పారు. ఒక ఇనుప కడియాన్ని ధరించి ఈ మంత్రాలను నిర్ణీత సంఖ్య మేరకు నిష్ఠగా జపించి వాటిని వశపరచుకున్నాను. నేను ఒక మంత్రాన్ని ఉచ్ఛరించి వెంటనే నా చేతుల్లోనికి పేడాలను, ఇతర మిఠాయిలను తెప్పించగలిగేవాడిని. ఈ మిఠాయిలను నేను తినకూడదు, అమ్మకూడదు. నా మంత్రశక్తికి అబ్బురపడి నన్ను అభినందించేవారికి పంచిపెట్టేవాడిని. ఇవన్నీ కేవలం మంత్రోచ్చారణ ద్వారా చేసేవాడిని కానీ యక్షులు, కామినీలు మొదలైన దుష్టశక్తులను వశపరచుకొనుట ద్వారా కాదు.

అంతేగాక ఇతరులు ప్రయోగించిన దుష్టశక్తులను నిర్వీర్యం చేయగలిగేవాడిని. ఇది ప్రమాదంతో కూడుకున్నది. ఈ శక్తులను ప్రయోగించి

ప్రాణహాని కూడా కలిగించవచ్చు. ఒక్కొక్కసారి ఆ శక్తులు, ప్రయోగించినవారికి కూడా భౌతికంగా హాని కలగజేయవచ్చు.

నేను 22 సంవత్సరాల వయస్సుకే ఈ మంత్రశక్తులన్నిటి మీద పట్టు సాధించాను. ఆ సమయంలో మా గురువుగారు సమాజానికి దూరంగా హిమాలయాలకు వెళ్ళి ఆమరణాంతం అక్కడే గడపదలచారు. మా గురువు నన్ను ఉత్తర దిశగా ఢిల్లీ వరకు తీసుకొని వెళ్లి అక్కడ నాకు తుది వీడ్కోలు ఇస్తూ శిరిడీలో సాయిబాబా అను పేరుతో తమ జ్యేష్ఠ సోదరుడున్నారని (మార్ఘా బడీల్ భావు), నన్ను వారి దగ్గరకు వెళ్ళి వారు చెప్పినట్లుగా నడుచుకొమ్మని ఆదేశించి వెళ్ళిపోయారు. ఆ తరువాత నా గురువు నాకు కనిపించలేదు, వారిని గురించిన వివరాలేమీ తెలియరాలేదు.

నేను 1908లో గురువు ఆదేశానుసారం శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాను. నేను నా ఇనుపకడియాన్ని తీసివేసి మంత్రవిద్యా ప్రయోగం ద్వారా పేడాలు మొదలైనవి తెప్పించడం మానిన తర్వాతే బాబా తమతో ఉండేందుకు అనుమతిస్తామని చెప్పారు. ఖచ్చితమైన వారి ఆదేశాన్ని పాటించి, ఇనుపకడియాన్ని పగులగొట్టి అవతల పారేసాను. మంత్ర విద్యలను కూడా త్యజించాను. శిరిడీలో భిక్షచేసి జీవనం గడిపేవాడిని. నాకు శిరిడీలో ఒక నివాసం లేదు. బాబా నన్ను పగలంతా మసీదులో ఒక మూల కూర్చొని దాసబోధ పారాయణ చేస్తూ ఉండమని ఆదేశించారు. నేను అలాగే చేసేవాడిని. రాత్రిళ్లు ఎక్కడ చోటు దొరికితే అక్కడ పడుకునేవాడిని. బాబా నాకుగానీ, ఇతరులకుగానీ ఏ ఉపదేశమూ ఇవ్వలేదు. అప్పటికింకా బొంబాయి నుండిగానీ ఇతర పట్టణాల నుండిగానీ భక్తులు రావడం మొదలవలేదు. అప్పుడప్పుడు గ్రామస్థులు మాత్రమే వారిని దర్శించి, జ్వరము, కడుపునొప్పి వంటి చిన్న చిన్న సమస్యలకు ఉపశమనం కోరేవారు. బాబా, మసీదులో నిరంతరం వెలుగుతుండే తమ ధుని నుండి ఊదీ తీసి వారికి ఇచ్చేవారు. వారు అందరినీ దక్షిణ అడిగేవారు కాదు. కొద్దిమందిని మాత్రం 4, 5 పైసలు దక్షిణ అడిగి ధునికయ్యే కట్టెలకు మొదలగువాటికి వాడేవారు. వారి దగ్గరికి వచ్చే గొప్పవారి విషయానికొస్తే తరచూ నానాసాహెబ్ నిమోణ్కర్‌ను వారితో చూసేవాడిని. బాబా తమ సంభాషణలలో బ్రహ్మ, మాయ, వివేకం, మహావాక్య తత్త్వాలు, సాధనా చతుష్టయాలు మొదలైన విషయాలు ప్రస్తావించగా నేను వినలేదు. బాబా యందు విశ్వాసముంచి ఆశ్రయించిన వాళ్ళకి, తమ అద్భుత

శక్తులతో భగవంతునిపట్ల విశ్వాసాన్ని కలిగించేవారు. అలా ఆశ్రయించిన వాళ్ళు తమ ఇష్టదైవాన్ని ఉపాసించిన పిదప, వారి ఇష్టదైవం యొక్క సాక్షాత్కారాన్ని బాబా ప్రసాదించేవారు.

నేను బాబా సన్నిధిలో మూడు సంవత్సరాలు గడిపాను. ఆ తరువాత తొమ్మిది సంవత్సరాలు వారిని తరచుగా దర్శిస్తూ వచ్చాను. ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో ఒకసారి బాబా ***"ఆ మూడు తలల వ్యక్తిని చూడు!"*** అని అన్నారు. మూడు తలలున్నవారు దత్తాత్రేయుడే కాబట్టి గాణ్గాపూర్ వెళ్ళి దత్తాత్రేయుని దర్శించమని బాబా ఆదేశంగా భావించాను. నేను గాణ్గాపూర్ సంవత్సరానికి రెండుసార్లు- గురుపూర్ణిమకు ఒకసారి, మాఘపూర్ణిమకు మరోసారి వెళ్ళేవాడిని. బాబా నన్ను మూడు రోజులకొక పారాయణం చొప్పున 108సార్లు గురుచరిత్ర పారాయణ చేయమని ఆదేశించారు. నేను ఈ పని మీద గాణ్గాపూర్ వెళ్ళి, అక్కడే 10, 11 నెలలు ఉండి వారు చెప్పినట్లుగా పారాయణం పూర్తి చేశాను.

నేను నా మంత్రశక్తులు ఉపయోగించడాన్ని బాబా నిషేధించారు. కానీ వారు దయతో నాకు మరొక శక్తిని ప్రసాదించారు. అదెలా జరిగిందో వివరిస్తాను.

నేను ఒక ఏకాదశి రోజున మసీదులో వారి ప్రక్కన కూర్చొని ఉన్నాను. అప్పుడు బాబాకు నాకు జరిగిన సంభాషణ:

*బాబా : ఈ రోజు నీవేమి తింటావు?*

నేను : ఏమీ తినను. ఈ రోజు ఏకాదశి

*బాబా : ఏకాదశి అంటే ఏమిటి?*

నేను : ఉపవాసముండే రోజు

*బాబా : ఉపవాసమంటే ఏమిటి?*

నేను : కంద మూలాలు తప్ప మరేదీ తినకుండా ఉండటం

'కంద'మూలాలంటే దుంప వేళ్ళు. మామూలుగా చిలగడ దుంపలనే కందమూలాలంటారు. వాటిని ఏకాదశిరోజు తింటుంటాము. (సనాతనులు ఏకాదశిరోజు ఉల్లిగడ్డలను తినకూడదు). బాబా కంద- కాందాలోగల ఉచ్ఛారణా సామ్యాన్ని అవకాశంగా తీసుకొని కొన్ని ఉల్లిగడ్డలు (మరాఠీలో కాందా) నా చేతిలో పెట్టి తినమంటూ బలవంతం చేయసాగారు. వారి అభీష్టానికి వ్యతిరేకంగా

నడుచుకోవడం ఇష్టంలేక నేను చివరికి లొంగి "మీరు తింటే నేను తింటాను" అన్నాను. అప్పుడు బాబా వెంటనే కొన్ని ఉల్లిగడ్డలు తీసుకొని తిన్నారు. నేనూ కొన్ని ఉల్లిగడ్డలు తిన్నాను. అప్పుడే కొందరు భక్తులు మసీదులోకి వస్తున్నారు. బాబా నన్ను ఆట పట్టించాలని తలచి, వచ్చిన భక్తులను ఉద్దేశించి ***"ఈ బాపనోణ్ణి చూసారా! ఏకాదశిరోజు ఉల్లిగడ్డలు తింటున్నాడు!"*** అన్నారు. నేను చేసిన పనిని సమర్థించుకోవాలని "బాబా తిన్నారు కనుక నేను తిన్నాను" అని బదులు చెప్పాను. బాబా వెంటనే ***"నేనసలు ఉల్లిగడ్డలనే తినలేదు"*** అంటూ తిన్నది కక్కేసారు. దానిలో ఉల్లిగడ్డలసలు లేవు. చిలగడ దుంపలున్నాయి. మళ్ళీ బాబా ***"చూసారా! నేను తిన్నది ఉల్లిగడ్డలు కాదు - చిలగడదుంపలు!"*** అన్నారు. బాబా తమ అద్భుత శక్తితో ఉల్లిగడ్డలను చిలగడదుంపలుగా మార్చేసారు. నాకు అది ఒక మహత్తర అవకాశంగా తోచింది. బాబా కక్కినదానిని ప్రసాదంగా భావించి ఒక్క ఉదుటున దానిపైబడి నోటితో లాక్కొని తినేసాను. బాబా తిట్టి అవతలకి తోసారు, కొట్టారు కూడా. బాబా ఉచ్ఛిష్టాన్ని (ఎంగిలి) తినగలిగినందుకు మహదానందంలో ఉన్న నేను ఇవేమీ లెక్కచేయలేదు. అక్కల్‌కోట మహరాజ్‌వలె, బాబా తిట్టిన తిట్లు కొట్టిన దెబ్బలు శుభాన్ని, శ్రేయస్సును కలుగజేస్తాయని నాకు తెలుసు! అందువల్ల వారి తిట్లను, దెబ్బలను ఆశీస్సులుగా భావించాను. మరుక్షణం బాబా మనోవైఖరి మారిపోయింది. వారిపై నాకున్న అచంచల విశ్వాసానికి అభినందనపూర్వకంగా నా తలపై వారి హస్తాన్నుంచి ఆశీర్వదించారు. అప్పటి నుండి బాబాను స్మరించి చేతులు చాచిన వెంటనే, నా చేతుల నుండి వెచ్చని ఊదీ రాలునట్లు వరాన్ని ప్రసాదించారు.

(ఈ విషయం చెప్పిన తరువాత కుశాభావు తన రెండు చేతులను దోసిలిలా పట్టి (ముందుకు చాచి ముఖానికి దగ్గరగా పెట్టుకొని) తలఎత్తి, కళ్ళు మూసుకొని బాబాను ధ్యానించాడు. ఒక నిమిషం తరువాత "ఇదిగో ఊదీ, చేతులు పట్టండి" అంటూ తమ దోసిలి గుండా ఊదీని ధారగా పోయసాగాడు. నేను, నాతో వచ్చిన అవస్థే అతని దోసిలి క్రింద పేపరు పెట్టి కొన్ని ఔన్సుల ఊదీ సేకరించి దాచుకున్నాము - బి.వి.నరసింహస్వామి)

ఊదీ ప్రసాదం పట్ల విశ్వాసంతో నా దగ్గరకు వచ్చే భక్తులకు, ఆ అద్భుతవరం వల్ల లభించిన ఊదీని పంచిపెట్టేవాడిని. అది వారి బాధలను, పలురకాల దుష్ప్రభావాలను తొలగించేది. సంతానం లేనివారికి సంతానం కూడా

ప్రసాదించేది. ఈ శక్తి కొరకు నేను ఏ జపమూ చేయవలసిన అవసరం లేదు. అది నాలో స్థిరంగా నిలిచింది.

ఇక చేతులలోనికి పేడాలను తెప్పించే మంత్ర విద్యపట్ల బాబా విధించిన నిషేధాన్ని నేను తప్పక పాటించేవాడిని. కానీ అప్పుడప్పుడు భక్తుల ఒత్తిడికి లొంగి ఆ మంత్రశక్తులను ప్రయోగించవలసి వచ్చేది. దుష్టశక్తులను తిప్పికొట్టే మంత్రవిద్యను మాత్రం ప్రయోగిస్తూ ఉండేవాడిని. ఇలా చేస్తున్నందుకు నేను పశ్చాత్తాపం చెందలేదు. నెల క్రితం రాజ్‌మచికర్ మనుమడిపై దుష్ట ప్రయోగమేదో జరిగింది. అది క్షుద్రశక్తి ప్రయోగాలలో వాడుకలో ఉండే ప్రయోగం. ఆ విధమైన శక్తులను తిప్పికొట్టేందుకు కొన్ని ప్రత్యేకమైన మంత్రాలు ఉన్నాయి (అవి నేను అభ్యసించి ఉన్నాను). అతని శరీరంపైన, గుడ్డలపైన, పడకపైన అకారణంగా నల్లని మచ్చలు ఏర్పడేవి. అవి ప్రతి శనివారం మాత్రమే కన్పించేవి. రాజ్‌మచికర్ నాకు కబురుపెట్టాడు. నేను వారి ఇంటికి వెళ్ళి ఆ దుష్ట ప్రయోగాన్ని నిష్ఫలం చేసే మంత్రాలు చదివి, దత్తాత్రేయుని పూజ నిర్వహించి ఆరతి ఇచ్చాను. నేను పూజ నిర్వహించిన తరువాత శనివారం (18.7.1936) మచ్చలు కనపడలేదు. ఆ దుష్టశక్తుల్ని విజయవంతంగా తిప్పికొట్టగలిగాను.

నేను మూడు సంవత్సరాలు బాబా చెంత గడిపిన తరువాత మా నాన్న వచ్చి నన్ను తనతో తీసుకెళ్ళాడు. నేను ఇంటికి వెళ్ళేముందు బాబాను దర్శించాను. బాబా ***"ఈసారి వచ్చేటప్పుడు ఇద్దరుగా రండి!"*** అన్నారు. కొన్ని రోజుల తరువాత నేను, మా నాన్న శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాము. అప్పుడు బాబా అంతకుముందు దర్శనంలో తాము చెప్పిన ***"ఇద్దరుగా రండి!"*** అన్న మాటలకు అర్థం- ***"పెళ్ళి చేసుకొని భార్యతోరా"*** అని వివరించారు. తరువాత మా నాన్న నన్ను శిరిడీ నుండి తీసుకెళ్ళాడు. నేను పెళ్ళి చేసుకున్నాను. పెళ్ళయినప్పటికీ నేను శిరిడీ వెళ్ళి బాబా దగ్గర ఉండటానికి ఇష్టపడేవాడిని. అందుకే ఒకసారి ఒంటరిగా వెళ్ళి చాలా రోజులు శిరిడీలోనే ఉండిపోయాను. అప్పుడు నా భార్య వచ్చి తనతో తీసుకెళ్ళింది. ఇప్పుడు నాకు పిల్లలు, మనుమలు కూడా ఉన్నారు.

నేనొకసారి శిరిడీ వెళ్ళి బాబాను దర్శించినప్పుడు ***"నన్ను చూడటానికి ఎందుకు ఇంతదూరం శ్రమపడి వస్తావు? నేను అక్కడే ఉన్నాను!"*** అన్నారు. అంతేగాక మా గ్రామంలో వారుండే ప్రదేశాన్ని వర్ణించి చెప్పారు. నేను తరువాత ఆ ప్రదేశానికి వెళ్ళి ముళ్ళపొదలు మొదలైనవన్నీ తొలగించి శుభ్రపరిచాను. అక్కడ

నాకొక సమాధి కన్పించింది. నేను ఆ స్థలాన్ని కొని సమాధిని పూజించసాగాను. అక్కడ నాకు బాబా దర్శనం లభించేది. అప్పటి నుండి శ్రీరామనవమి ఉత్సవాలకు తప్ప నేను శిరిడీ వెళ్ళేవాడిని కాదు.

మరో విషయమేమంటే చేతుల్లోనికి ఊదీ సృష్టించే శక్తిని నేను ఇతరులకు ఇవ్వవచ్చును. కానీ ఆ శక్తిని స్వీకరించే వ్యక్తి ఆరునెలల పాటు అత్యంత నియమనిష్ఠలు పాటించి ఇంద్రియ నిగ్రహంతో కఠోర బ్రహ్మచర్య దీక్ష అవలంబించాలి.

**30.8.1936 తేదీన చెప్పిన విషయాలు:**

మిరాజ్‌గాంలో ఫకీర్‌షా అను సాధువు సుప్రసిద్ధులు. వారు 200 సంవత్సరాలకు పూర్వం జీవించి ఉండేవారు. వారి సమాధి ఉండే స్థలం అప్పటి జాగీర్దారు వారికి ఈనాముగా ఇచ్చారు. కానీ ఆ స్థలం ఇప్పుడు నా సొంతం. వీరికి శిష్యులుగానీ, వారసులుగానీ లేరు. వారి దర్శనం ఇప్పటికీ మనం చేసుకోవచ్చు. చాతుర్మాసాలలో వారి దర్శనం లభించదుగానీ వారి మాటలు వినపడతాయి. వారు చాలా తక్కువగా మాట్లాడుతారు. అప్పుడప్పుడు సాయిబాబాను గురించి మాట్లాడేవారు. వారి మాటలద్వారా, భక్తి, జ్ఞానమార్గాలలో ప్రగతిని సాధించేదంటూ ఏమీ ఉండదు. భక్తులలో నమ్మకం కలిగించేందుకు మాత్రమే వారు దర్శనమిచ్చేవారు. వారు శ్రీసాయిబాబా జీవించే ఉన్నారని చెప్పేవారు. కానీ వారు ఏ రూపంలో ఉన్నది మాత్రం తెలియజెప్పేవారు కాదు. తామూ, సాయిబాబా ఒకే కూటమికి చెందినవారమని, వారితో సన్నిహిత బంధమున్నదని చెప్పేవారు.

(ఆ రోజు రాత్రి పదిగంటల సమయంలో కుశాభావు, నారాయణరావు భిడే గదిలోనికి ప్రవేశించి, తన చేతుల్లోనికి ఊదీని సృష్టించి కొంత నారాయణరావు నొసటిపై రాసి, మిగిలిన దానిని అందరికీ పంచిపెట్టారు. తరువాత ఊదీని సృష్టించే శక్తిని గురించి మరికొన్ని విషయాలు క్రింది విధంగా చెప్పారు - బి.వి.ఎన్. స్వామి)

నేను చేతుల్లోనికి ఊదీ సృష్టించడమనేది ఎలాంటి మంత్రాలు ఉచ్ఛరించడం వల్ల జరిగేది కాదు. కేవలం బాబాను స్మరించడం వల్లే సాధ్యమయ్యింది. కానీ చేతుల్లోనికి పేడాలు, మిఠాయిలు తెప్పించడం మంత్రప్రయోగం వల్ల జరిగేది. నా చేతుల్లో ప్రత్యక్షమైన పేడాగానీ, మిఠాయిగానీ మరో చోట నుండి తెప్పించబడేది. అంటే పేడాలు ఒక చోట నుండి మరొక చోటుకు బదిలీ చేయడం అన్నమాట. అందుకే దీనిని బాబా నిషేధించారు.

## ౪౨

## జులై ౨౬వ తేదీ, ౧౯౩౬

**బాలకృష్ణ గోవింద్ ఉపాసనీ శాస్త్రి,** పదవీ విరమణ చేసిన సంస్కృత ఆచార్యుడు, వయస్సు సుమారు 69సం॥లు, బ్రాహ్మణుడు, తండ్రి: గోవింద్ గోపాల్ ఉపాసనీ శాస్త్రి, శనివార్‌పేట్, పూనా.

పూనాలో ప్లేగు వ్యాధి ప్రబలి ఉన్నప్పుడు మా కళాశాల కొన్ని నెలలు మూసివేసారు. అప్పుడు నేను నా భార్యను, అమ్మను తీసుకొని తీర్థయాత్రలకు బయలుదేరాను. హరిద్వార్, ఋషీకేష్ చూసుకొని తపోవన్‌కు వెళ్ళాము. అక్కడ ఒక సాధువు నావైపే ప్రకాశవంతమైన కళ్ళతో తదేకంగా చూస్తుండటం గమనించాను. అతనికి నమస్కరించాను. అతడింకా నన్ను పరికించి చూస్తూ "నీవు సతానాకు చెందినవాడివి కదా?" అనడిగారు. మా పూర్వీకుల స్థలం సతానా కాబట్టి అవునని జవాబు చెప్పి తామెవరో చెప్పమని అభ్యర్థించాను. "రేపు ఇదే సమయానికి (మధ్యాహ్నానికి) ఇక్కడికి రా! నేను చెబుతాను" అన్నారు. నేను బసకు వెళ్ళి ఈ విషయాన్ని మా అమ్మకు చెప్పాను. ఆమె కాసేపు ఆలోచించి వారు మల్హారేకు (మయూరపుర) చెందిన తమ వంశగురువు ఉద్ధవ మహరాజ్ అయి ఉంటారని భావించింది. ఆమె కూడా వారిని దర్శించాలన్న కోరికతో నాతో పాటు నిర్ణీత సమయానికి సాధువును కలవాల్సిన ప్రదేశానికి వచ్చింది. 15 నిముషాలు అక్కడంతా వెదకిన తరువాత సంచారి అయిన ఒక సాధువు కోసం వెదకడం వృథా ప్రయాస అని తలచి మా అమ్మ వెళ్ళిపోయింది.

మా అమ్మ వెళ్ళిన మరుక్షణమే ఆ సాధువు నా ముందు ప్రత్యక్షమయ్యాడు. అతను గంభీరంగా "ఎప్పుడూ ఈ విధంగా నడుచుకోవద్దు" అన్నారు. ఏ విధంగా నడుచుకోకూడదు? అని అడిగాను. అతను "ఎవరిని రమ్మని ఆదేశిస్తారో వారు మాత్రమే రావాలి. భౌతికంగానే కాక ఇతర విషయాలలో కూడా ఒక వ్యక్తికి మరో వ్యక్తికీ ఎంతో తేడా ఉంటుంది. ఏ ఇద్దరూ ఒకటిగా ఉండరు. అందువల్ల పిలిచిన వారు మాత్రమే రావాలి!" అన్నారు. ఇక మీదట అదే విధంగా నడుచుకుంటానని వారికి మాట ఇచ్చి తామెవరో చెప్పమని అభ్యర్థించాను. "నీవు నీ ఇంట్లో పూజించే దేవుళ్ళ మధ్య ఒక సాలిగ్రామం (పవిత్రశిల) ఉంది కదా?" అని అడిగి దానిని యథాతథంగా

వర్ణించారు. నేను ఉందని చెప్పాను. "ఆ సాలిగ్రామంను ఉద్ధవమహరాజ్‌కు ఇచ్చింది నేనే! ఉద్ధవ మహరాజ్ దానిని అతని మనుమడికి ఇచ్చాడు. అతను మీ తాతగారికి ఇచ్చాడు!" అని చెప్పారు. ఆ సాలిగ్రామం నాకు వంశపారంపర్యంగా లభించింది. దానిని ఇంకా నేను పూజిస్తున్నాను.

ఆ సాధువు చూడడానికి 50, 60 సంవత్సరాల వయస్సున్నట్లుగా కనిపించారు. లావుగా, బలంగా ఒంటిపై కేవలం కౌపీనం మాత్రం ధరించి ఉన్నారు. అప్పటికీ వారెవరన్నది నాకు నిర్ధారణ కాలేదు. అంతలో ఆయన తమ చేతులను ఊపుతూ, నా దృష్టిని ఆకర్షిస్తూ "ఒక చెట్టుంది. ఇద్దరు దానినెక్కారు. ఒకడు క్రిందికి వచ్చాడు, మరొకడు పైకి వెళ్ళాడు!" అన్నారు. అప్పటివరకు మరాఠీలో మాట్లాడుతున్న వారు ఈసారి హిందూస్థానీలో మాట్లాడారు. చివరగా వారు "నీవు తెలుసుకుంటావులే!" అని చెప్పి అదృశ్యమయ్యారు.

ఇది జరిగిన చాలా సంవత్సరాల తరువాత 1910-11 (31.12.1911) ప్రాంతంలో వచ్చిన క్రిస్మస్ సెలవులలో నా తమ్ముడు కాశీనాథ్‌ను (ఉపాసనీబాబా) వెతకడానికి ధూళే నుండి దక్షిణం వైపు బయలుదేరాను. కాశీనాథ్ ప్రాణాయామం అభ్యసిస్తూ, శ్వాసకు సంబంధించిన ఒక వింత జబ్బుకు గురి అయ్యాడు. అతను పడుకుంటే ఊపిరి ఆగిపోయేది, అందువల్ల పడుకోలేడు. తత్ఫలితంగా నిద్ర కరువైంది. జీర్ణశక్తి కూడా లోపించింది. దాంతో అతను ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. మాకు అతని జాడ తెలియలేదు. నేను రైలులో మన్మాడ్ నుండి దక్షిణం వైపు వెళుతున్నాను. ఆ రైలు కోపర్‌గాంలో కొద్ది నిముషాలు ఆగినప్పుడు కోపర్‌గాం మామ్లత్‌దార్‌గా పనిచేస్తున్న నా స్నేహితుడు భట్ ప్లాట్‌ఫారంపై నన్ను కలిసాడు. తనతో ఒకరోజు ఆనందంగా గడపమని అక్కడ దించేశాడు. అక్కడికి ఆరు మైళ్ళ దూరంలోనున్న శిరిడీలో సాయిబాబా అనే గొప్ప సాధువున్నారని వారిని తప్పక దర్శించమని చెప్పి తన టాంగాలో శిరిడీకి పంపాడు.

నేను మసీదుకు వెళ్ళాను. సాయిబాబా ధుని దగ్గర నిలబడి అప్పుడప్పుడు తమ చుట్టూ తాము తిరుగుతూ ఉన్నారు. వారు నన్ను చూసి లోనికి రమ్మని పిలిచారు. నేను వెళ్ళి వారికి సాష్టాంగ ప్రణామం చేశాను. నన్ను పరికించి చూస్తూ ఖండోబా దేవాలయానికి వెళ్ళమన్నారు. బాబా ఖండోబా దేవతను

దర్శించమని చెబుతున్నారని తలచి అందరు దేవుళ్ళూ బాబాలోనే ఉన్నారని వారి దర్శనంతో నాకు తృప్తి కలిగిందని బదులు చెప్పాను. ***"ఖండోబా ఆలయానికి వెళ్ళు!"*** అని బాబా మళ్ళీ చెప్పారు. దీనిని బట్టి వారు నన్ను అక్కడ ఉండకుండా వెళ్ళిపొమ్మంటున్నారని అనుకున్నాను. దాంతో నేను మసీదు ప్రక్కనున్న ఇంటికి వెళ్ళాను. వారికి బాబా ఆదేశం గురించి చెప్పగా ఖండోబా ఆలయంలో ఉపాసనీ శాస్త్రి అనే వ్యక్తి ఉన్నాడని వాళ్ళు చెప్పారు. వెంటనే నేను ఖండోబా దేవాలయానికి వెళ్ళగా అక్కడ నా తమ్ముడు కనిపించాడు. కాశీనాథ్ తను బాబా ఆదేశం మేరకు అక్కడ నివసిస్తున్నానని, బాబాను అరుదుగా దర్శిస్తానని చెప్పాడు. నేను అతని భోజన ఖర్చుల నిమిత్తం నాలుగు రూపాయలు దాదాకేళ్కర్‌కు ఇచ్చి తిరిగి మసీదుకు వచ్చాను. నేనప్పుడు శిరిడీలో ఒకటి రెండురోజులు గడిపాను.

మొదటిరోజు బాబా అందరినీ మామూలుగా దక్షిణలు అడుగుతున్నారు. కొందరు వారికి దక్షిణ సమర్పించారు. వారు చేయి చాపి నన్ను కూడా ***"దక్షిణ కుక్షిణ ఇస్తావా?"*** అని అడిగారు. నా దగ్గర డబ్బులేదని చెప్పి నా ప్రణామాలు సమర్పించాను.

బాబా అప్పుడు హిందూస్థానీలో ***"చూడు! ఒక చెట్టుంది. ఇద్దరు దానినెక్కారు. ఒకడు క్రిందికి వచ్చాడు, మరొకడు పైకి వెళ్ళాడు!"*** అని తపోవనంలోని సాధువు చెప్పిన మాటలు యథాతథంగా చెప్పారు. నేను ఒక్కసారిగా తపోవనం సాధువును గుర్తు చేసుకున్నాను. చూడడానికి ఆ సాధువు, బాబా వేషధారణలో వేరుగా ఉన్నా, రూపంలో దగ్గరి పోలికలు కన్పించాయి. తరువాత బాబా తమ స్వీయ చరిత్రలోని కొన్ని జ్ఞాపకాలను ప్రస్తావించారు. ఝాన్సీరాణి పాల్గొన్న యుద్ధంలో తాము సైన్యంలో ఉన్నామని చెప్పారు.

రెండవరోజు కూడా బాబా నన్ను దక్షిణ అడిగారు. నా దగ్గర రైలు ఛార్జీలకు బొటాబొటిగా సరిపోయే డబ్బులే ఉన్నాయని దక్షిణ ఇవ్వలేక పోతున్నందుకు క్షమించమని అన్నాను. అప్పుడు వారు నా జేబులో నున్న వెండి గడియారాన్ని చూపిస్తూ దానిని దక్షిణగా ఇవ్వమని అడిగారు. నేను ఒక్క నిమిషం సంకోచించినా మొత్తానికి దానిని వారికి సమర్పించాను. వారు దానిని తీసుకొని ప్రక్కనే ఉన్న ఒక ఫకీరుకు ఇచ్చారు. తరువాత నన్ను చూస్తూ గడియారం కోల్పోయానన్న నా

బాధను తీరుస్తూ ***"దీనివలన నీవు పోగొట్టుకునేదేమీ ఉండదులే!"*** అన్నారు. నేను వారికి ఇచ్చింది బహుస్వల్పమని చెప్పి నేను ఇంటికి బయలుదేరాను. కోపర్‌గాం మీదుగా పూనా చేరాను. అక్కడ నా స్నేహితుడైన నాతూ ఇంటికి వెళ్ళాను. శిరిడీలో బాబాకు నేను సమర్పించిన జేబు గడియారం గురించి మాట్లాడుతూ, అలాంటి గడియారం కొనాలంటే ఎంత ఖరీదవుతుందని విచారించాను. అదే సమయంలో నాతూ సోదరుడు అరవై రూపాయలు ఖరీదు చేసే బంగారు జేబు గడియారాన్ని పంపి, దానిని నన్ను కానుకగా స్వీకరించమని చెప్పాడు. నేను స్వీకరించాను. నేను బాబాకు గడియారం ఇచ్చినందువల్ల పోగొట్టుకున్నదేమీ లేదు.

నేను శిరిడీకి ఒకటి, రెండుసార్లు వెళ్ళాను. అప్పుడు శ్రీసాయిబాబాపై ఒక సంస్కృత పద్యాన్ని రచించాను.

## 50

## జూలై 27వ తేదీ, 1936

**బాలకృష్ణ రామచంద్ర ఖైరికర్,** వైదిక జీవనం, వయస్సు 70సం॥లు, బ్రాహ్మణుడు, ఖైరి (చితలీకి 3మైళ్ళ దూరం).

నేను మొదట సాయిబాబా ఒక పిచ్చి ఫకీరని విన్నాను. అది సుమారు 35 సంవత్సరాల క్రితం సంగతి. కానీ తరువాత అందరూ సాయిబాబాను గురించి గొప్పగా చెబుతుండడంతో ఎలాగూ శిరిడీలో నాకు తెలిసిన కొంతమంది బ్రాహ్మణులు (అప్పాకులకర్ణి) ఉన్నారు, కనుక నేను బాబాను దర్శించేందుకు వెళ్ళాను. నేను అప్పట్లో ఒక గ్రామాధికారిని. అది నాకు వంశపారంపర్యంగా సంక్రమించింది. 1916లో ప్రభుత్వం వంశపారంపర్య గ్రామాధికారుల వ్యవస్థను రద్దు చేసింది. మొదట్లో ప్రజలు చితలీ, జలగాం, రామ్‌పూర్, నాథ్‌పట్లాచా, వాడి, పింపల్‌వాడి మీదుగా శిరిడీ చేరేవారు. చాలాకాలం నిరుపయోగంగా ఉండిన ఆ రోడ్డు ఇప్పుడు లేదు. బాబా నూనెకు బదులు నీటితో దీపాలు వెలిగించిన లీలను నేను చూసాను. దండేర్‌పూర్‌కు చెందిన దేశ్‌పాండే మాష్టరు బాబా మాటలు తరచూ వింటుండేవాడు. కానీ బాబా ఏం మాట్లాడారోనన్నది మాత్రం నాకు తెలియదు.

నేను 1908లో సాయిబాబా వద్దకు వెళ్ళినప్పుడు మసీదులో నా పాదం క్రింద ఒక పైసా ఉన్నట్లు గమనించి దానిని తీసి బాబాకిస్తూ "ఈ పైసా మీదే! భద్రపరచుకోండి" అన్నాను. బాబా ఆ పైసాను తిరిగి నాకు ఇస్తూ *"సరేలే! ఈ నాణాన్ని ఇంటికి తీసుకెళ్ళు. దీనిని నీ పూజాగదిలో దేవతా మూర్తుల మధ్య పెట్టుకొని పూజించుకో. నీకు శుభం కలుగుతుంది!"* అన్నారు. నేను అలాగే దానిని ఇంటికి తీసుకెళ్ళి పూజించాను. మూడు సంవత్సరాల వరకు అంటే 1911 వరకు నా పరిస్థితులు చాలా అభివృద్ధి చెందాయి. అంతకుముందు పగలు తింటే రాత్రి తినడానికి ఏమీ ఉండేది కాదు. అటువంటిది నాణాన్ని పూజించడం మొదలు పెట్టిన తరువాత గ్రామాధికారిగా నా సంపాదనలో చాలా డబ్బు ఆదా చేసుకోగలిగాను. నా భార్యకు బంగారు గాజులు కూడా చేయించగలిగాను.

ఒకసారి నేను ప్రయాణంలో అపవిత్రంగా ఉన్నందున నా పారాయణ గ్రంథాన్ని నా స్నేహితునికి ఇచ్చాను. బాబా ఇచ్చిన పైసా అందులోనే ఉంది.

కొన్నిరోజుల తరువాత ఆ పైసా పోయినట్లు కనుగొన్నాను. ఇది 1911లో జరిగింది. అప్పటి నుండి నాకు కష్టాలు మొదలయ్యాయి. పైసా పోయిన ఆరు నెలలకు నా భార్య మరణించింది. 1916లో నా గ్రామాధికారి పదవి పోయింది. 1917-18లో మా అమ్మ కూడా మరణించింది. ఇప్పుడు నేను భిక్షాటనతో జీవిస్తున్నాను. నేను ప్రతి శ్రీరామనవమికి శిరిడీ వెళుతుంటాను.

# 51

## ఆగష్టు 27వ తేదీ, 1936

**బదావే,** C/o ఆనంద రామచంద్ర బదావే, ఎస్టేట్ బ్రోకరు, వయస్సు 64సం॥లు, బ్రాహ్మణుడు, నేవాసే, ప్రస్తుత నివాసం: మోతీచౌక్, రవివార్‌పేట్, పూనా.

ముప్పై సంవత్సరాల క్రితం మా మామగారయిన వబాలే అహ్మద్‌నగర్‌లో వకీలుగా పనిచేస్తుండేవారు. వీరు గొప్ప సాయిభక్తులు. మా మామగారు, నానాసాహెబ్ చాందోర్కర్ స్నేహితులు. నేనప్పుడు నేవాసలో ఉన్న మోహినీరాజ్ ఆలయ పూజారిగా పనిచేస్తున్నాను. నాకు ఒక కుమారుడున్నాడు. వాడికి ముందు వెనుక చాలా మంది పిల్లలు పుట్టారు కానీ పుట్టిన కొంతకాలానికే మరణించారు. మా మామగారి ప్రోద్బలంతో నేను, నా భార్య- బిడ్డను తీసుకొని శిరిడీ వెళ్ళాము. మేము బాబాకు మా కష్టాలేమీ చెప్పుకోలేదు. నా భార్య మాత్రం మనస్సులో తనకు పుట్టబోయే పిల్లలు దీర్ఘాయువు కలిగి ఆరోగ్యంగా ఉండేటట్లు దీవించమని కోరుకుంది. బాబా ఆమె తలపై తమ హస్తాన్నుంచి *"ఏమీ చింతపడవద్దు"* అని ఆశీర్వదించారు. ఆ తరువాత మాకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె పుట్టారు. ఒక కుమారుడు మాత్రం 17సం॥ల వయస్సులో చనిపోయాడు. మిగిలిన వారందరూ క్షేమంగా ఆరోగ్యంగా ఉన్నారు. బాబాను దర్శించినప్పుడు వారు నన్ను దక్షిణ అడిగారు. నేను ఇచ్చాను. కానీ మళ్ళీ మళ్ళీ అడిగి నా దగ్గరున్న డబ్బంతా తీసేసుకున్నారు. నేను వారికి మరో రూపాయి సమర్పిద్దామనుకున్నాను కానీ ఇవ్వలేకపోయాను. మేము తిరిగి వచ్చిన తరువాత నా భార్యకు ఈ విషయం చెప్పాను. కొన్ని సంవత్సరాల తరువాత ఆర్థిక ఇబ్బందులు నన్ను చుట్టుముట్టాయి. వృత్తిరీత్యా నేను కాళ్ళరిగేలా తిరిగినా ప్రయోజనం లేక కొద్దిపాటి డబ్బే లభించేది. ఆ సమయంలో నా భార్య, నేను బాబాకు సమర్పించదలచి ఇవ్వలేకపోయిన రూపాయి విషయం గుర్తు చేసింది. నేను వెంటనే బాబాకు మనియార్డరు ద్వారా రూపాయి పంపాను. అప్పటి నుండి నా ఆర్థిక పరిస్థితి మెరుగుపడసాగింది. ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు, కష్టాలు లేకుండా నిశ్చింతగా గడపసాగాను. ఇది జరిగి ఇరవై సంవత్సరాలయింది. అప్పటికి బాబా సజీవులై ఉన్నారు. 1914లో నేను పూనా వచ్చాను. ఇక్కడ ఎస్టేట్ బ్రోకరుగా వ్యాపారం చేస్తున్నాను. నా కుమారులు కూడా చక్కగా వ్యాపారం చేసుకుంటున్నారు.



ఎస్.ఎన్. ఖార్కర్

## 52

### సెప్టెంబరు 1వ తేదీ, 1936

**శ్రీధర్ నారాయణ్ ఖార్కర్,** అక్కౌంటెంట్, సచివాలయము, వయస్సు 57సం॥లు, కాయస్థప్రభు, నెం.37, చార్నీరోడ్, థానా.

దైవభక్తి పరాయణుడైన మా తాతగారు నాకు చిన్నప్పటి నుండి భక్తిపూర్వకమైన విషయాలు, సనాతన ధర్మాలు బోధించేవారు. ఆ ప్రభావంతో నాకు ఆధ్యాత్మికతపై ఆసక్తి కలిగి సద్గ్రంథాలు చదువుతుండేవాడిని. ఒకసారి సాయిభక్తుడైన డిప్యూటీ కలెక్టరు శ్రీఅప్పాకులకర్ణి నాకు సాయిబాబా ఫోటో చూపించి, వారి గురించి చెప్పారు. అలా నాకు మొదటిసారిగా శ్రీసాయిబాబా గురించి తెలిసింది. ఒకరోజు నేను అనారోగ్యంతో ఉన్నప్పుడు దాభోళ్కర్ సాయిలీలా మాసిక్ పత్రికలను, బాబా ఫోటోను, ఊదీని పంపాడు. ఆ మరుసటి రోజు నుండి నా ఆరోగ్యం బాగయింది. అప్పటి నుండి నేను వారిని పూజించడం మొదలుపెట్టాను. క్రమేణా వారిపై భక్తి విశ్వాసాలు పెరగసాగాయి.

నాకు వచ్చిన ఒక కల వలన బాబాపై నమ్మకం ఏర్పడింది. దాభోళ్కర్ పంపిన సాయిబాబా ఫోటోను పూజాగదిలో పెట్టడానికి తీసుకువెళ్ళాను. నేను ముందు నుండి పూజిస్తున్న అక్కల్‌కోట మహరాజ్ ఫోటో ప్రక్కన బాబా ఫోటోను పెట్టడానికి ఉపక్రమిస్తున్నప్పుడు, ముస్లిం ఫకీరైన సాయిబాబాను, పవిత్ర హిందూ సాధువైన అక్కల్‌కోట మహరాజ్ ప్రక్కన పెట్టడం భావ్యం కాదని మనసుకు తోచి దానిని కాస్త దూరంగా పెట్టాను. ఆ రోజు రాత్రి నాకొక కల వచ్చింది. కలలోని విషయాలు ప్రొద్దున మరచిపోయాను కానీ, నేను పూజ మొదలుపెట్టినప్పుడు ఆ విషయాలన్నీ ఒక్కసారిగా గుర్తుకువచ్చాయి. కలలో నేను, మరో వ్యక్తి వరండాలో కూర్చొని ఉన్నాము. ఒక ఫకీరు 'సాయిబాబా' వలె దుస్తులు ధరించి మావైపు వస్తున్నారు. వారిని ఆహ్వానించేందుకు నేను లేచి నిలబడ్డాను. నాలో భేదభావం పొడసూపిందో ఏమో, దానిని గమనించి నా ప్రక్కనున్న వ్యక్తి, "వీరు సాయిబాబా! వీరికీ, అక్కల్‌కోట మహరాజ్‌కి తేడాలేదు. ఇద్దరినీ ఒకేలా పూజించుకో!" అన్నాడు. ఈ విషయం గుర్తుకొచ్చిన వెంటనే సాయిబాబా ఫోటోను అక్కల్‌కోట మహరాజ్ ఫోటో ప్రక్కనే పెట్టి పూజించసాగాను.

అనతి కాలంలోనే బాబా దయవలన నాకూ, నా కుటుంబ సభ్యులకు బాబాపై భక్తి విశ్వాసాలు ఎన్నోరెట్లు వృద్ధిచెందాయి. నేను బాబాను గురించి లభ్యమైన పుస్తకాలన్నింటినీ చదివాను. నా భార్య, పిల్లలు కూడా బాబా నిత్యపూజ ఆరంభించారు. నేను ఇంట్లో లేని సమయాలలో బాబా నిత్యపూజకు ఆటంకం కలగకుండా కుటుంబ సభ్యులలో ఎవరో ఒకరు శ్రద్ధగా పూజ నిర్వహించేవారు. చాలా సంవత్సరాల నుండి మా అమ్మ నా దగ్గర లేకుండా మరోచోట ఉండేది. బాబా అనుగ్రహం వల్ల ఆమె మనస్సు మారి నా దగ్గరకు వచ్చి నివసించసాగింది. మొదట్లో ముస్లిం ఫకీరైన సాయిబాబాను కొలవడంగానీ, శిరిడీ వెళ్ళి వారిని దర్శించడంగానీ ఆమెకు నచ్చేది కాదు. అందువల్ల ఆమెను వదిలి మేము మాత్రం శిరిడీ వెళ్ళేవాళ్ళం. కానీ బాబా ఆమెలో క్రమేణా పరివర్తన తెచ్చారు. రెండు మూడు సంవత్సరాల తరువాత 1933లో మా అమ్మ శిరిడీ సాయిమందిరాన్ని దర్శించాలన్న తన కోరికను నా భార్య, కుమార్తె వద్ద వెలిబుచ్చి శిరిడీకి తీసుకువెళ్ళమని అడిగింది. ఆమెలో వచ్చిన మార్పుని చూసి ఎంతో ఆనందించి ఆమెను శిరిడీకి తీసుకెళ్ళాము. ఆమె శిరిడీలోని ప్రదేశాలు చూసి ఎంతో సంతోషించింది. సనాతన ఆచారాలను ఖచ్చితంగా పాటించే ఆమె, బాబాను పూజించేందుకు తన ఛాందస భావాలను వదులుకుంది. ఆమె శిరిడీ నుండి తిరిగి వచ్చిన కొంతకాలానికే థానాలో ఉన్న మా ఇంట్లో అంతిమశ్వాస విడిచింది. సాయిబాబా ఎంతో దయతో ఆమెలో మార్పు తెచ్చి చనిపోయేముందు ఆమెకు తమ సమాధి దర్శనం చేయించారు. బాబా నాపైన, నా కుటుంబంపైన చూపిన కరుణకు ఎన్నో దృష్టాంతాలు ఉన్నాయి. కానీ అవన్నీ చెప్పనవసరం లేదు. బాబా సదా నా వెంటే ఉంటూ నా అవసరాలను గమనిస్తూ నన్ను ముందుకు నడిపిస్తున్నారు!

బాబా మా కుటుంబసభ్యులపై ఎంత దయ చూపించేవారో కేవలం రెండు దృష్టాంతాల ద్వారా తెలియజేస్తాను. నా రెండవ కుమారుడు గోవింద్ శిరిడీ వెళ్ళి సమాధి మందిరాన్ని, ద్వారకామాయిని చూడాలని తపించిపోయేవాడు. మాతో సన్నిహితంగా ఉండే శ్రీ జి.బి.దాతర్ కుటుంబం 1934 శ్రీరామనవమి ఉత్సవాలకు శిరిడీ వెళుతున్నప్పుడు వారితో గోవింద్‌ను పంపాము. గోవింద్ ద్వారకామాయికి వెళ్ళాడు. అక్కడ ఏ మూల నుంచున్నా మనలోకి చొచ్చుకొనిపోయి చూస్తున్నట్లుగా

ఉండే బాబా తైలవర్ణ చిత్రం వద్ద తానొక్కడే ఉన్నాడు. అతను అమితానందంతో ఆ చిత్రాన్ని చూస్తూ కళ్ళు మూసుకున్నాడు. అప్పుడు *"వచ్చావా! (ఆలాస్ కాయ్?)"* అనే ఆప్యాయమైన పలకరింపొకటి వినిపించింది. కనులు తెరిచి చూసాడు. అక్కడెవరూ లేరు. తను ఒంటరిగా ఉన్నాడు. దయామయుడైన బాబానే తనను ప్రేమగా పలకరించినట్లు గ్రహించాడు.

ఎనిమిది సంవత్సరాల క్రితం నా కుమార్తె గర్భవతిగా ఉన్నప్పుడు ప్రసవానికి ఆమెను థానా నుండి మూడుమైళ్ళ దూరంలోనున్న మా స్వగ్రామం ఖర్‌కు తీసుకువెళ్ళాము. అక్కడ ఎలాంటి వైద్య సదుపాయాలు లేవు. ఆమెకు ప్రసవం కష్టమయింది. గర్భంలోని శిశువు చనిపోయి ఉంటుందని, అందుకే బిడ్డ బయటికి రావడం లేదని నా భార్య చెప్పింది. ఈ మాటలు విన్న తరువాత మాకు ఆందోళన ఎక్కువయింది. థానేలోనే ప్రసవం చేయించకుండా, ఎలాంటి వైద్య సౌకర్యాలు లేని ఆ కుగ్రామానికి ఆమెను తీసుకువచ్చినందుకు మా బంధువులు అందరూ నన్ను తప్పుబట్టారు. అప్పుడు రాత్రి 2 గంటలయి ఉంటుంది. నా కుమార్తె నొప్పులతో తీవ్రంగా బాధపడుతోంది. అందరూ ఏం చేయడానికి తోచక ఆందోళనపడుతున్నారు. అకస్మాత్తుగా నాకు బాబా ఊదీ మహిమ గుర్తుకు వచ్చింది. నా భార్య వెంటనే బాబా ఊదీ తీసుకెళ్ళి కూతురి నొసటిపై రాసింది. ఊదీ రాసిన గంటలోగా సునాయాసంగా మృతశిశువు బయటపడింది. మా కుమార్తెకు ప్రమాదం తప్పింది. మా చింతలన్నీ తొలగిపోయాయి. ఉదయం డాక్టరు వచ్చి బిడ్డ ఎలా బయటికి వచ్చింది అని ఆశ్చర్యపోయాడు. బహుశ వైద్యశిక్షణ లేని మంత్రసాని మొరటుగా చేతులు చొప్పించి బిడ్డను బయటికి లాగి ఉంటుందని, అలా చేయడం వలన సెప్టిక్ అయి తల్లి ప్రాణానికే ప్రమాదం ఏర్పడుతుందని చెప్పాడు. అలాంటి ప్రయత్నాలేమీ ఎవ్వరూ చేయలేదని మానవ ప్రయత్నం లేకుండా కేవలం బాబా ఊదీ మహిమ వల్ల మృత శిశువు బయటపడిందని తెలుసుకొని ఆ డాక్టరు అబ్బురపడ్డాడు.

నా కుమార్తె ప్రసవించడానికి వారం రోజుల ముందు నా కుమారునికి ఒక కల వచ్చింది. కలలో బాబా కన్పించి *"నానా, నానా (నన్ను ఉద్దేశించి) అతడెక్కడున్నాడు? అతడెందుకు భయపడుతున్నాడు? నా ఊదీ రాయమని చెప్పు!"* అన్నారట. ఈ విషయం నా కుమారుడు నాకు చెప్పాడు. కానీ నా కుమార్తె

ప్రసవించలేక అవస్థపడుతున్నప్పుడు నాకు ఈ కల విషయం గుర్తుకు రాలేదు. అప్పటికప్పుడు స్ఫురించి ఊదీని ఆశ్రయించాను. ఆ తరువాత ఎంతోకాలానికి ఆ విషయం గూర్చి ఆలోచిస్తుండగా అర్థమైన విషయమేమిటంటే సాయిబాబా వారం రోజుల ముందే నా కుమార్తెకు రాబోయే ప్రమాదాన్ని కల ద్వారా హెచ్చరించి దానిని నివారించే మార్గాన్ని కూడా సూచించారు. కానీ, నేను ఆ కల విషయం మరిచిపోయినప్పుడు నాకు ప్రేరణనిచ్చి ఊదీ పెట్టేట్లు చేశారు. మా అమ్మాయిలందరూ శ్రద్ధతో బాబాను పూజిస్తూ, రోజూ ఆరతి ఇస్తారు.

## 53

## సెప్టెంబరు 12వ తేదీ, 1936

**శ్యామ్‌రావ్ రావ్‌జీ శ్రోత్రి,** రికార్డు గుమాస్తా, జిల్లా కోర్టు, వయస్సు 55 సం॥లు, కాయస్థప్రభు, థానా.

నేను సుమారు 1909లో ఒకే ఒక్కసారి సాయిబాబాను దర్శించాను. వారికి నమస్కరించి వారి సన్నిధిలో కూర్చుని ఉండగా నా మదిలో ఒక ప్రశ్న ఉదయించింది. బాబా వెంటనే నన్ను ఆలయంలో పురాణం చెబుతున్న 'బాయి' అనే ఆమె దగ్గరికి వెళ్ళమన్నారు. నేను ఆలయానికి వెళ్ళాను. అక్కడ యాభై సంవత్సరాల ఒక బ్రాహ్మణ స్త్రీ పురాణ పఠనం చేస్తోంది. నేనక్కడ కూర్చొని వినసాగాను. అప్పుడు ఆమె చదువుతున్న భాగమే, నా ప్రశ్నకు సమాధానమయింది. ఆ విధంగా బాబా తమ విశిష్ట పద్ధతిలో నా ప్రశ్నకు సమాధానమిచ్చారు.

## 54

## సెప్టెంబరు 12వ తేదీ, 1936

**సదాశివ్ త్ర్యయంబక్ విధావ్‌కర్,** రిటైర్డ్ గూడ్స్ క్లర్క్, జి.ఐ.పి. రైల్వే, వయస్సు 68సం॥లు, కాయస్థప్రభు, మహాగిరి, థానా.

ఇరవై ఎనిమిది సంవత్సరాల క్రితం అంటే సుమారు 1909లో నేను దాదర్‌లో రైల్వే గుమాస్తాగా పనిచేసేవాడిని. నా దూరపు బంధువైన తమానే సాయిభక్తుడు. అతను నన్ను శిరిడీకి వెళ్ళి సాయిబాబాను దర్శించమని ప్రోత్సహించాడు. 1909 ప్రాంతంలో నేను సాయిని దర్శించదలచి తమానేతో పాటు కోపర్‌గాం స్టేషను చేరాను. బాబాను దర్శించి తిరిగి కోపర్‌గాం రావడానికి, రానుపోను టాంగాను మాట్లాడుకొని శిరిడీ చేరాము. మేము తినడానికి రెండు మామిడిపండ్లను టాంగాలోనే ఉంచి, మిగిలిన మామిడిపండ్లను, కొంత పొగాకు, కొన్ని రాగి నాణాలను నేను బాబాకు సమర్పించాను. బాబా ***"ఆ రెండు మామిడిపండ్లు ఏవి? వాటినెందుకు అక్కడే ఉంచారు? వాటిని తీసుకురండి!"*** అన్నారు. మేము వారి సర్వజ్ఞతకు ఆశ్చర్యపడి వాటిని కూడా తెచ్చి సమర్పించాము. అక్కడున్న భక్తులతో పండ్లనన్నింటిని కోసి ప్రసాదంగా పంచమని బాబా ఆదేశించారు. ఆ తరువాత బాబా చిలుం పీల్చారు.

అప్పుడు సమయం ఉదయం పదకొండు గంటలయింది. ప్రతిదినం నాకు ఉదయం 9గం॥లకే భోంచేసే అలవాటుంది. ఆ రోజు భోంచేయనందువల్ల కడుపు నకనకలాడుతుంది. కానీ నా ఆకలి విషయం ఎవరికీ చెప్పలేక అలాగే కూర్చుని ఉన్నాను. అదే సమయంలో ఒక భక్తుడు ఒక పేడాల ప్యాకెట్టు తెచ్చి, బాబాకు కానుకగా వారి ముందుంచారు. సాధారణంగా బాబా ఏమీ తాకరు. కానీ ఆ రోజు ఆ ప్యాకెట్టు ఇచ్చిన వెంటనే తీసుకొని విప్పారు. అందులో పెద్ద పెద్ద పేడాలున్నాయి. వారు ఒకదానిని నా ఒడిలోకి విసిరారు. నేను కొన్ని అడుగుల దూరంలో కూర్చొని ఉన్నాను. అది బాబా ప్రసాదమని, బాబా కానుకగా ఇంటికి తీసుకువెళ్ళేందుకు ఇచ్చారని, దానిని నేను అక్కడే తినకూడదని అనుకున్నాను. పేడాను నేను చేతిలో పట్టుకొని ఉండడం చూసిన బాబా ***"అదిచ్చింది దాచుకోడానికి కాదు!"*** అన్నారు.

నేను దానిని తిన్నాను. నా ఆకలి సగం తీరింది. బాబా మళ్ళీ ఇంకొక పేడా విసిరారు. కనీసం దీనినైనా ప్రసాదంగా తీసుకెళ్ళదలచి చేతిలో పట్టుకొని ఉన్నాను. కానీ బాబా మళ్ళీ *"అదిచ్చింది దాచుకోడానికి కాదు!"* అని అన్నారు. నేను దానిని కూడా తిన్నాను. నా ఆకలి పూర్తిగా తీరిపోయింది. ఇక బాబా పేడాలను విసరనూ లేదు, ఎవ్వరికీ పంచనూ లేదు. బాబా మొదట నా ఆకలి విషయం తరువాత నా అర్ధాకలి విషయం ఆ తరువాత నా ఆకలి పూర్తిగా తీరిపోయిన విషయం నేను చెప్పకపోయినా తెలుసుకున్నారు.

మధ్యాహ్న ఆరతి జరిగిన తరువాత నాకు, తమానేకు భోజనం విషయం సమస్యగా తయారైంది. అప్పుడు వంట చేసుకొని తినడానికి సమయం మించిపోయింది. కానీ త్రికాలజ్ఞులైన బాబాకు మేము అక్కడికి వస్తున్న విషయం ముందే తెలుసు. అందుకే ఆ రోజు ఉదయం రిటైర్డు మామ్లత్‌దార్ ఇంటికి (బాలాసాహెబ్ భాటే కాబోలు) తాము ఆ రోజు భోజనానికి వస్తున్నట్లు బాబా చెప్పారట. అందువల్ల అతను భోజన పదార్థాలు ఎక్కువ వండించి తయారుగా ఉంచాడు. ఆరతి అయిన తరువాత బాబా మా ఇద్దరినీ, మూడవ అతిథిగా ఒక బ్రాహ్మణుణ్ణి ఇంటికి తీసుకువెళ్ళి భోజనం పెట్టమని అతనిని ఆదేశించారు. మేము బాబా ప్రతినిధులుగా వెళ్ళడంతో మాకు ఎంతో సంతృప్తికరంగా భోజనం వడ్డించారు. మమ్మల్ని ఆ అధికారి ఇంటికి పంపే ముందు, బాబా నన్ను చూపించి *"ఇతను అనవసరంగా చింతపడుతున్నాడు. కానీ ఇతని పని ఎప్పుడో జరిగిపోయింది"* అని ఆ అధికారితో చెప్పారట. అతను నాతో ఈ విషయం చెప్పి, నేను ఏ పనికోసం వచ్చానో తెలుపమన్నాడు. నేను బాబా నుండి ఉపదేశం పొందడానికి వచ్చినట్లు అతనితో చెప్పాను.

సాధారణంగా భక్తులను వచ్చిన రోజే వెళ్ళడానికి బాబా అనుమతించరని అందరూ చెబుతున్నారు. కానీ రెండు కారణాల వల్ల ఆ రోజే తప్పక వెళ్ళాల్సిన అవసరం ఉంది. మొదటిది, మేము కోపర్‌గాం వెళ్ళకపోయినా టాంగావాడికి తిరుగు బాడుగ ఇచ్చి తీరాలి. రెండవది, నేను ఆఫీసులో అనారోగ్యంగా ఉందని చెప్పి రావడంతో, మరుసటి ఉదయం దాదర్‌లోని రైల్వే మెడికల్ ఆఫీసరు ఎదుట హాజరుకావలసి ఉంది. మధ్యాహ్నం మమ్మల్ని తిరిగి కోపర్‌గాం తీసుకెళ్ళడానికి

టాంగావాడు తొందరపెట్టసాగాడు. మేము అతడిని మరికొంత సేపు ఆగమని చెప్పి మసీదులోనికి వెళ్ళాము. ఈలోపు టాంగావాలా అక్కడికి కూడా వచ్చాడు. బాబా అతనివైపు చూసి ***"తొందరేమిటి?"*** అని చెప్పి పంపించేశారు. నా రెండవ ఇబ్బంది కూడా బాబాకు తెలుసు కాబట్టి మాకు సెలవు ప్రసాదించారు. బాబా నన్ను ఊదీ తీసుకొని వెళ్ళమన్నారు. నేను ఊదీ తీసుకొని బయలుదేరాను. నేను మసీదు నుండి వచ్చేటప్పుడు ***"చింతపడకు, నీ పని పూర్తయ్యింది!"*** అన్నారు. నేను వచ్చింది బాబా నుండి ఉపదేశం పొందడానికి! కానీ వారు నాకు ఏ ఉపదేశమూ ఇవ్వలేదు. మరి పూర్తయిందని చెబుతున్న పనేమిటో నాకర్థం కాలేదు.

నేను దాదర్ తిరిగి వచ్చాను. 7, 8 రోజుల తరువాత నాకొక కల వచ్చింది. ఆ కలలో, ఇండోర్‌లో నివసిస్తున్న మా వంశగురువు నాకు ఉపదేశమివ్వడానికి మా ఇంటికి వచ్చినట్లు కనిపించింది. నాకు వారు వస్తున్నట్లు ఏ ఉత్తరంగానీ, సందేశముగానీ లేదు. కానీ ఈ కల వచ్చిన కొన్ని రోజులకు అకస్మాత్తుగా మా వంశగురువు ఆఫీసుకు వచ్చారు. నేను వారిని సాదరంగా ఆహ్వానించి ఇంటికి తీసుకెళ్ళాను. నాకు వచ్చిన కల విషయం ఆయనకు తెలిపాను. ఆ కల విషయం తనకు తెలుసునని, తాను వచ్చింది ఉపదేశమివ్వడానికేనని చెప్పారు. కానీ ఆ విషయం అప్పటికే ఎలా తెలుసో చెప్పలేదు. ఆ మరుసటి రోజు శాస్త్రోక్తంగా నాకు శివమంత్రాన్ని ఉపదేశించారు. నేను శైవుణ్ణి కాబట్టి నాకు శివమంత్రాన్ని ఉపదేశించారు. వారు మరో విషయం కూడా తెలిపారు. తాము చాలా రోజుల క్రితమే నాకు ఉపదేశమివ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. బాబా మాటలు ఎంత శక్తిమంతమైనవంటే, నేను శిరిడీలో ఉన్నప్పుడే నాకు ఉపదేశమివ్వడానికి వీరికి (శిరిడీకి ఎంతో దూరంలో ఉన్న ఇండోరులో నివసించే వీరు బాబాను ఎన్నడూ దర్శించలేదు) బాబా ప్రేరణ కలిగించారని అందుకే నా పని పూర్తయినట్లు బాబా చెప్పారని గ్రహించాను.

(ఈ భక్తుడు, హుబ్లీ సిద్ధారూఢస్వామి భక్తుడు. ఇతడు 1909లో బాబా దర్శనం చేసుకున్న తరువాత ఒక్కసారి మాత్రమే 1935లో శిరిడీ వెళ్లి బాబాకు కృతజ్ఞతలు అర్పించి వచ్చారు.)

## 55

## సెప్టెంబరు 13వ తేదీ, 1936

**దత్తాత్రేయ విఠల్ వైద్య,** ఖజానా గుమాస్తా, థానా కలెక్టరేట్, వయస్సు 25సం॥లు, కాయస్థప్రభు, తండ్రి: విఠల్ N వైద్య, థానా.

నా తండ్రి విఠల్ N వైద్య రిటైర్డ్ రైల్వే ఉద్యోగి. కరాచీలో నివసిస్తుండేవారు. వారు ఎప్పటి నుండో సాయిబాబా భక్తులు. కానీ ఆయన బాబాతో తనకున్న అనుభవాలను ఇతరులతో పంచుకోడానికి ఇష్టపడేవారు కాదు. మా నాన్న మొదటి శిరిడీ యాత్ర నా చిన్నతనంలో జరిగింది. అప్పటి విషయాలు గుర్తుంచుకొనే వయస్సు కూడా నాకు లేదు. శిరిడీ బయలుదేరే రోజు నా సోదరి ఛబూకు తీవ్రంగా జ్వరం వచ్చింది. అనారోగ్యంతో ఉన్న పసిబిడ్డను తీసుకొని ప్రయాణం చేయడం మంచిది కాదని బంధువులందరూ చెప్పారు. కానీ మా నాన్న లెక్క చేయకుండా, బాబాపై ఉన్న నమ్మకంతో అందరినీ తీసుకొని బయలుదేరాడు. మేము కళ్యాణ్ స్టేషను చేరేటప్పటికి ఛబూకు జ్వరం తగ్గిపోయింది. ఆ విధంగా మా నాన్న బాబాపై పెట్టుకున్న నమ్మకం బలపడింది. మా నాన్న మసీదుకు వెళ్ళి బాబాను దర్శించుకున్నాడు. ఆయన మరుసటి ఉదయం ఉద్యోగ విధులకు హాజరుకావలసి ఉంది. సరియైన సమయానికి బొంబాయి చేరుకోవాలంటే తాను వెళ్ళదలచిన రైలును కోపర్‌గాంలో అందుకోవాలి. మా నాన్న బాబా వద్దకు వెళ్ళి అనుమతికోరాడు. ఆ మరుసటి దినం ఆఫీసుకు వెళ్ళవలసి ఉన్నందున వెంటనే బయలుదేరాలని కూడా విన్నవించుకున్నాడు. కానీ బాబా అనుమతి ఇవ్వలేదు. దాదాపు 4 గంటలపాటు శిరిడీలోనే ఉంచిన తరువాత వెళ్ళమని ఆదేశించారు. అప్పుడు కోపర్‌గాం స్టేషనుకు వెళ్ళినా ప్రయోజనముండదు. రైలు ఎలాగూ వెళ్ళిపోయి ఉంటుంది. మా నాన్నకు ఏంచేయాలో తోచలేదు. ఒకసారి బాబా ఆజ్ఞ ఇచ్చిన తరువాత అక్కడ ఉండకూడదని భక్తులు చెప్పడంతో ఆయన కోపర్‌గాంకు బయలుదేరాడు. అనూహ్యంగా మా నాన్న ఎక్కవలసిన రైలు 5 గంటలు ఆలస్యంగా నడుస్తూ ఆయన స్టేషను చేరిన తర్వాతే వచ్చింది. బాబా సర్వజ్ఞతకు మా నాన్న ఆశ్చర్యపోయాడు. ఆయన సకాలంలో బొంబాయి చేరాడు.

1933-34 సంవత్సరంలో మా నాన్న అనారోగ్యానికి గురయ్యాడు. తీవ్రమైన న్యుమోనియా వ్యాధితో మంచానపడ్డాడు. ఆయనకు చికిత్స చేస్తున్న డాక్టరు చిప్కర్ మా నాన్న కోలుకుంటాడనే ఆశ వదులుకున్నాడు. 21 రోజులు గడచినా జ్వరతీవ్రత తగ్గలేదు. మా నాన్న అంతటి అనారోగ్యంలోనూ నిరంతరం బాబానే ప్రార్థిస్తూ గడుపుతున్నారు. 21వరోజు రాత్రి 9 గంటల సమయంలో ఆయనకు బాబా భౌతికంగా దర్శనమిచ్చారు. ఆయన పడక ప్రక్కనే మేమందరం ఉన్నా మాకెవరికీ ఏమీ కనిపించలేదు. "బాబా వచ్చారు. వారు రొట్టెలు, ఉల్లిపాయ అడుగుతున్నారు!" అని మా నాన్న అరిచారు. మాకేమో బాబా కనిపించలేదు. బహుశా నాన్నగారు జ్వరతీవ్రతలో పలవరిస్తున్నారనుకొని రొట్టె, ఉల్లి తీసుకువెళ్ళలేదు. దాంతో మా నాన్న కోపంతో మమ్మల్ని అందరిని బయటికి వెళ్ళమన్నారు. మేము గది బయటికి వచ్చి లోపల ఏమి జరుగుతోందో వినబడేలా నిలబడ్డాము. అప్పుడు లోపల బాబా మా నాన్నతో మాట్లాడడం వినిపించింది. ఇంకా ఎవరో అజ్ఞాత వ్యక్తులిద్దరిని బాబా వెళ్ళిపొమ్మని ఆజ్ఞాపిస్తున్నారు. కానీ వాళ్ళు తమతో మా నాన్నను కూడా తీసుకొని వెళ్తామని చెబుతున్నారు. బాబా ఒప్పుకోలేదు. వాళ్ళని అక్కడ నుండి వెళ్ళిపొమ్మని గద్దించి, సట్కాతో నేలపై కొట్టారు. దానితో వాళ్ళు వెళ్ళిపోయినట్లు అనిపించింది. ఆపై వాళ్ళ గొంతులు వినిపించలేదు. తరువాత బాబా మా నాన్నను ఒక పెద్దలోటాడు చల్లని నీటిని త్రాగమని చెప్పి వెళ్ళిపోయారు.

మా నాన్న నన్ను లోనికి పిలిచి, చల్లని మంచినీళ్ళు తెమ్మన్నారు. డాక్టరు చల్లని నీళ్ళు త్రాగవద్దని చెప్పినందువల్ల నేను కాస్త తటపటాయించాను. మా నాన్న పట్టుబట్టడంతో బాబా మాటలపై నమ్మకమున్న మా అమ్మ చల్లని నీరు తెచ్చి ఇచ్చింది. మా నాన్న రెండు మూడు కప్పుల నీళ్ళు తాగారు. వెంటనే ఆయనకి చెమటపట్టి జ్వరం తగ్గనారంభించింది. వెంటనే మేము డాక్టరుకు కబురుపెట్టగా, అతను వచ్చి పరీక్షించాడు. చల్లని నీళ్ళు త్రాగడంతో జ్వరం తగ్గిపోయిందని తెలుసుకున్న డాక్టరు ఆశ్చర్యానికి అవధులు లేవు. ఒక ఇంజక్షను ఇచ్చి వెళ్ళిపోయాడు. తిరిగి మరుసటిరోజు వచ్చి పరీక్షించి ఇక వారికి ఏ ప్రమాదమూ లేదని తేల్చిచెప్పాడు. ఇలా బాబా తమ దర్శనం ద్వారా సహాయం అందించి మా నాన్న ప్రాణాలను

కాపాడారు. అంతకుముందు కూడా మా నాన్న కష్టసమయాలలో ఉన్నప్పుడు బాబా తనకు కన్పించి, రొట్టె, ఉల్లిపాయలు అడిగారని చెప్పేవారు.

గత సంవత్సరం (1935లో) మా చెల్లెలు ఛబూకు వివాహం చేయదలచారు. తగిన సంబంధం కోసం వెదుకుతూ మా నాన్న ఆందోళన పడసాగారు. ఒక సంబంధం కుదిరినట్లనిపించి చివరికి ఏదో కారణం వల్ల చెడిపోయింది. దీనితో మానాన్న మరింతగా ఆందోళన పడసాగాడు. తన కుమార్తె వివాహం జరిపించమని బాబాను ఎప్పటిలాగే ఆర్తిగా ప్రార్థించాడు. ఒకరోజు మా నాన్నకు కలలో బాబా కన్పించి పండరిపురం వైపు నుండి తనకొక ఉత్తరం వస్తుందని, ఆ సంబంధం కుదురుతుందని, చింతపడవద్దని చెప్పారట. అలాగే బాబా చెప్పిన 15 రోజులకు డింగ్రే అనునతడు పండరికి చెందిన దీక్షిత్ అను యువకుడితో ఛబూ వివాహ విషయంగా ఉత్తరం వ్రాసాడు. త్వరలోనే ఆ సంబంధం కుదిరి వివాహం కూడా జరిగిపోయింది.

56

## సెప్టెంబరు 14వ తేదీ, 1936

**శంకర్ బల్వంత్ కొహెూజ్కర్,** బి.ఏ., గుమాస్తా, బొంబాయి కలెక్టరు కార్యాలయం, వయస్సు 41సం॥లు, కాయస్థప్రభు, థానా.

కీర్తిశేషులైన మా నాన్నగారు బల్వంత్ సి. కొహోజ్కర్ మామ్లత్‌దార్‌గా రిటైరయ్యారు. మా నాన్న 1911లో శిరిడీ వెళ్ళి బాబాను దర్శించారు. బాబా ఆయనను పితృవాత్సల్యంతో ఆదరించారు. బాబా ప్రేమగా మా నాన్న వీపుతట్టి *"మఠంలోనే (శిరిడీలోనే) ఉంటావా?"* అని అడిగారు. మా నాన్న శిరిడీలో సుమారు వారంరోజులు గడిపారు. సెలవు తీసుకునేందుకు అనుమతి కోసం బాబా దగ్గరికి వెళ్ళినప్పుడు *"నీవు ఎక్కడికైనా వెళ్ళు. నేను నీ వెంటే ఉంటాను"* అని అన్నారు. అప్పటి నుండి మా నాన్నకు ఏ ఆపదవచ్చినా బాబా కాపాడేవారు. కొన్ని నెలల క్రితం ఆయన చనిపోయారు. అంతవరకు బాబా రక్షణలోనే ఉన్నారు. మా నాన్న ఒక్కసారి మాత్రమే శిరిడీ వెళ్ళారు.

1911లో మా నాన్న శిరిడీలో ఉన్నప్పుడు దత్తజయంతి వచ్చింది. ఆ రోజు సాయంత్రం సుమారు ఐదుగంటల సమయమప్పుడు బాబా మసీదులో భక్తులతో కూర్చొని ఉన్నారు. ఉన్నట్టుండి బాబా *"నాకు ప్రసవ నొప్పులొస్తున్నాయి. బాధ భరించలేకుండా ఉన్నాను. నేను ప్రసవించబోతున్నాను!"* అన్నారు. బాబా దత్తాత్రేయుని తల్లి అనసూయమాతతో తాదాత్మ్యం చెంది ప్రసవవేదన అనుభవిస్తున్నట్లు స్పష్టమైంది. సంఘటన జరిగిన కొద్దిసేపటికి సంధ్యా సమయంలో బాబా భక్తులందరిని బయటికి వెళ్ళమని ఆదేశించారు. భక్తులందరూ బయటికి వెళ్లారు. కొంతసమయం గడచిన తరువాత భక్తులను లోనికి రమ్మని పిలిచారు. ఆ సమయంలో బాబా ఎంతో ఆనందంగా ఉన్నారు. అప్పుడు భక్తులందరూ లోనికి వెళుతుండగా, మా నాన్న మాత్రం నేరుగా మసీదు లోపలికి వెళ్ళారు. అక్కడ బాబా గద్దెపై బాబాకు బదులు మూడు శిరస్సుల దత్తాత్రేయ శిశువు మా నాన్నకు కనిపించారు. ఆ దృశ్యం క్షణకాలం మాత్రమే నిలిచింది. తిరిగి చూసేసరికి అక్కడ బాబా యథారూపంలో కఫ్నీధారియై కన్పించారు. పురాణాల ప్రకారం దత్తాత్రేయుడు

జన్మించింది సంధ్యాసమయంలోనే! ఇది చూసిన తరువాత మా నాన్న ఎటువంటి అనుభూతికి లోనైవుంటారో ఊహించవచ్చు. ఆయనకు బాబా దత్తస్వరూపులని నిదర్శనం దొరికింది.

తరువాత మా నాన్న ఊరికి బయలుదేరే రోజు బాబా దగ్గర సెలవు, ఊదీ తీసుకొని రోడ్డుకు, మసీదుకు మధ్యనున్న వీధులు, ఇళ్ళు అన్నీ దాటుకొని మెయిన్ రోడ్డుకు చేరాడు. అప్పుడు మా నాన్న మదిలో, బాబాను చూడటం ఇదే చివరిసారవుతుందేమోననే తలంపు వచ్చింది. "మరొక్కసారి వారిని చూస్తే బాగుండును కదా!" అని కోరుకుంటూ లెండీ వైపు చూసాడు. అక్కడ లెండీ కంచె నుండి తొంగి చూస్తూ బాబా ముఖం కనిపించింది. అద్భుతాలలోకెల్లా అద్భుతం! బాబాను తను మసీదులో దర్శించి వచ్చాడు. బాబా తనతోపాటుగానీ, తనను అనుసరించిగానీ రాలేదు. అయినప్పటికీ బాబాను మరోసారి దర్శించాలనే కోరిక జనించిన మరుక్షణం మసీదుకు 100-150 గజాల దూరమున్న లెండీ వద్ద బాబా రూపం కనిపించింది. మా నాన్న బాబాను చూడటం అదే చివరిసారి. అందుకే బాబా మా నాన్నతో *"వెళ్తున్నావా? మంచిది, వెళ్ళు"* అన్నారు. అప్పుడు నేను మా నాన్నతో శిరిడీ వెళ్ళలేదు కానీ పైఅనుభవాన్ని ఆయన నాకు, మరికొందరికి చెప్పాడు.

బాబా వద్ద నాకున్న అనుభవాలు చాలా కొద్ది మాత్రమే. చిన్నప్పుడు నేను బాబా ఫోటోను జేబులో పెట్టుకొని ఉండేవాడిని! అప్పటి నుండి నా చదువులో, జీవితంలో అంతా మంచే జరిగింది. తరువాత ఆ ఫోటోను మా చెల్లెలికిచ్చాను. నేను ఇప్పటికీ బాబాను పూజిస్తూనే ఉన్నాను.

1930లో ప్రాణాంతకమైన సంఘటన ఒకటి జరిగింది. నేను విరేచనాలతో బాధపడుతున్నప్పుడు నిద్రమత్తులో నీళ్లనుకొని ఫినాయిల్‌ను త్రాగేసాను. ఇది ప్రమాదానికి దారితీసింది. నాలుగు రోజులు స్పృహలేకుండా పడి ఉన్నాను. నాకు చికిత్స చేస్తున్న డాక్టరు చిప్కర్ నేను చనిపోతానని భయపడ్డాడు. నాలుగురోజుల తరువాత స్పృహ వస్తున్న సమయంలో నాకు ఒక దృశ్యం కనపడింది. పహిల్వాన్‌లా కనిపించే ఒక ముస్లిం యువకుడు నేను పడుకొని ఉన్న గది గోడలను, నేలను బెత్తంతో కొడుతూ కన్పించాడు. నా దైవం శ్రీసాయిబాబానే వచ్చి నా ప్రాణాలను కాపాడారని నిర్ధారించుకున్నాను.

1934లో నాకు శిరిడీ వెళ్ళి బాబా సమాధిని, ద్వారకామాయిని దర్శించాలని బలమైన ప్రేరణ కలిగింది. శిరిడీ వెళ్ళి ద్వారకామాయిలో బాబా చిత్రపటాన్ని చూసిన వెంటనే నా శరీరమంతా విద్యుత్తు ప్రవహించినట్లుగా అనుభూతి కలిగింది. ఆ చిత్రపటాన్ని తదేకంగా చూడలేకపోయాను. 'భగవంతుడు ఇక్కడే ఉన్నాడు' అన్న భావనతో నా మనసు నిండిపోయింది.

## 57

## సెప్టెంబరు 15వ తేదీ, 1936

**రామచంద్ర రామకృష్ణ సామంత్,** (Esq.,) **బి.ఏ.**, భూస్వామి, వయస్సు 45సం॥లు బ్రాహ్మణుడు, టర్నర్ రోడ్డు, బాంద్రా.

నా జీవితంలో మూడుసార్లు మాత్రమే సాయిబాబాను దర్శించాను. మొదటిసారి 1912వ సంవత్సరం గురుపూర్ణిమకు మా మామగారైన అన్నాసాహెబ్ దాభోళ్కర్‌తో పాటు నేను, నా భార్య వెళ్ళాము. మా మామగారు తన కుమార్తెను, అల్లుడిని శిరిడీ తీసుకువస్తానని మ్రొక్కుకున్నారట. మ్రొక్కు తీర్చడానికి నన్ను రమ్మని చెబితే వారి వెంటవెళ్ళాను. అంతేగానీ నాకు అప్పుడు సాయిబాబాపై పెద్దగా నమ్మకంలేదు. మా తల్లిదండ్రుల వైపు నుండి సాయిబాబాతో అనుబంధం లేదు కానీ మా కుటుంబంలో ఆధ్యాత్మిక, పారమార్థిక సంపద మెండుగా ఉంది. మా ముత్తాత లక్ష్మణ్ అర్జున్ సామంత్ (భగత్) విఠలుని పరమభక్తుడు. తరచూ పండరి యాత్రలకు వెళ్ళేవాడు. ఆయన ప్రతి ఆషాఢకార్తీక మాసాలలో పండరి యాత్రకు తీసుకువెళ్ళిన బట్టలు, నడుముకు కట్టుకునే కాషాయ దట్టి, పూజాసామగ్రి మొదలైనవి వారసత్వ జ్ఞాపికలుగా భద్రపరచబడ్డాయి. నేను వారి కాషాయ దట్టీని పండరి తీసుకెళ్ళి చంద్రభాగా నదిలో ముంచి తెచ్చేవాడిని. మా తాతగారు విఠల భక్తుడే కాక శివదీక్షాపరుడు కూడా! నిత్యం మధ్యాహ్న సమయాలలో ఏకాగ్రతతో శివమంత్రాన్ని జపించేవాడు. నేను వారి ముద్దుల మనవడినైనప్పటికీ వారు జపం చేస్తున్నప్పుడు వారి దగ్గరకు వెళ్ళే సాహసం లేదు. రాత్రిళ్ళు “హరిపథ” చదివేవాడు. వేకువఝామున భజన నిర్వహించేవాడు. ఆయన 59 సంవత్సరాలకే పరమపదించారు. ఆయన నిర్యాణం చెందేముందు “నా అంతిమ ఘడియలు సమీపిస్తున్నాయి. ధవళ వస్త్రధారి అయిన విఠలుడు నన్ను వైకుంఠానికి తీసుకెళ్ళడానికి అక్కడ పెట్టెపై కూర్చొని వేచి ఉన్నారు. వారు నాకు ఘటిక కాలం (24 నిముషాలు) మాత్రమే మీకు వీడ్కోలు పలకడానికి సమయమిచ్చారు!” అని పలికి తన కొడుకులు, కుమార్తెలు మొదలైన వారిని ఒకరి తరువాత ఒకరిని పిలిచారు. శోకిస్తున్న మా నాన్నగారిని దగ్గరకు పిలిచి, విచారించవద్దని ధైర్యంగా ఉండమని చెప్పారు. వారు తమ కుమార్తెలను దగ్గరికి పిలిచేటప్పుడు

వారి అసలుపేర్లతోగాక గంగ, భగీరథి మొదలైన తీర్థాలపేర్లతో పిలిచి, వీడ్కోలు పలికారు. నన్ను దగ్గరికి పిలిచి, నేను వారిని తలచిన వెంటనే నాతోనే ఉండి నన్ను కాపాడుతూ ఉంటామని ఆశీర్వదించారు. వారు పలికిన మాటలు వారివి కావు. తుకారాం, రామదాసు మొదలైన సత్పురుషుల ప్రవచనాలను నాకు తగినట్లు అన్వయించారు. ఈ విధంగా అత్యంత భక్తిపూర్వక సంభాషణల తరువాత వారు ప్రశాంతంగా కన్నుమూసారు. వారు తప్పక వైకుంఠానికే వెళ్ళి ఉంటారు. ఈ సంఘటన 1899లో జరిగింది.

మా నాన్న అంతటి ఆధ్యాత్మిక ప్రగతిని సాధించలేదు. వారు పండరిపురం దర్శించారు. కుటుంబ సంప్రదాయాలకు అనుగుణంగా ఇంటిలోని ప్రతి ఒక్కరు తమ జీవిత కాలంలో ఒక్కసారైనా పండరిపురం దర్శించి తీరాలని చెప్పేవారు. వారు 1911లో మరణించారు. వారు చివరి శ్వాస విడిచేంత వరకు ఎఱుకలోనే ఉన్నారు, దక్షిణంవైపు చూపిస్తూ "నన్ను తీసుకెళ్ళడానికి వారు వచ్చి ఉన్నారు!" అని చెప్పి అంతిమశ్వాస విడిచారు.

ఈ విధంగా నా చిన్నతనమంతా పవిత్ర పారమార్థిక భావాలతో నిండిపోయింది. కానీ నేను విద్యను అభ్యసించిన వాతావరణం యొక్క బలమైన ప్రభావం, ఈ భక్తి భావాలన్నింటిని తుడిచివేయడమేగాక వ్యతిరేక భావాలను జనింపజేసింది. 1911 జూన్‌లో నా వివాహ సమయమప్పుడు, వంశపారంపర్యంగా వచ్చిన కిడ్నీ వ్యాధితో బాధపడసాగాను. ఒంటిపూట భోజనం, రాత్రిళ్ళు ద్రవాహారం తీసుకుంటూ వచ్చాను. అప్పుడే బాబా మహిమల గురించి వినడం వల్ల సాయిభక్తిబీజాలు మొలకెత్తసాగాయి. కానీ ఆధ్యాత్మికతపట్ల ఉన్న వ్యతిరేకత పోయి స్తబ్ధత మాత్రం కొనసాగుతోంది. మా మామగారిని, ఇతరులను అనుసరిస్తూ నా పరిసరాలకు అనుగుణంగా నడుచుకుంటుండేవాడిని. ఇతరులు బాబాకు నమస్కరిస్తే, నేనూ వారికి నమస్కరించేవాడిని. ఒకసారి మసీదులో ఉన్నప్పుడు మాధవరావు బాబాకు నమస్కరించమని నాతో చెప్పాడు. నేను నమస్కరించాను. నా అంతరంగం ఎరిగిన బాబా ***"ఒత్తిడి చేస్తే తప్ప ఇతను గురుపాదాలకు నమస్కరించడు! (త్యాలా పాయా పడాయలా నేట్ లగాతో)"*** అని అన్నారు. ఆ

సున్నితమైన ఒత్తిడి ద్వారానే బాబా నాలో క్రమంగా మార్పు తెచ్చారు. బాబా కృపవల్ల నాకు ఎంతో మేలు జరిగి బాబా పట్ల నమ్మకం పెరగసాగింది. నా వ్యాధి మూలంగా నేను అందరివలె అన్ని వేళల్లో ఆహారం తీసుకోలేనందువల్ల శుష్కించిపోతున్నానని, వ్యాధి నివారణ చేయమని బాబాను అర్థించగా, నేను త్వరలోనే స్వస్థత పొందుతానని ***"అల్లా అచ్ఛా కరేగా"*** అన్నారు. నేను మితాహారం తీసుకుంటూ ముందుజాగ్రత్త కొరకు అప్పుడప్పుడు మందులు తీసుకుంటూ క్రమం తప్పకుండా మూత్ర పరీక్షలు చేయిస్తూ వచ్చాను. త్వరలోనే వ్యాధి నయమై మామూలుగా ఆహారం తీసుకోవడం మొదలుపెట్టాను. బాబా మాటలు నిజమయ్యాయి.

నేను మొదటిసారి బాబాను దర్శించిన 11 నెలలకు అంటే 5.6.1913న నాకు తొలి సంతానంగా ఆడపిల్ల జన్మించింది. అదే సంవత్సరం బస్సెన్‌లోనున్న తుంగరేశ్వర్ దేవస్థానం యొక్క కమిటీ ఛైర్మన్‌గా నేను నియమించబడ్డాను. 1915 గురుపూర్ణిమకు బాబాను రెండవసారి దర్శించాను. ఈసారి కూడా మా మామగారితో, నా భార్యతో కలిసి వెళ్ళాను. ఈసారి శిరిడీ దర్శనంలో చెప్పుకోదగిన అనుభవాలేమీ కలుగలేదు. కానీ 1915 ఫిబ్రవరిలో జరిగిన సంఘటన చెప్పుకోతగింది. నా ఎఱుకలో లేకుండా నిగూఢరీతిలో బాబా నన్నెలా కాపాడుతున్నారో నాకు తెలిసింది. ఆ సంఘటన వివరిస్తాను.

ఫిబ్రవరి నెలలో ఒకరోజు అర్నాలలో ఉన్న మా ఇంటిలో పడుకొని ఉన్నాను. అప్పుడే అనారోగ్యం నుండి మెల్లగా కోలుకుంటున్నాను. మంచం మీద నుండి లేవబోతూ అకస్మాత్తుగా మూర్ఛ (ఈడ్పు) వచ్చి పడిపోయాను. నా భార్య, ఇతర కుటుంబసభ్యులు నా చుట్టూ నిలబడి ఇది ఏ ప్రమాదానికి దారితీస్తుందో ఏమోనని భయపడుతున్నారు. ఆ సమయంలో నాకొక దృశ్యం కనపడింది. యమదూతల వలె కన్పించే 8-10 నల్లని ఆకారాలు నా చుట్టూ మూగాయి. వారు డాలు, బల్లాలు పట్టుకొని ఉన్నారు. వారెందుకో నన్ను కొట్టి హింసిస్తున్నారు. నాలో నేను "ఏమిటిదంతా? ఎందుకు వాళ్ళు నన్ను కొడుతున్నారు?" అని అనుకోసాగాను. కానీ వాళ్ళు నన్ను ఎంత కొడుతున్నా బాధేమీ తెలియడంలేదు. ఇంతలో గదిలోకి ఒక వెలుగు వచ్చింది. ఆ వెలుగు నుండి ఒక హస్తం ముందుకు వచ్చి ఆ ఆకారాలనన్నింటిని ఒక ప్రక్కకు ఈడ్చివేసింది. ఆ నల్లని ఆకారాలు, ఆ

వెలుగుకు దూరంగా గౌరవభావంతో నిలబడ్డాయి. ఆ హస్తం క్రిందగా తెల్లటి కఫ్నీ కొంతభాగం కన్పించింది. అంతేగాక ఒక వింతైన పరిమళం గదంతా వ్యాపించింది. తరువాత నాకు స్పృహవచ్చి కళ్ళు తెరిచాను. క్రిందపడటం మూలంగా నాకెలాంటి గాయాలు కాలేదు. నా కంటి అద్దాలు మాత్రం పగిలిపోయాయి. నా చుట్టూ చేరి ఉన్న కుటుంబ సభ్యులందరూ బాబానే నన్ను కాపాడారని నమ్మారు. నాకు మాత్రం అప్పుడు బాబాపై (1915లో) అంతటి నమ్మకం కలగలేదు. 1927లో నారాయణ మహరాజ్ మహిమ చవిచూసిన తరువాతే బాబాపై దృఢనమ్మకమేర్పడింది. ఆ రోజు నన్ను రక్షించిన అమృతహస్తం సాయిబాబాదే అని గుర్తించాను.

1918 అక్టోబరులో బాబా మహాసమాధి చెందడానికి వారం, పది రోజులముందు మేము శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాము. నా ఇద్దరు పిల్లలతో పాటు నా ఇతర కుటుంబ సభ్యులను కూడా తీసుకెళ్ళాను. దురదృష్టవశాత్తు శిరిడీలో నా కుమారులిద్దరూ నీళ్ళ విరేచనాలతో బాధపడసాగారు. మామూలుగా అలాంటి పరిస్థితుల్లో పూర్తిగా ఆహారం ఇవ్వకపోవడంగానీ లేదా ద్రవాహారం ఇవ్వడంగానీ చేస్తారు. కానీ ఈ విషయం బాబాకు చెబితే ***"వాళ్ళకి శిరా (గోధుమనూకను నేతిలో ఉడికించి) తినిపించండి"*** అన్నారు. పిల్లలు శిరా తిన్నారు. వారం రోజుల్లో వాళ్ళకి ఆరోగ్యం చేకూరింది. మా మామగారు కూడా ఒకసారి జబ్బుచేసినప్పుడు బాబా ఆదేశం మేరకు నిషిద్ధమైన ఆహారాన్ని తీసుకున్నారు. బాబా ఆజ్ఞానుసారం నడుచుకున్నందువల్ల ఎటువంటి హాని కలుగలేదు.

1918లో బాబా నన్ను మొదటిసారి దక్షిణ అడిగారు. అలా ఎన్నోసార్లు అడిగారు. నేను వారు అడిగినంత మొత్తాన్ని ఇచ్చాను. వారు నన్నెప్పుడూ ఇతరుల దగ్గర అప్పు తీసుకొని దక్షిణ సమర్పించమని ఒత్తిడి చేయలేదు. అటువంటి ప్రదేశాలలో అప్పు చేయడం నాకు ఇష్టముండదు. నా జేబులోని డబ్బులన్నీ అయిపోక మునుపే వారు నన్ను దక్షిణ అడగడం మానివేసేవారు. మరొక విశేషమేమంటే నాకు ఆధ్యాత్మికత పట్ల అపనమ్మకం జనించిన సమయాలలోనే నన్ను దక్షిణ అడిగేవారు. వారు దక్షిణగా అడిగే 25, 15, 10 సంఖ్యలలో ఏదైనా అంతరార్థముందో లేక ఆ సంఖ్యలు ఏ విషయాన్నైనా సూచిస్తున్నాయో కూడా నాకర్థమయ్యేది కాదు. బాబా ఒక్కొక్కసారి ***"వాడాకెళ్లి కూర్చో!"*** అని ఆదేశించేవారు. నేను వారి మాటలను

యథాతథంగా తీసుకొని, మేము ఉంటున్న బూటీవాడాకు వెళ్లి మా మామగారి వద్ద కూర్చునేవాడిని. కానీ, చాలాకాలం తరువాత బాబా మాటలకు అర్థం 'వాడాలో జరిగే పురాణ పఠనంలో కూర్చో' అని తెలుసుకున్నాను.

మానవతత్త్వం- దైవత్వం కలగలసిన స్వరూపమే శ్రీసాయిబాబా! దైవత్వము, దైవశక్తులు వారిలో ఒక భాగమని నా అభిప్రాయం. సాయిబాబాపై నాకు ఇలాంటి గొప్ప విశ్వాసం కలగడానికి మరో సంఘటన దోహదపడింది.

1926 ఆగష్టులో నా కుమారుల్లో ఒకనికి తీవ్ర అనారోగ్యం కలిగి, దీర్ఘకాలం కొనసాగింది. ఆ సమయంలో ప్రముఖ డాక్టర్లు వచ్చి పరీక్ష చేశారు. పిల్లవాడికొచ్చిన వ్యాధిని ఎవ్వరూ సరిగ్గా నిర్ణయించలేకపోయారు. ఒక్కొక్కరు ఒక్కొక్క వ్యాధిగా నిర్ణయించి మందులు ఇవ్వసాగారు. ఏ ఒక్కటీ పిల్లవాడి వ్యాధి నయంచేయలేక పోయింది. 1927 అక్టోబరు నాటికి డాక్టర్లు వాడికిక నయంకాదని తేల్చివేసారు. వాడిపై మేమందరం ఆశలు వదులుకున్నాము. అప్పుడు మా వదిన పిల్లవాడిని ఖేడ్‌గాంపేట్‌లో నున్న నారాయణ్ మహరాజ్ దగ్గరకు తీసుకువెళితే బాగుంటుందని చెప్పింది. ఆమె సలహామేరకు పిల్లవాడిని మహరాజ్ దగ్గరికి తీసుకెళ్ళాము. మహరాజ్ వాడిని ఆశీర్వదిస్తూ "అతడికి నయం అవుతుంది. ఈ తీర్థం తీసుకోండి!" అన్నారు. అదొక గొప్పమలుపు! అంతకుముందు చికిత్స చేసిన డాక్టరు మందులు మార్చడంతో పిల్లవాడు క్రమంగా కోలుకోసాగాడు. ఆరు నెలలకు ప్రమాదం తప్పిపోయింది. ఆ తరువాత బలం పుంజుకొని సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు. నారాయణ్ మహరాజ్ నోటి నుండి వెలువడిన అమృతతుల్యమైన మాటలే ఈ మలుపుకు కారణమని నేను సంపూర్ణంగా నమ్మాను. నారాయణ్ మహరాజ్, శ్రీసాయిబాబా లాంటి సత్పురుషులను, సామాన్య మానవమాత్రులుగా పరిగణించడం సరికాదని నాకర్థమైంది. సామాన్యులకందని ఉన్నతస్థాయిలో ఉన్న ఆ మహాత్ములు, టెన్నిసన్ తన 'మెమోరియమ్' అనే కవితలో చెప్పినట్లు దైవత్వము- మానవత్వము కలబోసిన దివ్యమూర్తులు.

1930లో సాధు సత్పురుషుల అద్భుత శక్తుల గురించి నాకు ఎక్కువగా అవగతమయ్యింది. తుంగరేశ్వర్ ఆలయంలో నాగబువా అను సాధువు నివసిస్తూ ఉండేవాడు. అతను గంజాయి పీల్చేవాడు. అతను 1930లో తుంగరేశ్వర్‌లో

మరణించాడు. ఆ రోజు రాత్రి నేను బాంద్రాలోని నా గదిలో కలతగా నిద్రిస్తున్నాను. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో నా ముక్కుకు ఘాటైన పొగవాసన తగిలింది. అది ఎక్కువయి గొంతులోనికి పోయి పొరపోయినట్లై మెలకువ వచ్చింది. లేచి చూస్తే గదిలో నా భార్య మాత్రమే ఉంది. "నీవు పొగత్రాగావా?" అని నేను నా భార్యనడిగాను. ఆమె విస్తుపోయి "మీరు ఏం మాట్లాడుతున్నారు?" అని కోపంగా అడిగింది. కానీ ఆ పొగవాసన ఇంకా వస్తూనే ఉంది. పొగ నా గదిలోనికి ఎలా వచ్చిందో నాకర్థం కాలేదు. చిత్రంగా నా భార్యకు మాత్రం పొగవాసన రాలేదు.

మరుసటి ఉదయం నేను కారు నడుపుకుంటూ గ్రామంలో ప్రయాణిస్తున్నాను. తుంగరేశ్వర్ ఆలయానికి అప్పుడు ఛైర్మెన్‌గా ఉన్నతను ఎదురుపడి నా కారు ఆపి, నాగబువా గతరాత్రి 2 గంIIల ప్రాంతంలో మరణించాడని, అతని అంతిమసంస్కారాలకు ఏమేమి ఏర్పాట్లు చేయాలో తెలుపమని అడిగాడు. నాగబువా దేహం విడిచి వెళ్ళేముందు నా గదికి వచ్చివెళ్ళాడని అప్పుడు అర్థమైంది. నా గదిలో వచ్చిన పొగవాసన, నాగబువా త్రాగే గంజాయి పొగవాసనగా నేను గుర్తించాను కూడా! 1915లో బాబా నా గదికి వచ్చి నల్లని ఆకారాలను ఈడ్చివేసినప్పుడు, వింతైన సుగంధ పరిమళం వచ్చినట్లు చెప్పాను కదా? ఆ పరిమళం బాబా వచ్చినప్పుడు మాత్రమే వస్తుందని కూడా గ్రహించాను.

బాబా నా గత జన్మల వృత్తాంతం నా ముందే శ్రీనానాసాహెబ్ నిమోణ్కర్‌కు వివరించారు. కానీ నేను వాటిని స్పష్టంగా వినలేకపోయాను. ఆ వివరాలేవో నిమోణ్కర్‌ను అడిగి తెలుసుకునేలోగా అతను మరణించాడు.

## 58

## సెప్టెంబరు 16వ తేదీ, 1936

**బాపూరావ్ నారాయణ చాందోర్కర్,** భూస్వామి, వయస్సు 40సం॥లు, బ్రాహ్మణుడు, తండ్రి: నారాయణ గోవింద్ ఉరఫ్ నానాసాహెబ్ చాందోర్కర్, గోగ్రస్‌వాడి, డోంబివ్లీ (కళ్యాణ్ దగ్గర), జి.ఐ.పి.

నాకు నాలుగు సంవత్సరాల వయస్సున్నప్పుడు మా నాన్న నన్ను సాయిబాబా దగ్గరికి తీసుకెళ్ళాడు. అప్పుడు మహల్సాపతి బాబా పాదాలకు, తలకు చందనం పూసి పూజించేవాడు. వారి నుదుటిపై ఎవ్వరూ చందనం పూసేవారు కాదు. మొదటిసారిగా నేను అమాయకంగా మన దేవుళ్ళకు దిద్దినట్లే వారి నొసటిపై చందనం దిద్దాను. అప్పటి నుండి ఇతర భక్తులు కూడా వారి నొసటిపై చందనం పూసేందుకు అనుమతి లభించింది. ఇది జరిగింది 1900 సంవత్సరంలో!

1900-1902 ప్రాంతంలో బాబా, తనకు గీతలోని సంస్కృత శ్లోకాలకు అర్థం చెప్పారని మా నాన్న చెప్పాడు. వారు నిగూఢ నీతికథలు, సాంకేతిక పరిభాష ఉపయోగించకుండా సామాన్యంగా పండితులు చెప్పే విధంగా బోధించారు. 1902వ సంవత్సరం తరువాత నుండి బాబా నిగూఢమైన రీతిలో నీతికథలు, సంజ్ఞలతోనూ మాట్లాడటం ప్రారంభించారట. బాబాకు సంస్కృతం తెలుసని వారు గీతలోని "తద్విద్ధి ప్రణిపాతేనా...॥" అనే శ్లోకానికి సరియైన అర్థం బోధించారని చెప్పాడు. బాబా అద్వైతవాది అని మా నాన్న చెప్పారు. కానీ వారు బోధించిన అద్వైత సిద్ధాంతమేదో నాకు చెప్పలేదు. బాబా చేసిన చమత్కారాలు, చెప్పిన భవిష్యవాణి, ప్రవచనాలు మొదలైనవి స్వయంగా విన్నాము, చూసాముగానీ తత్త్వం గురించి పెద్దగా పట్టించుకోలేదు. 1913 తరువాత భక్తులు అసంఖ్యాకంగా బాబా చెంత గుమిగూడేవారని, దీనివలన వారి ప్రశాంతతకు భంగం వాటిల్లిందని మా నాన్న చెప్పారు. బాబా ఒకసారి కన్నీటితో *"నేను దేనినైతే విస్తారంగా ఇవ్వదలచానో దానిని తీసుకునేవారే లేరు. నేను ఇవ్వలేనటువంటిదే వారు కోరుతున్నారు!"* అని వాపోయారట.

మా నాన్నగారికి జామ్నేరుకు బదిలీ అయింది. ఒకసారి, బాబా మా నాన్నగారితో ఒక ఆసక్తికరమైన చమత్కారం గురించి చెప్పారు. 1903-1904

ప్రాంతంలో జామ్నేరులో మా అక్క మైనతాయి ప్రసవం కష్టమైనప్పుడు బాబా ఓ గోసావిచే ఊదీ పంపి కాపాడారు. కానీ ఆ బిడ్డ పసితనంలోనే చనిపోయింది. మా అక్క చిన్న వయసులోనే ఇంకో సంతానం లేకుండా విధవరాలైంది. ఇది మా కుటుంబాన్నంతా విషాదంలో ముంచేసింది. మా నాన్నతో కలిసి మేమంతా శిరిడీ వెళ్ళాము. మా నాన్న బాధతో నిశ్శబ్దంగా బాబా ముందు కూర్చున్నాడు. సాధారణంగా మా నాన్నను చూడగానే బాబా పలకరించేవారు. మా నాన్న కూడా సంతోషంగా కబుర్లు చెప్పేవాడు. అంతా ఉల్లాసంగా ఉండేది. ఈసారి అక్కడ నిశ్శబ్ద వాతావరణం ఉంది. కొన్ని నిమిషాల తరువాత బాబానే మొదట నిశ్శబ్దాన్ని ఛేదించారు.

*బాబా : నీవు ఎందుకు అంత నిశ్శబ్దంగా ఉన్నావు?*

చందో : బాబా మీకు అంతా తెలుసు. మేము మీ రక్షణలో ఉన్నప్పుడే ఈ దుర్ఘటనలు జరిగాయి. అల్లుడు మరణించాడు. పసిబిడ్డ కూడా కన్నుమూసింది.

*బాబా : నీవు బిడ్డ కోసం, అల్లుడు కోసం నా దగ్గరికి వచ్చివుంటే పొరపాటు పడినట్లే! ఈ విషయంగా నా దగ్గరికి రానవసరం లేదు. ఇవన్నీ (బిడ్డ పుట్టడం, బంధువులు మరణించడం వంటివి) నా అధీనంలో లేవు. అవి పూర్వకర్మకనుగుణంగా జరుగుతుంటాయి. ఈ జగత్తును సృష్టించిన ఆ పరమేశ్వరుడు కూడా వాటిని మార్చలేడు. భగవంతుడు ఆ సూర్యుణ్ణిగానీ, చంద్రుణ్ణిగానీ, వారి నిర్ణీత ప్రదేశాలకు రెండు గజాల అవతల నుండి ఉదయించమని శాసించగలడనుకుంటున్నావా? శాసించలేడు, శాసించడు కూడా. అలా జరిగితే అంతా తారుమారై గందరగోళం అయిపోతుంది.*

చందో : అయితే, మీరు ఒకరికి కొడుకు పుడతాడని చెబుతారు. వారికి కొడుకు పుడతాడు. మరొకరికి ఉద్యోగమొస్తుందని చెబుతారు. వారికి ఉద్యోగమొస్తుంది. ఇవన్నీ ఎలా జరుగుతున్నాయి? ఇవన్నీ మీరు చేసే చమత్కారాలు కావా?

*బాబా : లేదు నానా. నేను ఏ చమత్కారాలు చేయను. మీకు గ్రామాలలో జ్యోతిష్కులున్నారు. వారు ఏవో గుణించి చూసి,*

*ఓ నాలుగైదురోజులు ముందుగా భవిష్యత్తు గురించి చెబుతారు. వాటిలో కొన్ని జరుగుతాయి. నేను ఇంకా కొంచెం దూరం ముందుగా చూస్తాను. నేను చెప్పింది జరుగుతుంది. అంతే! నాది కూడా ఒక విధమైన జ్యోతిషంలాగా కనబడవచ్చు! అయితే దీని ఆంతర్యం మీరు గ్రహించలేరు. మీకు భవిష్యత్తు తెలియదు కనుక, అది నేను చెప్తే నేనేదో చమత్కారాలు చేస్తున్నానని అనుకుంటారు. ఈ సంఘటనలన్నీ నా అద్భుత శక్తికి నిదర్శనాలని తలచి నాపట్ల భక్తి, గౌరవాలను చూపుతారు. నేను మీరు చూపే భక్తిగౌరవాలను ఆ భగవంతునికే సమర్పించి, మీరు నిజంగా అనుగ్రహింపబడేలా చూస్తాను.*

బాబా ఎన్నో ప్రవచనాలు చెబుతుండేవారు. అవేమీ నాకిప్పుడు గుర్తులేవు. 1913-14లో మా నాన్న అనారోగ్య కారణంగా చాలాకాలం సెలవుపెట్టారు. ఈ సెలవులు వారు శిరిడీలోనే గడిపారు. మా అమ్మ కూడా నాన్నతో పాటు ఉంది. ఒకసారి వాళ్ళిద్దరు బాబా ముందు కూర్చొని ఉన్నారు. నేను బాబాను పూజిస్తున్నాను అప్పుడు బాబా ***"నేనిప్పుడు వెళ్ళిపోతున్నాను. నేను బాపూ బిడ్డగా జన్మిస్తాను. అప్పుడు నానా తల (లేదా చేయి) ఇలా వణుకుతూ ఉంటుంది! (మీ ఆతాం జాఈన్ బాపూచే పోటీం జన్మ్ ఘేఈన్! త్యావేళీ నానాచీ మాన్ (ఘట్) ఆషీ ఆషీ హలత్ అసేల్)"*** అని చెప్పి, ముసలివాళ్ళ తల ఎలా వణుకుతూ ఉంటుందో అలా తమ చేతిని ఊపి చూపించారు. ఇది విని మా నాన్న, నాకు కొడుకు పుట్టేవరకు తాను జీవించి ఉంటానని తలచాడు. కానీ దురదృష్టవశాత్తు మా నాన్న 1921లోనే మరణించాడు. వారు తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పుడు, బాబా అంతకుముందు చెప్పిన విషయం గుర్తొచ్చి మా నాన్న కోలుకుంటారని అనుకున్నాను. ఎందుకంటే నాకు అప్పటికింకా వివాహం కాలేదు, కొడుకూ పుట్టలేదు. కానీ విధి నిర్ణయం మరోలా ఉంది. మా నాన్న మరణించారు. నాకు 1922లో వివాహమయ్యింది. మా నాన్న తల ఎన్నడూ వణకలేదు.[1]

నాకు తెలిసినంతవరకు బాబా వల్లించే మంత్రాలన్నీ సంస్కృతంలో కాక అరబిక్, పర్షియన్ భాషల్లో ఉండేవి. బాబా కొండాజీతో కలిసి "ఫత్యా" చదివేవారు.

---

*1. కానీ, నానా చేయి మాత్రం వణుకుతుండేది- బి.వి.నరసింహస్వామి.*

భక్తులు తెచ్చిన కేసరి (శీరా) నైవేద్యం మసీదు గూటిలో (నింబారులో) పెట్టినప్పుడు, బాబా మరియు కొండాజీ అరబిక్‌లోగానీ, పర్షియన్‌లోగానీ, (నాకు తెలియని భాషలో) ఏదో ఉచ్చరిస్తుండేవారు. బాబా 'మహావాక్యాలు' వల్లించేవారని మా నాన్న నాతో ఎప్పుడూ చెప్పలేదు.

1908లో మా నాన్న పండరిపురంలో పనిచేస్తున్నప్పుడు, నేను ఆయనతో కలిసి శిరిడీ వెళ్ళాను. బాబా మా నాన్నను నైవేద్యంగా పూరన్‌పోళీలు చేసి తీసుకొని రమ్మన్నారు. ఆయన అలాగే చేసి బాబాకు సమర్పించి, బాబాను తన బసకు వచ్చి భోంచేయమన్నారు. బాబా ***"నేను వస్తాను, వెళ్ళు!"*** అన్నారు. బాబా తమ భౌతికదేహంతో తన బసకు రారు అని మా నాన్న తెలుసుకొని నిరాశతో వెళ్ళిపోయాడు. ఇది జరిగేటప్పుడు మాధవరావు దేశ్‌పాండే బాబా చెంతనే ఉన్నాడు. మసీదు నుండి ఆయన బాధతో వెళ్ళిపోయిన తరువాత, బాబా షామాతో ***"నానా ఎంతో కాలం నుండి నాతో కలిసి ఉన్నప్పటికీ, నేను ప్రతి చీమ, ఈగ మొదలైన ప్రాణులలోనూ ఉంటానన్న సత్యాన్ని గ్రహించలేకపోయాడని అతనితో చెప్పు"*** అన్నారు. జీవరాసులన్నింటిలోను తాము ఉన్నామని బాబా చెప్పారు. ఇదే నేను బాబా నుండి ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ విన్న గొప్ప సత్యం.

బాబా ఎప్పుడూ అద్వైతాన్ని గురించిగానీ, వేదాంతానికి సంబంధించి సుదీర్ఘ ధర్మోపన్యాసాలుగానీ చేసినట్లు నాకు గుర్తులేదు. వారు సాధారణమైన విషయాల గురించి మాట్లాడేవారు. ఉదా: దానం చేయండి, మంచిపనులు చేయండి, సత్యాన్నే పలకండి మొదలైనవి! నేను చిన్నవాడిగా ఉన్నప్పుడు ***"నీ తల్లిదండ్రుల మాటలు విను, మీ అమ్మకు పనులలో సహాయం చేస్తూవుండు. ఎప్పుడూ నిజం మాత్రమే చెప్పు"*** అని చెప్పేవారు. అంతేగానీ వారెప్పుడూ నాతో మంత్రాల గురించి, భగవంతుని గురించి మాట్లాడలేదు.

బాబానే నా రక్షకులని నా అచంచల విశ్వాసం! నా జీవితమంతా వారి రక్షణలోనే గడుస్తుంది. నేను ఉదాహరణలు ఇవ్వలేకపోయినా నా అవసరాలు తీరుస్తూ శ్రేయస్సు చేకూరుస్తూ, తమ మార్గదర్శకత్వంతో నన్ను ముందుకు నడిపిస్తూ నన్ను సదా కాపాడుతున్నారన్నది నా అనుభవం.



నానాసాహెబ్ చాందోర్కర్



చంద్రాబాయి బోర్కర్

## 52

## సెప్టెంబరు 17వ తేదీ, 1936

**శ్రీమతి చంద్రాబాయి,** (కీ.శే. రామచంద్ర బోర్కర్ భార్య), వయస్సు 66సం॥లు, విల్లేపార్లే.

శ్రీసాయిబాబాను నేను గత 44 సంవత్సరాల నుండి పూజిస్తున్నాను. వారు సమాధి చెందడానికి 20 సంవత్సరాల పూర్వమే నేను శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాను. ఈ భవంతిలో నేను పూజించే దేవుడు వారే! ఇప్పటికీ నా దగ్గర బాబా స్వయంగా, తమ చేతులతో ప్రసాదించిన ఊదీ చాలా ఉంది. అప్పుడు వారు నాకు ప్రతిదినం స్వయంగా కొంత ఊదీ ఇచ్చేవారు. దానినంతా సేకరించి దాచి ఉంచాను. ఎందుకంటే వారి చేతుల నుండి వచ్చిన ఊదీ అమూల్యమైనది, అతిశక్తివంతమైనది కాబట్టి! నా దగ్గర బాబా పవిత్ర దంతంతో కూడిన తాయత్తు కూడా ఉంది. ఆ పవిత్ర దంతాన్ని వారి జ్ఞాపికగా నాకు ప్రసాదించారు.

బాబాపై నాకు అపారమైన భక్తివిశ్వాసాలుండేవి. దానికి తగినట్లు వారు కూడా నన్ను అంతగా అనుగ్రహించారు. నేను 1898 ప్రాంతంలో బాబాను దర్శించినప్పుడు సాఠేవాడా లేదు. మసీదు కూడా ఇప్పటి తీరుగా లేదు. మసీదుకు మరమ్మత్తులు చేసి తిరిగి నిర్మించిన తర్వాతే సాఠేవాడా నిర్మించబడింది. ఆ రోజుల్లో బాబా ఇప్పుడు సాఠేవాడాలో ఉన్న వేపచెట్టు క్రింద కూర్చొని ఉండేవారు. బాబా నీటితో దీపాలు వెలిగించే లీలను నేను చూసాను. వారు మొదట రేకుడబ్బాలో నిల్వవున్న కొద్ది నూనెలో నీరుపోసి త్రాగారు. తరువాత ప్రమిదలను నీటితో నింపి వెలిగించారు. బాబా, కొయ్యపలకను సన్నని గుడ్డపీలికలతో మసీదు కప్పుకు వ్రేలాడదీసి దానిపై నిద్రించడం కూడా చూసాను. ఆ కొయ్యపలక నాలుగు మూలలా వెలుగుతున్న దీపాలుండేవి. అప్పుడు గొప్పవారెవరు బాబాను దర్శించేందుకు వచ్చేవారు కాదు. నేను శిరిడీ ఎప్పుడు వెళ్ళినా గ్రామస్థుల ఇళ్ళల్లోనే ఉండేదాన్ని!

బాబా నాపై చూపిన కరుణ అపారము. (ఈ విషయం చెప్పేటప్పుడు, ఆమెకు బాబాపైనున్న కృతజ్ఞతాభావం అతిశయించగా కన్నీరు కార్చింది. దుఃఖభారంతో మాట్లాడలేక గద్గదకంఠంతో మధ్య మధ్యలో ఆగి సంభాషణ

కొనసాగించింది). నా భర్త శ్రీబోర్కర్ ఎప్పుడూ సాయిబాబాను దర్శించేందుకు వెళ్ళలేదు. అయినప్పటికీ బాబా వారిని దయతో కాపాడుతూ వచ్చారు. వృత్తిరీత్యా ఇంజనీరైన నా భర్త, 1909లో పండరిపురంలో బ్రిడ్జి నిర్మాణపు పనులలో నిమగ్నమై ఉన్నాడు. అప్పుడు మా వారి నివాసం పండరిలోనే! మా వారు అక్కడ ఉన్నప్పుడు నేను శిరిడీ వెళ్ళి బాబాను సేవిస్తూ ఉన్నాను. ఒకరోజు బాబా ***"నీవు పండరిపురం వెళ్ళడం మంచిది. నేనూ నీ వెనకే వస్తాను. నాకు ఏ వాహనాలు అక్కరలేదు!"*** అని నన్ను వెంటనే బయలుదేరమన్నారు. నేను వెంటనే బయలుదేరాను. అక్కడ ఏం జరిగిందో ఏమో! నేను పండరి వెళ్ళేటప్పటికి నా భర్త అక్కడ లేడు. అతను ఉద్యోగానికి రాజీనామా చేసి, బొంబాయి వెళ్ళినట్లు తెలిసింది. అది విన్న వెంటనే నాకు దుఃఖమాగలేదు. నా దగ్గర కొన్ని రూపాయలు మాత్రమే ఉన్నాయి. అంతేగాక నాతో మరి ఇద్దరు మిత్రులు కూడా ఉన్నారు. నా దగ్గరున్న డబ్బుతో మేము ముగ్గురం కుర్ద్‌వాడీ వరకు వెళ్ళగలిగాము. కుర్ద్‌వాడీలో దిక్కుతోచని స్థితిలో ఆలోచిస్తూ ఉన్నాము. అకస్మాత్తుగా ఒక ఫకీరు నా ముందుకు వచ్చి "దేనిగురించి దీర్ఘాలోచన చేస్తున్నావు?" అనడిగారు. అతనికి నేనేమీ జవాబు చెప్పలేదు. అతను "నీ భర్త ధోండ్‌లో ఉన్నాడు. ఈ ఇద్దరితో వెంటనే అక్కడికి వెళ్ళు!" అన్నాడు. కానీ రైలు ఛార్జీలకు డబ్బెక్కడ నుండి వస్తుందో తెలుపమని అతనిని అడిగాను. ఆ ఫకీరు వెంటనే ధోండ్‌కు మూడు టిక్కెట్లు నా చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు. నేను టిక్కెట్లు తీసుకొని, ఆ ఇద్దరితో కలిసి ధోండ్ వెళ్ళే రైలు ఎక్కాను. ఆ సమయంలో నా భర్త ధోండ్ స్టేషనులో ఒక బల్లపై కూర్చొని టీ త్రాగుతూ కునికిపాట్లు పడుతున్నాడు. అప్పుడొక ఫకీరు వచ్చి "ఎందుకు నా తల్లిని ఇలా నిర్లక్ష్యం చేస్తున్నావు? ఆమె ఇంకాసేపటికి వచ్చే రైలులో ఫలాన బోగీ నుండి దిగబోతోంది!" అని బోగీ నెంబరు కూడా చెప్పాడు.

నా భర్త ఉలిక్కిపడి "ఎవరీ ఫకీరు? ఎందుకు ఇలా చీవాట్లుపెడుతున్నాడు?" అనుకుంటూ పైకి చూసాడు. కానీ ఫకీరు అంతర్ధానమయ్యాడు. అంతలో రైలు వచ్చింది. నా భర్త నన్ను కలుసుకొని ఇంటికి తీసుకెళ్ళి తనకు ఫకీరు కనిపించిన విషయం చెప్పి, నేను పూజించే సాయిబాబా ఫోటో చూపించమని అడిగాడు. నేను

చూపించాను. దానిని చూసిన తరువాత తనకు ప్లాట్‌ఫారంపై కనిపించిన ఫకీరు సాయిబాబానే అని రూఢి చేసుకున్నాడు.

నా గురుబంధువైన ఉపాసనీ మహరాజ్ శిరిడీ విడిచి ఖరగ్‌పూర్ వెళ్ళడానికి ముందు ఒక గురుపూర్ణిమ రోజున పూజాద్రవ్యాలు, నైవేద్యం తీసుకొని వెళ్ళి వారిని పూజించమని బాబా నన్ను ఆదేశించారు. అలాగే నేను మహరాజ్ దగ్గరకు వెళ్ళి, అది బాబా ఆదేశంగా చెప్పి వారిని పూజించాను. మహరాజ్ నన్ను నిరోధించకుండా పూజను స్వీకరించారు. ఆ ఒక్కసారే తప్ప తిరిగి వారినెప్పుడూ పూజించలేదు. నేను ఉపాసనీ మహరాజ్‌ని ఒక గురుబంధువుగా పరిగణించాను కానీ చాలామంది శిరిడీవాసుల వలె వారిని ద్వేషించలేదు. బాబా ఎవరినీ ద్వేషించవద్దని, ఈర్ష్య, అసూయ, విరోధము, పోటీ మొదలైన భావాలకు చోటివ్వద్దని, ఎవరైనా నిన్ను ద్వేషించి, విరోధిస్తే మౌనంగా నామాన్ని ఆశ్రయించి వాళ్ళకి దూరంగా ఉండమని తరచూ చెబుతుండేవారు. ఉపాసనీ మహరాజ్‌పై నాకున్న అభిప్రాయాన్ని ఇతరులేకాక, మహరాజ్ కూడా సరిగా అర్థం చేసుకోలేదు. రెండు సంవత్సరాల క్రితం ఉపాసనీ పంచకన్య సంస్థాన్ స్థాపనలో మార్పులు తెచ్చే సందర్భంలో ఏర్పాట్లు చూడడానికి నేను సాకోరి వెళ్ళాను. అప్పుడు కూడా మహరాజ్, నాకు వారితో విరోధభావమున్నట్లు అపార్థం చేసుకొని విడిగా మాట్లాడేందుకు అవకాశమివ్వలేదు. నేను తిరిగి వచ్చేసాను.

1918లో బాబా సమాధి చెందడానికి ముందు, తరువాత కూడా వారు నాపైన, నావాళ్ళ పైన చూపిన దయ, కరుణ అంతులేనివి. తాము దేహత్యాగం చేసిన తరువాత నా శ్రేయస్సు గురించి బాబా ముందే యోచించారు. 1918లో దసరాకు మూడు నెలల ముందు వారు నాతో *"బాయీ, (బాబా నన్నెప్పుడూ 'బాయి' అనే పిలిచేవారు) ఇక మీదట నన్ను చూడడానికి, నువ్విక్కడికి రానవసరం లేదు. నీవెక్కడున్నా నేను నీతోనే ఉంటాను!"* అన్నారు (ఈ మాటలు చెబుతున్నప్పుడు, ఆమె కళ్ళు చెమర్చాయి). బాబా ఎంతో దయతో పలికిన ఆ మాటలు నిత్యసత్యాలు. తరువాత నేను వెళ్ళిపోయాను. దసరాకు కొద్దిరోజుల ముందు నేను పంచాగ్నిలో ఉన్నప్పుడు, బాబా తరచూ నా గురించే ఆలోచిస్తున్నారని, వారు ఎక్కువ రోజులు జీవించేటట్లులేరని హరిసీతారాం దీక్షిత్ నాకు కబురు పంపాడు. నేను వెంటనే

బయలుదేరి బాబా తుదిశ్వాస విడిచే సమయానికి శిరిడీ చేరాను. అంతిమ సమయంలో నేను వారి నోట్లో నీరు పోసాను. బగ్యా కూడా అలాగే చేశాడు. బాబా బగ్యాపై కొరిగి అంతిమశ్వాస విడిచారు.

ఆ తరువాత 1919లో ఒకసారి 1933లో మరోసారి శిరిడీ వెళ్ళాను. బాబా తామిచ్చిన మాట ప్రకారం నేనెక్కడున్నా, ఎప్పుడూ నావెంటే ఉండి నాకు సహాయపడుతున్నారు. నేను బాబాపై కొన్ని పద్యాలు వ్రాసాను. వాటిని నా అనుభవాలతో పాటు సాయిలీలా మాసిక్ పత్రికకు పంపాను.

1918కి నాకు 48 సంవత్సరాలు నిండాయి. నేనప్పటి వరకు గర్భం దాల్చలేదు. నాకొక బిడ్డ ఉంటే బాగుండేది కదా అని అనుకుంటూ ఉండేదాన్ని. కానీ నా చుట్టూ ఉన్నవాళ్ళు, డాక్టర్లు నాకా వయస్సులో బిడ్డలు పుట్టడం అసంభవమని అన్నారు. నేను బాబాను 1918లో దర్శించినప్పుడు నా కోరిక తెలిసి ఇలా అడిగారు:

*బాబా : బాయీ, నీ హృదయంలోని కోరికేమిటి?*

నేను : బాబా, మీకన్నీ తెలుసు. ప్రత్యేకంగా నేను చెప్పవలసినదేముంది!

ఆ తరువాత మూడు సంవత్సరాలకు నా నెలసరి ఆగిపోయింది. డాక్టరు పురందరే నన్ను పరీక్షించి నా కడుపులో ఉన్నది గడ్డ అని, దానిని ఆపరేషన్ ద్వారా తొలగించాలని తేల్చిచెప్పారు. నేను సమ్మతించక పదినెలలు ఆగిన తరువాత కానీ ఏ నిర్ణయమూ తీసుకోనని చెప్పాను. అంతవరకూ గర్భధారణ జరగకుండా 51వ సంవత్సరంలో గర్భం రావడం అసంభవమని డాక్టరు నచ్చజెప్పచూసాడు. కానీ, బాబా అసంభవాన్ని సంభవం చేశారు. బాబా మహాసమాధి చెందిన మూడు సంవత్సరాల, రెండు రోజులకు అంటే 1921లో ధన త్రయోదశినాడు నాకు కుమారుడు జన్మించాడు. ఈ ప్రసవం చెంబూరులో జరిగింది. ప్రసవ సమయమప్పుడు డాక్టరుగానీ, నర్సుగానీ ఎవ్వరూ లేరు. నేను ఎలాంటి మందులు కూడా వాడలేదు. ప్రసవమయ్యే రోజు కూడా మామూలుగానే పనులన్నీ చేసుకున్నాను. ఆ రోజు రాత్రి ఎవరి సహాయం లేకుండా సుఖంగా ప్రసవించాను. బిడ్డ గర్భంలో ఉన్న తొమ్మిది నెలలు మాత్రం కాళ్ళు వాయడం మొదలైన ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. నేనప్పుడు కొన్ని నెలల పాటు పెద్దగా ఆహారం తీసుకునేదాన్ని కాదు. తరచూ ఊదీని నీళ్ళల్లో కలుపుకొని త్రాగేదాన్ని.

1921లో నా భర్త బండి మీద నుండి పడడంతో ఆయన కాలు విరిగింది. నేను వారిని ఇంటికి తీసుకెళ్ళి విరిగిన చోట ఊదీ పూసి, 'బిబా' గింజల పిండిని, 'తాక్షీపల' అను మూలికను పేస్టులా చేసి కాలుకు పట్టించేదానిని. ఇలా మూడు నెలలు చేసేటప్పటికి కాలు నయమయ్యింది. అంతేగాక 1934లో నా భర్త మరణించే సమయంలో బాబా చూపిన కరుణ అపారం. ఈ ఘటన జరగడానికి రెండు నెలల ముందు నుండే ఈ విపత్తును ఎదుర్కొనేందుకు బాబా నన్ను మానసికంగా సిద్ధం చేశారు. ఒకరోజు కలలో నాకు బాబా కన్పించి *"భయపడవద్దు. శ్రీరాముణ్ణి (నా భర్త పేరు రామచంద్ర) తీసుకొని వెళతాను!"* అన్నారు. "నన్నే ముందు తీసుకెళ్ళు బాబా!" అని అన్నాను. నేను చేయాల్సిన పనులు మిగిలి ఉన్నాయని, అందువల్ల నా భర్త మరణాన్ని ఓర్పుతో సహించి నాకు విధించిన కార్యాలు నెరవేర్చమని బాబా చెప్పారు. ఈ కల విషయం నా భర్తకు చెప్పాను. ఆయన దానిని తేలికగా తీసుకొని "ఇది కలే కదా?" అన్నారు. ఆ సంఘటన చాతుర్మాసం ముగియడానికి రెండు నెలల ముందు జరిగింది. కానీ తరువాత కొన్ని రోజులకు ఆయన మూత్రపిండాలకు సంబంధించిన జబ్బుతో తీవ్రంగా బాధపడసాగాడు. దీనికి తోడు వెక్కిళ్ళు రావడం ప్రారంభించాయి. నా భర్త తనకు అవసాన దశ సమీపించినదని తెలుసుకున్నాడు. కానీ తనకు చాతుర్మాసం గడిచిన తరువాత చనిపోవాలనే కోరిక బలంగా ఉందని చెప్పాడు. ఈ మాటలు చెప్పిన వెంటనే వారి కాళ్ళు, చేతులు బిగుసుకుపోయాయి. స్పృహ కోల్పోయాడు. మృత్యుఘడియలు సమీపిస్తున్నట్లు కనిపించాయి. నేను బాబాను ఆర్తిగా ప్రార్థించాను. వారిని చాతుర్మాసం వెళ్ళేంతవరకు బ్రతికించమని వేడుకున్నాను. మరుసటిరోజు నా భర్త స్పృహలో కొచ్చాడు. కాళ్ళల్లో కదలిక వచ్చింది. వారు చాలా ఉల్లాసంగా కనిపించారు. చాతుర్మాసం ముగిసి ఏడు రోజులు గడిచాయి. కార్తీక పౌర్ణమి వచ్చింది. ఆ రోజు అర్ధరాత్రి వారు టీ త్రాగి నన్ను బాబాకు ఆరతి ఇవ్వమన్నారు. ఆరతి ఇచ్చిన తరువాత విష్ణుసహస్రనామం పెద్దగా చదవమన్నారు. నేను చదవడం మొదలుపెట్టి మరుసటి ఉదయం డాక్టరు వచ్చినంతవరకు కొనసాగించాను. డాక్టరు నా భర్తను పరీక్షించి కోలుకుంటాడని చెప్పాడు. కానీ, నాకు తెలుసు నా భర్త ఆ మధ్యాహ్నమో, సాయంత్రమో మరణిస్తాడని. నేను వారికి త్రాగడానికి గంగనీరు ఇచ్చాను. నీరు త్రాగిన కాసేపటికి

"శ్రీరామ్, శ్రీరామ్" అన్నాడు. ఇంతలో ఒక కుర్రవాడు వచ్చి మా వారిని "బాబా!" అని పిలిచాడు. వారు "ఓహ్!" అని లేవడానికి ప్రయత్నిస్తూ "శ్రీరామ్, శ్రీరామ్" అని ఉచ్ఛరిస్తూ అంతిమశ్వాస విడిచాడు. నేను నా భర్త ప్రక్కనే ఉండి, వారికి ఉత్తమగతి ప్రసాదించమని బాబాను, శ్రీకృష్ణుడిని ప్రార్థించాను. ఆ విధంగా నా భర్త భగవంతుడిని, బాబాను స్మరిస్తూ మరణించాడు. నా భర్త జీవితానికి మంచి ముగింపు ఇవ్వడంలో బాబా అనుగ్రహం ప్రస్ఫుటంగా కనిపించింది.

మావారు మరణించిన తరువాత నా కుమారుని పోషణ, ఈ భవంతిని నిలబెట్టుకోవల్సిన బాధ్యత నాపైబడ్డాయి. కొందరు బంధువులు నాకు ఎడతెగని చిక్కులుతెచ్చి, కోర్టులో వ్యాజ్యమేస్తామని బెదిరించారు. నేను ఎంతో కష్టపడి 14000 రూపాయలు సేకరించి వారికి ఇచ్చి ఈ ఇంటిని వారి బారి నుండి కాపాడుకోవలసి వచ్చింది. తరువాత కొందరు శత్రువులు, మంత్రించిన నిమ్మకాయలో క్షుద్రశక్తులను ఆవహింపజేసి మా ఇంటిలోనికి విసిరారు. మాకు హాని చేయాలని, మా ఇంటిని ఎవ్వరూ అద్దెకు తీసుకోకూడదని వారు అలా చేశారు. సాయిబాబా నా కలలో కనిపించి ఈ విషయం గురించి చెప్పారు. నేను వెంటనే మా మనిషిని గోవాకు పంపి, అక్కడున్న మా కులదైవాన్ని ప్రార్థించి, ఆ దేవి అనుగ్రహంతో ఆ క్షుద్ర ప్రయోగాన్ని, మంత్రాలను తిప్పికొట్టేట్లు చేశాను.

## ౬౦

## సెప్టెంబరు ౧౨వ తేదీ, ౧౯౩౬

**శ్రీబల్వంత్ హరికార్నిక్,** కస్టమ్స్ డిపార్ట్‌మెంట్, బొంబాయి రేవు, వయస్సు 54 సం॥లు, ఘోడ్‌బందర్ రోడ్డు, బాంద్రా.

నేను సాయిబాబా భక్తుడను. ఇంటిలో సాయిని పూజించడమే గాక ప్రతి సంవత్సరం వారి దర్శనార్థం క్రమం తప్పకుండా శిరిడీ వెళుతుంటాను.

దాసగణు కీర్తనలు వినడం ద్వారా నాకు మొదట సాయిపై భక్తి విశ్వాసాలు ఏర్పడ్డాయి. మొదటిసారిగా 1911లో శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాను. వారి కళ్ళు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి. వారితో ఒక్క మాట మాట్లాడకపోయినా, ప్రతి సంవత్సరం వారిని తప్పక దర్శించాలని నిర్ణయించుకున్నాను. నేను శిరిడీ వెళ్ళి వచ్చిన తరువాత నా తల్లిదండ్రులు కూడా శిరిడీ వెళ్ళి బాబాను దర్శించారు. అప్పటి నుండి మా కుటుంబమంతా నిత్యం సాయిని పూజించనారంభించాము.

నాకు చెప్పుకునేటంతటి అనుభవాలు బాబాతో లేవు. అసలు నేను ఎలాంటి కోరికలనూ ఆశించి వారిని దర్శించేవాడిని కాదు. 1918 గురుపూర్ణిమ నాడు మాత్రం నా ఆధ్యాత్మిక శ్రేయస్సు గురించి వారిని అడగాలని తలచాను. కానీ వారు ప్రసన్నంగా కనిపించనందువల్ల వారినేమీ అడగలేక అసంతృప్తితో బయటికి వచ్చి టాంగా ఎక్కబోతున్నప్పుడు నానావలీ వచ్చి నన్ను కౌగిలించుకొని "భగవంతుడు నీకు మేలు చేస్తాడు!" (అల్లా తేరా అచ్ఛా కరేగా) అన్నాడు.

నా భార్య సాయిబాబాను దర్శించిన తరువాత వారి భక్తురాలయ్యింది. ఆమె 1928లో మరణించింది. మరణానికి ముందు ప్రసవానంతరం వచ్చే అస్వస్థతలతో దాదాపు 9 నెలలు బాధపడి చివరకు మృత్యుముఖానికి చేరింది. చివరి 6, 7 రోజులు ఆమె పూర్తిగా స్పృహ కోల్పోయింది. నేను ఆమె ముందు బాబా ఫోటోను పెట్టాను. ఆశ్చర్యకరంగా అంతిమ ఘడియల్లో ఆమెకు స్పృహ వచ్చింది. ఆమె చేతులు జోడించి, ముందు బాబాకు తరువాత నాకు నమస్కరించింది. తరువాత పెద్దకుమారులను దగ్గరికి పిలిచి, చిన్నవారిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పి అంతిమశ్వాస విడిచింది. బాబా కృపవలన ఆమెకు శాంతి, సద్గతి (అనాయాసేన్

మరణ్) లభించింది. నేను సాధువులు, సత్పురుషులు, సంత్‌లు అన్న పదాలను సమాన అర్థంతో వాడతాను.

మొదటిసారి బాబాను దర్శించినప్పుడు, వారు నన్ను పది రూపాయలు దక్షిణ అడిగి పుచ్చుకున్నారు. దాంతో నా దగ్గర తిరుగు ప్రయాణానికి కూడా డబ్బు మిగలలేదు. ఏం చేయాలో తోచని స్థితిలో ఉన్నప్పుడు, నా స్నేహితుడు రోసర్ (ప్రస్తుతం స్వామి నారాయణాశ్రమ్, వాయ్) కలిసి నాకు కావలసిన డబ్బు అప్పుగా ఇచ్చాడు.

ఒకసారి నేను, నా భార్య పండరిపురం మొదలైన క్షేత్రాలు దర్శించాలని బయలుదేరి ముందు శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాము. అప్పుడు మా దగ్గర వంద రూపాయలున్నాయి. శిరిడీలో రెండు రోజులు గడిపాము. ఆ రెండు రోజులలో బాబా దక్షిణ రూపంలో నా దగ్గరున్న డబ్బంతా తీసుకున్నారు. ఫలితంగా మేము పండరి, ఇతర క్షేత్రాలకు వెళ్ళడం మానుకోవలసి వచ్చింది. పండరిపురం మరియు ఇతర పుణ్యక్షేత్రాలు అన్నీ కలిపి శిరిడీయే అని మాకు పరోక్షంగా బోధించేందుకే బాబా ఇలా చేశారని మాకు అర్థమయింది. మహాత్ముని పాదాల చెంత సకల తీర్థాలు ఉంటాయి. మా దగ్గరున్న డబ్బంతా తీసుకున్న తరువాత మేము ఇంటికి వెళ్ళడానికి బాబా అనుమతించారు. కానీ నా దగ్గర డబ్బు లేదు కాబట్టి నేను తిరిగి వెళ్ళలేనని శిరిడీలోనున్న నా స్నేహితులతో చెప్పాను. బాబా ఒకసారి అనుమతి ఇచ్చిన తరువాత అక్కడ ఉండడం తప్పని వాళ్ళు చెప్పారు. అప్పుడు అకస్మాత్తుగా నా స్నేహితుడు రోసర్ కన్పించి, ఒకతని వద్ద నాకు కావల్సిన డబ్బు అప్పుగా ఇప్పించాడు.

బాబా ఎందరో ఫకీర్లను, పేదసాదలను పోషిస్తూ సహాయం చేస్తున్నారు. అందువల్ల వారికి ఇచ్చిన దక్షిణ గొప్ప దానంతో సమానమని నా అభిప్రాయం. నేను బాబాను ఆశ్రయించిన ఫలితంగా నాకు భవిష్యత్తులో రాబోయే విపత్తుల గురించి ముందుగానే తెలిసేది. అంతేకాదు వాటిని ధైర్యంగా ఎదుర్కొనగలిగేవాడిని!

61

## సెప్టెంబరు 25వ తేదీ, 1936

**శ్రీవినాయక్ అప్పాజీ వైద్య,** గుమాస్తా, బొంబాయి నౌకాశ్రయ అకౌంట్స్ ఆఫీసు, వయస్సు 45 సం॥లు, కాయస్థప్రభు, పరశురాం భవనాలు, వర్సోవా రోడ్డు, అంధేరి.

నేను దాసగణు కీర్తనలు విని 1912 ఈస్టర్ సెలవుల్లో బాబాను దర్శించడానికి శిరిడీ వెళ్ళాను. తరువాత వారి మహాసమాధి అనంతరం 1923 నుండి శిరిడీకి వెళుతున్నాను. ప్రతిసంవత్సరం ముఖ్యంగా రామనవమి ఉత్సవాలకు తప్పక శిరిడీ వెళుతూ ఉంటాను. 1933లో నేను శిరిడీలో 20 రోజులు గడిపాను. బాబా ప్రసాదించిన స్వప్న దర్శనాలు, ఊదీ మహిమ మొదలైన అనుభవాలను శ్రీసాయిలీలా మాసిక్ పత్రికకు వ్రాసి పంపాను.


1927లో నా భార్య క్షయ వ్యాధితో ఎనిమిది నెలలపాటు బాధపడింది. ఆమె కోలుకునే సూచనలు కనిపించలేదు. నేను ఆమెను శిరిడీకి తీసుకెళ్ళాను. వెళ్ళిన నాలుగు రోజులకు జ్వరం తగ్గిపోయింది. నేను వెంటనే ఆమెను తీసుకొని తిరిగి అంధేరి వచ్చేసాను. కానీ పదిరోజుల తరువాత వ్యాధి తిరగబెట్టింది. ఆమెకిక వ్యాధి నయంకాదని తీర్మానించుకొని గ్రామానికి తీసుకెళ్ళదలచాను. కానీ ఆమెకు బాబా కలలో కనిపించి వ్యాధి నయమవుతుందని చెప్పారు. కల వచ్చిన 15 రోజులకు ఆమెకు జ్వరం తగ్గిపోయింది. ఆపై ఆమె బరువు పెరిగి పూర్తిగా కోలుకుంది. తరువాత నలుగురు బిడ్డలకు జన్మనిచ్చింది. ఇప్పటికీ ఆరోగ్యంగానే ఉంది.

1923లో బాబా నా భార్యకు కలలో కన్పించి నాకు వ్యతిరేకంగా వ్యాజ్యమొకటి వస్తుందని, కానీ నన్ను భయపడవద్దని చెప్పమని అన్నారు. వారు చెప్పినట్లుగా తరువాత కొంతకాలానికి నాపై వ్యాజ్యమొకటి నడిచింది. కానీ బాబా కృపవలన నాకు అనుకూలమైన తీర్పు వచ్చింది. అదే సంవత్సరం జూన్ నెలలో ఒక గురువారంనాడు, బాబా నా భార్యకు దర్శనమిచ్చి, తలకు కట్టుకునే వస్త్రాన్ని (పట్కా) ఇమ్మని అడిగారు. కానీ ఇంటిలో అలాంటిది ఏమీ లేనందున, ఆమె కొంత బియ్యము, పప్పు ఇచ్చింది. బాబా వాటిని తీసుకొని అంతర్ధానమయ్యారు. అంతకుమునుపు నా భార్య బాబాను చూసి ఉండలేదు.

కానీ, ఆమె దగ్గరికి వచ్చిన వ్యక్తిని వర్ణించిన మీదట వారు తప్పక బాబానే అయి ఉంటారని నేను అనుకున్నాను.

బాబా ఎప్పుడూ నాతోనే ఉండి నన్ను కాపాడుతూ ఉన్నారని నా గట్టి నమ్మకం. ఎందుకంటే నాకు ఎన్ని కష్టాలు వచ్చినా వారి సహాయంతో బయటపడేవాడిని. 1933లో బాబా నా కలలో కన్పించారు. నేను వారికి ఒక రూపాయి దక్షిణ సమర్పించాను. వారు ఆ రూపాయిని నాకు తిరిగి ఇచ్చి ***"నీకెంత కావాలో అంత తీసుకో!"*** అన్నారు. ఇది జరిగిన నెల లోపల అనుకోని విధంగా నాకు ఉద్యోగంలో పదోన్నతి (ప్రమోషన్) లభించింది.

పది సంవత్సరాల క్రితం మూడు ఏళ్ళ వయస్సున్న నా సోదరుని కుమార్తె చాలారోజుల పాటు 105 డిగ్రీల జ్వరంతో బాధపడుతుండేది. వైద్య చికిత్సలేమీ పని చేయలేదు. ఇక ఆ పాప బ్రతకదని అందరూ అనుకున్నారు. నేను ఆ పాపకు బాబా ఊదీని ఇచ్చాను. మూడు, నాలుగు రోజులలో జ్వరం తగ్గిపోయింది. ఇప్పటికీ ఆ పాప ఆరోగ్యంగా, చురుకుగా ఉంది.



దాదాసాహెబ్ ఖాపర్డే



బి.వి. దేవ్

## 62

## సెప్టెంబరు 27వ తేదీ, 1936

**శ్రీ బి.వి. దేవ్,** రిటైర్డ్ మామ్లత్‌దార్, స్టేషను రోడ్డు, థానా.

సాయిబాబా అద్వైతాన్ని గురించి చెప్పడంగానీ, ఆ మార్గంలో ఎవరినైనా నడిపించడంగానీ జరిగిందా అని మీరు అడిగితే, వారి దగ్గరకి వచ్చే భక్తులలో ఎవరికీ అంతటి అర్హత ఉందని నేననుకోను. శ్రీదాభోళ్కర్, నానాసాహెబ్ చాందోర్కర్, మహల్సాపతి, హరిసీతారాం దీక్షిత్ మొదలైనవారు బాబాకు ప్రథమశ్రేణి భక్తులు. వీరందరూ ఎవరికి వారు సమర్థులు, సచ్ఛీలురు. మహల్సాపతి సాధు స్వభావుడు, విధేయుడు మరియు దైవభక్తి కలవాడు. అతనికి విద్య, నాగరికత రెండూ లేవు. కటిక దారిద్ర్యంలోనూ అతను పవిత్రంగా జీవనం గడిపేవాడు. బాబా అతనిని అలాగే ఉంచారు. దీక్షిత్ బాబాకు విధేయత చూపుతూ, వారిపై అచంచల విశ్వాసం కలిగి ఉండేవాడు. ఆధ్యాత్మిక విషయాలలో అతను ప్రారంభదశలో ఉన్నాడు. అతని ఆధ్యాత్మిక ప్రగతికోసం ఏకనాథ భాగవతాన్ని పారాయణ చేయమని బాబా ఆదేశించారు. నానాసాహెబ్ చాందోర్కర్‌కు సంస్కృతం తెలుసు. అతను భగవద్గీతను అధ్యయనం చేస్తుండేవాడు.

నేను 1911లో పదవీ విరమణ చేసి, బాబా వద్దకు వెళ్ళాను. దీక్షిత్ ఆదేశానుసారం బాబాకు పాదపూజ చేయబోయాను. కానీ బాబా వారించారు. *“నీవు పూజించనవసరం లేదు. దక్షిణ ఇచ్చావు. అది చాలు!”* అన్నారు.

నేను బాలక్‌రాంను ప్రశ్నించడం, బాబా కోప్పడడం, నన్ను జ్ఞానేశ్వరి పారాయణ చేయమని ఆదేశించడం మొదలైన విషయాలన్నీ శ్రీదాభోళ్కర్ రచించిన “శ్రీసాయి సచ్చరిత్ర”లో ప్రస్తావించబడి ఉన్నాయి.

బాబా ఒకసారి దక్షిణ రూపంలో, ఒకటి తరువాత ఒకటిగా నాలుగు బంగారు నాణాలను నా వద్ద నుండి తీసుకున్నారు. తరువాత *“నేను తీసుకున్నది ఒక్కటే!”* అన్నారు.

నేను : బాబా నేను నాలుగు ఇచ్చాను

*బాబా : నేను కాదనలేదు. నీవు నాలుగు ఇచ్చినా నాకు అందింది ఒక్కటే!*

నేను : నాకు అర్థం కాలేదు

*బాబా : నీకు అర్థమవుతుందిలే!*

తరువాత నేనొక రోజు రైలులో ప్రయాణిస్తున్నప్పుడు ఒక యువ ఫకీరు నా బోగీలోనికి వచ్చి నన్ను భిక్ష అడిగాడు. నేనతనికి ఒక పైసా ఇచ్చాను. అతను తనకు నాలుగు కావాలని చెప్పాడు. నేనతనికి నాలుగణాల నాణెం ఇచ్చాను. అతను తనకు "ఒక్కటే" ఇచ్చినట్లు చెప్పి వెళ్ళిపోయాడు. మరొకసారి నాకొక వృద్ధ సన్యాసి తటస్థపడి తనకేదైనా ఇవ్వమన్నాడు. నేనతడికి ఒక నాణెం ఇచ్చాను. కానీ అతను "నాలుగు" కావాలన్నాడు.

ఇలా బాబా వివిధ రూపాలలో వచ్చి నాకు వారి మాటలలోని అంతరార్థం బోధించడానికి ప్రయత్నిస్తున్నట్లు అవగతమైంది. నేను వారికి మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అను నాలుగింటిని ఇచ్చినా వారు తీసుకొనేది ఒక్కటే, అది ఆత్మ లేక జీవుడు అన్న విషయం క్రమంగా అర్థమయింది.

నేను ఒక హఠయోగి వద్ద ఆసనాలు నేర్చుకోడానికి ప్రయత్నించాను. కానీ బాబా నా కలలో కనిపించి వారించారు. నేను మానేయడానికి ఒప్పుకున్నాను. తరువాత వారు సుఖాసనంలో ఎలా కూర్చోవాలో నేర్పారు.

చాందోర్కర్ వేదాంతాన్ని బాగా చదివినవాడు. అతను భగవద్గీతను వ్యాఖ్యాసహితంగా పఠించి ఉన్నందున, దానిలో తనకున్న పాండిత్యానికి ఎంతో గర్వపడేవాడు. బాబాకు వీటన్నింటి గురించిగానీ, సంస్కృతమును గురించిగానీ ఏమీ తెలియదనే భ్రమలో ఉండేవాడు. ఒకరోజు బాబా ఒక చిన్న సంఘటన ద్వారా అతనిలోని అహంకారాన్ని అణిచివేసారు. ఆ రోజుల్లో బాబా వద్ద జనసందోహం అంతగా ఉండేది కాదు. నానా వంటి సన్నిహిత భక్తులకు మసీదులో బాబాను ఏకాంతంగా కలుసుకొని మాట్లాడే అవకాశముండేది. ఒకరోజు నానా బాబా చెంత కూర్చొని ఉన్నాడు.

*బాబా : నానా, ఏమిటి నీలో నీవే ఏదో గొణుక్కుంటున్నావు?*

నానా : నేను ఒక సంస్కృత శ్లోకాన్ని వల్లిస్తున్నాను

*బాబా : ఏ శ్లోకాన్ని?*

నానా : భగవద్గీతలోనిది

బాబా : పెద్దగా చెప్పు

(అప్పుడు నానా, భగవద్గీత 4వ అధ్యాయంలో 34వ శ్లోకాన్ని ఇలా వల్లించాడు.)

నానా : తద్విద్ధి ప్రణిపాతేనా, పరిప్రశ్నేన సేవయా।

ఉపదేక్ష్యంతి తే జ్ఞానం, జ్ఞానిన స్తత్వదర్శినః ॥

బాబా : *నానా, నీకది అర్థమయిందా?*

నానా : అయింది

బాబా : *నీకు అర్థమైతే, నాకు చెప్పు*

నానా : దాని తాత్పర్యమిది. గురువుకు సాష్టాంగ నమస్కారం చేసి, ప్రశ్నించి, సేవించి తద్వారా ఈ జ్ఞానమంటే ఏమిటో తెలుసుకో. అప్పుడు నిజమైన జ్ఞానాన్ని (బ్రహ్మాన్ని) పొందిన జ్ఞానులు నీకు జ్ఞానాన్ని ఉపదేశిస్తారు

బాబా : *నానా, నాకు శ్లోకం యొక్క తాత్పర్యం అక్కరలేదు. శ్లోకంలోని ప్రతిపదానికి ఉన్న అర్థాన్ని వ్యాకరణ సహితంగా వివరించు*

నానా ప్రతి పదము యొక్క అర్థాన్ని వివరించాడు.

బాబా : *నానా, గురువుకు కేవలం సాష్టాంగ నమస్కారం చేస్తే చాలునా?*

నానా : ప్రణిపాత అనే పదానికి "సాష్టాంగ నమస్కారం" అనే అర్థంగాక మరో అర్థం నాకు తెలియదు

బాబా : *పరిప్రశ్న అంటే ఏమిటి?*

నానా : ప్రశ్నించడం

బాబా : *ప్రశ్న అంటే?*

నానా : అదే! ప్రశ్నించడం!

బాబా : *ప్రశ్న - పరిప్రశ్న, రెండింటికీ ఒకే అర్థం వచ్చినట్లైతే, వ్యాసుడు ప్రశ్నకు ముందు "పరి" అనే పదాన్ని ఎందుకు వాడాడు, వ్యాసుడు ఏమైనా తెలివితక్కువవాడా?*

నానా : పరిప్రశ్న అన్న పదానికి నాకు మరో అర్థమేదీ తెలియదు

బాబా : *సేవ అంటే ఏ విధమైన సేవ?*

నానా : మేము ఎప్పుడూ చేస్తున్నటువంటిదే!

బాబా : *ఈ రకమైన సేవ చేస్తే చాలునా?*

నానా : సేవకు మరో అర్థము ఏదైనా ఉందేమో నాకు తెలియదు

బాబా : *తరువాత వరుసలో "ఉపదేక్ష్యంతి తే జ్ఞానం" అనే పదసముదాయంలో, జ్ఞానానికి బదులు, మరే పదమైన ఉపయోగించవచ్చునా?*

నానా : ఉపయోగించవచ్చు

బాబా : *ఏమిటా పదం?*

నానా : అజ్ఞానం

బాబా : *జ్ఞానానికి బదులు అజ్ఞానం అనే పదం ఉపయోగిస్తే, ఈ శ్లోకములో వేరే అర్థమేమైనా వస్తుందా?*

నానా : లేదు. శంకరభాష్యంలో అటువంటి పదప్రయోగం ఏదీ చేయబడలేదు

బాబా : *అతను చేయకపోయినా ఫరవాలేదు. జ్ఞానానికి బదులు అజ్ఞానం అనే పదాన్ని ఉపయోగిస్తే మరింత మేలైన అర్థం వచ్చేటట్లయితే, ఆ పదం వాడేందుకు అభ్యంతరం ఏమైనా ఉంటుందా?*

నానా : లేదు. కానీ ఆ శ్లోకంలో అజ్ఞానం అనే పదాన్ని ఉపయోగించడం ఎలాగో నాకు అర్థం కావడం లేదు

బాబా : *కృష్ణుడు అర్జునుడిని, తత్త్వదర్శినులకు, జ్ఞానులకు సాష్టాంగపడమని, ప్రశ్నించమని, సేవ చేయమని ఎందుకు చెప్పాడు? కృష్ణుడు స్వయంగా తత్త్వదర్శి కాడా? వారు నిజానికి జ్ఞానస్వరూపులే కదా!*

నానా : అవును కృష్ణుడు జ్ఞానస్వరూపుడే కానీ, ఇతర జ్ఞానులను సేవించమని వారు ఎందుకు సూచించారో నాకు తెలియడం లేదు

బాబా : *నీకది అర్థం కాలేదా?*

అని అడగగానే, నానాకు తలకొట్టేసినట్లయింది. అతని అహంకారం పటాపంచలైంది. తరువాత బాబా అతనికిలా వివరించసాగారు.

*"1) జ్ఞానుల ముందు కేవలం సాష్టాంగ పడటమొక్కటే చాలదు. సద్గురువుకు సర్వస్య శరణాగతి చెందాలి.*

*2) ఊరకే ప్రశ్నించడం చాలదు. నిజమైన ఆసక్తితో, ఆధ్యాత్మిక ఉన్నతిని, మోక్ష సాధనను దృష్టిలో పెట్టుకొని ప్రశ్నించాలి. దురుద్దేశ్యముతోగానీ, దుర్బుద్ధితోగానీ, గురువును ఇరికించడానికిగానీ, వారి తప్పులెంచడానికిగానీ, కాలక్షేపానికిగానీ ప్రశ్నించకూడదు.*

*3) సేవ అంటే ఇష్టమున్నప్పుడు చేసేది, లేనప్పుడు మానేది కాదు. ఈ శరీరానికి యజమాని తను కాదని, ఇది గురువుకు చెందినదేనని, కేవలం గురువును సేవించుటకొరకే ఈ శరీరమున్నదని భావించాలి.*

*ఈ విధంగా చేస్తే, శ్లోకంలో చెప్పినట్లు సద్గురువు జ్ఞానాన్ని బోధిస్తారు" అని బాబా చెప్పారు.*

కానీ గురువు అజ్ఞానాన్ని బోధించడమంటే ఏమిటో నానాకు అర్థం కాలేదు.

*బాబా : జ్ఞానాన్ని ఉపదేశించడం ఎలా? అజ్ఞానాన్ని నిర్మూలించడమే జ్ఞానం*

జ్ఞానేశ్వరి, 18వ అధ్యాయం, 87వ శ్లోకంలో ఇలా ఉంది:

"ఓ అర్జునా! అజ్ఞాన నిర్మూలన ఈ విధంగా ఉంటుంది. కల, నిద్ర అదృశ్యమైతే నీవు నీవుగా మిగులుతావు!" అలాగే అజ్ఞానం తొలగిపోతే జ్ఞానం మిగులుతుంది. భగవద్గీత 16వ శ్లోకం గురించి జ్ఞానేశ్వరి 83వ పద్యంలో ఇలా ఉంది. అజ్ఞానాన్ని నశింపజేయడమే జ్ఞానమని కాక జ్ఞానానికి ప్రత్యేక నిర్వచనమేదైనా ఉందా? చీకటిని పారద్రోలడమే వెలుగు. ద్వైతాన్ని నశింపజేయడమే అద్వైతం! ద్వైతాన్ని నశింప చేయడం గురించి మాట్లాడేటప్పుడు అద్వైతాన్ని గురించి, చీకటిని పారద్రోలటం గురించి మాట్లాడేటప్పుడు వెలుతురు గురించి ప్రస్తావిస్తాము. అద్వైతమును పొందాలంటే, ద్వైత భావమును మనలో నుంచి తీసివేయాలి. అదే అద్వైత స్థితిని పొందడం. ద్వైతములోనే ఉండి అద్వైతమును గూర్చి ఎవరు మాట్లాడగలరు? ఎవరైనా ఆ స్థితిని పొందితే తప్ప ఆ వాస్తవాన్ని గ్రహించడం ఎలా సంభవం?

శిష్యుడు కూడా మూర్తీభవించిన జ్ఞానమే. సద్గురువు, శిష్యుని మధ్య ఉన్న భేదము- వారి మనోవైఖరి, సత్యాన్ని గ్రహించుట, అద్భుతమైన మానవాతీత శక్తి,

సాటిలేని సామర్థ్యము, దివ్యశక్తి సంపన్నత. సద్గురువు నిర్గుణుడు, సచ్చిదానందుడు. జగత్తును, మానవాళిని ఉద్ధరించుటకు మానవరూపం ధరించినవాడు. దానివలన వారి అసలైన నిర్గుణస్వభావము, అస్థిత్వము, దివ్యశక్తి, జ్ఞానము కొంచెము కూడా మార్పు చెందదు. శిష్యుడు కూడా అట్టి స్వరూపము కలవాడే. కానీ అతని అనేకజన్మల సంస్కారాల వల్ల కలిగిన అజ్ఞానము, తాను శుద్ధచైతన్యమనే సత్యాన్ని దృష్టికి రానీయకుండా కప్పివేస్తుంది.

భగవద్గీత ఐదవ అధ్యాయంలోని 15వ శ్లోకం:

"అజ్ఞానేనావృతం జ్ఞానం, తేన ముహ్యన్తి జన్తవః" లో చెప్పినట్లుగా నేను సామాన్య జీవుడను, దీనుడను, అల్పుడను అని శిష్యుడు అనుకుంటాడు.

గురువు ఈ అజ్ఞానమనే మూలాలను నిర్మూలించి, ఉపదేశము ఇవ్వాలి. లెక్కలేనన్ని జన్మల నుండి సంపాదించిన అజ్ఞానమును గురువు నిర్మూలించి ఉపదేశించవలెను. ఎన్ని జన్మలెత్తినా శిష్యునిలో ఆ భావాలు చెక్కుచెదరకుండా ఉంటాయి. తాను అల్పుడను అని అనుకొంటున్న శిష్యునికి గురువు అనేక జన్మల నుండి "నీవు దైవానివి, శక్తిమంతుడవు, సంపన్నుడవు" అని బోధించగా, తాను నిజంగా దైవమన్న సత్యాన్ని కొద్ది కొద్దిగా గ్రహిస్తాడు. తాను శరీరమని, తానొక జీవినని లేక అహంకారమని, దైవము, జగత్తు తన నుండి భిన్నమన్న ఆలోచన ఎన్నో జన్మల నుండి నిరంతరంగా కొనసాగుతున్న ఒక భ్రమ. దీనిపై ఆధారపడి చేసిన కర్మల ఫలితంగా అతను సుఖాన్ని, దుఃఖాన్ని లేదా ఈ రెంటియొక్క మిశ్రమాన్ని అనుభవిస్తున్నాడు. ఈ భ్రమను, తప్పిదాన్ని, అజ్ఞానపు మూలాలను నిర్మూలించేందుకై అతను విచారణను ఆరంభించాలి. ఈ అజ్ఞానము ఎట్లు మొదలైంది? అది ఎక్కడ ఉన్నది? అన్న విషయాన్ని చూపించడాన్ని గురూపదేశం అంటారు. ఈ క్రింద చెప్పబడినవి అజ్ఞాన లక్షణాలు:

1) నేను జీవుడను.

2) ఈ శరీరమే నేను.

3) దేవుడు, జగత్తు, జీవుడు వేర్వేరు.

4) నేను దేవుడిని కాను.

5) శరీరము, ఆత్మ ఒకటి కాదని తెలియకపోవడం.

6) దేవుడు, జీవుడు, జగత్తు ఒకటేనని తెలియకపోవడం.

ఈ తప్పులను శిష్యుని దృష్టికి తెస్తేగానీ, దేవుడు, జీవుడు, జగత్తు అంటే ఏమిటో, వాటి మధ్య ఉన్న సంబంధము ఏమిటో, అవి ఒకదాని నుండి ఒకటి వేరైనవా లేక అవన్నీ ఒకటేనా అన్న విషయాన్ని తెలుసుకోలేడు. ఈ విషయాలన్నీ బోధించి, అతని అజ్ఞానాన్ని నిర్మూలించడానికి చేసే బోధ, జ్ఞానాన్ని బోధించడమా? అజ్ఞానాన్ని బోధించడమా? జ్ఞానమూర్తి అయిన శిష్యునకు జ్ఞానాన్ని ఎందుకు బోధించాలి? ఉపదేశము శిష్యుడి తప్పులను చూపి, అతని అజ్ఞానాన్ని నిర్మూలించుట కొరకే.

బాబా ఇంకా ఇలా చెప్పారు -

1. ప్రణిపాతమంటేనే శరణాగతి చెందుట 2. తను (శరీరము), మన (మనస్సు), ధనము (ఐశ్వర్యము)- వీటన్నింటినీ సమర్పించుటే శరణాగతి. 3. శ్రీకృష్ణుడు అర్జునుడిని ఇతర జ్ఞానులను ఆశ్రయించమని ఎందుకు చెప్పాడు?

సద్భక్తునికి సర్వమూ వాసుదేవమయమే! (B.G.VII,19) భక్తుడు ఏ గురువునైనా శ్రీకృష్ణునిగానూ, గురువు శిష్యుని వాసుదేవునిగానూ భావిస్తారు. శ్రీకృష్ణుడు వారిద్దరినీ తన ప్రాణము, ఆత్మలుగానూ భావిస్తాడు (B.G.XII.7). అటువంటి గురువులు, శిష్యులు ఉన్నారని శ్రీకృష్ణునికి తెలియబట్టే, వారిని గూర్చి అర్జునుడికి చెప్పాడు. అట్టివారి గొప్పతనము అందరికీ తెలియాలని శ్రీకృష్ణుడు ఆ విధంగా చెప్పాడు.

**దేవ్‌గారు 13.12.1936న చెప్పిన విషయాలు:**

ఏసుక్రీస్తు వలె బాబా కూడా కుష్ఠురోగం, గ్రుడ్డితనం, చెముడు, పక్షవాతం మొదలైన రోగాలను నయంచేశారు. దయ్యాలు, క్షుద్రశక్తులు, మంత్రప్రయోగాల బారి నుండి కాపాడారు. పతితులను పావనులుగా మార్చారు. దుర్మార్గులను సన్మార్గులుగా చేశారు. ఆ వివరాలన్నీ నాకు స్పష్టంగా తెలుసు. దుర్గుణాల పట్ల బాబా ఆగ్రహించిన సంఘటనలు చాలా ఉన్నాయి. నాకున్న లోభగుణాన్ని, ధనవ్యామోహాన్ని ఎలా నివారించారో వివరిస్తాను.

నా సర్వీసు కాలం ముగిసిన తరువాత నా ఉద్యోగాన్ని మూడునెలల పాటు పొడిగించారు. ఆ మూడు నెలలు కూడా ముగిసిన తరువాత మరో సంవత్సరం

సర్వీసులో ఉండాలని ఆశపడ్డాను. నా సర్వీసు మరో సంవత్సరం పొడిగించమని అభ్యర్థించాను. కలెక్టరు నా అభ్యర్థనను పరిశీలనకు పంపారు. అందరూ చర్చించిన మీదట, నా సర్వీసు ఒక సంవత్సరం పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు. ఆ సమయంలో నాకొక కల వచ్చింది. కలలో బాబా ఇంకొకరితో కూర్చొని ఉన్నారు. నేను బాబాకు సాష్టాంగ నమస్కారం చేశాను.

*బాబా : ఈ పుస్తకాలేమిటో నీకు తెలుసా?*

నేను : తెలియదు

*బాబా : ఇవి నీ ఖాతా పుస్తకాలు. వీటిని నేను పరిశీలిస్తున్నాను*

నేను : నా ఖాతా పుస్తకాలా?

*బాబా : అవును. ఇక్కడ చూడు. 17 తరువాత 16 వస్తుందా లేక 16 తరువాత 17 వస్తుందా?*

నేను : 16 తరువాతే 17 వస్తుంది

*బాబా : మరి నీ ఖాతాలో 17 తరువాత 16 ఎలా వచ్చింది?*


నేను : అదెలా జరిగింది బాబా?

*బాబా : చూడు. నీ ఖాతా ఇదిగో!*

అంటూ తెరిచిన పుస్తకాన్ని నావైపు విసిరారు. నేను దానిని పరీక్షించాను. అది నా ఖాతా పుస్తకమే! "అవును బాబా, నా ఖాతాలో 17 తర్వాతే 16 వచ్చింది. ఇదెలా జరిగింది?" అని అడిగాను. తరువాత నేను ఆ కలయొక్క అంతరార్థాన్ని గురించి ఆలోచించాను. అది నాకు బోధపడింది.



డా. పిళ్ళే



శ్యామరావ్ జయకర్

63

## సెప్టెంబరు 18వ తేదీ, 1936

**శ్రీశ్యామరావ్ జయకర్,** చిత్రకారుడు, వయస్సు 70 సం॥లు, విల్లేపార్లే.

నేను 1916-17 ప్రాంతంలో శిరిడీ వెళ్ళాను. అక్కడ నేను కొందరితో కలిసి నివసించేవాడిని. వాళ్ళు శిరిడీ విడిచి వెళ్ళిపోయిన తరువాత కూడా నేను అక్కడే ఉన్నాను. నేను ఇతరులతో కలిసి ఉన్నప్పుడు నాకు డబ్బు బాగా వస్తుండేది. అప్పుడు బాబా నన్ను దక్షిణ అడిగేవారు. నేను సమర్పించేవాడిని. ఆ వ్యక్తులు వెళ్లిపోయిన తరువాత నా దగ్గర డబ్బులుండేవి కావు. అప్పుడు బాబా నన్ను దక్షిణ అడిగేవారు కాదు. నేను చెప్పకపోయినా వారికి నా పరిస్థితి తెలుసు.

నా 16వ యేట ఒక బ్రహ్మచారి నాకు శివమంత్రాన్ని ఉపదేశించాడు. ఆ తరువాత ఒక సన్యాసి దీనికి తోడుగా శక్తి మంత్రాన్ని ఉపదేశించాడు. నేను బాబా వద్దకు వెళ్ళేటప్పటికి ఈ మంత్రోపదేశాలన్నీ జరిగి ఉన్నాయి. బాబా ప్రతి ఒక్కరిని వారి వారి గురువులను పూజించుకొమ్మని, వారి గురువు ఉపదేశించిన మంత్రాలనే జపిస్తూ ఉండమని చెప్పేవారు (జో కరీత్ ఆలేఁ తోచ్ కరా). బాబా నైతిక విలువల గూర్చి మాత్రం బోధించేవారు. ఉదా: పవిత్రంగా ఉండమని, సత్యాన్నే పలకమని, అందరినీ సమాన దృష్టితో చూడమని చెప్పేవారు.

నాకు శిరిడీలో కొంతమంది వ్యక్తులు తెలుసు. రాధాకృష్ణ ఆయీ దగ్గరకు నేనెప్పుడూ వెళ్ళలేదు. వెళ్ళవలసిన అవసరం నాకు రాలేదు. నానావలీ నాకు తెలుసు. అతడొక ప్రమాదకరమైన వ్యక్తి. బాబా అతనితో సహవాసం చేయవద్దని నాతో చెప్పారు. మొదట నేను, డాక్టరు పిళ్ళే అతనితో సన్నిహితంగా ఉండేవాళ్ళం. ఒకసారి నానావలీ డాక్టర్ పిళ్ళేను కొట్టాడు. అప్పటి నుండి అతని సహవాసం మేము మానివేసాం. నానావలీ బాబాను పూజించేవాడు కాదు. కానీ వారిని మర్యాదపూర్వకంగా చూసేవాడు. దుశ్చేష్టలు మానమని నానావలీని బాబా హెచ్చరించేవారు. బాబా ఒక్కొక్కసారి అతడిని కొట్టేవారు కూడా!

నేను శిరిడీలో ఉన్న ఎనిమిది నెలలలో బాబా నోటిగుండా ఎన్నో సూక్తులు, ప్రవచనాలు విన్నాను. కానీ నాకు ఇప్పుడు అవేవీ జ్ఞాపకం లేవు. బాబా ఎప్పుడూ అద్వైతాన్ని గురించి ఎవరితోనూ చెప్పగా నేను వినలేదు. భక్తులు

చాలావరకు ఆరోగ్యము, ఐశ్వర్యము మొదలైన ప్రాపంచిక కోరికలను ఆశించి మాత్రమే బాబాను దర్శించేవారు. బాబా వారి కోరికలను నెరవేర్చేవారు.

బాబా కృపాదృష్టి ఎప్పుడూ నాపై ఉన్నందువల్ల నేను సంతృప్తిగా ఉన్నాను. నా ఇద్దరు కుమారులు మరణించినప్పటికీ బాబా నాకు ధైర్యాన్ని కలుగజేసారు. బాబా మన అవసరాలకు అనుగుణంగా డబ్బు కూడా ఇస్తున్నప్పటికీ డబ్బును మాత్రమే ఆశించి వారి దగ్గరకు వెళ్ళకూడదు. బాబా, తమ మసీదు గోడలన్నీ బంగారంతో చేసినవనీ, ప్రజలు ఇక్కడికి వచ్చి ఈ సంపదనంతా బండ్లలో నింపుకొని తీసుకువెళ్ళాలని కోరుకునేవారు. కానీ అలా తీసుకుపోయేవారు ఎవరూ లేరని వాపోయేవారు.

**17.10.1936నాడు చెప్పిన విషయాలు:**

రావుబహద్దుర్ ఎం.వి. ప్రధాన్ నిలువెత్తు బాబా తైలవర్ణచిత్రాన్ని గీయమని నన్ను కోరాడు. అందుకని నేను బాబాను స్వయంగా చూడడానికి మొదటిసారిగా శిరిడీ వెళ్ళాను. మసీదుకు వెళ్ళి బాబాను పరిశీలించి చూసాను. వారూ నన్నలాగే చూసారు. బాబా తైలవర్ణ చిత్రం వేయడానికి వారి అనుమతి కావాలి కనుక మాధవరావు దేశ్‌పాండే (షామా) బాబా వద్దకు వెళ్ళి వారి అంగీకారం కోరాడు. అప్పుడు బాబా ***"పేద ఫకీరునైన నాకు తైలవర్ణచిత్ర మెందుకు? షామా, నీవు నీ చిత్రాన్ని గీయించుకోరాదూ?"*** అన్నారు. కానీ చివరకు చిత్రం వేసేందుకు బాబా అనుమతినిచ్చారని షామా వచ్చి నాతో చెప్పాడు. ప్రధాన్ నన్ను ఒక చిత్రాన్ని గీయమన్నాడు. కానీ నేను మూడు చిత్రాలను గీసాను. ప్రధాన్ రెండు చిత్రపటాలను తీసుకొని, మూడవదానిని బాబా వద్దకు తెచ్చి, బాబా స్పర్శతో పవిత్రం చేయించి దీక్షిత్‌కు ఇచ్చాడు. ఆ చిత్రపటాన్ని దీక్షిత్ బంగళాలో ఉంచి ఈనాటికీ పూజించుకుంటున్నాడు.

తరువాత నేను బాబా పెద్ద చిత్రాన్ని మరొకటి కూడా గీసాను. చాలా సంవత్సరాలు దానిని ఉపయోగించకుండా ఉంచారు. ఇప్పుడది మసీదులో ఉంది. ఎంతోమంది భక్తులకు సాయిపట్ల భక్తి ప్రపత్తులు పెంపొందించుకొనేందుకు ఆ ఫోటో ఉపయోగపడుతోంది.

బాబా నాపై ఎంతో దయచూపేవారు. నేను బాబాతో పాటు ఇతర అన్ని విషయాలను నిర్లక్ష్యం చేసినందుకు ఎంతో సిగ్గుపడుతున్నాను. నేను ఒక

విచిత్రమైన స్వభావం కలవాడిని. ఏ పనినీ సక్రమంగా చేసేవాడిని కాదు. బాబాకు ఈ విషయం బాగా తెలుసు. ఒకసారి నేను చిన్న వెండిపాదుకలను చేయించి బాబా దగ్గరికి తీసుకెళ్ళాను. ఆ పాదుకలను బాబా స్వహస్తాల మీదుగా తీసుకొని పూజించుకోవాలని నా కోరిక. బాబా నా చేతిలోని పాదుకలను, నన్ను చూసారు. వాటిని తమ చేతుల్లోనికి తీసుకున్నారు. కానీ వాటిని నాకు ఇచ్చేందుకు బదులు తమ చేతులు క్రిందకి వంచారు. ఆ పాదుకలు క్రిందికి జారి నేలపై పడిపోయాయి. నేను ఆ పాదుకలనే పూజించదలచి వాటిని తీసుకున్నాను. కానీ అదే రోజు సాయంత్రం మాసిన గుడ్డలతో పాటు నా జేబులో వెండి పాదుకలున్న చొక్కాను కూడా చాకలికి వేసాను. అవి తిరిగి నా దగ్గరకు రాలేదు. బాబాకు నా నిర్లక్ష్య స్వభావం తెలుసు. నేనెలాగూ వాటిని చేజార్చుకుంటానని ముందే తెలుసు గనుక వాటిని పూజించుకునేందుకు నా చేతికి ఇవ్వకుండా వారే చేజార్చి చూపించారు.

నేనొక సందర్భంలో సంతానం లేని ధనవంతురాలైన ఒక మహమ్మదీయ ఘోషాస్త్రీకి 4000 రూ॥లు అప్పుగా ఇచ్చాను. నాది ఎనిమిది మంది కొడుకులతో కూడిన పెద్ద కుటుంబం అయినందువలన డబ్బు వసూలు చేసుకోవడం తప్పనిసరైంది. కానీ ఆమె ఎంతకూ డబ్బు పంపలేదు. బాబా నాపై దయచూపి అప్పు వసూలు కావడంలో సహాయపడతారని తలచి నేను వారి దగ్గరకెళ్ళాను. బాబా ***"ఆ దరిద్రపు సొమ్ము మనకు వద్దులే! (ఆపల్యాలా తే హరామాచే౯ నకో)"*** అన్నారు. నా డబ్బులు తిరిగి రాలేదు. ఆ స్త్రీ తన సంపదనంతా పోగొట్టుకుందని రెండు మూడు సంవత్సరాల తరువాత నాకు తెలిసింది.

నేను బాబాను దర్శించినప్పటి నుండి ఎల్లప్పుడు వారి ఫోటోను నాతో ఉంచుకొనేవాడిని. నేను ఎక్కడికి వెళ్ళినా, ఎక్కడ నివసించినా బాబా ఎప్పుడూ నావెంటే ఉండి నన్ను, నా కుటుంబాన్ని అసాధారణరీతిలో కాపాడుతూ ఉండేవారు. కొన్ని సంఘటనలను ఉదహరిస్తాను.

1916లో మేము, ముగాబత్‌లోని (బొంబాయి) గజాననన్‌రావు ఇంట్లో నివసిస్తున్నాము. ఇంటిలోని ఒక గదిలో బాబా ఫోటో ఉండేది. ఒక రాత్రి రెండు గంటల సమయంలో దొంగలు మా ఇంటిలోనికి ప్రవేశించదలచి, బాబా ఫోటో ఉన్న గదిలోని కిటికీ ఊచల్లో రెండు వంచి తీసేయగలిగారు. ఇక ఆ సందుగుండా లోనికి ప్రవేశించి ఇల్లంతా దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆ ఇంటి వేరొక భాగంలోని

వరండాలో ఒక మంగలి నిద్రిస్తున్నాడు. అతనికి ప్రతిదినం వేకువఝామున 4గం॥కు లేచి ఇంటి చుట్టూ తిరిగి వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకునే అలవాటుంది. ఆ రోజు అతను ఎందుకో ఆశ్చర్యకరంగా 2గం॥లకే మేల్కొని ఇంటి వెనుకకు వచ్చాడు. అతన్ని చూసి దొంగలు పరుగందుకున్నారు. అతను ఆ దొంగలను చూసి 'దొంగలు, దొంగలు!' అని పెద్దగా అరిచేసరికి మేమందరము లేచాము. దొంగలు ఇంటిలోనికి దూరకుండా సరైన సమయానికే మమ్మల్ని నిద్రలేపి, మా ఇల్లు దోచుకొనబడకుండా బాబానే మమ్మల్ని రక్షించారని మేమందరము నిర్ధారించుకున్నాము.

1917లో మేము పూనాలో శిథిలావస్థలో నున్న ఒక ఇంటిలో నివసించేవాళ్ళము. శిథిలమైన పైకప్పు నుండి అప్పుడప్పుడు పెళ్ళలు రాలుతుండేవి. దీనిని నివారించడానికి కప్పు క్రింది వైపు గుడ్డను అంటించిపెట్టాము. ఆ ఇంటిలోని ఒక గదిలో బాబా ఫోటో ముందు కిరోసిన్ లాంతరు వెలుగుతోంది. దీపానికి కొంచెం దూరంలో సంవత్సరం వయస్సున్న నా బిడ్డ నిద్రిస్తోంది. అర్ధరాత్రి సమయంలో "డబ్" మనే పెద్ద శబ్దం వచ్చి, మాకు మెలకువ వచ్చింది. ఏం జరిగిందోనని వెళ్ళి చూస్తే, శిథిలమైన గోడల తాలూకు ఇటుకరాళ్ళు, గుడ్డపై పడి, గుడ్డతో పాటు క్రిందపడి ఉన్నాయి. నిజానికి ఆ కప్పు క్రిందంతా గుడ్డ ఉండి రాళ్ళతోపాటు పడినందున, బాబా ఫోటో మీద కాకపోయినా బిడ్డమీదగానీ, లాంతరు మీదగానీ పడి ఉండాలి. కానీ బాబా సంకల్పం మరోలా ఉంది. ఆ గుడ్డ చిత్రంగా బిడ్డకు, దీపానికి అడుగు దూరంలో పడింది. బిడ్డపై పడివుంటే బిడ్డ నలిగిపోయి ఉండేది. దీపంపై పడినా మంట అంటుకొని అగ్ని ప్రమాదానికి దారితీసేది. ఈ విధంగా బాబా మమ్మల్ని కాపాడారు.

1917లో మేము శిరిడీ వెళ్ళి అక్కడ 10 నెలలపాటు నివసించాము. అప్పుడు మేము బాలాభావ్ (శారదాబాయి) ఇంట్లో ఉన్నాము. మేమున్న చిన్న వాటాలో ఒక మూల కలుగులో ఒక పాము ఉండడంతో మాకు భయంగా ఉండేది. ఒకరాత్రి ఆ కలుగులో నుండి పాము బయటికి రావడం నా కుమారుడు, మరికొందరు చూసి, దాన్ని చంపేసారు.

1923లో పది సంవత్సరాల వయస్సున్న నా కుమారుడు సురేంద్రకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. అతను అనారోగ్యంతో ఉండగా ఒకరోజు అకస్మాత్తుగా

కడుపులోని వాయువు నడుము నుండి ఛాతీభాగముకు, గుండెవైపుకు ఎగతన్ని తీవ్ర ఒత్తిడిని కలుగజేసింది. పిల్లవాడు ఎగిసిపడుతూ "కాపాడండి, కాపాడండి!" అని అరుస్తున్నాడు. టైఫాయిడ్ వల్ల అతను బాగా నీరసించిపోవడంతో నేను వాడిని ముట్టుకోవడానికి, గట్టిగా మర్దన చేయడానికి భయమేసి, వాడికెలాంటి సహాయం చేయలేక "బాబా" అని ఆర్తిగా అరిచాను. వెంటనే వాయువు ఒత్తిడి తగ్గిపోయింది.

ఆధ్యాత్మిక బోధ విషయంలో నేరుగా సలహాల రూపంలోను, దక్షిణల విషయంలో సంజ్ఞల రూపంలోను బాబా సహాయం నాకు అందేది. ఒకసారి బాబా నాతో ***"నీ వెంత నాటుతావో, అంతే ఫలితాన్ని పొందుతావు! (జైసే కరేల్ తైసా భోగేల్)"*** అని చెప్పారు. మరో సందర్భంలో, ***"మనం గురువును సేవించాలి! (గురూ సేవా కరావీ)"*** అన్నారు. బాబా నాకు ఏ మంత్రమూ ఉపదేశించలేదు. కానీ నేను అంతకుముందే నా 20వ సంవత్సరంలో ఒక గురువు నుండి ఉపదేశం పొంది, వారు నిర్దేశించిన 12 సంవత్సరాల కాలపరిమితి కన్నా ఎక్కువే ఆ మంత్రాన్ని జపించాను. నైతిక విలువల గురించి, ప్రవర్తన గురించి బాబా ఎక్కువగా బోధించేవారు. ఒకసారి భక్తులతో ***"ఏ విషయాన్నైనా మనమే స్వయంగా చూసి తెలుసుకోవాలి. ఇతరులను ప్రశ్నించి, వారి యొక్క అభిప్రాయాలు, అనుభవాలు సేకరించడంలో ప్రయోజనమేముంది? (ఆప్‌లా ఆపణ్ హోఉన్ పహానా త్యాలా విచారణాయాత్ కాయ్ అర్థ్ ఆహే)"*** అన్నారు. ఆ సమయంలో మాలో ఒకడు, ఇతరులను "సాయిబాబా సిద్ధుడా, అవతారపురుషుడా?" మొదలైన ప్రశ్నలు అడుగుతుండేవాడు. ఎవరికైనా బాబాను స్వయంగా దర్శించి, వారితో బంధమేర్పరచుకొని స్వయంగా తనంతట తనే నిర్ధారించుకునే అవకాశమున్నప్పుడు ఇతరుల భావాలను, అనుభవాలను తెలుసుకోవాలనుకోవడాన్ని బాబా నిరసించేవారు.

బాబాకు అతి విధేయుడుగా పేరుగాంచిన దీక్షిత్ గురించి కూడా బాబా ఒకసారి ఇలా వ్యాఖ్యానించారు. బాబా దీక్షిత్‌ను పిలిచి 30రూ॥లు దక్షిణ అడిగారు. దీక్షిత్ తన దగ్గర డబ్బు లేదని చెప్పాడు. బాబా ఆ డబ్బును బాపూసాహెబ్ జోగ్‌ను అడిగి తెమ్మన్నారు. దీక్షిత్ మసీదు ప్రాంగణం దాటకముందే బాబా అతనిని ఉద్దేశిస్తూ ***"నిలకడలేని మనిషి!"*** అన్నారు. ఆ సమయంలో దీక్షిత్ ప్రతివిషయంలోనూ బాబాను సంప్రదించి వారి సలహాల మేరకు నడచుకోవడానికి బదులు తన పాత అలవాటు ప్రకారం బాబాను గురించి విచారణలు జరుపుతూనే ఉన్నాడు. ఇదంతా

బాబా సమాధి చెందడానికి కొంతకాలం ముందు జరిగింది. తరువాత దీక్షిత్ వైఖరిలో నిస్సందేహంగా మార్పు వచ్చింది!

బాబా తమ అంతర్యామిత్వం ద్వారా కొన్ని నిదర్శనాలు ప్రసాదించి నా విశ్వాసం దృఢపడేట్లు చేశారు. ఒకసారి నేను వారిముందు కూర్చొని ఉన్నాను. నా జేబులో మూడు రూపాయలు మాత్రం ఉన్నాయి. ఇంటి ఖర్చులకు నా దగ్గర మిగిలివున్న డబ్బు అదే! అప్పుడు కాకాసాహెబ్ దీక్షిత్, నానాసాహెబ్ నిమోణ్కర్ కూడా బాబా చెంతనే ఉన్నారు. బాబా నాతో ***"మలా చార్ ద్యావే!"*** అన్నారు. వారు 'రుపయా' అన్నట్లుగా నాకు సందేహం వచ్చింది. బాబా నన్ను నాలుగురూపాయలు దక్షిణ అడుగుతున్నారని తలచి నా జేబులో ఉన్న మూడురూపాయలు తీసి వారి ముందుంచాను. దీక్షిత్, "నాలుగడిగితే మూడిస్తున్నావేంటి?" అన్నట్లు సందేహంగా నా ముఖం వైపు చూసాడు. బాబా వెంటనే ***"నాలుగెక్కడివి? ఉన్నవి మూడే!"*** అన్నారు. దీనిని బట్టి బాబాకు నా జేబులో ఉన్నవి మూడురూపాయలేనని తెలుసు. అంతేకాదు, నా పరిస్థితులన్నీ వారికి తెలుసునని గ్రహించాను. బాబా నాలుగు రూపాయలు అడగడంలోని ఉద్దేశ్యం, నేను విధికి తలవంచి డబ్బులేమి పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని ప్రసాదించడానికేనని నేను నమ్మాను. బాబాపై భారం వేసి అన్నీ బాబాయే చూసుకుంటారని అవసరమైనప్పుడు వారే మన పరిస్థితులను చక్కదిద్దుతారనే నమ్మకం మనకు కలిగితే మన దగ్గరున్న డబ్బంతా చివరిపైసాతో సహావారికి సంతోషంగా సమర్పించుకుంటాం!

ఒకసారి బాబా నా వద్ద చిల్లిగవ్వ కూడా లేకుండా చేసి, కుటుంబ అవసరాలను సైతం తీర్చలేని నిస్సహాయ స్థితిలో నన్ను నిలబెట్టిన మరో సంఘటన వివరిస్తాను. ఈ లీలలో బాబా సర్వాంతర్యామిత్వం వ్యక్తమవుతోంది. 1917 ఆషాఢంలో ఒక రోజు మసీదులో బాబా కూర్చున్న చోటుకు 20 అడుగుల దూరంలోనున్న సభా మంటపంలో కూర్చొని ఉన్నాను. వర్డే అను భక్తుడు బాబాతో మాట్లాడుతున్నాడు. అతను మసీదులో సత్యనారాయణ పూజ చేయడానికి అనుమతించమని బాబాను అర్థించాడు. బాబా అనుమతించారు. కానీ తన దగ్గర డబ్బేమీ లేదని వర్డే చెప్పాడు. అప్పుడు బాబా నావైపు చూపించి ***"వెళ్ళి, అతనినడుగు!"*** అన్నారు. వర్డే నా దగ్గరకొచ్చి సత్యనారాయణ పూజకు నా నుండి డబ్బులు తీసుకోమని బాబా ఆదేశించినట్లు చెప్పాడు. నాకు వర్డే బాబా భక్తునిగానే

తెలుసుగానీ, అతనితో పెద్దగా పరిచయం లేదు. కానీ అతను బాబా తనను పంపారని చెప్పడంతో నేను డబ్బివ్వడానికి అంగీకరించి, ఎంత కావల్సి ఉంటుందని అడిగాను. అతను 2 రూపాయల 5 అణాలవుతుందని బదులు చెప్పాడు. ఆశ్చర్యకరంగా నా జేబులో ఉన్న మొత్తం డబ్బంతా సరిగ్గా 2 రూపాయల 5 అణాలే! ఇలా నా దగ్గర ఉన్న డబ్బంతా అడగడం బాబా లీలగా భావించాను. వెంటనే ఆ డబ్బును వర్దేకిచ్చాను. వర్దే వెళ్ళి కావల్సిన పూజాసామగ్రిని కొని, ఏర్పాట్లన్నీ చేసుకున్నాడు. బాబాను సత్యనారాయణ మూర్తిగా భావించి, వారి రెండు వైపులా అరటి పిలకలను పెట్టి, పాలవెల్లి (మండపం) నిర్మించడానికి ప్రయత్నించాడు. కానీ బాబా ఆక్షేపణ తెలిపారు. అరటి పిలకల మధ్యలో ఎప్పుడూ పెట్టుకునే ఫోటోలను లేదా మూర్తులను పెట్టి, వాటినే పూజించమని ఆదేశించారు. కానీ వర్దే, మిగతా భక్తులు బాబాను సత్యనారాయణ మూర్తిగా ఉండమని పట్టుబట్టారు. చివరకు భక్తుల ఒత్తిడికి లొంగి బాబా అనుమతించారు.

సత్యనారాయణస్వామి కథాపఠనం క్రిందమంటపంలో మొదలైంది. నాకు సత్యనారాయణస్వామి కథ ఆలకించటం ఇష్టమే. నేను మసీదులో ఒకరిద్దరితో బాబా ప్రక్కనే కూర్చొని కథా శ్రవణం చేస్తున్నాను. వెంటనే నా మనస్సులో ఆందోళన మొదలై సంఘర్షణగా మారింది. ఒకవైపు సత్యనారాయణస్వామి కథ పారాయణ, మరోవైపు బాబా ప్రత్యక్ష సన్నిధి- ఈ రెండింటిలో దేనిపై ధ్యాస పెట్టాలో నిర్ణయించుకోలేకపోయాను. పైగా పారాయణ చేస్తున్న పూజారికన్నా ఎత్తులో కూర్చొని నేను కథ వినడం భావ్యం కాదు. దిగివెళ్ళడమా, లేక అక్కడే కూర్చొని వినడమా? ఈ సమస్యతో మథనపడుతున్నప్పుడు, బాబా నా ఆలోచన పసిగట్టి *"దిగివెళ్ళి, అక్కడ కూర్చో!"* అని ఆదేశించారు. వారు చూపిన స్థలం పూజారికి సమీపంలోను, తక్కువ ఎత్తులోను ఉంది. ఆ విధంగా నేను ఏదీ నిర్ణయించుకోలేనప్పుడు బాబా నాకు పరిష్కారం చూపారు.

అకారణంగా హింసింపబడే మూగజీవాల పట్ల బాబా ఎంతో కరుణ చూపుతారని, ఆ జీవులకు గల ప్రమాదకర రుగ్మతలను తమ అద్భుత శక్తితో నివారించి, వాటికి ఆశ్రయమిచ్చి, రక్షిస్తారని నిర్ధారించేందుకు ఈ సంఘటనే నిదర్శనం. నేనొక రోజు దీక్షిత్‌వాడా వరండాలో ఉన్నాను. అప్పుడొక చిన్న

తెల్ల కుక్కపిల్ల పెద్దకుక్కలను తరుముతుండడం చూసి ఆశ్చర్యపోయాను. చిన్నకుక్కపిల్లకు పిచ్చి పట్టిందని, అది కరుస్తుందని భయపడి పెద్దకుక్కలు పారిపోతున్నాయని స్పష్టంగా తెలుస్తోంది. కొందరు గ్రామస్థులు పిచ్చిపట్టిన కుక్కపిల్లను చంపాలని కర్రలతో దాని వెంటపడ్డారు. ఇదంతా జరుగుతుండగా నేను మసీదుకు వెళ్ళాను. ఆ కుక్కపిల్ల భయంతో పరిగెత్తి చివరికి మసీదులోనికి జొరబడి బాబా వెనుక దాగింది. బాబాను శరణుజొచ్చితే తనను వారు కాపాడగలరని, గ్రామస్థులు బాబా వద్ద తనను ఏమీ చేసే సాహసం చేయరని దానికి అనిపించినట్లుంది. దానిని తరుముతున్న గ్రామస్థులు దూరంగా నిలబడి కుక్కపిల్ల బయటికి వస్తే దానిని చంపాలని వేచి ఉన్నారు. నిస్సహాయమైన మూగజీవి పట్ల అమానుషంగా ప్రవర్తించినందుకు బాబా వారిని తీవ్రంగా తిట్టిపోసారు. కానీ అది పిచ్చిదని, దానిని తప్పకుండా చంపాలని వారు బదులు చెప్పారు. బాబా కోపంతో వాళ్ళని ఇంకా తీవ్రంగా తిట్టి అక్కడ నుండి వెళ్ళిపొమ్మని ఆదేశించారు. ఇది జరిగే సమయంలో నేను, డాక్టరు పిళ్ళే బాబా దగ్గరే కూర్చొని ఉన్నాము. ఆ పిచ్చి కుక్కవల్ల మాకేదైనా ప్రమాదం సంభవిస్తుందేమోనని మేము భయపడ్డాము. చివరికి గ్రామస్థులు వెళ్ళిపోవడంతో ఆ కుక్క రక్షింపబడింది. బాబా ఎంతో దయతో దాని పిచ్చి నయం చేసి, ప్రాణం కాపాడారని నేను పిళ్ళేతో చెప్పాను. నిజానికి ఆ కుక్కపిల్ల పరిస్థితి ఏమిటో, దాని జబ్బును ఎలా నివారించాలో, దానిని ఎలా రక్షించాలో బాబాకు మాత్రమే తెలుసు.

64

## అక్టోబరు 18వ తేదీ, 1936

**శ్రీబాలకృష్ణ వామన్ వైద్య,** c/o సి.కే.ప్రభు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి, (జి.ఐ.పి), వయస్సు 58సం॥లు, బాంద్రా.

నా మొదటి శిరిడీ యాత్ర 1910-11లో జరిగింది. నేను నా కుటుంబంతో సహా వెళ్ళి అక్కడ 4, 5 రోజులు గడిపాను. బాబా మమ్మల్నందరినీ ఎంతో దయతో ఆదరించి ఆశీస్సులిచ్చారు. శిరిడీ బయలుదేరకముందే వారి కృప ప్రకటమయ్యింది. నేను సెలవు మరియు పాసుల కోసం జి.ఐ.పి రైల్వే అధికారులకు అర్జీ పెట్టుకున్నాను. కానీ కొన్ని అర్జెంటు పనులు చేయవలసి ఉన్నందున నాకు సెలవు మంజూరవడానికి అవరోధమేర్పడింది. అయినప్పటికీ సాయిభక్తుడైన మా హెడ్‌గుమాస్తా పైఅధికారికి నా సెలవు అర్జీ పంపాడు. నాకు సెలవు మంజూరయింది. ప్రయాణంలో కూడా సాయి అనుగ్రహం మాకు లభించింది. మేము కోపర్‌గాం చేరేసరికి చీకటి పడింది. అప్పుడు కోపర్‌గాం నుండి శిరిడీ వెళ్లే మార్గంలో దోపిడీ దొంగల భయం ఎక్కువగా ఉండేది. అందువల్ల మేము మాట్లాడుకున్న టాంగావాడు మమ్మల్ని ఉదయం వరకు అక్కడే ఆగిపొమ్మని చెప్పాడు. కానీ బాబా మనకు తోడున్నారని, వారు మనకు ఏ ఆపదా కలుగనివ్వరని అతనికి చెప్పి బయలుదేరాము. అప్పుడు మరికొందరు ప్రయాణీకులు కూడా మా టాంగాతో పాటు వస్తామని చెప్పారు. ఆ విధంగా మాకు ఆ సమయంలో తోడు దొరికింది. దారిలో మాకు కొన్ని టాంగాలు శిరిడీ నుండి వస్తూ, కొన్ని శిరిడీ వెళుతూ కనిపించాయి. ఇలా దారిదోపిడి సంఘటనలేమీ జరగకుండా బాబా మాకు సహాయపడి మమ్మల్ని క్షేమంగా శిరిడీ చేర్చారు.

మేము శిరిడీలో దిగేటప్పటికి రాత్రి ఒంటిగంటయ్యింది. సాఠేవాడాలో బస చేశాము. మరుసటిరోజు సంకష్టచతుర్థి కావున ఉపవాసముండాలి. అందుకని ఈ రోజు నిరాహారంగా ఉండకుండా నాతోపాటు ఏదో కొంత ఫలహారం చేయమని బలవంతం చేసి నా కుటుంబ సభ్యుల చేత తినిపించాను. తరువాత మేము నిద్రపోయాము. మరుసటి ఉదయం బాబా నిద్ర మేల్కొని స్థానిక భక్తులతో *"రాత్రి నా బిడ్డలు వచ్చారు. మీరెవరూ వారిని ఆదరించలేదు. తినడానికి ఏమీ ఇవ్వకుండా ఉపవాసముండేట్లు చేశారు (మాఝీ లేకరే ఆలీ! త్యానా ఉపాశీ కోణీ పాహిలే*

*నాహీ! కాళజీ ఘేత్‌లా నాహీ! త్యానా ఉపాశీ ఠేవిలే)"* అని కోపంగా అరిచి వారిని అక్కడ నుండి తరిమివేసారు. (ఇది ఒక అర్థంలో సరియైనదే! ఉపవాసముండే రోజు భోజనం చేయకుండా ఫలహారం మాత్రం తీసుకుంటాము. రాత్రి మేము భోజనం చేయలేదు. ఫలహారం మాత్రం తీసుకున్నాం కాబట్టి ఉపవాసమున్నట్లే లెక్క). ఈ మాటల వల్ల బాబాకు మాపట్ల ఉన్న పితృవాత్సల్యం, మా బాగోగుల పట్ల బాబాకున్న శ్రద్ధ తెలిసింది. ఆ భక్తులు వచ్చి మాకు బాబా అన్న మాటలు చెప్పి, మేము రాత్రి ఫలహారం తీసుకున్న సంగతి బాబాకు తెలియజేయమని, మాకు ఆదరణ లభించిందని చెప్పమని అభ్యర్థించారు. తరువాత మేము మసీదుకెళ్ళి, బాబాను దర్శించినప్పుడు వారితో అలాగే చెప్పాము. బాబా నన్ను చూస్తూనే *"నీకు మంచి జరుగుతుంది! (తుఝే కల్యాణ్ హోఈల్)"* అని దీవించారు. మా కుటుంబ సభ్యులందరిని కూడా అలాగే ఆశీర్వదించారు.

తరువాత ఒకరోజు మేమున్న వాడాలో భోజనం తయారు చేసుకున్నాము. మధ్యాహ్నం బాబా మా బసకు వచ్చి (భాక్రీ భాజీ) భిక్ష అడిగారు. నా భార్య వెంటనే వారికి రొట్టె, కూర సమర్పించింది. మరొకరోజు ప్రత్యేకంగా బాబాకు నైవేద్యం తయారుచేసి సమర్పించాలని అనుకున్నాం. కానీ ఆ రోజు నైవేద్యం తయారుచేయడం ఆలస్యమయింది. ఈలోగా భక్తులందరూ నైవేద్యాలు మసీదుకు తీసుకెళ్ళి బాబా ముందుంచారు. బాబా మా నైవేద్యం కొరకు ఎదురుచూస్తూ భక్తులను వేచి ఉండమన్నారు. నేను నైవేద్యం తీసుకొని వెళ్ళిన వెంటనే దానిని తమకు దగ్గరగా ఉంచమని చెప్పి తరువాత మాకు ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

బాబాకు మా పట్ల ఉన్న కృప, ఆదరణను తెలుపుతాను. మేము బయలుదేరేటప్పుడు బాబా వద్దకెళ్ళి, నా కుటుంబంతో సహా నాశిక్ వెళ్ళడానికి అనుమతించమని వేడుకున్నాను. *"వెళ్ళు... నాశిక్ వెళ్ళు. అసలు నాశిక్‌కు వెళ్ళడమెందుకు? అక్కడ ప్లేగు వ్యాపించి ఉంది. వెళ్ళవద్దు. మీ పిల్లలను తీసుకొని మీరు వచ్చిన దారినే ఇంటికి తిరిగి వెళ్ళండి!"* అన్నారు.

నేను శిరిడీలో ఉన్న మూడు, నాలుగు రోజులలో ఒకరోజు మాధవరావు దేశ్‌పాండేతో మాట్లాడుతూ బాబా ఫోటోను బాబా చేతుల మీదుగా తీసుకొని ఇంట్లో పూజలో పెట్టుకోవాలనే కోరికను వ్యక్తపరచాను. ఆ ప్రక్కనే ఉన్న బాబా

వెంటనే నన్ను ఒక ఫోటోను తెచ్చుకోమని చెప్పి దానిని వారి చేతిస్పర్శతో పునీతం చేసి నాకు ఇచ్చారు. నేను ఆ ఫోటోను ఈనాటికీ నిత్యం పూజిస్తుంటాను. వారిని పూజించకుండా నేను భోజనం కూడా చేయను.

మా తిరుగు ప్రయాణమప్పుడు కూడా బాబా మాకు మార్గం చూపి మమ్మల్ని రక్షించారు. మేము వారి అనుమతికోసం వెళ్ళినప్పుడు *“మీరు ఇప్పుడు బయలుదేరడం మంచిది!”* అన్నారు. మేము వెంటనే టాంగా మాట్లాడుకొని బయలుదేరాము. మా టాంగా కోపర్‌గాం స్టేషను చేరేసరికి, మేమెక్కవలసిన రైలు ప్లాట్‌ఫారమ్ విడిచి వెళుతూ ఉంది. అలా రైలు తప్పిపోవడం మంచి శకునంగా అనిపించలేదు. మేము ఆ రాత్రి కొన్ని గంటలు స్టేషనులోనే గడిపి మరుసటి ఉదయం మన్మాడ్ రైలు ఎక్కాము. అప్పుడు తెలిసిన విషయమేమంటే ముందు సాయంత్రం బొంబాయి వెళ్ళేందుకు మేము ఎక్కవలసిన రైలు ప్రమాదానికి గురి అయ్యిందనీ, ఫలితంగా ఒక బోగీ నుజ్జు నుజ్జు అయిందని! బాబా నిరంతరం తమ బిడ్డలపై చూపే కరుణాదృష్టి వలన మేము ఆ ఆపద నుండి రక్షింపబడ్డాము.

మేము శిరిడీలో ఉన్నప్పుడు ఒక విచిత్ర సంఘటన జరిగింది. బాబా భక్తుడు ఒకతను నా దగ్గరికి వచ్చి “నాకు కొంత డబ్బివ్వండి, మీకు చందనం ఇస్తాను” అన్నాడు. అలా అడగడం నాకు కోపం తెప్పించి, ఇవ్వనన్నాను. అతను తిరిగి వెళుతుండగా ఎందుకో నేను మనస్సు మార్చుకొని వెనక్కి పిలిచి “నీకు కొన్ని నాణాలు ఇస్తాను, చందనం ఇవ్వు!” అన్నాను. కానీ అతను నిరాకరించి బాబా నుండి తనకలాంటి ఆదేశాలు లేవన్నాడు. వెంటనే నేను బాబా దగ్గరకెళ్ళి జరిగిన విషయమంతా చెప్పాను. వారు విని *“సరే!”* అన్నారు.

నేను 1912లో రెండవసారి శిరిడీ వెళ్ళాను. ఈసారి నేను నా కుటుంబ సభ్యులతో కాక ఇద్దరు ఆఫీసు స్నేహితులతోటి వెళ్ళాను. నాకు కలిగిన దురదృష్ట సంఘటనలు ఇతర బాధలు, విపత్తుల గురించి బాబాకు విన్నవించుకోవాలని తలచాను. కానీ వారు నేను చెప్పదలచిన విషయాన్నంతా ముందే గ్రహించినట్లు, నన్ను చూసిన వెంటనే *“నిశ్చింతగా ఉండు, భయపడకు!”* అన్నారు. వారి కృప, అండదండలు ఉన్నంతవరకు నేను దేనికీ భయపడనని వారికి బదులు చెప్పాను. మేము ఆఫీసుకు ఒక్కరోజు మాత్రమే సెలవుపెట్టి వచ్చాము. అందువల్ల తిరిగి

వెళ్ళడానికి అనుమతి ఇవ్వవలసిందిగా బాబాను ప్రార్థించాను. కానీ వారు నాకు అనుమతి ఇవ్వలేదు. బాబా నాకు ఏ ఆపదా రాకుండా చూసుకుంటారు అని తెలుసు కాబట్టి నేను శిరిడీలోనే ఉంటానని నా స్నేహితులతో చెప్పాను. అనుమతి లేకుండా ఆఫీసుకు హాజరుకాకపోతే ఉద్యోగం ఊడుతుందని నా స్నేహితులు భయపడ్డారు. కానీ నేను ఉండిపోవడం చూసి, బాబా మీద భారం వేసి వారు కూడా నాతోనే ఉండిపోయారు. బాబా రెండు మూడు రోజులు మమ్మల్ని శిరిడీలోనే ఉంచి తరువాత వెళ్ళడానికి అనుమతించారు. మేము తిరిగి వెళ్ళి, సెలవు పొడిగింపు అర్జీ పెట్టాము. బాబా దయవల్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా మా సెలవు మంజూరైంది.

నేను శిరిడీకి రెండుసార్లు మాత్రమే వెళ్ళాను. 1916లో నా నివాసం బాంద్రాకు మార్చాను. 1917-18 ప్రాంతంలో మేము నివసిస్తున్న ఇంటి వరండాలోనికి ఒక సాధువు వచ్చి ఒక పైసా అడిగాడు. నా కుమారుడు అతనికి పైసా ఇచ్చాడు. కానీ, సాధువు రూపం భిన్నంగా ఉన్నా వాడికెందుకో సాయిబాబానే వచ్చారనిపించి, "మీరెవరో నాకు తెలుసు!" అన్నాడు. వారు "శ్రీసాయిబాబా ఆహేం గాగేయకరూం నవనేం!" అన్నారు. ఈ మాటలు విన్న వెంటనే నేను వరండాలోనికి వచ్చి వారి పాదాలకు నమస్కరించాను. తరువాత ఇంటి లోనికి రమ్మని ఆహ్వానించాను. వారు లోనికి వచ్చారు. నేను తిరిగి పాదాభివందనం చేశాను. ఆ సాధువు ***"నీకు తృప్తిగా ఉందా?"*** అనడిగారు. నేను ఉందని చెప్పాను. తరువాత వారు 'శీదా వస్తువులు' (గోధుమపిండి మొ॥) అడిగారు. నేను సమర్పించాను. ***"నేనెప్పుడూ నీతోనే ఉన్నాను. నీవు శిరిడీ రావలసిన అవసరం లేదు!"*** అని చెప్పి ఆశీర్వదించి వెళ్ళిపోయారు. ఇది 1917-18 ప్రాంతంలో జరిగింది! ఆ తరువాత నేనెప్పుడూ శిరిడీ వెళ్ళలేదు.

ఇన్ని సంవత్సరాలలో మాకెన్నో దురదృష్టకర సంఘటనలు, సమస్యలు వచ్చాయి. కానీ బాబా నా వెంటే ఉండి వాటిని ధైర్యంగానూ, సంతోషంగానూ ఎదుర్కొని, పరిష్కరించుకొనే శక్తిని ప్రసాదించారు.

## 65

## డిసెంబరు 1వ తేదీ, 1936

**శ్రీరామ్‌గిరి బువా,** (బాబా పిలిచేపేరు - బాబూగిర్), సదా (శిరిడీ నుండి 4 మైళ్ళు)కు, చెందిన గంగగిర్ భక్తుడు, వయస్సు 76సం॥లు, శిరిడీ.

నేను చిన్నప్పుడు శిరిడీలోని పాఠశాలలో చదువుకున్నాను. నేను ఇప్పుడున్న ఇంటిలోనే (మా ముత్తవ్వగారి ఇల్లు) మొదటి నుండి నివసిస్తున్నాను. సాయిబాబా మొదట శిరిడీ వచ్చినప్పుడు నేను విద్యార్థిని. అప్పుడు బాబాతో పాటు ధూప్‌ఖేడాకు చెందిన ఒక పటేల్ కూడా వచ్చాడు. ఆ పటేల్ శిరిడీకి చెందిన అమీన్ భాయి కుమారుడు హమీద్‌కు పెళ్ళి సంబంధం కుదిర్చేందుకు వచ్చాడు. అప్పుడు బాబా 25-30 ఏండ్ల వయస్సున్నట్లు కనిపించారు. బాబా అమీన్‌భాయి ఇంట్లో అతిథిగా కొన్నిరోజులుండి తిరిగి పటేల్‌తో వెళ్ళిపోయారు. రెండు నెలల తరువాత బాబా ఒంటరిగా శిరిడీ వచ్చారు. అప్పటి నుండి శిరిడీనే శాశ్వత నివాసంగా చేసుకున్నారు.

ధూప్‌ఖేడా పటేల్ తప్పిపోయిన తన గుఱ్ఱం కనపడేందుకు బాబా ఏ విధంగా సహాయపడింది చెబుతూ ఉండేవాడు. ఆ విషయం నేను స్వయంగా విన్నాను. అతను తప్పిపోయిన తన గుఱ్ఱం కోసం వెతుకుతున్నప్పుడు సాయిబాబాను చూసాడు. బాబా అతనిని దేనికోసం వెతుకుతున్నావని అడిగారు. తప్పిపోయిన గుఱ్ఱం కోసమని అతను చెప్పాడు. అప్పుడు బాబా *"నీ గుఱ్ఱం అక్కడ సెలయేటి ప్రక్కన ఉంది చూడు!"* అంటూ ఒకవైపు చూపించారు. పటేల్ వెళ్ళి చూస్తే అక్కడ తన గుఱ్ఱం కనిపించింది. పటేల్ బాబాను చూసినప్పుడు వారి ముందు ధుని వెలుగుతూ కనిపించింది. (గుఱ్ఱం ఎక్కడున్నదీ చెప్పడం తప్ప, ఆ సందర్భంలో బాబా మరే అద్భుతాలు చేసినట్లు రామ్‌గిరి బువాకు గుర్తులేవు)

బాబా శిరిడీ వచ్చినప్పుడు వారికి నడుము క్రింద వరకు పెరిగిన పొడవైన జుట్టు ఉండేది. ఆకుపచ్చని కఫ్నీ ధరించి ఉండేవారు. జుట్టును అంటిపెట్టుకొని ఉండే సన్నని టోపి, దానిపై మరో కాషాయరంగు టోపీ ధరించేవారు. చిలిమ్, అగ్గిపెట్టె ఉండేవి. భిక్షాటన చేసి జీవించేవారు. మసీదు ప్రక్కనున్న ఇంట్లో నివసిస్తుండిన

యమునాబాయి అత్తగారు (నారాయణ తేలి భార్య) బాబాకు ప్రతిదినం సగం రొట్టె ఇస్తూ ఉండేది. అప్పుడు బాబా రోగులకు మందులిస్తూ ఉండేవారు.

మొయిద్దీన్ భాయ్ అల్లుడు ఒక మాంత్రికుడు. అతను బేలాపూర్‌లో నివసిస్తూ ఉండేవాడు. అతడొకసారి శిరిడీ వచ్చాడు. ఏదో విషయంపై బాబా, అతను తగాదాపడ్డారు. తరువాత బాబా శిరిడీ విడిచి ఒకటి రెండు మైళ్ళ దూరంలో నున్న అడవుల్లో నివసించసాగారు. అక్కడ బాబా తరచూ పస్తులుండేవారు. ఎవరైనా వారి దగ్గరకు వెళితే వారిని కొట్టేవారు.

వంజార్‌గాంకు చెందిన గంగగిర్ బువా శిరిడీ వచ్చారు. వారు నీంగాంకు చెందిన నానాసాహెబ్ డేంగ్లేకు, మరికొందరు గ్రామస్థులకు బాబాను గురించి గొప్పగా చెబుతూ బాబాను 'చింతామణి'గా అభివర్ణించారు. అప్పుడు బాబా ఒక తుమ్మచెట్టు క్రింద కూర్చొని ఉండగా, నానాసాహెబ్ డేంగ్లే వెళ్ళి వారికి నమస్కరించాడు. ఆ తరువాత కొన్ని రోజులకు బాబా శిరిడీ తిరిగి వచ్చి వేపచెట్టు క్రింద ఉండసాగారు. ఆ వేపచెట్టు క్రింద ఒక సమాధి ఉందని బాబా స్వయంగా చెప్పారు. అక్కడ 4-5 సంవత్సరాలు ఉండిన తరువాత బాబా మసీదుకు వెళ్ళి దానినే తమ నివాసంగా చేసుకున్నారు. వారు అక్కడే 50 సంవత్సరాలు నివసించారు.

బాబా ఎప్పుడూ కుస్తీ పట్టలేదు. కానీ గంగగిర్ మొదట మల్లయోధుడు. ఆయన దొండల్‌గాం పటేల్‌తో కుస్తీపట్టి, ఓడిపోయి, రెండవ స్థానంలో నిలిచారు. అప్పటి నుండి ఆయన కుస్తీ పట్టడం మానుకొని సాధువుగా మారారు. ఈ సంఘటన దాదాపుగా బాబా మొదటసారి శిరిడీ వచ్చిన రోజుల్లో జరిగింది. బాబా, గంగగిర్‌లు ఒకరినొకరు గుర్తించారు.

నేను నా జీవిత పర్యంతం దేశసంచారిగా గడిపాను. కానీ అప్పుడప్పుడు శిరిడీకి తిరిగి వస్తుండేవాడిని. అందువల్ల బాబాను గురించి నాకు తెలిసిన విషయాలుగాక, ఇతరుల నుండి విన్నవి కూడా నేను నిర్ధారించుకున్న తరువాతే మీకు చెబుతున్నాను. బాబాను గురించి కొన్ని అసాధారణమైన సంఘటనలు నాకు తెలుసు. ఒకసారి బాబా కళ్ళు వాచి బాగా ఎర్రబడ్డాయి. వారు మిరియాలను మెత్తగా నూరి ఆ మిరియాలకట్టుని కనురెప్పలపైన పట్టించారు. ఆ వ్యాధి తగ్గిపోయింది.

మరోసారి ఒక ముస్లిం బాలుడు మసీదు వెనుకనున్న వేపచెట్టు ఎక్కి, కాలు జారి క్రిందపడి మరణించాడు. ఆ క్షణమే మసీదులో ఉన్న బాబా దుఃఖంతో అరుస్తూ, *"ముల్లా జోర్ మారీల్!"* అని పలికి తమ చేతులను శంఖం వలె మడిచి ఊదారు. మసీదులోనికి వేపచెట్టు కనిపించదు. బాబా పైమాటలంటున్నప్పుడే బాలుడు క్రిందపడి, మరణించాడు. అప్పుడు నేను బాబాకు కొంచెం దూరంలో కూర్చొని ఉండడంతో వారి మాటలు విని వెంటనే నేను వెళ్ళి పడిపోయిన బాలుణ్ణి, చుట్టూ మూగి ఉన్న జనాన్ని చూసాను.

గ్రామంలో గడ్డివామి తగలబడిన విషయం కూడా నాకు తెలుసు. బాబా భాగ్‌చంద్ మార్వాడీతో *"గడ్డివామి తగలబడిపోతుంది. పరుగున వెళ్ళు!"* అన్నారు. అతను వెళ్ళి చూస్తే, అతని గడ్డివామి తగలబడుతోంది. బాబా అక్కడికి వచ్చి ఏవో సంజ్ఞలు చేశారు. మంటలు ఆరిపోయాయి.

ఒకరోజు బాబా నన్ను పిలిచి ఒక ఊదీపొట్లం, ఆరతి పాట ఉన్న కాగితం ఇచ్చి, జామ్నేరు (రోడ్డు మార్గంలో బుషావల్ స్టేషనుకు 36 కి.మీ దూరంలో ఉంది) వెళ్ళి, అక్కడ డిప్యూటీ కలెక్టరుగా ఉన్న నానాసాహెబ్ చాందోర్కర్‌కు ఇచ్చిరమ్మన్నారు. నేనప్పుడు ఖాందేష్ వెళ్ళవలసిన పని ఉంది. బాబాతో నా దగ్గర రెండు రూపాయలు మాత్రమే ఉన్నాయని, అవి కోపర్‌గాం నుండి జలగాం వరకు రైలు టికెట్టుకు, అక్కడ నుండి ముప్పై మైళ్ళ దూరంలో నున్న జామ్నేరుకు టాంగా ఖర్చుకు ఎలా సరిపోతాయని అడిగాను. బాబా *"భగవంతుడే సమకూరుస్తాడు!"* అన్నారు. ఆ రోజు శుక్రవారం. నేను వెంటనే రైలులో బయలుదేరి రాత్రి 7.30గం॥కు మన్మాడుకు, వేకువఝామున 2.45గం॥కు జలగాంకు చేరాను. అప్పుడు ప్లేగు నిబంధనలు అమలులో ఉన్నందువల్ల నేను చాలా ఇబ్బంది పడవలసి వచ్చింది. జామ్నేరు ఎలా వెళ్ళాలో తోచక సతమతమవుతున్నాను. 3.00గం॥ల సమయంలో బూటు, టోపీ, మంచి దుస్తులు ధరించి ఉన్న ఒక బంట్రోతు నా దగ్గరికి వచ్చి నన్ను టాంగాలో ఎక్కించుకొని తీసుకువెళ్ళాడు. నేను భయపడ్డాను. దారిలో భగూర్ దగ్గర ఫలహారం చేశాము. తెల్లవారుతుండగా జామ్నేరుకు చేరాము. నేను కాలకృత్యం కొరకు టాంగా దిగి తిరిగి వచ్చేసరికి టాంగా మరియు టాంగా నడిపే అతను అంతర్ధానమయ్యారు.

## 66

## డిసెంబరు 1వ తేదీ, 1936

**శ్రీఎస్.ఎ. పాటంకర్,** సినిమా కళాకారుడు, వయస్సు 42సం॥లు, కాయస్థప్రభు, దాదర్, బొంబాయి.

నా స్నేహితుడు సామంత్ మొదటిసారిగా సాయిబాబాను గురించి చెప్పాడు. వారి గొప్పతనం, సచ్ఛీలత తెలుసుకొని మా ఇంట్లో ఒక గోడకు వారి ఫోటో తగిలించుకొని పూజించడం మొదలుపెట్టాను. ఒకసారి నా బిడ్డ చాలారోజులు జ్వరంతో బాధపడింది. అప్పుడు ఒకరాత్రి 2-3 గం॥ల సమయంలో ఒక ఫకీరు నా బిడ్డ శరీరాన్ని నిమరడం చూసాను. వారిని సమీపించి, నేను రెండు చేతులు జోడించి వారికి నమస్కరించాను. ఆయన తమ చేతులతో దగ్గరికి రావద్దని సైగ చేసి "బిడ్డకు నయమౌతుంది!" అని చెప్పారు.

మరోసారి నా ఇద్దరు బిడ్డలు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరికి రోజుల తరబడి జ్వర తీవ్రత తగ్గకుండా ఉంది. నేను బాబా ఫోటోను చూస్తూ, బిడ్డను కాపాడమని ఆర్తిగా ప్రార్థించాను. తరువాత థర్మామీటరు తీసుకెళ్ళి బాబా ఫోటోపై ఉంచి "బాబా, మీరు మా బాగోగులు చూస్తున్నది నిజమే అయితే ఈ బిడ్డలెందుకు ఇలా అస్వస్థతకు గురి అయ్యారు? నేనిప్పుడు ఈ థర్మామీటరుతో బిడ్డ జ్వరాన్ని పరీక్షిస్తాను. జ్వరం తగ్గివుంటే మీపై నాకు నమ్మకం ఉంటుంది. అప్పుడు నేను బిడ్డను తీసుకొని రామనవమికి మీ చెంతకు వస్తాను. జ్వరం తగ్గకుంటే మిమ్మల్ని ఎలా విశ్వసించేది?" అని వారితో చెప్పుకొని థర్మామీటరుని ఫోటో దగ్గర నుండి తీసి దానితో బిడ్డ జ్వరాన్ని పరీక్షించాను. బిడ్డ జ్వరం తగ్గిపోయి నార్మలుకు వచ్చివుండడం చూసి నేనెంత ఆశ్చర్యపోయి ఉంటానో మీరు ఊహించవచ్చు.

## 67

## డిసెంబరు ౬వ తేదీ, ౧౯౩౬

**శ్రీరఘూజీ గణ్‌పత్ శిండే పాటిల్,** రిటైర్డ్ రెవెన్యూ పటేల్ మరియు భూస్వామి, వయస్సు 65సం॥లు, శిరిడీ.

బాబా శిరిడీ వచ్చినప్పుడు మహమ్మదీయుడైన అమన్ భాయి ఆతిథ్యమిచ్చాడు. అమన్ భాయి అప్పుడప్పుడు మా మావ్‌సి ఇంటికి వస్తుండేవాడు. మావ్‌సి కుమారుడైన గణపతి హరి కానడే కుష్ఠురోగం మరియు జ్వరంతో బాధపడుతూండేవాడు. అతని వయసు 35 సంవత్సరాలు. ఒక మహాత్ముడు తన ఇంటికి వచ్చారని, వారు తప్పక ఆమె కొడుకు రోగాన్ని నయం చేయగలరని ఆమన్ భాయి మావ్‌సికి చెప్పాడు. బాబా వచ్చి అతనిని పరీక్షించారు. అతనికివ్వవలసిన మందు నాగుపాము విషంతో తయారు చేయాలి. బాబా గణపతితో ధైర్యంగా ఒక నాగుపామును పట్టమని, నాగుపాము కుష్ఠురోగుల్ని కాటేయదని చెప్పారు. గణపతి నాగుపాముని పట్టుకున్నాడు. అది అతనిని కాటేయలేదు. బాబా ఆ పాము విషంతో మందును తయారుచేసి గణపతికి ఇచ్చారు. గణపతి ఆ మందును కొన్నిరోజులు వాడిన తరువాత రోగం తగ్గుముఖం పట్టింది. కానీ ఆ మందు వాడేటప్పుడు లైంగిక సుఖాలకు దూరంగా ఉండాలన్న నిబంధనలను గణపతి పాటించలేదు. దాంతో బాబా చికిత్స ఆపేసారు. అందువల్ల వ్యాధి ముదిరి అతను చనిపోయాడు.

నా తమ్ముడు భాగోజీ జ్వరతీవ్రతతో బాధపడుతూ ఉండేవాడు. పరిస్థితి చేజారిపోయి చావు తప్పదనుకున్న సమయంలో బాబా ఈ ఇంటికే వచ్చి వాడికి చికిత్స చేశారు. బాబా అతడికి మందు ఇచ్చి తరువాత ఇనుపకమ్మీని ఎర్రగా కాల్చి, రెండు కణతలపైన, వీపుపైన వాతలు పెట్టారు. దీనితో అతడి జ్వరం నయమైపోయింది. కానీ భాగోజీకి కుష్ఠురోగం ఉంది. బాబా దీనిని నయం చేయలేదు కానీ వ్యాధి వృద్ధి చెందకుండా నిలిపివేసారు. భాగోజీ బాబాకు సపర్యలు చేసేవాడు. నేను కూడా బాబాకు సేవ చేసేవాడిని.

శిరిడీలో ముఠా కక్షలు ఎక్కువగా ఉండేవి. నేనొక వర్గంలో ఉండేవాడిని. ముఠాల మధ్య ఈర్ష్యా ద్వేషాలు ప్రబలివుండేవి. కానీ బాబా వీటిని పట్టించుకునేవారు కాదు. అన్ని ముఠాలవారు బాబాను ఇష్టపడేవారు. ఒకసారి బిర్‌జీచంద్ భార్యను


నగ్నంగా చేసి తీసుకుని వచ్చి అవమానపరిచారు. నాపై, మరికొందరిపై కోపర్‌గాం మేజిస్ట్రేటైన అప్పాసాహెబ్ వద్ద కేసు నమోదు చేయబడింది. కేసు విచారణ జరుగుతున్నప్పుడు ఒకరోజు హరిసీతారాం దీక్షిత్, నన్ను విడుదల కాకుండా చూడమని బాబాను అర్థించాడట! అప్పుడు బాబా ***"లేదు, అలా చెయ్యడం కుదరదు. అలా చేయడానికి నేనెవరిని?"*** అన్నారట.

ఆ విచారణలో మాలో ఒక్కరిని తప్ప మిగిలిన వారందరినీ దోషులుగా తీర్మానించి నాలుగు నెలల కారాగార శిక్ష విధించారు. మమ్మల్ని కోపర్‌గాం నుండి అహ్మద్‌నగర్ జైలుకు తరలించారు. నేను విడుదల అవడం కోసం బాబాను ఆర్తిగా ప్రార్థించాను. మూడవరోజు బాబా నా కలలో కన్పించి ***"భయపడకు. మిమ్మల్నందరినీ నేను విడిపిస్తాను"*** అన్నారు. నేను నిద్రలో ఏడుస్తూ ఉండగా చూసిన జైలు సిపాయి నన్ను తట్టి లేపాడు. మరునాటి ఉదయం ధుమాళ్ వచ్చి అప్పీలు చేసి మమ్మల్ని అందరినీ విడుదల చేయించాడు. ఈ విచారణ నిమిత్తం నేను నా గేదెను ఒకదానిని అమ్మి 70 రూపాయలు ఇచ్చాను.

ఒకసారి నేను వంటచెఱకు కోసం పచ్చిమొద్దును నరుకుతున్నాను. అప్పుడు బాబా నన్ను ఆపి, పచ్చని చెట్లను నరకకూడదని, ఎండిపోయిన మోడులనే నరకాలని నాకు చెప్పారు. అప్పటి నుండి నేనాపని మానివేసాను.



శ్రీమతి బయజాబాయి



సగుణ్‌మేరు నాయక్

68

## డిసెంబరు 7వ తేదీ, 1936

**సగుణ్‌మేరు నాయక్,** టీ అంగడి, వయస్సు 47సం॥లు, మరాఠా, శిరిడీ.

నేను పూనా తాలూకాలోని బోరీమర్మగోవా గ్రామానికి చెందినవాడను. అక్కడ నేను పశువులు మేపుతూ ఉండేవాడిని. తరువాత బెల్గాంలో నివసిస్తూ వివిధ ప్రాంతాలకు వెళ్ళి వస్తూవుండేవాడిని. నరసోబావాడిలో తేంబే మహరాజ్ వద్ద రెండు సంవత్సరాలు గడిపాను. ఆ తరువాత అజున్‌కర్ మహరాజ్ వద్ద కొన్నిరోజులు గడిపి గాణ్గాపూర్ కూడా దర్శించాను. తరువాత అస్వస్థతకు గురై హుబ్లీకి చెందిన సిద్ధారూఢ్ మహరాజ్ వద్ద ఉన్నాను. ఆ తరువాత బయలుదేరి రామేశ్వరము, పండరిపురం మొదలైన క్షేత్రాలు దర్శించి, 1911-12లో ఇక్కడికి (శిరిడీ) వచ్చాను. బాబా నన్ను చూసి, నేను సిద్ధారూఢ్ మహరాజ్ దర్బారు నుండి వచ్చిన విషయాన్ని సూచిస్తూ *"నీవొక గొప్ప దర్బారు నుండి వచ్చావు!"* అన్నారు. నేను శిరిడీ వచ్చిన ఐదు నెలల తరువాత, తిరిగి వెళ్ళడానికి బాబా అనుమతి కోరినప్పుడు *"ఏదో ఒకటి చేసుకుంటూ ఇక్కడే ఉండు. భగవంతుడు నిన్ను అనుగ్రహిస్తాడు!"* అన్నారు. నేను బాబా మాట ప్రకారం శిరిడీనే నా శాశ్వత నివాసంగా చేసుకున్నాను. అప్పటి నుండి నేను టీ - ఫలహారముల అంగడి నడుపుతూ దాంతోపాటు బాబా ఫోటోలు, ఆరతి పుస్తకాలు, పూజా ద్రవ్యాలు మొ॥నవి అమ్ముతూ జీవనం సాగిస్తున్నాను. బాబా కృపవలన నేను అభివృద్ధి చెందుతూ వచ్చాను. నాకు ఏ ఆపదా రాకుండా కాపాడుతూ ఉండమని బాబాను అర్థించాను, వారు అలాగే కాపాడతానన్నారు. నేను మసీదులో దీపాలకు నూనె పోయడం వంటి చిన్న చిన్న పనులు చేస్తూ ఉండేవాడిని!

నేను 1911-12లో శిరిడీ వచ్చినప్పుడు, బాబా అద్భుత శక్తులను గూర్చి చాలా ఋజువులు దొరికాయి. హైదరాబాదుకు చెందిన ఒక వైశ్యషావుకారు బాబా భక్తుడు. అతను బాబాను దర్శించడానికి శిరిడీ బయలుదేరాడు. నేను కూడా అతనితో కలసి శిరిడీ వచ్చాను. షావుకారు, పక్షవాతంతో రెండు కాళ్ళు చచ్చుబడిపోయిన తన కుమార్తెను కూడా వెంటబెట్టుకొని వచ్చాడు. ఆమె నడవలేక చేతుల సాయంతో చిన్నగా గెంతుతూ కదిలేది. మొదట ఆమెను బాబా దగ్గరికి మోసుకొని వెళ్ళారు.

మూడవరోజుకు ఆమె కాళ్ళను కొంచెం కదిలించగలిగింది. ఎనిమిదవ రోజుకు స్వతంత్రంగా నడవగలిగింది. ఆమెకు నయమవడం ఒక అద్భుతం. బాబా అనుగ్రహానికి నిదర్శనం! బాబా నయం చేసిన మరో పక్షవాతపు దృష్టాంతం, రైల్వేలో పని చేస్తుండిన శ్రీగెయిసాస్‌కు సంబంధించినది. అతని భార్యకు పక్షవాతం ఉంది. శిరిడీకి వచ్చిన కొద్ది రోజులలో ఆమె పక్షవాతం నయమైంది!

1914లో బాబా నా కలలో కన్పించి ***"నాకు మెత్తగా ఉడికించిన అన్నం తీసుకొనిరా!"*** అన్నారు. నేనలాగే రెండు సంవత్సరాలపాటు బాబాకు నెయ్యి కలపని అన్నం సమర్పించేవాడిని. తరువాత అన్నంలో కొంచెం నెయ్యి కలపమని బాబా ఆదేశించారు. అప్పటి నుండి ఈ రోజువరకు బాబాకు నెయ్యి కలిపిన అన్నాన్ని నివేదిస్తూ ఉన్నాను. ఈ నేతి అన్నాన్ని మసీదుకు తీసుకెళ్లి ముందు కొంత ధునిలో అగ్నికి అర్పించి, మరికొంత బాబా కోసం కుండ (కొలంబ) లో ఉంచి మిగిలినది కుక్కలకు వేసేవాడిని. బాబాను దర్శించడానికి అసంఖ్యాకమైన భక్తులు శిరిడీ వస్తున్న రోజులలో వారి సౌకర్యం కోసం ఐదారు సంవత్సరాలు భోజన హోటలు నడిపాను. వంటకు, వడ్డనకు బ్రాహ్మణులను నియమించాను. బాబా మహాసమాధి తరువాత జనం రావడం తగ్గిపోవడంతో అక్టోబరు 1919లో దానిని మూసివేసాను.

ఉపాసనీ మహరాజ్ నాకు తెలుసు. అతను నేను రావడానికి కొంచెం ముందుగా శిరిడీకి వచ్చాడు. నేను వచ్చిన తరువాత దీక్షిత్ వాడాలో ఉండేవాడు. ఐదారు నెలలు అతని భోజన ఖర్చులన్నీ దీక్షిత్ భరించేవాడు. అప్పుడు శ్రీఖాపర్డే కూడా శిరిడీలోనే ఉన్నాడు. ఒకరోజు మాధవరావు దేశ్‌పాండే, దీక్షిత్ తరపున ఉపాసనీతో తగాదాపడ్డాడు. ఈ తగవు తరువాత ఉపాసనీ తన మకాంను ఖండోబా ఆలయానికి మార్చాడు.

1912వ సంవత్సరం మధ్యలో బాబా పాలరాతి పాదుకలు, సాఠేవాడాలో ఉన్న బాబాకు ప్రియమైన వేపచెట్టు క్రింద ప్రతిష్ఠించబడ్డాయి. ఈ ఆలోచన అగరుబత్తి వ్యాపారి అయిన భాయిఆలీబాగ్‌కర్‌కు వచ్చింది! కానీ అతను పేదవాడు. అందువల్ల ఈ ఖర్చులన్నీ బొంబాయికి చెందిన రామారావు కొఠారే అనునతడు భరించాడు. బాబా కూడా 25రూ॥ల చందా ఇచ్చారు. నాలుగు వేదాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, నలుగురు బ్రాహ్మణులను కోపర్‌గాం నుండి ఈ కార్యక్రమం కోసం

తీసుకువచ్చారు. స్థానికుల్లో బాలాసాహెబ్ భాటే, దాదాకేళ్కర్, బాపూసాహెబ్ జోగ్, ఉపాసనీ మహరాజ్ ఈ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ప్రముఖ పాత్ర వహించారు.

బాబా ప్రతిదినం పంచే ఆహారంపై ఆధారపడి వందలాదిమంది శిరిడీలో నివసిస్తూ ఉండేవారు. వారిలో మార్తాండ్ అనే ఒక పిచ్చి బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడొకరోజు వేపచెట్టు దగ్గరకెళ్ళి పెద్దబండతో ఒక పాదుకను రెండు ముక్కలుగా పగలగొట్టాడు. ఆ తరువాత పార్వతి - మహదేవుని ఆలయానికి వెళ్ళి అక్కడి విగ్రహాలను (తాత్యాకోతే పాటిల్ సూచన మేరకు ప్రతిష్ఠించబడిన) కూడా పగులగొట్టాడు. భక్తులు బాబా దగ్గరకు వెళ్ళి, పగులగొట్టిన పాదుక స్థానంలో మరొక పాదుక తయారు చేయించి ప్రతిష్ఠించమంటారా? అని అడిగారు. బాబా దానికి అంగీకరించక, అన్నశాంతి మాత్రం జరిపిస్తే చాలునని చెప్పారు. బాబా ఆదేశం మేరకు రెండు మూడు వందలమందికి అన్నదానం చేయబడింది. ఆ రోజులలో ప్రతిదినం రెండు వందల మందికి పైగా జనం భోజనం కోసం వేచి ఉండేవారు.

౬౨

## డిసెంబరు ౨వ తేదీ, ౧౯౩౬

**శ్రీలక్ష్మణ్ కచేశ్వర్ జాఖడె ఉరఫ్ నానుమామా ఉరఫ్ నానూభట్ పూజారి,** యజుర్వేది, బ్రాహ్మణుడు, వయస్సు 40 సం॥లు, శిరిడీ.

నేను ఎన్నో సంవత్సరాల నుండి బాబా పూజ, ఆరతి నిర్వహిస్తూ ఉన్నాను. బాబా భౌతికంగా ఉన్నప్పటి నుండే బాపూసాహెబ్ జోగ్‌కి సహాయకునిగా ఉంటూ బాబాను పూజించడం మొదలుపెట్టాను. నేను మొదట 1914లో శిరిడీ వచ్చాను. ఇక్కడ నా సోదరి భర్త బాపాజీ ఉండేవాడు. అప్పుడప్పుడు నేను శిరిడీ వచ్చి వారిని చూసి వెళుతూ ఉండేవాడిని. నేను సంగమనేరులో ఉండగా ఒకరాత్రి బాబా నా కలలో కన్పించి *"అబ్బాయీ, నిద్రపోతున్నావా? నీవు ఇక్కడ ఉండొద్దు. శిరిడీ వచ్చేయి. శిరిడీలో ఎంతో ఆనందం ఉన్నది!"* అన్నారు. మరుసటి ఉదయం బాపాజీ తండ్రి మా ఊరు వచ్చాడు. అతను నన్ను తనతో శిరిడీ రమ్మని, తనకు సహాయంగా ఉండమని ఆహ్వానించాడు. నేను శిరిడీ వెళ్ళి కొన్నిరోజులు అతనితో ఉన్నాను. నేను నా జీవనోపాధికి ఊరూరు తిరిగి భిక్ష చేసేవాడిని. మందిరంలో బాబా పూజకై బాపూసాహెబ్ జోగ్‌కు సహాయపడేవాడిని. ఇలా ఒకటి రెండు సంవత్సరాలు ఉచితంగా సేవ చేసిన తరువాత సాయిబాబా కమిటీవారు నన్ను శాశ్వత పూజారిగా నియమించారు.

# 70

## డిసెంబరు ౬వ తేదీ, ౧౯౩౬

**శ్రీలక్ష్మణ్ భట్ జోషి,** శిరిడీ.

నేను చిన్నప్పుడు బాబా దగ్గర ఉన్నప్పుడు ఆధ్యాత్మిక విషయాల గురించి ఆలోచించేవాడిని కాదు. అందువల్ల సాయిబాబా మాట్లాడిన మాటలు, ప్రవచనాలు ఏవీ మీకు చెప్పలేను. నేను, మాధవఫస్లే మసీదులో చిన్న చిన్న పనులు చేస్తూ ఉండేవాళ్ళం. రాధాకృష్ణ ఆయీ చెప్పిన పనులు కూడా చేసేవాళ్ళం. మేము చావడిలో బాబాతో పాటు నిద్రించేవాళ్ళం. ఎవ్వరూ బాబాతో ఉండేందుకు వీలులేని సమయాలలో కూడా మేము వారితోనే ఉండేవాళ్ళం. ***"భాయ్, కట్టెలను ఇటు తీసుకురా! ఆ తొట్టెతో నీళ్ళు తీసుకొనిరా!"*** అంటూ బాబా మాకు పనులు చెప్పేవారు. బాబాకు నిత్యం భక్తులు సమర్పించే తినుబండారాలను మాకు పంచిపెట్టేవారు. వాటితో మాకు ప్రతిదినము విందు భోజనమే! బుట్టలు, బుట్టలుగా పండ్లు వస్తూ ఉండేవి. అప్పుడప్పుడు వాటిలో కొన్ని మేము దొంగిలించేవాళ్ళం. ఒక్కొక్కసారి దొంగిలిస్తున్నప్పుడు బాబా మమ్మల్ని పట్టుకొని, ***"మరీ ఎక్కువగా తీసుకోకండిరా!"*** అని హాస్యధోరణిలో అనేవారు. తరచూ బాబా నన్ను తిట్టేవారు. ఒకటి రెండుసార్లు తమ చేత్తో కొట్టారు కూడా! అప్పుడప్పుడు వారు నాకోసం కబురుపెట్టడం కూడా జరిగేది.

రాత్రిళ్ళు చావడిలో ఉన్నప్పుడు బాబా ***"గణూ, తుకారాం పాటలు పాడు"*** అని అడిగేవారు. నాకు సంగీతం బాగా రాకపోయినా ఎలాగో పాడేవాడిని. బాబా పాటలలోని రాగాన్ని, భావాన్ని రెండింటినీ ఇష్టపడేవారు. అప్పుడప్పుడు మేము హాస్య ధోరణిలో కూడా మాట్లాడుకునేవాళ్ళం. బాబా ***"గణూ ఏమంటున్నాడురా!"*** అని అడిగేవారు. "రహమా నజరా కరో అబోమోరే సాయి" అని పాటను హాస్యయుక్తంగా పాడేవాడిని. ఒక్కొక్కసారి ఎవ్వరూ లేని సమయాలలో అర్ధరాత్రి దాటిన తరువాత బాబా పారవశ్యంతో కబీరు పాటలు పాడుతుండేవారు. ఆ పాటల వివరాలేమిటో నాకిప్పుడు గుర్తులేదు.

బాబా నివారించిన వ్యాధుల గురించి నేను చాలా వరకు మరచిపోయాను. కొన్ని మాత్రం గుర్తున్నాయి. దగ్డూబాయి కుష్ఠురోగం కొంతవరకు తగ్గించారు. తరువాత ఆ వ్యాధి వృద్ధికాకుండా నిలిపివేసారు. అంతేగానీ పూర్తిగా నయం చేయలేదు! కానీ బాబా సమాధి అనంతరం సుమారు 1922లో బొంబాయికి చెందిన డాక్టరు రాణేగారి భార్య (మరాఠీ మహిళ) యొక్క వ్యాధి నివారణ వివరాలు నాకు బాగా గుర్తున్నాయి.[1] ఆమె తన భర్తతో పాటు శిరిడీ వచ్చి నాలుగైదు నెలల పాటు ఒక్కొక్కసారి సంవత్సరం పాటు కూడా ఇక్కడ గడిపేది. ఆమె ప్రతిదినం బాబా అభిషేక తీర్థంతో స్నానం చేసి, శరీరంపై ఉన్న పుండ్లన్నింటిపై ఊదీ రాసేది. ఒక్కొక్కసారి బకెట్టు నిండా తీర్థాన్ని బొంబాయి తెప్పించుకునేది. రెండు సంవత్సరాల తరువాత ఆమె వ్యాధి పూర్తిగా నయమయింది. అంతకుముందు పప్పుగింజలంత పుండ్లు శరీరమంతా వ్యాపించి, శరీరం రంగు కూడా మారిపోయి ఉండేది. వ్యాధి నయమైన తరువాత శరీరపు రంగు పూర్వ స్థితికి వచ్చింది. తరువాత డాక్టర్ రాణే చాలా సంవత్సరాలు ఇక్కడకు రాలేదు.

10 సంవత్సరాల గుజరాతీ అమ్మాయికి క్షయవ్యాధి నివారణమైన విషయం కూడా నాకు తెలుసు. మొదట్లో అమ్మాయిని బాబా దగ్గరకి మోసుకొని పోవల్సివచ్చేది. కొన్నిరోజుల తరువాత ఆమె నడవగలిగింది. తరువాత ఆమె ఆరోగ్యం చాలావరకు మెరుగుపడింది. ఇది బాబా సశరీరులుగా ఉండగా జరిగిన సంఘటన.

గ్రుడ్డివారికి చూపు ప్రసాదించిన దృష్టాంతాలేమీ నాకు జ్ఞాపకం లేవు. అప్పుడు బాబాను దర్శించేందుకు వచ్చే భక్తులు అసంఖ్యాకంగా ఉండేవారు. భక్తులు వసతికోసం అవస్థలు పడేవారు. ఒక చిన్నగదికి నెలకు 4రూ॥ల చొప్పున చెల్లించేవారు. ఇప్పుడు పూర్తి ఇంటికి కూడా అంతమొత్తం చెల్లించరు. అంతటి జన సందోహంలో బాబా దగ్గరికి ఎవరెవరు వచ్చేది, వారి వివరాలు, వారు పొందిన

---

*1. ఈమెకు కుష్ఠువ్యాధి వచ్చి, శరీరమంతా వికృతంగా మారిపోయినట్లు పూజ్యశ్రీ బి.వి.యన్.స్వామి 'ముందుమాట'లో చెప్పారు.*

అనుభవాల గురించి నేను తెలుసుకోవాలనుకోలేదు. అకాల మరణాలను తప్పించిన దృష్టాంతాలు నాకు గుర్తులేవు.[2]

కొందరు తమ ఘనతను చాటుకోడానికి జరగని అనుభవాలను ఊహించి లేక జరిగిన అనుభవాలను ఎక్కువ చేసి చెబుతుంటారు. అలాంటివారు ఇక్కడ కూడా ఉన్నారు. వాటిని మనం లక్ష్యపెట్టకూడదు.

*2. కీర్తనకారుడైన విఠల్‌రావు ఇలా చెబుతున్నారు: ఇండోరుకు చెందిన ఎం.బి.రేగేను బాబా అనేకసార్లు శిరిడీలోనే ఉంచి, అతన్ని అకాలమరణం నుండి తప్పించినట్లు దాసగణుతో చెప్పాడు. రేగే తనకు నౌలా, బస్తి మొదలైన యోగాసనాలెన్నో తెలుసని, ఆయా ఆసనాలలో కూర్చొని ఎక్కువ సమయం ధ్యాన స్థితిలో ఉండగలనని, అలాంటి సమయాలలో తనకు బాబా సాక్షాత్కారం లభించిందని కూడ దాసగణుతో చెప్పాడు.*

71

## డిసెంబరు 13వ తేదీ, 1936

**శ్రీగణేష్ రఘునాథ్ తేలి,** గౌరవ మేజిస్ట్రేటు, బొంబాయి రోడ్డు, థానా.

నేను సాయిబాబాను దర్శించడానికి 1914-15లో శిరిడీ వెళ్ళాను. బాబా నన్ను *"ఒక్క రూపాయి రెండణాలు, ఆరుపైసలు ఇవ్వు"* అని దక్షిణ అడిగారు. నా జేబులో సరిగ్గా వారడిగినంత పైకం మాత్రమే ఉంది. బాబా ఆ మొత్తమే అడగటం వారి సర్వజ్ఞతకు నిదర్శనం. నేను ఆ మొత్తాన్ని బాబాకు సమర్పించాను. అప్పుడు నాతోబాటు చంద్రాబాయి అనే నర్సు ఉంది. బాబా ఆమెను ఆరు రూపాయల ఏడణాలు దక్షిణ అడిగారు. చిత్రంగా ఆమె దగ్గరున్న మొత్తం కూడా అదే! ఆమె కూడా ఆ మొత్తాన్ని బాబాకు సమర్పించింది. తరువాత అదే రోజు తిరిగి వెళ్ళడానికి అనుమతికోరాము. బాబా ఆమెతో *"కొన్ని రోజులు ఉండకూడదా?"* అన్నారు. తాను వేరేచోట ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాల ప్రకారం వెళ్ళవలసి ఉందని ఆమె చెప్పింది. ఆ రాత్రే మేము శిరిడీ విడిచి వచ్చాము. అదే రాత్రి ఆమె ఇంటిలో దొంగలు పడి 500 రూ॥లు విలువగల ఆస్థిని దోచుకోవడమేగాక ఇంటిలోని వస్తువులను కూడా ధ్వంసం చేశారు.

నాకు బాబాతో ఉన్న అనుభవం ఇదొక్కటే! నేను కేవలం వారి దర్శనం కోసమే శిరిడీ వెళ్ళాను. బాబా నాకు వారిపై నమ్మకాన్ని కలిగించారు. అది చాలు. నేను శిరిడీ నుండి తిరిగి వచ్చిన సంవత్సరంలోపే నాకొక కొడుకు పుట్టాడు. వాడి పేరు నానూ.

## 72

## డిసెంబరు 14వ తేదీ, 1936

**శ్రీరామచంద్ర వాసుదేవ గెయిసాస్,** రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి, ఆర్.ఎమ్.ఎస్ రికార్డు గుమాస్తా, సెలక్షన్ గ్రేడ్, వయస్సు 58సం॥లు, కొంకణ బ్రాహ్మణుడు, మే మాన్షన్స్, గోఖలే రోడ్డు, ఉత్తర దాదర్.

నేను సాయిబాబాను దర్శించలేదు. నేను మన్మాడ్‌లో తపాలా శాఖలో (ఆర్.ఎమ్.ఎస్) పనిచేస్తుండేవాడిని. శ్రీకాకాసాహెబ్ దీక్షిత్‌తో నాకు పరిచయముంది. ఆయన మా పొరుగు ప్రాంతానికి వచ్చినప్పుడు నాకు సాయిబాబాను గురించి చెబుతుండేవారు. ఒకరోజు దీక్షిత్, బాబా తనను శిరిడీకి రమ్మని పిలిచారని అందుకే శిరిడీ వెళుతున్నానని చెప్పారు. నేను "బాబా భౌతికంగా లేరు కదా? వారు మిమ్మల్ని ఎలా పిలువగలరు?" అని ప్రశ్నించాను. ఆయన "నీవు తెలుసుకుంటావులే" అని చెప్పి నాకు బాబా ఫోటో ఒకటి ఇచ్చారు.

ఈ సంఘటన జరిగిన కొన్ని నెలల తరువాత నా భార్య ప్రసవానంతరం అనారోగ్యానికి గురి అయ్యింది. ఆమె కోలుకుంటుందనే ఆశ కోల్పోయాము. ఇది జరిగి ఇప్పటికి 13 సంవత్సరాలయ్యింది. నేను ఆమె కోసం బాబాను ప్రార్థించి "ఆమె బ్రతుకుతుందా?" అని అడిగాను. ఒకటి రెండు రోజుల తరువాత నాకొక కల వచ్చింది. ఆ కలలో నేను మరియు షేక్ కాబూలా అను మహమ్మదీయుడు ఒక పడవలో ఉన్నాము. పడవ కళ్యాణ్ దగ్గరున్న సముద్రపు పాయలో ఉంది. ఎవరో ఒకతను పడవలోనికి వచ్చి తెడ్డు వేయసాగాడు. పడవ ప్రవాహానికెదురుగా అతి కష్టంతో ఆవలి ఒడ్డుకు ప్రయాణిస్తోంది. ఇంతలో మేము చేరాల్సిన తీరాన్ని చేరక ముందుకుపోయి బురదలో ఇరుక్కుపోయాము. ఎందుకలా అయిందో అని చూస్తే తెడ్డు వేసేవాడు కన్పించలేదు. మా ఇద్దరికి తెడ్డు వేయడం చేతకాదు. దాంతో మా పడవ ఇంకా బురదలో కూరుకుపోయింది. కానీ చివరికి పడవ ఎలాగో ఒడ్డుకు చేరింది. ఈ కలనుబట్టి నా భార్య బ్రతుకుతుందని అయితే కొంతకాలం మాత్రం బాధపడవలసి వస్తుందని ఊహించాను. ఆ కల వచ్చిన రోజు నుండి ఆమె కొద్ది కొద్దిగా కోలుకోవడం మొదలుపెట్టింది. డాక్టరు పరీక్షించి ఆమెకు ప్రమాదస్థితి తప్పిపోయిందని క్రమేణా ఆరోగ్యం మెరుగవుతుందని చెప్పాడు. నేను కల గురించి

దీక్షిత్‌తో చెప్పాను. బాబా సశరీరులుగా లేకున్నా ఈనాటికీ జీవించే ఉన్నారని ***"నా సమాధి మాట్లాడుతుంది!"*** అని తామిచ్చిన హామీని బాబా ఇప్పటికీ అమలు చేస్తూనే ఉన్నారని దీక్షిత్ చెప్పారు.


నాకు ఉద్యోగంలో పదోన్నతి (సెలక్షన్ గ్రేడు) రాలేదని ఎంతో మథనపడుతూ ఉండేవాడిని. ఆ సమయంలో నాకొక కల వచ్చింది. కలలో నేనొక వ్యక్తితో ఆర్థిక విషయాల గురించి మాట్లాడుతున్నాను. అకస్మాత్తుగా మరొక వ్యక్తి మా ముందుకు వచ్చి "ఇతడు (నేను) కోరేదేదో ఇవ్వవచ్చును కదా? ఇతడిని మూడు జతల వంకీలు తయారు చేయించమని చెప్పు!" అని నా ఎదుటి వ్యక్తితో అన్నాడు. "అలాగే మీరు చెప్పినట్లు చేస్తాను!" అని నా ప్రక్కనున్న వ్యక్తి జవాబు చెప్పిన మరుక్షణం మూడవ వ్యక్తి అంతర్ధానమయ్యాడు. ఇతర అనుభవాలు, కలలు చెప్పిన విధంగానే ఈ కల విషయం కూడా నేను దీక్షిత్‌కు చెప్పి, దాని అంతరార్థం వివరించమన్నాను. దీక్షిత్ ఆ మూడవ వ్యక్తి బాబా అని చెప్పారు. సాధారణంగా ఎవరైనా రెండు వంకీలే కదా ధరించేది మరి బాబా మూడు జతల వంకీలు ఎందుకడిగారని సందేహం వ్యక్తం చేశాను. బాబా దత్తావతారమని వారికి మూడు శరీరాలు ఒకటిగా ఉంటాయని అందుకే మూడు జతల వంకీలు అడిగారని దీక్షిత్ వివరించారు. నేను వెంటనే మూడు జతల వెండి వంకీలు తయారు చేయించి వాటికి ప్రాణప్రతిష్ఠ చేసి నేను నిత్యం పూజించే పెట్టెలో పెట్టాను. ఆ తరువాత నాలుగు రోజులకు నాకు పదోన్నతి లభించింది.

నేను ఏ గ్రంథం పారాయణ చేయాలో తెలియని స్థితిలో ఉన్నప్పుడు బాబా కలలో కన్పించి ***"53 భిక్షగా ఇవ్వు"*** అనడిగారు. నేను పేదవాడిని కాబట్టి 53 రూపాయలు సమర్పించలేక ప్రతినెల నా జీతం నుండి 53 కాణీలు (అణాలో నాల్గవ వంతు) బాబాకు ఖర్చుపెట్టేవాడిని. ఇలా నాలుగు నెలలు చేశాను. తరువాత ఈ కల గురించి దాభోళ్కర్‌ను సంప్రదించాను. బాబా భిక్షగా అడిగింది 53 రూపాయలు కాదని, 53 అధ్యాయాలున్న పాతప్రామాణిక గురుచరిత్ర పారాయణ చేయమని ఆ కల సూచిస్తుందని దాభోళ్కర్ వివరణ ఇచ్చారు. దాంతో నేను ఆ గ్రంథాన్ని పారాయణ చేయడం ప్రారంభించాను.

ఒకసారి నేను బాబా గురుచరిత్రను సప్తాహం పారాయణ చేయదలచి దాభోళ్కర్ రచించిన శ్రీసాయిసచ్చరిత్రను తెప్పించాను. కానీ ఆ రోజు రాత్రి మా ఇంటిలోనికి దొంగలు జొరబడినట్లు కలవచ్చింది. దీనినిబట్టి బాబాకు ఈ మార్పు ఇష్టం లేదని, సాంప్రదాయానుసారం పాత ప్రామాణిక గ్రంథమే పారాయణ చేయమని ప్రబోధించినట్లు తోచింది. దాంతో నేను సచ్చరిత్రను కాకుండా గురుచరిత్రనే సప్తాహం పాటు పారాయణ చేశాను.

రెండున్నర సంవత్సరాల క్రితం నా భార్యకు పక్షవాతం వచ్చి ఆమె ప్రాణానికే ప్రమాదం ఏర్పడింది. ఆమెకు బాబాపై దృఢమైన భక్తి విశ్వాసాలున్నాయి. ఆ సమయంలో ఆమెకొక కల వచ్చింది. ఆ కలలో ఆమె ఉన్న గది వాకిట్లో బాబా కూర్చొని ఉన్నారు. బాబా ఆమెతో *"భయపడకు. నిన్ను రక్షించడానికే నేను ఇక్కడ ఉన్నాను. ఆ యమదూతలను సైతం లోనికి రానివ్వను!"* అని అభయమిచ్చారు. అదే కలలో కొందరు వెదురు బొంగులు, మట్టికుండ మొదలైనవి తెచ్చి ఆమె శవాన్ని మోసుకొని పోవడానికి పాడె కడ్తున్నారు. బాబా వాళ్ళను అక్కడ నుండి తొలగిపొమ్మని, ఎదురుగా ఉన్న చోటికి వెళ్ళమని గట్టిగా ఆజ్ఞాపించారు. కానీ వారు బాబా మాటలు వినలేదు. దాంతో బాబా వారిని కొట్టి తరిమివేసారు. వెదురుబొంగులను విరిచేశారు. మట్టికుండను పగులగొట్టారు. అంతటితో కల సమాప్తమయ్యింది. నా భార్య రక్షింపబడింది. అదే రాత్రి మేము నివసిస్తున్న ఘామత్‌చాల్ ఎదురుగా నున్న రంగారీచాల్‌లో ఒక వ్యక్తి చనిపోయాడు. ఇలా నా భార్యను మృత్యువు నుండి బాబా కాపాడారు. తరువాత ఆమె కోలుకుంది.

దీక్షిత్ నన్ను భావూసాహెబ్ అని పిలిచేవాడు. నేను సాధారణంగా సాయిభక్తులకు చేయగలిగిన సహాయం అందించేవాడిని. శిరిడీ వెళ్ళడానికి తిరిగి రావడానికి రైలులో, బస్సులో టికెట్లు సమకూర్చడం వంటి పనులు చేసిపెడుతూ ఉండేవాడిని. సాయిలీలా మాసిక్ పత్రికలో ఒక సంఘటన ప్రచురితమయ్యింది. ఆ సంఘటనలో ఒక భక్తుడు నా ద్వారా బాబా సహాయం పొందినట్లు వ్రాయబడింది. నేను శిరిడీ వెళ్ళినప్పుడు ఆ భక్తుడు నన్ను గుర్తుపట్టి "భావూసాహెబ్" అని సంబోధించి పలకరించాడు.



అమోల్‌చంద్ సేఠ్

73

## మార్చి 8వ తేదీ, 1938

**శ్రీఅమోల్‌చంద్ చంద్రభాన్ సేర్,** షావుకారు, వయస్సు 35సం॥లు, రహతా.

మీకు మొదట మా వంశ వృత్తాంతాన్ని గురించి క్లుప్తంగా చెబుతాను. మా నాన్న చంద్రభాన్ సేర్‌కు ఇద్దరు సోదరులు. పెద్దవాడు రామచంద్ర సేర్, చిన్నవాడు బిర్‌జీచంద్ సేర్. మా పెదనాన్నగారి కుమారుడు కుశాల్‌భావు. చిన్నాన్నగారి కుమారుడు ప్రేమ్‌చంద్. మా నాన్న 13.12.1911లోనూ, మా పెదనాన్న 1860లోనూ మరణించారు. మా పెదనాన్న కుమారుడు కుశాల్‌భావు నాకన్నా 47సం॥లు పెద్దవాడు. ఆయన కూడా 15.11.1918లో 62వ ఏట చనిపోయాడు. ఇప్పుడు అతని భార్య ఒంటరిగా అహ్మద్‌నగర్‌లో జీవిస్తోంది. మా చిన్నాన్న కుమారుడు ప్రేమ్‌చంద్ బిర్‌జీచంద్ రహటేకర్ (60 సం॥లు, షావుకార్) ఔరంగాబాదులోని షాగంజ్‌లో ఉంటున్నాడు. ఇతనికి బాబా గురించి తెలుసు. నా దగ్గర మా నాన్నగారివి, కుశాల్‌భావు ఫోటోలు ఉన్నాయి.

శ్రీసాయిబాబా మా ఇంటికి, ప్రక్కనే ఉన్న మా సోదరుడు కుశాల్‌భావు ఇంటికి వస్తూండేవారు. సమాధి చెందడానికి మూడు రోజుల ముందు కూడా ఇక్కడికి వచ్చివెళ్ళారు. వారప్పుడు ఆరోగ్యంగానే ఉన్నట్లు కనిపించారు. బాబా మా ఇళ్ళల్లో కొద్దిగా ఫలహారం చేసి 15-30 నిముషాలు కూర్చొని వెళ్ళిపోయేవారు. ప్రస్తుతం శిథిలమైపోయి ఉన్న చావడిలో (రహతా) సాయిబాబా కొన్ని నెలలు నివసించినట్లు, అంతకుముందు అలీ (బహుశా అక్బర్ అలీ) అను ముస్లిం సాధువుతో అహ్మద్‌నగర్‌లో నివసించినట్లు మా అన్న కుశాల్‌భావు చెప్పాడు. ఈ విషయాన్ని దృఢపరుస్తూ సాయిబాబా అక్బర్‌అలీతో ఉండగా తాను చూసానని, వారు అహ్మద్‌నగర్ నుండి రహతావచ్చి ఇక్కడ కొన్ని రోజులుండి తరువాత శిరిడీ వెళ్ళారని దౌలూసేర్ చెప్పాడు.

అక్బర్‌అలీ అహ్మద్‌నగర్‌లో కింగ్‌గేట్ వద్ద ఉన్న బారాఇమామ్ కోట్లాలో నివసించేవాడు. వారి ఫోటో అహ్మద్‌నగర్‌లోని వాడియా పార్క్ దగ్గర ఉన్న రహటేకర్ మిల్లులో ఉంది.

## రహటేకర్

| | | |
|---|---|---|
| రామచంద్ర సేఠ్(1860) | చంద్రభాన్ సేఠ్(13.12.1911) | బిర్‌జీచంద్ |
| \| | \| | \| |
| కుశాల్‌భావ్ (15.11.1918) | అమోల్‌చంద్ (అలియాస్ బాబు కాకా, రహతా) | ప్రేమ్‌చంద్ (షాగంజ్, ఔరంగాబాద్) |
| \| | | |
| దౌలు సేఠ్ (28.10.1924) (రహటేకర్ మిల్లు, వాడియా పార్కు వద్ద, అహ్మద్‌నగర్) | | |

## 74

**శ్రీనాగేశ్వర్ ఆత్మారాం సామంత్,** పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు, బొంబాయి.

1926 ప్రాంతంలో బాబా పుణ్యతిథికి నేను నా భార్యను, రెండు సంవత్సరాల మా పెద్దబ్బాయి మనోహర్‌ను వెంట బెట్టుకొని శిరిడీ వెళ్ళాను. పుణ్యతిథి ముగిసిన తరువాత నేను బాబాజాన్‌ను దర్శించడానికి పూనా బయలుదేరాను. పూనా స్టేషను నుండి లష్కర్ వెళ్ళి బాబాజాన్‌ను చూసి రావడానికి రెండు రూపాయలు సరిపోతాయని అనుకొని నా లోపలి జేబులో 2రూ॥లు ప్రత్యేకించి విడిగా పెట్టాను. నేను ఖర్చుల కోసమని డబ్బు అలా వేరుగా పెట్టుకోవడం అదే మొదటిసారి! పూనాలో దిగి లష్కర్‌కు రానూపోనూ రూపాయి ఎనిమిదణాలకు విక్టోరియా (టాంగా) మాట్లాడుకొని లష్కర్ వెళ్ళాను. బాబాజాన్‌కు సమర్పించడానికి 4 లేక 6 అణాలకు పూలమాలకొన్నాను. అక్కడ ఫకీర్లకు టీ, రొట్టెలకుగాను రూపాయి నాలుగణాలు దానం చేశాను. తిరిగి పూనా స్టేషనుకు వచ్చి టాంగావానికి రూపాయి ఎనిమిదణాలు ఇచ్చి రైలులో కూర్చున్నాను. యథాలాపంగా లోపలి జేబులో చేయిపెట్టాను. నేను ప్రత్యేకించి పెట్టిన రెండురూపాయలు అలాగే ఉన్నాయి. అమితాశ్చర్యానికి లోనయ్యాను. టాంగాకు, పూలకు, ఫకీర్ల టీ కొరకు డబ్బు చెల్లించేటప్పుడు ఈ విషయాన్ని నేను గమనించలేదు. లష్కర్‌కు వెళ్ళి తిరిగి వచ్చేంతవరకు అయిన ఖర్చులన్నీ లోపలి జేబునుండే తీసి ఖర్చుపెట్టాను. వేరే జేబులో నోట్లున్నాయి కానీ వాటిని తాకలేదు. అయిన ఖర్చులు లెక్కించి చూస్తే మూడు రూపాయల పైచిలుకు ఖర్చయింది. అలా నా జేబులో ఉన్న రెండు రూపాయలు అంత మొత్తంగా ఎలా వృద్ధి అయిందా అని నాకు ఆశ్చర్యం వేసింది.

1931-32లో ఒక క్రిమినల్ కేసులో చాళిస్‌గాం మామ్లత్‌దార్ ముందు హాజరుకమ్మని నాకు సమన్లు వచ్చాయి. నేను అలాగే హాజరయ్యాను. కానీ కేసు వాయిదా వేసారు. మరుసటి వాయిదాకు ఆలస్యంగా అంటే మధ్యాహ్నం 1 1/2 గం॥లకు హాజరుకావడానికి కోర్టు నుండి ముందుగానే అనుమతి తీసుకున్నాను. నెల రోజుల తరువాత తిరిగి సమన్లు వచ్చాయి. దారిలో శిరిడీలో దిగి బాబా దర్శనం చేసుకొన్న తరువాత చాళిస్‌గాం వెళదామని వాయిదా తేదీకి ముందురోజే

బయలుదేరాను. బాబాను దర్శించి మరుసటి ఉదయం బస్సు ఎక్కాను. కానీ ప్రయాణం ఆలస్యమవడంతో కోపర్‌గాం పట్టణానికి ఉదయం 10.15 గం॥కు చేరాను. కోపర్‌గాం స్టేషనులో నేను ఎక్కవలసిన రైలు ఉదయం 10.30 గం॥కు బయలుదేరుతుంది. నేను స్టేషనుకు వెళ్ళడానికి అక్కడ టాంగా ఏదీ లేదు. నేను యూనిఫారమ్‌లో లేకుండా సాధారణ దుస్తులు ధరించి ఉన్నందున, స్టేషనుకు వెళ్ళే బస్సులలో నన్ను ఎవరూ ఎక్కించుకోవడం లేదు. నేను సహాయం కోసం బాబాను ప్రార్థించాను. వెంటనే "ఫౌజ్‌దార్ సాబ్" అని ఎవరో పిలిచినట్లనిపించి వెనుదిరిగాను. అక్కడ ఒక పోలీసు కానిస్టేబులు "మీరు ఫౌజ్‌దారే కదా?" అని అడిగాడు. అవునని జవాబిచ్చాను. అతను వెంటనే ఒక బస్సును ఆపి, అందులో నన్ను ఎక్కించి పంపాడు. అందువల్లనే నేను సకాలంలో స్టేషను చేరి రైలు ఎక్కి, విచారణ సమయానికి చాళిస్‌గాం వెళ్ళగలిగాను. బాబా సహాయపడకుంటే రైలు తప్పిపోయి, కోర్టుకు హాజరుకానందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చేది.

1929 మార్చిలో విశ్రాంతి కొరకు రెండు నెలలు సెలవు పెట్టి ఇంటికి వెళ్ళాను. 15 రోజులు అక్కడ కులాసాగా గడిచింది. ఒకరోజు వద్దని ఎంత చెబుతున్నా వినకుండా మా నాన్న చేపలు పట్టడానికెళ్ళి కొన్ని బ్రతికి ఉన్న చేపలను ఇంటికి తెచ్చాడు. చేపలను చంపడం పాపమని, ఇది బాబా అభిమతానికి విరుద్ధమని మా అమ్మతో చెప్పాను. కానీ ఎవరూ నా మాటలు పట్టించుకోలేదు. కాసేపటికి నాకు అకస్మాత్తుగా జ్వరం వచ్చింది. మా అమ్మ నాకేమౌతుందోనని తల్లడిల్లిపోయింది. అప్పుడు నేను "అమ్మా, నీ బిడ్డ క్షేమం కోసం తపించిపోతున్నావు. మరి చేపపిల్లల విషయంలో మాత్రం క్రూరంగా ప్రవర్తిస్తున్నావు. నాకేమీ కాకుండా ఉండాలంటే చేపలను చంపడం మానండి!" అన్నాను. అప్పుడు మా నాన్న నా దగ్గరికి వచ్చి నా నుదుటిపై ఊదీపెట్టి బాబాను ప్రార్థించాడు. "బాబా! నా కుమారుడు రేపు ఉదయానికి కోలుకుంటే నేను చేపలు తినడం మానివేస్తాను" అని మ్రొక్కుకున్నాడు. తరువాత 5 నిముషాలకు నా జ్వరం తగ్గిపోయి స్వస్థత చేకూరింది.

1931లో నవాల్కర్ వాడా పైఅంతస్థులో ఉన్న గదిలో బస చేశాను. ఆ గది గోడలు చాలాచోట్ల పగుళ్ళిచ్చి కూలిపోయేటట్లు ఉన్నాయి. తేళ్ళు కూడా విపరీతంగా ఉన్నాయి. అక్కడ ఉండటం ప్రమాదమని తలచి శ్రీఆర్.ఎ. తర్ఖడ్

వేరేచోటుకు వెళ్ళిపోయాడు. నన్ను కూడా హెచ్చరించాడు కానీ నాకు ఉండటానికి వేరే ఏ చోటు లేదు. అందువల్ల అక్కడే రామనవమి వరకు రెండు రోజులుండి తరువాత బొంబాయి వెళ్ళిపోయాను. నేను ఉన్న రోజులలో ఏమీ కాలేదు. కానీ నేను వెళ్ళిపోయిన కొద్దిసేపటికి గోడలు కూలిపోయినట్లు నాకు జాబు వచ్చింది.

కొన్ని సంవత్సరాల క్రితం నేను శిరిడీలో ఉన్నప్పుడు నా టోపీలోకి ఒక తేలు వచ్చి చేరింది. నేను శిరిడీలో దానిని గమనించకుండా టోపీ ధరించి బొంబాయికి వచ్చి, అక్కడ మేకుకు తగిలించడానికి టోపీ తీసాను. అప్పుడు ఆ టోపీలో తేలున్నట్లు గమనించాను. టోపీ దాదాపు 12 గంటల పాటు నా తలపై ఉన్నప్పటికీ ఆ తేలు నాకు ఏ హానీ చేయలేదు.

కొన్ని సంవత్సరాల క్రితం నేనొకరోజు బాబా సమాధికి ప్రక్కనున్న గదిలో నిద్రించాను. అర్ధరాత్రి సమయంలో సమాధి నుండి సంగీతం రావడం స్పష్టంగా వినిపించింది. నేను దానిని వర్ణించలేను!

## 75

**శ్రీ.జి.కె.రేగే,** రిటైర్డ్ తాసిల్దారు, ఇండోరు.

నేను 1912లో తుంటి నొప్పితో బాధపడసాగాను. జ్వరం కూడా రావడంతో నిద్ర కరువైంది. దాంతో నేను మా మామగారైన నారాయణరావు పరూల్కర్ దగ్గరకు వెళ్ళాను. ఆయన హార్దా సమీపంలో ఉన్న గీగ్గాం అనే గ్రామంలో ఉంటున్నారు. ఆయన గొప్ప సాయిభక్తులు. ఆయన బాబా ఊదీని నా నొసటిపై రాసారు. ఆ రాత్రి రెండు గంటల సమయంలో నేను మంచంపై పడుకొని ఉండగా కాషాయ వస్త్రాలు ధరించిన ఒక సన్యాసి ప్రత్యక్షమై, నా భుజం తట్టి ***"బిడ్డా! భయపడకు. నీకు మూడురోజులలో నయమౌతుంది"*** అన్నాడు. ఒక సన్యాసి నా ముందు నిలబడి ఉన్నారని, పైమాటలు అన్నారని మా మామగారితో గట్టిగా అరుస్తూ చెప్పాను. మా మామగారు సన్యాసిని చూడడానికి వచ్చే లోపే అతను అంతర్ధానమయ్యాడు. అక్కడకు వచ్చినది ఎవరో సన్యాసి కాదని, సాయిబాబా అని మా మామగారు చెప్పారు. సరిగ్గా మూడవరోజుకు నా నొప్పులన్నీ మాయమైపోయి వారం రోజులలో పూర్తి స్వస్థత చేకూరింది. మా మామగారు నన్ను శిరిడీ వెళ్ళి సాయిబాబాను దర్శించమని కోరారు. కానీ నేను రెండు సంవత్సరాల వరకు శిరిడీ వెళ్ళలేకపోయాను.

1914లో నా మూడవ కుమార్తె వివాహం మాండ్లలో జరిపించడానికి సెలవుపెట్టాను. బాబాకు కూడా ఆహ్వాన పత్రిక పంపాము. ***"నేను స్వయంగా వచ్చి వివాహానికి హాజరవుతాను"*** అని బాబా సమాధానం పంపారు. వివాహ వేడుక జరుగుతున్న సమయంలో బాబా నుండి పోస్టులో ఒక కవరు వచ్చింది. ఆ కవరులో ఊదీ పొట్లము, ఊదీని వధూవరుల నొసటిపై పెట్టమనే ఆదేశము ఉన్నాయి. అదే రోజు ఒక ఫకీరు వచ్చి, మా మామగారిని ఒక పైసా అడిగాడు. మా మామగారు నిర్లక్ష్యం చేసి ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదు. తరువాత మా మామగారు పశ్చాత్తాపం చెంది, వచ్చిన ఫకీరు సాయిబాబా అయి ఉంటారేమోననే సందేహాన్ని నా దగ్గర వ్యక్తం చేశాడు. ఆ వచ్చిన వారు సాయిబాబా అయితే, తిరిగి వారు మా వద్దకు రావాలని నేను ప్రార్థించాను. మరుసటిరోజు మరొక ఫకీరు నా దగ్గరికి వచ్చి ఒక పైసా మాత్రమే అడిగారు. నేను సమర్పించాను. ఆ ఫకీరు నేను సమర్పించిన

పైసా మాత్రమే తీసుకొని, మా మామగారు భోంచేసి వెళ్ళమని అభ్యర్థిస్తున్నా వినకుండా వెళ్ళిపోయాడు.

ఆ వివాహం జరిగిన తరువాత నేను శిరిడీ వెళ్ళి అక్కడ నాలుగురోజులు గడిపాను. బాబా నన్ను చూసిన వెంటనే *"ఎందుకింత ఆలస్యం?"* అనడిగారు. నేనొక పేద గుమాస్తానని అంత సులభంగా రాలేకపోయానని చెప్పాను. తరువాత వారు నన్ను దక్షిణ అడిగారు. నేను ఐదు రూపాయలు సమర్పించాను. బాబా తమకు మరో ఐదు రూపాయలు కావాలన్నారు. అలా ఎందుకు అడుగుతున్నారో నాకు అర్థం కాలేదు. ఐనా మరో ఐదు రూపాయలు సమర్పించాను. అవి తీసుకొని *"ఇంతకన్నా ఎక్కువ నీవు నాకు బాకీపడలేదు!"* అన్నారు. ఇంటికి (కాశేగాం) తిరిగి వెళ్లిన తరువాతగానీ నాకు ఆ విషయం బోధపడలేదు. నా భార్య సంవత్సరం క్రితం (నాకు తెలియకుండా) బాబాకు మనియార్డరు ద్వారా 5రూ॥లు పంపింది. కానీ అది తిరిగి వచ్చింది. తిరిగి వచ్చిన మనియార్డరు కూపనులో "ఈ మొత్తం స్వయంగా మీ నుండి తీసుకోబడుతుంది!" అని వ్రాసి ఉంది. అందుకే బాబా 'స్వయంగా' ఐదు రూపాయలు అధికంగా అడిగారని గ్రహించాను.

నాలుగు సంవత్సరాల వయస్సున్న నా చిన్న కుమార్తె ప్రేమాబాయికి జ్వరం వచ్చింది. అది క్రమేణా ప్రమాద స్థితికి చేరుకుంది. బిడ్డ కృశించిపోయి ఎముకల గూడుగా తయారైంది. వైద్యచికిత్సలు, మందులు ఏమీ పని చేయలేదు. నా భార్య బిడ్డను కాపాడమని ఆర్తిగా బాబాను ప్రార్థించింది. "నీ బిడ్డ కష్టాలన్నీ మూడవనాటికి తీసివేస్తాను!" అన్న బాబా కంఠధ్వని ఆమెకు స్పష్టంగా వినిపించింది. కానీ ఊహించని రీతిగా ఆ బిడ్డ మూడవనాటికి తల్లి ఒడిలో ప్రాణాలు విడిచింది. నేను 'మానస'లోని ఆఫీసులో ఉండగా నా భార్య కబురు పంపి వెంటనే ఇంటికి రమ్మని చెప్పింది. నేను ఇంటికి వెళ్ళి చూడగా బిడ్డ మరణించి ఉంది. నా భార్య శోకిస్తూవుంది. మేము ఎల్లప్పుడూ పూజగదిలో ఉంచుకునే గంగా తీర్థంలో కాస్త బాబా ఊదీని కలిపి బిడ్డ నోట్లో పోసాను. చిత్రంగా అవి బయటికి రాలేదు. దాంతో మరికొంత తీర్థం పోసాను. మరుక్షణం బిడ్డ కళ్ళు తెరిచింది. బిడ్డకు ప్రాణం వచ్చిందని తెలుసుకొని బాబా ఊదీ, తీర్థం ఇచ్చాము. బిడ్డ ఒక నెలరోజుల్లో కోలుకొని సంపూర్ణ ఆరోగ్యవంతురాలైంది. ఇప్పుడామె ఇండోరులోని ఒక బోర్డింగ్ స్కూలులో (ఎల్.ఆర్.టి) మేట్రన్‌గా పనిచేస్తోంది.

1924లో నా నాల్గవ కుమార్తె మైనాబాయికి వివాహం చేయదలచి సంబంధాల కోసం వెతకనారంభించాను. కానీ సరియైన వరుడు దొరకలేదు. నేను అప్పుడు సెలవు పెట్టి ఉన్నాను. నా భార్యను అంజన్‌గాంలో(సి.పి.) ఉన్న ఆమె సోదరుని ఇంటికి తీసుకెళ్ళాను. అక్కడికి వెళ్ళిన రెండవరోజు "జీరాపూర్ వెళ్ళు!" అనే కంఠధ్వని వినిపించింది. తిరిగి ఇండోర్ వచ్చాను. అక్కడ నా కుమారునికి జీరాపూర్ వెళ్ళమని ఉత్తర్వులు వచ్చి ఉన్నాయి. కానీ వాడి భార్య తొమ్మిది నెలల గర్భిణిగా ఉన్నందువల్ల వెళ్ళలేకపోయాడు. అందువల్ల వాడి పైఅధికారులు ఆ ఉత్తర్వులను రద్దు చేశారు. నా సెలవు ముగిసిన తరువాత నన్ను నెమావర్ జిల్లాలోని కథేగాంకు బదిలీ చేసినట్లు తెలిసింది. కానీ ఆ ఉత్తర్వులను సంతకం కోసం రెవెన్యూ మినిష్టరు దగ్గరికి పంపినప్పుడు, నా నుండి అభ్యర్థన లేకుండానే అతను ఆ ఉత్తర్వులను రద్దుచేసి నన్ను జీరాపూర్ బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశాడు. నేను జీరాపూర్ వెళ్ళాను. ఉద్యోగంలో చేరిన 15 రోజులకు నేను పర్యటిస్తూ సాయత్ అనుచోట ఆగాను. అక్కడ నా సోదరుడు గ్వాలియర్ సంస్థానంలో పని చేస్తున్నాడు. అతనిని చూడడానికి వెళ్లినప్పుడు తనతో బల్వంత్ అనే అందమైన, దృఢకాయుడైన యువకుడు కన్పించాడు. నేను ఆ యువకుని గురించి విచారించి, అతనే నా కుమార్తెకు సరియైన వరుడని నిర్ణయించి, సంబంధం కుదుర్చుకొని వివాహం జరిపించాను.

1926లో నా భార్య మరణించింది. ఆ తరువాత నా ఆరోగ్యం క్షీణించింది. నేను బాబా ఫోటో ముందు కూర్చొని ఉండగా ఒకరోజు ఆ ఫోటో నుండి "ఇకపై ఉద్యోగం చేయవద్దు!" అని కంఠధ్వని వినిపించింది. ఇలా వరుసగా మూడురోజులు ఆ ధ్వని వినిపించింది. ఎవరు మాట్లాడుతున్నారో నేను కనుక్కోలేకపోయాను. నా స్నేహితుడైన డాక్టరు పర్నేర్‌కర్, అది బాబా కంఠధ్వని అయి ఉంటుందని చెప్పాడు. దాంతో ఆ సంవత్సరమే (1926) పదవీ విరమణ చేసి పింఛను తీసుకున్నాను.

## 76

**ఒక అజ్ఞాత భక్తుడు -** సాయిసుధ పత్రికలో తన అనుభవాన్నిలా చెప్తున్నాడు:

శ్రీసాయిబాబా గురించి చెప్పే ముందు నా గురించి కొన్ని విషయాలు చెప్పాలి. నేను నిస్సంశయంగా దైవభక్తి కలవాడిని. నేను దక్షిణ భారతదేశంలో దాదాపు అన్ని దేవాలయాలను దర్శించాను. స్వతహాగా పేదలకు దానధర్మాలు చేసే స్వభావం కలవాడిని. నేను ఎల్లప్పుడు నా వకీలు స్నేహితునితో, శ్రీరామకృష్ణ పరమహంస, వివేకానంద మొదలైన మహాత్ముల జీవిత చరిత్రల గురించి చర్చిస్తూ ఉండేవాడిని. అతను నా అభివృద్ధిని కాంక్షించేవాడు. అతను సాయిభక్తుడైనప్పటికీ ఇన్ని సంవత్సరాలలో ఎప్పుడూ శ్రీసాయిబాబాను గురించి నాకు చెప్పలేదు. 1.7.1939న మా మధ్య జరిగిన సంభాషణలో శ్రీసాయిబాబా గురించి చెబుతూ వారు గొప్ప శక్తికలవారని, జ్ఞాని, దయామయులని, ఈ మానవాళిని ఉద్ధరించడానికే అవతరించారని చెప్పాడు. నేను సాయిబాబా గురించే ఆలోచిస్తూ ఇంటికి వెళ్ళి, ఆ విషయం నా భార్యతో చెప్పాను. అదే రోజు రాత్రి సాయిబాబా నా కలలో కన్పించారు.

నా భార్య చాలాకాలం నుండి కాళ్ళపై లేచిన కురుపులతో బాధపడుతూ ఉండేది. ఎన్నో మందులు, ఇంజక్షన్లు వాడాము. కానీ అవి పని చేయలేదు. నేను బాబా ఊదీని ఆ కురుపులపై పూయమని చెప్పాను. ఆమె రోజూ ఊదీ రాస్తూ వచ్చింది. కానీ ఇంట్లో ఉన్న ఊదీ చాలా తక్కువ. ఒకరోజు నా భార్య బాబాను తలచుకొని ఇంట్లో ఉన్న ఊదీ అయిపోయిందని చెప్పింది. మేము సెక్రెటరీకి ఎటువంటి ఉత్తరమూ వ్రాయకుండానే రహతా నుండి పోస్టులో మాకొక ఊదీ పొట్లం వచ్చింది. ఇది బాబా యొక్క లీలగా భావించాము. ఊదీ పూయడం ద్వారా క్రమంగా నా భార్య కాళ్ళకున్న కురుపులన్నీ పూర్తిగా నయమయ్యాయి. అప్పటి నుండి మాకు బాబాపట్ల ఉన్న భక్తివిశ్వాసాలు అధికమయ్యాయి. మేము బాబాను పూజించడం మొదలుపెట్టిన తరువాత మాకు ఎంతో ప్రశాంతత లభించింది.

ఇంతటి అద్భుత శక్తులున్న శ్రీసాయిబాబా సామాన్య సత్పురుషులు కాదని, భగవంతుడేనని, నాకు గట్టి నమ్మకం ఏర్పడింది. 27.11.1939 రోజున శ్రీసాయిబాబా భౌతికంగా వచ్చి, నాకు తీర్థమివ్వాలని కోరుకున్నాను. అదే రాత్రి

వారు భౌతిక రూపంలో కనిపించి, బెల్లం కలిపిన తీర్థం ఇచ్చారు. నేను తీర్థాన్ని భక్తితో సేవించాను.

మేము సాయిబాబాను నిత్యం ఇంటిలో పూజించడమేగాక, మేము ఎక్కడికి వెళ్ళినా వారి ఫోటో మాతోపాటు తీసుకెళ్ళి అక్కడ పూజిస్తుంటాము. వారు మాకెన్నో విధాలుగా సహాయపడుతూనే ఉన్నారు. ఈ అనుభవాలన్నీ 1.7.1939 నుండి 31.12.1939 మధ్యకాలంలో జరిగినవి. నేను ఈ వివరాలన్నీ సాయిబాబా పేరుపై వ్రాసిస్తున్నాను. నేను చెప్పినవాటిల్లో ఏవీ కల్పించినవి లేవు. అన్నీ వాస్తవాలే అని ప్రమాణం చేస్తున్నాను!

77

**శ్రీఅప్పాజీ సుతార్**, శిరిడీ.

1929లో నేను శిరిడీలో ఉండగా నా కాలికి ఎగ్జిమా (ఒక తరహా పొడ రోగము) సోకి బాధపడ్డాను. దాని నివారణ కోసం 200 రూపాయలు ఖర్చుపెట్టి కోపర్‌గాం ప్రభుత్వ డాక్టర్లచే చికిత్స చేయించుకున్నాను. కానీ ప్రయోజనం లేకపోయింది. షామా కూడా మందులిచ్చాడు. అయినా ఫలితం దక్కలేదు. చివరికి నాశిక్ హాస్పిటల్‌లో చేరాను కానీ కొంచెమైనా గుణం కన్పించలేదు. అక్కడున్న 8 రోజుల్లో ఒకరాత్రి బాబా కలలో కన్పించి ***"శిరిడీ తిరిగి వెళ్ళి, పురాణ పఠనం చెయ్యి!"*** అన్నారు. "ఎగ్జిమా బాధ వలన నాశిక్‌కు వచ్చాను కదా!" అని అన్నాను. దానికి బాబా ***"నా పురాణ పఠనం చేస్తూ ఊదీ రాస్తూవుండు. నీకు నయమవుతుంది!"*** అన్నారు. వారి ఆదేశం మేరకు శిరిడీ తిరిగి వచ్చాను. నేను శిరిడీకి వచ్చినప్పుడు విఠల్‌రావు మరాఠీ అనునతడు పారాయణ చేస్తున్నాడు. కానీ, అతను ఏదో పనిపై సిరువల్ అను చోటికి వెళ్ళవలసి వచ్చింది. నేను శిరిడీలో బస్సు దిగుతుండగా, అదే బస్సులో ఎక్కడానికి వచ్చిన విఠల్‌రావు నన్ను కలిసాడు. తను అత్యవసరంగా సిరువల్ వెళ్ళవలసివుందని, తాను లేని సమయంలో బాబా సన్నిధిలో పారాయణ నిర్వహించే వాళ్ళెవరూ లేరని, నన్ను పోతీ నిర్వహించమని కోరి వెళ్ళిపోయాడు. నేను పారాయణ చేయనారంభించాను. జ్ఞానేశ్వరి, ఏకనాథ భాగవతం, ఆధ్యాత్మిక రామాయణం మరియు దాభోళ్కర్ రచించిన శ్రీసాయి సచ్చరిత్ర బాబా సన్నిధిలో ప్రతిరోజూ పారాయణ చేసి, ఊదీ రాసుకునేవాడిని. ఏడు రోజులలో నా చర్మ వ్యాధి పూర్తిగా నయమయింది.

నాకు కలిగిన మరొక అనుభవం ఇది. శిరిడీకి చెందిన ముల్తాన్ ఫతేచంద్ మార్వాడీకి నేను 350 రూ॥లు బాకీ పడ్డాను. 1932లో అతను డబ్బు రాబట్టుకోవడానికి నాపై కోర్టులో కేసువేసి అరెస్టు చేయిస్తానని బెదిరించాడు. నేను చాలా భయపడ్డాను. ఒకరోజు బాబా నా కలలో కన్పించి, నన్ను మరో నలుగురు భక్తులను, ఒకదాని తరువాత ఒకటి, గీతలోని పద్యాలను వల్లించమన్నారు. వరుసగా మేమందరం వల్లించాము. తరువాత బాబా నన్ను *"నీకేం కావాలి?"* అనడిగారు.

ఫతేచంద్ బాకీ నుండి నన్ను విముక్తుణ్ణి చేయమని బాబాను కోరాను. అప్పు తీరిపోతుందని బాబా చెప్పారు. మరుసటిరోజు ఉదయం ఫతేచంద్ మా ఇంటికి వచ్చి, తనకొక ఇల్లు కట్టించి ఇవ్వమని అడిగాడు. నేను అలా చేస్తే నా బాకీ పత్రాలు తిరిగి ఇచ్చేస్తానని అగ్రిమెంటు కూడా వ్రాసిచ్చాడు. అంగీకారం మేరకు ఒక నెలలో ఇల్లు కట్టించి ఇచ్చాను. అతను నా బాకీ పత్రాలన్నీ తిరిగి ఇచ్చేసాడు. వాటిని చింపి అవతల పారేసాను.

## 78

**ఇమాంభాయ్ చోటాఖాన్,** వయస్సు సుమారు 65సం॥లు, వజాపూర్, ఔరంగాబాదు జిల్లా.

నేను మొట్టమొదట సాయిబాబాను గురించి 30 సంవత్సరాల క్రితం, మహమ్మదీయ సాధువైన దుర్వేష్‌షా చెప్పగా విన్నాను. నాకు, మా మేనత్తకు (మా అత్తగారు కూడా) మధ్యగల వివాదాల పరిష్కారం కోసం వారి దగ్గరికి వెళ్ళాను. ఆయన నన్ను సాయిబాబా దగ్గరికి వెళ్ళమని చెప్పి, కొన్ని సూచనలు ఇవ్వడంతో నేను శిరిడీ వెళ్ళాను.

అప్పుడు దీక్షిత్‌వాడా (1910) నిర్మిస్తున్నారు. నేను బాబాను గోండ్‌కర్ ఇంటి సమీపంలో దర్శించాను. బాబా నిలబడి ఉన్నారు, ఒక మహిళ వారి దర్శనం చేసుకుంటోంది. మద్రాసుకు చెందిన సాధువు విజయానందస్వామి కూడా బాబా వద్ద నిలబడి ఉన్నాడు. నన్ను బాబా వెనుక నిలబడి ఖురాన్ మొదటి అధ్యాయాన్ని వల్లించమని, వారి నుండి ఎటువంటి కానుకలు స్వీకరించవద్దని దుర్వేష్‌షా నాకు సలహా ఇచ్చి ఉన్నాడు. అందుకని నేను బాబా వెనుకకు వెళ్ళి ఖురాన్‌లోని మొదటి అధ్యాయాన్ని వల్లించడానికి "బిస్‌మిల్లా... " అని మొదలుపెట్టాను. బాబా ఒక్కసారిగా వెనుకకు తిరిగి కోపంతో ***"ఎవరు నువ్వు? నీవేదో నాయబ్బవైనట్లు నన్నేదో అడగాలని ఎందుకు వచ్చావు?"*** అంటూ తిట్ల వర్షం కురిపించారు. నేను భీతిల్లిపోయాను. బాబా ఎప్పటివలె అర్థం కాని రీతిలో ఏదో మాట్లాడుతూ మసీదుకి వెళ్ళారు. నేను వారిననుసరిస్తూ వెళ్ళి మసీదు ముందు మంటపంలో కూర్చున్నాను. బాబా అనుమతి ఇవ్వనందున మసీదులోనికి వెళ్ళలేక అలాగే రెండురోజులు వేచి ఉన్నాను. ఆ తరువాత కాకాసాహెబ్ దీక్షిత్ కల్పించుకొని బాబా దగ్గరికి వెళ్ళి, నన్ను ఉద్దేశించి "బాబా వీరందరూ మీ బిడ్డలే కదా? వారిపై ఎందుకు కోప్పడతారు?" అనడిగాడు. దానికి బాబా ***"ఏంటి, వాడిని బిడ్డ అంటావా? వాడొక గురువును కొట్టి చంపాడు!"*** అన్నారు. బాబా చెప్పింది నిజమే! అప్పటికి రెండు నెలల ముందు జరిగిన ఒక సంఘటన గురించి బాబా ప్రస్తావించారు (ఆ విషయం బాబాకు ఎవరూ చెప్పే అవకాశం లేదు). నేను మామ్లత్‌దార్ ఆఫీసులో నిజాం సిపాయిగా పనిచేస్తూ ఉండేవాడిని. పోలీసులు తమ విచారణలో భాగంగా ఒక క్రైస్తవ

మతగురువును ప్రశ్నిస్తున్నారు. నేను పోలీసులకు సహాయపడేందుకు వెళ్ళాను. అతను సరియైన సమాచారమివ్వడంలేదని ఆగ్రహించి, ఒక కర్రతో ఆ గురువును గట్టిగా కొట్టాను. అతను రక్తం కక్కుకొని క్రిందపడి స్పృహ కోల్పోయాడు. నేను భయపడి ఈ విషయం మామ్లత్‌దార్‌కు చెప్పాను. మామ్లత్‌దార్ నన్నెక్కడికైనా పారిపొమ్మని సలహా ఇచ్చాడు. నేను ఉద్యోగానికి రాజీనామా చేసి పారిపోయి శిరిడీ వచ్చాను. నేను చేసినదానికి విచారణను ఎదుర్కోవలసి వస్తుందన్న భయం కూడా బాబా దగ్గరికి రావడానికి గల మరోకారణం. కాకాసాహెబ్ బాబాతో మాట్లాడిన రోజు కూడా నేను బాబాకు భయపడి మసీదులోనికి వెళ్ళలేదు. ఆ తరువాత రెండు మూడు రోజులకు బడేబాబా కొడుకు కాశింభాయి, జోగ్, దీక్షిత్‌లు నన్ను మసీదులోనికి తీసుకెళ్ళారు. నేను బాబాను దర్శించుకున్నాను. బాబా నా శిరస్సుపై హస్తాన్ని ఉంచి *"భయపడకు. భగవంతుడే యజమాని!"* అన్నారు. తరువాత నేను ఏడువారాల పాటు శిరిడీలో గడిపాను. బాబా ఒకరోజు నాతో *"నీవు ఇంటికి తిరిగి వెళ్లు. నీ భూమి తగాదా పరిష్కారమవుతుంది. నీ బంధువులందరూ నీతో సఖ్యంగా మెలుగుతారు!"* అని ఆశీర్వదించారు. నేను ఇంటికి తిరిగి వెళ్ళాను. మా అత్తగారిపై కోర్టులో దావా వేసాను. ఈ కేసు ఏడుసంవత్సరాల పాటు నడిచి, చివరికి నా భూములు నాకు స్వాధీనమయ్యాయి.

రెండవ సందర్శనము: నేను బాబాను దర్శించి, తిరిగి వెళ్ళేందుకు వారి అనుమతి అడిగాను. ఆ సమయంలో బాబా వద్ద మహల్సాపతి, మావ్‌సీ ఉన్నారు. బాబా మావ్‌సీతో *"జనం నా మాటలు వినరు. పోకిరి వెధవలు చెప్పకుండానే వెళ్ళి బాధపడతారు. ముల్లు గుచ్చుకున్న గాయంవలన తల్లిని కూడా కోల్పోతారు!"* అన్నారు. నిజానికి నేను తిరిగి వెళ్ళేందుకు బాబా అనుమతించలేదు. నేను ఇల్లు చేరాలనే తొందరలో బాబా అనుమతి పొందకుండానే ఊరికి వచ్చేసాను. నేను తిరిగి వచ్చిన రెండురోజులకు మా అమ్మ కట్టెలు సేకరించడానికి వెళ్ళినప్పుడు ఆమె కాలుకు ముల్లు గుచ్చుకుంది. అది సెప్టిక్ అయి కాలు బాగా వాచిపోయి, తొమ్మిది పది రోజులు తరువాత ఆమె మరణించింది. అప్పుడు బాబా మసీదులో మావ్‌సీతో *"ముల్లు గుచ్చుకొని తల్లి మరణిస్తుంది"* అన్న మాటలు నా గురించి చెప్పినవేనని అర్థమయింది.

మూడవ సందర్శనము: మా అమ్మ చనిపోయిన నాల్గవరోజు శిరిడీ వెళ్ళాను. నాకు డబ్బు, ఉద్యోగం లేనందున నా ఆర్థిక దుస్థితి నుండి విముక్తి కలిగిస్తారని తలచి బాబా దగ్గరికి వచ్చాను. నేను శిరిడీలో 34రోజులు గడిపాను. ఒకరోజు నేను మసీదులో ఉన్నప్పుడు బాబా మావ్‌సీతో ***"ఊదీ తీసుకొని సెలవు తీసుకోవాలి!"*** అన్నారు. ఈ మాటలు నా గురించి మాట్లాడినవేనని అర్థం చేసుకున్నాను. ఒక వ్యక్తికి సంబంధించిన మాటలు ఇంకొక వ్యక్తితోగానీ లేక భక్త సందోహాన్ని సంబోధించిగానీ చెబుతారు. బాబా మాటలు ఎవరినుద్దేశించి మాట్లాడినవో వాళ్ళు మాత్రమే తెలుసుకుంటారు. మరుసటిరోజు నేను బాబా వద్దకు వెళ్ళడంతోనే వారంతట వారే ఊదీ నా చేతిలో పెడుతూ ***"ఇంటివాకిట్లో ముసలావిడ నిలబడి ఉంటుంది. ఆమె ఇచ్చింది తీసుకొని, దాంతో కార్యం జరిపించాలి. అతిథులు వచ్చివున్నారు. వారితో కలిసి విందు భోజనం చేయాలి!"*** అన్నారు. నాకు వారి మాటలు అర్థం కాలేదు. నేను ఇల్లు చేరింది మా అమ్మ చనిపోయిన 40వ రోజున! హిందువులు మాసికాలు జరిపించినట్లే, మేము మండలక్రతువు జరిపించాలి. కీర్తిశేషులైన కాజీ గారి భార్య మా ఇంటి వాకిట్లో నిలబడివుంది. వృద్ధురాలైన ఆమెకు నాపై ప్రేమాభిమానాలున్నాయి. ఆమె నన్ను పరామర్శించి నా చేతిలో 50రూ॥లు పెట్టి కార్యం జరిపించమని చెప్పి వెళ్ళిపోయింది. ఈ కార్యానికి మా నలుగురు అక్కచెల్లెండ్లు, వాళ్ళ భర్తలు వచ్చి ఉన్నారు. బాబా చెప్పిన అతిథులు వీళ్ళేనని గ్రహించాను. కాజీగారి భార్య ఇచ్చిన డబ్బుతో మండలక్రతువు సజావుగా జరిపించాను.

నాల్గవ సందర్శనము: నెలరోజుల తరువాత నేను తిరిగి శిరిడీ వెళ్ళాను. అప్పుడు బాబా నాతో ***"గులాబ్ మీ ఇంటికి వచ్చింది"*** అన్నారు. నేను ఇంటికి వెళ్ళి చూస్తే, నా భార్య మగపిల్లవాడిని ప్రసవించి ఉంది. బాబా చెప్పిన "గులాబ్" ఈ బిడ్డ గురించేనని తలచి వాడికి "గులాబ్" అని పేరుపెట్టాను.

తదుపరి సందర్శనాలు: ఒకసారి శిరిడీ వెళ్ళి బాబాను దర్శించి తిరిగి వెళ్ళేందుకు అనుమతి కోరాను. కానీ బాబా అనుజ్ఞ ఇవ్వలేదు. ***"ప్రజలు బయటికి వెళ్ళకూడదు. వెళితే తుఫానులొస్తాయి. అగ్నిగోళాలు వర్షిస్తాయి. అనేక విపత్తులు సంభవిస్తాయి!"*** అని బాబా అన్నారు. ఈ మాటలు ఎవరినుద్దేశించి చెప్పినవో నాకర్థం కాలేదు. బాబా అనుమతి లేకుండానే శిరిడీ విడిచాను. పరుగులాంటి నడకతో ప్రయాణించాను. నేను ఎంత త్వరగా నడిచానంటే, రెండు

గంటలలో శిరిడీకి 12 మైళ్ళ దూరంలోనున్న "వారి" నది చేరాను. అప్పుడు సమయం సాయంత్రం 5.30గం॥లు. నది ఒడ్డునే ప్రయాణిస్తూ సురళ గ్రామం చేరేసరికి సూర్యాస్తమయమయ్యింది. ఆ గ్రామపటేలు నన్ను వెళ్ళవద్దని ఆకాశం మేఘావృతమైవుందని వర్షమొచ్చే సూచనలు కనిపిస్తున్నాయని, అప్పుడు ప్రయాణం సాగిస్తే అవస్థలపాలవుతానని హెచ్చరించాడు. కానీ నేను "ఇక్కడికి మా ఊరు నాలుగుమైళ్ళే కదా! వెళ్ళిపోతాను" అని చెప్పి బయలుదేరాను. మరి మూడుమైళ్లు నడిచేసరికి ఉరుములు, మెరుపులతో పెద్దతుఫాను మొదలైంది. నా ముందున్న ఒక పెద్ద రావిచెట్టుపై పిడుగుపడి, చెట్టు రెండుగా చీలి మండసాగింది. పిడుగుపడినప్పుడు మిరుమిట్లుగొలిపే మెరుపు మెరిసింది. ఆ కాంతిని చూడలేక తల తిప్పుకున్నాను. నా వెనుక బాబా నిలబడి ఉన్నారు. వారి వెంట రెండు కుక్కలు కూడా ఉన్నాయి. నేను వారికి వంగి నమస్కరించాను. వారు అంతర్థానమయ్యారు. నేను ముందుకు సాగిపోయాను. మా గ్రామానికి దగ్గరగా నది ప్రవహిస్తూ ఉంటుంది. ఆ నది దాటితేగానీ మా ఊరు చేరుకోలేము. నేను నది వద్దకు వచ్చి దాని లోతెంతో తెలుసుకోకుండానే దానిలోకి దిగాను. నీళ్లు మోకాలు లోతున్నాయి. నదిని దాటి అవతలి ఒడ్డుకు చేరాను. యథాలాపంగా వెనుదిరిగి చూసి భయభీతుడనయ్యాను. నది వరదలో ఉంది. నీళ్ళు నది రెండుగట్ల పైవరకు చేరి పొంగి ప్రవహిస్తున్నాయి. నదిలోతు కనీసం 20 అడుగులుంటుంది. నేను నదిని ఎలా దాటానా అని విస్తుపోయాను. తరువాత క్షేమంగా ఇల్లు చేరాను. శిరిడీలో బాబా తుఫానులొస్తాయి, అగ్నిగోళాలు (పిడుగులు) పడతాయి అన్న మాటలు నిజమయ్యాయి.

నాలుగు సంవత్సరాల క్రితం గులాబ్ వివాహం జరిపించడానికి నాకు డబ్బు అవసరమైంది. నేను శిరిడీ వచ్చి మసీదులో నిద్రించాను. బాబా నా కలలో కన్పించి నన్ను ఆశీర్వదించి, పూనాకు వెళితే లాభపడతానని చెప్పారు. వారి ఆదేశం మేరకు పూనాకు వెళ్ళి ఒక వ్యక్తిని కలిసాను. అక్కడకు లడ్కర్ అనునతడు వచ్చాడు. అతను మొలల వ్యాధితో బాధపడుతున్నాడు. ఆ వ్యాధి నివారణకు ఒక సాధువు (బాబా) చెప్పిన వైద్యం నాకు తెలుసని అతనికి చెప్పాను. అతను మందు తీసుకోవడానికి సిద్ధపడ్డాడు. నేను మందు తయారు చేసి అతనికిచ్చాను. అతని వ్యాధి నివారణమైంది. అతను సంతోషంతో పూనాలో జరిగే గుర్రపుపందాలకు వెళ్ళి ఒక

గుర్రంపై కొంత సొమ్ము పణంగా పెట్టాడు. ఆ గుర్రం గెలిచి అతనికి 1000రూ॥లు వచ్చింది. ఆ మొత్తంలో నాకు 700రూ॥లు ఇచ్చాడు. నేను ఆ డబ్బు తీసుకొని వచ్చి గులాబ్ పెండ్లి జరిపించాను.

శిరిడీలో ఎనిమిది రోజులుండిన హరిద్వార్‌బువాకు ఒక గొప్ప అనుభవం కలిగింది. అతను శిరిడీ పొలిమేరలో నున్న సెలయేటిలో స్నానం చేయడానికి బయలుదేరే సమయానికి ఒక పిచ్చుక వచ్చి అతని తలపై కూర్చునేది. అతను సెలయేట్లో స్నానం చేస్తున్నప్పుడు మాత్రం పిచ్చుక అక్కడున్న వేపచెట్టు పైకి వెళ్ళి వేచివుండేది. అతను స్నానం ముగించిన తరువాత తిరిగి వచ్చి తలపై కూర్చునేది. నేను, ఇతర భక్తులు కూడా ఈ దృశ్యాన్ని చూసాము. మేమందరం బాబా వద్ద ఉన్న సమయంలో బువా ఈ దృశ్యం దేన్ని సూచిస్తుందో చెప్పమని బాబాను అర్థించాడు. అప్పుడు నిర్మాణంలో ఉన్న బూటీవాడాను ఉద్దేశించి బాబా ఇలా చెప్పారు:

*"లా ఇల్ల ఇల్లిల్లాహ్ క్యా బడా దర్బార్ హై॥*

*మున్షీ జీతో అందాయిహై, సర్దార్ జీ చుతీహై॥*

*అల్లా మాలిక్ హై, అల్లా అచ్ఛాకరేగా॥"*

బాబా దేహపరిత్యాగం చేయడానికి నాలుగు నెలల ముందు, ఒకరోజు అప్పాభిల్‌తో రాత్రి ఎనిమిది గంటల సమయంలో ***"నాలుగు కోళ్ళు తీసుకొనిరా అతిథులు వస్తున్నారు!"*** అన్నారు. వచ్చే అతిథులు ఎవరోనని నేనాశ్చర్యపోయాను. ఆ రాత్రి మసీదులో తెరవెనుక కూర్చొని ఉన్నాను. నేను మెలకువగానే ఉన్నాను. రాత్రి 2 గం॥ల తరువాత అడుగుపైగా వ్యాసమున్న ఒక పెద్ద అగ్నిగోళం మసీదులోనికి దూసుకు వచ్చింది. అది పడమర దిక్కునున్న నింబారు (గూడు) వద్ద కాసేపు నిలిచి, తరువాత పైకప్పుకెగసి చిన్నాభిన్నమై అసంఖ్యాకమైన తునకలు మశీదంతా ఆవరించాయి. అప్పుడు మసీదు మిరుమిట్లుగొలిపే కాంతితో నిండిపోయింది. ఆ కాంతిని చూడలేక నేను కళ్ళు మూసుకొని తలదించాను. నాతో ఉన్న అప్పాభిల్ కూడా అలాగే చేశాడు. అప్పుడు బాబా ధుని దగ్గరికి వెళ్ళి వంచి ఉన్న తమ మెడపై సట్కా కొన ఉంచి అరబిక్‌లో 10-15 నిముషాల పాటు ఏదో ఉచ్ఛరించారు. బాబా ధుని వద్దకు వెళ్ళగానే మసీదు నావరించి ఉన్న కాంతి అదృశ్యమైంది!

బాబా ఉదయం అప్పాభిల్ చేత నాలుగు కోళ్ళను తెప్పించి వాటి మాంసంతో వంటకం తయారు చేయించారు. మంటపం దగ్గరున్న పొయ్యిపై బాబా 'పోళీ' తయారు చేశారు. తరువాత బడేబాబా కొడుకు కాశింభాయి వచ్చాడు. బాబా అతనికి తాము చేసిన ఆహార పదార్థాన్ని కొంత ఇచ్చి *"నీవు ఔరంగాబాదు వెళ్ళి శంశుద్దీన్ మియాను దర్శించు. అతనికి ఈ 250రూ॥లు ఇవ్వు. అక్కడ మౌలూ, కవ్వాలి, న్యాస్ జరిపించు"*[1] అన్నారు.

*"తరువాత బన్నేమియా ఫకీరు దగ్గరకెళ్ళి, వారి మెడలో ఈ పూలమాల వేసి, నౌదిన్ నౌతారీఖ్ అల్లామియానే అప్నా దునియా లేగయా, మర్జీ అల్లాకి అని చెప్పు"* అంటూ కాశింకు 250రూ॥లు, ఒక సేవంతి పూలమాలను ఇచ్చారు. కాశిం తనకు ఆ ప్రదేశాలు కొత్త అని చెప్పాడు. బాబా నన్ను అతనికి తోడుగా వెళ్ళమన్నారు.

నేను, కాశిం అతని సేవకుడు అమీర్ ముగ్గురం బయలుదేరి ఔరంగాబాదు స్టేషనుకు మధ్యాహ్నం 3గం॥కు చేరాము. నాకు ముందే తెలిసిన ఫకీర్ శంశుద్దీన్ మియా మా కొరకు స్టేషనుకు వచ్చాడు. "సాయి ఫకీర్ వద్ద నుండి వచ్చిన అతిథులెవ్వరు?" అని అడిగాడు. మేము అతని ముందుకు వెళ్ళి నమస్కరించాము. బాబా శిరిడీలో మాకు ఇచ్చిన ఆదేశాలన్నింటిని శంశుద్దీన్ పొల్లుపోకుండా చెప్పి, మమ్మల్ని కోటలోనున్న అతనింటికి తీసుకెళ్ళి మాకు భోజనం పెట్టాడు. మేము వారికి 250రూ॥లు సమర్పించాము. అతను ఎంతోమందిని ఆహ్వానించి ఘనంగా సంతర్పణ (న్యాస్) చేసి, తరువాత మౌలూ, కవ్వాలి జరిపించాడు. ఆ రాత్రికి బాబా చెప్పిన పనులన్నీ పూర్తయ్యాయి.

నాకు బన్నేమియా ఇల్లు తెలియడంతో, మరుసటి ఉదయం మేము అక్కడికి వెళ్లాము. వారు ఒక చెయ్యి పైకెత్తి, మరో చెయ్యి క్రిందికి పెట్టి, నిలబడి ఉన్నారు. అక్కడ ఉన్న అరబ్బులు బన్నేమియా దగ్గరికి వెళ్ళవద్దని, వెళితే కోప్పడతారని చెప్పారు. దాదాపు ఒక గంటసేపు వేచి ఉన్న తరువాత నేను ధైర్యం

---

*1. మౌలూ అంటే దేవుని స్తుతిస్తూ పాడే పాటలు - కవ్వాలి అంటే తబలా వాయిస్తూ సాధువుల గురించి పాడే పాటలు - న్యాస్ అంటే అన్నసంతర్పణ.*

తెచ్చుకొని, వారిని సమీపించి, వారి మెడలో బాబా ఇచ్చిన పూలమాల వేసాను. బన్నేమియా ఎత్తి ఉన్న చేతిని క్రిందికి దించారు. నేను బాబా చెప్పమన్న మాటలు వల్లించాను. అప్పుడు బన్నేమియా తదేకంగా ఆకాశం వైపు చూస్తూ ఉండిపోయారు. వారి కంటి నుండి నీరు కారసాగింది. తరువాత వారి దగ్గర సెలవు తీసుకొని శిరిడీ తిరిగి వచ్చాము.

ఇది జరిగిన నాలుగు నెలల తరువాత, తొమ్మిదవ నెల తొమ్మిదవ తారీఖున (విజయదశమి రోజు) బాబా మహాసమాధి చెందారు. మేము రంజాన్ నెలలో ఔరంగాబాదుకు వెళ్ళి, ఆ రోజంతా ఉపవాసముండి రాత్రికి భోంచేశాము.

బాబాకు అరబిక్ తెలుసు. వారు ఖురాన్ చదివి, అబ్దుల్‌కు బోధించేవారు.

నూరుద్దీన్, సైనిక దళానికి చెందిన ఒక అశ్వ సైనికుడు. అతను ఒకరోజు శిరిడీ వచ్చి బాబాను దర్శించాడు. దర్శించిన వెంటనే తను తిరిగి వెళ్ళడానికి అనుమతి కోరాడు. బాబా అతనిని మరుసటిరోజు వెళ్ళమన్నారు. అతడి దళం ముందుకు వెళుతోందని అందువల్ల అక్కడ ఆగిపోవడం తనకు సాధ్యంకాదని చెప్పాడు. బాబా అతని చేతిలో ఊదీ పెట్టి ఉర్దూలో ఏవో మాటలు అన్నారు. వాటి అర్థం ఏమంటే "గొయ్యి త్రవ్వు - ఊదీ తిను!" అని. అతను ఊదీ తీసుకొని స్వారీ చేసుకుంటూ వెళ్ళిపోయాడు. కోపర్‌గాంలో శవాన్ని మోసుకుంటూ వెళ్తున్న దృశ్యమొకటి అతనికి కనిపించింది. అతను గమ్యం చేరాడు. కానీ శవదృశ్యం మాత్రం అతనిని వీడిపోలేదు. అంతేకాదు అతడికి శవదృశ్యం కనపడినరోజు, తృప్తిగా భోంచేసేవాడు. ఆ దృశ్యం కనపడని రోజు ఎంత ప్రయత్నించినా ఏదో ఒక కారణం వల్ల భోజనం చేయలేకపోయేవాడు. దీనితో విసిగిపోయిన అతను తన ఉద్యోగాన్ని కూడా వదులుకున్నాడు. బాబా మాటలు విననందుకే తనకు ఈ దుస్థితి ప్రాప్తించిందని తెలుసుకొని తిరిగి శిరిడీ చేరి ఆరునెలల పాటు అక్కడ గడిపాడు. క్రమేణా అతను ఆ శాపం నుండి విముక్తుడయ్యాడు. తరువాత బాబా అనుజ్ఞ తీసుకొని వెళ్లిపోయాడు. ఇప్పుడతడు దెవ్లాలిలో కిరాణా కొట్టు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

ప్రస్తుతం పూనా కంటోన్‌మెంట్‌లో ఉన్న అబ్దుల్ ఖాదిర్ 1915లో శిరిడీ వచ్చి బాబాను దర్శించాడు. అతడొక రోజు తకియావద్ద కూర్చొని ఉండగా,

బాబా అటువైపు వచ్చారు. అబ్దుల్ తనకు "సన్యాసం" (ఫకీరీ) ఇవ్వమని బాబాను అర్థించాడు. పిడికిలిలో ఉన్న వస్తువేదో విసురుతున్నట్లు, బాబా తమ పిడికిలిని అబ్దుల్ వైపు విసిరారు. కానీ వారి చేతిలో ఏదీ ఉన్నట్లు కనిపించలేదు. ఆ క్షణం నుండి అబ్దుల్ మాటలలోను, ప్రవర్తనలోను మార్పు వచ్చింది. బాబా వలె మాట్లాడుతూ అందరికి సలహాలిచ్చేవాడు. ఒక్కొక్కసారి అర్థం కాని మాటలేవో మాట్లాడుతూ అందరిని తిట్టేవాడు. రాళ్ళతో కొడతానని బెదిరించేవాడు. అతను భరించలేని విధంగా తయారయ్యాడు. ఇలా బలవంతంగా తెచ్చుకున్న ఫకీరు స్థితిలో ఒకటిన్నర నెల గడిపాడు. ఆ తరువాత మసీదు మంటపం దగ్గర అబ్దుల్ ఖాదిర్ ఉన్నప్పుడు, బాబా ఎదురుపడి ***"లావ్ బలే ఇదర్"*** అని పలుకుతూ పిడికిలితో అతని నుండి ఏదో లాక్కుంటున్నట్లు లాక్కున్నారు. వెంటనే అతనికి పూర్వస్థితి వచ్చింది. తరువాత 15 రోజులు శిరిడీలో ఉండి బాబా అనుమతితో కిర్కి వెళ్ళి అక్కడ బాబాజాన్ వేపచెట్టు (ఆమె సమాధి ఉన్నచోట) ఎదురుగా బీడీకొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు.

మదర్ ఆలీ ఒక ఖోజా. అతడిప్పుడు ఏవలాలో ఉన్నాడు. అబ్దుల్ ఖాదిర్ మదర్ఆలీకి గురువు. అబ్దుల్ ఖాదిర్ ఇతర మహమ్మదీయులతో కలిసి "నమాజు", "అజర్" చేసేవాడు. ప్రతిదినం పగటిపూట మసీదులో బాబా ముందు మౌలూ నిర్వహించబడేది. ఉదయం తబలా, సారంగీ మొదలైన వాద్యాలతో కవ్వాలి నిర్వహించబడేది.

మంటపం దగ్గర 'తబోత్' నిర్మించమని బాబా ఆదేశించేవారు. దాని నిర్మాణానికైన ఖర్చు కూడా వారే భరించేవారు. 'తబోత్' కార్యకలాపాలు జరిగేటప్పుడు, మాంసం, కిచిడీ చేసి బాబా అందరికి పంచేవారు. ఇలా చాలా సంవత్సరాల పాటు జరిగింది. మండప నిర్మాణం జరిగిన తరువాత ఆ కార్యక్రమాలు నిలిపివేసారు. బాబా తాము స్వయంగా 'ఫత్యా' చదవడంగానీ, ఇతరులచే చదివించడంగానీ చేసేవారు. బాబా సశరీరులై ఉన్నప్పుడు, ముస్లింలందరూ మసీదులో నమాజు చేయడానికి వచ్చేవారు. అది ఈనాటికీ కొనసాగుతోంది. బాబా కూడా వారితో కలసి నమాజు చేసేవారు. బాబా ధుని దగ్గర నిల్చొని నమాజు చేయడం నేను స్వయంగా చూసాను - విన్నాను. కానీ వారు ఇతరుల వలె మోకాళ్ళపై కూర్చోవడంగానీ, వంగడంగానీ చేసేవారు కాదు.

బాబా నాకు తెలిసిన ఇద్దరు మహమ్మదీయుల ఆధ్యాత్మిక ప్రగతికి తోడ్పడ్డారు. మా గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్లా శిరిడీ వచ్చి బాబాను దర్శించాడు. బాబా అతనితో వైరాగ్యంగా మాట్లాడుతూ *"మనం ఈరోజు చనిపోతే, ఎల్లుండికి మూడవ రోజు! ఈ ఇల్లు, భూములు, ఆస్తుల వల్ల మనకేమి ఉపయోగం?"* అన్నారు. అబ్దుల్లా మా ఊరు తిరిగి వచ్చాడు. అతనికి భార్య, పిల్లలున్నారు. అతను ఇంటిని, ఆస్థిని వాళ్ళకి వదిలేసి, విరాగియై వీధుల వెంబడి తిరగడం ప్రారంభించాడు. రాత్రిళ్ళు సమాధుల వద్ద ఏదో గొణుగుకుంటూ గడిపేవాడు. ఎవరైనా ఏదైనా పెడితే తినేవాడు లేదా ఆహార విషయం పట్టించుకోక పస్తుండేవాడు. ఈ విధంగా 10-12 సంవత్సరాలు జీవించి ఆ తరువాత మరణించాడు. కానీ ఈ 12 సంవత్సరాలలో అద్భుతశక్తులు సాధించాడు. ఒకసారి నేను పనిపై వెళుతుంటే నన్ను ఆపి ఒక ప్రదేశం పేరు చెప్పి, ఆ ప్రదేశంలో పాముందని హెచ్చరించాడు. నేను వెళుతున్నది పగటిపూటే కాబట్టి అతని మాటలు లక్ష్యపెట్టకుండా వెళ్ళాను. కానీ చిత్రంగా అతను చెప్పిన ప్రదేశంలోనే పాము కనిపించింది.

మా ఊరిలో అబ్బాస్ సేఠ్ అనే బీడీల వర్తకుడొకడుండేవాడు. ఒకసారి అతను అబ్దుల్లాను "ఎందుకిలా భార్యా బిడ్డలను వదిలి పిచ్చివాడిలా తిరుగుతున్నావు?" అనడిగాడు. అందుకు అబ్దుల్లా "నువ్వు తెలుసుకుంటావులే!" అన్నాడు. అబ్బాస్ సేఠ్ "తెలుసుకునేదేముంది. ఇది నిజంగా పిచ్చే!" అన్నాడు. అబ్దుల్లా పిడికిలి బిగించి అందులో ఉన్నదేదో అబ్బాస్‌పై విసురుతున్నట్లు "నువ్వూ అలాగే అయిపో!" అన్నాడు. దీనితో అబ్బాస్ సేఠ్ భార్యా బిడ్డలను, వ్యాపారాన్నీ అన్నింటినీ విడిచిపెట్టి ఇప్పటికీ వీధుల వెంబడి తిరుగుతున్నాడు.

భోపాల్‌లో (వర్హాడ్, బెహర్) అన్వర్‌ఖాన్ అను ముస్లిం ఉండేవాడు. అతడొకసారి శిరిడీ వచ్చి బాబాను దర్శించాడు. అతను బాబాతో "నాకు ఈ సంసారం వద్దు" అని చెప్పాడు. అతను చావడిలో 12 నెలలు నివసించాడు. తరువాత బాబా అతనికి ఖురాన్ మొదటి అధ్యాయంలోనున్న మంత్రాన్ని (అది నాకూ తెలుసు) 101 మార్లు అర్ధరాత్రి వల్లించమని ఆదేశించారు. తరువాత "దవూత్" వల్లించమన్నారు. బాబా అతడికి పేడా ప్రసాదంగా ఇచ్చి అరేబియాలోని బాగ్దాద్‌కు పంపారు. అన్వర్‌ఖాన్ శిరిడీ నుండి బొంబాయి వెళ్ళగానే హాజీ కాశిం అనునతడు ప్రయాణపు ఖర్చులిచ్చి అరేబియా పంపాడు. అన్వర్ అరేబియా వెళ్ళి మళ్ళీ తిరిగి రాలేదు.

ఔరంగాబాదు సమీపంలోని కనాడ్‌కు చెందిన హిడాబేగ్ అనునతడు శిరిడీ వచ్చి కొన్నిరోజులు గడిపాడు. అప్పుడు ఢిల్లీకి చెందిన మౌల్వీయాకూబ్ కూడా శిరిడీలోనే ఉన్నాడు. అతను రాత్రిగానీ, పగలుగానీ మంటపంలో కూర్చొని ఖురాన్ చదువుతూ ఉండేవాడు. ఒక రాత్రి 8గం॥ల సమయంలో బాబా హిడాబేగ్‌తో *"నువ్వు ఇక్కడ ఉండవద్దు. కనాడ్ (ఔరంగాబాద్) దగ్గర ఉన్న కంటోన్‌మెంటుకు వెళ్లు. నీ పేరు పంజాబ్‌షాగా మార్చుకో. అక్కడ కూర్చొని దొరికింది తిను!"* అన్నారు. అతడలాగే అక్కడికి వెళ్ళి స్థిరపడ్డాడు. అతడిని ఒక గొప్ప సాధువుగా అందరూ గౌరవిస్తారు. మా ఊరికి, కొండ ప్రాంతమైన కనాడ్ 70 మైళ్ళ దూరంలో ఉంది. నేనొకసారి అక్కడికి వెళ్ళి అతడిని చూసివచ్చాను. అతను మౌనంగా కూర్చొని ఉన్నాడు.

నేవాసకు చెందిన మహమ్మద్ ఖాన్ అను రోహిల్లా శిరిడీ వచ్చి బాబాతో కొంతకాలం గడిపాడు. ఒకసారి మసీదులో తెరవెనుక బాబా మహల్సాపతితో మాట్లాడుతున్నప్పుడు ఇతడు తెర ఎత్తి లోనికి చూచాడు. అక్కడ బాబా కనిపించలేదు. ఇతడికి మతి చలించి వింతగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. నేవాస నుండి అతని తమ్ముడు, ఖాన్‌ను తీసుకువెళ్ళడానికి శిరిడీ వచ్చాడు. బాబా అతనికి ఊదీ ఇచ్చి ఆశీర్వదించి పంపారు. కొంతకాలానికి ఖాన్ మామూలు స్థితికి వచ్చాడు.

నాలుగు సంవత్సరాల క్రితం నేను, మాధవ ఫస్లే ఒకరాత్రి మసీదులో నిద్రిస్తున్నాము. అర్ధరాత్రి సమయంలో *"మాధో, లే! నేను లఘుశంక తీర్చుకోవాలి"* అని మాధవ్‌ను లేపుతున్నట్లు బాబా స్వరం వినిపించింది. కానీ మాధవ్ కదలలేదు. ఉదయం లేచి చూస్తే బాబా మామూలుగా కూర్చునే చోటుకి ప్రక్కనే ఒక గుంటలో నీళ్ళు ఉన్నాయి. అవి సువాసన వెదజల్లుతున్నాయి. ఆ నీళ్ళు అక్కడ ఉండటానికి గల కారణం రాత్రి వినపడిన బాబా మాటలే తప్ప మరే వివరణ ఇవ్వడానికి అవకాశం లేదు.

బాబా తమ గురువెవరైనది చెప్పగా నేనెప్పుడూ వినలేదు. నేను గమనించిన, ఆసక్తి గొలిపే మూడు వింత సంఘటనల గూర్చి వివరిస్తాను.

1) అహ్మాద్‌నగర్‌కు చెందిన అన్వర్‌ఖాన్ కాజీ, తేలికాకూట్‌లో ఉన్న మసీదును పునర్నిర్మించాలని సంకల్పించాడు. దానికి కావలసిన నిధులకోసం బాబా

దగ్గరికి వచ్చి అభ్యర్థించాడు. బాబా *"మసీదు నీ నుండి కానీ, ఇతరుల నుండి కానీ డబ్బు స్వీకరించదు. తనకు కావల్సిన సొమ్ము అదే సమకూర్చుకుంటుంది. మసీదు నింబారు కింద మూడడుగుల లోతులో ఒక నిధి ఉంది. దానిని త్రవ్వి తీసుకొని మసీదును నిర్మించు!"* అని చెప్పారు. కాజీ అహ్మద్‌నగర్ వెళ్ళి నింబారు వద్ద త్రవ్వి నిధిని కనుగొన్నాడు. ఆ డబ్బుతో మసీదును పునర్నిర్మించి, తిరిగి శిరిడీ వచ్చి తకియా వద్ద నేను, ఇతరులు కూర్చొని ఉన్నప్పుడు ఆ విషయం చెప్పాడు. బాబా నిధి విషయం అన్వర్‌ఖాన్‌తో చెప్పేటప్పుడు నేను అక్కడే ఉన్నాను. అప్పుడు వారు మసీదు ఎదురుగానున్న రాతిపై కూర్చొని ఉన్నారు. అప్పటికే అన్వర్ ఖాన్‌కు 65-70 సం॥ల వయస్సుంటుంది. అతను చాలాకాలం క్రితమే చనిపోయాడు.

2) ఖాందేష్‌లోని జలగాంలో నున్న మీరాన్‌కు చెందిన మద్దూషా ఫకీరు 27 సం॥ల క్రితం శిరిడీ వచ్చాడు. తనకు అత్యవసరంగా 700రూ॥లు కావాలని బాబాను అభ్యర్థించాడు. అతడి అవసరమేమిటో నాకు తెలియదు. కానీ అతను దీనంగా శోకించేవాడు. బాబా అతనికి 700రూ॥లు ఇవ్వమని బాపూసాహెబ్ జోగ్‌తో చెప్పారు. జోగ్ 700 రూపాయల వెండి నాణాలు తెచ్చి బాబా ముందు పెట్టాడు. కొండాజీ కొడుకు గులాబ్, లక్ష్మణ్ బాలాభార్కర్ షింపీ అను ఇద్దరు బాలురను బాబా పిలిచి ఆ డబ్బును మంటపం దగ్గర కూర్చొని ఉన్న ఫకీరుకు ఇవ్వమని ఆదేశించారు. ఆ బాలురు ఆ డబ్బులో 200రూ॥లు కాజేసి, మిగిలిన 500రూ॥లు ఫకీరుకిచ్చారు. ఫకీరు తిరిగి బాబా దగ్గరకొచ్చి తనకు 500రూ॥లు మాత్రమే ముట్టాయని శోకించసాగాడు. అతను మరి రెండు మూడు రోజులు ఏదో గొణుగుకుంటూ, ఏడుస్తూ శిరిడీలోనే ఉన్నాడు. బాబా అతనికి శిరిడీలో మరేమీ ఇవ్వలేదు. అందువల్ల ఆ ఫకీరు బాబా నుండి ఊదీ తీసుకొని వారి అనుమతితో వెళ్లిపోయాడు. అతను నుంగాం సమీపంలో నడిచి వెళుతున్నప్పుడు ఒక టాంగా వచ్చి అతని ముందు ఆగింది. నిజాం రాష్ట్రంలో తాసీల్దారుగా పనిచేస్తున్న ఐరస్‌షా అను పార్శీ మతస్థుడు టాంగా నుండి దిగి ఫకీరును పలకరించాడు. ముందు ఫకీరుకు ఆహారం పెట్టి, తరువాత 200రూ॥లు ఇచ్చి "ఇప్పుడు నీకు తృప్తిగా ఉందా?" అని అడిగాడు. తరువాత ఐరస్‌షా శిరిడీ వచ్చి, తాత్యాపాటిల్ ఇంటికి వెళ్ళి అక్కడున్న వారందరితో తన అనుభవాన్నిలా వర్ణించాడు. అతడికి గతరాత్రి బాబా కలలో కన్పించి అతడిని టాంగాలో శిరిడీ రమ్మని, నుంగాం పరిసరాలలో పులితోలు

చంకన పెట్టుకొని నడిచివస్తున్న ఫకీరొకడు ఎదురుపడతాడని, ఫకీరు ఆకలిగా ఉంటాడు కాబట్టి అతడికి ముందు ఆహారం పెట్టి తరువాత 200రూ॥లు ఇవ్వమని ఆదేశించినట్లు చెప్పాడు. అందువల్ల అతను ఆహారం, డబ్బు తీసుకొని టాంగాలో వచ్చి వాటిని ఫకీరుకు ఇచ్చాడు. ఆ ఐరస్షా ఇప్పుడు లేడు, మరణించాడు.

3) నైజాం రాష్ట్రంలో, వైజాపూర్ తాలూకాలో ఉన్న లాసుర్ అను గ్రామానికి చెందిన ఒక మహమ్మదీయుడు 27 సం॥ల క్రితం శిరిడీ వచ్చాడు. అతను బాబాను దర్శించి తనకు అత్యావసరంగా 4000 రూపాయలుగానీ, 5000 రూపాయలుగానీ కావాలని అభ్యర్థించాడు. బాబా అతడిని మర్రి చెట్టు క్రింద మలవిసర్జన చేయమని, అప్పుడతనికి నాణాలు నిండి ఉన్న బిందె ఒకటి దొరుకుతుందని చెప్పారు. మరుసటి ఉదయం అతను మలవిసర్జన చేసి కడుక్కునేందుకు లేచి నాలుగడుగులు వేయగానే అతని కాలికి బరువైన బిందె తగిలింది. దాని నిండా నాణాలున్నాయి. అది చాలా బరువుగా ఉన్నందువల్ల దాన్ని లేపలేకపోయాడు. దాంతో అతను చావడిలో ఉన్న బాబా దగ్గరికి వచ్చాడు. అతను తిరిగి వెళ్ళేసరికి ఆ బిందె మాయమవడంతో అతను శోకించాడు. ఆ బిందెను రూయీకి చెందిన గణూకాడు అనునతడు తీసుకొని వెళ్ళిపోయాడని, ఇక తామేమీ చేయలేమని బాబా చెప్పారు. ఆ గణూకాడు ఇప్పుడు ధనవంతుడు. లాసుర్‌కు చెందిన ఆ మహమ్మదీయుడు తన దురదృష్టానికి దుఃఖిస్తూ వెనుదిరిగాడు.

79

**శ్రీఎం.వి. సహస్రబుద్ధే,** సివిల్ ఇంజినీరు, పల్టన్ షుగర్ వర్క్స్, వయస్సు: 41సం॥లు, బ్రాహ్మణుడు, తండ్రి: విష్ణు, పల్టన్, సతారా జిల్లా.

1931లో నీంగాం - శిరిడీ నీటిపారుదల, డ్రైనేజి పథకం క్రింద నాకు మంజూరైన కాంట్రాక్టు తీసుకోవడానికి రహతా వెళ్ళాను. అక్కడ బాబాను గురించి తెలుసుకొని శిరిడీ వెళ్ళి ఆరతికి హాజరయ్యాను. నేను ఎంతగానో ప్రభావితుడనయ్యాను. ఆ తరువాత నాకు సాయిబాబా అద్భుతరీతిలో ఎన్నో విధాలుగా సహాయపడ్డారు. కొన్ని సంఘటనలు వివరిస్తాను.

1932లో చాలామంది పనివాళ్ళను నియమించి, డ్రైనేజి గొట్టాలను వేయడానికి మట్టి త్రవ్విస్తున్నాను. మధ్యాహ్నం ఒక చెట్టు క్రింద కాలువగట్టుపై పడుకొని నిద్రిస్తుండగా, మగత నిద్రలో ఉన్న నన్ను అకస్మాత్తుగా ఎవరో కుదిపి లేపినట్లైంది. ఆ నిద్రలోనే బాబా *"లే! పై నుండి జారిపడిన మట్టిలో ఒకడు పూడుకుపోతున్నాడు. వెళ్ళి, వెంటనే అతనిని బయటికి తీయి!"* అన్నారు. వెంటనే నేను లేచి కొందరు కూలీలను వెంటబెట్టుకొని అక్కడికి రెండుమైళ్ళ దూరంలోనున్న ప్రమాదస్థలానికి సైకిలుపై వెళ్ళాను. బాబా చెప్పినట్లు త్రవ్వుతున్న కందకం పైనుండి మట్టి జారిపడి, అందులో 20మంది కూలీలు పూడుకుపోయారు. మేము వెంటనే ఆ మట్టినంతా వెలికితీసి కూలీలను లేవదీసాము. పూడుకొనిపోయిన కూలీలందరూ చిన్న చిన్న గాయాలతో రక్షింపబడ్డారు. కానీ అందులో ఒకతనికి మాత్రం ప్రమాదకరంగా గాయాలయ్యాయి. అతని నోరు, ముక్కుల నుండి రక్తం స్రవిస్తోంది. కళ్లు ఉబికి ఉన్నాయి. అతని కోరిక మేరకు అతనిని బండిలో వేసుకొని అతనింటికి తీసుకెళ్ళాము. అక్కడ అతను మరణించాడు. బాబా నన్ను సకాలంలో హెచ్చరించకుంటే పని జరుగుతున్న స్థలంలోనే అతను మరణించడం, చాలామంది గాయపడటం జరిగి ఉండేది. అప్పుడు నేను విచారణ కమిటీ ముందు దోషిగా నిలబడి ఎన్నో చిక్కులను ఎదుర్కోవలసి వచ్చేది. అయినప్పటికీ రెండు నెలల తరువాత కలెక్టరు ఆ ప్రమాదం గురించి విచారణ జరిపారు. కానీ బాబా నాకెలాంటి సమస్యా రాకుండా కాపాడారు. ఇది బాబా నుండి నేను పొందిన గొప్ప సహాయం.

1933లో బాబా నాకు మరో సహాయం చేశారు. అప్పుడు నేను పూనాలో ఉన్నాను. బాబా నా కలలో కన్పించి, శిరిడీ సంస్థాన్ కమిటీవారు నాకోసం శిరిడీలో ఎదురు చూస్తున్నారని చెప్పారు. కమిటీవారికి నాతో అవసరం ఏముంటుందా అనే కుతూహలంతో శిరిడీ వెళ్ళాను. కమిటీ మెంబరైన శ్రీఎన్.డి. నెవాల్కర్‌కు నేను నీంగాం కాంట్రాక్టరుగా తెలుసు. అతను నాకోసం అడుగుతున్నట్లు తెలిసింది. నేను వెళ్ళి అతనిని కలిసాను. అతను నాకు సభామంటపాన్ని నిర్మించే పని అప్పగించాడు. ఇప్పుడు శిరిడీలో ఉన్న సభామంటపం నేను నిర్మించినదే!

1936లో మా అమ్మ అస్వస్థతగా ఉన్నప్పుడు కూడా బాబా సహాయం చేశారు. ఆమెకు కాలేయం ఆపరేషన్ చేయవలసి వచ్చింది. ఆ ఆపరేషన్ పూనాలో చేయించడం మంచిది. కానీ అక్కడ ప్లేగు వ్యాపించి ఉన్నందున మేముంటున్న వాయ్‌లోనే (సతారా జిల్లా) ఆపరేషన్ చేయించదలచాము. అప్పుడు బాబా నా కలలో కన్పించి, ఆపరేషన్ వాయ్‌లో జరిపించవద్దని, పూనాలోనే జరిపించమని ఆదేశించారు. వారి ఆదేశం మేరకు ఆమెను పూనా తీసుకొని వెళ్ళి ససున్ ఆసుపత్రిలో డాక్టరు ఘర్‌పురేతో ఆపరేషన్ చేయించాము. ఆపరేషన్ విజయవంతమై ఆమె ఇప్పటికీ ఆరోగ్యంగానే ఉంది.

నేను ఈ మధ్యనే సాయి సంస్థాన్ కమిటీ మెంబరుగా ఎన్నుకోబడ్డాను. నాకు ఈ మధ్య వచ్చిన కలలో బాబా సకలదేవతా స్వరూపులనే నిదర్శనం లభించింది. నేను పల్టన్‌లో ఉన్నప్పుడు నాకొక కల వచ్చింది. బాబా సమాధి ముందున్న హాలులో సత్యనారాయణస్వామి విగ్రహం ప్రతిష్ఠించి, విగ్రహం చుట్టూ పాలవెల్లి కట్టి పూజ నిర్వహిస్తున్నారు. స్వామికి నివేదించిన నైవేద్యాలన్నీ సమాధిలో కూర్చొని ఉన్న సాయిబాబా శరీరంలోనికి వెళుతున్నాయి. సమాధి పారదర్శకంగా కనిపించింది. ఆ కలలో కన్పించిన దృశ్యం నిజమో కాదో తెలుసుకోవాలని నేను శిరిడీ సంస్థాన్‌వారికి జాబు వ్రాసాను. నాకు కల వచ్చిన రోజు సమాధి మందిరంలో శ్రీసత్యనారాయణస్వామి పూజ నిర్వహించినదీ, లేనిదీ తెలుపమని కోరాను. సంస్థాన్‌వారు పూజ నిర్వహించినట్లు జవాబిచ్చారు. దీనిని బట్టి సాయిబాబాయే శ్రీసత్యనారాయణస్వామి అని, శ్రీసత్యనారాయణస్వామిని పూజిస్తే తమను పూజించినట్లేనని బాబా నిదర్శనం చూపారు.

నేనొక శ్రోత్రీయ బ్రాహ్మణుణ్ణి, సనాతన ఆచారాలు పాటించేవాడిని. అందువల్ల ముస్లింలు, కడజాతివాళ్ళు తాకిన వస్తువులను తాకేందుకు కూడా ఇష్టపడేవాడిని కాదు. ఒకసారి బాబా నా కలలో కన్పించి అస్పృశ్యతను పాటించడం తప్పని హితవు పలికారు.

## ८०

**శ్రీభాస్కర్ సదాశివ్ సాతమ్,** పోలీసు సబ్ఇన్స్పెక్టరు, హిందూ మరాఠా, లామింగ్టన్ రోడ్డు, బొంబాయి.

నేను 1911లో పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాను. క్రమేణా సబ్ ఇన్స్పెక్టరు స్థాయికి ఎదిగాను. 1930 ప్రాంతంలో నాగేష్ ఆత్మారాం సామంత్‌ను కలిసాను. అతను శ్రీసాయిబాబా గురించి చెప్పాడు. అతనితో నేను శిరిడీ వెళతానని చెప్పాను కానీ, చాలా సంవత్సరాల వరకు వెళ్ళలేదు.

1940లో నేను, సామంత్ నార్గాం ట్రైనింగ్ స్కూలులో ఉన్నాము. ఆ సమయంలో నా ఉద్యోగానికి సంబంధించి కొన్ని దురదృష్టకరమైన సంఘటనలు ఎదుర్కోవలసి వచ్చింది. 16.2.1940న నన్ను సస్పెండ్ చేశారు. అప్పుడు నేను బాబాను ప్రార్థించాను. శిరిడీ నుండి ఊదీ, ప్రసాదము పంపమని కోరగా శ్రీసగుణ్‌మేరు నాయక్ నాకు ప్రసాదము, ఊదీ రెండూ పంపాడు కానీ నాకు ప్రసాదం మాత్రమే అందింది. తరువాత 28.2.1940న నన్ను ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు వచ్చాయి. సామంత్, నన్ను మరో ఆలోచన చేయకుండా శిరిడీ వెళ్ళమని చెప్పాడు. నేను, నా కుమారుడు క్రిందటి రామనవమికి శిరిడీ వెళ్ళాము. అక్కడ రెండు రోజులుండి బాబాను ఆర్తిగా ప్రార్థించాము. మూడవరోజు బొంబాయికి తిరిగి వస్తుండగా దాదర్‌లో ఒక కానిస్టేబులు కలిసి నన్ను తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నట్లు, లామింగ్టన్‌రోడ్ పోలీస్‌స్టేషనులో పోస్టింగ్ ఇచ్చినట్లు చెప్పాడు. కానీ అటువంటి ఉత్తర్వులు అప్పటికి జారీ చేసే అవకాశమే లేదు. 28.4.1940న నేను అప్పీలు చేశాను. అధికారులు విచారణ జరిపి, పదిహేను రోజుల తరువాత 14.5.1940న నన్ను తిరిగి ఉద్యోగంలోకి తీసుకొని, లామింగ్టన్‌రోడ్ స్టేషనులో పోస్టింగ్ ఇచ్చినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అధికారికంగా ఉత్తర్వులు రావడానికి రెండునెలల ముందే బాబా నిర్ణయం కానిస్టేబుల్ నోటి గుండా వెలువడింది!

నేను తీర్చవలసిన కొన్ని బాకీలు ఉండేవి. అప్పుడు నేను బాబాను ప్రార్థించాను. బాబా నాకు డబ్బు అందేలా చేయడంతో నా బాకీలన్నీ తీరి, నాకు కావలసినవన్నీ సమకూరాయి. ఇటువంటి సుఖసంతోషాలు ప్రసాదించమనే నేను బాబాను ప్రార్థించాను.